# భాగము - 4

## మణిమకుటం

# అధ్యాయము - 1

## కెడిలం నదీతీరాన

**తిరుముడైప్పాడి** నాడును సారవంతం చేసి సమృద్ధి చేసిన నదుల్లో కెడిలం నది ఒకటి. అప్పర్ స్వామిని ఆ భగవానుడు కరుణించి తన భక్తునిగా స్వీకరించిన తిరువదిగై ఆలయం ఈ నదీతీరానే ఉంది. సుందరమూర్తిని ఆపి తన భక్తునిగాగొన్న పెరుమాళ్ళు నివసించే తిరునావలూర్ ఈ నది దగ్గరే ఉంది. ఈ రెండు క్షేత్రాలకు మధ్య తొండై మండలానికి వెళ్ళే రాజబాట ఆ రోజుల్లో ఉండేది. రాజబాట కెడిలం నదిని దాటే చోటు ఎప్పుడూ గలగలమని కోలాహలంగా ఉండేది. నదీతీరాన ఉన్న చెట్లమీదున్న పక్షుల కిలకిలారావాలు, వాటి రెక్కల టపటపలు వినిపిస్తూంటుంది. ప్రయాణీకులు అక్కడ తమ బళ్ళను ఆపి, ఎడ్లను విప్పదీసి వనభోజనం చేసేవారు. భోంచేసేటప్పుడు వారు తమాషాగా గాల్లోకి ఎగరేసే అన్నం ఉండల్ని కాకులు అలాగే గాల్లోనే ఎగరేసుకుని వెళ్ళేవి. ఇదంతా చూసే చిన్నపిల్లలు చప్పట్లు కొడుతూ, కేరింతలు కొడుతూ గలగలమని నవ్వుతూ ఆనందించేవారు.

ఈయేడు ఆశ్వయుజమాసం మొదట్లో కెడిలం నదిలో మామూలుకన్న ఎక్కువగానే వాననీళ్ళు పారుతూంది. అందువల్ల మధ్యాహ్నం వేళ అక్కడ భోజనం చేసేందుకు ఆగిన ప్రయాణీకుల కోలాహలం కూడ అధికంగా ఉంది. ఆ కోలాహలాన్నంతా అణచిపెట్టేటట్లు ఒక పెద్ద హాహాకారం కాస్తదూరాన రాజబాటలో వినవచ్చింది. అది విని ప్రయాణీకులు ఆశ్చర్యపడ్డారు. వారిలో కొందరు గట్టెక్కి చూశారు. మొదట ధూళి మాత్రమే కనిపించింది. తర్వాత ఏనుగులు, గుర్రాలు, పల్లకి, పరిచారకులు మొదలైన రాజపరివారం రావడం కనిపించింది. వారు కాస్త దగ్గరికి రాగానే వందిమాగధుల ఘోష స్పష్టంగా వినవచ్చింది.

“పన్నెండేళ్ళ ప్రాయంలోనే యుద్ధరంగంలోకి దూకిన వీరాధివీరులు, వీరపాండ్యుని తలగొన్న కోప్పరకేసరి, రెట్టిమండల నాయకుల కలలోకొచ్చే భయంకర సింహం, తొండైమండలాధిపతి, ఉత్తర సైన్యానికి మాతండ నాయకులు, ముల్లోకాలను ఏలే సుందర చోళ చక్రవర్తి ప్రధమ పుత్రులు, ఆదిత్య

కరికాల చోళ మహారాజు వేంచేస్తున్నారు! బహు పరాక్!"

పిడుగులాంటి గొంతుతో అష్టదిక్కులూ దద్దరిల్లేలా లేచిన ఆ ఘోషను వినగానే కెడిలం నదీతీరానున్న ప్రయాణీకులందరూ తొందర తొందరగా గట్టెక్కారు. అటువంటి మహావీరుని చూడాలన్న కుతూహలంతో నది పక్కనున్న బాటకిరువైపులా ఒదిగి నిలబడ్డారు.

వందిమాగధులు, కొమ్ము బూరాలూదేవారు మొదలైన పరివారమంతా మొదట వచ్చి నదీతీరాన చేరారు.

~

పరివారాల వెనక మూడు గుర్రాలు ఒకదానిపక్కనొకటిగా వచ్చాయి. మూడు గుర్రాల పైన ముగ్గురు యువ వీరులు కూర్చొని వస్తున్నారు. వారిని దూరాన్నుంచే చూసిన ప్రజలు వారిని వేలెత్తి చూపించి ఫలానావారని చెప్పుకోసాగారు. "మధ్యనున్న గుర్రం పైన వస్తున్నవారే ఆదిత్య కరికాలన్! స్వర్ణ కిరీటాన్ని చూడగానే తెలియడం లేదా? ఎండ పడుతున్నప్పుడు ఎలా ధగధగా మెరిసిపోతూంది కదూ!" అన్నాడొకడు.

"ఈ కిరీటం గురించి మాట్లాడుతున్నావేమి? కరికాల్ వలవన్ ధరించిన మణి మకుటాన్ని ఈయన తన శిరస్సున ధరించినప్పుడు కద చూడాలి! అది కోటి సూర్యులకు సమానంగా ప్రకాశిస్తుందట!" అన్నాడింకొకడు.

"అది కరికాల్ వలవన్ కిరీటం కాదు, తమ్ముడూ! అలా సంప్రదాయంగా చెప్పడమంతే. పరాంతక చక్రవర్తి కాలంలో చేసిన మణిమకుటాన్నే ఇప్పుడు సుందర చోళ చక్రవర్తి ధరిస్తున్నారు. ఇంకా ఎన్నాళ్ళో, తెలియదు!" అన్నాడొకడు.

"సుందర చోళుల జీవితకాలాన్ని ఇలాగే కొంతకాలంగా లెక్కపెడుతున్నారు. ఆయన చిరకాలం ఉంటారని తోచడం లేదు!" అన్నాడు మొదటివాడు.

"ఆయన చల్లగా ఉండనీ. ఆయన ఉన్నంతవరకు ఊరూ వాడా సుభిక్షంగా ఉంటాయి."

"అలా చెప్పడానికీ లేదు. పొన్నియిన్ సెల్వన్ని సముద్రం తీసుకెళ్ళిపోయిందన్న వార్త వచ్చినప్పటినుంచి చోళనాడంతా అల్లకల్లోలంగా ఉంది. ఎప్పుడు అంతర్యుద్ధం మొదలవుతుందోనని అక్కడినుంచి వచ్చినవారు చెప్పుకొంటున్నారు."

"ఎవరెవరికి మధ్య యుద్ధం? ఎందుకని?"

"పళువేట్టరయ్యలకు, కొడుంబాళూర్ వేళార్‌కు మధ్య యుద్ధం వస్తుందంటున్నారు. అలా జరగకుండ చూసేందుకే కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో చిన్నరాజులందరూ సమావేశమవుతున్నారట. ఆదిత్య కరికాలన్‌గారు కూడ అక్కడికే వెళుతున్నారట..."

"గుర్రాలు దగ్గరకొచ్చేశాయి. పెద్దగా మాట్లాడకండి!" అని ఒకడు హెచ్చరించి, "యువరాజు

ఆదిత్య కరికాలన్ ముఖం ఎంతగా వాడిపోయివుందో చూడు!" అన్నాడు.

"మరెలా ఉంటుంది? ఆయనకు తమ్ముడంటే ప్రాణం. అటువంటి తమ్ముడి గురించి సమాచారం తెలియలేదంటే అన్నగారికి దిగులుండదా? తండ్రేమో మంచం పట్టారు!"

"ఇదంతా లోకంలో సహజమే, తమ్ముడూ! యువరాజు ముఖం వాడిపోయివుండడానికి ఇదంతా కారణం కాదు. రెట్టై మండలం పైన దండెత్తివెళ్ళాలని ఆయన ఆశ. అది చేజారిపోయిందనే దిగులు!"

"అదెందుకు చేజారిపోయింది? ఎవరు ఈయనను దండెత్తి వెళ్ళకుండ అడ్డగిస్తున్నారు?"

"ఇంకెవరు? పళువేట్టరయ్యర్లే! దండయాత్రకు కావలసిన వస్తుసామగ్రిని ఇవ్వ నిరాకరిస్తున్నారట!"

"ఏవేవో లేనిపోని కారణాలు కల్పించి చెబుతున్నారట. నిజమైన కారణం మీకెవ్వరికీ తెలియదు" అన్నాడింకొకడు.

"అన్నీ తెలిసినవాడా! నిజమైన కారణాన్ని నీవే చెప్పు!" అని ఇంకొకడన్నాడు.

"ఆదిత్య కరికాలన్ ఎవరో ఒక పాండ్యనాడు పిల్లపైన ప్రేమగొన్నాడట. యువరాజు ఉత్తర పెన్న యుద్ధానికి వెళ్ళి వస్తున్నప్పుడు పెద్ద పళువేట్టరయ్యర్ ఆమెను పెళ్ళి చేసేసుకొన్నారట. ఆమే ఇప్పుడు పళువూర్ యువరాణిగా చెలామణి అవుతూ చోళనాడులో సర్వాధికారాలు చెలాయిస్తూందట. అప్పటినుంచి ఆదిత్య కరికాలన్‌గారి మనసు డీలా పడిపోయిందట!"

"కావచ్చు, కావచ్చు. ప్రపంచంలో అన్ని యుద్ధాలకు ఒక స్త్రీనే కారణమైవుంటుందని పెద్దలు చెబుతున్నారు కద?"

"ఏ పెద్దలు అలా చెబుతున్నారు, తమ్ముడూ! అంతా ఒట్టి పిచ్చితనం! యువరాజు ఒక అమ్మాయిని ప్రేమించి, కోరుకొన్నారంటే, ఆమె ఒక అరవైయేళ్ల ముసలాడిని పెళ్ళాడుతుందా? చెప్పేవాళ్ళు చెబితే, వినేవాళ్ళకు బుద్ధి లేదా?"

"అలాగైతే, ఆదిత్య కరికాలన్‌గారికి ఇంకా పెళ్ళి కాలేదెందుకు? మీరే చెప్పండేం?"

"ఊర్కోండి! ఇదిగో, దగ్గరికొచ్చేశారు. యువరాజుకు కుడివైపు వస్తున్నాయనే పార్థిబేంద్ర పల్లవుడు కావచ్చు. ఎడమవైపున్నదెవరు? వాణర్ కులవీరుడైన వంతిదేవుడా?"

"కాదు, కాదు! కడంబూర్ శంబువరయ్యర్ కొడుకైన గందమారన్. పత్రం రాసి పంపిస్తే ఒకవేళ రారేమోనని శంబువరయ్యర్ తమ కొడుకునే యువరాజును పిలుచుకొని రమ్మని పంపించారు."

"దీన్నుంచే విషయం చాల ముఖ్యమైనదని తెలుస్తోంది."

"ఆ ముఖ్యమైన విషయం రాజకీయ విషయం కావచ్చు. లేక, వివాహ సంబంధమైనదిగా కూడ ఉండవచ్చు. ఆదిత్య కరికాలన్‌గారికి పెళ్ళి కానంతవరకు ఆయనకు వల వేసి పట్టుకోవడానికి చిన్న రాజులందరూ ప్రయత్నిస్తుంటారు. మొదట ఆయనను పెళ్ళి చేసుకొనే అమ్మాయికి చోళ

సామ్రాజ్యసింహాసనం పైన కూర్చొనే భాగ్యం కలుగుతుంది కద?"

~

కెడిలం నదీతీరాన గుమిగూడి చోద్యం చూస్తున్న ప్రజలు పైవిధంగా మాట్లాడుకోసాగారు.

మూడు గుర్రాలూ వచ్చి నదీతీరాన ఆగాయి.

గుర్రాల వెనక వచ్చిన రథం, కాస్త అవతలగా రావి చెట్టు కింద ఆగింది. ఆ రథంలో ఎనభైయేళ్ల వీర వృద్ధులు తిరుక్కోవలూర్ మలైయమాన్ ఉన్నారు.

నదీతీరాన గుర్రంపైన కూర్చొన్న ఘళంగా ఆదిత్య కరికాలన్ ఆయనవైపు తిరిగి చూశారు.

~~~
~~~

# అధ్యాయము - 2

## తాత – మనుమడు

**రధంలో** ఆసీనులైన వృద్ధులు సైగ చేయగానే ఆదిత్య కరికాలన్ గుర్రాన్ని వెనక్కి తిప్పి ఆయన దగ్గరకు వెళ్ళాడు.

"బిడ్డా! కరికాలా! నేనిక్కడే మీదగ్గర సెలవు తీసుకొని తిరుక్కోవలూర్‌కి తిరిగి వెళ్ళాలనుకొంటున్నాను. వెళ్ళేందుకు ముందు నీకు కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలి. గుర్రం పైనుంచి దిగి ఆ రావిచెట్టు కిందనున్న మేడ దగ్గరకు రా!" అన్నారు తాతగారు.

"అలాగే తాతా!" అని చెప్పి ఆదిత్య కరికాలన్ గుర్రంపైనుంచి దిగాడు.

ముసలాయన కూడ రధంనుంచి దిగారు.

ఇద్దరూ రావి చెట్టు కిందనున్న మేడ దగ్గరకు వెళ్ళారు.

అప్పుడు పార్థిబేంద్రుడు గందమారన్‌తో, "అబ్బ! బతికిపోయాం! ఎక్కడ ఈ ముసలాయన మన వెంబడే దారి పొడుగునా వస్తారోనని భయపడ్డాను!" అన్నాడు.

"అలా వస్తే ఈయన్ను ఆ నది వెల్లువలో తోసి ముంచేయాలని అనుకొన్నాను!" అన్నాడు గందమారన్.

ఇద్దరూ తమ మాటలకు తామే నవ్వుకొని చంకలు గుద్దుకొన్నారు.

~

ఆదిత్య కరికాలన్ని చూసి మలైనాడు ఏలికైన తిరుక్కోవలూర్ మలైయమాన్ ఇలా చెప్పసాగారు:-

"ఆదిత్యా! ఇప్పటికి ఇరవై నాలుగు సంవత్సరాలకు మునుపు నీవు పుట్టావు! తిరుక్కోవలూర్‌లో నా అంతఃపురంలోనే పుట్టావు! ఆసమయాన జరుపుకొన్న వేడుకలు నిన్న జరిగినట్లు గుర్తున్నాయి. నీ కులానికి చెందినవారు, నా కులానికి చెందినవారు, చోళనాడు, తొండైనాడు చిన్న రాజులు అందరూ వచ్చారు. వారందరితోబాటు వారి సైనికులు ముప్పైయారు వేలమంది వీరులు వచ్చారు. వారందిరికి ఏర్పాటు చేసిన విందుభోజనాలు చెప్పనలవి కాదు. నీ తండ్రి పట్టాభిషేక వైభవానికి కూడ అటువంటి విందుభోజనం జరగలేదు. నా బొక్కసంలో నా పూర్వీకులు నూరేళ్ళుగా కూడబెట్టిన ధన సంపదంతా ఆ మూడురోజుల పండగకే ఖర్చుచేసేశాను!

"ఆ సమయాన నీ ముత్తాతైన పరాంతక చక్రవర్తే స్వయంగా తిరుక్కోవలూర్‌కి వచ్చారు. నీ పెద్ద తాత గండరాదిత్యులు, నీ తండ్రి సుందర చోళులు కూడ వచ్చారు. మగబిడ్డ పుట్టిన వెంటనే వారందరూ

పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. చోళకులాన్ని సుప్రసిద్ధం చేసేందుకే నీవు పుట్టావని అందరూ కుతూహలపడ్డారు. నీ తాతగారి పెద్దన్నగారికి అప్పటివరకు సంతతి కలగలేదు. అరింజయునికీ నీ తండ్రి ఒక్కడే సంతానం. అతడు నీ ప్రాయంలో అందంలో మన్మధునికి దీటుగా ఉండేవాడు. చోళకులంలోగాని, తమిళనాడులోని చిన్నరాజుల వంశాలలోగాని అంతటి అందమైన అబ్బాయిని అప్పటివరకు ఎవరూ చూసి ఎరుగరు. అందువల్ల నీ తండ్రికి కొన్ని ఇబ్బందులు కూడ కలిగాయి. కుటుంబీకులందరికీ వాడు ముద్దుబిడ్డగా ఉండేవాడు. అంతఃపురస్త్రీలు వాడికి అమ్మాయి వేషం వేసి చూసుకొని మురిసిపోయేవారు. 'వీడు ఆడపిల్లగా పుట్టివుంటే...?' అని చెప్పుకొని సంబరపడేవారు. నీ తండ్రికి పిల్లనిచ్చేందుకు లంకనుంచి వింధ్యవరకు రాజాధిరాజులు, చిన్నరాజులు తపస్సు చేసేవారు. అర్జునుని, మన్మధుని మించిన అందగాడేగాక, చోళసింహాసనానికి అర్హుడన్న ఆలోచన కూడ వారి ఆశకు కారణమయ్యింది. నీ తండ్రిని అల్లుడిగా పొందే భాగ్యం చివరికి నాకు దక్కింది.

"మా వంశంలో ఆడవారుగాని, మగవారుగాని అందానికి పేరుగాంచినవారు కాము. మగవాళ్ళు ఎన్ని వీలయితే అన్ని యుద్ధగాయాలను తమె ఒంటిమీద ఆభరణాలుగా ధరిస్తే అంతటి అందగాళ్ళమని భావించేవారం. మా కులస్త్రీలకు శీలం, గుణమే అందం, ఆభరణాలూను. నీ తండ్రికి నా కూతురునిచ్చి పెళ్ళి చేయడమని తీర్మానించినప్పుడు తమిళనాడంతా అల్లకల్లోలమైంది. తక్కిన చిన్నరాజులందరూ అసూయపడ్డారు. దాన్ని నేను పట్టించుకోలేదు. ముల్లోకాలు అదిరిపోయేటట్లు నీ తలిదండ్రుల వివాహం తంజావూరులో జరిగింది. అయినా కూడ, అప్పుడు జరిగిన వేడుకలకన్న నీవు పుట్టినప్పుడు తిరుక్కోవలూరులో జరిగిన వేడుకలే పెద్దగా జరుపుకొని సంతోషపడ్డారందరూను. నీకు ఏం పేరుపెట్టాలన్న విషయమై చాల కుతూహలమైన చర్చ జరిగింది. కొందరు నీ కులపూర్వీకులలో చాల పెద్ద పేరుగాంచిన 'కరికాల్ వలవన్' పేరు పెట్టాలన్నారు. నేను, ఇంకొందరు నీ పెదతాత రాజాదిత్యుల పేరే పెట్టాలన్నాము. చివరికి రెండింటినీ చేర్చి, 'ఆదిత్య కరికాలన్' అని నీకు నామకరణం చేశారు.

~

"అదిగో చూడు, ఆదిత్యా! తిరునావలూర్ కోవెల గోపురం కనిపిస్తూంది. నంబి ఆరూరార్ సుందరమూర్తి పుట్టినచోటది. అక్కడ నీ తాతగారు రాజాదిత్యులు ఇరవైయేళ్ళకు మునుపొకసారి విడిది చేశారు. కథల్లోను, కావ్యాల్లోను ఎందరో మహావీరుల గురించి విన్నాను, చదివాను. ఈ వీరతమిళనాడులో ఎందరో మహావీరులను చూశాను. కానీ రాజాదిత్యులవంటి ఇంకొక వీరుని విని, చూసి ఎరుగను. యుద్ధరంగలో ఆయన యుద్ధం చేయడం చూసినవారెవరైనా అలాగే చెబుతారు.

"ఒక మహాసైన్యాన్ని కూడదీసుకొని ఉత్తర నాడు మీద దండెత్తి వెళ్ళేందుకు ఆయన అక్కడ సన్నాహాలు చేస్తున్నారప్పుడు. రెట్టైమండలం రాజైన కన్నరదేవుని ఓడించి మాన్యకేతమనే అతడి రాజధాని నగరాన్ని నేలమట్టం చేయాలని నిశ్చయించారు మీ తాతగారు. మునుపొకసారి మామల్ల చక్రవర్తి వాతాపి

(బాదామి) నగరాన్ని తుడిచిపెట్టినట్లు మాన్యకేత నగరాన్ని సమూలంగా నాశనం చేసేస్తే వాడి గర్వం అణుగుతుందని, తాను కూడ మామల్ల చక్రవర్తిలాగ పేరుప్రఖ్యాతులు పొందవచ్చని రాజాదిత్యులు తలచారు. అందుకు కావలసిన మహాసైన్యాన్ని కూడదీయడమంటే మాటలా? మామల్లు పదేళ్ళు సైన్యం కూడదీశాడని చెబుతారు. అంతకాలం తనకవసరం లేదని, మూడునాలుగేళ్ళు చాలని రాజాదిత్యులు చెప్పారు. సైన్యాన్ని కూడదీసేందుకు, అలా కూడదీసిన సైనికులకు యుద్ధశిక్షణనిచ్చేందుకు తగిన ప్రదేశం ఈ కెడిలం నదికి, దక్షిణ పెన్నకు మధ్యనున్న ప్రదేశమేనని ఆయన ఏరికోరి ఎంపిక చేశారు.

"ఆదిత్యా! ఆ రోజుల్లో ఈ రెండు నదులకు మధ్యనున్న ప్రదేశాన్ని చూసే అవకాశం నీకు లేకపోయింది. ఆ దృశ్యాలను చూసినవారేమో జీవితాంతం మరువలేరు. తిరునావలూరులో రాజాదిత్యులు ముప్పైయారువేల వీరులతో శిబిరం వేశారు. పెన్నానదీతీరాన మడియార్రైవద్ద చేరనాడు రాజైన వెళ్ళన్ కుమరన్ ఇరవైవేల వీరులతో వచ్చి దిగాడు. నీతాత అరింజయుడు నాతో తిరుక్కోవలూరులో ఉన్నాడప్పుడు. నేను, మీతాత అరింజయుడు యాభైవేల వీరులను ఆయత్తం చేశాము. ఇంకా కొడుంబాళూర్ పెద్ద వేళార్, ఈనాడు చోళనాడుకు శనిగా తయారైన పళువేట్టరయ్యన్, కడంబూర్ శంబువరయ్యన్, ఈ తిరుముణైప్పాడి చిన్నరాజైన మణైయ తరైయ్యన్, మళనాడు మళవరయ్యన్, కుండ్రత్తూర్ కిళాన్, పైదుంబరాయన్ మొదలైనవారు తమతమ సైన్యాలతో ఈ రెండు నదుల మధ్య వచ్చి శిబిరం వేశారు. గజబలాలు, తురగబలాలు, కైక్కోళార్ వారి మూడు సైన్యాలు ఈ రెండు నదుల మధ్య వచ్చి చేరాయి. ఇలా వచ్చి దిగిన సైన్యాలకు మధ్య తరచూ శిక్షణాయుద్ధాలు జరిగేవి. ఏనుగులు ఒకదానితోనొకడి గుద్దుకొన్నప్పుడు భూమి భూకంపం వచ్చినట్లు అదిరేది. గుర్రాలమీద వీరులు శూలాలు చేతబట్టి యుద్ధవిన్యాసాలు చేయగా ప్రళయకాల సముద్రం పొంగివచ్చినట్లుండేది. తమ విలువిద్యను పరీక్షించుకొనే వీరులు ఒక్కసారిగా తమ అమ్ములను సారించి వదిలితే ఆకాశమే కప్పేసుకుపోయేది. శత్రుసైన్యాలను ముట్టడించేందుకు వేలకొద్ది వీరులు 'నావలో నావల్' అని గర్జిస్తూ ముందుకు దూకి వెళ్ళేటప్పుడు ప్రపంచమే అంతం కాబోతోందా అనిపించేది. ఇదంతా ఒక వేడుకగా చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారు.

"ఈ తిరుముణైప్పాడి ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడ చాల మంచివారు. అదీగాక వీరత్వం మిక్కిలిగొన్నవారు. ఇక్కడ సైన్యం కూడడం వల్ల వారి వ్యవసాయానికి చాల ఇబ్బంది కలిగింది. కానీ వారది పట్టించుకోలేదు. ఇటువంటి మంచి ప్రజలకు కృతజ్ఞతలు చెల్లించుకోవడానికై రాజాదిత్యులు ఈ రెండు రాజ్యాల్లోను అనేకమైన చెరువులు తవ్వించారు. కొళ్ళిడం నదినుంచి కొత్త వరద నీళ్ళు పొర్లి వచ్చి వీరనారాయణ చెరువులో నిండేటట్లు ఏర్పాటు చేశారు. ఆదిత్యా! ఆ చెరువు వల్ల అందరికన్న ఎక్కువగా లాభం పొందినవాడు కడంబూర్ శంబువరయ్యన్. వాడు ఆనాడు రాజాదిత్యుల అడుగులకు మడుగులొత్తిన స్థితినుంచి ఇప్పుడు చేరుకొన్న ఆర్థికస్థితిని చూస్తే నాకే చాల ఆశ్చర్యం కలుగుతోంది...!"

అప్పుడు ఆదిత్య కరికాలన్ అడ్డుపడి, “తాతా! ఈ శంబువరయ్యార్ గురించి మీకెందుకు దిగులు? తక్కోలంలో జరిగిన యుద్ధం గురించి చెప్పండి. ఈ కెడిలం నదీతీరాన కూడిన ఆ మహాసైన్యం ఎప్పుడు ఇక్కడినుంచి బయలుదేరింది? అంతగా ముందు ఏర్పాట్లు చేసుకొన్నా కూడ, మా తాతగారు అంతటి మహావీరులైనా కూడ, మన సైన్యం ఎందుకు ఓడిపోయింది? మీరు కూడ ఆ యుద్ధంలో చేరి పోరాడారు కద? కాబట్టి ప్రత్యక్షంగా చూసి తెలుసుకొని ఉంటారు కద?” అన్నాడు.

“అవును; నేను కూడ ఆ పోరులో పాల్గొన్నాను. దాని గురించే నీకు చెప్పబోతున్నాను.

“రాజాదిత్యులు ఇక్కడ పలువిధాలైన సైన్యాలను కూడదీసి, వారికి దూరదేశాలలో యుద్ధాలు చేసి ఆరితేరిన వీరులచేత శిక్షణనిప్పించేవారు కద? కొన్ని కారణాలవల్ల తాను అనుకొన్న సమయంలోపల బయలుదేరలేకపోయారు. లంకలో మళ్ళీ పోరు మొదలైనట్లు వార్త వచ్చింది. దాన్ని విజయవంతంగా ముగించేందుకు మరిన్ని సైన్యాలను అక్కడకు పంపవలసివచ్చింది. దక్షిణాన ఒక శత్రువునుంచుకొని, ఉత్తరాన తన ముఖ్యమైన వీరులను, దళపతులను పంపనిష్టపడలేదు చక్రవర్తి. లంకలో యుద్ధం ముగిసిందని వార్త వచ్చిన తర్వాత బయలుదేరుదామని చెప్పారు. రాజాదిత్యులు కూడ తండ్రి మాటను తోసిపుచ్చలేక ఓపికతో వేచి చూశారు. కానీ పగవారు అలా వేచివుండలేదు. రెట్టైమండలం రాజు కణ్ణర దేవన్ అదే సమయాన చోళనాడుమీద దండెత్తేందుకు ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని రాసాగాడు. గంగనాడు రాజు కూడ తన పెద్ద సైన్యాన్ని కణ్ణర దేవర్ సైన్యంతో చేర్చాడు. ఉత్తర సముద్రం, దక్షిణ సముద్రం ఒక్కటైనట్లు ఆ రెండు సైన్యాలు ఒక మహాసముద్రంలాగ ముందుకు దూసుకు రాసాగాయి. అందులో వేలకొద్ది ఏనుగులు, గుర్రాలు ఉన్నాయి. ప్రళయకాలంలో ఏడు సముద్రాలు ఒక్కటై పొంగి వచ్చినట్లు ముందుకు వస్తున్న ఆ మహాసైన్య సముద్రం దక్షిణనాడునే ముంచేస్తుందేమోననిపించింది. ఆ సైన్యం గురించిన వివరాలను ముందుగా తెలుసుకొని వాయువేగ మనోవేగాలతో వచ్చిన గూఢచారులు అలా వర్ణించి చెప్పారు.

“అయితే ఇదికూడ ఒకవిధంగా మంచిదేమోనని భావించారు పరాంతక చక్రవర్తి. మన సైన్యాలను చాల దూరం ప్రయాణం చేయించి ఆ ప్రయాణపు బడలికతో శత్రుసైన్యాలను ముట్టడింపజేసేందుకు బదులు, ఆ శత్రుసైన్యాలను మన నాడుకు సమీపంగా లాగి, నలువైపులనుంచి ముట్టడించి హతమార్చడమే మంచి ఉపాయమని/వ్యూహమని ఎంచారు. శత్రుసైన్యం ఉత్తర వేంగి వరకు వచ్చేశారని తెలిసిన తర్వాతే ఇక్కడినుంచి బయలుదేరేందుకు అనుమతి ఇచ్చారు.

~

“అనుమతి దొరికిందో, లేదో రాజాదిత్యులు  వెంటనే బయలుదేరారు. మూడు లక్షల పదాతివీరులు, యాభైవేల అశ్వ వీరులు, పదహారువేల యుద్ధగజాలు, రెండువేల రథాలు, మూడువందల ఇరవై దళపతులు, ముప్పైరెండు చిన్నరాజులు, ఆ మహాసైన్యంలో చేరారు. వారిలో ఒకరిగా వెళ్ళే భాగ్యం

నాకూ దొరికింది. కానీ బతికి బయటపడి తిరిగివచ్చిన దౌర్భాగ్యశాలిని కూడ అయ్యాను.

"మూడు రోజుల ప్రయాణం తర్వాత కంచికి ఉత్తరాన మూడు కోసుల దూరంలో తక్కోలం అన్న చోట మన సైన్యాలు పగవారి సైన్యాలను ఎదుర్కొన్నాయి!

"ఆదిత్యా! పురాణాలలో దేవేంద్రునికి, వృత్రాసురునికి మధ్య జరిగిన యుద్ధం గురించి విన్నాం. రామ రావణ యుద్ధం గురించి, పాండవ కౌరవ యుద్ధం గురించి కూడ మనమెరుగుదుము. తక్కోలంలో జరిగిన ఘోర యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసినవారు ఆ యుద్ధాలన్నీ తక్కోలం యుద్ధం ముందు దిగదుడుపే అంటారు. మన సైన్యం కన్న శత్రుసైన్యం సుమారు రెండు రెట్లు అధికంగా ఉన్నాయి. ఐదు లక్షల వీరులు, ముప్ఫైయారు వేల ఏనుగులు ఆ సైన్యంలో ఉన్నట్లు తెలిసివచ్చింది. ఉంటేనేమి? మీ పెద్ద తాత రాజాదిత్యుల వంటి సేనాధిపతి ఆ సైన్యంలోను లేడు. కాబట్టి వీరలక్ష్మి, జయలక్ష్మి కూడ మనవైపే ఉన్నట్లు తోచింది.

~

"యుద్ధం పదిరోజులపాటు జరిగింది. ఇరువైపుల మరణించిన వీరులను లెక్కించడం అసాధ్యమైంది. యుద్ధరంగంలో నల్లటి గుండ్రాళ్ళలాగ ఏనుగులు పీనుగులై పడ్డాయి. ఇరువైపుల నష్టం విపరీతంగా ఉన్నా కూడ, చివరికి శత్రుసైన్యం బలహీనం కాజొచ్చింది. ఇందుకు కారణం ఏమని శత్రువులు కనిపెట్టి తెలుసుకొన్నారు. పులిజెండాను గంభీరంగా ఎగరవేసుకొని రాజాదిత్యుల ఏనుగు వెళ్ళిన చోటల్లా విజయలక్ష్మి ఆయన వెంట వెళుతుందని గ్రహించారు. ఎక్కడెక్కడ మన సైన్యంలో వీరులు నీరుగారిపోతున్నారో అక్కడల్లా రాజాదిత్యులు వెళ్ళారు. ఆ ఏనుగును, దానిపైన విరాజిల్లిన వీరపురుషుని చూసిన వెంటనే మన వీరులు నిరుత్సాహం వీడి, ద్విగుణీకృతోత్సాహంతో శత్రుసైన్యాల మీద దాడి చేశారు. ఇదంతా పదిరోజులపాటు గమనిస్తూ వచ్చిన శత్రువులు ఒక మహాపాతకమైన కుట్ర పన్నారు. అది కుట్ర అని తర్వాతే తెలిసివచ్చింది. కుట్ర పన్నినవాడు, దాన్ని నెరవేర్చినవాడు కూడ గంగనాడు రాజు భూతుకుడే. ఉన్నట్లుండి ఆ పాతకుడు తన ఏనుగుపైన శాంతి జెండాను ఎగరవేస్తూ రెండు చేతులను తలపైకెత్తి, 'శరణు! శరణు!' అంటూ వచ్చాడు. ఆ సమయాన రాజాదిత్యులే సమీపాన ఉన్నారు. పులిజెండా ఎగురుతున్న ఆ ఏనుగు అంబారీని చూసిన తర్వాతే ఆ పాతకుడు అలా చేసివుండాలి. మహావీరులైన రాజాదిత్యులు ఇలా ఒక శత్రురాజు 'శరణాగతి' అంటూ రావడాన్ని చూడగానే కరిగిపోయారు. రెట్టిమండలపు చక్రవర్తే యుద్ధం ఆపేసి సంధి కోరుతున్నాడా, లేక ఈ రాజు ఆ చక్రవర్తి పక్షం వదిలి మనతో చేరడానికి వస్తున్నాడా అని తెలుసుకోగోరారు. కాబట్టి శంఖనాదం చేస్తూ తన చుట్టూ నిలబడ్డ రక్షకభటులను తొలగమన్నారు. భూతుకుడు ఎక్కివున్న ఏనుగును తన ఏనుగు దగ్గరకు రమ్మని సైగచేశారు. భూతుకుడు రాజాదిత్యుల దగ్గరకు వచ్చేవరకు చేతులు జోడించిన వైనంగా వచ్చాడు. వాడి కళ్ళనీరు రాజాదిత్యులు చూశారు. అందువల్ల ఆయన మనసు ఇంకా కరిగిపోయింది.

<< యుద్ధరంగంలో మొసలి కన్నీళ్ళు చూసి మోసపోవద్దని ఒక పాత సామెత >>

ఆ సామెత ఆ సమయాన రాజాదిత్యులకు గుర్తు రాలేదు. కన్నీరు చూసి కరిగిపోయారు. భూతుకుని ఇంకా దగ్గరకు రానిచ్చి, "ఏమిటి సంగతి?" అని అడిగారు. అందుకు వాడిచ్చిన ఉత్తరం రాజాదిత్యులకు కోపం, చిరాకు కలిగించింది. రెట్టిమండలపు సైన్యానికి ఓటమి తథ్యమని తెలిసినందువల్ల శరణాగతి కోరుదామని తాను కణ్ణరదేవరకు తాను విన్నవించుకొన్నాడని, అతడు దాన్ని తిరస్కరించాడని, కాబట్టి తాను మాత్రం ఆ సైన్యంనుంచి విడివడి శరణు కోరడానికి తీర్మానించాడని చెప్పాడు. ఇది వినగానే రాజాదిత్యులు వాడిని కఠినంగా తిట్టారు.

"అటువంటి నీచుడిని తమ పక్షంలో చేర్చుకోమని, తిరిగి వెళ్ళిపొమ్మని చెబుతుండగానే, భూతుకుడు కన్ను మూసి తెరిచేలోపల ఆ భయంకరమైన వంచక కృత్యాన్ని చేసేశాడు. మరుగ్గా ఉంచుకొన్న విల్లు బాణాలనెత్తి, వింటికి అమ్ము సారించి వదిలేశాడు. ఆ క్రూరమైన విషం పూసిన బాణం ఎదురు చూడని సమయాన రాజాదిత్యుల గుండెల్లో దూసుకుపోగా, ఆయన వాలిపోయారు. ఇటువంటి వంచనను ఎవరూ ఎదురుచూడనందువల్ల చుట్టూ నిలబడ్డ వీరులకు కాసేపు ఏం జరిగిందో తెలియలేదు. రాజాదిత్యులు భూతుకుని తిరిగి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించడం మాత్రం వారి చెవిన పడింది. వెంటనే భూతుకుడు తన ఏనుగును వెనక్కి మళ్ళించి పారిపోయాడు!

~

"రాజాదిత్యులు ఏనుగుమీద ఉన్నపళంగానే మరణించారన్న వార్త విని అందరి తలలమీద పిడుగు పడ్డట్లయింది. ఆ మహాదుఃఖంలో మునిగిపోయి యుద్ధాన్నే మరచారు. సామంతరాజులు, దళపతులు, సైనికులు అందరూ చేష్టలుడిగి విలపించనారంభించారు. ఆ పరిస్థితిలో పగవారిది పైచేయి కావడంలో ఆశ్చర్యమేముంది? కాసేపటికల్లా మనసైన్యం వెనుదిరగవలసి వచ్చింది. ఇక్కడికి వచ్చిన తర్వాతే మాకు ఈ విషయం తెలిసివచ్చి తిరిగి నిలబడ్డాము. పగవారిని అడ్డగించి ఆపాము. నేను తిరుక్కోవలూర్ నుంచి నా కుటుంబీకులను తీసుకొని వెళ్ళి పశ్చిమాన ఉన్న కొండనాడులో ఉన్న కోటలో భద్రపరిచి వచ్చాను. ఆ కొండ పక్కనే సైన్యాలను కూడదీశాను. ఈ కెడిలం నది వరకు వచ్చేసిన శత్రుసైన్యాలను అడ్డగిస్తూ వచ్చాను. కానీ అప్పుడు వచ్చిన శత్రుసైన్యం చాలయేళ్ళ వరకు ఈ చోటు వదిలి పోలేదు. అక్కడక్కడా ఉంటూ చికాకు పరచసాగారు. కంచి నగరం వారి అధీనంలోకి వెళ్ళిపోయింది. మూడేళ్ళ క్రితం వీరపాండ్యుని ఓడించిన తర్వాతే నీవిటువైపు దండెత్తి వచ్చి కంచిని తిరిగి గెలిచావు/కైవసం చేసుకొన్నావు..."

ఆదిత్య కరికాలన్ మళ్ళీ అడ్డుపడి, "తాతా! నాకిదంతా ఇంతకు మునుపు తెలిసిందే! కానీ తక్కోలం గురించి, రాజాదిత్యుల మరణ వృత్తాంతం గురించి ఎన్నిసార్లు విన్నా నాకు అలుపూ సొలుపూ అనిపించదు. ఇప్పుడు రాజాదిత్యుల గురించి నాకెందుకు గుర్తు చేస్తున్నారు? అది చెప్పండి!" అన్నాడు.

"బిడ్డా! నీ తాతగారు రాజాదిత్యులు చోళసామ్రాజ్యాన్ని లంకనుంచి గంగ వరకు విస్తరింపజేయాలని ఆశపడ్డారు. ఆ ఆశ నెరవేరకనే మరణించారు. ఆయన వంటి మహావీరుడు నా మనుమడు ఆదిత్య కరికాలన్ అని దేశమంతా చెప్పుకొంటున్నారు. ఆయన సాధించలేని కార్యాలను నీవు సాధించబోతున్నావని ఈ తమిళనాడు ప్రజలంతా చెప్పుకొంటున్నారు. కానీ రాజాదిత్యులలాగ నీవు కూడ వంచనకు మోసపోకూడదనే ఆయన వృత్తాంతాన్ని నీకు గుర్తు చేశాను."

"తాతా! నా పెద తాత యుద్ధరంగంలో పగవారి వంచన వల్ల అసువులు బాసారు. దాన్ని ఇప్పుడు నాకెందుకు గుర్తు చేస్తున్నారు? నేను యుద్ధరంగానికి పోవడం లేదు కద? నన్ను వంచించగల పగవారి మధ్యకు కూడ పోవడం లేదు కద? నా తండ్రికి అత్యంత సన్నిహితులను చూసేందుకే కద వెళుతున్నాను? వారు నన్ను ఏవిధంగా, ఎందుకు వంచించబోతున్నారు?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

"విను, కరికాలా! శత్రువుల జోడించిన చేతుల్లోను, కార్చిన కన్నీళ్ళలోను అతి క్రూరమైన అయుధం దాగి/పొంచివుండగలదని చెప్పిన తిరువళ్ళువర్, బాహ్య శత్రువుల కన్న అంతర్శత్రువులనుంచే పెద్ద అపాయం అని కూడ చెప్పారు:

<< తిరువళ్ళువర్ చెప్పిన ఆ నీతి వాక్యం/పద్యం >>

ఆకాశంలాగ బాహాటంగా నిలబడ్డ పగవారిని చూసి భయపడనవసరం లేదు; స్నేహితుల్లాగ నటించి వంచించే పగవారిని చూసే భయపడాలని చెప్పారు తిరువళ్ళువర్. బిడ్డా! స్నేహితుల్లాగ నటించే శత్రువుల మధ్యకు వెళుతున్నావిప్పుడు. నేను వద్దని చెప్పి అడ్డగించినా వినకుండ వెళుతున్నావు. ఏదో రాజ్యానికి చెందిన తగాదా వచ్చిందని, దాన్ని పరిష్కరించబోతున్నారని చెప్పి, అందుకోసం నిన్ను పిలిపించారు. శంబువరయ్యన్ కూతురొకతెను నీకు కట్టబెట్టేందుకు పన్నాగం పన్నుతున్నారని కూడ ఎరుగుదును. కానీ వారి నిజమైన ఉద్దేశమేమని నేనెరుగను. నీవూ ఎరుగ సాధ్యంలేదు. నీకు కూతురునిచ్చేందుకు ఈ భారత దేశంలో రాజాధిరాజులు తపస్సు చేస్తున్నారు. శంబువరయ్యన్ కూతురే కావాలని లేదు. రాజ్యాన్ని నీకు సగం, మధురాంతకునికి సగంగా విడగొట్టి పంపకం చేసి రాజీ కుదిర్చేందుకు మంత్రాలోచనలు జరుగుతున్నాయని కూడ విన్నాను. అందులో ఏం కపటం దాగివుండగలదో, ఏం కుట్ర ఉందో నాకు తెలియదు. ఏదెలావున్నా, నేను వెంటనే తిరుక్కోవలూర్‌కి వెళ్ళి నా రక్షక సైన్యాన్నంతా కూడదీసుకొని వచ్చి వెళ్ళం నది ఒడ్డున సిద్ధంగా ఉంటాను. శంబువరయ్యన్ అంతఃపురంలో ఉన్నప్పుడు నీకు ఏదైన సందేహం కలిగితే నాకు వెంటనే చెప్పి పంపించు...!"

ఈ సమయాన ఆదిత్య కరికాలన్ శ్రద్ధ తనమాటలమీద లేదని, వేరొకవైపు మళ్ళిందని మలైనమాన్ గ్రహించారు.

"తాతా! అదిగో చూడండి!" ఆదిత్య కరికాలన్ దిగులుతో అన్న మాటలు ఆ వీరవృద్ధుడు విని,

అటువైపు పరీక్షగా చూశారు.

~~~

# అధ్యాయము - 3

[This chapter is missing. Apologies]
~~~

# అధ్యాయము - 4

## అయ్యనార్ కోవెల

**కెడిలం** నదీతీరాన తాత మనుమలు మాట్లాడుకొంటున్న అదేసమయాన కొళ్ళిడం నది ఉత్తర తీరాన తిరుక్కాణాట్టు ముళ్ళూర్ అనే ఊరిలో మన పాత స్నేహితులైన ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు ఒక వినోదమైన కార్యంలో నిమగ్నమైవున్నారు. ఆ కాలంలో కొళ్ళిడం నది ఉత్తర కావేరిగా పరిగణించబడేది. తులామాసంలో ప్రతిదినమూ తిరుక్కాణాట్టు ముళ్ళూర్ ఆలయంలో నెలకొన్న శివ పరమాత్మ వృషభారూడుడై కొళ్ళిడం తీరానికి వచ్చి, అక్కడ నదిలో స్నానానికి వచ్చిన భక్తులను కరుణించడం సంప్రదాయం. మధ్యాహ్నవేళ ప్రతిరోజు పండగగానే ఉండేది. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలి వచ్చేవారు. శైవులు వచ్చేవారు; వైష్ణవులూ వచ్చేవారు. ఆ ఊళ్ళో విష్ణువాలయం చిన్నదిగా ఉన్నాకూడ విష్ణువు ఆ ఆలయంనుంచి గరుడవాహనమెక్కి కొళ్ళిడం నదీతీరానికి వస్తారు.

ఇలా తులామాసంలో ఉత్తరకావేరి నదిలో స్నానం చేసేందుకు వచ్చిన భక్త కూటమి మధ్య ఆళ్వార్ కట్టియాన్ ఒక నేరేడు చెట్టు కొమ్మను నేలలో నాటి, "నావలో నావల్ (=నేరేడు)! నావలో నావల్! ఈ నావల్ (నేరేడు) దీవిలో వైష్ణవమతమే మేలైనదని ఎంచి దాన్నే నెలకొల్పేందుకై వాగ్యుద్ధం చేసేందుకు వచ్చాను. శైవులు, శాక్యులు, అద్వైతులు, కాపాలికులు, కాళాముఖులు, బౌద్ధులు, జైనులు ఎవరు కావాలన్నా వాగ్యుద్ధంలో పాల్గొనవచ్చు. వారు గెలిస్తే వారిని నా భుజాలమీద ఎక్కించుకొని ఊరేగిస్తాను. వారు ఓడిపోతే, నడుం బట్ట తప్ప, మిగిలినవన్నీ ఇక్కడ వదిలిపెట్టి పోవాలి! నావలో నావల్!" అని కేకలేయసాగాడు. అతని ముందు రుద్రాక్షమాలలు, కమండలాలు, కుండలాలు, పట్టు పీతాంబరాలు, బంగారు కాసులు మొదలైనవి కుప్పగా పోసివున్నాయి. ఇందునుంచి ఇతడు చాలసేపటినుంచి వాగ్యుద్ధంలో చాలమందిని ఓడించాడని తెలుస్తోంది. పక్కనే ఒక చెట్టునానుకొని చేత పదును పెట్టిన కత్తితో నిలబడ్డాడు వంతిదేవుడు. అప్పుడు అతని చేత ఒక కత్తి, నడుం చుట్టు ఒక బట్ట మాత్రమే ఉన్నాయి. అతడు నిలబడ్డ వైఖరి ఎలా ఉందంటే, ఆళ్వార్ కట్టియాన్ పైన బలాత్కార ప్రయోగం చేయజూసిన వారిని కత్తి ఝుళిపించి భయపెట్టి తరమగొట్టివుండాలని అనిపిస్తోంది. ఆ సమయాన గుంపుగా ఘోషిస్తూ అటువైపు వచ్చిన ఒక శైవుల బృందాన్ని చూసి అతడన్న మాటలనుంచి కూడ అది విశదమవుతూంది:

“హెచ్చరిక! న్యాయంగా వాగ్యుద్ధం చేసేవారు చేయవచ్చు. హద్దుమీరి ఈ వైష్ణవుని మీద చేయి చేసుకోవడానికి ప్రయత్నిస్తే, ఈ కత్తికి ఎరౌతారు!” అని హెచ్చరించడంతోబాటు కత్తిని రెండుసార్లు తిప్పి ఝుళిపించాడు. కోపంతో వచ్చిన శైవులు చల్లబడిపోయారు. వారిలో ఒకడు, “ఏ వైష్ణవా! ఏదో నీవీరోజు వాగ్వివాదంలో గెలిచేశావని గర్వపడకు! తిరువయ్యార్‌కు పో! అక్కడ నిన్ను వాగ్యుద్ధంలో ఓడించి

తరిమికొట్టగల నంబియార్ నంబి ఉన్నారు!" అన్నాడు.

"మీ తిరువయ్యార్ నంబిని వీరనారాయణ పురం భట్టుగారితో వాదించమనండి! అక్కడ ఒకవేళ నేను కూడ ఉంటే ఉండవచ్చు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

చాలసార్లు అతడు 'నావలో నావల్' అని కేకలేసినా కూడ కొత్తగా ఎవరూ వాగ్యుద్ధానికి రాలేదు. కాబట్టి నేరేడు కొమ్మను తీసేసి శంఖ చక్రాలు పూసిన విజయధ్వజాన్ని నాటాడు. పక్కనే నిలబడి ఇదంతా చూస్తున్న కొందరు వైష్ణవులు వెంటనే అతని దగ్గరకొచ్చి అతన్ని భుజాలపైకెత్తుకొని,

"నారాయణుడే మాదైవం!

మనమందరం స్తుతిస్తాం!"

అని పాడుతూ గెంతులేశారు. తర్వాత, "వీరవైష్ణవా! మా ఇంటికి వచ్చి విందుభోజనం ఆరగించి కరుణించాలి!" అని ప్రార్థించారు. "అలాగే కానివ్వండి!" అని ఆళ్వార్ కట్టియాన్ గంభీరంగా చెప్పేసి, వంతిదేవుని కూడ తనతోబాటు తీసుసుకొని వెళ్ళాడు. ఇద్దరూ పులిహోర, పరమాన్నం, దద్ధోజనం మొదలైనవి కడుపు నిండా ఆరగించారు. ఆళ్వార్ కట్టియాన్ తాను వాగ్యుద్ధంలో గెలిచిన వస్తువులనన్నింటిలో, అంగవస్త్రంగా ధరించదగ్గ ఒక్క పట్టు పీతాంబరాన్ని మాత్రం వంతిదేవునికిచ్చి, తక్కిన వాటినన్నింటినీ శ్రీవైష్ణవులకిచ్చి వాటి విలువకు సమానమైన బంగారు కాసులను తీసుకొన్నాడు. వైష్ణవమతం గొప్పతనాన్ని ఉత్తరాన హరిద్వారం వరకు విస్తరింపజేసేందుకు వెళుతున్నానని, అందుకు బంగారు కాసులు కావలసివస్తుందని చెప్పుకొన్నాడు. శ్రీవైష్ణవులు కూడ మనస్ఫూర్తిగా, ఆ వస్తువుల విలువకన్న ఎక్కువగానే బంగారు కాసులిచ్చారు. వాటిని తీసుకొని మరుసటి రోజు ఉదయాన ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు కడంబూర్‌వైపు పయనమయ్యారు.

~

కొళ్ళిడం నది పొంగి పారుతుండడం వల్ల వారెక్కి వచ్చిన గుర్రాలను అవతలి గట్టుకు తమతో తీసుకొని వెళ్ళలేకపోయారు. వారెక్కిన పడవలో అప్పటికే చాలమంది ప్రయాణీకులున్నారు. కాబట్టి అది ఉత్తర తీరం చేరేటప్పటికి తలకిందులైపోయింది. తక్కిన వారిలాగ వంతిదేవుడు కూడ నదిలో పడి, ఈదుకొంటూ వెళ్ళి గట్టెక్కవలసివచ్చింది. ఆ సమయాన అంతకాలంగా ఎన్నో క్లిష్టమైన పరిస్థితులలో కూడ కాపాడుకొంటూ వచ్చిన అతని నడుం బట్ట, దానిలో అతడు భద్రపరుచుకొని వచ్చిన రాజముద్రలు, యువరాకుమారి కుందవైదేవి రాసిచ్చిన తాళపత్రం కూడ వెల్లువలో కొట్టుకుపోయాయి. కొత్త గుర్రాలను కొనుక్కోవడానికే వారిద్దరు పైన సూచించిన యుక్తిని పన్నారు. యుక్తి ఫలించి కాస్త ధనం కూడ దొరికింది. కానీ ఆ గ్రామాంతర ప్రదేశంలో ఎక్కడా గుర్రాలు కొనుక్కోవడానికి దొరకవని కూడ తెలిసివచ్చింది. కడంబూర్ గ్రామంలో వారానికొక రోజు జరిగే సంతలో ఒకవేళ గుర్రాలు అమ్మకానికి రావచ్చు. లేకపోతే తిరుప్పాపులియూర్‌కి వెళ్ళే కొనుక్కోవాలి.

కడంబూరుకు వెళ్ళడమా వద్దా అన్న విషయం గురించి ఆ స్నేహితుల మధ్య వివాదం జరిగింది. అందులో ఉన్న సాధకబాధకాలను గురించి వివాదించారు. కడంబూర్‌లో ఆదిత్య కరికాలన్ రాక గురించి ఏదైనా సమాచారం దొరకవచ్చు. కంచి నుంచి బయలుదేరారా, ఏ దారిలో వస్తున్నారు అని ఏదైనా సమాచారం దొరకవచ్చు కద? కానీ కడంబూర్‌లో తెలిసినవారి కంట పడకూడదు. గందమారన్ని కలవడమే జరిగితే చాల అపాయం. ఒకవేళ పళువేట్టరయ్యర్ల పరివారం ఇంతలోపల వచ్చివుంటే, అది కూడ పెద్ద తంటానే.

"వైష్ణవా! నీకు రాత్రి పూట గోడెక్కి దూకడం ఎలాగూ తెలుసు కద? శంబువరయ్యర్ గుర్రపుశాల నుంచే రెండు గుర్రాలను తెచ్చేయవచ్చు కద?" అన్నాడు వంతిదేవుడు.

"నేను గోడెక్కి దూకుతాను. కానీ గుర్రాలకు గోడెక్కి దూకడం తెలియాలి కద?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"పళువూర్ పరివారం అక్కడికి వచ్చి చేరివుంటే, రెండు గుర్రాలను కొట్టేయవచ్చు కద? వారు మునుపొకసారి నా గుర్రాన్ని తరిమికొట్టారు కద? అందుకు పగ తీర్చుకోవాలి!" అన్నాడు వాణర్ కులవీరుడు.

కొన్ని నెలల క్రితం వారిద్దరు కడంబూర్‌లో కలిసిన విషయం, ఆ రాత్రి జరిగిన అపూర్వ సంభవాల గురించి దారి పొడుగునా మాట్లాడుకొంటూ వెళ్ళారు. ఇద్దరూ సూర్యాస్తమయ సమయానికి కడంబూర్ చేరారు.

~

కడంబూర్ వారు ఎదురుచూసినట్లు చాల సందడిగానే ఉంది. అంతఃపురం, కోట వాకిలి తోరణాలతోను, పూలమాలలతోను అలంకరించబడివున్నాయి. కోట వాకిట, కోట బయటి ప్రాకారం చుట్టూ మునుపటికన్న కాపలా గట్టిగా ఉంది. పట్టపు యువరాజు ఆదిత్య కరికాలన్ వస్తున్నారంటే అడగాలా మరి? అదే సమయాన ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ తమ రాణి సమేతంగా రాబోతున్నారు. ఇద్దరి పరివారాలు కూడ వస్తున్నారు. కొన్ని రోజులపాటు ఊరు సందడిగానే ఉంటుంది.

ఇదంతా కడంబూర్ బజారు వీధిలో జనాలు మాట్లాడుకొంటుండగా మన ఇద్దరు మిత్రులు విని తెలుసుకొన్నారు. జనాల మాటలనుంచి ఇద్దరి పరివారాలు కూడ ఇంకా వచ్చి చేరలేదని తెలిసింది. శంబువరయ్యర్ కొడుకు గందమారన్ ఆదిత్య కరికాలన్‌ని పిలుచుకొని రావడానికి ఏకంగా కంచికే వెళ్ళాడని కూడ తెలిసింది. ఈ సంభ్రమపూరితమైన మాటల మధ్య 'కడలి పొట్టనబెట్టుకొన్న యువరాజు అరుళ్మొళివర్మ' గురించి కొందరు మెల్లగా మాట్లాడుకోసాగారు. అంత పెద్ద దుఃఖకారణమైన సంభవం జరిగివున్నప్పుడు ఇక్కడ విందులు వినోదాలకు ఏర్పాట్లు జరుగుతుండడం చాలమందికి నచ్చలేదన్న విషయం వారు చూచాయగా మాట్లాడుకోవడంనుంచి తెలియవచ్చింది.

ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు ఈ మాటలన్నీ చెవిన వేసుకోనివారిలాగ వింటూనే ఊరు దాటి వెళ్ళారు. ఊరిలోపల ఎక్కడా ఆ రాత్రి విడిది చేయడానికి వారిష్టపడలేదు. ఊరి బయట, ఊరికి సమీపంగానే ఏదైనా పాడుబడ్డ మంటపమో, చావడో లేకుండ పోతుందా? అలా లేకపోతే, రాత్రి తిరునారాయణపురానికి వెళ్ళి విడిది చేయడం మంచిది. అక్కడున్న పెద్ద పెరుమాళ్ళ దేవాలయంలోని నూరుకాళ్ళ మంటపంలో నెమ్మదిగా పడుకొని నిద్రపోవచ్చు. క్రితం రాత్రి జరిగిన సంఘటనల తర్వాత ఒక రాత్రి మంచి నిద్ర కావలసి వచ్చింది.

కడంబూర్ దాటి బాట వెంబడి కాస్త దూరం వెళ్ళగా దట్టమైన ఒక వెదురు పొదల అడవి, దాని లోపల అయ్యనార్ కోవెల కనిపించాయి. “వైష్ణవులుగారూ! ఇక నేను నడవలేను. రాత్రి ఈ గుడిలో పడుకొందాం. ఎవరి కంటా పడకుండడానికి ఇది మంచి చోటు!” అన్నాడు వంతిదేవుడు.

“అబ్బాయి! నీ ఆలోచన పొరబాటు. ఇలాంటి చోటికి మనలాంటివారు వచ్చి చేరరని ఏం నిశ్చయం?” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అలా వచ్చేవాళ్ళు గుర్రాలతో వస్తే చాల మంచిది!” అన్నాడు వంతిదేవుడు.

“ఈ వెదురు అడవి లోపల ఏ గుర్రమూ దూరలేదు. మనుషులు దూరి వెళ్ళేందుకే చాల కష్టంగా ఉంది కద?”

“ఎక్కడైనా ఒక ఒంటి కాలిబాట దొరకకుండ పోదు. కోవెల పూజారి వచ్చేందుకైనా ఒక కాలిబాట ఉండే తీరాలి!”

~

ఇద్దరూ వెదురు పొదల చుట్టూ తిరిగి తిరిగి చివరికి ఒక ఇరుకైన కాలిబాటను కనిపెట్టారు. దాని వెంబడి, ముళ్ళు తమను గీరకుండ వెళ్ళడం చాల ప్రయాసగా ఉంది. ఇలా కాస్త దూరం వెళ్ళాక ఒక బయలు ప్రదేశం కనిపించింది. అక్కడ ఒక చిన్న అయ్యనార్ ఆలయం కనిపించింది. గుడికెదురుగా ఒక బలిపీఠం, దాని పక్క మట్టితో చేయబడి, ఆవంలో కాల్చబడ్డ ఏనుగు బొమ్మలు, గుర్రం బొమ్మలు వరుసగా పెట్టబడివున్నాయి. అయ్యనార్ స్వామికి మొక్కుకొన్నవారు అలా ఏనుగు, గుర్రం బొమ్మలు తీసుకొని వచ్చి పెట్టడం సంప్రదాయం/పరిపాటి.

“గుర్రాల గురించి ఇంత దిగులుబడుతున్నావే! అయ్యనార్ స్వామిని అడిగి రెండు గుర్రాలు తీసుకోవచ్చు కద?” అన్నాడు వంతిదేవుడు.

“మట్టి గుర్రాలను నమ్మి నదిలో దిగవద్దన్న పాత సామెత తెలియదా?” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“వైష్ణవా! మా అయ్యనార్ స్వామి చాల శక్తివంతమైన దేవుడు. అడిగిన వరాన్ని వెంటనే ఇవ్వగలిగినవారు. మీ విష్ణువులాగ భక్తులను అష్టకష్టాలు పడనిచ్చి పట్టపగలే నిద్రపోయేవారు కారు!”

అన్నాడు వంతిదేవుడు.

"అలాగైతే ఈ మట్టి గుర్రాలకు ప్రాణం ఇచ్చినా ఇస్తాడని చెప్పు! చాల మంచిది. డబ్బులు మిగులు!"

"నిజమైన భక్తి ఉంటే మట్టి గుర్రాలు కూడ ప్రాణం పోసుకొంటాయి! చూడబోతే మన శరీరాలు మాత్రం ఏమి? బ్రహ్మదేవుడు మట్టితో చేసి ప్రాణం ఇచ్చినవే కద?"

"బాగా చెప్పావు తమ్ముడూ! ఈ శరీరం మట్టితో చేసిందని మరిచిపోతున్నాము. దాన్ని అప్పుడప్పుడూ గుర్తుతెచ్చుకోవడానికే తిరుచూర్ణాన్ని నెత్తిమీద, ఒంటిమీద పూసుకోవాలని వైష్ణవ ఆచార్య పురుషులు ఆజ్ఞాపించారు!"

వంతిదేవుడు "ఉష్!" అని చెప్పేసి, ఆళ్వార్ కట్టియాన్ చేయి పట్టుకొని ఇంకొక చేత్తో ఎదురుగా చూపించాడు. సూర్యుడస్తమించి కాసేపైంది. నలువైపులా వెదురుపొదలు కమ్ముకొన్న ఆ చిన్న బయలు ప్రదేశంలో చాల మసగ్గా కనిపించిన వెలుతురులో అయ్యనార్ స్వామివారి వాహనాలు ప్రాణం వచ్చి కదులుతున్నట్లు కనిపించింది. ఒక ఏనుగు, ఒక గుర్రం ఉన్న చోటునుంచి పక్కకు జరిగాయి. కళ్ళతో చూస్తున్న ఈ అద్భుతాన్ని నమ్మడమా, వద్దా అని ఒక్కక్షణం అవాక్కై నిలబడ్డాడు వంతిదేవుడు. కానీ ఆయ్యనార్ స్వామివారి అద్భుతశక్తిని తక్షణమే చూపించగల అవకాశాన్ని పోగొట్టుకోవడానికి కూడ అతడికి మనసొప్పలేదు. "వైష్ణవులుగారూ! చూశారా..." అని అతడు చెప్పేలోపల, ఆళ్వార్ కట్టియాన అతడి చేతిని గట్టిగా పట్టుకొని, పెదవులపైన వేలుంచి నిశ్శబ్దంగా ఉండమని సైగ చేశాడు. తర్వాత వంతిదేవుని పట్టుకొన్న చేత్తోనే లాక్కొని వెళ్ళి ఆ వెదురు పొదల వెనక దాక్కొని నిలబడ్డాడు.

గుర్రమూ, ఏనుగూ కాస్త పక్కకు తొలిగాయి కద? అలా పక్కకు తొలగి కాస్త చోటిచ్చిన ప్రదేశాన ఒక మనిషి తల మాత్రం కనిపించింది. ఆ తల అటూ ఇటూ నలువైపులా తిరిగి చూసింది. అయ్యనార్ బలిపీఠం ముందు ఇలా ఒక తల మాత్రం కనిపించి అటూ ఇటూ తిరిగి చూడడం చాల భయంకరమైన దృశ్యంగా కనిపించింది. ఎన్నో భయంకరమైన దృశ్యాలను చూసిన వంతిదేవుని ఒళ్ళు, ఈ దృశ్యాన్ని చూడగానే జలదరించింది. కానీ ఆళ్వార్ కట్టియాన్ తనను పట్టుకొన్న చేయి మాత్రం ఏమాత్రం వణకకుండడాన్ని గమనించి మనసు గట్టిపరుచుకొన్నాడు.

వీరు చూస్తుండగానే ఆ తల లేచి పైకి వచ్చింది. ఒక మనిషి ఎద వరకు కనిపించింది. తర్వాత ఆ మనిషి పూర్తి ఆకారం పైకి వచ్చింది. ఆ మనిషి పైకి వచ్చిన చోట ఒక చిన్న ద్వారం - నల్ల చీకటి కమ్ముకొన్న పాతాళ బిలద్వారంలాగ, భయంకరంగా నోరు పెకలించుకొని అగుపించింది.

కాస్త పరీక్షగా చూసిన తర్వాత ఆ మనిషి ఎవరని వంతిదేవునికి తెలిసిపోయింది. కడంబూర్ మాళిగలో పనివాడుగా ఉంటూనే రవిదాసుని కుట్ర కూటమిలో చేరివున్న ఇడుంబన్‌కారే వాడు.

దీన్ని ఇద్దరూ ఏకకాలంలో గ్రహించగానే ఒకరికొకరు సైగలతో తమ ఆశ్చర్యాన్ని

తెలియజేసుకొన్నారు.

ఇడుంబన్‌కారి తెరిచిన ద్వారాన్ని అలాగే వదిలిపెట్టి, మళ్ళీ ఒకసారి అటూ ఇటూ చూసేసి, అయ్యనార్ గుడివైపు నడిచాడు. గుడి తలుపును తెరుచుకొని లోపలికి వెళ్ళాడు. కాసేపటికల్లా కోవెల లోపలినుంచి మిణుకు మిణుకుమని వెలుతురు కానవచ్చింది. కోవెల లోపల దీపం వెలిగించబడిందని ఇద్దరూ గ్రహించారు.

“తమ్ముడూ! ఇందుగురించి ఏమనుకొంటున్నావు?” అని సన్నగా అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

“అయ్యనార్ శక్తివంతమైన దైవమని అనుకొంటున్నాను. గుర్రానికి ప్రాణం రావడాన్ని చూడలేదా?” అన్నాడు వంతిదేవుడు.

’అది సరే. ఇప్పుడు బయటకు వచ్చాడే, వాడి గురించి ఏమనుకొంటున్నావు?”

“వాడు అయ్యనార్ కోవెల పూజారిలాగుంది. మనం కూడ వెళ్ళి స్వామి దర్శనం చేసుకొందామా?”

“కాస్త ఓపిక పట్టు; ఇంకా ఎవరైనా స్వామి దర్శనానికి వస్తారేమో చూసి తెలుసుకొందాం.”

“ఇంకా ఎవరైనా వస్తారని ఎదురుచూస్తున్నావా?”

“మరెందుకు వాడు దీపం వెలిగించాడు?”

“పూజారి గుడి దీపం వెలిగించడంలో ఆశ్చర్యమేముంది?”

“తమ్ముడూ! వాడెవడని తెలియడం లేదా?”

“తెలియకేం? బాగా తెలుసు. కొళ్ళిడం నది ఉత్తర తీరాన నాకు గుర్రం తీసుకొని వచ్చాడే, ఆ ఇడుంబన్‌కారే వీడు. ఇప్పుడు కూడ వెళ్ళి గుర్రమిప్పిస్తాడేమోనని అడగాలనుకొంటున్నాను.”

“భలే మంచి ఆలోచన!”

“ఏం? నీకు నచ్చలేదా?”

“ఇడుంబన్‌కారి నీకు గుర్రం తీసిచ్చినవాడు మాత్రమే కాదు. రవిదాసు కూటమికి చెందినవాడు కూడాను.”

“అలాగైతే ఇంకొక మంచి ఆలోచన తడుతోంది.”

“ఏమది?”

“ఇడుంబన్‌కారి అయ్యనార్ కైంకర్యంలో నిమగ్నమైఉన్నప్పుడు వాడెక్కడినుంచి మొలిచాడో వెళ్ళి చూసి తెలుసుకొని వద్దామని అనుకొంటున్నాను.”

“అదెలా సాధ్యం?”

“వాడు బయటికి వచ్చిన ద్వారం నుంచి నేను లోపలికి పోలేనా?”

"కావచ్చు. కానీ అందులో ఉన్న అపాయాలు..."

"అపాయాలు లేని కార్యం ఏది?"

"తర్వాత నీ ఇష్టం."

"వైష్ణవులుగారూ! మీరిక్కడే ఉండి ఏం జరుగుతుందో గమనిస్తూండండి."

"దానికేం కష్టం? నేనిక్కడే ఉండి గమనిస్తూంటాను. సొరంగ మార్గం ఎక్కడిదాకా వెళుతుందని నీకనిపిస్తూంది?"

"తోస్తూంది స్వామీ, తోస్తూంది! అది సరియైనదేనా అని తెలుసుకోగోరుతున్నాను."

"దాన్ని నీవెందుకు తెలుసుకోవాలి?"

"ఏదైన ఒక సమయాన ఉపయోగపడవచ్చు కద? ఎవరు చూడవచ్చారు?"

అప్పుడు కాస్త దూరాన ఇంకెవరో మాట్లాడడం వినిపించింది.

"ఆలస్యం చేసేందుకు సమయం లేదు. వైష్ణవులుగారూ! నేను తిరిగి వచ్చేంతవరకు ఇక్కడే ఉంటారు కద? లేక సుగ్రీవుడు వాలికి చేసినట్లు చేస్తారా?"

"ఊపిరున్నంతవరకు ఇక్కడే ఉంటాను. కానీ నీవు తిరిగి వస్తావని ఏం నిశ్చయం?"

"ప్రాణముంటే నేను తిరిగి వస్తాను..."

~

ఇలా అంటూనే వంతిదేవుడు నాలుగే అంగల్లో ద్వారం ఏర్పడిన చోటుకు చేరి, అందులోకి దిగాడు. మరుక్షణమే ఆ చీకటి కమ్ముకొన్న పల్లంలో కనుమరుగైనాడు. బిలద్వారం అతన్ని అలాగే మింగేసినట్లనిపించింది.

కోవెల లోపలికి వెళ్ళిన ఇడుంబన్‌కారి మళ్ళీ బయటకు వచ్చి అటూ ఇటూ చూశాడు. తెరిచిన ద్వారం వాడి కంట పడింది. వెంటనే అక్కడికి వెళ్ళి బలిపీఠం పక్కనున్న శూలాయుధాన్ని మెలితిప్పాడు.

ఉన్న చోటునుంచి పక్కకు తొలగిన ఏనుగు, గుర్రం మళ్ళీ దగ్గరికి వచ్చాయి. ద్వారం మూసుకొని ఉన్నచోటు తెలియకుండ మరుగైంది.

ఈ కార్యాన్ని చేసేసి ఇడుంబన్‌కారి మళ్ళీ కోవెల మెట్ల దగ్గరకు వచ్చాడు. అదే సమయాన రవిదాసు, సోమన్ శాంభవన్ మొదలైనవారు ఇంకొకవైపునుంచి వచ్చి అక్కడ చేరారు.

ఆళ్వార్ కట్టియాన్ వెదురు పొదల వెనక ఇంకా బాగ దాక్కొన్నాడు.

కోవెల మెట్లపైన రవిదాసు కూర్చొన్నాడు. తక్కినవారు అతడి ముందు నేలపైన కూర్చొన్నారు.

"స్నేహితులారా! మనం చేపట్టిన వ్రతం నెరవేరే సమయం ఆసన్నమైంది!" అన్నాడు రవిదాసు.

"ఇలాగే ఆర్నెల్లనుంచి 'దగ్గరకొచ్చేసింది', 'దగ్గరకొచ్చేసింది' అని చెప్పుకొంస్తున్నారు" అన్నాడొకడు.

“అవును; అందులో తప్పేమీ లేదు. ఆరు నెలలుగానే ఆ దినం దగ్గరపడుతూ వచ్చింది. ఇప్పుడు వేళ్ళమీద లెక్కపెట్టేటంతగా రోజుల లెక్కలో దగ్గరకొచ్చేసింది. అదిత్య కరికాలన్ కంచినుంచి బయల్దేరాడని వార్త అందింది. తిరుక్కోవలూర్ ముసలాడు వాడిని అడ్డగించి ఆపేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదట!”

“దారిలో ఇంకెవరైనా అడ్డగించి ఆపరని ఏం నిశ్చయం?”

“ఆదిత్య కరికాలన్ ముందుంచిన కాలును వెనుదీయడు. ఇక ఎవరడ్డగించినా వినడు!”

“వాడి చెల్లెలు రాసి పంపించిన సందేశం వెళ్ళి చేరితే...?”

"అదెలా వెళ్ళి చేరగలదు? సందేశాన్ని తీసుకొని వెళ్ళిన యువకుని అడవిలో కట్టిపడేశాం కద?”

“భలే మాట! వాడిని ఈరోజు పొద్దున కొళ్ళిడం నది ఉత్తర తీరాన చూశాను. వాడితో మన ఇంకొక పగవాడు కూడ చేరుకొన్నాడు...”

“ఎవరది?”

“కపట వైష్ణవ వేషధారి!”

“అలాగైతే మనం అప్రమత్తంగా ఉండవలసిందే. వాళ్ళు ఆదిత్య కరికాలన్ని కలవకుండ అడ్డుపడాలి!”

“తొండాన్ని వదిలి తోకను పట్టుకొన్నట్లుంది మన కథ. చేత దొరికినవాడిని అక్కడే ముగించాల్సింది. రాణి వాడిని ఎందుకు ప్రాణాలతో వదిలిపెట్టమని చెప్పిందో తెలియడం లేదు.”

“స్నేహితులారా! నాక్కూడ అది అప్పుడు అర్థం కాలేదు. తర్వాత తెలుసుకొన్నాను. రాణి నన్ను కూడ మించిపోయిందని ఒప్పుకొంటున్నాను. అతిముఖ్యమైన ఒక ఉద్దేశంతోనే వంతిదేవుని ప్రాణాలతో విడిచిపెట్టమని చెప్పింది రాణి. అది మీరిప్పుడు తెలుసుకోనవసరం లేదు. వంతిదేవుని గురించి దిగులు అవసరం లేదు. కానీ ఆ వైష్ణవుని మళ్ళీ చూస్తే మాత్రం ఏమాత్రం కనికరం చూపించకుండ ముగించేసి తర్వాతి పని చూడండి...” అన్నాడు రవిదాసు.

~~~
~~~

# అధ్యాయము - 5

## భయంకరమైన నేలమాళిగ

బిలద్వారం గుండా కిందికి దిగిన వంతిదేవుడు కొన్ని మెట్లు దిగి వెళ్ళిన తర్వాత సమతలంగా ఉండడాన్ని గమనించాడు. అక్కడ చాల మసగ్గా వెలుతురు కానవచ్చింది. పది పదిహేను అడుగులు ముందుకు వెళ్ళాడు. ఏదో బండి (చక్రం) తిరుగుతున్న శబ్దం వినవచ్చింది. ఉన్నట్లుండి చిమ్మచీకటి కమ్ముకొని అతన్ని మింగేసినట్లనిపించింది. దానితో అతనికి భయం పట్టుకొంది. జోలిమాలిన పనికి వెళ్ళకూడదని తాను చాలసార్లు చేసుకొన్న తీర్మానం గుర్తుకొచ్చింది. మనం బయలుదేరిన కార్యమేమి? ఎంత ముఖ్యమైనది? దాన్ని వదిలేసి ఈ పాతాళ సొరంగమార్గంలో దిగాం కద? ఇది తనని ఎక్కడికి తీసుకొని వెళ్ళి చేరుస్తుందో, ఏమో! అక్కడ ఎటువంటి అపాయాలు పొంచివున్నాయో కద? ఎంత తెలివి తక్కువ పని చేశాం? మన తొందరపాటు బుద్ధి మనని ఎప్పుడు వదులుతుంది? ఈ ఆలోచనలు అతని నడక వేగాన్ని తగ్గించాయి. తిరిగి వెళ్ళిపోదామని వెనక్కి తిరిగాడు. మెట్లు తగిలాయి. కానీ పైన ద్వారం కనిపించలేదు. తడిమి తడిమి చూశాడు. ఫలితం లేకపోయింది. ఎవరో పైనుంచి ద్వారాన్ని మూసేసివుండాలి. వంతిదేవునికి ముచ్చెమటలు పట్టనారంభించాయి. ఇంకా గాభరాతో, మూసిన ద్వారాన్ని తోసి తెరిచేందుకు ప్రయత్నించాడు. ఇంతలో ఎవరో మాట్లాడే గొంతు వినవచ్చింది. ఒకటి కాదు, చాల గొంతులు వినిపించాయి. ఒకవేళ తాను ఎక్కడినుంచి బిలద్వారంలోపల ప్రవేశించాడో ఆ అయ్యనార్ కోవెల వాకిట మనుషులు మాట్లాడుకొంటుండవచ్చు. ఇడుంబన్‌కారి ఎవరినో ఎదురుచూసే కద దీపం వెలిగించాడు? వారిప్పుడు వచ్చివుండవచ్చు. అది నిజమైతే తాను బిలద్వారాన్ని తెరిచి బయటకు/పైకి వెళ్ళడం చాల అపాయకరం కావచ్చు. వాళ్ళు అక్కడ ఎంతసేపు కూర్చొని మాట్లాడుకొంటారో తెలియదు.ఇడుంబన్‌కారి కూటమికి చెందిన రవిదాసు మొదలైనవారైతే ఆ కుట్రదారులు అక్కడే కూర్చొని చాలసేపు మాట్లాడుకొనే అవకాశముంది. వారిక్కడ ఎందుకు సమావేశమయ్యారు? ఏం మాట్లాడుకొంటున్నారు? ఏం కుట్ర పన్నాగాలు పన్నుతున్నారు? ఇదంతా ఆ వీరవైష్ణవుడు గమనిస్తుంటాడు. మనమిక్కడ ఊపిరి బిగబట్టి, చెమటలు కారుస్తూ నిలబడి ఉండడం కన్న, కాస్త ముందుకు వెళ్ళి చూడడం మంచిది. తెగించి దిగడమేమో దిగేశాం. ఈ సొరంగ మార్గం ఎక్కడికి వెళ్ళి అంతమవుతుందో కనిపెట్టడం మంచిది కద?

~

ఇలా నిశ్చయించుకొన్న వంతిదేవుడు వెనకేసిన అడుగును మళ్ళీ ముందుకు వేశాడు. కింద నేల సమతలంగా ఉన్నాకూడ రాళ్ళు రప్పలమయంగా ఉంది. రాతిని తొలిచి ఆ పాతాళగృహాన్ని

నిర్మించివుండాలి. ఆ దారి ఎక్కడికి వెళ్ళి చేరుస్తోందన్న విషయమై అతని మనసులో ఒక ఆలోచన రూపు దిద్దుకొంది. బహుశ అది కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలోపలికి వెళ్ళి ముగియాలి. ఆ మాళిగలో ఎక్కడికి వెళ్ళి చేరుస్తుందో, ఏమో! ఒక వేళ బొక్కసం గదికి వెళ్ళి చేర్చవచ్చు; లేక అంతఃపురస్త్రీల నివాస స్థలంలో వెళ్ళి ముగియవచ్చు. రాజులు, సామంతులు నివసించే మాళిగలనుంచి అటువంటి సొరంగమార్గాలు ఉంటాయన్న విషయం అతడికి తెలిసిందే. ఏదైనా పెద్ద అపాయం వచ్చి, తప్పించుకొని పారిపోవలసిన పరిస్థితి వస్తే, అటువంటి సొరంగమార్గాలను ఉపయోగించుకొంటారు. అంతఃపురస్త్రీలను క్షేమంగా తప్పించడం కోసమే అటువంటి రహస్యమార్గాలు సాధారణంగా అంతఃపురంలోకి దారితీస్తాయి. ముఖ్యమైన బొక్కస సంపదను తీసుకొని వెళ్ళడం కూడ అత్యవసరం కాబట్టి అటువంటి మార్గాలు బొక్కసం గది గుండా వెళ్ళడం కూడ పరిపాటి. మరి ఈ దారి ఎక్కడికి వెళ్ళి ముగియబోతుంది? ఇడుంబన్‌కారి ఈదారి గుండా వచ్చి బయటకు వెళ్ళాడు కాబట్టి బహుశ ఇది బొక్కసపు గదికి వెళ్ళవచ్చు. పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసాన్ని ఆయనకు తెలియకుండ పళువూర్ రాణి ద్వారా ఈ కుట్రదారులు దొంగిలించడంలాగ, శంబురవరయ్యర్ బొక్కసాన్ని కూడ దోచేందుకు వీళ్ళు పన్నాగం పన్నారు కాబోలు! ఆదిత్య కరికాలన్, తదితరులు వస్తున్న ఈ సమయాన వీరిలా చేస్తుండడానికి కారణమేమి? ఒకవేళ ఇంకేమైనా ఉద్దేశం ఉండగలదా? తిరుప్పురంపయం పళ్ళిప్పడై అడవిలో తాను చూసింది, విన్నది గుర్తొచ్చింది వంతిదేవునికి. పళువూర్ యువరాణి దగ్గరున్న చేప చిహ్నం పొదిగిన ఖడ్గం ఒక్కక్షణం అతని మనోనేత్రం ముందు మెరిసి మాయమైంది. వంతిదేవునికి ఒళ్ళు జలదరించింది. బొక్కసాన్ని కొల్లగొట్టడంకన్న అతిభయంకరమైన ఉద్దేశంతో వీరున్నారని తోచింది. ఈ రహస్య మార్గం ఎక్కడికి వెళ్ళి ముగుస్తుందో తెలుసుకొంటే వారి ఆ భయంకరమైన ఉద్దేశం నెరవేరక అడ్డుపడేందుకు ఉపయోగపడవచ్చు.

~

నిజానికి అతడు సొరంగమార్గాన నడవడం మొదలుపెట్టి కొన్ని నిమిషాలు మాత్రమే గడిచాయి. కానీ చీకటి కమ్ముకొన్న దారిగుండా వెళుతుండడం వల్ల చాలసేపటినుంచి నడుస్తున్నట్లనిపించింది. గాలి లేనందువల్ల ఊపిరాడడం కష్టమైంది. పైగా విపరీతంగా చెమట పట్టసాగింది. అయ్యనార్ కోవెలనుంచి కడంబూర్ మాళిగ ఎంతదూరమని ఎంచినప్పుడు అతన్ని నిరుత్సాహం కమ్ముకొంది. కానీ మళ్ళీ ఆలోచించి చూశాడు. మాళిగ ముందు వాకిటనుంచి చుట్టు తిరిగి వీధులగుండా నడిచి ఊరు దాటి అడవి దారిన కోవెల దగ్గరకు వచ్చినందువల్ల అంతదూరమనిపించింది. అంతఃపురం/మాళిగ వెనుక భాగంనుంచి తిన్నగా వస్తే అయ్యనార్ గుడి అంతదూరముండదు. విల్లునుంచి బాణం వదిలితే అది వెళ్ళగలిగినంత దూరం మాత్రమే ఉంటుంది. అది నిజమైతే ఇప్పటికి అంతఃపురం బయటి ప్రాకారం గోడ దగ్గరకు వచ్చేసివుండాలి కద...?

అవును; అలాగే అనిపిస్తూంది. ఉన్నట్లుండి ఎక్కడో పైనుంచి చల్లనిగాలి వంతిదేవుని పైన

వీచింది. ఊపిరాడక చెమటబట్టి మూర్ఛపోయే స్థితికి వచ్చిన వంతిదేవునికి ఆ చల్లనిగాలి కొత్తగా ప్రాణం పోసింది. తలెత్తి చూశాడు. ఎత్తైన చోట చాలదూరాన చిన్నగా వెలుతురు కనిపించింది. మాటలుకూడ వినవచ్చాయి. ప్రాకారం గోడమీద కాపలా వీరులు కాపలా కాసేందుకు అక్కడక్కడా అమర్చబడివుండే గూళ్ళలో అది ఒకటైవుండాలి. దానిగుండా సొరంగమార్గంలోపలికి గాలి దూరి వచ్చేందుకు ఏర్పాటు చేయబడివుండాలి. కానీ గాలి మాత్రం రావచ్చుగాని, మనుషులు కిందకు దిగడానికిగాని, పైకెక్కడానికి గాని అక్కడేమీ వసతులు లేవని వంతిదేవుడు గ్రహించాడు.

కడంబూర్ మాళిగలోపలికి ప్రవేశించేశామన్న విషయం, పైనుంచి వీచిన చల్లని గాలి అతడికి కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. సొరంగమార్గం అంతమయ్యే చోటు ఇక అతి సమీపానే ఉండాలి. అది బొక్కసపు నేలమాళిగా? పెద్ద పళువేట్టరయ్యర్‌లాగ శంబువరయ్యర్ కూడ కుప్పలు కుప్పలుగా ముత్యాలు, రత్నాలు, వజ్రాలు, వైఢూర్యాలు, బంగారు కాసులు కూడబెట్టి ఉంటారా? అక్కడ చూసినట్లు ఇక్కడ కూడ ధనరాసుల మధ్య చచ్చిన మనుషుల ఎముకల గూళ్ళు కనిపిస్తాయా? బంగారు కాసుల మీద సాలె పురుగులు గూడు కట్టివుంటాయా?

~

ఇలా ఆలోచిస్తూ వెళ్ళిన వంతిదేవుడు కాలికేదో తగలగా అదిరిపడ్డాడు. తర్వాత అది ఒక మెట్టు అని తెలుసుకొని ధైర్యం తెచ్చుకొన్నాడు. అవును; ఆ మెట్లెక్కి వెళితే బొక్కసపు గది చేరడం తథ్యం. లేదా రాచస్త్రీలు నివసించే అంతఃపురం కావచ్చు. అలాగైతే తన గతి అధో గతే! ఆఁ! గందమారన్ చెల్లెలు మణిమేఖల! ఆ నలుపు వన్నె సుందరి అక్కడుంటుంది కద! ఒకప్పుడు ఆమెను పెళ్ళాడే ఆలోచన తనకు కలిగిన విషయాన్ని గుర్తు తెచ్చుకొని చిన్నగా నవ్వుకొన్నాడు. ఆ చిరునవ్వును చూసి సంతోషించేందుకు అక్కడ ఎవరూ లేరు! ఒకవేళ ఆమె అలంకారాలేమీ లేకుండ ఉన్నప్పుడు తాను ఉన్నట్లుండి వారందరి ముందు ప్రత్యక్షమైతే? ఇది తలుచుకొన్నప్పుడు అతడికి నవ్వొచ్చేసింది.

నవ్విన మరుక్షణమే, అతని ఒంట్లో రక్తమంతా హరించుకు పోయేటట్లు, అతని ఊపిరి ఆగిపోయేటట్లు, గుండె కొట్టుకోవడం కూడ నిలిచిపోయేటటువంటి భయంకరమైన దృశ్యం అతడి ముందు కనిపించింది. మెట్లెక్కి వెళ్ళాడు కద? పైమెట్టు చేరిన తర్వాత, ఇక పైకి వెళ్ళేందుకు మెట్లు లేవని గ్రహించి తానెక్కడికి వచ్చి చేరానన్న విషయం తెలుసుకోవడానికి చుట్టూ చూశాడు. వందల కొద్దీ కొరివి కళ్ళు అతన్ని గుచ్చి చూశాయి. వాటివైపు పరీక్షగా చూశాడు. ఆ కళ్ళన్నీ భయంకరమైన అడవి మృగాల కళ్ళు! ఉన్నట్లుండి వాటిని చూసిన దిగ్భ్రాంతి వల్ల భీతిగొని వచ్చిన దారినే తిరిగి వెళ్ళిపోదామనుకొన్నాడు. కానీ వెనుదిరిగి వెళ్ళేందుకు దారిలేదు. పైమెట్టుమీద అతడు కాలిడగానే వెనక ఏదో శబ్దం వినిపించింది. సొరంగమార్గం తనకు తానే మూసుకొంది కాబోలు! కానీ, ఇదేం ఘోర భయంకర దృశ్యం? ఇన్ని అడవి మృగాలూ ఇక్కడ తనకోసం కాచుకొని ఉన్నాయి కద! వేంగై పులులు (= బెబ్బులులు), చిరుతలు,

సింహాలు, ఎలుగు బంట్లు, అడవి దున్నలు, తోడేళ్ళు, నక్కలు, ఖడ్గ మృగాలు! అదిగో రెండు ఏనుగులు! అన్నీ తనపైకి దూకేందుకే సిద్ధంగా ఉన్నట్లున్నాయి! ఎందుకింకా అవి దూకలేదు? - అదిగో ఎంత పెద్ద బ్రహ్మాండమైన డేగ! అయ్యో! ఆ రాక్షస గుడ్లగూబ! గబ్బిలం! - తాను చూస్తున్నది కలా? లేక... ఇదేమి? ఇక్కడ ఒక మొసలి పడివుందే? నోరు బార్లా తెరిచి, భయంకరమైన పళ్ళను చూపిస్తూ ఇక్కడుందేమి? మొసలి నీటిలో కద ఉంటుంది? ఇది నేల కద? అడవి మృగాల మధ్య ఈ మొసలి ఎలా వచ్చింది...?

~

"అమ్మయ్య! బతికిపోయాను!" అని నోరారా పెద్దగా అన్నాడు వంతిదేవుడు. తన చుట్టూ ఉన్న ఆ మృగాలు సజీవంగా లేవని, వేటలో చంపబడి, తర్వాత తోలుబొమ్మల్లాగ చేయబడి అక్కడ అమర్చబడివున్నాయని గ్రహించాడు. వేటలో చంపిన ఆ జంతువుల తోలును పదిలపరిచి, నిజమైన మృగాల్లాగ కనిపించేందుకు, వాటిలోపల దూది కుక్కి అక్కడ అమర్చిన 'వేట మంటపం' అది అని అర్థం చేసుకొన్నాడు. అలాంటి వేట మంటపం ఒకటి ఆ మాళిగలో ఉందని గందమారన్ తనకు చెప్పిన విషయం కూడ గుర్తుకొచ్చింది. తానిప్పుడు ఆ వేట మంటపంలో ఉన్నానని అవగాహనకొచ్చినా, మొదట భీతి వల్ల కలిగిన వణుకు తగ్గేందుకు కాసేపు పట్టింది.

~

తర్వాత ఒక్కొక్క మృగం దగ్గరికి వెళ్ళి చూశాడు. వాటిని తాకి చూశాడు. కదిలించి చూశాడు. తొక్కి చూశాడు. ఆ జంతువులు నిర్జీవమైనవని నిర్ధారం చేసుకొన్నాడు. తర్వాత ఏం చేయడమా అని ఆలోచించాడు. వచ్చిన దారి మూసుకుపోయింది. దాన్ని కనిపెట్టి మళ్ళీ వచ్చిన దారినే వెనుదిరగడమా? లేక, ఈ భయంకర మంటపం కడంబూర్ మాళిగలో ఏ భాగాన ఉందో కనిపెట్టడమా? లేక ఇక్కడినుంచి ఇంకేదైనా దారి ఉందా అని వెతకే ప్రయత్నంలో దిగడమా? గోడల్లో ఎక్కడైనా తలుపులున్నాయా అని తడిమి చూస్తూ చుట్టు తిరిగి తిరిగి వచ్చాడు. బాహాటంగా తెలిసే తలుపేదీ కనిపించలేదు. సమయం గడిచేకొద్దీ వంతిదేవునికి కోపం అధికం కాసాగింది. ఈ అనవసర కార్యంలో తలదూర్చి చిక్కుకొన్నాం కద అని ఉక్రోషం పొంగుకొచ్చింది. గోడ వారగా చుట్టూ తిరిగి వస్తున్నప్పుడు ఒక ఏనుగు తల, తొండం దంతాల సమేతంగా గోడలో అమర్చబడి కనిపించింది.

"ఒసే దిక్కుమాలిన ఏనుగా! నీవు పక్కకు జరిగే కద నన్నీ చెరసాలలో బంధించావు?" అని ఆ ఏనుగును చూసి కోపంగా అడిగాడు. బతికున్న ఏనుగులే మాట్లాడవు. మరి ఈ చచ్చిన తోలుబొమ్మ ఏనుగు ఏం మాట్లాడుతుంది? తొండాన్ని కూడ కదిలించలేదు.

"ఏం? నేనడుగుతున్నా మాట్లాడవేమి?" అని అంటూనే ఆ ఏనుగు దంతాలను పట్టుకొని ఒక్కసారి మెలిదిప్పాడు.

అప్పుడక్కడ ఒక మాయాజాలం జరిగింది.

~

దంతాలను పట్టుకొని తిప్పిన తక్షణం గోడతో అంటుకొనివున్న ఏనుగు చెవి కదిలింది. కదలడం మాత్రమే కాదు, మడతబడి పక్కకు జరిగింది. అక్కడ గోడలో ఒక పెద్ద ద్వారం కనిపించింది.

ఆపుకోలేని ఆశ్చర్యంతో వంతిదేవుడు ఆ ద్వారం దగ్గరికి వెళ్ళి మెడను చాచి తొంగి చూశాడు.

చూసిన చోట ఒక అమ్మాయి ముఖం కనిపించింది. ఆ అమ్మాయి పెద్ద కళ్ళు ఆశ్చర్యంతో విప్పారి ఆమె అలాగే కళ్ళప్పగించి చూసింది. ఆశ్చర్యమాశ్చర్యం! ఆమె ముఖం పక్కన వంతిదేవుని ముఖం కూడ కనిపించింది. ఒక అమ్మాయి ప్రేమించినవాడు ఆమెకు ముద్దిచ్చేందుకు ఆమె ముఖం దగ్గరగా తన ముఖాన్ని ఎలా దగ్గరికి తీసుకొని వెళతాడో, అలాగ వంతిదేవుడు తన ముఖాన్ని ఆమె ముఖం పక్కన చూశాడు. అప్పటికే పెద్దగా విప్పారిన ఆమె కళ్ళు ఇప్పుడు చెప్పలేని ఆశ్చర్యంతో ఇంకా పెద్దగా విప్పారాయి. ఆశ్చర్యంతోబాటు కాస్త భయం కూడ ఆమె కళ్ళలో ప్రతిఫలించింది. ఒక్క క్షణం ఆమె అలాగే చూస్తూ నిలబడింది. మరుక్షణం ఆమె తన ఎర్రబారిన పెదవులను విప్పి "కీ"చుమని అరిచింది.

వంతిదేవునికి ఉన్నట్లుండి దిగులు పట్టుకొంది. ఆ దిగులులో ఏనుగు దంతంపైనున్న తన చేతులను తీశాడు.

మరుక్షణం ఏనుగు ఏనుగుగాను, గోడ గోడగాను నిలిచాయి.

ద్వారం మూసుకుపోయింది. అమ్మాయి మాయమైంది.

భ్రమర ఝుంకారంలాగ తన చెవులను తొలిచిన ఆ కీచుమన్న అరుపు మళ్ళీ వినబడలేదు.

వంతిదేవుని గుండె దడ ఆగేందుకు కాసేపు పట్టింది.

తర్వాత తాను చూసిన దృశ్యం గురించి దీర్ఘాలోచనలో మునిగాడు.

~~~
~~~

# అధ్యాయము - 6

## మణిమేఖల

**శంబువరయ్యర్** ముద్దుల కూతురైన మణిమేఖల కుతూహలం నిండిన అమ్మాయి. తలిదండ్రులు, అన్న గందమారన్ కూడ చిన్నప్పటినుంచి ఆమెను చాల గారాబంగా ముద్దుచేసి పెంచారు. శంబువరయ్యర్ మాళిగలో ఆమె (చేత బెత్తం లేని) రాణిగా విరాజిల్లేది. ఆమె చెప్పిందే మాళిగలో చట్టం. కొంతకాలం క్రితం వరకు మణిమేఖల జీవితం ఆటపాటలతో ఉల్లాసంగా గడుస్తూ వచ్చింది. నాలుగైదు నెలలకు మునుపు మొట్టమొదటిసారిగా ఆమె జీవితంలో ఒక ఆటంకం ఏర్పడింది. ఆమె కోరికకు విరుద్ధంగా ఒక కార్యాన్ని చేయాలని ఇంటి పెద్దలు బలవంతం చేయసాగారు. "మంకుపట్టు పనికి రాదు" అని ఆమె పెద్దలకు ఎంత ఉపదేశించినా ఫలితం లేకపోయింది.

రెండుమూడేళ్ళుగా గందమారన్ యుద్ధరంగంనుంచి తిరిగి వచ్చినప్పుడల్లా తన స్నేహితుడు వల్లవరయ్యన్ గురించి ఆమెతో చెప్పేవాడు. అతడి వీర ప్రతాపాలగురించి, బుద్ధి చాతుర్యం గురించి గొప్పగా పొగిడేవాడు. అందంలో మన్మధుడని, యుక్తిలో కృష్ణుడని వర్ణించేవాడు. "వాడే నీకు తగిన భర్త; నీ దుడుకుతనాన్ని అదుపులో ఉంచగలవాడు" అనేవాడు. ఇదంతా తరచూ వినాలని మణిమేఖల ఆశపడేది. అదే సమయాన గందమారన్ మీద విరుచుకుపడేది; అతడితో దెబ్బలాడేది.

"ఇలా ఊరికే చెబుతుండడమెందుకు? ఒకసారి అతన్ని పిలుచుకొని వస్తే అతడి సామర్థ్యమేమిటో నేనూ చూస్తాను" అనేది.

"అలాగే, అలాగే" అనేవాడు గందమారన్.

మణిమేఖలకూడ ఒకసారి వంతిదేవుని తన మనోనేత్రంతో చూసి, తన మానసికలోకంలో అతనితో సరససల్లాపాలాడి, తర్వాత దెబ్బలాడి, సమాధానపడి, - ఇలా పగటి కలలు కంటూ కాలం వెళ్ళబుచ్చసాగింది. తన సన్నిహిత స్నేహితురాళ్ళతో కొన్నిసార్లు తన అన్న స్నేహితుడైన వాణర్ కుల వీరుని గురించి వర్ణించి సంతోషపడేది!

ఇటువంటి ఇంపైన పగటి కలలకు నాలుగు నెలల క్రితం ఎదురుచూడని ఒక ఆటంకం కలిగింది.

గందమారన్ కొత్తరాగం మొదలెట్టాడు. "ఇల్లు, వాకిలి, పదవి, అంతస్తు ఏమీ లేని ఆ అనాధవాడిని మరిచిపో!" అని చెప్పసాగాడు. తంజావూరు సింహాసనం మీద ఆమెను కూర్చోబెట్టబోతున్నామని ఆశపెట్టాడు. తర్వాత ఒకరోజు తేటగానే విషయాన్ని చెప్పేశాడు. అప్పటికే చిన్నపళువేట్టరయ్యర్ కూతురిని పెళ్ళాడిన మధురాంతకునికి ఈమెను కూడ ఇచ్చి పెళ్ళి చేయబోతున్నట్లు చెప్పాడు. మధురాంతకుడే తర్వాతి చక్రవర్తి, అతన్ని పెళ్ళాడితే మణిమేఖల ముల్లోకాలకు చక్రవర్తిని

కావచ్చని ఆమె కడుపున పుట్టే పిల్లాడు కూడ సామ్రాజ్యం ఏలే సామ్రాట్టు కావచ్చని ఆశ చూపించాడు. దీనికంతటికీ ఆమె కన్నవారు కూడ వంతపాడారు.

~

కానీ మణిమేఖలకు ఈ మాటలేమీ రుచించలేదు. వంతిదేవుని గురించి విని, విని ఆమె మనసు అతడికే అంకితమైపోయింది. అది మాత్రం కాదు - మధురాంతకుడు వీరత్వం లేని వాడని, యుద్ధరంగాన్ని చూసే ఎరగడని, నిన్న మొన్నటివరకు ఒంటి నిండా విభూతి పూసుకొని రుద్రాక్షలు ధరించి సన్యాసిని కాబోతున్నానని చెప్పుకొంటూ వచ్చినవాడని కూడ ఆమె ఎరుగును. అది చాలదని అతడికి ఇప్పటికే ఒకసారి పెళ్ళై భార్య ఉంది. తంజావూరు అంతఃపురస్త్రీలేమో చాల గర్విష్ఠులు. తమకు మాత్రమే నాగరికత తెలుసునన్నట్లు తక్కిన ఊళ్ళవారిని చులకనగా చూస్తారు. ఇదంతా ఎంచి చూసుకొని మణిమేఖల చాల మండిపడింది. తంజావూరు సింహాసనం తనకందేటట్లయినా సరే, దేవలోకపు దేవేంద్రుని సింహాసనం తనకు దొరుకుతుందన్నా సరే, మధురాంతకుని మాత్రం తాను పెళ్ళాడనని హఠం పట్టింది.

తర్వాత ఇంకొక సమాచారం తెలియవచ్చినప్పుడు ఆమె నిర్ణయం ఇంకా బలపడింది. పెద్ద పళువేట్టరయ్యర్ కడంబూర్ మాళిగకు వచ్చినప్పుడు ఆయనతోబాటు ఆయన యువరాణి నందిని కూడ వచ్చిందన్నారు. కానీ ఆమె అంతఃపురానికి రానే లేదు. కడంబూర్ అంతఃపురస్త్రీలను చూడను కూడ లేదు. దాని గురించి అంతఃపురస్త్రీలు పరిహాసంగా మాట్లాడుకొన్నారు. తర్వాత కొద్దికొద్దిగా నిజం బయటపడింది. మూసిన పల్లకిలో యువరాణి రాలేదని, మధురాంతకుడు వచ్చాడని తెలిసినప్పుడు మణిమేఖల అసహ్యం మరింత పెరిగింది. “ఛీఛీ! ఇలా పిరికిపందలాగ మూసిన పల్లకిలో ఆడదాని వేషంలో తిరుగాడేవాడిని నేను వరిస్తానా? ఏనాడూ అది జరగదు!” అని మణిమేఖల దృఢనిశ్చయం తీసుకొంది.

మధురాంతకుడు మూసిన పల్లకిలో అంతఃపురానికి వచ్చిన అదే సమయాన గందమారన్ స్నేహితుడైన వంతిదేవుడు కూడ వచ్చాడు. అతడు అంతఃపురానికి వచ్చి కాసేపు మాత్రమే ఉన్నాడు. అప్పుడు మణిమేఖలకు చెప్పలేనంత సిగ్గేసింది. తక్కిన అంతఃపురస్త్రీల వెనక నిలబడింది. వంతిదేవుని నేరుగా, ముఖాముఖి చూడను కూడ లేదు. కానీ ఇతర అంతఃపురస్త్రీల వెనక నిలబడి సరిగ్గా చూడకపోయినా, అతని కళతో నిండిన ముఖం, చిరునవ్వు ఆమె మనసులో పదిలమైపోయాయి. అతని గొంతు. అతడు మాట్లాడిన కొన్ని మాటలు ఆమెకింకా జ్ఞాపకమున్నాయి.

కాబట్టి మణిమేఖల తన అన్నతో ముగింపులేని వివాదం మొదలుపెట్టింది. ముక్కంటియైన ఆ పరమేశ్వరుడే వచ్చి చెప్పినా తాను మధురాంతకుని పెళ్ళాడనని ఖరాఖండీగా చెప్పేసింది.

వంతిదేవుని తాను చూసింది కొన్ని నిమిషాలపాటేనైనా తన మనసు అతనికే అంకితమైపోయిందని మణిమేఖల గ్రహించింది.

గందమారన్‌కి ఇది ఎనలేని కోపాన్ని కలిగించింది. మొదట మంచి మాటలతో చెప్పి చూశాడు.

ఫలించలేదు. తర్వాత, "వంతిదేవుడు నా స్నేహితుడు కాడు; పరమ ద్రోహి. నన్ను వెన్నుపోటు పొడిచి చంపజూసిన మిత్రద్రోహి. నీవు వాడిని పెళ్ళి చేసుకొంటే నిన్ను, వాడిని కలిపి చంపేస్తాను!" అన్నాడు. వీపులో గాయాన్ని చూపించాడు. తర్వాత పళువూర్ యువరాణి తనకు చేయించిన చికిత్స గురించి చెప్పాడు.

"నాపైన నీకు నువ్వు గింజంత నమ్మకమున్నా కూడ, వాడిని మరిచిపో!" అన్నాడు.

~

ఇది విన్న తర్వాత మణిమేఖల మనసు నిజంగానే మారిపోయింది. తన అన్న గందమారన్ పైన ఆమెకు చాల ప్రేమ. అతన్ని చంపజూసిన పగవాడిని తాను పెళ్ళాడడం అసాధ్యం. కాబట్టి వంతిదేవుని మరిచిపోవడానికి ప్రయత్నించింది. కానీ అది అంత సులభసాధ్యమనిపించలేదు. తరచూ, ఎదురుచూడని సమయాల్లో, అతని చిరునవ్వు నిండిన ముఖం ఆమె మనోనేత్రం ముందు ప్రత్యక్షమయ్యేది. పగటి కలల్లోను వచ్చేది; రాత్రి నిద్రలోను కనిపించేది.

ఇన్ని కారణాలవల్ల మణిమేఖల కొన్ని మాసాలుగా తన సహజ కుతూహల స్వభావాన్ని కోల్పోయింది. శోకం, నిరుత్సాహం ఆమెను పట్టి పీడించసాగాయి. పెళ్ళీడు రావడమే ఇందుకు కారణమని పెద్దలనుకొన్నారు. ఆమె చెలికత్తెలు ఆమెను పరిహసించేవారు. ఆటపాటలతో ఆమెను ఉత్సాహపరిచేందుకు ప్రయత్నించారు. కానీ అదేమీ ఫలించలేదు.

మళ్ళీ గత కొన్నిరోజులుగా మణిమేఖల మునుపటిలాగ ఉత్సాహం పుంజుకొంది. మధురాంతకునికి ఆమెనిచ్చి పెళ్ళి చేసే మాటను ఆమె తలిదండ్రులు, అన్న విడిచిపెట్టడం వల్ల కాస్త ఉత్సాహం కలిగింది. చక్రవర్తి జ్యేష్టపుత్రుడు, పట్టపు యువరాజైన ఆదిత్య కరికాలన్‌కి ఆమెనిచ్చి పెళ్ళిచేయడమని ఆమె పెద్దలు మాట్లాడుకోవడం ఆమె చెవిన పడింది.

~

ఆదిత్య కరికాలన్ వీర, ధీర, శౌర్య పరాక్రమాలను గురించి తమిళనాడులో విననివారు లేరు. ఆయన ఏదో కారణంవల్ల పెళ్ళిచేసుకోవడానికి నిరాకరిస్తున్నారని కూడ అందరికీ తెలిసిందే. అటువంటి వ్యక్తిని పెళ్ళిచేసుకోవడమంటే కలలో కూడ ఊహించలేనంత మహాభాగ్యం కద? ఈ విశాల భారతదేశంలో ఎందరు రాకుమార్తెలు ఆ భాగ్యంకోసం తపస్సు చేస్తున్నారు? ఇదంతా ఎంచి మణిమేఖల మళ్ళీ కాస్త ఉత్సాహంగొంది.

కంచినుంచి ఆదిత్య కరికాలన్, తంజావూరునుంచి పెద్ద పళువేట్టరయ్యర్ కడంబూర్ మాళిగకు అతిథులుగా రాబోతున్నారన్న వార్త ఆమెకు మళ్ళీ మునుపటి ఉత్సాహాన్ని, కుతూహలాన్ని కలిగించింది. ఈసారి పళువేట్టరయ్యర్ తమ యువరాణిని కూడ వెంట పిలుచుకొని వస్తున్నారు. నందినీదేవి తన అన్న ప్రాణాలను కాపాడింది. ఆమె అందం గురించి, గుణం గురించి, తెలివితేటల గురించి తన అన్న ద్వారా

ఎంతగానో వినివున్నది. ఈ కొత్త పెళ్ళి మాటకు మూలకారణం ఆమేనని తన అన్న పెద్దగా చెప్పుకొచ్చాడు. ఆమె కడంబూర్ మాళిగలో విడిదిచేసివున్నప్పుడు ఆమెకు తగిన ఉపచారాలు చేయడంలో ఆమే ముఖ్యపాత్ర వహించాలని కూడ ఆమె అన్న నొక్కిచెప్పాడు. మణిమేఖల మనసుకూడ అందుకు తగిన పరిపక్వత పొందింది. పళువూర్ రాణితో స్నేహం కలుపుకొని తంజావూరు అంతఃపురస్త్రీలను నాగరికతలో ఓడించగల సామర్థ్యాన్ని తెచ్చుకోవాలని కూడ ఆశపడింది మణిమేఖల.

కాబట్టి గత వారంరోజులుగా మణిమేఖల ఉత్సాహంతో తుళ్ళుతూ తిరుగాడసాగింది. ఉత్సుకతతో అంతఃపురంలో అటూఇటూ తిరుగాడుతూ, అతిథులకు కావలసిన వసతులన్నీ సరిగ్గా అమరుతున్నాయా అని చూడడంలో నిమగ్నమైంది. ముఖ్యంగా, పళువూర్ యువరాణికని అంతఃపురంలో కేటాయించిన భాగంలో సకల వసతులూ అమర్చడంలో చాల శ్రద్ధ తీసుకొంది. ఆమే కద ముఖ్య అతిథి? కాబట్టి అంతఃపురంలోని పనివాళ్ళను పేపుకు తినేసింది. తన చెలికత్తెలకు కూడ ఊపిరి సలపనీయలేదు. పళువూర్ యువరాణి విడిది చేయబోయే గదిలో ఒక్కొక్క వస్తువును వందసార్లు తీసి, చోటు మార్చి తిరిగి అమర్చేలాగ పనివాళ్ళను పురమాయించసాగింది.

యువరాజు ఆదిత్య కరికాలన్ తమ స్నేహితులతో విడిది చేయబోయే గదులను కూడ తరచూ వెళ్ళి చూసి వచ్చింది. ఎవడో పార్థిబేంద్రుడన్నవాడు ఆయనతోబాటు వస్తున్నాడట. అతడు ఎలాంటివాడో, ఏమో? - ఈ కాలంలో ఎవరెలా మారిపోతారని ఎవరికి తెలుసు? తన అన్న స్నేహితుడైన వంతిదేవుడు ఆదిత్య కరికాలన్‌గారి పరివారానికి చెందినవాడే! అతడిలా మిత్రద్రోహిగా మారిపోకుంటే ఇప్పుడు వీరితోబాటు వచ్చివుండాలి కద?

అవును. మణిమేఖల ఎంతగా ఈ పనుల్లో నిమగ్నమైవున్నాకూడ ఆ మిత్రద్రోహిని మరువలేకపోయింది!

~

పళువూర్ యువరాణి బహుశ ఈ రాత్రే వచ్చేస్తుందన్నారు. కాబట్టి చివరిగా ఇంకొక్కసారి మణిమేఖల ఆ పళువూర్ యువరాణికోసం కేటాయించిన గదిని పర్యవేక్షించడానికి వచ్చింది. అప్పుడు పళువూర్ రాణికోసం గోడవారగా అమర్చిన అద్దానికెదురుగా వచ్చి నిలబడింది. తన ముఖాన్ని అందులో చూసుకొంది. కాసేపు నిలబడి నిదానంగానే చూసుకొంది. తన ముఖమేమీ అందంలో తక్కువకాదని తనకు తానే చెప్పుకొని తృప్తిపడింది. అద్దం ముందునుంచి కదిలి పక్కకు వెళుతున్నప్పుడు అందులో ఇంకొక ముఖం కనిపించింది. అది తన ముఖం పక్కన చెంపకు చెంప తాకేటంత దగ్గరగా కనిపించింది. ఆమె కలలో తరచూ కనిపిస్తూ ఆమెను కలవరపరుస్తున్న వాణర్ కులవీరుని ముఖమే అది! ఆమె అది గ్రహించగానే ఆమె గొంతునుంచి, ఆమెకు తెలియకుండానే, 'కీ'చుమన్న కేక వెలువడింది.

మరుక్షణం అద్దంలో ఆమె ముఖం మాత్రమే కనిపించింది. ఆ ఇంకొక ముఖం మాయమైంది.

~~~
~~~

# అధ్యాయము - 7

## తోకలేని కోతి

**మణిమేఖల** కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయింది. తాను కాసేపటి క్రితం చూసిన దృశ్యం ఒట్టి భ్రమా? లేక కలా? కలైతే తాను నిద్రపోతుండాలి కద? తనను తాను తాకి చూసుకొంది. లేదు, తాను నిద్రపోవడం లేదు - మెలకువగానే ఉంది. పళువూర్ యువరాణి కోసం సిద్ధం చేసిన గది కద ఇది? పాలరాతి అద్దంలో తన ముఖం ఇప్పుడు చక్కగానే కనిపిస్తూంది. అదిగో స్తంభదీపం వెలుగుతోంది. అద్దానికెదురుగా ఉన్న గోడను పరీక్షగా చూసింది. దానిలో రహస్యద్వారమొకటున్న విషయం ఆమెకు తెలుసు. దాన్ని బయటినుంచి తెరవవచ్చు; లోపలినుంచి కూడ తెరవవచ్చు. మణిమేఖల ఆ చోటికి వచ్చి గోడవారగా నిలబడి చెవిని గోడకు తాకించి శ్రద్ధగా వింది. ఆ చోట గోడలో గోడగా ఉన్న రహస్యద్వారం చెక్కతో చేసిందే. కాబట్టి వేట మంటపంలో ఏదో జరుగుతున్నట్లు శబ్దం వినిపించింది.

మణిమేఖల మెల్లగా రహస్యద్వారాన్ని తెరిచి, మంటపంలోకి తొంగి చూసింది. మంటపంలో చాలవరకు చీకటి కమ్ముకొనివుంది. ఒక మూలలో మాత్రం ఒక చిన్న ప్రమిద వెలుగుతూంది. ఉన్నట్లుండి ఆ ప్రమిద వెలుతురు తగ్గిపోయింది. మరుక్షణం మునుపటిలాగ ప్రకాశించసాగింది. ఏదో ఒక ఆకారం ఆ దీపం ముందు అడ్డంగా వెళ్ళినట్లు తోచింది. ఆ ఆకారం ముఖం తాను కాసేపటి క్రితం చూసిన ముఖమేనా? లేక ఇది కూడ తన చిత్త భ్రమేనా?

మణిమేఖల తొంగి చూస్తూనే చేతులు చరిచింది. "ఎవరక్కడ?" అని మెత్తగా అన్నది. బదులుగా ఒక గొంతు సవరింపు వినిపించింది. ఒక గబ్బిలం, చూరునుంచి తాను వేలాడుతున్న చోటు వదిలి ఎగురుకొంటూ వెళ్ళి ఇంకొక చోట తలకిందులుగా మళ్ళీ వేలాడసాగింది. మళ్ళీ ఎవరో చాల మెత్తగా దగ్గిన చప్పుడు.

మణిమేఖల ఆ రహస్యద్వారం వాకిట నిలబడ్డ పళంగానే, "ఒసే, చంద్రమతీ!" అని పెద్దగా పిలిచింది.

"ఏమమ్మా?" అని బదులు వినవచ్చింది.

"చేతిదీపం తీసుకొని వెంటనే ఇక్కడకు రా!" అన్నది మణిమేఖల. కాసేపటికల్లా చేతిలో దీపంతో ఒక పనిపిల్ల వచ్చింది.

"ఇక్కడే ఇంత పెద్దగా దీపం వెలుతుతోంది కద? మరింకో దీపమెందుకు?"

"వేట మంటపంలోకి వెళ్ళి చూడాలి. ఏదో శబ్దం వినిపించింది."

"గబ్బిలం రెక్కలు కొట్టుకొని ఉంటుందమ్మా! ఇంకేం ఉండగలదు?"

"కాదే! కాసేపటి క్రితం ఈ పాలరాతి అద్దంలో నేను ముఖం చూసుకొంటున్నప్పుడు ఇంకొక ముఖం కనిపించింది!"

"ఆ ముఖం ఎలావుంది? మన్మధుని ముఖంలాగుందా? అర్జునుని ముఖంలాగుందా?" అనేసి చంద్రమతనే ఆ పనిపిల్ల కిసుక్కున నవ్వింది.

"ఏమే, చంద్రమతీ! నన్ను పరిహాసం చేస్తున్నావా?"

"లేదమ్మా, లేదు! మీరు తరచూ కలలో చూస్తున్నారంటున్నారు కద? ఆయనే ఇప్పుడు నిజంగా ప్రత్యక్షమైనారా?"

"అవునే, చంద్రమతీ! కానీ చాల నిజంగా తోచింది!"

"అందరాడపిల్లలకు ఒక్కోసారి ఇలాంటి చిత్తభ్రమ పడుతుంది. మీకలా ఇంకొక రెండుమూడు రోజులు మాత్రమే ఉంటుంది. రేపు కంచినుంచి వచ్చే యువరాజును చూశారంటే, ఆ పాత ముఖాన్ని పూర్తిగా మరిచిపోతారు."

"అదలా ఉండనీవే! ఇప్పుడు వేటమంటపంలోకి వెళ్ళి చూద్దాం, రా!"

"అనవసరమైన పని, అమ్మా! అక్కడ ఒకటే దుమ్ము, ధూళీను. బట్టలు మాసిపోతాయి."

"పోతే పోనీ."

"దగ్గు, తుమ్ములు వస్తాయి. రేపు అందరూ వచ్చే సమయాన..."

"వస్తే రానీ. ఇప్పుడు వేట మంటపాన్ని శోధించే తీరాలి. దీపం ఆరిపోకుండ జాగ్రత్తగా తీసుకొని రా!"

ఇలా చెబుతూనే మణిమేఖల వేటమంటపంలో ప్రవేశించింది. పనిపిల్ల కూడ ఆమె వెనకే వెళ్ళింది.

ఇద్దరూ చుట్టూ తిరిగి చూస్తూ వచ్చారు. చంద్రమతి (పనిపిల్ల) చేతబట్టిన దీపం పైనుంచే చచ్చిన అడవి మృగాలను చూస్తూ వెళ్ళింది. మణిమేఖలేమో నేలను కూడ పరీక్షించి చూస్తూ వెళ్ళింది. నేలపైన పేరుకొన్న దుమ్ములో అక్కడక్కడ కాలిగుర్తులుండడాన్ని గమనించింది.

"అమ్మా! అదిగో!" అన్నది చంద్రమతి.

"ఏమే అలా ప్రేలాపిస్తున్నావు?"

"అదిగో, ఆ తోకలేని కోతి కదిలినట్లనిపించింది!"

"నిన్ను చూసి అది తన సంతోషాన్ని తెలియబరిచింది కాబోలు!"

"ఏంటమ్మా నన్నలా గేలి చేస్తున్నారు?"

"నేను చిత్త భ్రమ పట్టి తిరుగాడుతున్నావని నీవు మాత్రం నన్ను పరిహాసం చేయలేదా?"

"ఒకవేళ మీ అద్దంలో కనిపించింది ఆ కోతి ముఖమేనేమో! మనం వచ్చిన వాకిలికి సరిగ్గా

ఎదురగా ఉంది చూడండి...! కోతి మళ్ళీ కదులుతోంది!"

"ఛీఛీ! నీ దీపం నీడే! దీపం జ్వాల కదిలేటప్పుడు కోతి అలా కదులుతున్నట్లనిపిస్తోంది. రా, వెళదాం! ఇక్కడెవరూ కనిపించడం లేదు."

"అలాగైతే ఆ కోతి ముఖమే అద్దంలో కనిపించివుండాలి. లేదా, అదిగో పైన కూర్చొనివున్న గుడ్లగూబ ముఖమైవుండాలి. అది మనని ఎలా గుడ్లప్పగించి చూస్తోంది, చూడండి!"

"నన్నెందుకు చేర్చుకొంటున్నావు? నీ అందాన్ని చూసి డంగైపోయే నిన్నలా కళ్ళార్పకుండా చూస్తోంది!"

"మరి, మిమ్మల్ని అద్దంలో తొంగి చూసిన ముఖం ఎవరిదైవుంటుంది?"

"ఒసే! నాకు చిత్తభ్రమ అని తీర్మానించేశావు కదే? నా కలలో తరచు కనిపించే ముఖం అద్దంలో కూడ కనిపించిందేమో. ఆ సుందరవదనాన్ని చూసిన కళ్ళతో ఈ కోతిని, గబ్బిలాన్ని చూడవలసిరావడం కష్టంగా ఉంది. రావే, వెళదాం! అద్దంలో ఇంకొకసారి ఆ ముఖం కనిపిస్తుందేమో చూస్తాను...!"

ఇద్దరమ్మాయిలూ మళ్ళీ వచ్చిన దారినే అంతఃపురంలోకి తిరిగి వెళ్ళారు.

~

తోకలేని కోతి వెనకనుంచి వంతిదేవుడు ఇవతలికి వచ్చాడు. రెండు మూడు సార్లు తుమ్మి ముక్కులోని దుమ్మును వదిలించుకొన్నాడు.

తనను అంత బాగ మరుగుపరిచిన ఆ తోకలేని కోతికి కృతజ్ఞతలు తెలియజేసుకొన్నాడు.

"ఓ కోతీ! నీవు బాగుండాలి! ఆ పనిపిల్ల నా ముఖాన్ని నీ ముఖంతో పోల్చినప్పుడు నాకు కోపం వచ్చిన మాట నిజమే. బయటపడిపోదామా అని కూడ అనుకొన్నాను. మంచిబుద్ధితో ఆ ఆవేశాన్ని అణచుకొన్నాను. నీవు ఇక్కడ నిలువెత్తు నిలబడివుండకపోతే నా గతేమయ్యేది? ఆ అమ్మాయిల చేత చిక్కుకొని ఉండేవాడిని! కోతీ! నీకు మేలు కలుగుగాక!"

ఇలా చెప్పి ముగిస్తుండగానే, ఆ అమ్మాయిల చేత చిక్కుబడ్డా కూడ అంత పెద్ద అపాయమేమీ కలిగివుండదన్న ఆలోచన కూడ తోచింది. వారెవరన్నది ముందుగానే ఊహించుకొన్నాడు.

వారి మాటలన్నీ అతడికి బాగానే వినిపించాయి. మణిమేఖల గట్టిగా ఘంటానాదంలాంటి గొంతుతో మాట్లాడింది. కలలో చూసిన ముఖం గురించి, అద్దంలో చూసిన ముఖం గురించి ఆమె ఏదో చెప్పింది కద? అదేమి? అతనికిప్పుడు పాత సంభవాలు గుర్తుకొచ్చాయి. గందమారన్ తరచూ ఆమెతో తన గురించి చెప్పేవాడని తనకు చెప్పాడు. మొట్టమొదటిసారి ఈ మాళిగకు వచ్చినప్పుడు ఆమెను  చూసీ చూడనట్లు చూసి వెళ్ళిన విషయం, గందమారన్ ఆమెను ఇంకెవరో పెద్దింటికిచ్చి పెళ్ళి చేయబోతున్నట్లు చెప్పిన విషయమూ గుర్తుకొచ్చాయి. ఒక వేళ ఈ పిచ్చి పిల్ల తన మనసు మార్చుకోకుండ ఉందా, ఏమి...?

దాని గురించి ఆలోచించేందుకు ఇప్పుడు సమయం/తీరిక లేదు. ఇక్కడినుండి బయటపడే

దారి వెతకాలి. ఏనుగు దంతం చేత తెరవబడ్డ ద్వారం అంతఃపురం లోపలికి వెళుతుంది. కాబట్టి అది తనకు ఉపయోగపడదు. తాను వచ్చిన దారినే వెతికి పట్టుకోవాలి. రహస్య మార్గాలను తెరిచేందుకు బయటినుంచి, లోపలినుంచి కూడ ఏర్పాట్లుంటాయన్న విషయం అతడికి తెలిసిందే. తెరవడమెలా అని కష్టపడి కనిపెట్టవచ్చు. కానీ రహస్యమార్గమెక్కడుందని తెలిస్తేనే కద దాన్ని తెరిచేదారి కనిపెట్టగలం? గోడను ఎంత పరీక్షించి చూసినా ఏమీ తెలియలేదు. వెలుతురు కూడ చాలినంత లేదు. తాను లోపలికి దూరిన చోటికి పక్కనే ఒక మొసలి ఉందన్న అతడికి గుర్తొచ్చింది. అక్కడికి వెళ్ళి దగ్గరున్న గోడ భాగాన్ని తడిమిచూస్తే, ఒకవేళ బయటపడే దారి కనిపించవచ్చు.

~

ఇలా ఆలోచించి, మొసలి దగ్గరకు వెళ్ళి చుట్టుపక్కల గోడభాగాలను తడిమి చూశాడు. ఏమీ ఫలితం దక్కలేదు. సమయం గడిచేకొద్దీ దిగులు అధికం కాసాగింది. ఇదేం తంటా? ఈ చెరసాలలో అప్పనంగా చిక్కుకొన్నాం కద? భగవాన్! అంతఃపురంలోకి దూరడం తప్ప వేరే దారి లేనట్లుంది కద! అలా అంతఃపురంలో దూరితే అందులో ఎన్ని అపాయాలు! ఒకవేళ మణిమేఖల తన మీద కనికరం చూపవచ్చు గాని ఆమెకు తానిక్కడకు ఇలా రహస్యంగా వచ్చినందుకు ఏం కారణం చెప్పడం? “నీపైన ప్రేమవల్ల ఇలా వచ్చాను!” అని చెప్పవచ్చా? అది ఎంతటి క్రూరమైన అబద్ధం? తెగించి అలా బొంకినా, ఆమె నమ్ముతుందా? మణిమేఖల మాత్రం ఒంటరిగా ఉంటుందని నమ్మకమేమిటి? తక్కిన ఆడవారి మధ్య చిక్కుబడితే...? శంబువరయ్యర్‌కి తెలిస్తే తనని ఖచ్చితంగా చంపేస్తారు!

మళ్ళీ వంతిదేవుని చూపులు నేలమీదున్న మొసలి వైపు మళ్ళాయి. దానిపైన అతడికి కోపం వచ్చింది. “ఒసే మొసలీ! ఎందుకలా నోరు బార్లా తెరుచుకొన్నావు?” అంటూనే దాన్ని చాచి తన్నాడు. తన్నినప్పుడు మొసలి కాస్త జరిగింది. అదే సమయాన నేలలో ఒక చీలిక కనిపించింది.

“ఆహా! నీవేనా దారిని అడ్డగించి మూశావు? బుద్ధిలేని మొసలి! మొదటే చెప్పకూడదా?” అని అంటూనే వంతిదేవుడు వంగి ఆ మొసలిని పక్కకు జరిపాడు. మొసలి జరిగే కొద్దీ నేలలో ద్వారం పెద్దది కాసాగింది. కింద మెట్లు కనిపించాయి.

~~~
~~~

# అధ్యాయము - 8

## రెండు చేతులు

**కడంబూర్** మాళిగలో రహస్యమార్గాలు ఎంత సమర్థవంతంగా నిర్మించబడివున్నాయన్న విషయాన్ని ఎంచి వంతిదేవుడు అచ్చెరువొందాడు. తెలియనివాళ్ళు తొందర తొందరగా ఎక్కడమో, దిగడమో చేస్తే చాల అపాయమే. సగం మెట్లెక్కేటప్పుడు మొసలి కదిలితే గోడ ఇరుకులో చిక్కుకొని అవస్థపడవలసిందే.

మొసలి కదలకుండ ఉందా అని పరీక్షగా చూసి నిశ్చయం చేసుకొని, వంతిదేవుడు నేలలోని ద్వారం దగ్గరకు వచ్చి కింద కాలు పెట్టబోయాడు. ఆఁ! అదేమి? తెరుచుకొన్న దారిలో కాలి చప్పుడు వినిపిస్తోందే! వస్తున్నదెవరు? ఆళ్వార్ కట్టియాన్ కావచ్చా? తనను వెతుక్కొంటూ వస్తున్నాడేమో...? అతడిక్కడికి రాకుండ అడ్డుపడి ఆపేయడమే మంచిది. లేదు, లేదు! వస్తున్నది ఒక్కరు కాదు! ఐదారుమంది వస్తున్నట్లు కాలి చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. అలాగైతే అది ఇడుంబన్‌కారి, వాడి కూటమికి చేరినవారై ఉండవచ్చు. వంతిదేవుడు ఒక్క అంగలో పక్కకు దూకి ఆ తోకలేని కోతి వెనక దాక్కొన్నాడు. ఆహా! రహస్యద్వారాన్ని తెరిచిపెట్టి వదిలేసి వచ్చేశామే! అందువల్ల ఏదైనా సందేహం కలుగుతుందా వాళ్ళకు? లేదు, లేదు! మనం వచ్చినప్పుడు ఆ ద్వారం తెరిచేవుంది. మనం పైమెట్టు మీద కాలు పెట్టినప్పుడే కద ఆ దారి మూసుకొంది! కాబట్టి అది తెరిచివుండడమే మంచిదైపోయింది. అదిగో, ద్వారం గుండా తల ఒకటి కనిపిస్తోంది. ఇడుంబన్‌కారి తలే! ఇదిగో పైమెట్టుమీద కాలు పెట్టి అటూ ఇటూ చూస్తున్నాడు. ఒక కాలు మాత్రం కింద ఉంది. ద్వారం మూసుకోకుండేందుకు కోసం అలా ఒక కాలు కింది మెట్టుపైన ఉంచి నిలబడ్డాడు కాబోలు!

అరెరె! ఇటువైపు ఏమీ వెలుతురు! గోడలో ఏనుగు ముఖం ఉన్నచోటు వదిలి పెకలించుకొంటోందే! అంతఃపురానికి దారి కనిపిస్తోందే! ఆ వాకిలి గుండా వస్తున్నదెవరు? అదిగో మణిమేఖల దీపం పట్టుకొని వస్తోంది!

ఇడుంబన్‌కారి ఒక్క దూకులో పైకెక్కి వస్తున్నాడు. వాడు వచ్చినదారి మూసుకొంటోంది. ఇడుంబన్‌కారి తొందర తొందరగా తన తలపాగాను తీసి పులిబొమ్మ మీది దుమ్ము దులుపుతున్నాడు! ఈ నాటకానికి ముగింపేది?

~

మణిమేఖల చేతి దీపాన్ని పైకెత్తి పట్టుకొని నలువైపులా చూసింది. ఇడుంబన్‌కారిని చూసి ఆశ్చర్యపోయింది.

ఇడుంబన్‌కారి దుమ్ముదులిపే పనిని ఆపి మణిమేఖలను ఆశ్చర్యంతో చూశాడు.

"తల్లీ! ఇదేమిటి? ఈ వేళలో ఇక్కడికెందుకు వచ్చారు?" అన్నాడు.

"ఇడుంబా! నీవేనా? ఏం చేస్తున్నావు?" అని మణిమేఖల అడిగింది.

"అమ్మా! రేపు వస్తున్న అతిథులను ఈ వేట మంటపానికి తీసుకొని వచ్చి చూపించాలి కద? అందుకే అన్నిటినీ తుడిచి శుభ్రం చెస్తున్నాను. చిన్న యజమాని కంచికి వెళ్ళేముందు నాకలా పురమాయించేసి వెళ్ళారు."

"అవును, ఇడుంబా! చిన్న యజమాని ఈ మాళిగలో నిన్ను, నన్ను తప్ప ఇంకెవరినీ నమ్మరు. ఈ పళువూర్ రాణిగారు దిగబోతున్న గదిలో ఏర్పాట్లన్నీ సరిగ్గా ఉన్నాయో లేవోనని చూస్తున్నాను. అప్పుడు ఇక్కడేదో శబ్దం వినిపించింది. నీవే ఉండాలనుకొన్నాను. ఇంకెవరికి ఈ మాళిగలోని రహస్యమార్గాలు, రహస్యద్వారాలు తెలుసు? ఎంతసేపటినుంచి నీవిక్కడ పనిచేస్తున్నావు?"

"ఒక గడియ పైనే కావచ్చు, తల్లీ! ఇంకా ఒక గడియ పనివుంది. తమరు ఒంటరిగానా ఇక్కడికి వచ్చారు? ఆ వదరుబోతు పిల్ల చంద్రమతి ఎక్కడ?"

"ఏదో శబ్దం వినిపిస్తోందని నేనే దాన్ని నాన్నగారిని పిలుచుకొని రమ్మని పంపాను. ఇక్కడున్నది నీవేనని తెలిసింది కద? ఇప్పుడు నాన్నగారిని పిలవడం అనవసరమని నేనే వెళ్ళి ఆ పిల్లకు చెబుతాను."

~

ఇలా చెబుతూనే మణిమేఖల దీపాన్నెత్తి పట్టుకొని ఇడుంబన్‌కారి ముఖంలో కలిగిన మార్పును గమనించింది. తర్వాత తోకలేని కోతిని చూసింది. మునుపొకసారి కదిలినట్లు ఇప్పుడు కూడ కదిలింది.

"అవును, తల్లీ! యజమానికి ఇవాళ ఎన్నో పనులు. మీరు వెళ్ళి ఆయనను రావద్దని చెప్పేసి నెమ్మదిగా పడుకొని నిద్రపొండి. అన్ని పనులూ నేనే చూసుకొంటాను." అన్నాడు ఇడుంబన్‌కారి.

మణిమేఖల మళ్ళీ వచ్చినదారినే లోపలకు వెళ్ళింది. రహస్యద్వారం మూసుకొంది.

ఇడుంబన్‌కారి ఏనుగు ముఖం దగ్గరకు వెళ్ళి గోడకు చెవి ఆనించి కాసేపు వింటూ నిలబడ్డాడు. పక్కగదినుంచి శబ్దమేమీ రావడం లేదని రూఢి చేసుకొన్న తర్వాత తిరిగి వచ్చాడు. బిలద్వారాన్ని తెరిచి కిందకు కొన్ని మెట్లు దిగి నిలబడ్డాడు.

బిలద్వారం లోపలినుంచి గుడ్లగూబ కూత వినిపించింది. బదులుగా ఇడుంబన్‌కారి కూడ గుడ్లగూబలాగ ఒకసారి కూశాడు.

బిలం దారిగుండా మనుషులు నడిచి వస్తున్న శబ్దం వినవచ్చింది.

తర్వాతి పనులు చకచకా జరిగాయి.

గబ్బిలమొకటి పటపట రెక్కలు కొట్టుకొంటూ ఎగిరిపోయింది.

ఇడుంబన్‌కారి అది గమనించాడు.

అదే సమయాన వెనకనుంచి తోకలేని కోతి అతడిమీద పడింది.

అది ఉన్నట్లుండి తన మీద పడ్డ వేగానికి వాడు మోకాళ్ళు మడుచుకుపోయి తడబడ్డాడు. అందువల్ల వాడు ఇంక రెండు మెట్లు కిందకు దిగవలసి వచ్చింది.

తన పైన పడ్డది ఇదీ అని మొదట తెలియకపోవడం వల్ల వాడు కేకలేసి చేతులు అటూ ఇటూ విసిరాడు.

తర్వాత జీవంలేని ఆ తోకలేని కోతి తనమీద ఎలాగో పొరబాటున పడిపోయిందని గ్రహించాడు. ధైర్యం తెచ్చుకొని దాన్ని నిలబెట్టి ఉంచబోయాడు.

ఇంతలో జీవమున్న మనిషి చేతుల్లాంటి రెండు చేతులు పైనుంచి ద్వారంలోపలికి వచ్చి అతన్ని ఇంకా కిందికి నొక్కాయి.

ఇడుంబన్ ఇది నమ్మలేకపోయాడు. ఒక్క క్షణం అతన్ని విపరీతమైన భీతి కమ్ముకొంది.

మళ్ళీ కిందా పైనా చూశాడు.

తోకలేని కోతి తలకిందులుగా ద్వారం గుండా కిందకు వేలాడుతుండడాన్ని, దాని సగం శరీరం వరకు కిందకు వచ్చి ద్వారం తలుపు సగం మూసుకొని వుండడాన్ని గమనించాడు.

మనిషి చేతులు తనకు కనిపించింది తన చిత్తభ్రమే అయివుండాలని నిశ్చయించుకొన్నాడు.

ఇంతలో బిలమార్గాన వస్తున్నవారు దగ్గరకొచ్చేశారు. ముందు వచ్చిన రవిదాసు, “ఇడుంబా! ఏమిది? ఎందుకిలా అరిచి నోరుకొట్టుకొన్నావు? ఏదైనా అపాయముందా? మేము తిరిగి వెళ్ళాలా?” అని అడిగాడు.

“వద్దు, వద్దు! అపాయం ఏమీ లేదు. బిలద్వారం తలుపు తెరిచేటప్పుడు ఈ రాక్షసి కోతి ఉన్నచోటు నుంచి జరిగి నా తలపైన పడింది. ఒక్క క్షణం నేను భీతిగొన్నాను. ఇప్పుడీ కోతి పైకి వెళ్ళకుండ, కిందికి రాకుండ దారికడ్డంగా ఉంది. కాస్త ఓపిక పట్టండి. దీన్ని పక్కకు తోసేసి దారి సరి చేస్తాను" అన్నాడు ఇడుంబన్‌కారి.

~

తడబడి కిందబడ్డ ఇడుంబన్‌కారిని పైనుంచి నొక్కిన చేతులెవరివో పాఠకులు ఊహించుకొనె ఉంటారు. వంతిదేవుని అదృష్టం ఈ సందర్భంలో కూడ అతనివైపే ఉంది. సరైన సమయాన సరైన ఉపాయం అతనికి తోచింది. ఇడుంబన్‌కారి మెట్లమీద నిలబడి గబ్బిలాన్ని చూస్తున్నపుడు వాడిపైకి తోకలేని కోతిని తోశాడు. తర్వాత వాడు తన ముఖాన్ని చూసే అవకాశం లేనట్లు మరుగ్గా నిలబడి, వాడిని కిందకు నొక్కాడు. తర్వాత తోకలేని కోతిని కూడ తలకిందులుగా లోపలికి తోశాడు. చివరిగా మొసలిని కూడ

జరిపేశాడు.

ఇదంతా కొన్ని క్షణాల్లో ముగించేసి వంతిదేవుడు ఏనుగు ముఖం దగ్గరకు పరుగెత్తాడు. ఏనుగు దంతాలను పట్టుకొని తన బలాన్నంతా ఉపయోగించి గట్టిగా తిప్పాడు.

గోడలో దారి ఏర్పడింది. కానీ మణిమేఖల లోపలినుంచి వచ్చి వెళ్ళిన విశాలమైన దారి కాదు - ఇది వలయాకారంలో ఉన్న ఇరుకైన దారి. అది తలుపు లోపల తలుపు కావచ్చు. తలుపును పూర్తిగా తెరవడం ఎలా అని ఆలోచించేందుకు ఇది సమయం కాదు. అంతలోపల కుట్రదారుల కూటమి పేటమంటపంలోకి వచ్చేయవచ్చు. తర్వాత తాను తప్పించుకోవడం దుర్లభం.

కాబట్టి తెరుచుకొన్న దారి ఇరుకైనా దాని లోపలికి దూరవలసిందే.

తీర్మానించినట్లే చేపట్టిన కార్యాన్ని ముగించాలని ఆ చిన్న ద్వారం గుండా దూరాడు వంతిదేవుడు. అతని తల, చేతులు సగం శరీరం లోపలికొచ్చేశాయి. మిగిలిన సగం శరీరం దూరడం ప్రయాసైంది. చేతులు చాచి పట్టుకోవడానికి ఏమీ కనిపించలేదు. ఈ సమయాన లోపలున్న దీపం ఆరిపోయి చీకటి కమ్ముకొంది.

వంతిదేవుడు అభయం కోరే స్వరంతో, "చంద్రమతీ! చంద్రమతీ! నన్ను కాపాడు!" అన్నాడు.

బదులుగా గలగలమని ఒక అమ్మాయి నవ్విన శబ్దం వినిపించింది.

"చంద్రమతీ! నీవిక్కడే నిలబడి చోద్యం చూస్తున్నావా? ఇది తగునా?"

అందుకు బదులుగా మళ్ళీ నవ్వు. దాని వెంబడే, "నీవిలా అంతఃపురంలోపలికి దొంగతనంగా రావడం మాత్రం తగునా/ఉచితమా?" అని ఒక ఆడపిల్ల గొంతు అడిగింది.

అది మణిమేఖల స్వరమని వంతిదేవుడు గ్రహించాడు.

కానీ కావాలనే, "చంద్రమతీ! నీవు రమ్మన్నావు కాబట్టి వచ్చాను! వెనక మనుషులు వస్తున్నారు. తొందరగా నన్ను ఎత్తు. లేకపోతే విపరీతాలు జరిగిపోతాయి!" అన్నాడు.

"చంద్రమతి ఇంతటి తెలివిగలదా? ఉండనీ! నీకు, దానికి చేర్చి బుద్ధి చెబుతాను!"

"ఓహో! తమరు రాకుమారి మణిమేఖలా? అమ్మా! ఈ ఒక్కసారి మాత్రం నన్ను మన్నించి కాపాడండి! ఇక మీదట ఇలాంటి తప్పుడు పనులు చేయను! మీకు కోటి పుణ్యాలు!" అని బతిమాలాడు వంతిదేవుడు.

చీకట్లో రెండు మెత్తని చేతులు వంతిదేవుని భుజాలను పట్టి, మెల్ల మెల్లగా కింద నేలమీదికి దించాయి. గోడలోని ద్వారం మూసుకొంది.

"రాకుమారీ! మీకు అనంతకోటి వందనాలు!" అన్నాడు.

"కాస్త ఓపిక పట్టు! నేను నిన్నేం చేయబోతున్నానని తెలుసుకొని వందనాలు చెల్లించు!"

"మీరు నన్నేం చేసినా ఒప్పే! హంతకులనుంచి నన్ను కాపాడారు కద, అదే చాలు! ఆ

కిరాతకుల చేత చావడం కన్న తమ పవిత్ర హస్తాల్లో మరణం కలిగితే అది నా భాగ్యం!"

"ఓయబ్బ! పెద్ద వీరాధివీరుడిలాగ ఉన్నావే! నిన్ను వెన్నంటి వస్తున్న హంతకులెవరు? కాస్త ఓపిక పట్టు! మొదట దీపం వెలిగించి నీ ముఖం ఎలావుందో చూస్తాను!"

"అమ్మణీ! నా ముఖాన్ని మళ్ళీ చూడాలా? మీరు అద్దంలో ముఖం చూసుకోబోతున్నపుడు వెనక కనిపించిన కోతి ముఖమే నాది! చంద్రమతి వర్ణించింది కద!" అన్నాడు వంతిదేవుడు.

చీకటిలో చిరునవ్వు శబ్దమూ, గాజుల గలగల వినిపించాయి.

వంతిదేవుడు ఆ గదిలో తల దూర్చినప్పుడు మణిమేఖల దీపాన్ని మూసేసింది. కాబట్టి చీకటి కమ్ముకొంది. ఇప్పుడు దాని మూతను తీయగానే దీపం బాగా వెలగసాగింది. దాని వెలుతురులో వంతిదేవుని ముఖాన్ని చూస్తూ మైమరచి నిలబడింది మణిమేఖల,

అప్పుడు పక్కనున్న వేటమంటపంలో పలువురు దడదడమని ప్రవేశిస్తున్న శబ్దం వినిపించింది.

~~~
~~~

# అధ్యాయము - 9

## కుక్క మొరిగింది

**మణిమేఖల** వంతిదేవుని ముఖాన్ని చూస్తూ నిలబడింది.

వంతిదేవుడు కూడ చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డాడు. పైకి నవ్వుతూ, లోలోపల, ఈ అమ్మాయికి ఏం కట్టు కథ చెప్పి తప్పించుకోవాలా అని ఆలోచించసాగాడు.

ఈ సమయాన ఎక్కడో దూరంనుంచి, “అమ్మా! నన్ను పిలిచారా?” అని ఒక గొంతు అడిగింది.

“లేదే! నీ పని చూసుకో!” అన్నది మణిమేఖల. వెంటనే ఆమె సంభ్రమం వీడింది.

కాసేపటి క్రితం వంతిదేవుడు దూకి వచ్చిన ద్వారం దగ్గరకు వెళ్ళి లోపలి తాళం వేసింది. తర్వాత వంతిదేవునికి సైగ చేసి ఆ గదిలోనే కాస్త దూరంగా తీసుకొని వెళ్ళింది. చటుక్కున తిరిగి, “అయ్యా! నిజం చెప్పండి! చంద్రమతి మిమ్మల్ని పిలిచిందని చెప్పారు కదా? అది నిజమా?” అని అడిగింది.

“అవును, అమ్మణి!”

“ఎప్పుడు, ఎక్కడ మిమ్మల్ని చూసి పిలిచింది?”

“కాసేపటి క్రితమే! పక్కగదిలో నేను కోతి వెనక దాగివున్నప్పుడు మీరిద్దరూ వచ్చి చూసేసి వెనుదిరిగారు. మీరు వెనుదిరిగిన తర్వాత ఆమె నన్ను చూసి, 'కోతీ! నీవు నా గదికి వచ్చి ఉంటావా? అనవసరమైన సమయాల్లో వచ్చేవారిని భయపెట్టి తరిమేందుకు చాల ఉపయోగకరంగా ఉంటుంది!' అన్నది. అది మీ చెవిన పడ్డట్లు లేదు!”

మణిమేఖల లేతనవ్వుతో, “నా చెవిన పడివుంటే ఊరకే వదిలేదాన్నా?” అన్నది.

“రాకుమారీ! మీ చెలికత్తెపైన కోపించుకొని ఏం ప్రయోజనం? నా ముఖమూ, ఆ తోకలేని కోతి ముఖమూ ఒకేలాగుంటే చంద్రమతి ఏం చేయగలదు?”

“మీ ముఖానికీ, తోకలేని కోతి ముఖానికీ చాల దూరం!”

“కోతి ముఖానికీ, దానిపైన వేలాడుతున్న గుడ్లగూబ ముఖానికి మధ్యనున్న దూరంలాగ కాబోలు.”

“మీ ముఖం కోతి ముఖమూ కాదు; గుడ్లగూబ ముఖమూ కాదు. కానీ కోతి చేష్టలన్నీ మీదగ్గరున్నాయి. ఒక్కోసారి గుడ్లగూబ లాగాను కళ్ళప్పగించి చూస్తుంటారు. కాసేపటి క్రితం ఆ అద్దంలో తొంగి చూసింది మీరే కద?”

“అవును, రాకుమారీ, నేనే!”

“ఎందుకు వెనకడుగు వేసి తలుపు మూశారు?”

"ఈ అద్దంలో నా ముఖం పక్కన ఒక దేవకన్య ముఖం కనిపించింది. ఆ దేవకన్య నా ముఖాన్ని చూసి భయపడుతుందేమోనని నేను పట్టుకొనివున్న ఏనుగు దంతంపైనుంచి చేయి తీశాను. తలుపు దానంతటదే మూసుకుపోయింది."

"ఆ దేవకన్య ఎవరని మీకు తెలుసా?"

"ఆ క్షణాన తెలియలేదు. తర్వాత గుర్తు తెచ్చుకొని తెలుసుకొన్నాను."

"ఏం తెలుసుకొన్నారు?"

"నేను చూసింది దేవకన్య కాదు; దేవకన్యలు పరుగెత్తి వచ్చి కాళ్ళమీద పడి దాసోహమనే మణిమేఖలాదేవి; కడంబూర్ శంబువరయ్యర్ ముద్దుల కుమార్తె అని తెలుసుకొన్నాను. నా ప్రాణస్నేహితుడు గందమారన్ ప్రియతమ సోదరి అన్న విషయం కూడ గుర్తుకొచ్చింది."

మణిమేఖల భ్రుకుటి ముడిపడింది. హేళన, కోపం కలగలిసిన చిరునవ్వుతో, "నా అన్న గందమారన్ మీ ప్రాణస్నేహితుడా?" అని అడిగింది.

"అందులో ఏం సందేహం, రాకుమారీ! నాలుగు నెలల క్రితం నేనిక్కడికి వచ్చింది మీకు గుర్తు లేదా? అంతఃపురానికి కూడ వచ్చి తల్లులకు నమస్కరించాను కద? అది జ్ఞాపకం లేదా?"

"బాగా గుర్తుంది. అంతలోపల మరిచిపోతానా? ఆ వల్లవరయ్యన్ వంతిదేవులు అని పిలవబడే వాణర్ కులవీరులు మీరేనా?"

"అవును, రాకుమారీ! ఉండేందుకు మాళిగ, ఏలేందుకు రాజ్యం లేక 'అరైయ్యర్' అన్న ఇంటిపేరును మాత్రమే ఆస్తిగా పొందిన ఆ నిరుపేదను నేనే! ఒకానొకప్పుడు మీ అన్న నాకు మీగురించి ఎన్నో చెప్పాడు. ఒకప్పుడు నేను, గందమారన్ ఉత్తర పెన్నా నది తీరాన కాపలా కాస్తున్నప్పుడు తరచూ మీగురించి చెప్పేవాడు. నేనూ ఏవేవో కలలు కనేవాడిని. తర్వాత ఆ ఉద్దేశాన్ని మరిచిపోయాను."

~

మణిమేఖల మనసులో ఒక విచిత్రమైన ఆలోచన ఉదయించింది. ఇతడు తనను వెన్నుపోటు పొడిచి చంపజూశాడని అన్న చెప్పాడు. అది ఎందుకోసమై ఉండవచ్చు? ఒక వేళ తన గురించి ఉండవచ్చా? తనను ఇతడికిచ్చి పెళ్ళిచేయబోరని తెలిసి గందమారన్‌తో దెబ్బలాడాడా? ఇలా ఒక భావం కలగగానే ఆమె మనసులో ప్రేమ వెల్లువ పొంగింది.

కానీ దాన్ని ఆమె కోపంగా మార్చుకొని, "అయ్యా! ఆ పాతకథలన్నీ ఇప్పుడు వద్దు. ఇప్పుడు మా అంతఃపురంలోకి దొంగతనంగా దూరిన కారణాన్ని చెప్పండి! లేకపోతే వెంటనే నా చెలికత్తె చేత నా తండ్రిని ఇక్కడికి వెంటనే రప్పిస్తాను!" అన్నది.

"రాకుమారీ! నేనిక్కడికెందుకొచ్చానో ముందుగానే చెప్పాను కద? కొందరు హంతకులు నన్ను తరుముకొంటూ వచ్చారు. వారినుంచి తప్పించుకోవడానికి పారిపోయి వస్తున్నప్పుడు నేలలో ఒక ద్వారం

కన్పించింది. అదేదో ఒక రహస్య మార్గమని గ్రహించాను. ఆ దారిన తప్పించుకొని పోదామని అందులోకి దిగినప్పుడు, అది నన్నిక్కడికి చేర్చింది!"

"అయ్యో! శుద్ధవీరులంటే మీరే. నేనెందరో అసహాయశూరులను గురించి విన్నాను. కానీ మీలాంటి పరుగు వీరులను గురించి వినలేదు. ఉత్తర కుమారుడు మీముందు దిగదుడుపే!"

వంతిదేవుని మనస్సు చివుక్కుమంది. మనం వెర్రిబాగులదనుకొన్న పిల్ల మననిప్పుడు దెప్పిపొడుస్తోంది కద!

"దేవీ! వారు ఏడెనిమిది మంది. నేనొక్కడిని. వారు సాయుధులు. నేనేమో నిరాయుధుడిని - నా శూలం కొళ్ళిడం నది వెల్లువలో పడి కొట్టుకుపోయింది..."

"చాలా మంచిది. ఆ పాపిష్టి శూలం, స్నేహితుడిని వెన్నుపోటు పొడిచి చంపే శూలం. నదిలో కొట్టుకుపోయిందే మంచిది!"

వంతిదేవుడు అదిరిపడ్డాడు. అతడు బదులు చెప్పేందుకు నోరు తెరిచేలోపల మణిమేఖల, "నిజం చెప్పండి. హంతకులనుంచి పారిపోయి వచ్చారా? లేక, హత్య చేసేందుకు వచ్చారా?" అని నిలదీసి అడిగింది.

~

వంతిదేవుడు నిప్పులో కాలుపెట్టిన పిల్లాడిలాగ విలవిల్లాడిపోయి, "శివశివా! నారాయణా! నేనెవరిని చంపేందుకు ఇక్కడికి రావాలి? నా ప్రాణస్నేహితుని సోదరినా? ఎందుకు?" అన్నాడు.

"నాకేం తెలుసు? 'ప్రియతమస్నేహితుడు' అని జంకు గొంకు లేకుండ బొంకుతున్నారు కద? అలాంటి ప్రాణస్నేహితుని వెన్నుపోటు పొడిచి చంపేందుకు మీరు ప్రయత్నించలేదా? అదెందుకో, అదే కారణంతో, ఇక్కడ ఎవరినైనా హత్య చేసేందుకు వచ్చివుండవచ్చు కద?"

"భగవాన్! ఇదేం అపనింద? నేనా గందమారన్ని వెన్నుపోటు పొడిచాను? అటువంటి పని చేస్తే నా చేతిని నేనే తెగగొట్టేసుకోనా? రాకుమారీ! ఇటువంటి మహాపాతకమైన అబద్ధాన్ని మీకెవరు చెప్పారు?"

"నా అన్నే చెప్పాడు. ఇంకెవరైనా చెబితే నమ్మేదాన్నికాను."

"గందమారనా ఇలా నామీద నింద మోపాడు? అలాగైతే నేను నిజంగానే దౌర్భాగ్యశాలిని! ఎవరో వాడిని వెన్నుపోటు పొడిచి తంజావూరు కోట గోడ బయట పడేసిపోయారు. తీవ్రరక్తస్రావం వల్ల మూర్ఛపోయిన వాడిని నేను తీసుకొని వెళ్ళి సేందన్ అముదన్ ఇంట్లో చేర్చి కాపాడాను. అందుకు నాకు దొరికిన బహుమతి ఇదా?! రాకుమారీ! నేనెందుకు వాడిని చంపజూస్తాను? ఏదైనా కారణం చెప్పాడా?"

"చెప్పాడు, చెప్పాడు! మీరు నా అందాన్ని నిరసించి హేళన చేశారట. తంజావూరు అమ్మాయిలు నాకన్న అందగత్తెలన్నారట. దానివల్ల గందమారన్ చాల కోపగించి మిమ్మల్ని చెరిగేశాడట. ముఖాముఖీ ద్వంద్వ యుద్ధం చేసేందుకు చేతగాక వెన్నుపోటు పొడిచారట! ఇదంతా నిజమా, కాదా?"

"అబద్ధం! అబద్ధం! భయంకరమైన అబద్ధం! తమరు లక్షణంగా లేరని చెప్పే ముందు, నా నాలుకనే తెగకోసేసుకొంటాను కద? గందమారనే కద నేనతని సోదరిని మరిచిపోవాలని చెప్పాడు?"

"ఎందుకని?"

"రాజ్యాలేలే మహారాజులు తమరిని పెళ్ళాడేందుకు వేచివున్నారట. కాబట్టి నేను తమను మరిచిపోవాలని చెప్పాడు."

"మీరు కూడ నన్ను పూర్తిగా మరిచిపోయారులాగుంది!"

"నేను మిమ్మల్ని పూర్తిగా మరిచిపోలేకపోయాను. కానీ అప్పటి నుంచి తమను నా ప్రియసహోదరిగా ఎంచనారంభించాను. రాకుమారీ! వెంటనే నన్ను గందమారన్ వద్దకు పిలుచుకొని వెళ్ళండి! లేక వాడిని ఇక్కడికి పిలుచుకొని రండి! వాడెందుకింత ఘోరమైన అబద్ధాన్ని చెప్పాడని తెలుసుకొంటాను. లేక నిజంగా వాడలా భావిస్తుంటే వాడి అపోహను తొలగిస్తాను..."

"తంజావూరులో ప్రారంభించిన కార్యాన్ని ఇక్కడ ముగించాలని వచ్చారా?"

"అంటే..."

"వాడినక్కడ చంపజూశారు; ఆ ప్రయత్నం ఫలించలేదు..."

"భగవాన్! గందమారన్ని చంపాలంటే వాడి అంతఃపురాన్నా వెతుక్కొంటూ వస్తాను?"

"రహస్యమార్గం గుండా వచ్చింది మరెందుకు?"

"అదిగో, శ్రద్ధగా చెవులు రిక్కించి వినండి! నన్ను చంపవచ్చినవారు ఇంకా పక్కగదిలోనే ఉన్నారు. వారు తిరుగాడే చప్పుడు, మాట్లాడే మాటలు వినిపించడం లేదా?"

"వారెందుకు మిమ్మల్ని చంపేందుకు రావాలి?"

"వారిని చూస్తే మాంత్రికుల్లాగున్నారు. ఒకవేళ నరబలి ఇచ్చే కూటమి కావచ్చు..."

"సకల లక్షణాలున్న రాకుమారులైన మిమ్మల్ని అందుకోసం పట్టుకోజూశారు కాబోలు..." అనేని మణిమేఖల నవ్వింది.

"అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది. ఈ గుడ్లగూబ కళ్ళు, కోతి ముఖం వాడిని వాళ్ళెందుకు నరబలికి ఎంచుకోవాలో తెలియడం లేదు. మీ మాటలు విన్న తర్వాత ఒక సందేహం కలుగుతోంది. నా స్నేహితుడు గందమారనే ఒకవేళ ఇలాంటి హంతకుల కూటమిని నా వెంట పంపించాడేమోననిపిస్తూంది. నన్ను వాడి దగ్గరకు వెంటనే పిలుచుకొని వెళ్ళండి! వాడు వాడి దురభిప్రాయాన్ని మార్చుకోనీ! లేదా వాడి చేత్తోనే నన్ను చంపేయనీ! హంతకులను ఎందుకు నామీదికి పురిగొల్పాలి? అమ్మణి! వెంటనే గందమారన్ని పిలిపించండి!"

"అయ్యో! అంత తొందర పడకండి. గందమారన్ ఊళ్ళో లేడు."

"ఎక్కడికి వెళ్ళాడు?"

"ఆదిత్య కరికాలన్‌గారిని పిలుచుకొని వచ్చేందుకు కంచికి వెళ్ళాడు. రేపు రాత్రికల్లా వచ్చేస్తాడు. అంతవరకు మీరు..."

"అంతవరకు నన్ను ఇక్కడే ఉండమంటారా? అది న్యాయం కాదు!"

"ఇక్కడ ఉండమనడం లేదు. ఇంకాసేపటికల్లా పళువూర్ యువరాణి ఇక్కడికి వేంచేస్తారు. తర్వాత ఇక్కడికి ఈగకూడ రాలేదు. పళువేట్టరయ్యర్ ఎటువంటివారని మీకు తెలిసే ఉంటుంది. ఆయన మిమ్మల్ని ఇక్కడ చూస్తే ఖండఖండాలుగా నరికేయమని ఆజ్ఞాపిస్తారు! ఆహా! ఆ ముసలాయనకు పెళ్ళాం మీద ఎంత ప్రేమ!" అని చెప్పి నవ్వింది మణిమేఖల.

వంతిదేవుడు మునుపొకసారి పళువేట్టరయ్యర్ వచ్చినప్పుడు జరిగిందంతా గుర్తు చేసుకొన్నాడు.

"అలాగా? పళువేట్టరయ్యర్కి పళువూర్ రాణి అంటే అంత ఆశా?" అని అడిగాడు.

"అది ఊరూ వాడా ఎరిగిన సంగతే. క్రితంసారి, ఎనిమిది నెలల క్రితం, ఆయన ఇక్కడికి వచ్చారు. పళువూర్ రాణిని అంతఃపురానికి రావడానికి కూడ ఆయన వదల్లేదు! ఆయన ఆమెను కంటికి రెప్పలాగ కాపలా కాస్తారు. ఈసారి ఇక్కడే కొన్నిరోజులుండబోతారట. పళువూర్ రాణికి ప్రత్యేక అంతఃపురం కావాలని ఒకటే ఆర్బాటం. ఈసారైనా మా అందరినీ ఆమె చూస్తుందో లేదో, చూసేందుకు ఆ ముసలాయన ఒప్పుకొంటారో లేదో, తెలియదు..."

"అలాగైతే నేనిప్పుడేం చేయాలి?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఆఁ! ఒక ఉపాయం తడుతోంది. నా అన్న గందమారన్ కోసం ఒక ప్రత్యేకమైన ఆయుధాల గది ఉంది. అందులో మిమ్మల్ని ఉంచుతాను. రేపు సాయంకాలం గందమారన్ వచ్చేస్తాడు. అంతవరకు అక్కడే ఉండండి, మీ మాటల్లోని నిజానిజాలను వాడి ముందే నిరూపించేయవచ్చు..."

"రాకుమారీ! అది ఉచితం కాదు! చాల ప్రమాదకరమైన కార్యం!"

"ఏం ప్రమాదం?"

"నేనిక్కడికి ఎలా వచ్చి చేరానని గందమారన్ అడిగితే ఏం చెప్పను?"

"ఉన్నది ఉన్నట్లు చెప్పండి."

"ఉన్నది ఉన్నట్లు నేనిప్పుడు చెబితే మీరే నమ్మలేదు కద - పక్కగదిలో నన్ను వెతుక్కొంటూ వచ్చిన హంతకులున్నప్పుడే?"

"అయ్యో! దాన్ని ఇప్పుడే శోధించేస్తాను."

"ఏం శోధించబోతున్నారు?"

"పక్క గదిలోకి వెళ్ళి ఆ మనుషులను విచారించబోతున్నాను. వాళ్ళు మిమ్మల్ని చంపడానికి

వచ్చినవారా, లేక మీరు పిలుచుకొని వచ్చినవారా అని తెలుసుకొని వస్తాను."

"అయ్యో! వాళ్ళు మహా దుష్టులు. మీరు వారి చేత ఒంటరిగా చిక్కుకొంటే..."

"నా అంతఃపురంలో ఎవరు నన్నేం చేయగలరు? ఇదిగో చూడండి!" అని చెప్పి మణిమేఖల ఎవరికీ కనిపించనట్లు తన బొడ్లో దోపుకొన్న మడత కత్తిని తీసి చూపించింది.

"అమ్మణి! నా దగ్గరిప్పుడు ఆయుధాలేమీ లేవు."

"బలం కలవాడికి గడ్డిపోచ కూడ ఆయుధమన్న సామెత మీరు వినలేదా? మీ పేరే వల్లవరయ్యన్ కద? ఆయుధం చేత ఉంటే ఆడపిల్లలు కూడ పోరాడుతారు. మగవాళ్ళెందుకు? మీకు దిగులవసరం లేదు. ఆ గదిలో దుమ్ము దులుపుతున్నవాడు మా అంతఃపురం పనివాడే. తక్కినవారిని వాడే పనిలోకి తీసుకొచ్చివుండాలి. వారు కూడ నాకు తెలిసినవారేననిపిస్తోంది. వారిక్కడికి ఎందుకొచ్చారని తెలుసుకొని వస్తాను. తలుపు దగ్గర నిలబడండి. అదిగో ఆ చెక్కతో చేసిన గాదె పక్కకు వెళ్ళి కాస్త మరుగ్గా నిలబడండి!"

~

ఇలా చెబుతూనే మణిమేఖల పేట మంటపానికి వెళ్ళే రహస్య ద్వారం దగ్గరకు వెళ్ళి ఆ తలుపును తెరిచేందుకు ప్రయత్నించింది.

వంతిదేవుడు తొందర తొందరగా గాదె వెనక్కు వెళ్ళి మరుగ్గా నిలబడ్డాడు.

గాదె తలుపులు తెరిచివున్నాయి. దాని లోపల ఏముందని యథాలాపంగా చూశాడు. అది ధాన్యాలుంచే గాదె కాదని తెలిసింది. దాని లోపల మెట్లు ఏర్పరచి ఉన్నాయి. ఒక్కో మెట్టు మీద ఒక సంగీత వాద్యముంది (వీణ, మద్దెల, తాళం మొదలైనవి). కాస్త తల పైకెత్తి చూశాడు. మెట్లు పై చూరు వరకు వెళుతున్నట్లు అగుపించింది.

ఇంతలోపల మణిమేఖల పేట మంటపం తలుపు తెరిచి లోపలకు ప్రవేశించింది.

ఆమె ధైర్యం చూసి వంతిదేవుడు ఆశ్చర్యపోయాడు. అదే సమయాన మణిమేఖలకు ఏ అపాయమూ కలగబోదని మనసు దిటవు చేసుకొన్నాడు.

ఇంతలో ఆ గదిలోని ఇంకొక వైపు ఒక తలుపు తెరుచుకొంది. "అమ్మా! అమ్మా!" అని పిలుస్తూనే చంద్రమతి లోపలికొచ్చింది.

వంతిదేవుడు అదిరిపడ్డాడు. ఆమె తనను కనిపెట్టకూడదని గాదె లోపలికి దూరాడు.

"అమ్మా! అమ్మా! తంజావూరు అతిథులు కోట వాకిలి దగ్గరకొచ్చేశారట. మహారాణి మిమ్మల్ని వెంటనే పిలుచుకొని రమ్మన్నారు!" అని చెబుతూనే చుట్టూ చూసింది. తనకెదురుగా తెరిచివున్న పేట మంటపం తలుపును చూసి అటువైపు వెళ్ళింది.

తలుపు దగ్గర నిలబడి చూస్తే తాను వాద్యాలున్న గాదెలో ఉన్నది తెలిసిపోతుంది. కాబట్టి

అతడు అతివేగంగా కొన్ని మెట్లెక్కాడు. ఒక వీణకు అతని మోకాలు తగిలి అది శబ్దం చేసింది.

వంతిదేవుడు భీతిగొని ఇంకొన్ని మెట్లు పైకెక్కి వెళ్ళాడు. అతని తల గాదె చూరు బల్లకు తగిలింది. ఏం వింత? అతని తల పైబల్లకు తగలగానే అది కాస్త పైకి లేచింది.

ఏదో సందేహం వచ్చి వంతిదేవుడు ఆ బల్లను చేత్తో పైకెత్తాడు. అది బాగా తెరుచుకొన్న తర్వాత బయటినుంచి వెలుతురు లోపలికొచ్చింది. దూరాన గలగలమని శబ్దం వినిపించింది. ఒకవైపు ఆకాశాన మెరిసే నక్షత్రాలు కూడ కనిపించాయి. వంతిదేవుని మనసు ఉత్సాహంతో ఉప్పొంగింది.

బల్లను బాగా జరిపి పైకెక్కాడు. తాను మాళిగ పైడాబాలో ఒక భాగానికి వచ్చి చేరానని గ్రహించాడు. అది కూడ తానొకసారి సుఖంగా చల్లగాలి అనుభవిస్తూ పడుకొన్న చోటే. పెద్ద స్తంభాల చాటున దాక్కొని చిన్నరాజుల కుట్ర పన్నాగాలను విని తెలుసుకొన్నది అక్కడే.

బల్లను యథాస్థానంలో ఉంచేసిన తర్వాత, చూరు పైనుంచి అంతఃపురంలోపలికి అలా ఒక దారి ఉందని కనిపెట్టడం అంత సులభం కాదని గ్రహించాడు. దాని గురించి ఇప్పుడు ఆలోచించేందుకు గాని, అబ్బురపడేందుకు గాని తీరిక లేదు. అక్కడినుంచి తప్పించుకొనే దారి వెతకాలి.

ఇంతసేపు తనకు సహాయం చేసిన అదృష్టదేవత ఇంకాసేపు తనకు సహాయం చేయకపోతుందా?

~

వంతిదేవుడు నలువైపులా తిరిగి చూశాడు. ఎటు చూసినా జెండాలు, తోరణాలతో ఆ మాళిగ చుట్టుపక్కల కంటికింపుగా తోచింది. ఆహా! రాజోపచారం అంటే ఇదే కద!

వంతిదేవుడు అడుగులో అడుగేసుకొంటూ మెల్లమెల్లగా, చుట్టుపక్కల చూసుకొంటూ నడిచాడు.  ఇంతవరకు మన అదృష్టమే. తర్వాత కాస్త వేగం పెంచాడు.

మునుపొకసారి తాను పడుకొని నిద్రించిన వెన్నెల డాబాకొచ్చాడు. అక్కడినుంచి చూసినప్పుడు మాళిగ బయటి ప్రాకారం, ఆ ప్రాకారం గోడకు, మాళిగకు మధ్యనున్న డాబా, కురవై ఆట జరిగిన ప్రదర్శనా స్థలం కనిపించాయి. కానీ ఎక్కడా మనుషులు కనిపించలేదు. అందుకు కారణం కనిపెట్టడం అంత కష్టసాధ్యమేమీ కాదు. ఆ మాళిగ ముందు భాగాన చాల సందడిగా ఉంది. వందలకొద్దీ దివిటీలు వెలుతురునిస్తున్నాయి. మేళతాళాల ఘోష, ప్రజల ఉత్సాహపూరిత సంభాషణలు - అన్నీ కలగలిసి పెద్దగా వినిపించింది. పళువేట్టరయ్యర్ పరివారాలు మాళిగ వాకిలి దగ్గరకొచ్చేసినందువల్ల వారిని స్వాగతించేందుకు అందరూ అక్కడికి వెళ్ళారు. అందుకే ఈ భాగాన జనసంచారం లేదు. ఆహా! నిజానికి అదృష్టదేవత వంతిదేవునివైపు ఉందనడంలో సందేహం లేదు. తప్పించుకోవడానికి ఎంత మంచి సమయం? అరగడియ క్రితం కూడ ఇటువంటి అవకాశం దొరికేది కాదు; అరగడియ తర్వాత కూడ ఇటువంటి అవకాశం దొరకదు.

కుట్రాలోచన జరిగిన స్థలానికొచ్చి, ఇంకొకసారి చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. కింద తొంగి చూశాడు. అక్కడ కూడ ఎవరూ లేరు. ఎదురుగా ఉన్న ప్రాకారం గోడను చూశాడు. అక్కడ కూడ ఎవరూ లేరు. ఆః! ఇదేమి గోడపైన, కొమ్మల మధ్య ఒక ముఖం! ఆళ్వార కట్టియాన్ ముఖంలాగుందే...! ఛీఛీ! ఒట్టి భ్రమ! మునుపొకసారి ఆళ్వార్ కట్టియాన్ ముఖం కనిపించిన చోటే అది! కాబట్టి అతని మనసు అతన్నలా మోసం చేసింది! అదీ ఒకందుకు మంచిదే. గోడపైకెక్కి కిందికి దూకేందుకు అదే సరైన చోటు. అతడి మనసు అది గ్రహించి, అతడికి ఎత్తి చూపింది. స్వాగత సత్కారాలు ముగిసి, వాకిట ఉన్న కూటమి లోపలికొచ్చేలోపల తాను తప్పించుకోవాలి. డాబా మీదినుంచి గోడపైకి ఎలా దిగడం...? ఆః! ఇదిగో ఒక దారి! ఇక్కడ ప్రాకారం గోడనానుకొని ఒక కొట్టం కనిపిస్తోంది. కురవై ఆట కోసం వేసిన కొట్టం కాబోలు. దానికోసం పాతిన ఒక పొడవైన వెదురు బొంగు తిన్నగా పై డాబా వరకు వచ్చివుంది. వంతిదేవుడు డాబానుంచి ఒక్క దూకు దూకి దాన్ని అందుకొని సరసరా కిందకు జారాడు. మళ్ళీ చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. పైడాబామీద తానింతవరకు నిలబడ్డ చోట సన్నగా కిణికిణి శబ్దం వినిపించింది. ఆహా! మణిమేఖల తనను వెతుక్కొంటూ వస్తూంది కాబోలు! మా చెడ్డపిల్ల! ఈసారి ఆమె చేత చిక్కితే తన పని గోవింద!

బయలు ప్రదేశాన్ని నాలుగంగల్లో పరుగెత్తి వెళ్ళి చేరాడు వంతిదేవుడు. ప్రాకారపు గోడ వారగా నిలబడి వెనుదిరిగి చూశాడు. డాబమీద ఒక అమ్మాయి ఆకారం కనిపించింది. మణిమేఖలో, చంద్రమతో తెలియలేదు. ఎవరైనా కూడ తాను డాబానుంచి దూకి పరుగెత్తినప్పుడు చూసే ఉండాలి. అదృష్టవశాత్తు కేకలేయలేదు. ఆమె ఎవరైనా, ఆమెకు మేలు కలుగుగాక!

ఇలా మనసులో ఆ గుర్తు తెలియని అమ్మాయిని దీవిస్తూనే ప్రాకారం గోడవారగా వేగంగా నడిచాడు. గోడపైన ఆళ్వార్ కట్టియాన్ ముఖం కనిపించిన చోటు వచ్చేసింది. అక్కడ గోడెక్కడమెలా? చాల ఎత్తుగా ఉంది కద? ఆహా! ఇదిగో ఒక ఉపాయం! గోడకు చేర్చి కొట్టాన్ని కట్టేందుకు తీసుకొచ్చిన వెదురు బొంగుల్లో కొన్ని కాస్త దూరాన పడివుండడాన్ని గమనించాడు. ఒక్క అంగలో దూకి వెళ్ళి వాటిలో ఒకదాన్ని తీసుకొన్నాడు. ప్రాకారం గోడకు దాన్ని ఆనించాడు. దాని పొడవు ప్రాకారం గోడ ఎత్తుకు సరిగ్గా ఉంది. కానీ ఈ వెదురు బొంగు గోడనానుకొని నిలకడగా నిలబడాలి కద? ఎక్కేటప్పుడు జారి పడిపోతే? కింద పడాల్సిందే! అందుకని చేతులు కట్టుకొని ఊరకే కూర్చొంటే ఏం ప్రయోజనం?

వెదురు బొంగును రెండు మూడుసార్లు నొక్కి చూసుకొని, దాన్ని పట్టుకొని పైకెక్కనారంభించాడు. సగం దూరం ఎక్కిన తర్వాత అది జారసాగింది. 'చచ్చాం! కింద పడితే ఎముకలు నుగ్గునుగ్గైపోతాయి!' అని అనుకొనేలోపు ఆ వెదురు బొంగు మళ్ళీ దృఢంగా నిలబడింది. పైనుంచి ఏదో ఒక చేయి దాన్ని పట్టి నిలబెట్టినట్లనిపించింది! 'మనకు పిచ్చి పట్టడమే తక్కువ' అనుకొంటూ వంతిదేవుడు పైకెక్కాడు. ప్రాకారం గోడ పైఅంచును అతడు పట్టుకోగానే వెదురు బొంగు జారి పడింది! అది పడ్డ శబ్దం

పిడుగులాగ అతని చెవిన పడింది. మంచివేళ! కోట వాకిట కోలాహలం ఇప్పుడింకా అధికమైంది. కాబట్టి అది ఎవరికీ వినిపించివుండదు. కానీ ఎదురుగా డాబామీది అమ్మాయి వినే ఉంటుంది!

గోడపైకెక్కి నిలబడి మళ్ళీ అటువైపు ఒకసారి చూశాడు వంతిదేవుడు. ఆ అమ్మాయి ఇంకా అక్కడే నిలబడివుంది!

వంతిదేవుని తుంటరి బుద్ధి అతన్ని వీడలేదు! 'వెళ్ళొస్తాను' అని చెప్పే సూచనగా చేయూపి, గోడ అవతలివైపుకు దిగసాగాడు. దిగడం అంత కష్టమనిపించలేదు. ఎందుకంటే గోడ అవతలి భాగం అంత సమతలంగా లెదు; కాస్త ఎగుడు దిగుడుగా ఉంది. పక్కనున్న చెట్ల కొమ్మలు కొన్ని గోడను తాకుతున్నాయి. వాటి సహాయంతో సరసరా కిందకు దిగసాగాడు. మణిమేఖలను తాను ఏమార్చి తప్పించుకొన్న విషయాన్ని తలుచుకొని అతడికి నవ్వొచ్చింది. ఆ నవ్వుకు ప్రతిధ్వనిలాగ ఇంకొక నవ్వు వినిపించింది. వంతిదేవుని రక్తం గడ్డకట్టినట్లయింది. చేతులు వణికాయి. కింద దూకేందుకు చూశాడు. అడవి కుక్క ఒకటి అతడిపైకి దూకేందుకు సిద్ధంగా ఉండడాన్ని చూశాడు. మళ్ళీ పైకెక్కడం గురించి ఆలోచించడమే వృథా! కిందకు దూకే తీరాలి. కిందకు దూకితే ఈ కుక్క నోటికి ఒక పిడికిలి కండైనా ఇచ్చే తీరాలి! కాసేపటి క్రితం తాను విన్న శబ్దం నవ్వా? లేక, ఈ కుక్క మొరిగిన శబ్దమా? చుట్టుపక్కల ఎవరైనా మరుగ్గా నిలబడి కుక్కను తనమీదికి పురిగొల్పి ఉంటారా...? పైకెక్కడంలో అపాయం ఎక్కువా? కిందికి దూకడంలోనా? వంతిదేవుని మనసు రెంటి మధ్య ఊగిసలాడింది! అతని కాళ్ళు కూడ పైపైకి ఎగురుతున్న కుక్కనోటికి చిక్కకుండ ఊగిసలాడాయి!

~~~
~~~

# అధ్యాయము - 10

## మనిషి వేట

**వంతిదేవుడు** కుక్క నోటికి చిక్కకుండ కిందకు దూకడమా, లేక మళ్ళీ ప్రాకారం గోడమీదికే ఎక్కడమా అని తీవ్రంగా ఆలోచించసాగాడు. అదే సమయాన పక్కనున్న చెట్టు వెనక ఎవరైనా దాగివున్నారా అని పరికించి చూశాడు. ఒక చెట్టు వెనక ఒక తెల్లబట్ట కనిపిస్తున్నట్లనిపించింది. కాసేపటి క్రితం కుక్క మొరుగుతోబాటు ఒక మనిషి నవ్విన శబ్దం కూడ వినిపించిన విషయం గుర్తుకొచ్చింది. మనుషులెవరైనా అక్కడ దాగివుంటే...? ఒక్కడేనా? పలువురా? అది తెలుసుకోకుండ కిందికి దూకడం పెద్ద పొరబాటవుతుంది. కుక్క నోటినుంచి తప్పించుకొన్నా, ఆ మనుషుల చేత చిక్కుబడే పరిస్థితి రావచ్చు. అంతఃపురం పైడాబామీదినుంచి చూసిప్పుడు ఆళ్వార్ కట్టియాన్ ముఖం ప్రాకారం గోడపైన కనిపించినట్లు తోచింది. ఆ వైష్ణవుడు అయ్యనార్ కోవెల దగ్గర తనకోసం వేచి చూసి చూసి అలిసిపోయి, చివరికి ఇక్కడకు వచ్చి ఈ కుక్కను తన మీదికి ఉసిగొల్పి చోద్యం చూస్తున్నాడా, ఏమి? అన్నిటికీ ఒకసారి పిలిచి చూస్తే తెలిసిపోతుంది. "వైష్ణవులుగారూ! వైష్ణవులుగారూ! ఇదేం చోద్యం?" అన్నాడు. మళ్ళీ ఒక నవ్వు వినిపించింది. అది ఆళ్వార్ కట్టియాన్ గొంతు కాదు. కాబట్టి మళ్ళీ గోడెక్కి అంతఃపురం లోపలికి వెళ్ళడమే ఉచితమనిపించింది. పెద్ద పళువేట్టరయ్యర్‌కి జరుగుతున్న స్వాగత సమారంభంలో ఎలాగైనా తప్పించుకోవచ్చు. లేకపోతే సొరంగమార్గం ఉండనే ఉంది.మణిమేఖలను మళ్ళీ ఒకసారి బతిమాలుకొంటే సరి. లేకపోతే పళువూర్ యువరాణి క్షమే మళ్ళీ సంపాదించుకోవలసిందే! ఇంతవరకు తనను పట్టివ్వని ఆవిడ ఇప్పుడు మాత్రం పట్టిచ్చేస్తుందా?

వంతిదేవుడు దిగిన దారినే మళ్ళీ గోడెక్కనారంభించాడు.

కుక్క ఇంకా ఎత్తుకెగిరి మొరిగింది.

మళ్ళీ నవ్వు శబ్దం వినిపించింది.

చెట్టు మరుగునుంచి ఒక ఆకారం బయటికొచ్చింది. ఆ ఆకారం చేత ఒక శూలం ఉంది.

అతడు దేవరాళన్ అని వంతిదేవుడు గ్రహించాడు.

దేవరాళన్ వంతిదేవుడు గోడనుంచి వేలాడుతున్న చోటిని సమీపించాడు.

"అబ్బాయీ! నీ ప్రాణం చాల గట్టిది!" అన్నాడు.

"అది తెలిసిన విషయమే కద? మళ్ళీ ఎందుకు నాదగ్గరకొస్తున్నావు?" అని వంతిదేవుడడిగాడు.

"ఈసారి నీవు తప్పించుకోలేవు!" అంటూనే దేవరాళన్ తన్ చేతనున్న శూలాన్ని వంతిదేవుని

మీదికి గురి పెట్టాడు.

వంతిదేవుడు తనకొచ్చిన ఆపదను గ్రహించాడు. గోడ అంచునుంచి వేలాడుతున్నవాడు, కింద శూలం చేతబట్టినవాడితో ఎలా పోరాడగలడు? కిందికి దూకి పరుగెడుదామంటే వేటకుక్క ఒకటి తనమీదికి దూకేందుకు సిద్ధంగా ఉంది.

“దేవరాళా! జాగ్రత్త! మీ యజమానురాలు పళువూర్ యువరాణి ఆజ్ఞను గుర్తు తెచ్చుకో! నాకేమీ హాని చేయకూడదని చెప్పలేదా?”

దేవరాళన్ ఒక పైశాచిక నవ్వు నవ్వేసి, “ పళువూర్ యువరాణి నా యజమాని కాదు. ఏ ఊరి రాణీ నా యజమాని కాదు. భద్రకాళి దుర్గాపరమేశ్వరే నా యజమాని!” అన్నాడు.

“నా కులదైవం కూడ దుర్గా పరమేశ్వరే! ఆమె దయవల్లే నడి సముద్రంలో కాలుతున్న ఓడనుంచి తప్పించుకొని బయటపడ్డాను. నన్ను తాకితే దుర్గాదేవి నిన్ను హతమార్చేస్తుంది!” అని హెచ్చరించాడు వంతిదేవుడు.

“నీవు దుర్గా పరమేశ్వరి భక్తుడవైతే నీవు నాకిప్పుడొక పని చేసిపెట్టాలి. అప్పుడే నిన్ను చంపకుండ వదిలేస్తాను!” అన్నాడు దేవరాళన్.

“ఏం చెయ్యాలి? మొదట నీ కుక్కను అవతలికి పొమ్మని చెప్పు!”

"ఇటువైపు ఒక వీరవైష్ణవుడు వచ్చాడు. వాడిని వెతికి పట్టేందుకు నీవు సహాయం చేస్తే నిన్నేం చేయకుండ వదిలిపెడతాను...”

“ఎందుకని అతన్ని పట్టుకోవాలి?” అని అడిగాడు వంతిదేవుడు.

“దుర్గాదేవికి ఒక వీరవైష్ణవుడిని బలిస్తానని నేను శపథం చేశాను!” అన్నాడు దేవరాళన్.

~

ఆ సమయాన వంతిదేవుడు కోట ప్రాకారం గోడను పట్టుకొని వేలాడుతున్న ఒక చిన్న మొక్క కూకటి వేళ్ళతో పెకలించుకొని రానారంభించింది.

శూలానికి చిక్కకుండ ఎలా దేవరాళన్ పీకపైకి దూకాలని తీవ్రంగా ఆలోచిస్తూనే, “ఆ వీర వైష్ణవుడు నా ప్రియస్నేహితుడు. అతడికి నేనేనాడూ ద్రోహం చేయను. అతడికి బదులు నన్నే బలిచ్చేయి" అన్నాడు.

“అలాగైతే ఇప్పుడే ఈ శూలానికి బలైపో!” అని దేవరాళన్ శూలాన్ని వంతిదేవునిపైకి గురిపెట్టాడు.

వంతిదేవుడు ఆ చిన్న మొక్కను వదిలేసి, ఒక్క ఊపులో కిందకు దేవరాళన్ మీదికే దూకాడు. దూకిన వేగానికి నేలమీద వెల్లికిలా పడ్డాడు. దేవరాళన్ ఆ అదిరిపాటును సంభాళించుకొని మళ్ళీ శూలాన్నెత్తాడు.

ఆ సమయాన వెనకనుంచి ఒక ఆకారం పరుగెత్తుకొని వచ్చి బడితెతో దేవరాళన్ తలమీద లాగి ఒక పెట్టు వేసింది.

దేవరాళన్ దబ్బున వంతిదేవునిమీద పడ్డాడు.

కుక్క తన యజమానిని అటకాయించిన ఆగంతకునిపైకి లంఘించింది. ఆళ్వార్ కట్టియాన్ దానికీ సిద్ధంగా ఉన్నాడు. తన పైబట్టను విప్పి దాని మూతిమీదికి విసిరాడు. కుక్క కొన్ని క్షణాలపాటు కళ్ళు కనిపించక గుడ్డిదైంది. అప్పుడు ముడివేసి సిద్ధంగా ఉంచిన ఒక అడవి తీగెను దాని మెడచుట్టూ విసిరి గట్టిగా లాగి పక్కనున్న చెట్టుకు కట్టేశాడు ఆ వీరవైష్ణవుడు.

ఇంతలో వంతిదేవుడు దేవరాళన్ని తనమీదినుంచి పక్కకు తోసేసి లేచాడు.

దేవరాళన్ ఆ వీరవైష్ణవుని ఒకే దెబ్బకు తెలివి తప్పి పడిపోయాడు. ఇద్దరూ ఇంకొన్ని అడవి తీగలను తీసుకొని వచ్చి వాడి కాళ్ళు చేతులను కట్టిపడేశారు.

తర్వాత వంతిదేవుడు శూలాన్ని, ఆళ్వార్ కట్టియాన్ తన బడితెను తీసుకొని బయల్దేరారు.

శంబువరయ్యర్ మాళిగ ముందు భాగం తప్ప తక్కిన మూడువైపుల చాలదూరం వరకు దట్టమైన అడవి. అందులో దూరితే బయటకు రావడం కష్టం. కాబట్టి ఇద్దరు మిత్రులూ ప్రాకారం గోడవారగానే వేగంగా వెళ్ళారు.

వేగంగా నడుస్తూనే ఆళ్వార్ కట్టియాన్, "నీవు బుద్ధిశాలివనుకొన్నాను. నేననుకొన్నది పొరబాటని ఇప్పుడు తెలుస్తోంది!" అన్నాడు.

"తొందరపడి సొరంగమార్గంలోకి దిగిన విషయం గురించి చెబుతున్నారా? అందునుంచి ఎంతటి భయంకరమైన రహస్యాలను తెలుసుకోగలిగానో మీకు తెలుసా?" అన్నాడు వంతిదేవుడు.

"అదలా ఉండనీ. 'వైష్ణవుని కనిపెట్టేందుకు సహాయం చేస్తావా?' అని దేవరాళన్ అడిగిన వెంటనే. 'అలాగే' అని చెప్పడానికేం కష్టం? అనవసరంగా ప్రమాదంలో చిక్కుకోనేల?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"అంతా సహవాస దోషమే!" అన్నాడు వంతిదేవుడు.

"ఎవరి సహవాసం గురించి చెబుతున్నావు? ఇటువంటి పొరబాటు చేయమని నేనేనాడూ నీకు చెప్పిన గుర్తు లేదే?"

"మిమ్మల్ని అనడంలేదయ్యా! పొన్నియిన్ సెల్వన్‌గారి గురించే చెబుతున్నాను. ఆయన పరిచయమైన తర్వాత అబద్ధం చెప్పేందుకు మనసు రావడం లేదు..."

"నీ ప్రాణం కాపాడుకోవడానిక్కూడానా? అంత సత్యసంధుడివైపోయావా?"

"అది మాత్రం కాదు. మీరెక్కడో చుట్టు పక్కలే దాక్కొని ఉన్నారని నాకు తెలుసు. నేను మిమ్మల్ని దేవరాళన్‌కి పట్టిస్తానని చెప్పడాన్ని మీరు వింటే? ఈ ఆపత్కాలంలో నన్ను కాపాడేందుకు

వచ్చేవారా?"

"అబ్బాయీ! నీ తెలివితేటలు అపారం. నీది కుశాగ్రబుద్ధి. సందేహం లేదు. నిజానికి దేవరాళన్ అడిగిన ప్రశ్నకు నీవేం బదులు చెబుతావా అని నేను చాల ఉత్సుకతతో, ఉత్కంఠతో ఎదురుచూశాను!"

"చూశారా! మీరొక సందేహప్రాణి అని నేనన్నది సరిగ్గా సరిపోయింది. అది తప్పు, నాకెంతటి మేలు చేకూరేటట్లయినా కూడ, నోటిమాటక్కూడ, మిత్రద్రోహంగా నేనేమీ చెప్పను. కానీ, మీరు? 'అయ్యనార్ కోవెల దగ్గర నేనుంటాను' అని చెప్పేసి ఇక్కడికెలా వచ్చారు? సొరంగమార్గం గుండా నేను తిరిగివచ్చివుంటే మీరు కనిపించక అవస్థపడేవాడిని కద?" అన్నాడు వంతిదేవుడు.

"సొరంగమార్గం గుండా నీవు ప్రాణాలతో తిరిగి రావడం సందేహమే. నీవు దాంట్లో చొరబడిన కాసేపటికల్లా కుట్రదారులందరూ ప్రవేశించారు. నీవు బుద్ధిశాలివి కాబట్టి తప్పక ఇంకొక దారి వెతుక్కొని వస్తావు. బహుశ ఇక్కడ గోడెక్కి దూకి వస్తావని అంచనా వేశాను."

"అలా ఆలోచించా ఇక్కడికి వచ్చారు?"

"అది మాత్రం కాదు. సొరంగ మార్గాన దిగినవారు దేవరాళన్‌ని మాత్రం బయట కాపలా ఉంచి వెళ్ళారు. వారు తిరిగి వచ్చినప్పుడు అయ్యనార్ కోవెలలో ఎవ్వరూ ఉండకూడదు కద? అందుకని, ఏవో సైగలతో చెప్పుకొని లోపలికి దిగారు కాబోలు. కానీ అది నాకు తెలియదు. అందరూ సొరంగమార్గం లోపలికి దిగారనుకొన్నాను. నీవు లోపలికి వెళ్ళి చిక్కుబడ్డావు కద అని ఇంకొకవైపు దిగులు. సొరంగమార్గాన్ని బయటినుంచి తెరిచే రహస్యాన్ని కనిపెడదామని కూడ అనుకొన్నాను. అందుకోసం బలిపీఠం దగ్గరకు వెళ్ళి దాన్ని తిప్పేందుకు ప్రయత్నించాను. ఉన్నట్లుండి కాలి చప్పుడు వినిపించి అదిరిపడి వెనక్కి తిరిగి చూశాను. దేవరాళన్ చేత శూలంతో వస్తూ కనిపించాడు. నన్ను చూసిన చోటే చంపేయాలని కుట్రదారులు చాలరోజుల క్రితమే తీర్మానించుకొన్నారు. అది నాకు తెలుసు. నాచేతిలోనేమో ఆయుధమేమీ లేదు. కాబట్టి కాలికి బుద్ధి చెప్పడం తప్ప ఇంకేమీ దారి లేదు. వాడు నన్ను తరుముకొంటూ వచ్చాడు. కానీ అడవి దట్టంగా ఉండడం వల్ల నన్ను పట్టుకోలేకపోయాడు. ఆ దట్టమైన అడవిలో శూలాన్ని విసిరేందుక్కూడ అవకాశంలేదు కాసేపటి తర్వాత వాడు నన్ను వెన్నంటి రావడం లేదని గ్రహించాను. ఇక భయం లేదని రాజబాటకు తిరిగి వచ్చేసి ఆ బాట వెంబడి వెళదామని అనుకొన్నాను. కాస్త దూరాన ఒక గుడిసె కనిపించింది. గుడిసె వాకిట దేవరాళన్ నిలబడివున్నాడు. ఒక ఆడపిల్ల, ఒక వేటకుక్క వాడి సమీపాన నిలబడివున్నారు. దేవరాళన్ ఆమెకు ఏదో చెప్పేసి, వేట కుక్కను వెంట తీసుకొని మళ్ళీ బయలుదేరాడు. కుక్క నేను నిలబడ్డ దిక్కు చూసి మొరిగింది. కాబట్టి అపాయం ఇంకా ఎక్కువైంది. రాజబాట వెంబడి వెళ్ళే ఉద్దేశాన్ని వదిలిపెట్టి, అడవి దారినే పరుగెత్తి వచ్చాను. కుక్క అప్పుడప్పుడూ మొరుగుతూ వస్తూండడం వల్ల వారు ఎక్కడున్నారని ఊహించగలిగాను. పరుగెత్తి వస్తున్నప్పుడే బుర్రకూడ వేగంగా పనిచేయసాగింది. రాత్రంగా అడవిలో తిరుగాడుతుండడం అసాధ్యం. వారి చేతికి దొరికిపోవడం తథ్యం అనిపించింది. అదే

సమయాన ఈ కోట గోడ కనిపించింది. గోడెక్కి లోపల దూకేస్తే ఎలాగైనా తప్పించుకోవచ్చని అనుకొన్నాను. అలాగే గోడెక్కేశాను. ఆ సమయాన నీవు మాళిగ డాబామీద పరుగెత్తి వస్తుండడాన్ని చూశాను. నీవు గోడెక్కి బయటకు దూకేందుకే వస్తున్నావని గ్రహించి మళ్ళీ గోడెక్కి బయటకు దూకాను. మనిద్దరం దేవరాళన్ని, వాడి కుక్కను సంభాళించవచ్చన్న నమ్మకం ఏర్పడింది. ఇంతలో కుక్క మొరగడం వినిపించగా, పక్కనున్న చెట్టెక్కాను. దేవరాళన్, వాడి కుక్క  ఆ చెట్టు దగ్గరికే వచ్చేశారు. అంతలో నీవు కోట గోడ దిగడం వాడి కంటపడింది కాబోలు. కుక్కను వెంట తీసుకొని నీవు గోడ దిగుతున్న చోటికి వచ్చాడు. తర్వాత జరిగిందంతా నీకు తెలుసు...."

"వైష్ణవులుగారూ! విధి బలం గురించి మీ అభిప్రాయమేమి?"

"ఇదేం ప్రశ్న? ఉన్నట్లుండి నీ ఆలోచన విధివైపు ఎందుకు మళ్ళింది?"

""పుట్టేటప్పుడే, 'ప్రతి ఒక్కరికి ఇలా, ఇలా జరగబోతుంది' అని బ్రహ్మదేవుడు  నుదుటిపైన రాసేస్తాడని పెద్దలు చెబుతారు కద? దాన్ని మీరు నమ్ముతారా, లేదా?"

"లేదు. నాకందులో నమ్మకం లేదు. విధిని పూర్తిగా నమ్మేటట్లయితే, పరంధాముని పైన భక్తిగొనివుంటే చాలన్న మాటకు అర్థం లేకుండ పోతుంది కద? ఆళ్వార్లు ఏం చెబుతున్నారంటే..."

"ఆళ్వార్లు ఏమైనా చెప్పనీ. నాకు విధిపైన పూర్తి నమ్మకం ఏర్పడింది. లేకపోతే నేనీరోజు తప్పించుకొని బయటపడలేకపోయేవాడిని...."

"అబ్బాయి! విధివల్ల నీవు తప్పించుకోలేదు. బుద్ధివల్లనే అది సాధ్యమైంది."

"కానే కాదు. బుద్ధి నన్ను లోతు తెలియని అపాయంలోకి తోసేసింది. విధి నన్ను దాన్నుంచి గట్టెక్కించింది!"

~

వారిలా మాట్లాడుకొంటుండగానే అడవి దాటి వచ్చేశారు. కడంబూర్ మాళిగ ముందు భాగం అక్కడినుంచి కనిపిస్తూంది. అక్కడ చాల కోలాహలంగా ఉండడమూ కనిపిస్తూంది. పళువేట్టరయ్యర్ ఏనుగులు, గుర్రాలు, పరివారాలు కోట వాకిలిని సమీపిస్తున్నాయి. అమోఘంగా అలంకరించబడ్డ మాళిగ ముఖద్వారం వద్ద శంబువరయ్యర్, ఆయన పరివారం అతిథులను స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నారు. వందలకొద్దీ దివిటీలు రాత్రినే పగలుగా మార్చేశాయి. తమ్మెటలు, పలకలు, మద్దెలలు, కొమ్ము బూరాలు ఒక్కటిగా ఘోషిస్తున్నాయి.

ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చేయి పట్టి లాగి, "రా, వెళదాం. ఎవరైనా మనని చూసేస్తారు!" అన్నాడు.

"ఇటువైపు ఎవరూ చూడరు. చూసినా నా విధి నన్ను కాపాడుతుంది."

"అయినా ఎందుకిక్కడ నిలబడాలి?"

"పెద్ద పళువేట్టరయ్యర్ ఏనుగుపైన వచ్చి దిగే దృశ్యాన్ని చూడవద్దా?"

"అది మాత్రమేనా?"

"పళువూర్ రాణి ఆయనతోబాటు ఏనుగుపైన వచ్చి దిగుతుందా, లేక మూసిన పల్లకిలో వస్తుందా అని చూడాలని ఆశపడుతున్నాను..."

"తమ్ముడూ! విధి ఎప్పుడూ నీకనుకూలంగా ఉంటుందనుకోకు. ఒక మాయమోహిని రూపంలో వచ్చి నిన్ను తలకిందులు చేసినా చేయవచ్చు..."

"అలా మైమరచి పడిపోయేవాడిని నేను కాను, వైష్ణవులుగారూ! అందుకు వేరే వాళ్ళున్నారు!"

~

ఏనుగు గంభీరంగా వచ్చి మాళిగ ముందు ఆగింది. దానిపైనుంచి పెద్ద పళువేట్టరయ్యర్ దిగారు. ఆయన వెంబడే పళువూర్ యువరాణి కూడ దిగింది.

"ఓ! ఈసారి పళువూర్ యువరాణి మూసిన పల్లకిలో రాలేదు. ముసలాయన ఆమెను బహిరంగంగానే పిలుచుకొని వచ్చారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అది తెలుసుకోవాలనే చూస్తున్నాను. ఇక వెళదాం!" అని వంతిదేవుడు వెనుదిరిగాడు.

కానీ ఆళ్వార్ కట్టియాన్ ఇప్పుడు వెనుదిరిగేందుకు అంత తొందరపడలేదు. పైగా అక్కడే కదలకుండ నిలబడ్డాడు. పళువూర్ యువరాణి నందినిని కళ్ళార్పకుండ చూడసాగాడు.

యధాలాపంగానో, లేక ఆమె మనోశక్తి లాగిన ప్రభావంవల్లనో నందిని అటువైపు తిరిగి చూసింది.

ఆళ్వార్ కట్టియాన్ ముఖం చీకటితో కమ్ముకొన్న చెట్ల మధ్యనుంచి తొంగి చూడడాన్ని గుచ్చి చూసింది.

వెంటనే ఆమె ముఖాన భీతి ఛాయలు కమ్ముకొన్నాయి.

యువరాణి ముఖంలో వచ్చిన మార్పును పెద్ద పళువేట్టరయ్యర్ గమనించారు. ఆమె చూసినవైపు ఆయనకూడ ఒకసారి పరీక్షగా చూశారు.

రెండు ఆకారాలు దట్టంగా పెరిగిన చెట్ల నీడలో మరుగవుతూ కనిపించాయి.

వెంటనే శంబువరయ్యర్ చెవిలో ఏదో చెప్పారు.

ఆయన తమ వీరులలో ఇద్దరికి ఏదో ఆజ్ఞ జారీ చేశారు.

పళువేట్టరయ్యర్, యువరాణి అమోఘమైన వాద్యఘోష మధ్య మాళిగలో ప్రవేశించారు.

~

అదే సమయాన ఇద్దరు అశ్వవీరులు మాళిగ చుట్టూ ఉన్న అడవిలోపల ప్రవేశించారు.

వారు చాల కష్టపడుతూ గుర్రాలను ఆ దట్టమైన అడవిగుండా నడుపుకొంటూ వెళ్ళారు.

చాలదూరం వెళ్ళినా కూడ వారికెవరూ కనిపించలేదు. ఇంచుమించు అడవి దాటి అవతల

ఉన్న బయలు ప్రదేశానికి వచ్చేశారు.

"అన్నా! అడవిలో ఎవరూ లేరు. ముసలాయన చిత్త భ్రాంతి మాత్రమే!" అన్నాడు వారిద్దరిలో ఒకడు.

ఆ సమయాన కుక్క ఒకటి వారికెదురుగా ఊల వేసుకొంటూ వచ్చింది.

"తమ్ముడూ! కుక్క ఎప్పుడు ఊల వేస్తుందో తెలుసా?" అని అడిగాడు రెండోవాడు.

"ఎవరైనా చచ్చిపోతే ఊల వేస్తుంది!" అన్నాడు మొదటివాడు.

"దెయ్యాలు, పిశాచాలు, బేతాళాలను చూసినా కూడ ఊల వేస్తుంది!" అన్నాడు రెండోవాడు.

"నిన్ను చూసే దెయ్యమనుకొని ఊల వేసిందేమో?"

"లేదు, తమ్ముడూ! నిన్ను చూసే బేతాళమనుకొంది!"

ఆ సమయాన వారి తలల మీది నుంది ఒక భయంకరమైన పైశాచిక నవ్వు వినిపించి వారిద్దరూ అదిరిపడి తలెత్తి చూశారు.

ఇద్దరి తలల పైనా, రెండు చెట్లలో రెండు బేతాళాలు కూర్చొనివున్నాయి.

ఆ రెండు బేతాళాలు ఆ ఇద్దరు వీరుల చెంపలమీద బలంగా కొట్టి, గొంతులు నొక్కి కింద పడేశాయి!

తర్వాత ఆ దుష్ట బేతాళాలు గుర్రాలమీదెక్కి అడవి దాటి బయలు మైదానంలో వేగంగా సాగాయి!

~~~
~~~

# అధ్యాయము - 11

## మిత్రుడా? ద్రోహియా?

**మణిముక్తానది** వెళ్ళారుతో సంగమించే ప్రసిద్ధమైన స్థలాన్ని దాటి వస్తున్నారు ఆదిత్య కరికాలన్, అతని స్నేహితులు.

మునుపటి రోజు రాత్రి తిరుముదుక్కుండ్రంలో యువరాజుకు జరిగిన ఉపచారాల గురించి, ఆ క్షేత్రంలో జరుగుతున్న కైంకర్యాల గురించి వారు మాట్లాడుకొంటున్నారు.

"తిరుముదుక్కుండ్రంలో సుందరమూర్తి చేసిన కార్యం నాకు చాల నచ్చింది!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"దేన్ని గురించి చెబుతున్నావు?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

"ముసలావిడ గురించి పాట పాడమని చెప్పిన విషయమే!"

"అదేమి? నాకు తెలియదే? కాస్త వివరంగా చెప్పు!" అన్నాడు కరికాలన్.

సుందరమూర్తి క్షేత్రయాత్ర చేసుకొంటూ వస్తున్నప్పుడు తిరుముదుక్కుండ్రం అనే వృద్ధాచలానికి వచ్చారు. అలవాటు ప్రకారం ఆ ఊరి శివాలయనికి వెళ్ళారు. ఆలయ పూజారి నాయనార్‌కి స్వామి దర్శనం చేయించి, "మా ఊరి దేవుని గురించి కూడ ఒక పాట పాడండి!" అని వేడుకొన్నారు.

"చూద్దాం. ఈ ఆలయ స్వామి పేరేమి?" అని అడిగారు.

తిరుముదుక్కుండ్రం అన్న ఊరిపేరు మీదుగా ఆ ఆలయ స్వామికి వృద్ధ గిరీశ్వరుడనే పేరు పెట్టారు. భట్టుగారు ఆ పేరును చెప్పారు.

నాయనార్‌గారి ముఖం నల్లబడింది. ముసలాయన పేరు మీదా పాట పాడాలి అని మనసులోనే అనుకొని, "పోనీ, అమ్మవారి పేరేమి?" అని అడిగారు.

"వృద్ధ గిరీశ్వరి" అన్నారు పూజారి.

"స్వామికి ముసలాయన పట్టం కట్టారు; అమ్మవారిని కూడ ముసలావిడగా చేసేశారే? ముసలాయన మీద, ముదుసలి మీద నేను పాట పాడలేను!" అని చెప్పేసి సుందరమూర్తి కోపంగా గుడి వదిలి బయలుదేరారు.

సుందరమూర్తి నాయనార్ పదిగం (పాట) కట్టి పాడకపోతే తమ ఊరికి పేరు రాదని అనుకొన్నారు భట్టుగారు.

కాబట్టి ఆలయంలో ఇంకొక అమ్మవారిని ప్రతిష్ఠ చేసి 'బాలాంబిక' అని పేరు పెట్టారు.

మళ్ళీ సుందరమూర్తి ఉన్నచోటికి వెళ్ళి ఆయనకు పైవివరాలను చెప్పి, మళ్ళీ

తిరుముదుక్కుండ్రం ఆలయానికి విజయం చేయమని వేడుకొన్నారు. సుందరమూర్తి నాయనార్ పెద్ద మనసు చేసి మళ్ళీ ఆ ఊరికి వెళ్ళి బాలాంబిక సమేత వృద్ధ గిరీశ్వరుని మీద పాట పాడి అంకితం చేశారు.

~

ఈ కథ వినేసి ఆదిత్య కరికాలన్ పడీ పడీ నవ్వాడు.

“పెద్ద పళువేట్టరయ్యర్ దగ్గరకు సుందరమూర్తి లాంటి కవి బహుశ వచ్చివుంటాడు. ముసలాడు, ముసలావిడ మీద పాట పాడమని చెప్పాడేమో. అందుకే ఆయన నందినిని పెళ్ళిచేసుకొన్నారేమో?” అన్నాడు.

ఇది విని పార్థిబేంద్రుడు, గందమారన్ కూడ పడీ పడీ నవ్వారు. అలా వారు నవ్వుతున్నప్పుడు గుర్రాలపైనుంచి పడిపోతారేమోననిపించింది.

నవ్వి, నవ్వి అలిసిపోయిన తర్వాత పార్థిబేంద్రుడు, "దేవుడు ముసలితనాన్ని ఎందుకు సృష్టించాడో తెలియదు. వారికీ, వారికి విధించబడ్డ వయసు వరకు ఒకే విధంగా ఉండేలా చేయకూడదా ఆ దేవుడు?” అన్నాడు.

“దేవుడు ఏదెలా ఉండాలని నిర్ణయిస్తేనేమి? ముసలితనం పొందడమూ, పొందకపోవడమూ మన చేతిలోనే ఉంది!” అన్నాడు కరికాలన్.

“అదెలా సాధ్యం?”

“అభిమన్యుని, ఇరవాన్ని మనం ముసలివాళ్ళమని ఎంచుతామా?”

తక్కిన ఇద్దరూ ఏం మాట్లాడక మౌనందాల్చారు.

“తంజావూరు అంతఃపుర చిత్రాలయాల్లో నా ముత్తాతల చిత్రాలన్నీ చిత్రించబడివున్నాయి. విజయాలయ చోళులు, ఆదిత్య చోళులు, పరాంతక చక్రవర్తి - అందరూ వృద్ధులుగానే కనిపిస్తున్నారా చిత్రాలలో. కానీ నా పెదతాత రాజాదిత్యులు ఎలా కనిపిస్తున్నారు? నవయవ్వన వీరపురుషుడిగా విరాజిల్లుతున్నారు! ఆయన చిన్న వయసులోనే మరణించారు; కాబట్టి ఎన్నటికీ యవ్వనం వీడని భాగ్యశాలి అయ్యారు! మనలో ఎవరికి అటువంటి భాగ్యం దొరకబోతుందో తెలియదు!”

తక్కిన ఇద్దరికీ ఆ మాటలు అంతగా రుచించలేదు. వారు మౌనాన్ని కొనసాగించారు.

“ఎందుకు ఉన్నట్లుండి మౌనందాల్చారు? చావంటే మీ ఇద్దరికీ ఎందుకింత భయం? ఈ శరీరం పోతే ఇంకొక కొత్త శరీరం దొరుకుతుంది. ఎందుకని మరణానికి జంకాలి? నా స్నేహితుడు వంతిదేవుడిక్కడుంటే నా మాటల్ని ఆమోదించేవాడు. అతనిలాంటి ఉత్సాహపురుషుడు అరుదు. యమలోకం వాకిలి దగ్గరకు వెళ్ళినా అతడు కుతూహలంగా నవ్వుతుంటాడు!” అన్నాడు యువరాజు ఆదిత్య కరికాలన్.

ఆ సమయాన వారికెదురుగా బాటలో రెండు గుర్రాలు దుమ్ము లేపుకొంటూ అతివేగంగా

రావడాన్ని చూశారు. కన్ను మూసి తెరిచేలోపల ఆ గుర్రాలు వారి దగ్గరకొచ్చేశాయి. అవి వస్తున్న వేగాన్ని చూస్తుంటే ఎదురుగా వస్తున్న యువరాజు బృందాన్ని కూడ గమనించక ముందుకు వెళ్ళిపోతారనిపించింది.

అంత అహంభావం పట్టినవారెవరని చూసేందుకు పార్థిబేంద్రుడు, గందమారన్ శూలాలు చాచి దారికి అడ్డంగా నిలబడేందుకు ఆయత్తమైనారు.

కానీ అంతవేగంగా వచ్చిన గుర్రాలు వారికి కాస్త దూరాన ఉన్నట్లుండి ఆగాయి.

వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ గుర్రాలపైనుంచి కిందకు దూకారు.

వంతిదేవుని చూడగానే యువరాజు ఆదిత్య కరికాలన్ ఉత్సాహం పట్టలేకపోయాడు. అతడు కూడ గుర్రంపైనుంచి కిందకు దిగి ఎదురేగి వంతిదేవుని గాఢంగా హత్తుకొన్నాడు.

“తమ్ముడూ! నీకు నూరేళ్ళాయుష్షు. ఇప్పుడే నీగురించి మాట్లాడుతున్నాను!” అన్నాడు కరికాలన్.

~

పార్థిబేంద్రుడు, గందమారన్ ఈ దృశ్యాన్ని చూసి పొందిన అసూయ వారి ముఖాల్లో కొట్టవచ్చినట్లు కనిపించింది. వారు తమ గుర్రాలను కాస్త ముందుకు తీసుకొని వెళ్ళి ఆపారు.

కాస్త దూరాన మరి కొన్ని గుర్రాలు వస్తుండడాన్ని వారు చూశారు. కాసేపటికల్లా ఆ గుర్రాలు కూడ అక్కడికి వచ్చి చేరాయి. ఆ గుర్రాల మీద వచ్చినవారు కడంబూర్ మనుషులని గందమారన్ గమనించాడు.  వారి దగ్గరకు వెళ్ళి విషయమేమని వివరాలడిగాడు.

తర్వాత యువరాజు దగ్గరకొచ్చి, “యువరాజా! ఈ వంతిదేవుడు మీకూ స్నేహితుడు; నాకూ స్నేహితుడిగానే ఉండేవాడు. కానీ వీడిపైన నేను నింద మోపవలసి వస్తోంది. వీడు మిత్రద్రోహి! వీడు నన్ను వెన్నుపోటు పొడిచాడు! కాబట్టి వీడి విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి అని హెచ్చరించడం నా ధర్మం, కర్తవ్యం!” అన్నాడు గందమారన్.

~~~
~~~

# అధ్యాయము - 12

## శూలం విరిగింది

**గందమారన్** తన ప్రాణస్నేహితుడైన వంతిదేవుని మీద మోపిన నింద విని ఆదిత్య కరికాలన్ పడి పడి నవ్వాడు.

"గందమారా! వంతిదేవుడు నిన్ను వెన్నుపోటు పొడిచాడనా చెప్పావు? నీవు వాడికెందుకు వెన్ను చూపించావు?" అని అడిగేసి, మళ్ళీ పడి పడి నవ్వాడు.

గందమారన్ నల్లటి ముఖం ఎర్రబారింది. కళ్ళు మోదుగ పూవుల్లాగ ఎర్రబారాయి. పెదవులు వణికాయి.

"అయ్యా! మీకిది నవ్వులాటగా ఉందా?" అన్నాడు.

"గందమారా! నేను నవ్వకూడదంటున్నావా? నవ్వనేది దేవుడు మనకిచ్చిన వర ప్రసాదం. పశువులు నవ్వలేవు; సింహం నవ్వలేదు; గుర్రం నవ్వలేదు; చేష్టలంటే చాల ఇష్టపడే కోతులుకూడ నవ్వలేవు. మనుష్య జన్మ ఎత్తినవారు మాత్రమే నవ్వగలరు. అదలా ఉండగా, నీవు నన్ను నవ్వకూడదంటున్నావే? నేను కూడ నవ్వి చాల కాలమైంది, మిత్రమా! ఇప్పుడు నా నవ్వు విని నేనే ఆశ్చర్యపడుతున్నాను. మరి నీవు నన్ను నవ్వకూడదంటున్నావే?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"అయ్యా! మీరు కాస్త ఆనందించడం గురించి నాకూ సంతోషమే! కానీ నేను ఈ శూరాధిశూరునికి వెన్ను చూపాననుకొని నవ్వకండి. నేను ఎదురుచూడని సమయాన వీడు నా వెనక పొంచివుండి వెన్నుపోటు పొడిచాడు. దుర్గాదేవి దయవల్ల, నందినీదేవి ప్రీతితో చేసిన చికిత్స వల్ల నేను బతికి బయటపడ్డాను. వీడు చేసిన ద్రోహం గురించి మీరు విచారించి న్యాయం చేయండి. లేక నేనే వీడిని దండించేందుకు అనుమతివ్వండి!" అన్నాడు గందమారన్.

"మిత్రమా! నేనే తప్పక విచారించి న్యాయం చేకూరుస్తాను. శెంబియన్ కుల రాజుల వద్ద ఒకడు న్యాయం అడిగి, అతడికి న్యాయం దొరకలేదు అన్న మాట ఇంతవరకు లేదు నా వంశపరంపరకు ఆది పురుషుడైన శిబి, పావురానికి న్యాయం చేకూర్చేందుకు తన శరీరంనుంచే కండను ముక్కలుగా కోసివ్వలేదా? మా కులానికి చెందిన మనునీతి చోళుడు ఒక ఆవుకు న్యాయం చేకూర్చేందుకు తన కుమారునే బలివ్వలేదా? నీవు పావురం కన్న, ఆవుకన్న లోకువ కాదు. నీకు నేను న్యాయమిచ్చేందుకు నిరాకరించను. వీడిని నేను విచారించేంతవరకు ఓపిక పట్టు! వల్లవరయ్యా! నీ ప్రయాణం తక్కిన వివరాలు చెప్పేముందు, గందమారన్ చేస్తున్న నిందారోపణకు నీ ఉత్తరాన్ని చెప్పడం మంచిది. ఏమంటావు? ఇతడిని నీవు వెన్నుపోటు పొడిచింది నిజమేనా? అలాగైతే అటువంటి నీచకార్యాన్ని, వీరలక్షణం కాని

కార్యాన్ని ఎందుకు చేశావు?" అని అడిగాడు.

"యువరాజా! నేనీ వీరాధివీరుని పొడవనూ లేదు, వెన్నుపోటు అంతకన్నా లేదు; వెన్నులో పొడవబడి తెలివి తప్పిరక్తపువెల్లువలో పడివున్నవాడిని భుజానెత్తుకొని తీసుకొని వెళ్ళి సేందన్ అముదన్ ఇంట చేర్చి కాపాడాను. కానీ వీడి ప్రాణాన్ని కాపాడినందుకు పశ్చాత్తాపపడుతున్నాను. వీడిని గుండేపోటు పొడిచి చంపలేదే అని విచారిస్తున్నాను. స్నేహధర్మాన్ని ముందుంచి, నా రాజుకు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేసేశాను. అయ్యో! వీడు నన్ను మిత్రద్రోహి అన్నాడు. కానీ వీడు మిత్రద్రోహి మాత్రమే కాడు, స్వామి ద్రోహి కూడాను. వీడు వెన్నుపోటు పొడవబడింది ఎప్పుడు, ఎక్కడ, ఏ సందర్భంలో అని అడగండి! తంజావూరు కోట రహస్యమార్గం గుండా వీడు ఎవరిని పళువేట్టరయ్యర్ అంతఃపురానికి తీసుకొని వెళ్ళాడో అడగండి. పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసపు నేల మాళిగలో వీడు ఎవరిని చూశాడని అడగండి. ఆషాఢమాసం పద్దెనిమిదోనాడు కడంబూర్ మాళిగలో ఏం జరిగిందని అడగండి! ఆ రోజు మూసిన పల్లకిలో అక్కడికి వచ్చింది ఎవరని అడగండి!"

అప్పుడు గందమారన్, ఒళ్ళు వణకగా, తడబడుతున్న నాలుకతో, "ఒరే వెధవా! ఆపు నీ అబద్ధ ప్రేలాపన! లేకపోతే ఇప్పుడే నిన్ను ఈ శూలానికి ఎర చేస్తాను!" అని శూలాన్నెత్తాడు.

ఆదిత్య కరికాలన్ అతని ఉద్రేకాన్ని చూసి కాస్త ఆశ్చర్యపడ్డాడు. గందమారన్ చేతనున్న శూలాన్ని లాగేసుకొని తన ఉక్కు చేతులతో దాని కాండాన్ని వంచేశాడు. శూలం 'ఫట్'మని విరిగింది. దాని విరిగిన రెండుభాగాలను ఆదిత్య కరికాలన్ దూరంగా విసిరేశాడు. "జాగ్రత్త! నా స్నేహితులు నా ముందే ఒకరితోనొకరు పోట్లాడుకోవడాన్ని చూస్తూ ఊరుకోను...పార్థిబేంద్రా! వీరిద్దరిలో ఎవరైనా ఇకమీదట శూలాన్నో, కత్తినో ఎత్తితే వారిని చెరపట్టి బంధించడం నీ బాధ్యత!" అన్నాడు.

వెంటనే వంతిదేవుడు తన ఖడ్గాన్ని తీసి పార్థిబేంద్రునికిచ్చాడు. పార్థిబేంద్రుడు కూడ దాన్ని అయిష్టంగా స్వీకరించాడు.

"గందమారా! నీ నిందారోపణకు వంతిదేవుడు ఉత్తరమిచ్చాడు. దాని నిజానిజాలను నేనే తీరిక చేసుకొని విచారించి తీర్పు చెబుతాను. అతడు అడిగిన ప్రశ్నలకు నీవు జవాబు చెప్పబోతున్నావా?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

గందమారన్ తడబడిపోయి, "ఆ విషయాల గురించి నేనెవ్వరికీ చెప్పనని సత్య ప్రమాణం చేశాను!" అన్నాడు.

అప్పుడు పార్థిబేంద్రుడు కలగజేసుకొని, "రాజా! వీరిద్దరూ ఇలా ఒకరిపైనొకరు నిందమోపుకోవడం ఎవరో ఒక అమ్మాయి విషయమై ఉండాలి. కాబట్టి వీరిద్దరిని వేర్వేరుగా విచారించి తెలుసుకోవడం మంచిది!" అన్నాడు.

"అవును, పార్థిబా! నేనూ అదే అనుకొంటున్నాను. మీరు ముగ్గురూ వేర్వేరుగా పళువూర్

యువరాణిని చూసి, ఆమె మోహపు వలలో పడ్డారు. అందుకనే ఒకరినొకరు మింగేయజూస్తున్నారు!" అని చెప్పేసి మళ్ళీ నవ్వాడు కరికాలన్.

పార్థిబేంద్రుని ముఖం ఎర్రబారింది. అతడు, "ప్రభూ! మీరు ఈ రోజు ప్రతి ముఖ్యమైన విషయాన్ని కూడ తేలిక చేసి నవ్వేసేయాలని నిశ్చయించినట్లున్నారు. మంచిది; నేను కూడ చెప్పవలసింది చెప్పేస్తాను. నాకు కూడ ఈ వంతిదేవుని మీద అనేక సందేహాలున్నాయి. కానీ వాటిలో ముఖ్యమైన కొన్నిటిని మాత్రం ఇప్పుడు వెలిబుచ్చుతాను. వీడిని నిప్పంటుకొన్న ఓడనుంచి కాపాడేందుకే మీ ప్రియ సహోదరులు పొన్నియిన్ సెల్వన్ సముద్రంలోకి దూకారు. తర్వాత ఆయన కనిపించనేలేదు. కానీ వీడు మాత్రం చెక్కు చెదరకుండ ఇక్కడికొచ్చి తేలాడు. తమ సహోదరులు ఏమైనారని వీడిని అడగండి. ఆయనను కడలి పొట్టన పెట్టుకొనివుంటే, దానికి ఈ పాతకుడే కారణం!" అన్నాడు.

కరికాలన్ వంతిదేవుని చూసి, "ఇందుకు ప్రత్యుత్తరమేమిస్తావు?" అని అడిగాడు.

"అయ్యా! నేను వీరి ప్రశ్నకు ఉత్తరమిచ్చేముందు, వీరు ఒక ప్రశ్నకు ఉత్తరమివ్వాలి. పొన్నియిన్ సెల్వన్ని ఈయనే లంకనుంచి తమ ఓడలో ఎక్కించుకొని బయలుదేరారు. ముఖ్యమంత్రి అనిరుద్ధులు, సేనాధిపతి బూది విక్రమకేసరి కూడ ఆయనను లంకలోనే ఉండమని వేడుకొన్నారు. అయినాకూడ అన్నగారి ఆజ్ఞకు ప్రాముఖ్యతనిచ్చి పొన్నియిన్ సెల్వన్ ఈయనగారి ఓడలో ఎక్కి బయలుదేరారు. ఆయనను ఎందుకీయన క్షేమంగా తీసుకొని వచ్చి మీదగ్గర చేర్చలేదు? నడిసముద్రంలో పొన్నియిన్ సెల్వన్ దూకినప్పుడు ఎందుకీయన చూస్తూ నిలబడ్డారు? ఎందుకు యువరాజును అడ్డగించి ఆపలేదు? పేదవాడిని, అనాథనైన నన్ను కాపాడేందుకు పొన్నియిన్ సెల్వన్ తన ప్రాణాలకు తెగించి దూకారు కద? వీర పల్లవకులంలో పుట్టిన ఈయన, ఈయన మనుషులు యువరాజును కాపాడేందుకు ఎందుకు సముద్రంలో దూకలేదు? వారిని కడలి తీసుకొని వెళ్ళడాన్ని చోద్యం చూస్తూ నిలబడ్డారా...?"

పార్థిబేంద్రుని ముఖాన నువ్వులు, గుగ్గిలాలు పేలాయి. అతని చేతులు వణికాయి; పెదవులు వణికాయి; ఒళ్ళు ఊగింది.

"అయ్యా! ఈ మూర్ఖుడు నాపైన నింద మోపుతున్నాడులాగుంది. యువరాజును నేనే చంపేశానని కూడ చెబుతాడేమో. దీన్ని నేను ఒక్క క్షణం కూడ సహించలేను!" అన్నాడు.

కరికాలన్ అతన్ని గుచ్చి చూసి, "పార్థిబా! నేనప్పుడే చెప్పాను కద? నా ప్రియ స్నేహితులైన మీరు ముగ్గురూ ఒకరినొకరు నమిలి మింగేసే స్థితికి వచ్చేశారు. దీనికంతా నేను మీమీద నింద మోపడం లేదు. ఆ పళువూర్ రాణి మోహశక్తి అటువంటిదని నేనే స్వయంగా అనుభవించి తెలుసుకొన్నాను. నీవు, గందమారన్ మీమీ గుర్రాలెక్కి కాస్త ముందుగా వెళుతుండండి. నేను కాస్త వెనగ్గా వస్తాను. మీ నిందారోపణల గురించి విచారించి నిజానిజాలు తెలుసుకొంటాను. కానీ ఒకటి గుర్తుంచుకోండి. మీరు ముగ్గురూ స్నేహంగా ఉండాలి. ఒకరితోనొకరు కొట్లాడుకొంటే నాకంతకన్న మనస్తాపమిచ్చే విషయం ఇంకేదీ

ఉండబోదు!"

~

పార్థిబేంద్రుడు, గందమారన్ ఇక వేరు దారి లేక తమ తమ గుర్రాలెక్కి ముందుకు సాగారు.

అప్పుడు ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని దగ్గరకొచ్చి, అతని చెవిలో "అబ్బాయీ! నీవు చాల తెలివిమంతుడివైపోయావు! అబద్ధమూ చెప్పక, నిజాన్ని వెలిబుచ్చక చాల సామర్థ్యంగా మాట్లాడి తప్పించుకొన్నావు!" అన్నాడు.

అప్పుడే ఆదిత్య కరికాలన్ చూపు అక్కడికొచ్చిన ఆళ్వార్ కట్టియాన్ మీద పడింది.

"ఓహో! ఇతడెవరు? ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుందే?" అన్నాడు.

"అవును, రాజా! కొన్నేళ్ళకు మునుపు మీరు నన్ను చూశారు!"

"నీ గొంతుకూడ విన్న గొంతులాగుందే!"

"అవునయ్యా! మూడేళ్ళకు మునుపు ఒక అతిముఖ్యమైన సందర్భంలో నా గొంతు విన్నారు..."

ఆదిత్య కరికాలన్ ముఖాన ఉన్నట్లుండి ఒక నల్లని మేఘం వచ్చి కమ్ముకొన్నట్లయింది.

"మూడేళ్ళకు మునుపు ముఖ్యమైన సందర్భం.... అదేమి...? వైగైనది దీవిలో నా పగవాడిని వెతుకుతూ తిరుగాడుతున్నప్పుడు నేను విన్న గొంతా? అది సాధ్యమా?"

"ఆ గొంతు నాదే రాజా! పగవాడు దాగివున్న చోటును చెట్టుమాటునుంచి చెప్పినవాడిని నేనే!"

"ఆహా! ఎంతటి భయంకరమైన దినమది? ఆ రోజు నాకు పట్టిన ఆవేశాన్ని. పిచ్చికోపాన్ని తలుచుకొంటే ఇప్పుడు కూడ నా ఒళ్ళు వణుకుతోంది. వైష్ణవా! నీవెందుకు ఆ రోజు ఆ అడవిలో దాగివున్నావు? ఎందుకు నిన్ను అశరీరిగా మార్చుకొన్నావు?"

"రాజా! కాసేపటికి మునుపు మీరే చెప్పారు కద – ఆ రోజు మీకు పట్టిన ఆవేశం గురించి! ఎదురుగా కనిపించిన వారందరినీ ముక్కలు ముక్కలుగా నరికేసి ముందుకు వెళ్ళారు. నేనింకా కొంతకాలం బతకాలని ఆశపడుతున్నాను...."

"అది మాత్రమేనా కారణం? 'అశరీరి బయటకు వచ్చి నాకు దారి చూపనీ' అని ఎన్నోసార్లు గొంతెండిపోయేలాగ అరిచి వేడుకొన్నాను కద? అప్పుడు కూడ నీవెందుకు బయటకు రాలేదు?"

"నేను పెంచిన సహోదరి - ఇప్పుడు పళువూర్ యువరాణి - ఆమె తీరని కోపానికి నేను గురికావడానికి నేనిష్టపడలేదు..."

"ఆమె తీరని కోపానికి నేను మాత్రం గురైతే ఫరవాలేదనుకొన్నావు కాబోలు! ఒరే ఛండాలా!" అని ఆదిత్య కరికాలన్ ఒరనుంచి కత్తిదూశాడు.

వంతిదేవుడు అదిరిపడ్డాడు. ఆళ్వార కట్టియాన్ జీవితం ఆ రోజుతో ముగిసిందనుకొన్నాడు.

చాల బిడియంతో, "అయ్యా! ఈ వైష్ణవుడు ముఖ్యమంత్రి దూతగా వచ్చినవాడు. ఇతడు తీసుకొచ్చిన సమాచారాన్ని అడిగి తెలుసుకొన్న తర్వాత ఇతన్ని దండించండి!" అన్నాడు.

"ఆహా! ఇతన్ని దండించి ఏం ప్రయోజనం! ఇక ఎవరిని దండించి ఏం ప్రయోజనం?" అని కరికాలన్ కత్తిని ఒరలో పెట్టాడు.

కరికాలన్ కోపాన్ని చూసి వంతిదేవుడు భయపడ్డట్లు ఆళ్వార్ కట్టియాన్ భయపడ్డట్లనిపించలేదు. ముఖంపైన ఒక విచిత్రమైన చిరునవ్వుతో, "రాజా! మీ కోపాన్ని నామీదికి తిప్పుతారనే నేనిన్నాళ్ళూ నేరుగా/ముఖాముఖి కలవలేదు. నామీద నాసహోదరిగొన్న కోపం కూడ ఇంకా తీరలేదు. నందినీదేవి ప్రేమతో రాసి పంపిన తాళపత్ర సందేశాన్ని చూసిన తర్వాతే కద మీరు కడంబూర్ మాళిగకు అతిథిగా బయల్దేరారు?" అన్నాడు.

"ఆహా! దుష్ట వైష్ణవా! అది నీకెలా తెలుసు?" అని అడిగాడు కరికాలన్.

"అయ్యా! ముఖ్యమంత్రి అనిరుద్ధుల సేవకుడిని నేను. ఆయనకు తెలియకుండ ఈ చోళరాజ్యంలో ఒక్క చిన్న కార్యం కూడ జరగజాలదు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చూస్తూండు! ఒక రోజు ఆ అణ్బిల్ అనిరుద్ధులను, నిన్ను కూడ చేర్చి దేశభ్రష్టులను చేసేస్తాను! ఇప్పుడు మీరిద్దరూ గుర్రాలెక్కి నాకిరువైపుల నాతోబాటు రండి! మాట్లాడుతూ వెళదాం!" అన్నాడు ఆదిత్య కరికాలన్.

~~~
~~~

# అధ్యాయము - 13

## మణిమేఖల అంతరంగం

**కడంబూర్** మాళిగలో అతిథులు విడిది చేసే భాగంలో, విశేషంగా అలంకరించబడ్డ భాగంలో, పట్టెమంచంమీద నందిని ఆనుకొని కూర్చొనివుంది. ఆమె కూడ చాల బాగ అలంకరించుకొంది. ఆరోజు ఆమె ముఖం మునుపెన్నడూ లేనంతగా ప్రకాశిస్తూంది. ఆమె పగటి కలలు కంటూందని ఆమె అర్ధనిమీలిత నేత్రాలను చూస్తూనే తెలిసిపోతూంది. నల్లటి కనురెప్పలు మూసి తెరిచినప్పుడల్లా ఆమె కళ్ళనుంచి మెరుపుల్లాంటి కాంతిపుంజాలు వీచి మాయమవుతున్నాయి. ఇందునుంచి, ఆమె చూసేందుకు సగం నిద్రలో ఉన్నట్లున్నా కూడ, అమె మనసు ఉద్వేగంతో చింతిస్తూందని స్పష్టంగా తెలుస్తూంది.

ఇంకాస్త పరీక్షగా చూస్తే ఆమె అరమోడ్పు కనులు ఆ గదిలో ఒకపైపున్న అగ్నిగుండంనుంచి వెలువడుతున్న పొగపైన ఉన్నాయని గ్రహించవచ్చు. గుండంనుంచి పొగ సుడులు తిరుగుతూ పైకి లేచి, ఇంకా పైకి పోనుపోను చెదరిపోయి కంటికి కనిపించక మాయమవుతూంది. ఆ పొగలో నందిన ఏమేం దృశ్యాలు కంటూందో తెలియదు. ఉన్నట్లుండి ఆమె పెద్దగా నిట్టూర్చింది. అమె పగడాల పెదవులు, "అవును! నేను కన్న కలలన్నీ ఈ పొగలాగే చెదరి మాయమైపోయాయి. ఈ పొగైనా కమ్మని వాసనను తన వెనక వదిలి మాయమవుతూంది. నా కలలు తమ వెనక వదిలిపెట్టిందంతా వేదన, బాధ, దుఃఖమూ, నింద, అపకీర్తి మాత్రమే!" అని తనలో తాను గొణుక్కొంది.

ఆ సమయాన, "దేవీ! దేవీ! లోపలికి రావచ్చా?" అని మణిమేఖల మెత్తని స్వరంతో పిలవడం వినిపించింది.

"రామ్మా, రా! నీ ఇంటి లోపలికి వచ్చేందుకు నన్ను అడగాలా?" అన్నది నందిని.

మణిమేఖల మెల్లగా తలుపు తెరుచుకొని లోపలికి అడుగు పెట్టింది. కానీ ఆమె నడక, చేతులూపుకొంటూ రావడం చూస్తే ఆమెలో ఉత్సాహం పొంగి పొర్లుతున్నట్లు కనిపించింది.

నందిని కాస్త నిటారుగా కూర్చొని, మంచానికి పక్కనున్న పీఠాన్ని చూపించి మణిమేఖలను దానిమీద కూర్చోమంది.

మణిమేఖల కూర్చొని, "దేవీ! మీతో ఎలా నడుచుకోవాలని నా అన్న నాకు నేర్పించాడు. దక్షిణదేశంవారి నాగరికత గురించి ఎంతో చెప్పాడు. ఉన్నట్లుండి, అనుమతి కోరకుండ ఇంకొకరి గది లోపలికి ప్రవేశించకూడదని చెప్పాడు!" అన్నది.

"దక్షిణదేశస్థులు, వారి నాగరికత పాడు గాను. నీ అన్న నీకు నేర్పించిందంతా వెంటనే మరిచిపో! నన్ను 'దేవీ' అనో, 'మహారాణీ' అనో పిలవకు! 'అక్కా' అని పిలు!"

"అక్కా! నేను తరచూ మీ గదికొచ్చి మీకిబ్బందివ్వడం మీకు కష్టంగా ఉండదు కద?"

"నీవు తరచూ ఇక్కడికొచ్చి నాకిబ్బంది పెడుతూంటే కష్టంగానే ఉంటుంది! నీవు నన్ను వదిలిపోక ఇక్కడే ఉంటే ఏ ఇబ్బందీ, కష్టమూ ఉండదు!" అనేసి నందిని చిరునవ్వు నవ్వింది.

ఆ చిరునవ్వు జల్లులో తడిసిపోయిన మణిమేఖల కాసేపు నందినినే చూస్తూండిపోయింది. తర్వాత, "మీలాంటి అందగత్తెను నేనింతవరకు చూడనే లేదు. చిత్రాలలో కూడ చూడలేదు!" అన్నది.

"అమ్మాయీ! నీవు కూడ నాపైన మోహంగొనకు! ఇప్పటికే నన్ను 'మాయమోహిని' అని అందరూ చెప్పుకొంటున్నారు. నాకెదురుగా వచ్చే మగవాళ్లనందరినీ నేను మైమరచిపోయేలా చేస్తున్నానని అందరూ నామీద అపనిందలు మోపుతున్నారు...!"

"అక్కా! అలా ఎవరైనా మీగురించి మాట్లాడడం నా చెవిన పడితే వారి నాలుక తెగ కోసేస్తాను!" అన్నది మణిమేఖల.

"ఊరివాళ్ళను తప్పుబట్టడంలో అర్థంలేదు, మణిమేఖలా! నేను ముసలాయనను పెళ్ళిచేసుకొన్నాను కద? అందుకే అందరూ అలా మాట్లాడుకొంటున్నారు!"

మణిమేఖల ముఖం చిన్నబోయింది.

"అవునవును! అది తలుచుకొంటే నాక్కూడ చాల విచారంగా ఉంది. నా అన్న కూడ దాని గురించి చెప్పి చాల విచారపడ్డాడు. అందుకని ఒకరిని గురించి నోటికొచ్చినట్లు మాట్లాడవచ్చా, అక్కా?"

"మాట్లాడుకొంటే మాట్లాడుకోనీ, మణిమేఖలా! సీతాదేవి వంటి మహాపతివ్రత గురించి కూడ ఊరివాళ్ళు నిందాపూర్వకంగా మాట్లాడారు. నా విషయం పక్కకు పెట్టు; నీ గురించిచెప్పు!"

"నా గురించి చెప్పేందుకేముందక్కా?"

"ఒసే దొంగా! ఈ రోజు సాయంత్రం వచ్చి నీ మనసులోని అంతరంగ విషయాలను చెబుతాననలేదా? ఇప్పుడు చెప్పేందుకేముందంటున్నావే?" అని చెప్పి నందిని మణిమేఖల అందమైన బుగ్గను మెత్తగా గిల్లింది.

"అక్కా! ఎప్పుడూ మీతో ఇలాగే ఉండిపోవాలనిపిస్తోంది. నాకు స్వయంవరం జరిపి, అమ్మాయిలు అమ్మాయిలనే పెళ్ళి చేసుకోవచ్చని చెబితే, నేను మీకే వరమాల వేస్తాను!" అన్నది మణిమేఖల.

"నీవు నన్ను చూసి ఇంకా ఒకరోజు కూడ గడవలేదు! అంతలో ఇలా వరమాల మాటలు మాట్లాడుతున్నావే! అందుగురించి నాకు సంతోషమే. నేనిష్టపడే నీలాంటి స్నేహితురాలు లేదు కద అని ఇన్నాళ్ళూ తపించిపోయాను. చోళదేశపు చిన్నరాజుల ఇంటి ఆడపడుచులందరూ ఆ పళైయార్రై పిశాచినే వెతుక్కొంటూ వెళతారు. నీవొక్కతెవైనా నాకు మిగిలావు కద? - కానీ నీవు కాసేపటి క్రితం చెప్పింది జరగని కార్యం. స్త్రీలకు స్త్రీలు వరమాల వేయడం లోకంలో ఎన్నడూ జరగలేదు. ఎవరైన ఒక మగవాడినే నీవు పెళ్ళి

చేసుకొని తీరాలి..."

"కన్యగానే ఉండిపోతేనేం, అక్కా?"

"వీలు కాదు, బంగారు! అస్సలు వీలు కాదు! నిన్ను ఈ లోకం కన్యగా ఉండనివ్వదు. నీ తలిదండ్రులు ఉండనివ్వరు. నీ అన్న కూడ ఉండనివ్వడు. ఎవరైనా ఒక మగాడి మెడకు నిన్ను కట్టబెట్టిన తర్వాతే వారికి నెమ్మది. ఒక వేళ నీవు పెళ్ళి చేసుకోవడమంటూ జరిగితే, ఎవరిని పెళ్ళి చేసుకోవాలని ఇష్టపడుతున్నావు, చెప్పు!"

"పేరు పెట్టి అడగండక్కా, చెబుతాను!"

"సరే, సరే! అలాగే అడుగుతాను. శివభక్తి పరాయణుడైన మధురాంతకుని పెళ్ళాడగోరుతున్నావా? లేక, వీర, ధీర పరాక్రమాలలో మేటియైన ఆదిత్య కరికాలన్ మెడలో వరమాల వేయడానికి ఇష్టపడుతున్నావా?"

~

ఉన్నట్లుండి మణిమేఖల దేన్నో తలుచుకొన్నట్లు గలగల నవ్వింది.

"ఎందుకలా నవ్వుతున్నావు, మణిమేఖలా? నిన్ను పరిహాసం చేస్తున్నాననుకొన్నావా? ఈ విషయాన్ని తీర్మానించేందుకే నీ అన్న నన్ను ఇక్కడికి ముఖ్యంగా రమ్మని చెప్పాడు. ఇంకాసేపట్లో కరికాలన్ ఇక్కడికొచ్చేస్తారు. నీ అన్న కూడ వచ్చేస్తాడు. నీ మనసులోని మాట తెలుసుకొంటానని నీ అన్నకు మాటిచ్చాను!" అన్నది నందిని.

"నా అంతరంగం ఇదీ అని నాకే తెలియదు కదక్కా! నేనేం చేయను?"

"ఎందుకు నవ్వావు? అదైనా చెప్పు!" అని అడిగింది నందిని.

"మధురాంతకుల పేరు చెప్పగానే ఒక విషయం జ్ఞాపకమొచ్చింది. నాలుగు నెలల క్రితం ఆయన మా ఇంటికి వచ్చారు. మీరు మామూలుగా వచ్చే మూసిన పల్లకిలో ఎవరూ చూడలేనట్లు తెరవేసుకొని వచ్చారు. అంతఃపురంలో మాకా రహస్యం తెలియదు. మేమంతా మీరే వచ్చారనుకొన్నాము. 'పళువూర్ రాణి ఎందుకు రాలేదు?' అని ఒకరినొకరు విచారించుకొన్నామక్కా! ఆడవాళ్ళను ఆడవాళ్ళు పెళ్ళి చేసుకోలేరని కాసేపటి క్రితం చెప్పారు కద? మధురాంతకులను నేను పెళ్ళిచేసుకోవడం ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నట్లే...!"

నందిని చిరునవ్వు నవ్వి, "అవునవును! మధురాంతకులను నీవిష్టపడవనే నేనూ అనుకొన్నాను. నీ అన్నకూ చెప్పాను. మధురాంతకులు ఇప్పటికే నా మరిదిగారి కూతురిని పెళ్ళి చేసుకొన్నారు. ఆమె చాల అహంభావి. ఆమెతో నీవు ఒక్కరోజు కూడ ఉండలేవు. అలాగైతే నీ మనసును యువరాజు కరికాలన్‌కి అంకితం చేసేశావని చెప్పు!" అన్నది నందిని.

"అలానూ చెప్పనక్కా! ఆయనను నేనింతవరకు చూడనే లేదు. ఎలా నా మనసు ఆయనవైపు వెళ్ళ సాధ్యం?"

"అమ్మాయీ! రాజవంశపు కన్యలు చూసి మనసిచ్చే పద్ధతి ఉందా? కథల్లోను, కావ్యాల్లోను చిత్రం చూసి, కీర్తి ప్రతిష్టల గురించి విని ప్రేమించిన అమ్మాయిల గురించి వినలేదా?"

"అవునవును! నేనది ఎరుగుదును. ఆదిత్య కరికాలన్ వీరాధివీరులని లోకంలో అందరికీ తెలుసునని కూడ ఎరుగుదును. అక్కా! వీరపాండ్యుని తలను ఆదిత్య కరికాలన్ ఒక్క వేటుతో తెగగొట్టేశారట కద? అది నిజమేనా?"

~

నందిని ముఖం ఆ సమయాన ఎంత భయంకరంగా మారిందన్నది మణిమేఖల గమనించనే లేదు.

నందిని కొన్ని క్షణాలపాటు అటు తిరిగి చూస్తూండి, ఆ తర్వాత మణిమేఖలవైపు తిరిగింది. అంతలో ఆమె ముఖం మళ్ళీ మునుపటిలాగ, చూసేవారి మతిపోగొట్టే మోహన వశీకరణ శక్తితో ప్రకాశవంతమైంది.

"మణిమేఖలా! ఒకరి తలను ఒక్క వేటుతో తెగగొట్టడం మహావీరత్వం అనుకొంటున్నావా? అది భయంకర రాక్షసత్వం కద?"

"మీరు చెబుతున్నది నాకర్థం కావడం లేదక్కా! పగవాని తలను నరకడం వీరత్వం కాదా? అదెలా రాక్షసత్వం అవుతుంది?"

"ఇలా ఆలోచించి చూడు - నీకు ప్రీతిపాత్రుడైన వాడి తల నరకడానికి అతని శత్రువు వస్తున్నాడనుకో. నీ అన్న అనుకో. లేక నీవు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకొన్న నీ ప్రియుడనుకో. అతడు గాయపడి మంచాన పడివుంటే, ఇంకొకడు - అతని పగవాడు - కత్తిదూసి అతని తలను నరికేసేందుకు వస్తున్నాడనుకో. అలాంటి వాడి వీరత్వాన్ని నీవు మెచ్చి పొగడుతావా?" అని అడిగింది పళువూర్ రాణి.

మణిమేఖల్ కాసేపాలోచించి, "మీరు అడుగుతున్నది చాల విచిత్రమైన ప్రశ్న. కానీ నాకు తోచిన సమాధానాన్ని చెబుతాను. అలాంటి పరిస్థితి నాకే వస్తే నేను చూస్తూ ఊరుకోను. చంపవస్తున్న వాడి చేతి నుంచి కత్తిని లాక్కొని వాడినే పొడిచి చంపేస్తాను!" అన్నది.

నందిని మణిమేఖలను ఆప్యాయంగా హత్తుకొంది. "నా ముద్దూ! మంచి ఉత్తరమిచ్చావు! ఇంత బుద్ధిశాలివైన నీకు మంచి మగడు దొరకాలి కద అని నాకు చాల దిగులుగా ఉంది. ఆదిత్య కరికాలన్ కూడ నీకు తగిన భర్త కాగలడా అని సందేహిస్తున్నాను" అన్నది నందిని.

"నేనూ అలాగే అనుకొంటున్నాను. కరికాలన్‌గారి గుణగణాల గురించి విన్న తర్వాత ఆయన్ను తలుచుకొంటే కాస్త భయమేస్తూంది. నా అంతరంగాన్ని, నా మనసులో ఉన్నది ఉన్నట్లు చెప్పనా, అక్కా?"

అని అడిగింది మణిమేఖల.

~~~
~~~

# అధ్యాయము - 14

## కల నిజమవుతుందా?

**నందిని** మణిమేఖల గడ్డాన్ని పట్టుకొని కాస్త పైకెత్తి ఆమె విప్పారిన కళ్ళలోకి ఆప్యాయంగా చూసింది.

"నా బంగారూ! నీవు నీ అంతరంగాన్ని నాకు చెప్పకుండడమే మంచిది. నేను నీకు పరిచయమై ఇంకా ఒక్కరోజు కూడ పూర్తి కాలేదు. చాల కాలంగా పరిచయమున్న స్నేహితులకు మాత్రమే నీవు నీ అంతరంగాన్ని చెప్పుకోవాలి" అన్నది.

"లేదక్కా! మిమ్మల్ని చూస్తే చాల కాలంగా పరిచయమున్న గాఢస్నేహితులలాగ అనిపిస్తున్నారు. ఎవరికీ చెప్పని విషయాలను మీకు చెప్పాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఎవరినీ అడగని మాట మిమ్మల్ని అడిగేందుకు నాకు ధైర్యాన్నిస్తోంది నా మనసు..."

"అలాగైతే అడుగు ముద్దూ!"

"అశరీరరూపం కంటికి కనిపించడమనే విచిత్రం గురించి కథల్లో చెబుతారు కద, అది నిజమా అక్కా? మన ఎదురుగా ఎవరూ లేనప్పుడు వారు మనకెదురుగా ఉన్నట్లు అనిపిస్తుందా?"

"కొన్ని సమయాల్లో అలా అనిపిస్తుంది. ఒకరిపైన మనం చాల ప్రేమగొనివుంటే, వారు మనకెదురుగా లేకున్నా, మనకెదురుగా సాకారంగా ఉన్నట్లనిపిస్తుంది. ఒకరిపైన చాల ద్వేషం ఉన్నాకూడ అటువంటి దృశ్యం సాధ్యం. కృష్ణలీలలు వినలేదా, మణిమేఖలా? నాటకం కూడ చూసివుంటావు కద? కంసునికి కృష్ణుడంటే చాల ద్వేషం. కాబట్టి చూసిన చోటల్లా కృష్ణుడే కనిపించేవాడు. కత్తి విసిరి, విసిరి మోసపోయేవాడు. నప్పిన్నై అనే గోపికకు కృష్ణుడంటే చాల ప్రేమ. కృష్ణుడు లేని చోటల్లా కనిపించేవాడు. స్తంభాన్ని, చెట్టును, పారే నదిని కృష్ణుడని భ్రమించి పరుగెత్తి వెళ్ళి హత్తుకోజూసి మోసపోయేదట! ఓ, మణిమేఖలా! నిన్నలా మైమరపిస్తున్న మాయకృష్ణుడెవరే?"

"అక్కా! నాలుగు నెలల క్రితం ఆయనను చూశాను. అంతకు మునుపు నా అన్న గందమారన్ ఆయన గురించి తరచూ చెప్పేవాడు. అప్పుడల్లా ఆయన రూపం నా కంటి ముందు కనిపించేది కాదు. ఒకసారి చూసిన తర్వాత ఆయన తరచూ నా కలల్లో కనిపించసాగారు. ఒక్కోసారి పగటిపూట కూడ ఆయన రూపం నా ముందున్నట్లనిపిస్తూంది..."

"నిన్న కూడ ఆ మాయావి అశరీర రూపం నీవు చూశావు కద?"

"అవునక్కా! అది మీకెలా తెలుసు?"

"నాకు మంత్ర శక్తి ఉందని నీకెవరూ చెప్పలేదా?"

"అవును, చెప్పారు. అది నిజమేనా, అక్కా?"

"నీవే పరీక్షించి తెలుసుకో. నీ మనసును దోచుకొన్న ఆ యవ్వన సుందర పురుషుడెవరని నా మంత్ర శక్తితో తెలుసుకొని చెప్పనా?"

"చెప్పండి, చూద్దాం. నాకూ ఆయన పేరు చెప్పేందుకు సిగ్గుగా ఉంది."

నందిని కాసేపు కళ్ళు మూసుకొని, తర్వాత, "నీ మమసును దోచుకొన్న ఆ నీ ప్రేమికుడు వాణర్ కులంలో పుట్టిన వల్లవరయ్యన్ వంతిదేవుడే కదా?" అన్నది.

"అక్కా! మీకు మంత్రశక్తి ఉందన్నది నిజమే!" అన్నది మణిమేఖల.

"అమ్మాయీ! మరెందుకు ఈ విషయాన్ని నీ అన్నకు చెప్పలేదు? మధురాంతకునికి ఆశ చూపించనేల? కరికాలన్‌ని ఇక్కడికి రప్పించనేల? నన్ను ఇక్కడికి అనవసరంగా రప్పించనేల?"

"అక్కా! నా అన్నకు ఆయన నచ్చలేదు..."

"బాగుంది! నీ అన్నా పెళ్ళి చేసుకోబోతున్నాడు? కానీ గందమారనే కద ఆయన గురించి నీకు చెప్పాడన్నావు? అతన్నిక్కడికి పిలుచుకొచ్చింది కూడ నీ అన్నే కదా?"

"అవును; నా అన్నే ఆయన గురించి నాకు చెప్పాడు. ఒకరోజు అంతఃపురానికి కూడ పిలుచుకొని వచ్చాడు. తర్వాత వాడి మనసు మారిపోయింది. తంజావూరులో ఆయన నా అన్నను వెన్నుపోటు పొడిచాడట, అక్కా! మీ అంతఃపురంలో నా అన్న చాలరోజులు వైద్యసహాయం తీసుకొన్నాడట కద? మీ ఆప్యాయపూరితమైన శైత్యోపచారాల వల్లనే నా అన్న బతికి బయటపడ్డాడట కద?"

"నేను చేసిన సహాయాన్ని నీ అన్న చాల పెద్దదిగా - గోరంతలు కొండంతలుగా - చేసి చెప్పాడు. అది పోనీ. ఇప్పుడు నీవేం చెబుతావు? నీ మనస్సును ఆకట్టుకొన్నవాడు నీ అన్నకు విరోధి అయ్యాడు కద?"

"కానీ ఈయనేం చెబుతున్నారో తెలుసా...?"

"ఈయన అంటే?"

"ఆయనే! మీరిప్పుడు చెప్పారే, ఆయనే! గందమారన్ని ఆయన వెన్నుపోటు పొడవనేలేదని ప్రమాణం చేసి చెబుతున్నారు. ఇంకెవరో వాడిని పొడిచేసి తంజావూరు కోట ప్రాకారం గోడ వారగా పడేశారని, ఆయన ఎత్తుకొని  వెళ్ళి కాపాడారని చెబుతున్నారు."

"ఇది ఆయన నీకెలా చెప్పారు?"

"నిన్ననే...!"

"నిన్న ఆ వంతిదేవుని ముఖాముఖీ చూశావా, ఏమి? అతని అశరీర రూపాన్ని చూశానని కద చెప్పావు?"

"అదే అక్కా! నాకు ఒకటే గందరగోళంగా ఉంది. నేను నిన్న చూసింది ఆయననేనా, లేక ఆయన

అశరీర రూపాన్నా అని తేల్చుకోలేకపోతున్నాను. నిన్న జరిగినవన్నీ తలుచుకొంటే, అంతా ఒక కలలాగనిపిస్తోంది. అక్కా! కొన్నిసార్లు మనుషులు చనిపోతే వారి ఆత్మ వచ్చి మాట్లాడుతుందంటారు కద? అది నిజమా?" - ఈ ప్రశ్న అడుగుతున్నప్పుడు మణిమేఖల గొంతులో ఎనలేని భీతి ధ్వనించింది.

~

నందిని ఒళ్ళు కూడ వణికింది. ఎక్కడో చూస్తూ, "అవును! అది నిజమే! అల్పాయుష్షులో చనిపోయినవారి ఆత్మ బతికున్నవారిని వచ్చి చుట్టుకొంటుంది. ఒకరి తలను నరికి చంపేస్తే, కొన్నిసార్లు తల మాత్రం వస్తుంది. కొన్నిసార్లు మొండెం మాత్రం, తల లేకుండ, వస్తుంది. మరికొన్నిసార్లు రెండూ వేర్వేరుగా వచ్చి 'పగ తీర్చావా?' అని అడుగుతాయి!" అన్నది.

తర్వాత మణిమేఖలను చూస్తూ, పెద్ద గొంతుతో, "అమ్మాయీ! నీవెందుకే నన్నా ప్రశ్న అడిగావు? అలా ఏమైనా జరిగివుంటుందని భయపడుతున్నావా? ఈ సందేహాన్ని నీ మనసులో ఎవరు పుట్టించారు?" అన్నది.

"ఈ మాళిగలో పూనకం వచ్చే పూజారి ఒకడున్నాడు. వాడిని పిలుచుకొని రమ్మని పంపించారు. వాడిని ఎవరో నిన్న రాత్రి కొట్టి పడేశారట. వాడికి బదులుగా వాడి పెళ్ళాం దేవరాట్టి (పూనకం పూజారిణి) వచ్చింది. ఆమే ఇలా చెప్పింది..."

"ఛీఛీ! నీవదంతా నమ్మకు!"

"నాకూ అందులో నమ్మకం లేదు. ఒట్టి ఆత్మ శరీరమైతే తాకలేం కద?"

"అలాంటి ఆత్మ శరీరాన్ని తాకలేము; అశరీర రూపాన్నీ తాకలేము. నీవెందుకిలా అడుగుతున్నావు? నీ మనసు చూరగొన్నవాడిని నిన్న తాకి చూశావా?, ఏమి?"

"అదే చాల గందరగోళంగా ఉంది. తాకి చూసినట్లు ఉంది; కానీ ఇంకొన్ని విషయాలను తలుచుకొంటే సందేహంగా కూడ ఉంది."

"నిన్న జరిగిందంతా వివరంగా చెప్పమ్మాయ్! నేను నీ సందేహాన్ని తీరుస్తాను!"

"అలాగే, అక్కా! నేనేదైనా తారుమారుగా చెబుతే మళ్ళీ అడిగి తెలుసుకోండి!" అన్నది మణిమేఖల. తర్వాత ఆమె ఇలా చెప్పుకొచ్చింది:- "నిన్న నేను ఇంచుమించు ఇదే సమయానికి ఇక్కడున్నాను. నా అన్న నాకు పురమాయించినట్లు ఈ గదిలో మీకు తగిన వసతులన్నీ సరిగ్గా అమర్చబడ్డాయా లేదా అని తనిఖీ చేస్తున్నాను. అప్పుడు ఒకసారి, ఇదిగో ఇక్కడున్న అద్దంలో నా ముఖాన్ని చూసుకొంటున్నాను..."

"నీ అందాన్ని నీవే చూసి మురిసిపోయావు కాబోలు..."

"అలాగేం లేదక్కా! నా ముఖ లక్షణం నాకు తెలియదా?"

"నీ ముఖ లక్షణానికేం కొరత? రతి, ఇంద్రాణి, ఊర్వశి, మేనకలు నిన్ను చూసి

అసూయపడరా?"

"వారంతా మీ కాలి ధూళికి సరిపోరక్కా!"

"సరే, సరే! ముందుకు చెప్పు! అద్దంలో నీ ముఖాన్ని చూసుకొంటున్నావు..."

"అప్పుడు ఉన్నట్లుండి ఇంకొక ముఖం అద్దంలో కనిపించింది. నా ముఖానికి దగ్గరగా కనిపించింది...."

"అది నీ ప్రేమికుని ముఖమే కద?"

"అవును. నేనదిరిపడ్డాను..."

"ఎందుకని అదిరిపడాలి? నీవు అతని ముఖాన్ని తరచూ కలలో చూస్తున్నావాయె! అశరీరరూపాన్ని చూసేదానివి అని చెప్పావు కద?"

"దానికీ దీనికీ కాస్త తేడా కనిపించింది. కలలో వచ్చేటప్పుడు కాస్త దూరాన కనిపించేవారు. అశరీర రూపంలోను  అలాగే. కానీ ఇక్కడ వెనకనుంచి - చెప్పడానికి సిగ్గుగా ఉంది..."

"ఫరవాలేదు, చెప్పవే దొంగా!"

"వెనకనుంచి బుగ్గమీద ముద్దు పెట్టినట్లనిపించింది. ఉలిక్కిపడి తిరిగి చూశాను. ఎవరూ లేరు. తర్వాత అద్దంలో కూడ ఆ ముఖం కనిపించలేదు. నాకు పెద్ద సందేహం కలిగింది. ఈ గదికి పక్కనున్న వేటమంటపం రహస్య ద్వారాన్ని మీకు చూపించాను కద? నిన్న ఆ అద్దం ఆ రహస్యద్వారానికి ఎదురుగా ఉంచబడింది. కాబట్టి ఆ రహస్యద్వారం గుండా ఎవరైనా తొంగి చూశారేమో అని తోచింది. అన్యపురుషుడొకడు వేటమంటపానికి ఎలా వచ్చివుండగలడు? కానీ ఆ సందేహాన్ని తీర్చుకోవడానికి తలుపు తెరిచి ఆ వేటమంటపంలోకి వెళ్ళి చూశాను..."

నందిని చాల ఆసక్తితో, "వేటమంటపంలో ఆ దొంగ దాక్కొనివున్నాడా? దొరికాడా?" అని అడిగింది.

"ఏమక్కా ఆయనను 'దొంగ' అంటున్నారు?"

"దొంగ అంటే నిజమైన దొంగా? నీ మనసును దోచుకొన్న దొంగ అన్న అర్థంతో చెప్పానే! అతడు వేట మంటపంలో దొరికాడా?"

"అదే విచిత్రం. ఆయన వేట మంటపంలో లేరు. అందుకు బదులు మా మాళిగ పనివాడు ఇడుంబన్‌కారి అక్కడ ఏదో పని చేస్తూ కనిపించాడు. వాడి ముఖం అయ్యనార్ కోవెల ముందు అడవి చెట్లు కొట్టేవాడి ముఖంలాగ నల్లగా ఉంటుంది. 'ఇక్కడ ఇంకెవరైనా వచ్చారా?' అని అడిగాను. 'లేదు' అని ఘంటాపథంగా చెప్పేశాడు."

"వాడు అబద్ధం చెప్పాడని అని సందేహిస్తున్నావా?"

"అదేమో నాకు తెలియదు. కానీ ఇంకొక మనిషి ఆ మంటపంలో దాక్కొని ఉన్నట్లనిపించింది.

'దొంగతనం తనకు తానే బయట పడనీ' అని నేను ఈ గదికి తిరిగి వచ్చేశాను..."

"దొంగతనం బయటపడిందా?"

"వినండి! నేనీ గదిలోపలికొచ్చేసి, వేటమంటపంలో ఎవరైనా మాట్లాడుకోవడంలాగ వినిపిస్తుందా అని గమనించసాగాను. మాట శబ్దం వినిపించింది. గడబిడగా ఏదో కిందపడ్డ శబ్దం కూడ వినిపించింది. నేను ఏం చేద్దామని ఆలోచించేలోపు ఈ తలుపు కదిలింది. నేను దీపాన్ని మరుగుపరిచేసి వేచివున్నా. ఈ తలుపులో వృత్తాకారంగా ఇంకో తలుపుంది. దాన్ని తెరుచుకొని ఒక ఆకారం ఈ గదిలోకి రాసాగింది. 'నన్ను కాపాడండి' అన్న పిలుపు వినిపించింది. గొంతు, ఆకారం ఆయనలాగే అనిపించడంవల్ల, ఆయన ఈ గది లోపలికి వచ్చేందుకు సహాయం చేసేసి, దీపం ఎత్తి పట్టాను. చూస్తే ఆయనే!"

"మణిమేఖలా! ఇదెంత విచిత్రం! విక్రమాదిత్యుని కథలాగుంది కద?"

"ఇంకా వినండి! నాలుగు నెలలుగా కలలో చూస్తున్న ఆయనను ప్రత్యక్షంగా చూడగానే నా మనసు ఉప్పొంగింది; ఒడలు పులకరించింది. కానీ ఉత్తుత్తి కోపంతో ఆయనతో మాట్లాడాను. 'స్త్రీలు నివసించే అంతఃపురంలో దొంగతనంగా ప్రవేశించవచ్చా?" అని నిలదీశాను. ఆయనను చంపేందుకు ఎవరో ఆయనను తరుముకొని వస్తున్నారని అన్నారాయన. 'ప్రాణాలకు భయపడి పారిపోయే పిరికిపంద' అని పరిహాసం చేశాను. అందుకు బదులుగా ఆయన తమ వద్ద ఆయుధమేమీ లేదని చెప్పారు. ఆ తర్వాతే నా అన్నను వెన్నుపోటు పొడిచిన విషయం గురించి ప్రస్తావించాను. 'లేనే లేదు' అని సత్య ప్రమాణం చేశారక్కా!"

"నీవు దాన్ని నమ్మేశావు కాబోలు!"

"అప్పుడు నమ్మవలసే వచ్చింది. కానీ జరిగినదంతా తలుచుకొంటే దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో అని తెలియడం లేదు..."

"తర్వాత ఇంకా ఏమేం విచిత్రాలు జరిగాయో చెప్పు!"

"ఆయనతో మాట్లాడుతూనే ఇంకొక చెవితో ఆ గదిలోనుంచి ఏమైనా శబ్దం వినిపిస్తుందా అని గమనించసాగాను. చాలమంది నడయాడే శబ్దం, మాట్లాడే శబ్దం కూడ వినిపించాయి. కాబట్టి ఆయన్ను చంపేందుకు చాలమంది వెన్నంటి వస్తున్నారన్నది నిజమే అయివుండాలనుకొన్నాను. ఇది వినండక్కా! ఆ సమయాన ఈ పేదరాలి మనసు ఆయనను ఎలాగైనా కాపాడాలని పరితపించింది. ఆయనను చంపేందుకు వచ్చిన వారెవరని తెలుసుకోగోరాను. ఇడుంబన్‌కారికి దీనిలో భాగముందా? అయితే వాడు ఈయనకు లోబడ్డవాడా, లేక ఈయనను చంపేందుకు వచ్చినవారికి లోబడ్డవాడా అన్నది కూడ తెలుసుకోవాలనుకొన్నాను. వేటమంటపం లోపలికొచ్చే ఈ రహస్య సొరంగమార్గం ఇంతమందికి తెలిసి ఉండడం గురించి చాల దిగులు కలిగింది. అందులోను మీరిక్కడ దిగబోతున్నారన్నది తలుచుకోగానే దిగులింకా అధికమైంది. నాన్నగారిని పిలిపిద్దామంటే అందుకూ ధైర్యం రాలేదు. ఈయన

అంతఃపురంలోపలికొచ్చి ఉండడాన్ని నాన్నగారు చూస్తే, వెంటనే ఈయన ప్రాణానికే ఆపద కలుగుతుంది. కాబట్టి ఈయనను ఇక్కడే కాసేపుండమని చెప్పేసి, వేటమంటపంలో ఉన్నవారెవరని చూసేందుకు రహస్య మార్గాన్ని తెరుచుకొని వెళ్ళాను. లోపల ఐదారుమంది ఒక మూల గోడవారగా ఉన్నారు. నన్ను చూసి వారు చేష్టలుడిగి నిలబడిపోయారనిపించింది. వారినలా చూడగానే నా మనసులో కూడ కాస్త భయం పుట్టింది. ఆ భయాన్ని పక్కకు నెట్టి, కఠినకోపాన్ని తెచ్చుకొని వారెవరని అడిగేందుకు నోరు తెరిచాను. అంతలో నా చెలికత్తె చంద్రమతి ఇంకొక వాకిలి గుండా లోపలికొచ్చి, 'అమ్మా! అమ్మా!' అని పిలవసాగింది. వీరిక్కడ ఉండడం నాకు వెంటనే గుర్తుకొచ్చింది.చంద్రమతి ఈయనను చూసేసి కేకలేస్తే ఎలా అని భయపడిపోయాను. వేటమంటపంలో ఉన్నవారిని తర్వాత చూసుకొందామని వెనుదిరిగాను. చంద్రమతిని కూడ దారి తప్పించి ఈ గది లోపలికి తీసుకొచ్చాను. ఇక్కడ ఆయన కనిపించలేదు. మాయమైపోయారు. 'ఎవరైనా ఇక్కడున్నారా?' అని చంద్రమతినడిగాను. తాను చూడలేదన్నది. మళ్ళీ కాసేపు వెతికి చూసేసి, మళ్ళీ వేటమంటపంలోకి వెళ్ళాను. అక్కడ కూడ నేనంత క్రితం చూసినవారెవరూ కనిపించలేదు. ఇడుంబన్‌కారి ఒక్కడు మాత్రం మునుపటిలాగే గది శుభ్రం చేస్తూ కనిపించాడు. 'కాసేపటి క్రితం ఇక్కడున్నవారందరూ ఎవరు? ఇప్పుడెక్కడ వారు?' అని అడిగాను. ఇడుంబన్‌కారి 'ఇక్కడికెవరూ రాలేదు తల్లీ!' అని ఘంటాపథంగా చెప్పేశాడు. వాడి మాటలను నేను నమ్మలేకపోయాను. నా చెలికత్తె వంద్రమతి నన్ను పరిహాసం చేయనారంభించింది. 'అక్కా! మీకీరోజు నిజంగానే ఏదో చిత్త భ్రమ పట్టుకొంది! మనుషులు లేని చోటల్లా మనుషులు కనిపిస్తున్నారు' అన్నది. తర్వాత మీరందరూ కోట వాకిలికి దగ్గరకు వచ్చేశారని తెలియజేసింది.. మిమ్మల్ని స్వాగతించేందుకు మా నాన్నగారు నన్ను వెంటనే పిలుచుకొని రమ్మన్నారని చెప్పింది. వెంటనే నేను మాళిగ వాకిలివైపు బయలుదేరాను. త్వరగా అక్కడికి చేరుకోవాలని చంద్రమతి వచ్చినదారినే వెళ్ళి, రెండు పిట్టగోడలు దాటి మెట్లదారిన పైడాబా మీదికి నడిచి వెళ్ళాను. అక్కడ మళ్ళీ ఇంకొక విచిత్రాన్ని చూశాను. ఆ వాణర్ కులవీరుడు వెన్నెల డాబాను దాటి కోట ప్రాకారం గోడ వారగా వెళుతున్నాడు. గోడకు ఒక వెదురుబొంగును ఆనించి, గోడెక్కి బయటకు దూకడాన్ని కూడ చూశాను. నా కళ్ళకు అలా కనిపించింది. అదంతా నిజంగా జరిగిందేనా లేక నా చిత్త భ్రమేనా అని నాకింకా నిశ్చయంగా తెలియలేదు."

~

నందిని దీర్ఘాలోచనలో మునిగిపోయింది. ఆ మాళిగకు కాస్త దూరాన దట్టంగా పెరిగివున్న అడవి చెట్ల మధ్య తాను నిన్న సాయంకాలం చూసిన రెండు ముఖాలు ఆమె మనోనేత్రం ముందు నిలిచాయి. వారిని పట్టి బంధించడానికి ఇద్దరు అశ్వవీరులు పంపబడ్డారని కూడ ఆమెకు తెలుసు. వారింత లోపల పట్టుబడివుంటారా? అయితే ఇక్కడికి తీసుకురాబడతారా...?

"నాకా? నాకు ఏమనిపిస్తోందని అడుగుతున్నావా? నీకు మోహపు పిచ్చి బాగా

ముదిరిందంటాను!" అన్నది నందిని.

"చంద్రమతిలాగ మీరు కూడ నన్ను పరిహాసం చేస్తున్నారా?"

"నేను నిన్ను పరిహాసం చేయడం లేదే! ప్రత్యక్షంగా చూసిన నీకే నిజమో, కలో, చిత్తభ్రమో తెలియడం లేదు కద? మరి నేనెలా చెప్పగలను? ఈ గది నుంచి బయటకు వెళ్ళడానికి ఇంకేదైనా రహస్య మార్గం ఉందా?"

"నాకు తెలిసినంతవరకు ఇంకేదారీ లేదక్కా!"

"నీవూ, చంద్రమతి వెళ్ళిన దారినే అతడు కూడ మెట్లెక్కి వెళ్ళి ఉండవచ్చు కద?"

"అక్కడ దారిలో చాలమంది పనిచేసే అమ్మాయిలున్నారక్కా! వారికి తెలియకుండ పారిపోవడం అసాధ్యమక్కా!"

"విచిత్రంగా ఉంది... ఇదంతా మీ నాన్నగారికి తెలియజెప్పలేదా?"

"లేదక్కా! నాన్నగారికి చెప్పేందుకు సంకోచంగా ఉంది; భయంగానూ ఉంది. ఒకవేళ ఆయన ఇక్కడికి వచ్చి వెళ్ళిందంతా నిజమైవుంటే..."

"అవును. పురుషులకు ఇదంతా చెప్పకుండడమే మంచిది. వారికి చెప్పినా అర్థంకాదు..."

"నా అన్నకు చెబుదామా వద్దా అని ఆలోచిస్తున్నాను..."

"అతడికి చెబితే తప్పక రగడవుతుంది. నీ అన్న ఇప్పుడు ఎలాగైనా నిన్ను కరికాలన్‌కి కట్టబెట్టాలని చూస్తున్నాడు...!"

"అక్కా! మీరే నాకు సహాయం చేయాలి. గందమారన్కి మీరంటే చాల గౌరవాభిమానాలున్నాయి. మీరు చెబితే వింటాడు..."

"అమ్మాయ్! నేనిక్కడికి ఏ ఉద్దేశంతో వచ్చానో, అందుకు విరుద్ధమైన సహాయం కోరుతున్నావే! నీవు చాల తెలివైనదానివి! ఆ విధంగానే కరికాలన్‌కి నిన్నిచ్చి పెళ్ళిచేసే ఆలోచనను విడిచిపెట్టినా కూడ, ఇంకొకడి గురించి నీకు ఏమీ తెలియదు కద? అతనికి నీకిష్టమా, పెళ్ళిచేసుకొంటాడా..?"

"అందు గురించి నేను దిగులుపడడం లేదక్కా! ఆయన ఇష్టపడ్డా, లేకున్నా..."

"ఆడవాళ్ళ తలరాతే అంతటిది కాబోలు. పురుషులు ఎలా నడుచుకొన్నా కూడ, స్త్రీలు వారికోసం ప్రాణం కూడ ఇవ్వాలని కట్టుబాట్లు! ఏమో నీ అదృష్టం ఎలా ఉందో చూద్దాం. మళ్ళీ నిన్నటిలాగ జరిగితే నాకు చెబుతావు కద?"

"మీకు చెప్పక ఇంకెవరికి చెప్పనక్కా! నిన్న రాత్రి ఒక కల కన్నాను. అది కూడ మీకు చెప్పాలనిపిస్తోంది..."

"పగటి కలలు చాలదన్నట్లు రాత్రి కూడ కలగన్నావా? ఏమది? మళ్ళీ అతడు కలలో వచ్చి నిన్ను ఏమార్చేసి వెళ్ళిపోయాడా?"

"లేదు, లేదు! ఇది ఇంకొక విషయం. తలుచుకొంటేనే భయంగా ఉంది. ఉదయాన కన్న కలలు ఫలిస్తాయంటారు కద? అది నిజమేనా, అక్కా?"

"కల గురించి చెప్పు, విందాం! వేరే విషయం అంటే, ఇంకెవరి గురించైనా కలగన్నావా?"

"ఈయన గురించే! ఈయనను ఎవరో కత్తితో పొడవడానికి వస్తున్నారు. ఈయన చేత ఆయుధమేమీ లేదు. కానీ నేలపైన తళతళ మెరుస్తున్న ఒక కత్తి పడివుంది. దాన్ని ఒక్కదూకులో వెళ్ళి చేత తీసుకొన్నాను. ఈయనను పొడిచేందుకు వస్తున్న వాడిని వెన్నుపోటు పొడిచేయాలన్న ఉద్దేశంతో పరుగెత్తాను. దగ్గరకు వెళ్ళగానే వాడి ముఖం స్పష్టంగా తెలిసింది. వాడు నా అన్న గందమారనే...! 'కెవ్వు'మని కేకవేసి నిద్రనుంచి మేలుకొన్నాను. నా ఒళ్ళంతా చెమటపట్టి తడిసిపోయింది. నా కాళ్ళు చేతులు చాలసేపు వణుకుతున్నాయి. కల అంతగా నిజమనిపించేలాగ ఉంది. ఇది ఒక వేళ నిజంగా జరుగుతుందా, అక్కా?"

"అమ్మాయీ! నీ మనసు నిజంగానే కలతబారింది. నిజంగా జరిగినదాన్ని భ్రమ అనుకొంటున్నావు. కలలో చూసింది నిజమనుకొంటున్నావు! నాకు భలే స్నేహితురాలివి దొరికావు! నేనే ఒక పిచ్చిదాన్నంటే నన్ను మించిన పిచ్చిదానివిగా ఉన్నావు!" అన్నది నందిని.

ఈ సమయాన చంద్రమతి లోపలికొచ్చింది. "వారు వస్తున్నారట! వీర నారాయణపురం చెరువును దాటి వచ్చేశారట!" అని తెలియజేసింది.

~~~
~~~

# అధ్యాయము - 15

## రాజోపచారం

కడంబూర్ శంబువరయ్యర్ మాళిగ ముఖ్యద్వారం మునుపెన్నడూ చూడని దృశ్యాలను చూసింది. కనుచూపు మేర వరకు ప్రజలు గుంపులు గుంపులుగా క్రిక్కిరిసి నిలబడ్డారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, ముసలివాళ్ళు - అందరూ ఆ గుంపులో ఉన్నారు.

గట్టిగా కాలూని నిలబడలేని ముసలివాళ్ళు, ముసలమ్మలు కూడ ఊతకర్రల సాయంతో నిలబడ్డారు. తమను చుట్టుపక్కల నిలబడ్డవారు తోసేస్తున్నా పట్టించుకోక ఆదిత్య కరికాలన్ దివ్యముఖాన్ని చూడాలన్న ఉత్సుకతతో తడబడుతున్న కాళ్ళను ఎలాగో నిలదొక్కుకొని ఎదురుచూడసాగారు. పిల్లలేమో తమను ఇతరులు నలిపేస్తున్నా పట్టించుకోక ముందుకు తోసుకొని రాసాగారు. యవ్వనవతులు తమ సహజమైన సిగ్గును పూర్తిగా వదిలేసి అన్యపురుషుల మధ్య తోసుకొని ముందుకు రావడానికి ప్రయత్నించసాగారు. యవ్వన పురుషులేమో అటువంటి యువతులను ఏమాత్రం లక్ష్యం చేయక, వారివైపు కడగంటి చూపైన సారించక, యువరాజును బాగా చూడగలిగిన చోటు వెతికి పట్టుకోవడం పైన శ్రద్ధ చూపించసాగారు. వారిలో చాలమంది కడంబూర్ మాళిగ ఎదురుగా, పక్కన ఉన్న చెట్లపైకెక్కి కూర్చొన్నారు. ఇంకొంతమంది కోట గోడ ఎక్కేందుకు ప్రయత్నించి, కాపలవీరుల చేత కిందకు తోయబడ్డారు.

పసిబిడ్డలను చంకనేసుకొని చాలమంది తల్లులు ఆ గుంపులో చాల కష్టాలనెదుర్కొని నిలబడ్డారు. ఏడుస్తున్న బిడ్డలతో వారి తల్లులు, “బిడ్డా! ఏడవకు! తమిళదేశపు వీరాధివీరుడు - వీరపాండ్యుని తలగొన్న ఆదిత్య కరికాల చోళులు రాబోతున్నారు! ఆయనను చూసిన భాగ్యంవల్ల నీవుకూడ ఒకనాడు అంతటి వీరుడు కావచ్చు!” అని చెప్పి బుజ్జగించజూశారు. ఇలాగే ప్రేమికులు తమ ప్రియురాళ్ళతో, తండ్రులు తమ కొడుకులకు ఆదిత్య కరికాలన్ గురించి చెప్పుకోసాగారు.

ఆ విధంగా ఆదిత్య కరికాలన్ కీర్తి ప్రతిష్టలు ఆ కాలంలో తమిళనాడంతా వ్యాపించింది. పన్నెండో ఏటనే కత్తి చేతబట్టి యుద్ధరంగంలోకి దూకి పగవారిని మట్టి కరిపించిన విషయం, శేవూర్ యుద్ధంలో పాండ్యసైన్యాన్ని మట్టుపెట్టి, వీరపాండ్యుడు పారిపోయి ఎడారి గుహలో తలదాచుకొనేలాగ చేసి, వాడు దాక్కొన్న చోటు కనిపెట్ట్ వాడి తలను నరికి తీసుకొచ్చిన విషయం - ఇంతటి వీరకృత్యాలు చేసిన యువరాజును ఎవరు మాత్రం చూడాలని ఆశపడరు?

~

ఇటువంటి వీరపురుషుని గురించి గత మూడునాలుగేళ్ళుగా పలువిధాలైన వదంతులు

ప్రచారం కాసాగాయి. ఆదిత్య కరికాలన్‌కి యువరాజు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఆయనకు, సుందర చోళ చక్రవర్తికి మధ్య మనస్తాపం కలిగిందని, ఆదిత్య కరికాలన్ తమ తర్వాత సింహాసనమధిష్ఠించడం చక్రవర్తికి ఇష్టంలేదని కొందరు చెప్పుకోసాగారు. ఇంతకు ముందొకసారి ఒక చోళ యువరాజు కంచిని రాజధానిగా చేసుకొని వేరే రాజ్యం స్థాపించుకొని పల్లవ కులాన్ని ముందుకు కొనసాగించినట్లు ఆదిత్య కరికాలన్ కూడ చేయబోతున్నారని ఇంకొందరన్నారు. ఆయన తమ్ముడైన అరుళ్మొళి మీద చక్రవర్తి ఎక్కువ ప్రీతి చూపించడంవల్ల ఆదిత్య కరికాలన్ కోపగించుకొనివున్నారన్నారు మరికొందరు. ఇంకొందరు ఈ వాదాన్ని పూర్తిగా తిరస్కరించేసి, కరికాలన్, అరుళ్మొళి వర్మ లాగ స్నేహభావమున్న సహోదరులు ఎక్కడా ఉండబోరని వాదించారు. యువరాజుకు ఇంకా పెళ్ళికాకపోవడం గురించి పలువురు పలువిధాలుగా చెప్పుకొన్నారు. రాజవంశపు రాకుమార్తెలందరినీ తిరస్కరించి ఒక పూజారి కూతురిని పెళ్ళిచేసుకోగోరారని, అదే తండ్రీకొడుకుల మధ్య విభేధం కలగడానికి కారణమని కొందరి ఉవాచ. ఆదిత్య కరికాలన్‌కి చిత్తభ్రమ అని, పాండ్యదేశపు మాంత్రికులు శూన్యవిద్య ద్వారా ఆయనను సగం పిచ్చివాడిగా చేసేశారని, అందువల్లనే చక్రవర్తి తర్వాత కరికాలన్ సింహాసనమెక్కడం కొందరు సామంతరాజులకు ఇష్టం లేదని మరికొందరు వక్కాణించారు.

ఏదెలావున్నా, ఆ మహావీరుని చూసేందుకు ప్రజలంతా ఎనలేని కుతూహలంతో వేచివున్నారు. కడంబూర్ మాళిగకు యువరాజు విజయం చేయబోతున్నారన్న వార్త తెలిసిన వెంటనే చుట్టుపక్కల పెద్ద కుతూహలం లేచింది. ఆ రోజు సాయంత్రం రాబోతున్నారని తెలిసిన తర్వాత చుట్టుపక్కల రెండుకోసుల దూరాన ఉన్న ఊళ్ళన్నిటినుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి చేరారు.

ఆ గుంపును జనసముద్రమని చెప్పడం సమంజసంగా/సబబుగా ఉంటుంది. వేలకొద్ది ప్రజల గొంతులనుంచి వెలువడిన మాటలు ఒక్కటిగా కలిసి సముద్రఘోషలాగ మారుమోగింది. మాళిగ వాకిట యువరాజు, ఆయన పరివారం వచ్చేందుకు మాళిగ కాపలావీరులు దారి చేసుకొని నిలబడ్డారు. వెనుకనున్నవారి చేత ముందున్నవారు తోయబడి దారిలోకి తోయబడడమూ, వారు మళ్ళీ కాపలావీరుల చేత వెనక్కి తోయబడడమూ చూస్తే, సముద్రతీరాన్ని అలలు వచ్చి గుద్దుకొని మళ్ళీ వెనుదిరిగి పోతున్నట్లు అనిపించింది.

చెట్టుపైన కూర్చొన్నవాడొకడు, "అదిగో వస్తున్నారు!" అని కేక వేశాడు. "ఎక్కడ? ఎక్కడ?" అని వేవేల గొంతులు లేచాయి. ఒక గుర్రం అతివేగంగా వచ్చింది. గుంపును ఏమాత్రం పట్టించుకోక గుంపును చీల్చుకొని ముందుకు దూసుకొచ్చింది. గుర్రం కాళ్ళ కింద పడకుండడానికి జనాలు పక్కకు జరిగి దారి విడిచారు. "యువ శంబువరయ్యర్" అని కొందరు అరిచారు. అవును; వచ్చింది గందమారనే! గుంపులో ఉన్నవారు అడిగిన ప్రశ్నలకు బదులు చెప్పక వేగంగా వెళ్ళి కోట వాకిట గుర్రాన్ని నిలిపి కిందకు దూకాడు. అక్కడ నిలబడ్డ శంబువరయ్యర్ని, పళువేట్టరయ్యర్ని చూసి నమస్కరించి, "యువరాజు వస్తున్నారు. కానీ

చిత్తం అంతగా స్వాధీనంలో లేదు. ఉన్నట్లుండి కోపగించుకొంటున్నారు. ముందుగా హెచ్చరించేందుకే వచ్చాను. మంచిగా రాజోపచారాలు చేసి స్వాగతించాలి. ఆయన ఏమైనా తారుమారుగా మాట్లాడినా కూడ బదులు చెప్పకుండడం మంచిది!" అన్నాడు. ఇలా చెప్పేసి, అక్కడ నిలబడకుండ తల పైకెత్తి చూశాడు. ముందు వాకిలి గోపురం పైనున్న మేడలో అంతఃపురస్త్రీలు వేచివుండడం కనిపించింది. వెంటనే కోట లోపలికి వెళ్ళి అక్కడ ఒక వైపున్న మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

స్త్రీలున్న స్థలాన్ని చేరిన వెంటనే అతని కళ్ళు తక్కినవారిని పట్టించుకోక నందిని దేవినే వెతికి పట్టుకొన్నాయి. ఆమె దగ్గరకు వెళ్ళి, "దేవీ! తమ కోరికను నెరవేర్చాను. యువరాజును పిలుచుకొని వచ్చాను. అదిగో వస్తున్నారు. కానీ మదించిన ఏనుగులాగున్నారు. ఆయనను ఎలా సంభాళించబోతున్నామో తెలియడం లేదు!" అన్నాడు.

"అయ్యా! దాని గురించేం దిగులు? మదించిన ఏనుగును అదుపులో పెట్టేందుకు మీ సహోదరి రెండు కళ్ళనే అంకుశాలున్నాయిగా!" అన్నది నందిని.

మణిమేఖల ఖంగుతిని, "అక్కా! ఇదేం మాట!" అన్నది.

గండమారన్, "మణిమేఖలా! పళువూర్ యువరాణి మాటల్లో తప్పేమీ లేదే! ఆదిత్య కరికాలన్ వంటి వీరాధివీరుని పతిగా పొందేందుకు తపస్సు చేయాలి కద?" అన్నాడు.

మణిమేఖల బదులు చెప్పేలోపు నందిని అడ్డుపడి, "అయ్యా! యువరాజుతో ఇంకెవరైనా వస్తున్నారా?" అని అడిగింది.

"అవును! పార్థిబేంద్ర పల్లవుడు, వంతిదేవుడు వస్తున్నారు..."

నందిని మణిమేఖలవైపు ఒక ప్రత్యేకమైన చూపు విసిరి, "ఏ వంతిదేవుడు? మీ స్నేహితుడని చెప్పారే, అతడేనా?" అని అడిగింది.

"అవును; నన్ను వెన్నుపోటు పొడిచిన ఆ పరమ స్నేహితుడే. వాడు ఎక్కడినుంచో, ఎలాగో కొట్టుకొచ్చి వెళ్ళాట్రం కరై (వెళ్ళారు నదీతీరం) దగ్గర మాతో వచ్చి చేరుకొన్నాడు. యువరాజు ముఖం చూసి ఊరుకొన్నాను. లేకపోతే అక్కడే వాడిని నా కత్తికి ఎర చేసేవాడిని!" అన్నాడు.

మణిమేఖల ముఖం చిన్నబోయి, భృకుటి ముడిపడింది. "అన్నా! ఆయన నిన్ను వెన్నుపోటు పొడిచింది నిజమైతే ఆయనను ఈ మాళిగ లోపలికి ఎందుకు రానివ్వాలి?" అన్నది.

"ముద్దూ! నీవూరుకో! అదంతా మగవాళ్ళ విషయం. నిన్న దెబ్బలాడుకొన్నవారు ఈరోజు ఒకరినొకరు కౌగలించుకొని పొర్లాడుతారు!" అన్నది నందిని.

గండమారన్ చిరునవ్వు నవ్వి, "అలాగేం లేదు. యువరాజు ముఖం చూసి ఊరుకోవలసి వచ్చింది. ఓహో! బుట్టల నిండా పూలు తీసుకొచ్చారా! మీరిక్కడినుంచి కురిపించే పూలవాన యువరాజు కోపాన్ని చల్లార్చి శాంతింపజేస్తుంది! నేను కిందకు వెళుతున్నాను!" అని చెప్పేసి గబగబా మెట్లు దిగి

వెళ్ళాడు.

~

ఆ ముఖద్వారం పైమేడనుంచి చూసినప్పుడు కనుచూపు మేర విస్తరించిన ఆ జనసముద్రం మధ్య, సుడిగాలి వల్ల ఏర్పడే సుడిగుండంలాగ ఒక చోట కనిపించింది. ఆ సుడిగుండంలో చిక్కుకొన్న నావలాగ మూడు గుర్రాలు, వాటిపైన ముగ్గురు వీరులు అప్పుడప్పుడు కనిపించి, మళ్ళీ జనసముద్రంలో మరుగవుతున్నారు.

అలా ఏర్పడిన సుడిగుండం పైపైకి పయనించి కోటద్వారాన్ని సమీపించింది. చివరిగా, కోట ముఖద్వారాన్ని చేరింది.

ఆ ముగ్గురు వీరులు - ఆదిత్య కరికాలన్, పార్థిబేంద్రుడు, వంతిదేవుడు - వెంబడి వచ్చిన అశ్వ, గజ పరివారాలన్నీ జనసముద్రాన్ని దాటి రాలేక చాల వెనకబడిపోయాయి.

గుర్రాలు వచ్చి మాళిగ వాకిట ఆగగానే ఒక పెద్ద ఘోష లేచింది. ఇరవై భేరీలు, రెండు వందల కొమ్ముబూరాలు, మూడు వందల తప్పెటలు, అయిదు వందల తప్పెళాలనుంచి లేచిన అ మహాఘోష జసముద్రఘోషను కొంతవరకు అణచివేసింది.

వాద్యఘోష కాసేపటి తర్వాత ఉన్నట్లుండి ఆగిపోయింది.

అప్పుడు నెలకొన్న నిశ్శబ్దంలో వందిమాగధుడొకడు పైమేడ పక్కనున్న ఇంకొక మేడపైన నిలబడి పిడుగులాంటి గొంతుతో ఇలా ఘోషించాడు:

“సూర్యవంశంలో పుట్టిన మనుమాంధాత, అదే వంశంలో పావురం కోసం తన శరీరాన్నే కోసిచ్చిన శిబి చక్రవర్తి, శిబి చక్రవర్తి తర్వాత ఉదయించిన రాజకేసరి, ఆయన కుమారుడు పరకేసరి, ఆవుకు న్యాయం చేకూర్చేందుకు తన కుమారునే బలిచ్చిన మనునీతి చోళులు, హిమవన్నగం పైన పులిజెండాను నాటిన కరికాల్ పెరువళత్తాన్, నలంకిళ్ళి, నెడుంకిళ్ళి, పెరువన్‌కిళ్ళి, కిళ్ళి వలవన్, కిళ్ళివాళవన్, డెబ్బైయారు శివాలయాలను కట్టించిన కోప్పెరుంచోళుల వీర పరంపరలో పుట్టి, తొంబైయారు యుద్ధగాయాలను భరించిన పళైయారై విజయాలయవర్మ, ఆయన కుమారుడు సస్యపర్వతంనుంచి పుహార్ నగరం వరకు కావేరి నదీతీరం వెంబడి ఎనబైరెండు శివాలయాలను కట్టించిన ఆదిత్య చోళులు, ఆయన కుమారుడు రెట్టిమండలపు కణ్ణర దేవర సైన్యాన్ని తుడిచిపెట్టిన మహావీరులు, ఆయన కుమారుడు లంకనుంచి సీడపులినాడు వరకు ఒకే ఛత్రం కింద ఏలిన పరాంతక సుందర చోళ చక్రవర్తి, ఆయన ప్రథమ పుత్రుడు - ఉత్తరదేశపు మాతండ నాయకుడు - యువరాజు - వీరపాండ్యుని తలగొన్న ఆదిత్య కరికాల్ చోళులు విజయం చేస్తున్నారు! పరాక్! బహుపరాక్!”

వెంటనే వాడి పక్కనున్న ఇంకొక వందిమాగధుడు, “కొరివి పర్వతానికి రాజు - ఒకే బాణంతో సింహాన్ని, ఎలుగుబంటిని, జింకను, పందిని చేర్చి కొట్టిన వీరుడు వల్‌విల్ ఓరి - ఆయన పరంపరలో

పుట్టిన రాజాధిరాజు, రాజమార్తాండ వీర గంభీర శంబువరయ్యర్ - చోళ చక్రవర్తి కులానికి ఎన్నడూ తోడుగా నిలబడ్డవారు - తమ చిన్న మాళిగకు వేంచేయమని పట్టపు రాకుమారులు ఆదిత్య కరికాలన్‌వారిని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు!" అని ఘోషించాడు.

అతడలా ఘోషించి ఆపిన వెంటనే మేడపైనుంచి పూలవర్షం కురిసింది. ఆదిత్య కరికాలన్, వంతిదేవుడు తల పైకెత్తి చూశారు. అక్కడున్న స్త్రీల సుందరవదనాల మధ్య వంతిదేవునికి చిరునవ్వుతో విప్పారిన మణిమేఖల ముఖం మాత్రం కనిపించింది. వంతిదేవుడు కూడ ఒక్క క్షణం చిరునవ్వు నవ్వాడు. అది ఎంతటి పొరబాటో వెంటనే గ్రహించి ఇంకొక వైపు దృష్టి సారించాడు.

అదే సమయాన పైకి చూసిన ఆదిత్య కరికాలన్ ముఖాన చిటపటలు అధికమైనాయి. అతడు గుర్రంపైనుంచి కిందకు దూకాడు.

తక్కిన ఇద్దరు కూడ తమ గుర్రాలమీదినుంచి కిందకు దిగారు.

ఇంతలో వాద్యఘోష మళ్ళీ మొదలైంది. కాసేపటివరకు అణిగివున్న ప్రజల కోలాహలం కూడ మళ్ళీ లేచింది.

అతిథులు, వారిని స్వాగతించేందుకు కోట వాకిట నిలబడ్డవారు లోపలికి ప్రవేశించారు. వెంటనే కోట వాకిలి ద్వారాలు ధడేల్మని మూయబడ్డాయి.

ఆదిత్య కరికాలన్ వెనక్కి తిరిగి చూసి, "ఎందుకింత తొందరగా తలుపులు మూసేస్తున్నారు? తంజావూరులో నా తండ్రిని చెరలో ఉంచినట్లు నన్ను కూడ ఇక్కడ చెరలో ఉంచబోతున్నారా, ఏమి? నాతో వచ్చిన పరివారాల గతేమి?" అని అడిగాడు.

ఇద్దరు ముసలివాళ్ళూ కొన్ని క్షణాలపాటు అవాక్కై నిలబడ్డారు.

పళువేట్టరయ్యర్ ముందుగా తేరుకొని, "యువరాజా! ఈ చోళ సామ్రాజ్యంలోని లక్షలాది ప్రజల ప్రేమతో నిండిన హృదయాలే తమనీ, తమ తండ్రిని చెరపట్టివున్నాయి. ప్రత్యేకంగా చెరలో ఉంచడమెందుకు?" అన్నారు.

"యువరాజా! తమ దర్శనం కోసం వచ్చిన మహాజనకూటమి నా ఈ చిన్న గుడిసెలో దూరితే ఏం గతి? వాళ్ళు బయట నిలబడ్డప్పుడు చుట్టుపక్కలున్న తోపులు కోతులు నాశనం చేసిన మధువనంలాగ అయిపోయాయి. జనకూటమి వెనుదిరిగిన తర్వాతే తమ పరివారాలను లోపలికి పిలుచుకొని వస్తాము. అంతవరకు మీకు కావలసిన సౌకర్యాలను చేసి పెట్టేందుకు ఇక్కడ పనివాళ్ళున్నారు..." అన్నారు శంబువరయ్యర్.

ఆ సమయాన కోట వాకిలి బయట ప్రజల కోలాహలం అధికమవుతున్నట్లు వినిపించింది.

కరికాలన్ గందమారన్ని, "ముఖద్వారం పైమేడకు వెళ్ళేందుకు దారేది?" అని అడిగాడు.

గందమారన్ మెట్లపైపు వేలెత్తి చూపించగానే కరికాలన్ వడివడిగా అటువైపు నడిచి వెళ్ళాడు.

గందమారన్, పార్థిబేంద్రుడు, వంతిదేవుడు కూడ వెంట వెళ్ళారు.

శంబువరయ్యర్ పళువేట్టరయ్యర్ని చూసి, "ఇదేమి? దారి వెంబడి వెళుతున్న శనిని డబ్బిచ్చి కొనుక్కొన్నట్లు మన తలల మీదికి తెచ్చుకొన్నామే? వీడి బుద్ధి సరిగ్గా ఉందనే అనిపించడం లేదు కద? చిన్న పిల్లల మాట విని ఈ కార్యంలో తల దూర్చినట్లున్నామే?" అన్నారు.

"అలా ఏం పెద్ద అవాంతరం జరగబోతుంది? కార్యం సఫలమైతే కానీ, లేకపోతే పోనీ" అన్నారు పళువేట్టరయ్యర్.

"కార్యం గురించి నేను మాట్లాడడం లేదు. మన ఇంట్లో ఉన్నప్పుడు ఏదైనా తారుమారుగా జరగకూడదు కద? శకునాలేవీ సరిగా లేవు. వాడేమో మదించిన ఏనుగులాగున్నాడు. ముఖాన కటువుతనం, నాలుకమీద విషాన్ని చూశారు కద?"

"కొన్నాళ్ళపాటు పళ్ళు గిట్టకరుచుకొని ఓర్చుకోవలసిందే. ఆ పల్లవుడు వాడిని అదుపులో ఉంచేందుకు సహాయపడతాడు. ఇంకొక దుష్టుడు వాడి వెంటే వచ్చాడు చూశారూ? వాడే నాకు నచ్చలేదు. వాడు గూఢచారి అని కూడ నాకు సందేహముంది. మునుపు మనం ఇక్కడ సమావేశమైనప్పుడు కూడ ఇక్కడకు వచ్చాడు కద? నిన్న సాయంత్రం చెట్ల వెనక దాక్కొని నిలబడ్డది కూడ వాడే!"

"వాడు నా కొడుకు స్నేహితుడు కద? కాబట్టి వాడి గురించి భయం లేదు. ఇప్పుడు స్త్రీలున్న అంతఃపురానికి ఎందుకు తొందరగా వెళుతున్నాడు? మనం కూడ వెళదామా?"

ఈ సమయాన మెట్లదాక వెళ్ళిన పార్థిబేంద్రుడు వెనుదిరిగి ఆ ఇద్దరు పెద్ద సామంతరాజులు నిలబడ్డ చోటును సమీపించాడు. శంబువరయ్యర్ చివరిగా అన్న మాటలు కూడ అతడి చెవిన పడ్డాయి.

"అయ్యా! యువరాజు విషయంలో మీకు ఇంకే సందేహమున్నా కూడ, స్త్రీల విషయంలో మాత్రం సందేహమవసరం లేదు. ఆయన స్త్రీలను కన్నెత్తి కూడ చూడరు..." అన్నాడు.

పళువేట్టరయ్యర్ చిరునవ్వుతో, "అలాగైతే ఆయనను మేమిక్కడికి ఆహ్వానించిన ఉద్దేశం ఎలా నెరవేరుతుంది?" అని అడిగారు.

"అది శంబువరయ్యర్‌గారి కుమార్తె అదృష్టం మీద, చోళ సామ్రాజ్యం అదృష్టం మీద ఆధారపడివుంటుంది...."

"పార్థిబేంద్రా! మణిమేఖల అదృష్టం ఒకవైపుండనీ! వస్తున్నప్పుడే యువరాజెందుకిలా ముఖం గంటు పెట్టుకొని వచ్చారు? ఎందుకిలా విషపూరిత భాషణాలాడుతున్నారు? ఆయనను నీవు ఎలాగైనా సమాధానపరిచి ఇక్కడినుంచి తీసుకొని వెళ్ళిపోతే చాలనిపిస్తూంది!" అన్నారు శంబువరయ్యర్.

"వెళ్ళం నదీతీరం వరకు యువరాజు సుముఖంగాను, కుతూహలంగాను వచ్చారు. తర్వాత వంతిదేవుడు, ఒక వైష్ణవుడు వచ్చి చేరారు. వారేదో చెప్పివుండాలి. అప్పటినుంచి యువరాజు పోకడ మారిపోయింది..."

“మేమూ అలాగే అనుకొన్నాము. ఇప్పుడేం చేయడం? ఆ చెడ్డ పిల్లాడు మీతో మళ్ళీ వచ్చినట్లున్నాడు కద?”

“మీరు కాస్త ఓపిక పట్టండి. నేనంతా సరి చేస్తాను. వాడితో నాకూ ఒక దెబ్బలాట బాకీ ఉంది. సమయం చూసి తీర్చుకొంటాను" అన్నాడు పార్థిబేంద్రుడు.

~

కరికాలన్, అతని ఇద్దరు స్నేహితులు ముఖద్వారం పైమేడకు వెళ్ళినప్పుడు అక్కడున్న స్త్రీలు కిందికి దిగి వచ్చే సమయం.

కరికాలన్ గందమారన్ని చూసి, “మిత్రమా! తల్లులందరూ మన కోసం ఇక్కడికి వచ్చి వేచివుండేటట్లు చేయవచ్చా? అది చాల పొరపాటు. మనం కద వారి నివాసస్థలానికి వెళ్ళి మన వందనాలు సమర్పించాలి?” అని చెప్పి స్త్రీమణులకు నమస్కరించి దారి వదిలి పక్కకు నిలబడ్డాడు. ఒక్కొక్కరు దిగిరాగా గందమారన్ని వారెవరని అడిగి తెలుసుకొన్నాడు. నందినిని చూడగానే, “ఓ! పళువూర్ యువ వృద్ధురాలు కద? నిజంగానే వచ్చారా? చాల సంతోషం!” అన్నాడు. నందిని బదులు చెప్పక, ఒక తీక్షణ వీక్షణాన్ని అతడి వైపు విసిరి, కిందకు దిగి వెళ్ళింది. ఆ చూపుల తీక్షణత కరికాలన్ ఒంటిని కాస్త వణికించింది. మరుక్షణమే సంభాళించుకొని, ఆమె వెనకే వచ్చిన మణిమేఖలను చూసి, “ఓహో! ఈమె నీ చెల్లెలు మణిమేఖలైవుండాలి. చిత్రాలలో వర్ణించే గంధర్వ కన్యలాగుంది. ఈమెకు త్వరలో ఒక మంచి వరుని చూసి పెళ్ళి చేయాలి!” అన్నాడు. మణిమేఖల సిగ్గుతో వాలిన కళ్ళతో వంతిదేవుని కడగంటి చూపుతో చూసేసి గబగబా కిందకు దిగి వెళ్ళింది.

స్త్రీలందరూ వెళ్ళిన తర్వాత కరికాలన్ ఆ పైమేడ ముందు భాగానికి వెళ్ళి నిలబడ్డాడు. వాకిట అప్పుడప్పుడే చెదరుతున్న జనకూటమిలో మళ్ళీ కుతూహలభరితమైన  కోలాహలం లేచింది. జనాలు మళ్ళీ కోట వాకిలి దగ్గరకు రాసాగారు. ఆ మేడకు చేరినట్లున్న ఒక పొడవైన డాబామీద ఒక వందిమాగధుడు నిలబడివుండడాన్ని కరికాలన్ గమనించాడు. అతడిని సైగతో దగ్గరకు రమ్మన్నాడు. రాగానే ప్రజలకు కొన్ని విషయాలను తెలియజేయమని చెప్పాడు. వందిమాగధుడు మళ్ళీ భేరీని కొన్ని సార్లు మోగించాడు. తర్వాత ప్రజలను నిశ్శబ్దంగా ఉండమని సైగ చేశాడు. ఆదిత్య కరికాలన్ బిరుదుల్లో కొన్నిటికి వదిలి పెట్టి, మరి కొన్నింటిని మళ్ళీ చదివి, “అటువంటిచోళ కుల దీపమైన యువరాజు ఈ కడంబూర్ మాళిగలో ఒక వారం, పది రోజులపాటు విడిది చేస్తారు. చుట్టుపక్కలున్న ఊళ్ళన్నిటికీ విజయం చేస్తారు. అప్పుడు ఆయా ఊరి ప్రజలను ప్రత్యక్షంగా పరామర్శించి వారి కష్టనష్టాలను తెలుసుకొంటారు!” అన్నాడు.

అంతే! ఇంతవరకు ఆ జనసముద్రంనుంచి లేచిన కోలాహలమంతా పిచ్చుక కూత అని అనిపించేటట్లు ఒక పెద్ద కోలాహలం లేచింది. కుతూహల స్వరాలు, దీవించే స్వరాలు కలివిడిగా ఘోషించగా

అ శబ్దం చుట్టుపక్కల చాల దూరం వరకు వ్యాపించి వీరనారాయణపురం చెరువు డెబ్బైనాలుగు కాలువలనుంచి పారే నీటి హోరును మరిపించేటట్లు చేసింది.

~

పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్, పార్థిబేంద్రుడు ఇంత క్రితం నిలబడ్డ చోటే ఇంకా నిలబడివున్నారు. ఆదిత్య కరికాలన్ వారిని సమీపించగానే, “పార్థిబేంద్రా! నీవెందుకిక్కడ నిలబడివున్నావు? ఈ ముసలివాళ్ళతో చేరి నీవు కూడ కుట్ర పన్నుతున్నావా, ఏమి?” అన్నాడు.

వృద్ధులిద్దరూ అదిరిపడి కరికాలన్ ముఖాన్ని చూశారు. అతని ముఖాన చిరునవ్వు చిందులేస్తూంది.

~

శంబువరయ్యర్ కాస్త తేరుకొని, “రాకుమారా! కాసేపటి క్రితం చెర అన్నారు. ఇప్పుడు కుట్ర అంటున్నారు. ఈ గుడిసెలో మీరు అతిథిగా విడిది చేసినంతకాలం మీకు ఇసుమంతైనా కీడు కలగదని ఆన చేసి చెబుతున్నాను. అలా జరిగే మునుపు నా ఈ శరీరం నుంచి నా ప్రాణం విడిచి వెళ్ళిపోతుంది!” అన్నారు.

“అయ్యా! నాకేమైనా హాని కలుగుతుందని నేను భయపడుతుందనుకొంటున్నారా? ఒక లక్ష పాండ్యదేశపు  శత్రుసైనికుల మధ్య ఉన్నప్పుడు కూడ భయపడలేదు. నా ప్రియమిత్రుల మధ్య ఉన్నప్పుడు భయపడనేల? కానీ ఈ మీ మాళిగను గుడిసె అనకండి! ఆహా! దీని చుట్టూ ఉన్న గోడలు ఎంత ఎత్తైనవి? ఎంత పొడవైనవి? తంజావూర్ కోట గోడ కన్న పెద్దవని చెప్పాలి కద? ఏ పగవారిని ఎంచి ఇంత గట్టి కోట కట్టించారు?” అన్నాడు కరికాలన్.

“యువరాజా! మాకు ప్రత్యేకంగా శత్రువులెవరూ లేరు. చోళకుల శత్రువులు మా శత్రువులు; చోళ కుల మిత్రులు మాకు కూడ మిత్రులే.”

“మీ హామీ నాకు చాల సంతోషాన్నిస్తూంది. దీన్ని మీ కుమారుడు గందమారన్‌కి కూడ చెప్పి పెట్టండి. నా స్నేహితుడైన వాణర్ కుల రాకుమారుని గందమారన్ తన పగవాడని భావిస్తున్నాడు. ఇది పెద్ద సమస్య కద?” అని ఆదిత్య కరికాలన్ అనగా, గందమారన్ తల వంచుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 16

## మలైయమాన్ దిగులు

**మాళిగకు**, కోట ప్రాకారపు  గోడకు మధ్యనున్న వెన్నెల బయలులో గందమారన్ దారి చూపుతూ ముందు వెళ్ళగా, ఆదిత్య కరికాలన్ చుట్టుపక్కల పరికించి చూస్తూ వెంట నడిచాడు. తక్కిన నలుగురు  కూడ వెంట వెళ్ళారు.

కురవై ఆట కోసం ఏర్పాటు చేసిన మేడ, కొట్టాలున్న చోటుకు రాగానే కరికాలన్ ఆగాడు.

"ఓహో! ఇదేమి? ఇక్కడేం జరగబోతోంది?" అని అడిగాడు.

"రాకుమారా! తమకిష్టమైతే ఇక్కడ కురవై ఆట ఏర్పాటు చేద్దామని ఉద్దేశం..."

"ఆహా! చాల మంచిది! కురవై ఆట ఏర్పాటు చేయండి. పాటలు పాడించండి. కరికాల్ వలవన్ కథ, విజయాలయ చోళుల కథ అంతా జరిపించండి. పగలంతా అడవిలో వేటతో గడుపుదాం. రాత్రంతా ఆటపాటలతో గడుపుదాం. నా తాతగారు మలైయమాన్ నాకు ఏం చెప్పి పంపించారో తెలుసా? కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో ఉన్నప్పుడు, "రాత్రి నిద్రపోకు!' అని హెచ్చరించారు. నేను నా తాతగారికి ఏం బదులు చెప్పానో తెలుసా? 'తాతా! నేను పగలు నిద్రపోను; రాత్రికూడ నిద్రపోను. నేను నిద్రించి మూడేళ్ళు కావస్తోంది. కాబట్టి నేను నిద్రపోతున్నప్పుడు విరోధులు నాకేమైనా హాని చేస్తారని భయపడకు. నేను మెలకువగా ఉన్నప్పుడే నాకెవరైనా హాని చేయ సాధ్యం. అంతటి తెగింపున్న/తెంపరితనమున్న మగవాడెవడున్నాడు? ' అని మలైయమాన్‌కి ధైర్యం చెప్పి వచ్చాను!" అని చెప్పి గడగడ ఒళ్ళు కదిలేలాగ నవ్వాడు కరికాలన్.

శంబువరయ్యర్ కోపంతో వణుకుతున్న గొంతుతో, "అయ్యా! మీరు నిద్రించినా సరే, మెలకువగా ఉన్నా సరే - ఈ మాళిగలో ఉన్నంతవరకు ఎవడూ మీకు హాని చేయ తెగించడు!" అన్నారు.

"అవునవును! కడంబూర్ మాళిగలో నాకు హాని చేయగలవారెవరు ఉండగలరు? లేక, బయటినుంచి ఇంతెత్తు ప్రాకారపు గోడలను దాటి ఎవరు రాగలరు? యముడు కూడ రాలేడు. కడంబూర్ శంబువరయ్యర్ అంటే యముడు కూడ భయపడుతాడు కద? ఆ తిరుక్కోవలూర్ మలైయమాన్ దిగులు గురించి మీకు అనవసరంగా చెప్పాను. వయసైపోయింది కద? కొంతమందికి వయసు మీద పడితే మనోధైర్యం సన్నగిల్లుతుంది. కానీ నా పళువూర్ తాతను చూడండి! ఎంత స్థైర్యంతో నడిచి వస్తున్నారు? అరవై ఏళ్ళు దాటినవారని ఎవరైనా చెప్పగలరా?!" అని చెప్పేసి చిరునవ్వు నవ్వాడు.

పళువేట్టరయ్యర్ ఇందుకు ఏదైనా సమాధానం చెప్పాలని గొంతు సవరించుకొన్నారు. అది సింహగర్జనలాగ మోగింది.

"చూడండి! పెద్ద పళువేట్టరయ్యర్ గొంతు సవరించుకొంటేనే సింహగర్జనలాగుంది! గందమారా! వంతిదేవా! పార్థిబేంద్రా! మీరంతా పళువూర్ తాత వయసులో ఇంత గట్టిగా ఉంటారేమో ఆలోచించి చూడండి ఒకవేళ వారిలాగ గొంతు సవరించుకొంటారు. కానీ ఆయనలాగ అంతఃపురానికి పడుచుపిల్లను తేలేరు. తాతా! మీతో యువరాణిని కూడ వెంట తెచ్చారు లాగుందే! ముఖద్వారం పైమేడలో చూశాను! యువరాణి ఎలా ప్రయాణం చేసి వచ్చారు? మూసిన పల్లకిలోనా? రథంలోనా? లేక ఎడ్లబండిలోనా?"

పళువేట్టరయ్యర్ అప్పుడు అడ్డుపడి, "ఏనుగు అంబారీలో అందరికీ తెలిసేలాగ పిలుచుకొని వచ్చాను!" అని గర్వంగా చెప్పుకొన్నారు.

"అలాగే చెయ్యాలి, తాతా! ఇకమీద ఎప్పుడూ అలాగే చెయ్యండి! మూసిన పల్లకిలో మాత్రం పిలుచుకొని రావద్దండి! అందువల్ల అనేక వదంతులు పుడుతున్నాయి. ఒక తమాషా వినండి. పళువూర్ యువరాణి మూసిన పల్లకిలో నా చిన్నాన్న మధురాంతకుడు రహస్యంగా ఊరూరా తిరిగి వస్తున్నాడట! ఇలా ఒక వదంతి/పుకారు దేశమంతా వ్యాపించివుంది!" అని చెప్పేసి పిడుగు పడ్డట్లు నవ్వాడు ఆదిత్య కరికాలన్.

కానీ అక్కడున్న తక్కినవారెవరూ నవ్వలేదు. ఒక్కొక్కరి ముఖాన ఒక్కొక్క విధమైన కలత పొడసూపింది.

వంతిదేవుడు తన మనసులో, "అయ్యో! ఎంత పెద్ద పొరబాటు చేసేశాం! ఈ పిచ్చిపట్టిన మనిషికి అన్నీ చెప్పేశామే! ఒక్కటీ మిగల్చకుండ అన్నిటినీ బహిరంగ పరిచేస్తారులాగుంది!" అని గాభరా పడ్డాడు.

పెద్ద పళువేట్టరయ్యర్ మనసు అగ్నిపర్వతంలాగ కుతకుతలాడసాగింది. నిప్పు, పొగ అగ్నిపర్వతం నోటినుంచి బయటకు పేలే మునుపు పుట్టే భయంకరమైన ఉరుములాగ ఆయన మళ్ళీ గొంతు సవరించుకొన్నారు.

ఆయన నోరు తెరిచేలోపు పార్థిబేంద్రుడు ఒకడుగు ముందుకు వేసి, "రాకుమారా! పళువూర్ యువరాణిని నేను చాల కొద్దిసేపు మాత్రమే చూసి మాట్లాడే అవకాశం కలిగింది. ఆ కాసేపటిలోనే వారు ఎటువంటి పరమపత్ని అన్నది గ్రహించాను. పళువూర్ యువరాణి మీద ఎవరైనా అపనింద మోపితే వాడిని నా కత్తికి ఎర చేస్తాను! ఇది నా ప్రమాణం!" అన్నాడు.

గందమారన్ ఒకడుగు వెనక్కి వేసి, "నా చేతి కత్తి తీయనవసరమే లేదు. అలా మాట్లాడినవాడిని ఒట్టి చేతులతోనే గొంతు నులిమి చంపేస్తాను!" అన్నాడు.

ఇది విన్న వంతిదేవుడు కూడ ఒకడుగు ముందుకు వేసి, "నేనూ అంతే! పళువూర్ యువరాణి గురించి ఎవరైనా నిందాపూర్వకంగా మాట్లాడితే వాడిని నా కళ్ళతోనే కాల్చి చంపేస్తాను!" అన్నాడు.

"ఆహా! కాస్త ఓపిక పట్టండి, మిత్రులారా! నాతోనే యుద్ధానికి దిగుతారులాగుందే! చూశారా

తాతా! తమిళ కులస్త్రీల గౌరవాన్ని, మర్యాదను కాపాడేందుకు వీళ్ళు ఎంత రోషంతో ముందుకువస్తున్నారో! కానీ పళువూర్ యువరాణి గురించి ఎవరూ అపనిందలు చెప్పలేదు. చెబితే నేనూ వింటూ ఊరుకోను. ఈ వీరాధివీరులు వచ్చేవరకు అలా అపనిందలు చెప్పినవాడిని ప్రాణాలతో వదలను. పళువూర్ యువరాణి మూసిన పల్లకి గురించి మాత్రమే వదంతులు చెబుతున్నారు! ఆ పిరికిపంద మధురాంతకుడు పళువూర్ యువరాణి మూసిన పల్లకిలో రహస్యంగా ఊరూరా తిరుగుతున్నాడట! ఎప్పుడు ఒక మగవాడు మూసిన పల్లకిలో ప్రయాణం చేస్తాడో, అప్పుడు యువరాణి కూడ అలా ప్రయాణం చేస్తే కొన్ని అనర్థాలు కలగవచ్చు కద?"

"రాకుమారా! పరాంతక చక్రవర్తి మనుమడు, గండరాదిత్యుల కుమారుడైన మధురాంతక దేవరు మూసిన పల్లకిలో ఎందుకు ప్రయాణం చేయాలట? నాకేమీ అర్థం కావడం లేదే?" అన్నాడు పార్థిబేంద్ర పల్లవుడు.

"దానికి కారణం కూడ ఒక వింతైన కారణమే! మధురాంతకుడు మూసిన పల్లకిలో ఎక్కి ఊరూరా తిరిగి తన పక్షానికి బలం చేకూర్చుకొంటున్నాడట...!"

"ఎందుకని బలం చేకూర్చుకోవడం?"

"ఎందుకా? నా తండ్రి తర్వాత చోళ సింహాసనమెక్కడానికే! ఎలా ఉంది కథ? కొన్ని నెలల క్రితం ఈ కడంబూర్ మాళిగకు కూడ అలా రహస్యంగా మూసిన పల్లకిలో వచ్చాడట. మధ్యరాత్రి కుట్రాలోచన కూటమి ఒకటి ఇక్కడ జరిగిందట. పార్థిబేంద్రా! తిరుక్కోవలూర్ తాత నీవు కూడ నాతో ఉన్నప్పుడే కద ఇదంతా చెప్పారు? మధురాంతకునికి సింహాసనమెక్కే కుతూహలం వచ్చి తొందరపడి నా తండ్రిని స్వర్గానికి శీఘ్రంగా పంపించేసినా ఆశ్చర్యం లేదని కూడ చెప్పారు కద? అదంతా గుర్తు లేదా?"

"గుర్తుకొస్తూంది యువరాజా! అదంతా నేనప్పుడు నమ్మలేదు. ఇప్పుడేమో కించిత్తుకూడ నమ్మడం లేదు. తంజావూరుకు వెళ్ళి తమ తండ్రిని ప్రత్యక్షంగా దర్శించి వచ్చిన తర్వాత..."

"నీవు మాత్రమా? నేను కూడ నమ్మలేదు. నమ్మివుంటే ఈ కడంబూర్ మాళిగకు అతిథిగా వచ్చేవాడినా?" అని చెప్పి కరికాలన్ ఏదో గుర్తు తెచ్చుకొన్నవాడిలాగ సన్నగా నవ్వాడు.

కడంబూర్ శంబువరయ్యర్ గొంతు సవరించుకొని, "రాకుమారా! తిరుక్కోవలూర్ మలైయమాన్ కులానికి, మా కులానికి మధ్య చాల కాలంగా వైరుధ్యమని మీకు తెలుసు!" అన్నారు.

"తెలియకేం? ఆ విరోధం గురించి సంగమ కవులు పాటలు రాసి పాడారు కద? కొల్లిమలై వలవన్ ఓరిని మలైయమాన్ తిరుముడిక్కారి యుద్ధంలో చంపాడు. మీరు వల్‌విల్ ఓరి వంశ పరంపరలో వచ్చినవారు. కాబట్టి ఆ విరోధాన్ని ఇంకా విడిచిపెట్టక పొడిగిస్తున్నారు..."

"రాకుమారా! వల్‌విల్ ఓరి మరణానికి వెంటనే పగ తీర్చుకొన్నారు. వల్‌విల్ ఓరి బంధువైన అదియమాన్ నెడుమానాంజి తిరుక్కోవలూర్ మీద దండెత్తి వెళ్ళి ఆ ఊరిని నేలమట్టం చేశాడు;

మలైయమాన్ ముళ్ళూర్ మలై [=కొండ] కోటను కూడ తుడిచిపెట్టాడు..."

"శంబువరయ్యరే! అదియమాన్ ఒంటరిగా ఆ కార్యాన్ని సాధించలేదు. నా పూర్వీకుడైన చోళుడు కిళ్ళి వళవన్ సహాయం తీసుకొనే మలైయమాన్ పైన అదియమాన్ విజయం సాధించాడు. ఆ పాత కథలన్నీ ఇప్పుడెందుకు?"

"మేము మరిచిపోయినా, మలైయమాన్ మరవడం లేదు. మాపైన ఏదో ఒక నింద మోపుతూనే ఉంటాడు..."

"నేను చెప్పాను కద? ఆయనకు వయసు మీద పడింది; కాబట్టి బుద్ధి కూడ తడబడుతూంది. నేనిక్కడ ఉన్నప్పుడు నాకే అపాయమూ కలగకూడదని ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని రాకుండ ఉండాలి కద అని కూడ నాకు దిగులుగా ఉంది..."

"యువరాజా! మీకలా సందేహం ఉంటే..." అని శంబువరయ్యర్ తడబడుతూ ఏదో చెప్పబోయారు.

"నాకు సందేహమా? లేనేలేదు. మలైయమాన్‌తో మా సంబంధం రెండు తరాలనుంచి మాత్రమే. పళువేట్టరయ్యర్లతో మా సంబంధం ఆరు తరాలుగా కొనసాగి వస్తోంది. పళువూర్ రాజే ఇక్కడికి వేంచేశారు కద? ఆయన చోళకులానికి విరుద్ధంగా ఏదైనా చేస్తారని అనుకోవడానికి నాకేమైనా పిచ్చి పట్టిందా?" అనేసి కరికాలన్ ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

పళువేట్టరయ్యర్ గంభీర స్వరంతో, "యువరాజా! చోళ కులానికి విరుద్ధంగా నేను ఏమీ చేయను; ఇది సత్యం. ధర్మానికి, న్యాయానికి విరుద్ధంగా కూడ ఎప్పుడూ ఏదీ చేయను. ఇది రెండింతలు సత్యం!" అన్నారు.

"అవునవును. ధర్మం, న్యాయం అని ఒకటి ఉండనే ఉంది. దాని గురించి మీతో మాట్లాడి తెలుసుకోవడానికే వచ్చాను. వేటాడే సమయం, కురవై ఆట చూసే సమయం పోగా, మిగిలిన సమయాన తీరికగా ఉన్నప్పుడు ధర్మన్యాయాల గురించి చర్చించుకొందాం. శంబువరయ్యరే! ఈ బ్రహ్మాండమైన అంతఃపురంలో నేనూ, నా స్నేహితులు విడిది చేసేందుకు ఎక్కడ ఏర్పాట్లు చేశారు?" అని అడిగాడు కరికాలన్.

"అయ్యా! తమకు, పళువూర్ రాజుకు వెనక వైపున్న భాగాన్ని పూర్తిగా కేటాయించాము. తర్వాత వచ్చే సామంతరాజులందరినీ నాతోనే ముందు భాగాన ఉండేందుకు ఏర్పాట్లు చేసుకొన్నాను..."

"ఓహో! ఇంకా సామంతరాజులు రాబోతున్నారా?"

"అవును, యువరాజా! తమను ఇక్కడ దర్శించేందుకు చుట్టుపక్కలున్న చిన్న చిన్న రాజులందరూ చాల ఆతురతతో వేచివున్నారు. చాలమంది వచ్చారు..."

"రానీ, రానీ! అందరినీ రానివ్వండి! చాల మంచిది. ఆలోచించి తీర్మానించవలసిన విషయాన్ని

ఒకేసారిగా ముగించేయవచ్చు. మధురాంతకుని కుట్రాలోచన ఒకవైపుండనీ. నేనే మీతో చేరి ఒక కుట్రాలోచన చేయాలని అనుకొంటున్నాను. దానికి ఈ మాళిగకన్న తగిన చోటింకేదీ లేదు!" అన్నాడు కరికాలన్.

~~~
~~~

# అధ్యాయము - 17

## పూంగుళలి ఆశ

**నాగపట్టణం** నుంచి కోడిక్కరై వరకు పారుతున్న ఆ కాలువలో పూంగుళలి పడవ సాగుతోంది. పూంగుళలితోబాటు సేందన్ అముదన్ కూడ ఆ పడవలో ఉన్నాడు. పడవ కోడిక్కరైని సమీపిస్తూంది.

కాలువ గట్టు వారగా బంగారు వన్నె మొగలి పూలు రేకులు విప్పి తమ సుగంధాన్ని అన్ని వైపులా వెదజల్లుతున్నాయి.

ఒక మొగలి పూవు మీద చిలుక ఒక టి ఎగిరి వచ్చి కూర్చొంది. అది వచ్చి వాలిన వేగానికి పూవు ఊయలలూగింది. చిలుక కూడ దానితోబాటు ఊగి, తర్వాత దాని బంగారు వన్నె రేకులను తన కెంపు వన్నె ముక్కుతో పొడిచింది.

పడవ దగ్గరపడగానే ఆ చిలుక 'కిక్కిక్కి' అని కూస్తూ ఎగిరి వెళ్ళిపోయింది.

"పుడితే పచ్చటి రాచిలుకగానే పుట్టాలి!" అన్నది పూంగుళలి.

"నీవలా అనుకొంటున్నావు. దానికెన్ని కష్టాలో, దిగుళ్ళో ఎవరికి తెలుసు?" అన్నాడు సేందన్ అముదన్.

"ఏ దిగులు, ఎంత కష్టం ఉన్నా కూడ ఇష్టం వచ్చినట్లు ఎల్లలు లేని ఆకాశంలో ఎగురుతూ పోవచ్చు కద? దాని కన్న సుఖమేముంటుంది?" అన్నది పూంగుళలి.

"అలా ఎగురుతూ వెళ్ళే చిలుకలను కొందరు పట్టి పంజరాలలో బంధిస్తున్నారు కద?" అన్నాడు సేందన్ అముదన్.

"అవునవును! అంతఃపురంలో నివసించే రాకుమార్తెలు చిలుకలను పట్టి పంజరాలలో బంధించి పెడుతున్నారు! క్రూర రాక్షసులు! చిలుకలను పంజరాలలో బంధించి ఉంచి, వాటితో మాట్లాడి మురిసిపోతారు! నేనేగనక ఒక అంతఃపురంలో పనిపిల్లగా ఉంటే, పంజరాల్లోని చిలుకలకు విషమిచ్చి చంపేస్తాను. ఆ రాకుమార్తెలకు కూడ విషమిచ్చి చంపేస్తాను...."

"నీ మాటలను ఎవరైనా వింటే నిన్ను కూడ క్రూర రాక్షసి అంటారు."

"అంటే అననీ! నేను కావాలంటే రాక్షసిగా ఉంటాను గాని రాకుమారిగా మాత్రం ఉండను."

"రాకుమార్తెల మీద నీకెందుకింత కోపం పూంగుళలీ? చూడబోతే వారిమీద కూడ జాలి చూపించాలి కద? పంజరాల్లో బంధించబడ్డ చిలుకల్లాగనే కద వారు కూడ అంతఃపురంలో బంధించబడి కాలం వెళ్ళబుచ్చాలి? పొరబాటున వారు బయటకు వెళ్ళాలంటే ఎంత రహస్యంగా వెళ్ళాలి? ఎన్ని జాగ్రత్తలు

తీసుకోవాలి? నీలాగ వారు ఒంటరిగా పడవక్కి కాలువలోను, సముద్రంలోను వెళ్ళగలరా? ఇష్టం వచ్చినట్లు జింకలాగ గెంతుతూ అడవిలో తిరుగాడగలరా?"

"వాళ్ళనెవరు అలా బంధించబడి ఉండమని చెప్పారు? నేను చెప్పలేదే? ఇష్టమైతే వాళ్ళు కూడ నాలాగ అడవిలో తిరుగాడనీ!"

"ఇష్టం మాత్రం చాలదు; వారి పెంపకం మీద కూడ ఆధారపడివుంటుంది. చిలుకలాగ నీవు కూడ ఆకాశంలో ఎగరాలని ఆశపడుతున్నావు. అది సాధ్యమా? కడలి తీరాన పుట్టి పెరిగినదానివి నీవు. కాబట్టి నీవింత స్వేచ్ఛగా ఉండగలవు. అంతఃపురంలో పుట్టి పెరిగినవారికి అది సాధ్యం కాదు. ఇంకా ఒక విచిత్రం విను. కొన్నాళ్ళు పంజరంలో బంధించబడి రాకుమార్తెల చేతినుంచి ఆహారం తిని పెరిగిన ఆ చిలుకలు పంజరం తెరిచి వదిలిపెట్టినా, బయటకు ఎగిరి పారిపోవడానికి ఇష్టపడవు. కాస్త దూరం ఎగిరి వెళ్ళి , గిరికీలు కొట్టేసి మళ్ళీ ఆ పంజరాల్లోకే వచ్చేస్తాయి. తంజావూరులోను, పళైయారైలోను ఉన్న అంతఃపురాల్లో నేనే ఇది ప్రత్యక్షంగా చూశాను...."

"అలా పంజరంలో బంధించబడేందుకు నేనేనాడూ సమ్మతించను. నేనే చిలుకనైతే నాకు అన్నం తినిపించేందుకు వచ్చే ఆ రాకుమారి చేతిని కసుక్కుమని పొడిచేస్తాను!"

"నీకు ఆ రెండు విధాల పంజరాలు - చిలుక పంజరం, పంజరంలాంటి అంతఃపురం - ఇష్టం లేదు కద?"

"సుతరామూ ఇష్టం లేదు. దాని కన్న విషం తిని చచ్చిపోతాను!"

"అదే సరి. అలాగైతే అంతఃపురంలో నివసించే రాకుమారుని పెళ్ళి చేసుకోవడానికి కూడ నీవిష్టపడకూడదు!"

ఆకాశం కింది భాగాన నల్లని మబ్బులు కమ్ముకోసాగాయి. అప్పుడప్పుడు ఫెళఫెళమని మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుముల శబ్దం కూడ మెల్లగా వినిపించసాగింది.

సేందన్ అముదన్ చివరిగా చెప్పిన మాటలు వినగానే పూంగుళలి కళ్ళలో ఒక్క మెరుపు మెరిసింది.

"నేను రాకుమారుని పెళ్ళాడేందుకు ఇష్టపడుతున్నానని నీకెవరు చెప్పారు?" అని కోపంగా అడిగింది.

"నాకెవరూ చెప్పలేదు. నేనే చెప్పానంతే. నీ మనసులో అటువంటి ఆశ లేకపోతే చాల మంచిది. నేను చెప్పింది మరిచిపో!" అన్నాడు సేందన్ అముదన్.

కాసేపు ఆ పడవలో మౌనం నెలకొంది. అముదన్ తెడ్డు వేస్తున్న శబ్దం, కప్పల బెకబెకలు, సముద్ర పక్షుల కిలకిలలు, అప్పుడప్పుడు ఆకాశంలో పిడుగుల శబ్దం మాత్రం వినవచ్చింది.

సేందన్ అముదన్ గొంతు సవరించుకొని, మనసును కూడ దిటవు పరుచుకొని, "పూంగుళలీ!

వంతిదేవుడు నా అంతరంగాన్ని నీకు తెలియజేశాడన్నావు కద? దాని గురించి నీ అభిప్రాయం ఏమని తెలియజేస్తే బాగుంటుంది. అదిగో కోడిక్కరై దీపస్తంభం కనిపిస్తోంది. ఇక నీతో ఏకాంతంగా మాట్లాడే అవకాశం దొరకకపోవచ్చు. రేపు నేను కూడ బయలుదేరి వెళ్ళాలి. తంజావూరులో నా తల్లిని ఒంటరిగా వదిలివచ్చి చాల రోజులైంది!" అన్నాడు.

"వంతిదేవుడు నీ తరపున ఎందుకు మాట్లాడాలి? ఏం నీకు నోరు లేదా? అడగాలనుకొన్నది నన్ను నేరుగా అడిగేసెయ్!" అన్నది పూంగుళలి.

"సరే. అడుగుతున్నాను. నీవు నన్ను పెళ్ళి చేసుకొంటావా?" అని అడిగాడు సేందన్ అముదన్.

"ఎందుకని నన్ను పెళ్ళి చేసుకొంటావా అని అడుగుతున్నావు?" అన్నది పూంగుళలి.

"నీపైన నా మనసు లోలోపల ఆశవుంది. అందుకే!"

"లోలోపల ఆశ ఉంటే పెళ్ళి చేసుకొనే తీరాలా?"

"అలా ఏం పెళ్ళి చేసుకొనే తీరాలని లేదు. లోకంలో సంప్రదాయం అలా ఉంటూ వస్తూంది..."

"నేను నిన్ను పెళ్ళి చేసుకొంటే నీవు నాకేమిస్తావు? నేను కోరుకొనే అంతఃపురవాసం, వస్త్రాభరణాలు, ఏనుగులు, గుర్రాలు, పనిమనుషులు నీవు ఇవ్వగలవా?"

"ఇవ్వలేను. వాటన్నిటికన్న మేలైన నెమ్మదిగల జీవితాన్నిస్తాను. విను, పూంగుళలీ! తంజావూరు నగరాన అందమైన పూలతోట మధ్య నా గుడిసె ఉంది. అందులో నేను, నా తల్లి నివసిస్తున్నాము. నీవక్కడికి వస్తే నీ జీవితమే మారిపోతుంది. నా తల్లి నిన్ను ప్రేమతో ఆదరించి చూసుకొంటుంది. పొద్దు పొడవగానే లేచి, మన ఇంటి చుట్టూ ఉన్న పూల తీగలు, పూల చెట్లనుంచి రకరకాల పూలు కోసి తీసుకొచ్చి మాలలు కట్టవచ్చు. మాలలను నేను తంజావూరు తళి కుళత్తూర్ ఆలయానికి, దుర్గాపరమేశ్వరి ఆలయానికి తీసుకొని వెళ్ళి ఇచ్చి వస్తాను. అంతలోపల నీవు మా తోటలో ఉన్న తామర కొలనులో స్నానం చేసి, నా తల్లికి ఇంటిపనుల్లో సాయం చేయవచ్చు. సాయం సమయాన మనం ముగ్గురం తామర కొలన్నుంచి నీళ్ళు తీసుకొని వెళ్ళి పూల చెట్లకు పోయవచ్చు. సాయంత్రం కాగానే నేను నీకు అద్భుతమైన తీయనైన తమిళ పద్యాలను, పాటలను నేర్పుతాను. నీ ఇంపైన గొంతుతో పాటలు పాడితే, పాడిన నీ నోరు పావనమవుతుంది; మనకిష్టమైతే ఆలయాలకు వెళ్ళి దైవదర్శనం చేసుకొని, ఆ భక్తి గీతాలను పాడవచ్చు. గుడికి వచ్చే భక్తులు కూడ విని ఆనందిస్తారు. పూంగుళలీ! ఇంతకన్న ఇంపైన జీవితం , ఆనందాన్నిచ్చే జీవితం లోకంలో ఉండగలదా? ఆలోచించి చెప్పు!"

ఇలా సేందన్ అముదన్ చెప్పిందంతా వినేసి పూంగుళలి గలగలమని నవ్వింది.

"అముదా! నీవు ఇంపైనదని అనుకోనే జీవితం గురించి చెప్పావు! కానీ, నేనెటువంటి జీవితం కావాలని కోరుకొంటున్నానో తెలుసా? ఆకాశలోకానికి వెళ్ళి దేవేంద్రుని పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాను.

దేవేంద్రునితో ఐరావతమెక్కి మేఘమండలాల మధ్య పయనించాలనుకొంటున్నాను. దేవేంద్రుని చేతినుంచి వజ్రాయుధాన్ని లాక్కొని మేఘాలమీద ప్రయోగించాలని ఆశపడుతున్నాను. వజ్రాయుధంతో కొట్టబడ్డ ఆ మేఘాలనుంచి వెలువడే వేవేల మెరుపులు ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా చీల్చడాన్ని చూసి ఆనందించాలని కోరుకొంటున్నాను. ఇప్పుడల్లా పిడుగు పడితే ఎక్కడో సముద్రంలోనో, అడవిలోనో పడి మాయమైపోతూంది కద? నేనలాంటి పిడుగులను వృధా పోనీయను. రాజులు, రాణులు, రాకుమార్తెలు, రాకుమారులు నివసించే మాళిగలను, అంతఃపురాలను వెతికి వాటిపైన పడేస్తాను. ఆ అంతఃపురాలు విరిగి పడి నేలమట్టం కావడాన్ని చూసి ఆనందిస్తాను. ఒకవేళ దేవేంద్రుడు నన్ను పెళ్ళాడనిష్టపడకపోతే వాయుదేవుని వద్దకు వెళతాను. అతడికి ఇప్పటికే చాలమంది భార్యలున్నా, ఫరవాలేదని చెప్పి నన్ను పెళ్ళిచేసుకోమంటాను. అంతే. తర్వాత ఈ భూలోకంలో ఎప్పుడూ సుడిగాలి, ఈదురుగాలి, చండమారుతం వీస్తుంటాయి. పెద్ద పెద్ద చెట్లు విరిగి మాళిగలమీద పడి వాటిని నేలమట్టం చేసేస్తాయి. సముద్రంలో పయనించే ఓడలు చండమారుతం చేత కొట్టబడి ఛిన్నాభిన్నమౌతాయి. ఆ ఓడల్లో ప్రయాణం చేసేవారు కల్లోలిత సముద్రంలో పడి విలవిల్లాడుతారు. అందులో రాకుమారులు, రాకుమార్తెలు ఉంటే వాళ్ళను లోతైన సముద్రంలోకి తొక్కేసి, తక్కినవారిని పోతేపోనీ అని విడిచిపెట్టేస్తాను. వాయుదేవుడు కూడ నన్ను పెళ్ళాడ నిరాకరిస్తే అగ్నిదేవుని చెంతకు వెళతాను. తర్వాత అడగాలా? ఈ భూలోకమే నిప్పంటుకొని కాలిపోవలసిందే!"

"పూంగుళలీ! చాలు, ఆపు! మనసులో ఉన్న ఏదో చేదు వల్ల ఇలా మాట్లాడుతున్నావు. మనఃపూర్వకంగా నీవిలా మాట్లాడడం లేదు. నీ మనోస్థితిని తెలుసుకోకుండ నీతో ఒంటరిగా మాట్లాడింది నా తప్పు. అందుకు నన్ను మన్నించు! దేవుడే నీ మనసులోని చేదును పోగొట్టి నెమ్మదినిచ్చి కరుణించాలి. అందుకోసం నేను రాత్రింబగళ్ళు ప్రార్థిస్తాను!" అన్నాడు సేందన్ అముదన్.

కూర్చొనివున్న పూంగుళలి ఉన్నట్లుండి లేచి నిలబడింది. కాలువ గట్టున ఉన్న ఒక చెట్టువైపు పరీక్షగా చూసింది. సేందన్ అముదన్ కూడ ఆ దిక్కున చూశాడు. చెట్టు కొమ్మల మధ్య ఒక ఆడదాని ముఖం కనిపించింది. సేందన్ అముదన్ ఒక్క క్షణం ఆమె ముఖాన తన తల్లి పోలికలను చూసి నివ్వెరపోయాడు.

తర్వాత ఆమె తన తల్లి కాదని గ్రహించాడు. భూతదీవిలో నివసిస్తున్నట్లు పూంగుళలి చెప్పిన తన పెద్దమ్మ అయివుండాలని ఊహించుకొన్నాడు.

పూంగుళలి ఒక్క దూకున పడవనుంచి గట్టుమీదికి దూకి ఆ స్త్రీ ఉన్న చెట్టువైపు వేగంగా పరుగెత్తింది.

~~~
~~~

# అధ్యాయము - 18

## ప్రేమ పొంగింది!

**కాలువ** గట్టున ఒక చెట్టు చాటున సగం కనిపించి సగం కనిపించక మరుగ్గా నిలబడ్డ మూగరాణిని చూసింది పూంగుళలి. ఎదురుచూడని సమయాన, ఎదురుచూడని చోట ఆమెను చూడడం చాల ఆశ్చర్యం కలిగించిందామెకు. అన్యులను చూడడం అత్తకు ఇష్టం లేదని పూంగుళలి ఎరుగును. పడవలో సేందన్ అముదన్ ఉన్నాడు కద? - వాడిని చూసి అత్త పరుగెత్తి పారిపోతుందా? - అన్న ఆలోచన పూంగుళలి మనసులో తలెత్తిన ఆ క్షణమే మూగరాణి పరుగెత్తి పారిపోనారంభించింది. పూంగుళలి చటుక్కున గట్టుపైకి దూకి, మిట్ట ఎక్కి చూసింది. అత్త కాస్త దూరాన దట్టమైన అడవిలో మరుగు కావడాన్ని గమనించింది.

ఇంతలో సేందన్ అముదన్ కూడ పడవనుంచి గట్టుమీదికి దూకి పూంగుళలి నిలబడ్డ చోటుకు వచ్చి చేరాడు.

"పూంగుళలీ! కాసేపటి క్రితం ఇక్కడ చెట్టు చాటున నిలబడ్డదెవరు?" అని అడిగాడు.

"నీకు తెలియలేదా, అముదా?"

"ఖచ్చితంగా తెలియడం లేదు; ఒకవేళ..."

"అవును, నా అత్తే! నీవు చనిపోయిందనుకొన్న నీ పెద్దమ్మే!"

"అవును; అమ్మ పోలికలు కాస్త ఉన్నట్లనిపించింది."

"ఊరకే ఏమీ చెప్పకు! చిన్నత్తకు, పెద్దత్తకు రూపంలో పోలికే లేదు. ఇంట్లో కట్టి పడేసినట్లున్న నీ అమ్మెక్కడ? అడవిలో స్వేచ్ఛగా తిరిగే సింహరాణి ఎక్కడ?"

"సరే! అలాగే ఉండనీ. ఎందుకు సింహరాణి నిన్ను చూసి పారిపోయింది?"

పూంగుళలి నవ్వేసి, "నన్ను చూసి కాదు. నిన్ను చూసే పారిపోయింది. అన్యులను చూసేందుకు ఆమె ఇష్టపడదు" అన్నది.

"నేనన్యుడిని కాను కద?"

"అత్తకు అది తెలియదు కద? తెలుసుకొంటే నిన్ను చూసి పారిపోదు. కానీ తెలుసుకోవడానికి మునుపు చాల సంకోచిస్తుంది/జంకుతుంది."

"పూంగుళలీ! ఇప్పుడేం చేయబోతున్నావు?"

"అత్తను వెతికి పట్టుకోబోతున్నాను."

"నేనూ రానా?"

"ఎందుకు?"

"పెద్దమ్మను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవడానికే!"

"ఎందుకు నీవు పెద్దమ్మను తెలుసుకోవాలి?"

సేందన అముదన్ తన పెద్దమ్మ పూర్వగాధను పూంగుళలి ద్వారా కాస్త తెలుసుకొనివుండడం వల్ల ఆమెను చూడాలని చాల ఆశపడుతున్నాడు. అదీగాక, పెద్దమ్మ తనవైపు నిలబడి, పూంగుళలి మనసును తనవైపు మళ్ళించేందుకు సహాయం చేయవచ్చన్న ఆశకూడ అతడికి కలిగింది.

"ఎన్నో కారణాలున్నాయి. కానీ పెద్దమ్మను చూసేందుకు కారణాలు కావాలా, ఏమి?"

పూంగుళలి కాసేపు ఆలోచించి, "సరే రా, వెళదాం! నిన్ను నాతో పిలుచుకొని వెళితే పెద్దత్త వెతికి పట్టుకోవడం కాస్త కష్టమవుతుంది. కానీ ఎవరు వదులుతారు? పడవను ఇక్కడే కట్టేసి వెళదాం!" అన్నది.

అలాగే పడవను ఒక మొగలి పొద కింద మరుగ్గా పెట్టి కట్టేసి ఇద్దరూ కోడిక్కరై అడవివైపు సాగారు.

నడుస్తూనే సేందన్, "పూంగుళలీ! పెద్దమ్మ లంకలోను, భూతదీవి లోను ఉంటుందని కద చెప్పావు?" అని అడిగాడు.

"అవును. కొన్ని సార్లు లంకలోను, కొన్ని సార్లు భూతదీవిలోను ఉంటుంది..."

"ఇక్కడికీ తరచూ వస్తుంటుందా?"

"లేదు, చాల అరుదుగా వస్తుంటుంది. నేను చాల రోజులు ఆమెను చూడకుంటే ఆమే ఇక్కడికి వస్తుంది."

"ఇప్పుడు నిన్ను చూసేందుకే వచ్చిందా?"

"ఈసారి ఇంకో పనిమీద వచ్చినట్లుంది..."

"ఇంకేం పని?"

"ఆమె దత్త పుత్రుడు సముద్రంలో మునిగిపోయాడో, లేక బతికి గట్టెక్కాడా అని తెలుసులోవడానికి కావచ్చు. ఓడెక్కి బయలుదేరిన తర్వాత సముద్రంలో సుడిగాలి వీచిన విషయం అత్తకు తెలుసు కద?"

"అరుళ్మొళి వర్మ ఆమె దత్త పుత్రుడా? అలాగైతే పెద్దమ్మ సొంత కొడుకెవరు?"

""అదే నాకూ తెలియదు. ఒకరోజు కాకపోతే ఇంకొకరోజు ఆ రహస్యాన్ని కనిపెట్టి తెలుసుకోబోతున్నాను."

"సొంత కొడుకు బతికున్నాడో, చనిపోయాడో..."

"అవును. వాడు చనిపోయికూడ ఉండవచ్చు. ఎవరికి తెలుసు?" అన్నది పూంగుళలి.

~

కాసేపైన తర్వాత, "అముదా! అత్తను చూశావు కద? మీ అమ్మ పోలికలున్నట్లు చెప్పావు; ఇంకెవరి ముఖమైనా జ్ఞాపకం వస్తూందా?" అని అడిగింది.

"ఏదో జ్ఞాపకం వస్తున్నట్లనిపిస్తూంది. తేటగా తెలియడం లేదు. మేఘం కమ్ముకొన్నట్లు మసగ్గా ఉంది..."

"పళువూర్ యువరాణిని నీవు చూశావా?"

"కొన్నిసార్లు చూశాను. ఆఁ! అవును! నీవు చెప్పిన  తర్వాత తెలుస్తూంది. నందినీదేవి ముఖమే! ఆశ్చర్యంగా ఉందే! అదెలా సాధ్యం, పూంగుళలీ! నీవెలా ఆ పోలికను కనిపెట్టావు?"

"అత్తను నేను తరచూ చూస్తుంటాను. పళువూర్ రాణిని కొన్నిరోజుల క్రితం ఇదిగో ఈ కోడిక్కరైలోనే చూశాను. ముఖాల్లో పోలిక నాకు వెంటనే తెలిసిపోయింది."

"కారణమేం కావచ్చు?"

"అది కూడ ఒకరోజు కనిపెట్టబోతున్నాను. ఇప్పుడు అత్తను చూసి అదే విషయాన్ని అడగాలనుకొంటున్నాను."

"పెద్దమ్మేమో మూగది కద? ఎలా ఆమెతో మాట్లాడడం?"

"నీవు నీ అమ్మతో మాట్లాడడం లేదా?"

"సైగలతో మాట్లాడుతాను. పుట్టినప్పటినుంచి అలవాటు. అయినప్పటికీ కొత్త విషయం చెప్పడం కష్టమే!"

"పెద్దత్తా, నేనూ అలాగే సైగలతో మాట్లాడుకొంటాం. అది వీలు కాకపోతే చిత్రం గీసి చూపించుకొంటాం...."

"ఒకే కుటుంబంలో అక్కా చెల్లెళ్ళు మూగవాళ్ళుగా పుట్టడం ఎంత కష్టం? వారిని కన్నవారికి అందువల్ల ఎంత దుఃఖం?"

"అది మాత్రం కాదు. చిన్న వయసులో అక్కాచెల్లెళ్ళు ఎప్పుడూ దెబ్బలాడుకొనేవారట. అందుకనే తాత పెద్దత్తను మాత్రం తీసుకొని భూతదీవిలో కొత్త ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసించేవారట. పెద్దత్త మీద తాతకు చాల ప్రేమ ఉండేదట. బిడ్డ పుట్టిన వెంటనే ఆమెకు రాణి అయ్యే యోగం ఉందని ఎవరో జోస్యం చెప్పారట. కాబట్టి బిడ్డ మూగది అని తెలిసిన వెంటనే ఆయన మనోవేదన అధికమైందట..."

~

ఇలా మాట్లాడుకొంటూనే వారు అడవిలో దూరారు. ఎంతసేపు తిరిగి వెతికినా కూడ మూగరాణి కనిపించలేదు.

"అముదా! నీవు నాతోబాటు ఉండడం వల్లనే అత్తను కనిపెట్టలేకున్నాము. నిన్ను చూసి

మరుగవుతూంది."

"నా అదృష్టం అంతే. నేననుకొన్నది ఏదీ జరగడం లేదు. నేను తిరిగి వెళ్ళనా?"

"ఎలా వెళతావు? ఈ అడవినుంచి నేనే నిన్ను బయటకు తీసుకొని వెళ్ళి విడిచిపెట్టాలి."

అప్పుడు అడవిలోపలినుంచి ఒక విచిత్రమైన గొంతు వినిపించింది. అది మనిషి గొంతులాగాను అనిపించలేదు; మృగం గొంతులాగ కూడ అనిపించలేదు.

రెండు మూడు సార్లు ఆ కూత వినిపించింది. ఆ శబ్దం వినిపించిన దిక్కుగా కొన్ని జింకలు పరుగెత్తాయి.

పూంగుళలి కాస్త ఆగి ఆలోచించింది. "అముదా! శబ్దం చేయకుండ నాతో రా!" అన్నది.

గొంతు వినవచ్చిన దిశగా ఇద్దరూ మెల్లగా నడిచి వెళ్ళారు. కాసేపటికల్లా ఒక అద్భుత దృశ్యం వారికగుపించింది.

~

మూగరాణి ఒక చెట్టు అడుగున ఆనుకొని నిలబడివుంది. ఆమె చేత కొన్ని లేతాకులు పట్టుకొనివుంది. ఆమె చుట్టూ ఏడెనిమిది అందమైన జింకలు నిలబడివున్నాయి. ఆమె చేతనున్న లేతాకుల కోసం అవి పోటీ పడుతున్నాయి. ఆమె భుజం పైన ఒక చిన్న జింక కూర్చొని తన అందమైన కళ్ళతో ఆమెను చూస్తూంది.

ఈ అపూర్వమైన దృశ్యాన్ని చూస్తూ పూంగుళలి, సేందన్ అముదన్ కాసేపు కదలకుండ నిలబడ్డారు.

మొదట మూగరాణి భుజంపైనున్న జింకపిల్లే వారిని చూసింది. చూసిన వెంటనే ఆమె భుజంపైనుంచి కిందకు దూకింది.

తక్కిన జింకలు కూడ వారిని చూసేశాయి. అన్ని జింకలూ వారు మరింత దగ్గరికి వస్తే పారిపోవడానికి సిద్ధమైనాయి.

తర్వాత మూగరాణి కూడ వారిని చూసింది. అమె గొంతునుంచి ఇంకొక విచిత్రమైన శబ్దం వెలువడింది.

అది వినగానే జింకలన్నీ గెంతుతూ పారిపోయాయి.

"అత్తకు మనుషుల భాష ఒక్కటి మాత్రమే తెలియదు. మృగాల భాష బాగా తెలుసు" అని చెబుతూనే పూంగుళలి మూగరాణికి సైగ చేసింది.

మూగరాణి ఈసారి పరుగెత్తి పారిపోలేదు. పూంగుళలిని చూసి బదులు సైగ చేసింది.

పూంగుళలి దగ్గరకు రాగానే ఆమెను హత్తుకొని తల నిమిరింది.

సేందన్ అముదన్ కాస్త దూరానే నిలబడ్డాడు.

అత్త, మేనకోడలు కాసేపు మూగభాషలో మాట్లాడుకొన్నారు.

మూగరాణి అతన్ని ఎగాదిగా కొన్నిసార్లు పరీక్షగా చూసేసి, అతని తలపైన చేయుంచి ఆశీర్వదిస్తున్న భావంతో కాసేపు మౌనం దాల్చింది.

తర్వాత అతని తలపైనుంచి చేయి తీసేసి, పూంగుళలి చేయి పట్టుకొని పిలుచుకొని వెళ్ళింది.

ముగ్గురూ కాలువ గట్టుకు వచ్చి చేరారు.

మూగరాణి అక్కడే కూర్చొనేసి, పూంగుళలికి వెళ్ళ,మని సైగచేసింది.

పూంగుళలి, "రా, అముదా! ఇంటికి వెళదాం. అత్త రాదట. ఇక్కడికే భోజనం తీసుకొని రావాలట" అన్నది.

ఇద్దరూ దీపస్తంభ గృహం వైపు సాగారు.

"పూంగుళలీ! నా మాటకేం బదులు చెబుతావు?" అని అముదన్ అడిగాడు.

"నీతో తంజావూరుకు రావాలనే ఆలోచన ఉండేది. అది ఇప్పుడు సాధ్యం కాదు. అత్త ఆమె దత్త పుత్రుని చూడాలట. కాబట్టి నాకు మళ్ళీ నాగపట్టణం ప్రయాణం ఉంది. నీవూ వస్తే అత్త మళ్ళీ పారిపోయినా పోవచ్చు. ఆమెనుంచి నేను తెలుసుకోవలసిన వివరాలు కూడ తెలుసుకోలేకపోతాను."

సేందన్ అముదన్ పెద్దగా నిట్టూర్చి, "నా అదృష్టమే ఇంతే. అలాగైతే ఇప్పుడే నీ దగ్గర సెలవు తీసుకొంటాను!" అన్నాడు.

"లేదు, లేదు! ఇంటికొచ్చి భోంచేసి నీ మామగారి దగ్గర సెలవు తీసుకొని వెళ్ళు! లేకపోతే నాతో అందరూ దెబ్బలాడతారు!"

~

దారిన ఇంకొక చోట ఒక పొద వెనక ఒక ఆడ మనిషి, ఒక మగాడు మరుగ్గా నిలబడి మాట్లాడుకొంటుండడాన్ని వారు గమనించారు.

"ఆహా! వదిన రాక్కమ్మలాగుంది. ఇంకా రహస్యపు మాటలు ముగించినట్లు లేదు. ఇప్పుడొచ్చిన వారెవరు? ఆ పాండ్యదేశపు గూఢచారులేనా? ఇంకెవరైనానా?" అని పూంగుళలి తనలో తానే చెప్పుకొంది.

రాక్కమ్మ పొదచాటునుంచి ఇవతలికొచ్చింది. పూంగుళలిని చూసి కాస్త ఉలిక్కిపడింది. కానీ ఆ ఉలికిపాటును చూపించుకోక, వారివైపు వేగంగా వచ్చింది.

"పూంగుళలీ! ఇన్నిరోజులు ఎక్కడికేగావు? నీ అమ్మనాన్నలు చాల గాభరా పడుతున్నారు!" అన్నది.

"ఎందుకని? నేను ఇల్లు వదిలి పోవడం ఇదే మొదటిసారా?"

"ఈసారి నీ అత్త కొడుకును కూడ వెంట తీసుకెళ్ళావు కద? ఎవరికీ చెప్పకుండ పెళ్ళి

చేసేసుకుంటారేమోనని దిగులు!" అన్నది రాక్కమ్మ.

"వదినా! ఇలాంటి వెధవ మాటలు నాతో మాట్లాడవద్దని నీకెన్నిసార్లు చెప్పాలి? ఇంకొకసారి ఇలా మాట్లాడావో..."

"లేదే, పిల్లా! లేదు! నీవు నీ అత్త కొడుకును పెళ్ళి చేసుకొంటే నాకేం? రాకుమారుని పెళ్ళి చేసుకొంటే నాకేం? లంకనుంచి నీ పెద్దత్త వచ్చి నీకోసం వెతుకుతూంది. ఆమెను నీవు చూశావా?" అని అడిగింది రాక్కమ్మ.

"లేదు, ఇంకా చూడలేదు!" అన్నది పూంగుళలి.

ఇల్లు చేరేలోపు అముదన్తో ఏకాంతంగా మాట్లాడే అవకాశం దొరికినప్పుడు, "అముదా! జాగ్రత్త! వదిన పాండ్యదేశపు కుట్రదారుల పక్షం. ఆమె నీ నోరు విప్పేందుకు ప్రయత్నిస్తుంది. ఏమీ బదులు చెప్పకు!' అన్నది.

"ఇక్కడ నేనుండే ఇంకాసేపు కూడ మూగగానే ఉండిపోతాను: అన్నాడు సేందన్ అముదన్.

~

ఆ రోజు మధ్యాహ్నం పూంగుళలి మళ్ళీ తన పడవను నాగపట్టణంవైపు నడిపింది. పడవలో మూగరాణి ఆసీనురాలైవుంది.

మూగరాణి చెంతనున్నప్పుడు పూంగుళలి మనసు ఎప్పుడూ నెమ్మదిగా ఉండడం అలవాటు. ఇద్దరి మనసులు ఒకదానికొకటి దగ్గరై ఒకటి కావడమే దానికి కారణం.

కానీ ఇప్పుడు పూంగుళలి మనసు అలా నెమ్మదిగొనలేదు.

కొన్నిరోజుల క్రితం అదే కాలువలో పొన్నియిన్ సెల్వన్ని స్పృహ తప్పివున్న పరిస్థితిలో తన పడవలో తీసుకొని వెళ్ళిన సంఘటన ఆమెకు తరచూ గుర్తుకు రాసాగింది. ఆ రాకుమారుని ఇంకొక రాకుమారి వద్దకు తీసుకొని వెళ్ళి చేర్చేందుకే తానెంతటి కష్టానికి పాలైనానన్న విషయాన్ని తలుచుకోగానే ఆమె మనసు చివుక్కుమంది.

సేందన్ అముదన్ని, "ఊరికి పో!" అని పట్టి తోసినట్లు పంపించేసిన విషయం గుర్తుకొచ్చిఆమె మనసు కరిగిపోయింది.

ఈ ఆలోచనలేగాక, ఆ రోజు రాత్రి ఆమె తండ్రి చేసిన హెచ్చరిక తరచూ గుర్తుకు రాసాగింది.

"బిడ్డా! నీ రాకపోకలను కాస్త కట్టుబాటులో ఉంచుకొంటే మంచిది. ఎవరెవరో కొత్త కొత్త మనుషులు ఇక్కడికి వచ్చి వెళుతున్నారు. ఎందుకు వస్తున్నారని తెలియడం లేదు. రాజ్యంలో ఏవేవో కుట్రలు జరుగుతున్నాయి. వాటిలో నీవు చిక్కుకోకు. మన కుటుంబం ఎన్నటికీ చోళవంశానికి ఋణపడివుంది! ఇది మరిచిపోకు!"

తండ్రి హెచ్చరికతో వదిన రహస్య సమావేశాలను చేర్చి ఆలోచించినప్పుడు పూంగుళలికి

ఎన్నడూ లేని దిగులు పట్టుకొంది. ఒకవేళ ఆ కొత్త మనుషులు తనని వెతుక్కొనే వచ్చారా? తనని వెంబడించి రావడం ద్వారా పొన్నియిన్ సెల్వన్ ఉన్న చోటు కనిపెట్ట ప్రయత్నిస్తారు కాబోలు? తన మూలంగా అది బయటపడితే అది ఎంత పెద్ద నేరమవుతుంది...?

పూంగుళలి మనసులోని కల్లోల పరిస్థితిని మరింత అధికం చేసేటట్లు కాలువ గట్టునున్న అడవిలో గలగల శబ్దాలు వినిపించనారంభించాయి.

అప్పుడు గాలే వీయడం లేదు. అష్ట దిగ్బంధనం చేసినట్లు గాలి స్తంభించివుంది.

అలా ఉన్నప్పుడు కాలువ తీరానున్న అడవినుంచి గలగల శబ్దం వినరావడానికి కారణమేమి?

మూగరాణి ఇదంతా ఏమీ పట్టించుకొన్నట్లే అనిపించలేదు. కళ్ళతో చూసి, చెవులతో విని తెలుసుకోలేని విషయాలను ఆరో జ్ఞానం సహాయంతో తెలుసుకోగలదు. ఆమె తెలుసుకోలేని అపాయమేమీ తనను సమీపించడం లేదు కద?

ఇదేమి? అత్త కూడ తరచూ దిగులుగా కాలువగట్టు వైపు చూస్తూంది? నిజంగానే ఏదైనా అపాయం ముంచుకొస్తూందా...?

అత్త తరచూ కాలువ గట్టువైపు చూస్తూన్న కారణం త్వరలోనే బయటపడింది. పూంగుళలి దిగులును అది పోగొడుతుంది కాబోలు.

ఒక చోట ఐదారు జింకలు కాలువ గట్టున ఉన్న కొన్ని పొదల వెనక కనిపించీ కనిపించనట్లు నిలబడి వారి పడవను తొంగి చూస్తున్నాయి!లేదు; పడవను చూడడం లేదు! మూగరాణిని చూస్తున్నాయి!

ఆహా! జింకల్లాంటి అందమైన ప్రాణులు ఈ లోకంలోనే లేవు! జింకలను సృష్టించిన దేవుడు మనుషులను కూడ ఎందుకు సృష్టించాడో తెలియడం లేదు. ఇంత అందమైన ప్రాణులను కూడ వేటాడి చంపే మనుషులున్నారు కద!

జింకలను చూసి, వాటి అందంగురించి తలుచుకొని సంభ్రమించిన పూంగుళలి చేతులు తెడ్లు వేయడం ఆపాయి. పడవ ఆగింది.

మూగరాణి గొంతునుంచి ఒక విచిత్రమైన శబ్దం వెలువడింది. అది పొద్దున విన్న శబ్దంలాగ లేదు. ఈ శబ్దంలో దిగులు, హెచ్చరికతో కూడివున్నాయి.

అది విన్న జింకలు కూడ దిగులుతో వెనుదిరిగి పరుగెత్తాయి.

అదే క్షణాన ఎక్కడో మరుగైన చోటునుంచి ఒక బాణం వేగంగా వచ్చి ఒక జింకను కొట్టింది.

బాణం తగిలిన జింక శోకంతో, బాధతో కేకవేసింది!

మూగరాణి ఒక్క దూకున గట్టుమీదికి దూకి ఆ జింకవైపు పరుగెత్తింది.

ఆమె గాయపడ్డ జింకను సమీపించిన అదే క్షణాన నలువైపుల పొదల నుంచి గలగలమని శబ్దం వినిపించింది. మరుక్షణమే ఏడెనిమిది మంది వచ్చి ఆమెను చుట్టుముట్టారు, అందులో చాలమంది

చేత శూలాలు కూడ ఉన్నాయి. కాస్త దూరాన వారికి దారి చూపించి పిలుచుకొచ్చిన రాక్కమ్మ కూడ కనిపించింది.

మూగరాణి తప్పించుకొని పారిపోజూసింది; వీలు కాలేదు. అది అసాధ్యమని తెలియగానే మూగరాణి ఊరకే నిలబడిపోయింది.

ఇద్దరు మనుషులు ఆమెను సమీపించి ఆమె చేతులను వెనక్కి విరిచి కట్టారు.

ఇదంతా పూంగుళలి చూస్తుండగానే కొన్ని క్షణాల్లో జరిగిపోయింది. మూగరాణి చేతులను కట్టేస్తున్నారని గ్రహించగానే పూంగుళలి పడవనుంచి దూకి కేకలేస్తూ అటువైపు పరుగెత్తి వెళ్ళింది. చేతనున్న తెడ్డును పైకెత్తి పట్టుకొని వచ్చింది.

మూగరాణి చుట్టూ నిలబడ్డవారిలో ఐదారు మంది పూంగుళలివైపు పరుగెత్తి వచ్చారు. ఆమెను పట్టుకొని తీసుకొని వెళ్ళి పడవలో ఎత్తి పడేసి, తాటితో కట్టేశారు.

తర్వాత తిరిగి వెళ్ళి, మూగరాణిని పిలుచుకొని కొన్ని క్షణాల్లో మాయమైనారు.

~~~
~~~

# అధ్యాయము - 19

## నవ్వు - నిప్పు

**పూంగుళలి** తనని పడవతో చేర్చి కట్టిన కట్లను తొందర తొందరగా విప్పుకోవడానికి ప్రయత్నించింది. అది అంత సులభసాధ్యంగా తోచలేదు. ఛండాలురు! ముడి మీద ముడి వేసి కట్టిపడేశారు. పూంగుళలి చురకత్తి పడవ అడుగుభాగాన ఉంది. ఒక చేతికైన విడుదల దొరికితే కత్తితో కట్లను కోసేసేయవచ్చు. కానీ ఆ పాపిష్టివాళ్ళు చేతి మణికట్లను వెనక్కి విరిచి కట్టేశారు. పూంగుళలి అతికష్టం మీద ముందుకు వంగి పళ్ళతో కత్తిపిడిని దొరికించుకొంది. కత్తిని పళ్ళతో పట్టుకొన్న ఫళంగానే తాటిని ఒకచోట కోసింది. చేతి కట్లు కాస్త సడలాయి. ఒక చేతిని అతిప్రయాస పడి ముళ్ళనుంచి విడిపించుకొంది. తర్వాత తాటిని పూర్తిగా కోసి విదిలించుకోవడం సులభమైంది.

కట్లనుంచి విడిపించుకోవడానికి ఇంచుమించు ఒక ఘడియ సమయం పట్టింది. అప్పుడు కాలువ గట్టున కాలి చప్పుడు వినిపించింది. తర్వాత ఒక నీడ అగుపించింది. తనని కట్టిపడేసిన వాళ్ళలో ఒకడే మళ్ళీ ఇక్కడికి తిరిగి వస్తున్నాడు కాబోలు! లేక తాను కట్లు విప్పుకొని పారిపోకుండ కాపలా కాయడానికి ఒకడిని ఇక్కడే నిలబెడుతున్నారు కాబోలు! వాడు  తన కళ్ళ ముందు రాగానే వాడి మీదికి తన కత్తిని విసిరి చంపేయాలని నిశ్చయించుకొని పూంగుళలి అందుకు సిద్ధమైంది.

కానీ, ఎంతటి ఆశాభంగం!

“పూంగుళలీ! పూంగుళలీ!” అని సేందన్ అముదన్ గొంతు వినిపించింది.

మరుక్షణం భయభ్రాంతులు నిండిన సేందన్ అముదన్ ముఖం కాలువ గట్టు మీది నుంచి అగుపించింది.

పూంగుళలి కత్తిని వెంటనే బొడ్లో దోపుకొంది.

అముదన్ ఆమెను చూసేశాడు.

“పూంగుళలీ! నీవు బతికేవున్నావా?” అంటూనే ముందుకు దూకి పరుగెత్తుకొని వచ్చాడు.

“నేను ప్రాణాలతో ఉండడం నీకు కష్టంగా ఉంది కాబోలు! కావాలంటే నీ చేతులతోనే చంపేసి పో! కానీ అంతటి ధైర్యం నీకెక్కడినుంచి రాబోతూంది గనక?” అన్నది పూంగుళలి.

“శివ శివా! ఎంతటి కఠోరమైన మాటలాడుతున్నావు! నేనెందుకు నిన్ను చంపబోతాను? నీవే నన్ను నీ మాటలతో చంపుతున్నావు!” అన్నాడు అముదన్.

“మరి, నీవెందుకు ఇంతకు ముందే వచ్చివుండకూడదు? కట్లను కోసేసి విడిపించుకోవడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా?” అని చెబుతూనే పూంగుళలి లేచి నిలబడేందుకు ప్రయత్నించింది. కాళ్ళు తాళ్ళ

మధ్య అస్తవ్యస్తంగా చిక్కుబడివుండడం వల్ల తడబడి పడబోయింది.

అముదన్ నెత్తీ నోరూ కొట్టుకొంటూ ముందుకు దూకి ఆమె పడిపోకుండ పట్టి ఆపాడు.

"అయ్యయ్యో! ఆ పాపిష్టివాళ్ళు నిన్నిలాగా కట్టి పడేశారు? ఒళ్ళంతా దద్దులు!" అని వాపోయాడు.

"ఇప్పుడింత జాలి పడుతున్నావు కద? కాసేపటి క్రితం వచ్చివుంటేనేం?"

"మళ్ళీ అలాగే మాట్లాడుతున్నావేమి? నీకిలాంటి ఆపద వచ్చిందని నేను కలగన్నానా? నీవు నన్ను 'పో పో' అని తరిమి కొట్టావు. నేనలాగే వెళ్ళిపోయాను..."

"మరెందుకు తిరిగి వచ్చావు? ఒకవేళ నేను చచ్చిపోయివుంటే నా శరీరాన్ని దహనం చేసి వెళదామని తిరిగి వచ్చావా?"

"శివపరమాత్మ విషాన్ని/గరళాన్ని తన కంఠంలో పెట్టుకొన్నాడు. నీవేమో నీ నాలుక నుంచే విషాన్ని కక్కుతున్నావు. నీకేమైన ఆపద కలిగివుండవచ్చని నీ వదిన చెప్పగా పరుగెత్తి వచ్చాను. అందుకు సరైన బహుమానమే దొరికింది!"

ఇంతలో పూంగుళలి పడవనుంచి గట్టుమీదికి దిగింది.

"ఈ కత్తిని నీ మీదకు విసురుదామనుకొన్నాను. నీవు బతికిపోయావు. ఇదే కత్తితో నా వదిన్ని పొడిచి చంపేసే తర్వాతి పని చూడబోతున్నాను. ఆ ఛండాలి ఎక్కడ?"

"నన్ను వదిలేసి ఎందుకు నీ వదిన మీదికి దూకుతున్నావు? ఆమె మీద ఎందుకింత కోపం? నీ గురించి నాకామె చెప్పింది నేరమా...?"

"ఆమే నా అత్తను ఆ పాపిష్టివాళ్ళకు చూపించింది. పొదల వెనక ఆమె ఎవరితోనో రహస్యంగా మాట్లాడుతుండడాన్ని నీవు కూడ చూశావు కద?" అన్నది పూంగుళలి.

"నీవనుకొంటున్నది పొరబాటు. నీ వదిన ఎవరితో ఏం రహస్యం మాట్లాడింతో, ఏమో? నీ అత్తను ఆమె కనిపెట్టి చూపించలేదన్నది నిశ్చయం. నీ అత్తను బలాత్కారంగా పట్టి తీసుకొని వెళ్ళినవాళ్ళు నీ వదినను కూడ ఒక చెట్టుకు కట్టి పడేసి వెళ్ళారు. ఆమె తలమీద కొట్టి గాయపరిచి మరీ వెళ్ళారు."

"ఇదేం విచిత్రం! నమ్మశక్యంగా లేదే! నిన్నామె మోసం చేసేసింది! సరే. నీవెందుకు తిరిగి వచ్చావు? వదిన్ని ఎక్కడ చూశావు? - అన్నీ వివరంగా చెప్పు!" అని ఆదుర్దాగా అడిగింది.

సేందన్ అముదన్ అలాగే వివరంగా చెప్పాడు. అతడు తంజావూరుకు వెళ్ళే బాట వెంబడి వెళుతున్నాడు. పూంగుళలిని విడిచి వెళ్ళ మనసు రాక, అయిష్టంగానే వెళుతున్నాడు. అప్పుడు పక్కనున్న అడవినుంచి ఏవో కేకలు, ఎవరిదో ఆర్తనాదం వినిపించింది. చాలమంది వేగంగా వస్తున్న చప్పుడు కూడ వినిపించింది. అముదన్ బాట వారగా ఒక చెట్టు వెనక మరుగ్గా నిలబడ్డాడు. అడవినుంచి చేత శూలాలు పట్టుకొన్న ఏడెనిమిది మంది వీరులు దడదడమని వేగంగా రాజబాటెక్కారు. వారి మధ్య ఒక

స్త్రీ ఉన్నట్లు తోచింది. ఆ వీరుల మధ్య కాస్త తెరపిచ్చినప్పుడు ఆమె పూంగుళలి అత్తలాగ అగుపించింది. అది పూంగుళలి ఆత్త కావడానికి వీల్లేదు, అది తన చిత్తభ్రమ అనుకొన్నాడు సేందన్ అముదన్.

ఆ వీరులు వెళ్ళిపోయిన తర్వాత అడవినుంచి ఒక ఆడదాని ఆర్తనాదం వినిపించసాగింది. సేందన్ అముదన్ మొదట 'మనకెందుకొచ్చిన తంటా? మన దారిన మనం వెళదామా?' అనుకొన్నాడు. కాని అలా చేయడానికి మనసు రాలేదు. ఎవరలా దీనంగా అరుస్తున్నరని చూసి, తనకు చేతనైన సహాయం చేసి వెళదామని ఆ గొంతు వినిపించిన దిక్కుగా సాగాడు. అక్కడ రాక్కమ్మ చెట్టుకు కట్టబడివుంది. ఆమె తలనుంచి రక్తం కారుతూ ఆమె ముఖం ఘోరంగా అగుపించింది. అముదన్‌కి ఆమెను సమీపించడానికే భయమేసింది. మనసును దిటవు పరుచుకొని ఆమె దగ్గరికి వెళ్ళి కట్లను విప్పాడు. కట్లను విప్పుతూనే, 'ఈ ఘోరకృత్యాన్ని చేసిందెవరు? ఎందుకని? కాసేపటి క్రితం ఈ అడవినుంచి రాజబాటకు వచ్చిన వాళ్ళెవరు? వారి మధ్య ఒక స్త్రీ కూడ ఉన్నట్లుంది కద? ఎవరది?' అని ప్రశ్నల వర్షం కురిపించాడు. 'అవును, తమ్ముడూ! వాళ్ళు నీ పెద్దమ్మను పట్టి బంధించి తీసుకొని వెళ్ళిపోయారు. వాళ్ళను నేనడ్డగించ ప్రయత్నించాను. అందుకే నన్నిలా కొట్టి, చెట్టుకు కట్టి పడేసి వెళ్ళారు. నీ మామ కూతురు, నీ పెద్దమ్మ పడవెక్కి వెళుతుండగా, వాళ్ళు ముట్టడించి, నీ పెద్దమ్మను పట్టి బంధించి తీసుకొని వెళ్ళారు. పూంగుళలి గతేమైందో తెలియదు. పరుగెత్తి వెళ్ళి చూడు!' అన్నది రాక్కమ్మ. ఇది విన్న సేందన్ అముదన్ అదిరిపడి, పూంగుళలిని వెతుక్కొంటూ బయలుదేరాడు. అంతలో రాక్కమ్మ, 'కాస్త ఆగు, తమ్ముడూ! పూంగుళలి, ఆ మూగపిశాచి పడవెక్కి ఎక్కడికి బయల్దేరారో నీకు తెలుసా? నిన్ను వదిలిపెట్టి ఎందుకు వెళ్ళారు? నీవెక్కడికి ఒంటరిగా బయల్దేరావు?' అని ఎదురు ప్రశ్నలడిగింది. ఆమె ఇలా అడగడం, ముఖ్యంగా తన పెద్దమ్మను 'మూగపిశాచి' అనడం అతడికి నచ్చలేదు. 'అంతా తర్వాత చెబుతాను' అనేసి కాలువవైపు పరుగెత్తాడు. పూంగుళలిని కూడ ఆ మనుషులు కొట్టి పడేశారేమో, లేక చంపేశారేమో అని భయపడుతూ వచ్చాడు. పూంగుళలి సజీవంగా ఉండడం, గాయాలేమీ లేకుండడం చూసి, అతడి మనసు నెమ్మదిగొంది.

ఈ వివరాలన్నీ చెప్పేసి, "పూంగుళలీ! ఇప్పుడేమంటావు? నీ వదిన మీద కోపగించుకొన్నది పొరబాటే కద?" అని అడిగాడు అముదన్.

"నీవు చెప్పింది వింటే అలాగే అనిపిస్తూంది. ఆమెను ఎక్కడ విడిచిపెట్టి వచ్చావు? అక్కడికి వెళ్ళి చూద్దాం, రా!" అన్నది పూంగుళలి.

"ఆమె అక్కడే ఉంటుందని ఏం నిశ్చయం?"

"అక్కడే లేకపోతే, చుట్టుపక్కల ఉంటుంది. లేకపోతే మనని వెతుక్కొంటూ వస్తుంది. అముదా! నేను, నా అత్త పడవెక్కి ఎక్కడికి బయల్దేరామని నా వదిన అడిగింది కద?"

"అవును, అడిగింది."

"నీవందుకు ఉత్తరమివ్వలేదు కద? నిశ్చయంగా?"

"ముమ్మాటికీ చెప్పలేదు. 'మూగపిశాచి' అని నా పెద్దమ్మను అనగానే నాకు కలిగిన చిరాకువల్ల ఏమీ సమాధానం చెప్పకనే వచ్చేశాను."

"ఇకమీదట మంచిగా అడిగినా చెప్పకు! మేమెక్కడికి బయల్దేరామని ఆమె ఎందుకు తెలుసుకోగోరుతూంది? దానికేదో కారణం ఉండే తీరాలి కద? అముదా! అత్తను పట్టి బంధించి తీసుకొని వెళ్ళిన వారికి, వదినకు ఏమీ సంబంధం లేదని చెప్పలేము. వదిన మూలంగా గుట్టు తెలుసుకొని, పని ముగిసిన వెంటనే ఆమెను కొట్టి, కట్టి పడేసి వెళ్ళివుండవచ్చు. అలా కాకపోయినా కూడ, ఇంకేదో దురుద్దేశంతోనే మా వెన్నంటి వచ్చివుండాలి. కాబట్టి ఆమెతో చాల జాగ్రత్తగానే నడుచుకో! ఆమెను పూర్తిగా నమ్మి మోసపోకు...!"

"పూంగుళలీ! నీ వదిన సమక్షాన నీ అన్న మూగవాడైపోతాడని అన్నావు. అలాగే నేను కూడ ఆమె ముందు మూగవాడినైపోతాను. మాట్లాడవలసిందంతా నీవే మాట్లాడు..."

ఇది విని పూంగుళలి నవ్వింది.

"నీ నవ్వు నా చెవులకు అమృతంలాగుంది; తిరునావుక్కరసి పాడిన దేవారంలాగ ఇంపుగా ఉంది!" అన్నాడు సేందన్ అముదన్.

"ఏదో పొరబాటున నవ్వేశాను. అది విని మోసపోకు! నా మనసులో అగ్నిగుండం రగులుతోంది!"

"మనసులో రగిలే అగ్నితాపాన్ని చల్లార్చేందుకు దేవుని కరుణ అనే వెల్లువకన్న గొప్పది ఇంకేదీ లేదు!" అన్నాడు సేందన్ అముదన్.

~~~
~~~

# అధ్యాయము - 20

## మళ్ళీ వైద్యకుమారుడు!

**కాసేపు** పూంగుళలి, ఆమె అత్త కొడుకు ఆ అడవి దారిన మౌనంగా సాగారు.

పూంగుళలి పెద్దగా నిట్టూర్చి, "అముదా! నీకూ, నాకూ మధ్య ఏదో జన్మాంతర సంబంధం ఉన్నట్లుంది!" అన్నది.

"పూర్వజన్మాల గురించి ఇప్పుడెవరికి దిగులు? ఈ జన్మ గురించి ఏదైనా మంచి వార్త ఉంటే చెప్పు!" అన్నాడు సేందన్ అముదన్.

"పూర్వజన్మల్లోని బంధుత్వం ఈ జన్మలో కూడ కొనసాగుతుందంటారు కద? అది నిజమే అయివుండాలి; ఈ రోజు మిట్ట మధ్యాహ్నం నిన్ను వదిలి వెళ్ళినప్పుడు నిన్ను మళ్ళీ చూడనే చూడననుకొన్నాను. కానీ రెండు గడియల్లోపలే నిన్ను మళ్ళీ చూడడమైంది..."

"అందుకోసమని విచారించకు; ఈ అడవి దాటి తంజావూరు బాటను చేరుకొన్న వెంటనే నేను నా దారిన వెళతాను. నీవు నీ ఇష్టం వచ్చిన దారిన వెళ్ళవచ్చు..."

"నేను నిన్నలా ఒంటరిగా విడిచి వెళ్ళను. వదిన్ని చూసి మాట్లాడిన తర్వాత నేను నీతోబాటు తంజావూరుకు రాబోతాను. నా అత్తకు కలిగిన కష్టానికి పరిహారం వెతకబోతాను. చోళ చక్రవర్తి సన్నిధానానికి వెళ్ళి మొరపెట్టుకోబోతున్నాను..."

"పూంగుళలీ! చక్రవర్తిని చూడడం అంత సులభమనుకొన్నావా? మనలాంటివారు తంజావూరు కోట లోపలికే ప్రవేశించలేరు కద?"

"ఎందుకు సాధ్యం కాదు? కోట తలుపులు తెరవకపోతే విరగగొట్టి తెరుస్తాను! అది సాధ్యం కాకపోతే కోట గోడెక్కి దూకి వెళతాను..."

"అంతఃపురం వాకిట కాపలా ఉండే భటులనేం చేస్తావు?"

"నేను వేసే కేకలకు భయపడి నన్ను చక్రవర్తి దగ్గరకు తీసుకొని వెళతారు!"

"చిన్న పళువేట్టరయ్యర్ని అలా ఏం దబాయించలేవు. ఆయన అనుమతి లేనిదే యముడు కూడ చక్రవర్తిని సమీపించలేడని తంజావూరు ప్రజలు మాట్లాడుకోవడం కద్దు. అందుకే చక్రవర్తి ఇంకా సజీవంగా ఉన్నారని కొందరు మాట్లాడుకోగా విన్నాను కూడ."

"చక్రవర్తిని చూడలేకపోతే, పళువేట్టరయ్యర్లనే ఈ అక్రమానికి పరిహారం ఉందా లేదా అని అడిగేస్తాను! వాళ్ళు తగిన పరిహారం చేయకపోతే, ముఖ్యమంత్రి బ్రహ్మరాయల దగ్గరికి వెళతాను. అది కూడ నిరుపయోగమైతే, పళైయారైలో ఉన్న రాణుల దగ్గరికి వెళ్ళి మొర పెట్టుకొంటాను. నా అత్త గతేమైందని

తెలుసుకొనే వరకు ఒకచోట నెమ్మదిగా ఉండను. ఆమెకు జరిగిన అన్యాయానికి పరిహారం లభించేవరకు రాత్రింబగళ్ళు నిద్రపోను. వదిన నా అత్తను 'మూగపిశాచి' అన్నది కద? నేను కూడ ఒక పిశాచినై ఊరూ, వాడా తిరుగాడుతాను. 'న్యాయం! న్యాయం' అని అరుస్తూ తిరుగుతాను...అముదా! నీవు కూడ నాతోబాటు వస్తావా...?"

"తప్పక వస్తాను, పూంగుళలీ! నీకిష్టమైతే వస్తాను. కానీ ఎందుకు నీవు నీ మనసునిలా కల్లోలితం చేసుకొంటున్నావు? మనం మొదట చేయవలసింది నీ అత్తను వెతికి కనిపెట్టడం కద? ఆమెను బంధించి తీసుకొని వెళ్ళిన దుష్టులనుంచి ఆమెను విడుదల చేయాలి కద? నీ తండ్రి, అన్నగార్లకు చెప్పవద్దా..?"

"అముదా! నా అత్త మానవాతీత శక్తులు కలది. ఆమెకు ఎవరూ ఎటువంటి కీడు కూడ చేయలేరు. కంటిచూపుతోనే భస్మం చేసేయగలదు. కాబట్టి ఆమె గురించి నాకంతగా దిగుల్లేదు. కానీ ఈ చోళసామ్రాజ్యంలో పట్టపగలే ఇటువంటి అక్రమాలు జరుగుతున్నాయి కద? పరాంతక చక్రవర్తి కాలంనుంచి ఈ చోళనాడులో ధర్మరాజ్యం నడుస్తున్నట్లు చెబుతున్నారు. మహాశివభక్తులైన గండరాదిత్యులు పరిపాలించిన ఈ దేశంలో, ఆవు, పులి ఒకే సెలయేరునుంచి నీళ్ళు తాగేవని గొప్పగా చెప్పుకొంటున్నారు. సుందరచోళ చక్రవర్తి పరిపాలనలో ఈ చోళనాడులో బాలికలు కూడ రాత్రింబగళ్ళు నిర్భయంగా ఎక్కడికైన ప్రయాణం చేయవచ్చని దండోరా కొట్టి మరీ చెబుతున్నారు. అలా పేరుగాంచిన రాజ్యంలో, ఒక మూగవనిత – చెవిటిది, మూగది అయిన ఒక పేదరాలిని పట్టపగలే కొందరు దుష్టులు పట్టి బంధించి వెళ్ళిపోవడమంటే, అది ఎంతటి అక్రమం? నా అత్త గురించి కూడ నాకంతగా దిగుల్లేదు. ఈరోజు నా అత్తకు కలిగిన విపత్తు రేపు నాకు కలగవచ్చు కద? ఇంకా ఈ దేశంలో ఉన్న పలువురు కన్యలకు కలగవచ్చు కద?"

సేందన్ అముదన్ అప్పుడు పూంగుళలికి అడ్డుపడి, "అవును. అటువంటి అపాయం ఈ చోళనాడులో తప్పకుండ ఉంది. సుందర చోళ చక్రవర్తి జబ్బుతో మంచం పట్టినప్పటినుంచి ఈ రాజ్యంలో ధర్మం తలకిందులైపోయింది. ప్రజలకు కాపలా, రక్షణ ఎండమావైపోయింది. ఆడపిల్లలకు అపాయం పొంచివుంది. కాబట్టి కన్యలందరూ సాధ్యమైనంత త్వరలో పెళ్ళి చేసుకోవడమే మంచిది!" అన్నాడు.

పూంగుళలి ఇది విని గలగల నవ్వింది.

"అముదా! ఒక కన్య నిన్ను పెళ్ళి చేసుకొంటే ఆమెను నీవు కాపాడగలవా? నీవు కత్తి పట్టి పోరాడడం తెలుసా?" అని అడిగింది.

"పూలమాల కట్టడం, భక్తి పద్యాలు పాడి శివపరమాత్మను స్తుతించడం మాత్రమే నేను నేర్చుకొన్నాను. కత్తి పట్టి యుద్ధం చేయడం నేను నేర్చుకోలేదు. అందువల్లనేమి? తెడ్లు పట్టి పడవ నడపడం నీవు నాకు నేర్పలేదా? అలాగే కత్తి పట్టి పోరాడడం కూడ నేర్చేసుకొంటాను. మధురాంతక దేవరు సింహాసనమెక్కి రాజ్యమేల ఆశపడుతున్నప్పుడు, నేను కత్తి యుద్ధం నేర్చుకోవడమా

అసాధ్యమవుతుంది?" అన్నాడు సేందన్ అముదన్.

ఇంతలో పూంగుళలి వదినను కట్టిపెట్టిన చెట్టు దగ్గరికి వచ్చేశారు వారు. కానీ అక్కడ ఆమె కనిపించలేదు. ఆమె తల మీద తగిలిన గాయం నుంచి నేల మీద చిందిన రక్తబిందువులను పూంగుళలికి చూపించాడు అముదన్.

"బాగ కొట్టిపడేసినట్లున్నారు; అత్తను పట్టుకొని వెళ్ళినవారికి వదిన సహాయం చేయలేదన్నది ఇప్పుడు రూఢిగా తెలిసింది. కానీ ఆమె ఇంకెవరి కోసం ఏ రహస్యం కనిపెట్ట ప్రయత్నించిందన్నది మనం కనిపెట్టి తెలుసుకోవాలి!" అన్నది పూంగుళలి.

"నా మామ కూతురా / మరదలా! ఇది విను! ఇక్కడ జరిగినవన్నీ కారణం తెలియని మర్మభూయిష్టమైన సంఘటనలుగా ఉన్నాయి. అన్నీ రాజ్యాంగానికి/రాజకీయాలకు, రాజవంశానికి సంబంధించిన చిక్కులుగా అగుపిస్తున్నాయి. వీటి గురించి నీవు, నేను ఎందుకు దిగులుపడాలి? మనని మనమే ఎందుకు ఇక్కట్లకు గురి చేసుకోవాలి?"

"అముదా? ఎంత పెద్ద రాజకీయ విషయమైతేనేమి? ఎంతటి మర్మభూయిష్టమైనదైతేనేమి? నా అత్తకు సంబంధించిన విషయంలో నేను పాలుపంచుకోకుండ ఉండగలనా? నీ పెద్దమ్మ గతి గురించి నీవు దిగులుపడకుండడం సాధ్యమా?"

"నా మనసులో తోచింది నేను చెబుతున్నాను పూంగుళలీ! నేను చూసిన ఏడెనిమిది మంది మధ్య ఒక స్త్రీ కూడ ఉందని చెప్పాను కద? ఆమె నా పెద్దమ్మే కావచ్చని కూడ  చెప్పాను కద? ఆమె నడిచి వెళ్ళిన విధం చూస్తే, ఆమెను బలవంతంగా తీసుకొని వెళుతున్నట్లు కనిపించలేదు. తన ఇష్టప్రకారమే స్వచ్ఛందంగా వెళ్ళినట్లు తోచింది..."

"కావచ్చు, అముదా! అలాగూ ఉండవచ్చు; నా అత్త స్వభావమే అలాంటిది! ఎక్కడికి తీసుకొని వెళుతున్నారో తెలుసుకోవడానికే అలా ఇష్టపడి వెళ్ళివుండవచ్చు. ఆమెకు ఇష్టం లేకపోతే వెయ్యిమంది మధ్యనుంచి కూడ ఆమె తప్పించుకోగలదు. కోట గోడలు, పాతాళ చెరసాలలు కూడ ఆమెను బంధించి ఉంచలేవు. అందుకే, అత్తకు కలిగిన ఆపద గురించి నేనంతగా దిగులుపడడంలేదని చెప్పాను. అత్తకు జరిగిన అన్యాయానికి పరిహారం వెతకడమే నా ముఖ్యోద్దేశం. ఆ అన్యాయం ఇప్పుడు కలిగింది కాదు; ఇరవై ఐదేళ్ల క్రితం కలిగిన అతిక్రూరమైన అన్యాయం! దానికి పరిహారం దొరికేవరకు నాకు నెమ్మది లేదు!" అన్నది పూంగుళలి.

"భగవాన్! ఎటువంటి అసాధ్యమైన కార్యంవైపు నీ మనసును కేంద్రీకరించావు, పూంగుళలీ!" అని చెప్పి సేందన్ అముదన్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

కాస్త దూరాన ఎవరో మాట్లాడుకొంటున్న శబ్దం వినిపించింది; ఒక గొంతు ఆడగొంతు. మాట్లాడుకొంటున్నవారిని తంజావూరు రాజబాట దగ్గర చూశారు పూంగుళలి, అముదన్.

వదినతో మాట్లాడుతున్నది పళైయార్రై వైద్యకుమారుడని చూసి తెలుసుకొన్న వెంటనే పూంగుళలికి చిరాకు, కోపం ముంచుకొచ్చాయి.

రాక్కమ్మ పూంగుళలిని చూడగానే, “అమ్మాయీ! బతికి వచ్చావా? నిన్ను చంపేశారేమోనని భయపడ్డాను. ఇదిగో చూడు! నీ అత్తను కాపడే ప్రయత్నంలో నా తలమీద ఎంత పెద్ద గాయం తగిలింది? వైద్యకుమారుని ఈ గాయానికి మందేమైన ఉందా అని అడుగుతున్నాను!” అన్నది.

“కరైయర్ (పూంగుళలి తండ్రి) కుమార్తెకు ఏదైన గాయమైవుంటే దానికి కూడ మందు వేసి నయం చేస్తాను" అన్నాడు వైద్యకుమారుడు.

పూంగుళలి అతడికి బదులివ్వక, “వదినా! అత్తను పట్టి బంధించి తీసుకొని వెళ్ళినవారు ఎటువైపు వెళ్ళారో నీకు తెలుసా?” అని అడిగింది.

“నేను చూడలేదు. తంజావూరు బాట వెంబడి వెళ్ళారని ఈ వైద్యకుమారుడు చెబుతున్నాడు...”

“వదినా! నేను, అముదన్ అత్తను వెతుక్కొంటూ వెళ్ళబోతున్నాము. నాన్నకు చెప్పు! అముదా! రా!” అని చెప్పేసి పూంగుళలి వెంటనే అక్కడినుంచి ముందుకు కదిలింది.

అప్పుడు వైద్యకుమారుడు అడ్డుపడి, “పూంగుళలీ! కాస్త ఆగు! మీరు వారిని వెంబడించి పట్టుకోలేరు ఇక్కడినుంచి కాస్త దూరాన ఆపివుంచిన గుర్రాలనెక్కి వెళ్ళారు వారు. నా దగ్గర ఒక గుర్రముంది. నేను వాయువేగ, మనోవేగాలతో గుర్రం మీద వెళ్ళి వారెక్కడికి వెళ్ళి చేరబోతున్నారన్నది కనిపెట్టి తిరిగివచ్చి మీకు చెబుతాను. దానికి ప్రత్యుపకారంగా నీవు నాకొక సహాయం చేయాలి. నీవు, నీ అత్త పడవెక్కి ఎక్కడికి వెళ్ళాలని బయల్దేరారు? అది మాత్రం చెప్పు, చాలు!” అన్నాడు.

పూంగుళలి, “వదినా! ఇతడి సహాయం మాకవసరం లేదు! మేము వెళుతున్నాము. నాన్నకు చెప్పడం మరవకు!” అన్నది.

వైద్యకుమారుడు అప్పటికీ వదల్లేదు. “ఆహా! కరైయర్ కుమార్తె గర్వాన్ని చూడండి! నా సహాయం అవసరం లేదట! అమ్మాయీ! నీకు నామీదెందుకింత కోపం? నీవు రాకుమారుని పెళ్ళాడడాన్ని నేనా అడ్డుపడి ఆపాను? నన్ను వంచించి, ఏమార్చి పడవలో ఎక్కించుకొని వెళ్ళావు కద? నీవు ఆశపడ్డ ఆ వాణర్కుల వీరుని సముద్రం పొట్టనపెట్టేసుకొంది కద! నామీద కోపగించుకొని ఏం ప్రయోజనం?” అనేసి 'హహ్హహ్హ' అని బూటకపు నవ్వు నవ్వాడు.

పూంగుళలి కళ్ళలో నిప్పులు కక్కుతుండగా అతన్ని కాల్చేసేటట్లు ఒక్క చూపు చూసేసి, అముదన్ చేయి పట్టుకొని రాజబాటెక్కింది.

కాస్త దూరం వెళ్ళిన తర్వాత, “అముదా! నీవు కత్తిసాము నేర్చుకొన్న తర్వాత మొదట ఈ ధూర్తుడైన వైద్యకుమారుని ముగించాలి. నీ కత్తికి మొదటి బలి వీడే!” అన్నది.

రాత్రింబగళ్ళు నిర్విరామంగా రాజబాట వెంబడి తంజావూరు వైపు నడిచి వెళ్ళారు ఇద్దరూను. వెళ్ళేదారిన ఏడెనిమిది మంది గుర్రాల మీద వీరులు ఒక స్త్రీని తీసుకొని ఎటువైపు వెళ్ళారని విచారించి తెలుసుకొంటూ సాగారు. సగం దూరం వరకు సమాచారం తెలిసి వచ్చింది. ఆ తర్వాత సమాచారమేమీ దొరకలేదు. అయినా కూడ తంజావూరు వరకు వెళ్ళి వెతికి తెలుసుకోవాలని పట్టుదలగా వెళ్ళారు.

సేందన్ అముదన్‌కి ఈ ప్రయాణం చాల ఉత్సాహాన్నిచ్చింది. పూంగుళలితో మాట్లాడుతూ వెళ్ళడం ఒక కారణం; కత్తి పట్టి పోరాడడంలో శిక్షణ పొందడం ఇంకొక కారణం.కోడిక్కరై సమీపానే పూంగుళలికి తెలిసిన ఒక కొలిమిలో అతడొక కత్తిని కొనుక్కొన్నాడు. దారిన వెళ్ళేటప్పుడు దాన్ని తిప్పుతూ వెళ్ళాడు. కొన్నిసార్లు తన ఎదుట పగవారున్నట్లు ఊహించుకొని కత్తిని అడ్డదిడ్డంగా తిప్పేవాడు. అప్పుడు పూంగుళలి కత్తిని ఇలా పట్టుకోవాలి, అలా పట్టుకోవాలి అని నేర్పించేది.

ఇందువల్ల ఇద్దరికీ ప్రయాణం ఉత్సాహంగా సాగింది.

తంజావూరు కోట కనిపించగానే తాను చేపట్టిన కార్యాన్ని ఎలా నెరవేర్చబోతున్నామనే దిగులు పట్టుకొంది పూంగుళలికి. కోట లోపల ప్రవేశించడమే బ్రహ్మకార్యం కద? తాను తలుచుకొన్న కార్యాలన్నీ ఎలా సాధించడం?

వంతిదేవుని వికట సామర్థ్యాలన్నీ అముదన్ గుర్తు తెచ్చుకొన్నాడు. అతడి సామర్థ్యాలలో పదో వంతు తనకు ఉంటే ఎంత బాగుండేది...! లేక ఆ వంతిదేవుడే ఇప్పుడిక్కడికి రాకూడదా...!

వంతిదేవుడిక్కడ ఉంటే ఏం చేసేవాడని సేందన్ అముదన్ ఆలోచించసాగాడు.

ఆ సమయాన బాట వెంబడి ఒక మూసిన పల్లకి వస్తుండడం కనిపించింది. పొద్దుగుంకి చీకటి అలముకొనే సమయం. మూసిన పల్లకి పైనున్న తెరమీద తాటి చెట్టు చిహ్నం కనిపించింది.

"ఆహా! పళువూర్ యువరాణి పల్లకిలాగుంది కద? కోట బయటే పళువూర్ యువరాణిని కలిసి రాజముద్రను పొందగలిగితే ఎంత బాగుంటుంది?" అనుకొన్నాడు అముదన్. ఈ ఆలోచనను పూంగుళలికి కూడ చెప్పాడు. ఆమె కూడ అది మంచి ఆలోచనే అన్నది.

కానీ పల్లకి లోపలున్న రాణిని ఎలా చూడడం?

పల్లకి వెనక కూడ కాపలవీరులున్నారు కద? పల్లకిని సమీపించడానికి కూడ వాళ్ళు వదలరు కద?

"అముదా! దిగులు పడకు! తంజావూరు కోట ఇంకా అర్ధకోసు దూరముంది. అంతలోపల మనకేమైన అవకాశం దొరక్కపోదు!" అన్నది పూంగుళలి.

ఎదురు చూడని విధంగా వారికి అటువంటి అవకాశం దొరికింది.

~~~
~~~

# అధ్యాయము - 21

## పల్లకి ఎక్కే భాగ్యం!

**ఆయేడు** వర్షాలు మామూలుగా ప్రారంభమయ్యే కాలానికి రాలేదు. రెండుసార్లు వాన వచ్చేటట్లు వచ్చి ఆగిపోయింది. కావేరి నదిలోను, దాని ఉపనదుల్లోను ప్రవాహం రానురాను తగ్గిపోసాగింది. అప్పుడే నాటిన పైర్లకు చాలినంత నీరందక పైర్లు వాడిపోసాగాయి.

"అంతా ఆ తోకచుక్క వల్ల వచ్చిన విపత్తు" అని మాట్లాడుకోసాగారు ప్రజలు.

'దేశానికి రాగల విపత్తులన్నీ ఒకేసారి వస్తాయి కాబోలు; రాజ్యకార్యాల్లో గందరగోళం; యువరాజు గురించిన సమాచారం లేదు; ఆకాశం కూడ మనని ఏమార్చేస్తుంది లాగుంది' లాంటి మాటలను దారి పొడుగునా పూంగుళలి, సేందన్ అముదన్ వింటూ వచ్చారు.

వాన పడకపోవడమేమో వారి ప్రయాణానికి చాల అనుకూలమైంది.

ఆరోజు పొద్దుటినుంచే ఎండ చుర్రుమని కాస్తోంది. మధ్యాహ్నసమయానికి తట్టుకోలేనంతగా ఉక్కపోయసాగింది. రాజబాట పక్కనున్న చెట్ల చల్లని నీడలో నడుస్తున్నప్పుడు కూడ వారికి విపరీతంగా చెమర్చసాగింది.

"ఇది ఆశ్వయుమాసంలాగే అనిపించడం లేదే? వైశాఖమాసం ఎండల్లాగ కద ఉంది?" అని ఒకరికొకరు చెప్పుకొంటూ ముందుకు సాగారు.

పళువేట్టరయ్యర్ అంతఃపురపల్లకి వారిని దాటి వెళ్ళిన కాసేపటికల్లా చల్లనిగాలి వీచసాగింది. చెట్ల ఆకులు గలగలమని ఆడసాగాయి.

ఈశాన్యదిక్కున చీకటి అలముకోసాగింది. దట్టమైన మేఘాలు కమ్ముకొంటున్నాయి.

కాసేపటికల్లా ఆ మేఘాల గుంపు మదించి పరుగెత్తి వచ్చే ఏనుగుల్లాగ ఆకాశం పైపైకి రాసాగాయి.

పిల్లగాలి పెనుగాలైంది; పెనుగాలితో వాన చినుకులు సర్రున పడసాగాయి తుంపరగా మొదలైన వాన కాసేపటికల్లా జడివానై భోరున కురవసాగింది.

ఆ గాలివానలో బాట పక్కనున్న చెట్లు పడ్డ పాట్లు చెప్పనలవి కాదు. ఫెళఫెళమని చెట్ల కొమ్మలు విరిగి పడసాగాయి. అప్పుడు ఆ చెట్లలో తలదాచుకొన్న పక్షులు కీచుమని అరుస్తూ ఎగిరిపోసాగాయి.

దారిన వెళుతున్న జనాలు కూడ నలువైపుల పరుగెత్తి తలదాచుకోసాగారు.

ఆ గాలివాన నుంచి తప్పించుకోవడానికి కొందరు పరుగెత్తారు. చెట్ల కొమ్మలు మీద పడకుండ

తప్పించుకోవడానికి ఇంకొందరు పరుగెత్తారు. బ్రహ్మాండం పేలిపోతున్నట్లున్న పిడుగుల శబ్దానికి భయపడి మరి కొందరు పరుగెత్తారు.

వాన మొదలైన కాసేపటికల్లా పగటివేళ ముగిసి రాత్రి మొదలైంది.

ఆ రాత్రే తంజావూరు కోట లోపల ప్రవేశించాలన్న ఉద్దేశాన్ని సేందన్ అముదన్, పూంగుళలి విడిచిపెట్టేశారు. సేందన్ అముదన్ గుడిసెకు వెళ్ళి చేరితే చాలనిపించింది వారికి. వానాకాలపు చీకటిలో ఒకరికొకరు ధైర్యం చెప్పుకొంటూ జాగ్రత్తగా నడిచివెళ్ళారు.

"పూంగుళలీ! నడిసముద్రంలో ఎంత గొప్ప సుడిగాలి, జడివాన చూసినదానివి కద! కొండెత్తు అలల్లో ధైర్యంగా పడవ నడపగలవు కద! మరి ఈ వానకు ఎందుకింత భయపడుతున్నావు?" అని అడిగాడు సేందన్ అముదన్.

"నడిసముద్రాన ఎంతటి సుడిగాలి వీచినా, జడిగాన కురిసినా తలమీద చెట్లకొమ్మలు విరిగి పడవు కద? పడితే పిడుగే కద పడుతుంది?" అన్నది పూంగుళలి.

ఇలా పూంగుళలి చెప్పి ముగించేలోపు వారికెదురుగా కాస్త దూరాన ఫెళఫెళమని ఒక చెట్టు కొమ్మ విరిగిపడే శబ్దం వినిపించింది.

సేందన్ అముదన్ పూంగుళలి చేతిని గట్టిగా పట్టుకొని ఆమెను ఇక ముందుకేమీ చెప్పనీయక ఆపాడు.

"ఇక తొందరపడి ముందుకు వెళ్ళడం వల్ల ప్రయోజనం లేదు. దారి పక్కనే కొన్ని మంటపాలున్నాయి. వాటిలో ఒక మంటపంలో తలదాచుకొని వాన ఉధృతం కాస్త తగ్గిన తర్వాత వెళదాం" అన్నాడు సేందన్ అముదన్.

"అలాగే చేద్దాం. కానీ ఈ చీకటిలో మంటపాన్ని ఎలా కనిపెట్టడం?" అన్నది పూంగుళలి.

"మెరుపులు మెరిసేటప్పుడు చూస్తే తెలిసిపోతుంది. ఇరువైపులా నిశితంగా చూడాలి" అన్నాడు అముదన్.

భూమ్యాకాశాలను  సూర్యకాంతిమయంగా చేసి, కళ్ళు మిరుమిట్లుగొలిపేటట్లు ఒక మెరుపు మెరిసింది.

"అదిగో ఒక మంటపం!" అన్నాడు సేందన్ అముదన్.

పూంగుళలి కూడ ఆ మంటపాన్ని చూసింది. అదే కాంతిలో వారి ముందు కాస్త దూరాన ఒక పెద్ద చెట్టు పడివుండడాన్ని కూడ చూసింది. పడ్డ చెట్టు అడుగున కొందరు చిక్కుబడివున్నట్లు తోచింది.

"అముదా! విరిగి కింద పడ్డ చెట్టును చూశావా? దాని కింద..." అన్నది

"అవును, చూశాను. ఆ గతి మనక్కూడ పట్టబోతూంది. త్వరగా మంటపానికి వెళ్ళి చేరుదాం!" అంటూనే అముదన్ పూంగుళలి చేయి పట్టుకొని మంటపాన్ని గురిగా పెట్టుకొని ఆ దిక్కున వేగంగా

వెళ్ళాడు.

ఇద్దరూ మంటపాన్ని చేరారు; ముద్దగా తడిసిపోయిన బట్టలనుంచి నీటిని పిండారు. తర్వాత పూంగుళలి తన పొడవైన జడవెంట్రుకలను కూడ పిండింది. పిండిన వాన నీళ్ళు మంటపం నేలమీద పడి చిన్న కాలువలాగ పారింది.

“అరెరె! మంటపాన్ని తడిచేసేశాం కద!” అన్నది పూంగుళలి.

“మంటపానికి అందువల్ల నష్టమేమీ కలగదు. జలుబేమీ రాదు! నీవిలా పూర్తిగా తడిసిపోయావే!” అన్నాడు అముదన్.

“నేను కడలిలోనే పుట్టి పెరిగినదాన్ని. నాకు ఇంకొక పేరు 'సముద్రకుమారి'. నన్నీ వానేం చేసేయబోదు!” అన్నది పూంగుళలి.

వారి మనస్సులప్పుడు తంజావూరు కోట దగ్గరున్న మంటపంనుంచి నాగపట్టణం చూడామణి విహారానికి ఎగిరి వెళ్ళాయి. 'సముద్రకుమారి' అని ఆమెను మొట్టమొదట పిలిచిన వారు ఆ చూడామణి విహారంలో కద ఉన్నారిప్పుడు?

“పూంగుళలి! నా నందనవనం గుడిసె దగ్గర్లోనే ఉంది. వాన ఆగగానే అక్కడికి వెళ్ళిపోవచ్చు. నా తల్లి నిన్ను బాగ చూసుకొంటుంది!” అని సేందన్ అముదన్ అన్న మాటలు పూంగుళలి చెవిన సరిగ్గా పడలేదు.

మళ్ళీ కళ్ళు మిరుమిట్లుగొలిపేటట్లు ఇంకొక మెరుపు.

దాని వెలుతురులో వారికి ఇంతకు మునుపు అస్పష్టంగా కనిపించిన దృశ్యం ఇప్పుడు స్పష్టంగా అగుపించింది. అది చూసి ఇద్దరూ అదిరిపడ్డారు.

బాటమీద వారున్న మంటపానికి ఇంచుమించు ఎదురుగా ఒక పెద్ద మర్రిచెట్టు కూకటివేళ్ళతో పెకలించుకొని పడివుంది. విశాలంగా పరుచుకొన్న దాని కొమ్మలు రెమ్మలు కూడ విరిగి చెదరిపడివున్నాయి.

వాడి కింద రెండు గుర్రాలు ఐదారు మనుషులు చిక్కుపడివున్నారు. అలా చిక్కుపడ్డవారిని విడుదల చేసి కాపాడేందుకు ఇంకొంతమంది ప్రయత్నిస్తుండడం కనిపించింది. తొందర తొందరగా వారు విరిగి చెదరిపడివున్న కొమ్మలను పక్కకు తొలగిస్తున్నారు.

“అయ్యో!”, “అబ్బా!”, “అక్కడ!”, “ఇక్కడ!” “వేగంగా!” అన్న కేకలు వానహోరు మధ్య మెల్లగా వినిపించాయి.

వీటన్నిటికన్న సేందన్ అముదన్, పూంగుళలి ఆసక్తిని ఇంకొక దృశ్యం ఆకట్టుకొంది. విరిగిపడ్డ చెట్టుకు కాస్త దూరాన ఒక పల్లకి నిలబడివుంది. దానికి కాపలాగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. తక్కినవారు చెట్టు కొమ్మల కింద చిక్కుకొన్నవారిని కాపాడడంలో నిమగ్నమైవున్నట్లున్నారు.

"అముదా! పల్లకిని చూశావా?" అని అడిగింది పూంగుళలి.

"చూశాను. పళువూర్ యువరాణి పల్లకిలాగుంది" అన్నాడు అముదన్.

"పడ్డ చెట్టు ఆ పల్లకి పైన పడివుండకూడదా?"

"భగవాన్! ఎందుకలా అంటున్నావు? పళువూర్ యువరాణిని కలిసి ఆమె ద్వారా ఏదో కార్యం నెరవేర్చుకోవాలని చెప్పావు కద?"

"అవును. అయినా కూడ ఆ పళువూర్ రాణి నాకంతగా నచ్చలేదు!"

"నచ్చకపోతే, ఆమె మీద చెట్టు విరిగిపడాలా, ఏమి?"

"సాధారణప్రజల మీద మాత్రమే చెట్లు విరిగిపడాలా? రాణుల తలమీద పడకూడదా?...అదలా ఉండనీ. మనమిప్పుడు పల్లకి దగ్గరికి వెళ్ళి పళువూర్ యువరాణిని చూసి మాట్లాడుదామా, వద్దా? కోట లోపల వెళ్ళేందుకు ఆమె సహాయం అడుగుదామా?"

"భలే బాగుంది! రాణిని చూసేందుకు మంచి సమయం! మంచి చోటు! పల్లకిని సమీపిస్తే, ఈ వానాకాలపు చీకటిలో దొంగతనం చేసేందుకు వచ్చినవారని ఎంచి మనని కొట్టిపడేసినా ఆశ్చర్యం లేదు!"

"రాణిని నేను చూసేస్తే, తర్వాత మన కార్యం సులువైపోతుంది..."

"అదెలా?"

"నా వదిన పేరు చెబుతాను. లేకపోతే మాంత్రికుడు రవిదాసు పంపాడని చెబుతాను."

"భలే ఉపాయమే! కానీ రాణి దగ్గరికి పోగలిగితేనే కద...? అదిగో చూడు, పూంగుళలి!"

మళ్ళీ ఒక మెరుపు మెరిసింది; ఆ కాంతిలో ఇద్దరు మనుషులు పల్లకిని ఎత్తడం కనిపించింది. ఆహా! బయల్దేరేశారా? లేదు, లేదు! మంటపంవైపు కద వస్తున్నట్లుంది?

అవును, కాసేపటికల్లా పల్లకి మంటపం ముందు వచ్చి నిలిచింది. పల్లకి బోయీలు దాన్ని కిందికి దింపారు.

"పళువూర్ యువరాణి మనని వెతుక్కొంటూ వస్తూంది!" అన్నది పూంగుళలి.

సేందన్ అముదన్ పూంగుళలి చేతిని పట్టుకొని మంటపం లోపలికి వెళ్ళబోయాడు; కానీ పూంగుళలి ఉన్నచోటునుంచి కదల్లేదు.

ఇంతలో "ఎవరక్కడ?" అని ఒక గద్దింపు వినిపించింది.

అది పల్లకిని మోసుకొని వచ్చినవారిలో ఒకడి గొంతని తెలిసుకొని, "భయపడకన్నా! మీలాగ మేము కూడ బాటసారులమే. వాననుంచి తలదాచుకోవడానికి మంటపంలోకి వచ్చాము!" అన్నది పూంగుళలి.

"సరే, సరే! పల్లకి దగ్గరికి రాకు!" అన్నది అదే గొంతు.

"మేమెందుకు పల్లకి దగ్గరికొస్తాము? పల్లకెక్కే భాగ్యం మాకెక్కడిది?" అన్నది పూంగుళలి.

సేందన్ అముదన్, “తిరువళ్ళువర్ దీని గురించి కూడ ఒక మాట చెప్పారు. పూర్వజన్మలో చేసిన చెడు గురించి చెప్పేటప్పుడు...” అని మొదలెట్టాడు.

“చాలు, చాలు! నోరు మూసుకొని ఊరుకోండి! మీరెంత మంది?”

“మేమిద్దరం మాత్రమే. ఇంకా రెండు వందలమంది వచ్చినా ఈ మంటపంలో తలదాచుకోవడానికి తావుంది!” అన్నాడు అముదన్.

తాను నిజమని నమ్మినదే చెప్పాడు అముదన్. అదే మంటపంలోపలి భాగాన ఒక స్తంభం వెనక మూడో మనిషి దాగివుండడం అతడికి తెలియలేదు.

పల్లకి బోయీ, “నేనప్పుడే చెప్పాను. వాన మొదలవగానే మంటపంలోపలికి వెళ్ళి తల దాచుకొందామని; వినలేదు. అందుకే ఈ సంకట పరిస్థితి వచ్చింది!” అని తన సహ బోయీతో చెప్పుకొన్నాడు.

అప్పుడు ఇంకొక మెరుపు పెద్దగా మెరిసింది.

సేందన్ అముదన్, పూంగుళలి - ఇద్దరి చూపులు, ధ్యానం పల్లకి మీదే ఉన్నాయి.

కాబట్టి ఆ మెరుపు కాంతిలో పల్లకి తెరను తొలగించుకొని ఒక స్త్రీ తాము నిలబడ్డవైపే గుచ్చి చూడడాన్ని గమనించగలిగారు. అలా చూసిన స్త్రీమణి వారు ఫలానావారని తెలుసుకొని ఒక చిరునవ్వు నవ్వడాన్ని కూడ గమనించారు. మరుక్షణమే మంటపంలోను, బయటా చీకటి కమ్ముకొంది.

అతి మెల్లని స్వరంతో పూంగుళలి "అముదా! చూశావా?” అన్నది.

“అవును, చూశాను.”

“పల్లకిలో ఉన్నది ఎవరు?”

“పళువూర్ యువరాణే కద?”

“నీకేమనిపించింది?”

“పళువూర్ యువరాణిలాగే తోచింది. కానీ కాస్త సందేహంగా ఉంది.”

“సందేహం లేదు; నిశ్చయమే!”

“ఏది నిశ్చయం?”

“పళువూర్ రాణి కాదు; పిచ్చిపట్టిన నా అత్త రాణే పల్లకిలో ఉంది!”

“ష్! గట్టిగా మాట్లాడకు!”

“గట్టిగా మాట్లాడకపోతే కార్యం నెరవేరేదెలా?”

“ఏ కార్యం?”

“ఎందుకు ఇంత దూరం వచ్చామో, ఆ కార్యమే. అత్తను కనిపెట్టేశాం. ఆమెను విడిపించి తీసుకొని వెళ్ళాలి కద?”

“ఇప్పుడది సాధ్యంకాని కార్యం, పూంగుళలీ! పల్లకి ఎక్కడికి వెళ్ళి చేరబోతోందని చూసుకొందాము. తర్వాత ఆలోచించి విడిపించుకోవడానికి దారి కనిపెడదాం.”

“తొండాన్ని వదిలేసి తోకను పట్టుకొందామంటున్నావేమి? అదంతా వీలుకాదు; ఇప్పుడే అత్తను విడిపించాలి. నీకు భయమైతే ఊరుకో!”

“విడుదలయ్యేందుకు నీ అత్త సమ్మతించాలి కద? పల్లకిలో ఎక్కి వైభవంగా వెళుతోంది. ఎక్కడికి వెళుతోంది, ఎందుకని, ఎవరామెను పట్టి తీసుకొని రమ్మనారు - ఇదంతా తెలుసుకోవద్దా?”

“పాతాళ చెరసాలకు తీసుకొని వెళుతున్నారో, ఏమో? తర్వాత మనం ఏం చేయగలం?”

“ఎందుకు కాదు? పాతాళ చెరసాలలో నేనే ఒకసారి బంధించబడి, తర్వాత బయటపడ్డాను కద? అంతఃపురంలో నాక్కూడ కాస్త పలుకుబడి ఉంది. నీ అత్తను ఎలాగైనా నేను విడుదల చేయిస్తాను. ఇప్పుడు కాస్త ఊరుకో!”

పూంగుళలి కూడ అప్పుడు కాస్త ఓపిక పట్టాలని తీర్మానించుకొంది. అప్పుడు వారు ఏమాత్రం ఎదురుచూడని సంభవం ఒకటి జరిగింది.

మూసిన పల్లకి తెర ఇంకా బాగ తొలగించబడింది. ఆ పల్లకినుంచి ఒక ఆకారం బయటికొచ్చింది. ఏమాత్రం శబ్దం చేయకుండ పిల్లిలాగ నడిచివచ్చింది. మరుక్షణమే వారి సమీపానికొచ్చేసింది.

ఇదంతా చిమ్మచీకటిలో జరిగినందువల్ల మంటపం కింది మెట్లమీద నిలబడ్డ కాపలావారి కంట పడలేదు.

పల్లకినుంచి వచ్చింది మూగరాణే అని పూంగుళలి ఆ చిమ్మచీకటిలో కూడ తెలుసుకోగలిగింది.

మూగరాణి ఆ ఇద్దరి చేతులను పట్టుకొని మంటపం వెనకభాగానికి వేగంగా లాక్కొని వెళ్ళింది.

పూంగుళలిని హత్తుకొని ముద్దాడి, ఆమెను చూసిన సంతోషాన్ని వెలిబుచ్చింది.

తర్వాత అత్తకు, మేనకోడలికి మధ్య సంజ్ఞాభాషలో కాసేపు సంభాషణ జరిగింది.

ఆ కారుచీకటిలో వారిద్దరు ఒకరితోనొకరు ఎలా మాట్లాడుకొన్నారో, ఏమో? ఒకరి ఆలోచనను ఇంకొకరు ఎలా అర్థం చేసుకొన్నారో, ఏమో? అది మనం వివరించలేని విషయం.

పూంగుళలి అముదన్‌ని చూసి, “అత్త చెబుతున్నది నీకు తెలుస్తోందా? నన్ను పల్లకెక్కి వెళ్ళమంటోంది. తనని నీ ఇంటికి పిలుచుకొని వెళ్ళమంటోంది!” అన్నది.

“నీ అభిప్రాయమేమి, పూంగుళలి?” అని అడిగాడు సేందన్ అముదన్.

“అత్త చెప్పేది చేయబోతున్నాను. ఆమెను పట్టుకొని రమ్మని పంపినవారు ఫలానావారని తెలుసుకోవడానికి ఇది మంచి ఉపాయం కద?”

“ఆలోచించి చెప్పు, పూంగుళలీ! ఉపాయం సరైనదే! కానీ అందులో ఏం అపాయం ఉందో,

ఏమో?"

"అముదా! నీవు దిగులుపడకు! అత్త చెప్పినట్లు చేయడం వల్ల నాకే అపాయమూ రాదు. అలా అపాయం కలిగేటట్లయితే నా నడుంలో ఈ చురకత్తి ఉండనే ఉంది!" అన్నది పూంగుళలి.

అత్తను మరొకసారి హత్తుకొని, తర్వాత ఆమెలాగే శబ్దం చేయకుండ వెళ్ళి పల్లకిలోకి ఎక్కింది.

~~~
~~~

# అధ్యాయము - 22

## అనిరుద్ధుల ఆశాభంగం!

**ముఖ్యమంత్రి** అనిరుద్ధ బ్రహ్మరాయలు కొన్ని రోజులుగా రాజధానిలోనే ఉంటున్నారు. ఆయనను దర్శించేందుకు రాజ్యాంగ అధికారులు, సామంతరాజులు, సేనాధిపతులు, విదేశీ దూతలు, వర్తక సంఘ ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, దక్షిణభాష, ఉత్తరభాషావిద్వాంసులు మొదలైనవారు వరుసగా వస్తూన్నారు. కాబట్టి ఆయన మాళిగలో చాల జనసందోహంగా/సందడిగా ఉంది.

అనిరుద్ధులు తమకోసం ప్రత్యేకంగా కాపలాదండును ఏర్పాటు చేసుకోలేదు. తమ పరివారాన్ని కూడ చాల చిన్నదిగానే పెట్టుకొన్నారు. కాబట్టి పళువేట్టరయ్యర్లతో తగాదాలు రావడానికి ఏమీ కారణం లేకుండేది.

అయినా కూడ చిన్న పళువేట్టరయ్యర్ సణుగుతున్నారు. ముఖ్యమంత్రి తంజావూరులో విడిది చేయనారంభించినప్పటినుంచి కోట కాపలా తగ్గిపోనారంభించింది. ముఖ్యమంత్రిని చూడాలనే నెపంతో దారిన పోయేవాళ్ళందరూ కోట లోపల దూరుతున్నారు (అని చిన్నపళువేట్టరయ్యర్ ఆరోపణ). చక్రవర్తి అంతఃపురం పక్కనే ముఖ్యమంత్రి మాళిగ ఉండడంవల్ల, అంతఃపురం చుట్టుపక్కల కూడ జనకూటమి అధికమైంది. ముఖ్యమంత్రి పేరు చెప్పుకొని, ఆయన అధికారముద్ర చూపించి అనేకులు వచ్చి ఆయనను దర్శించడం పరిపాటైపోయింది.

ఇదంతా కొంతవరకు కట్టడి చేయాలని చిన్న పళువేట్టరయ్యర్ అనుకొన్నారు. కానీ తిన్నగా ముఖ్యమంత్రిగారి ముందుకు వెళ్ళి వివాదించేందుకు అయనకు ధైర్యం చాలలేదు. పెద్ద పళువేట్టరయ్యర్ కూడ ఉంటే, ఇద్దరూ చేరి ఏదైనా ఆలోచించవచ్చు. ఇదే సమయం చూసి పెద్దాయన కడంబూరుకు వెళ్ళినందువల్ల చిన్నాయనకు ఒక చేయి విరిగినట్లుంది.

కోట లోపలికి జనాలను విశృంఖలంగా రానివ్వడమేగాక, ముఖ్యమంత్రి చిన్న పళువేట్టరయ్యర్ని సహాయం అడిగేటట్లు నటిస్తూ ఆయనకు ఆజ్ఞలు జారీ చేస్తున్నారు.

కొన్నాళ్ళ క్రితం కోడిక్కరైకి పంపించేందుకు కొందరు వీరులు కావాలని అడిగారు. కాలాంతక గండరు కూడ వీరులను ఇప్పించి సహాయం చేశారు. నిన్న ఒక ఉన్నతకులస్త్రీని తిరువైయ్యారునుంచి పిలుచుకొని రావాలని, అందుకు పళువూర్ అంతఃపురపు మూసిన పల్లకి ఒకటి, దానితోబాటు బోయీలు కూడ కావాలని అడిగారు. చిన్న పళువేట్టరయ్యర్ ఈ కోరికను కూడ నెరవేర్చారు. చిన్న పళువేట్టరయ్యర్ 'ఈ బ్రహ్మరాయలు ఏదో కుట్ర పన్నుతున్నారు. అలా మూసిన పల్లకిలో ఎక్కించుకొని పిలుచుకొని రాదగిన ఉన్నతకులస్త్రీ ఎవరు? ఎందుకని ఇక్కడికి వస్తూంది? దీన్ని ఎలాగైనా కనిపెట్టాలి. ఇటువంటి సందర్భంలో

అన్నగారిక్కడ లేకపోయారు కద?' అనుకొన్నారు.

ముఖ్యమంత్రి మాళిగకు మూసిన పల్లకిలో రాబోతున్నదెవరని తెలుసుకోవడానికి ఇంకొక వ్యక్తి కూడ ఆసక్తిగొనివున్నాడు. అది ఇంకెవరో కాదు - అనిరుద్ధ బ్రహ్మరాయల ప్రియశిష్యుడైన ఆళ్వార్ కట్టియానే. జడివాన కురిసిన మరుసటి రోజు పొద్దున అనిరుద్ధ బ్రహ్మరాయలు స్నానపానాలు, జపతపాలు, పూజ పునస్కారాలు ముగించుకొని మాళిగ ముందు వసారాకు వచ్చారు. తమను చూసేందుకు ఎవరెవరు వచ్చారని చూసి రమ్మని సేవకునికి చెప్పారు. వేచివున్నవారిలో ఆళ్వార్ కట్టియాన్ ఉన్నాడని తెలియగానే అతన్ని వెంటనే పిలుచుకొని రమ్మన్నారు.

ఆళ్వార్ కట్టియాన అతివేగంగా తన గురుదేవుల సమక్షానికి వచ్చి భయభక్తి వినయాలతో నిలబడ్డాడు.

“తిరుమలై! వెళ్ళిన కార్యం ఏమైంది?” అని అడిగారు అనిరుద్ధులు.

“గురుదేవా! క్షమించాలి. ఓడిపోయి వెనుదిరిగాను" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“ఒకవిధంగా నేను ఎదురుచూసిందే. ఆదిత్య కరికాలన్‌గారిని కలవలేకపోయావా?”

“కలిసానయ్యా! మీరు చెప్పి పంపిన వార్తను అందించాను కూడ. ఏమీ ప్రయోజనం లేదు. యువరాజుగారిని కడంబూర్ మాళిగకు వెళ్ళకుండ అడ్డుకోలేకపోయాను...”

“యువరాజు ఇప్పుడు కడంబూరులోనే ఉన్నారా?”

“అవును, గురుదేవా! శంబువరయ్యర్ మాళిగలో ఆయన ప్రవేశించడాన్ని చూసిన తర్వాతే తిరిగి వచ్చాను. యువరాజుగారికి శంబువరయ్యర్ రాజోపచారాలు చేసి స్వాగతించారు. చుట్టుపక్కలనుంచి వచ్చిన ప్రజలు చూపిన ఉత్సాహాన్ని వర్ణించనలవికాదు!”

“అదంతా ఎదురుచూసిందే. కడంబూర్ మాళిగకు ఇంకా ఎవరెవరు వచ్చారు?”

“యువరాజుగారితో పార్థిబేంద్రుడు, వంతిదేవుడు వచ్చారు. ఇక్కడినుంచి పెద్ద పళువేట్టరయ్యర్ తమ యువరాణితోబాటు వేంచేశారు. ఇంకా మధ్యనాడుకు, తిరుమునైప్పాడి నాడుకు చెందిన పలువురు చిన్నరాజులు ఆహ్వానించబడ్డారని విన్నాను...”

“తిరుక్కోవలూర్ మలైయమాన్...?”

“మణిముక్తానది వరకు యువరాజుతో వచ్చి, తిరిగి వెళ్ళిపోయారు...”

“ఆ వీరవృద్ధుడు ఊరకే ఉండడు. ఇప్పటికి సైన్యాన్ని కూడదీస్తూ ఉంటాడు. దక్షిణంనుంచి పెద్ద వేళార్ పెద్ద సైన్యంతో వస్తున్నాడని విన్నాను. ఈ రాజ్యానికి కీడేమీ రాకుండ ఆ దేవుడే కాపాడాలి. తిరుమలై! నీవు వచ్చిన దారిన చోళనాడు ప్రజలు ఏం మాట్లాడుకొంటున్నారో విన్నావా?”

“చిన్న యువరాజుకు కలిగిన కడలి విపత్తు గురించే అధికంగా మాట్లాడుకొంటున్నారు. పళువేట్టరయ్యర్ల మీద చాల కోపంగొనివున్నారు. కొందరు మిమ్మల్ని కూడ చేర్చి నిందిస్తున్నారు...”

"అవునవును. నా గురించి అసంతృప్తిగా మాట్లాడుకోవడానికి ప్రజలకు తగిన కారణాలున్నాయి. తిరుమలై! త్వరలో ఈ ముఖ్యమంత్రి పదవినుంచి దిగిపోవాలని అనుకొంటున్నాను..."

"గురుదేవా! మీరలా చేస్తే నాకు కూడ విడుదల లభిస్తుంది. ఆళ్వార్ల పాశురాలను పాడుతూ దేశమంతటా యాత్రలు చేస్తూ ఆనందమయంగా కాలం గడుపుతాను. ఎప్పుడు ఉద్యోగాన్ని వదిలిపెట్టబోతున్నారయ్యా?"

"రాజ్యానికి ఆపద కలగకుండ కాపాడేందుకు ఒక ఆఖరి ప్రయత్నం చేయబోతున్నాను. అది ముగిసిన వెంటనే ఉద్యోగవిరమణ చేయడమే."

"అదేం ప్రయత్నం గురుదేవా?"

"ఆ ప్రయత్నంలో అతిముఖ్యమైన మొట్టమొదటి మెట్టెక్కడమైంది. తిరుమలై! నీవల్ల కాదని చేతులెత్తేసిన ఒక కార్యంలో నేను గెలుపొందాను..."

"అందులో ఆశ్చర్యమేమీ లేదయ్యా! ఆ కార్యమేమిటో?"

"లంకదీవిలో పిచ్చిపట్టినట్లు తిరుగాడుతున్న ఒక మూగవనితను పట్టి తీసుకొని రమ్మని నీకు చెప్పాను కద? నీవల్ల ఆ కార్యం కాలేదని నీవు వెనుదిరిగి వచ్చి చెప్పావు కద?" అన్నారు ముఖ్యమంత్రి అనిరుద్ధులు.

"అవునయ్యా! ఆ మూగవనిత..."

"నిన్న రాత్రి అంతఃపురానికి ఆమెను తీసుకొనిరావడమైనది."

"ఆహా! ఆశ్చర్యం! విచిత్రం! ఎలా సాధించారు?"

"చిన్న యువరాజు ఆపదనుంచి తప్పించుకొని బతికారా లేదానని తెలుసుకోవడానికి ఆమె కోడిక్కరైకి వస్తుందని ఎదురుచూశాను/ఊహించాను. వస్తే పట్టి తీసుకొని రమ్మని మనుషులను పంపించాను. మంచివేళగా ఆమె ఎక్కువ కష్టమివ్వకుండ వారితో వచ్చేసింది. ఈ విచిత్రాన్ని విను, తిరుమలై! తిరుపైయ్యారు నుంచి ఆమెను మూసిన పల్లకిలో ఉంచి తీసుకొని రమ్మన్నాను. ఇందుకోసం పళువూర్ యువరాణి పల్లకినే రప్పించాను..."

"అయ్యా! నిన్న సాయంకాలం పెద్ద సుడిగాలి వీచి జడివాన పడింది కద?"

"అవును. అందువల్ల దారిలో ఆటంకాలేర్పడ్డాయి. నేను కూడ చాల దిగులుపడ్డాను. నిన్న నడిరాత్రి సమయానికి పల్లకి వచ్చి చేరిన తర్వాతే నెమ్మదిగొన్నాను."

"ఓహో, మధ్యరాత్రయ్యిందా? మీరు కూడ అంతవరకు మెలకువగా ఉండి స్వాగతం పలికారా?"

"మేలుకొనేవున్నాను. కానీ స్వాగతించేందుకు నేను వెళ్ళలేదు. ఇంటి ఆడపడుచులనే పంపి స్వాగతం చెప్పి పిలుచుకొని రమ్మన్నాను. పిచ్చిపట్టిన మనిషి కద? ఏం చేస్తుందోనని భయపడ్డాను. అదృష్టవశాత్తు అలా ఏం చేయలేదు; బాగ భోంచేసి వెంటనే నిద్రపోయింది. తిరుమలై! నిజం చెప్పబోతే,

ఇంకా ఆమెను చూసే విషయంలో కాస్త భయంగానే ఉంది. నీవిప్పుడు వచ్చింది చాల మంచిదైంది..."

"గురుదేవా! నేను కూడ ఆ స్త్రీమణిని చూసేందుకు చాల ఆతురతగొనివున్నాను..."

అలాగైతే, రా! అంతఃపురానికి వెళదాం. నిన్ను ఇప్పటికే ఆమె ఎరుగును కద? నీవు చిన్న యువరాజుకు కావలసినవాడివి అని కూడ తెలుసు. కాబట్టి నీతో కాస్త సుముఖంగా ఉంటుందని ఆశిస్తున్నాను."

గురుశిష్యులు మాళిగ వెనుక భాగానున్న అంతఃపురానికి వెళ్ళారు. దాదులను గతరాత్రి వచ్చిన స్త్రీమణిని పిలుచుకొని రమ్మని ఆజ్ఞాపించారు.

దాదులు ఆ విధంగానే వెళ్ళి ఆ స్త్రీమణిని పిలుచుకొని వచ్చారు.

అనిరుద్ధ బ్రహ్మరాయలు ఆమెను చూసి అదిరిపడ్డారు.

ఆళ్వార్ కట్టియాన్ ముఖాన చిరునవ్వు విరిసింది.

~~~
~~~

# అధ్యాయము - 23

## మూగది కూడ మాట్లాడుతుందా?

**అనిరుద్ధులు** పూంగుళలిని కాసేపు నిశితంగా, శ్రద్ధగా చూసిన తర్వాత ఆమెను పిలుచుకొని వచ్చిన దాదులను దగ్గరికి పిలిచారు.

వారిని మెల్లని స్వరంలో ఏదో అడిగారు. వారు బదులు చెప్పిన తర్వాత వారిని ఆ గది బయటికి వెళ్ళమన్నారు.

తర్వాత ఆళ్వార్ కట్టియాన్ని చూసి. "తిరుమలై! ఏదో పొరబాటు జరిగినట్లుంది!" అన్నారు.

"అవునయ్యా! అలాగే నాకూ అనిపిస్తూంది."

"ఈమె చిన్నపిల్ల; సుమారు ఇరవైయేళ్ళప్రాయం మాత్రమే ఉండవచ్చు."

"అంత వయసు కూడ ఉండదు."

"నేను ఎదురుచూస్తున్న ప్రౌఢవనితకు వయసు సుమారు నలభైయేళ్ళుండాలి."

"దానికి పైబడి కూడ ఉండవచ్చు."

"అవునవును! నీవు లంకలో మందాకినీదేవిని చూసివున్నావు కద?"

"అవునయ్యా! చూసి, మీ ఆజ్ఞ మేరకు ఇక్కడికి పిలుచుకొని రావడానికి ప్రయత్నించాను కూడ. సాధ్యం కాలేదు."

"ఈ అమ్మాయి మందాకినీదేవి కాదు కద?"

"కాదు, గురుదేవా! ఆ అమ్మగారు కానే కాదు!"

"అలాగైతే ఈ పిల్ల ఎవరైవుండవచ్చు? ఎలా ఇక్కడికి వచ్చింది?"

"ఈమెనే అడిగితే సరి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"మూగదాన్ని అడిగి ఏం ప్రయోజనం?"

"గురుదేవా? ఈమె మూగదే అని..."

"అదే నేను దాదులనడిగాను. ఇక్కడికి వచ్చినప్పటినుంచి ఏమీ మాట్లాడలేదట."

"గురుదేవా? మందాకినీదేవిని గుర్తుపట్టి పిలుచుకొని రావడానికి ఎవరిని పంపారు?"

"ఆహా! ఆ మూఢుడు ఏదైన పొరబాటు చేసేశాడా, ఏమి?"

"ఏ మూఢుడు, గురుదేవా? తమరు ఇటువంటి కార్యానికి ఒక మూఢుణ్ణి పంపిస్తారంటే నేను నమ్మలేను!"

"తెలివైనవాడుగానే అగుపించాడు; పళైయారైకి నేను వెళ్ళిన రోజు, వాణర్కులవీరునితో ఒక

యువకుడు దెబ్బలాటకు దిగాడు కద?"

"అవును! పళైయారై వైద్యకుమారుడు పినాకపాణి."

"వాడే! నిన్ను, వల్లవరయన్ని కరికాలన్‌గారిని కలిసేందుకు పంపించిన తర్వాత ఆ వైద్యకుమారుని చెరనుంచి విడిపించి పిలిపించాను. మన గూఢచారుల దండుకు తగినవాడని, వాడిని కోడిక్కరైకి పంపించాను. మునుపొకసారి వాడు కోడిక్కరైకి వెళ్ళాడట; ఆ చోటు పరిచయమున్నవాడట..."

"వాడేనా ఈ అమ్మాయిని ఇక్కడికి పిలుచుకొని వచ్చింది?"

"గుర్తులన్నీ సరిగ్గా చెప్పి పంపాను. వాడు తిరువయ్యారు వరకు తీసుకొని వచ్చి, కార్యం విజయవంతమైందని వార్త పంపించాడు..."

"అయ్యా! నేను ఓడిపోయిన కార్యంలో గెలుపొందిన ఆ తెలివిమంతుడైన గూఢచారి ఇప్పుడెక్కడ? ఈ పిల్ల గురించి వాడినే అడిగేస్తే మంచిది కద?"

"అదే మంచిది! కానీ నిన్నరాత్రి వాడికి ఎదురు చూడని ఒక విపత్తు కలిగింది...!"

"అరెరె! వాడికి ఏం విపత్తు? ఎలా?"

"పల్లకి వెనక వాడు కూడ వస్తున్నాడు. చీకటి పడ్డ తర్వాతే కోట లోపలికి రావాలని నేను వాడిని ఆజ్ఞాపించాను. కాబట్టి వారు అదే విధంగా సంధ్యాసమయాన తిరువయ్యారు నుంచి బయల్దేరి, రాత్రి మొదటిజాము సమయాన కోటను సమీపిస్తున్నారు. ఉన్నట్లుండి సుడిగాలి వీచిన విషయం నీకు తెలిసేవుంటుంది కద..."

"అవునయ్యా! నేను కూడ ఆ సుడిగాలికి భయపడి బాట పక్కన ఒక మంటపంలో కాసేపు తలదాచుకోవలసి వచ్చింది."

"పల్లకి కోటకు కాస్త దూరాన వస్తున్నప్పుడు ఒక చెట్టు కూకటివేళ్ళతో పెకలించుకొని కూలిపోయింది. అదృష్టవశాత్తు పల్లకి మీద పడకుండ, వెనక వస్తున్నవారి మీద పడింది. వైద్యకుమారుడు ఆ చెట్టు కింద చిక్కుబడ్డాడు..."

ముఖ్యమంత్రి ఇలా చెప్పినప్పుడు, ఒక ఆడగొంతు, "ఆ ఛండాలుని మీద చెట్టు మాత్రమేనా పడింది? పిడుగు పడలేదా?" అని శాపనార్థధ్వనితో అడగడం వినిపించింది.

ముఖ్యమంత్రి అమితాశ్చర్యంతో పూంగుళలిని చూశారు. ఆమెను చూస్తూనే, "తిరుమలై! ఇప్పుడు మాట్లాడింది ఈ అమ్మాయేనా?" అన్నారు.

"అవునయ్యా! అలాగే తోస్తూంది."

"ఇదేం వింత? చెవిటికి వినిపిస్తుందా? మూగది మాట్లాడుతుందా?" అన్నారు అనిరుద్ధులు.

"చెవిటికి వినపడడం, మూగది మాట్లాడడం వింతైన విషయాలే. కానీ సర్వశక్తిసంపన్నుడైన ఆ విష్ణుమూర్తి భక్తులైన మీరు మనసు చేస్తే ఏ అద్భుతమసాధ్యం? ఆళ్వార్ దివ్యవచనమేమంటే..."

"చాలు! ఆళ్వార్లను ఇప్పుడిక్కడికి లాక్కొని వచ్చి ఇబ్బంది పెట్టకు! ఇది విష్ణుభగవానుని కరుణ వల్ల సంభవించినది కాదు; ఏదో పొరబాటు జరిగిపోయింది. ఈ పిల్ల మనని మోసం చేసింది. ఈమె ఎవరు? ఈమె ఉద్దేశమేమి? ఎందుకని ఇంతవరకు చెవిటిది, మూగదానిలాగ నటించింది?"

"గురుదేవా? ఈ అమ్మాయినే అడగవచ్చు కద?"

"అబ్బాయి! నీ ముఖంలో చిందులాడుతున్న చిరునవ్వును చూస్తే, నీకు ఒకవేళ ఈ వింత రహస్యం తెలిసేవుండవచ్చునని తోస్తూంది. సరే! ఈమెను నేనే అడుగుతాను; అమ్మాయీ! నీవు చెవిటిదానివి కాదా? నేను మాట్లాడేది నీకు వినిపిస్తూందా...?"

"అయ్యా! నేను చెవిటిదాన్ని కాకూడదా అని కొన్నిసార్లు కోరుకొన్న సందర్భాలు కూడ ఉన్నాయి. కానీ నాకిప్పుడు చెవులు వినిపించడం గురించి సంతోషపడుతున్నాను. ఆ ఛండాలుడు వైద్యకుమారుని మీద చెట్టు విరిగిపడ్డ విషయం విన్నాను కద? వాడు చచ్చి తొలగిపోయాడా?" అని అడిగింది పూంగుళలి.

"ఆహా! నీకు చెవులు వినిపిస్తాయి. మూగదానివి కూడ కాదు!" అన్నారు ముఖ్యమంత్రి.

"నిస్సందేహంగా ఈ అమ్మాయి మూగది కాదు!" అన్నాడు శిష్యుడు.

"నేను మూగదాన్ని కాదని కనిపెట్టేశారే! చోళసామ్రాజ్యంలోనే అతిబుద్ధిశాలురు ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలని నేను విన్నది నిజమే!" అన్నది పూంగుళలి.

"అమ్మాయీ! నన్ను పరిహాసం చేస్తున్నావా? జాగ్రత్త! నీవు మూగదానివి కాకపోతే నిన్నరాత్రి ఇక్కడికి వచ్చినప్పటినుంచి మాట్లాడకున్నావేల? మూగదానిలాగ నటించనేల? నిజం చెప్పు!" అని నిలదీశారు ముఖ్యమంత్రి అనిరుద్ధులు.

"అయ్యా! నిన్న రాత్రి నేనిక్కడికి వచ్చి చేరేవరకు నాకు మాట వచ్చేదే. నన్ను 'అతిగా మాట్లాడేది'/'వాగుడుకాయ' అని కూడ అందరూ అంటారు. నాకీ అంతఃపురంలో జరిగిన రాజోపచారాలు చూసి దిగ్భ్రమించి  మూగదాన్నైపోయాను. మీ అంతఃపురస్త్రీలు కూడ నాతో సంజ్ఞాభాషలోనే మాట్లాడారు. వారందరూ మూగవాళ్ళని ఎంచి నేను కూడ వారితో సైగల మూలంగానే సంభాషించాను. మీ మాట విన్న తర్వాత, నాకు మాట వచ్చన్న సంగతి గుర్తుకొచ్చింది..."

"నీది పెద్ద నోరనడంలో సందేహం లేదు; నిన్ను ఆ వైద్యకుమారుడెలా పట్టుకొని వచ్చాడో అని ఆలోచిస్తుంటే ఆశ్చర్యమేస్తూంది. వాడు మూర్ఖుడైనా కూడ గట్టివాడే/సమర్థుడే."

"స్వామీ! ఆ పాపిష్టివాడు నన్ను పట్టుకొని రాలేదు. ఆ ప్రయత్నం చేసివుంటే వాడిప్పటికి యమలోకయాత్ర చేస్తూండేవాడే!" అని చెప్పి పూంగుళలి తన బొడ్లో దోపుకొన్న చురకత్తిని తీసి చూపించింది.

"అమ్మాయీ! నీకు పుణ్యముంటుంది. ఆ కత్తిని తిరిగి బొడ్లో దోపేసుకో.  వాడు నిన్ను పట్టుకొని

రాలేదంటున్నావు కద? మరి వాడి మీద నీకెందుకింత కోపం?"

"వాడు నన్ను పట్టుకొని రాలేదు; కానీ వాడి మనుషులు నన్ను నా పడవలో కట్టి పడేసివచ్చారు. నా వదినను చెట్టుకు కట్టేశారు. ఇంతకీ ఆ ఛండాలుడు తనకీ విషయాల్లో సంబంధమేమీ లేదని దబాయించి మరీ చెప్పాడు..."

"అంతవరకు వాడు బుద్ధిశాలే. నేను చెప్పినట్లే నడుచుకొన్నాడు..."

"అయ్యా! ముఖ్యమంత్రిగారూ! ఆ ధూర్తుని పంపించింది మీరేనా? నోరులేని పేదరాలైన నా అత్తను పట్టి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించింది కూడ మీరేనా?"

"నీ అత్తా! బెస్తవారి కూతురు మందాకిని నీ అత్తా? అలాగైతే నీవు...దీపస్తంభ గృహాన్ని చూసుకొనే త్యాగవిడంగర్ నీకేం కావాలి?" అని అడిగారు అనిరుద్ధులు.

"అయ్యా! వారి ముద్దులకూతురినే నేను!"

"ఆహా! త్యాగవిడంగర్‌కి ఇలాంటి వాగుడుకాయ కూతురుందని నాకింతవరకు తెలియలేదే!"

"చోళసామ్రాజ్యంలో ముఖ్యమంత్రి అనిరుద్ధులకు తెలియని విషయమే లేదని ప్రతీతి. మీకు ఒక విషయం తెలియలేదని ప్రజలకు తెలిస్తే, మీ గౌరవం తగ్గిపోదా?"

"అమ్మాయీ! నా గౌరవం గురించి నాకు దిగులేం లేదు. నాకు తెలియని ఇంకొక సంగతిని మాత్రం చెప్పేయి. నీ అత్తను పట్టుకొని వచ్చారన్నావు కద? ఆమె ఇప్పుడెక్కడ? నేను పంపిన పల్లకిలో నీవెలా వచ్చావు? ఎలా ఎక్కి వచ్చావు?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"అయ్యా! నోరులేని మూగదైన నా అత్తను పట్టి బంధించి తెమ్మని మీరెందుకు ఆజ్ఞాపించారు?"

"బిడ్డా! అది నీకు చెప్పకూడని విషయం; అది పెద్ద రాజ్యాంగ సంబంధమైన విషయం."

"తండ్రీ! అలాగైతే మీరు అడిగిన ప్రశ్నకు కూడ నేను బదులివ్వలేను."

"నీచేత బదులు చెప్పించేందుకు దారులున్నాయి."

"నా దగ్గర అవి పనిచేయవు."

"అమ్మాయీ! నిన్ను పాతాళ చెరసాలకు పంపిస్తాను!"

"ఏ పాతాళ చెరసాలలోను మీరు నన్ను బంధించలేరు!"

"పాతాళ చెరసాలకు ఒకసారి వెళ్ళినవారు మళ్ళీ తిరిగి రారు..."

"తిరిగి వచ్చినవాడు ఒకడు నాకు తెలుసయ్యా! నిన్న కూడ సేందన్ అముదన్‌తో మాట్లాడుతూనే ప్రయాణం చేశాను..."

"అదెవరు సేందన్ అముదన్...?"

"అతడు నా ఇంకొక అత్త కొడుకు. అతడు, నేనే కోడిక్కరైనుంచి వస్తూన్నాము నిన్న."

"ఎందుకని, బిడ్డా?"

"ఈ తంజావూరులో ఉన్న మిద్దెలు, మేడలు, గోపురాలు చూడాలని చాల కాలంగా ఆశపడేదాన్ని. చక్రవర్తి సుందర చోళులను కూడ దర్శించాలని ఆసక్తిగొన్నాను. చక్రవర్తికి ఒంట్లో బాగా లేదని అంటున్నారు కద? ఇప్పుడు ఎలా ఉన్నారు? నేను చూడవచ్చా?"

"ఆయన ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడలేదమ్మా! కాబట్టి ఆయన్ని దర్శించే ఉద్దేశాన్ని ప్రస్తుతానికి మరిచిపో..!"

"అదెలా మరిచిపోగలనయ్యా? చక్రవర్తిని నేను చూడనే చూడాలి. ఆయనను చూసి, ఆయన ధర్మసామ్రాజ్యంలో స్త్రీలను బలవంతంగా పట్టి తీసుకొని వచ్చే అక్రమం జరుగుతున్న విషయాన్ని తెలియజేయాలి..."

"అమ్మాయీ! నీతో ఒట్టి వాగ్వివాదం చేస్తుండడానికి నాకు తీరిక లేదు. నిన్ను బలవంతంగా పట్టి తీసుకొని రమ్మని నేను ఆజ్ఞ జారీ చేయనూ లేదు. నేను పంపిన పల్లకిలో నీవెలా వచ్చావో, అది చెప్పు! ఎవరైన నిన్ను బలవంతంగా పల్లకిలో ఎక్కించుకొని తీసుకొని వచ్చారా?"

"లేదు, స్వామీ! అది మాత్రం కాదు. తంజావూరు కోటను సమీపిస్తున్నప్పుడు ఈ పల్లకి ఖాళీగానే ఉంది. అందుకే నేనే పల్లకిలో ఎక్కి వచ్చాను..."

ముఖ్యమంత్రి అనిరుద్ధులు తమ శిష్యుడైన ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "విషయం నాకిప్పుడు ఒకింత అర్థమవుతూంది. దారిలో సుడిగాలి, జడివానలో ఎక్కడో పల్లకిని బోయీలు దింపినట్లున్నారు. ఆ సమయాన ఈమె అత్తను పల్లకిని నుంచి దింపేసి తాను ఎక్కి కూర్చొంది. వైద్యకుమారుని మీద చెట్టు విరిగిపడి వాడు స్పృహ కోల్పోయినందువల్ల వాడు గమనించలేకపోయాడు. పల్లకిని మోస్తున్న బోయీలు గమనించలేదు. కోట వాకిలి సమీపానే ఇది జరిగివుండాలి. తిరుమలై! నా ఊహ సరైనదేనని నీకనిపిస్తూందా?" అని అడిగారు.

"స్వామీ! మీరిప్పుడు ఊహించినట్లే జరిగింది; నేనే కళ్ళారా చూశాను."

"నీవు చూశావా? అదెలా? ఇంతవరకు చెప్పక ఊరకున్నావెందుకు? త్వరగా చెప్పు!"

"నిన్నరాత్రి వానాకాలపు చీకటిలో కోట వాకిలిని సమీపిస్తున్నాను. అప్పుడు పెనుగాలి వీచి జడివాన కురవనారంభించింది; చెట్లు విరిగి పడ్డాయి. బాట పక్కనున్న యాత్రీకుల మంటపంలో కాసేపు తలదాచుకొందామని వెళ్ళాను. అక్కడికి నేను వెళ్ళి ఒదిగిన కాసేపటికల్లా ఈ అమ్మాయి ఇంకొక యువకుడు వచ్చారు. ఈమె తన అత్తకొడుకంది కద, అతడే అయివుండాలి. తర్వాత మెరుపు వెలుతురులో అతడి మెడలో రుద్రాక్షమాల చూశాను. పిందెలోనే పండిన శైవుడని గ్రహించి అతడి ముందు వైష్ణవమతం గొప్పతనం చెబుదాం; కాసేపు కాలక్షేపమవుతుందని అనుకొన్నాను. ఇంతలో అదే మంటపం ముందు ఒక పల్లకిని తీసుకొని వచ్చి దింపారు. పల్లకి తెరమీద పళువేట్టరయ్యర్ తాటిచెట్టు చిహ్నం కనిపించింది. పల్లకినుంచి ఒక స్త్రీ దిగి వీళ్ళ దగ్గరికి వచ్చింది. మంటపంలో చీకటి కమ్ముకొన్న ఒక మూల

వీరు ముగ్గురూ ఏదో రహస్యంగా మాట్లాడుకొన్నారు. తర్వాత ఈ అమ్మాయి వెళ్ళి పల్లకిలోకి ఎక్కడాన్ని చూశాను. తర్వాత ఇంకొక మెరుపు వెలుతురులో 'పల్లకినుంచి దిగిన వ్యక్తి పేరు; మళ్ళీ ఎక్కి కూర్చొన్న వ్యక్తి పేరు' అని తెలుసుకొన్నాను. పల్లకి బోయీలు ఇదంతా గమనించలేదు; వాన కాస్త తగ్గగానే పల్లకిని ఎత్తుకొని బయల్దేరి వెళ్ళిపోయారు...!"

"ఆహా! అలాగా నన్ను మోసగించారు? ఇంతసేపూ ఇదంతా చెప్పక ఊరకున్నావేల? తర్వాత వారిద్దరూ ఏం చేశారు?"

"పల్లకి వెళ్ళిపోయిన తర్వాత వారు కూడ వెళ్ళిపోయారు. నేను కూడ బయల్దేరాను..."

"తిరుమలై! నీవిదంతా చూస్తూ ఎందుకు ఊరకున్నావు? ఈమె అత్తను నీవెందుకు అడ్డుపడి ఆపలేదు? నీవు కూడ వీళ్ళతో ఈ కుట్రపన్నాగంలో చేరిపోయావా?"

"అపచారం, గురుదేవా! అపచారం! నేనటువంటి ద్రోహం చేయదగినవాడిని కాను. ఇదంతా మీరు చేసిన ఏర్పాటని తెలియదు. పళువూర్ అంతఃపురం పల్లకి కాబట్టి చిన్న పళువేట్టరయ్యర్ కార్యంకావచ్చని అనుకొన్నాను. పైగా, మందాకినీదేవిని నేను అడ్డుపడి ఆపగలనా? సుడిగాలిని కంచె వేసి ఆపినా ఆపవచ్చు; కానీ ఆ మహిళామణిని ఎవరైన ఆపగలరా? లంకలోనే ప్రయత్నించి ఓడిపోయినవాడిని. పైగా ఆ అమ్మగారికి నా గుర్తు తెలుసు. చూడగానే మొరాయించి పారిపోతుంది; తర్వాత ఎవరూ ఆమెను పట్టుకోలేరు..."

"అది తలుచుకొంటే వైద్యకుమారుడు చాల తెలివిపరుడే అనిపిస్తూంది. ఇంతదూరం పిలుచుకొని వచ్చేశాడు కద?"

"గురుదేవా! ఈ విషయంలో మీ ఊహ సరియైనది కాదని అనిపిస్తూంది. మందాకినీదేవి తామే ఇష్టపడి వచ్చివుండాలి. తంజావూరు సమీపించగానే వారి మనసు మారివుండాలి..."

"కావచ్చు, కావచ్చు. కానీ ఇంతలో ఆవిడ చాలదూరం వెళ్ళివుండసాధ్యం కాదు. రాత్రంతా గాలి, వానగా ఉంది కద? సమీపానే ఎక్కడైనా ఉండాలి. తిరుమలై! ఎలాగైనా ఆమెను పట్టుకోవాలి. ఒకవేళ ఈ అమ్మాయికి ఆమె ఉన్నచోటు తెలిసివుండవచ్చు... బిడ్డా! నీపేరేమి?"

"పూంగుళలి, అయ్యా!"

"ఆహా! చాల అందమైన పేరు! పేరు పెడ్డడంలో త్యాగవిడంగర్‌గారి సామర్థ్యానికి సాటే లేదు. పూంగుళలి! నీ అత్త ఎక్కడ వుంటుందనేది నీకు తెలిసేవుంటుంది. తెలిస్తే చెప్పు! ఆమెకు ఏ హానీ కలగదు."

పూంగుళలి కాసేపాలోచించి, "అయ్యా! నా అత్త ఇప్పుడు ఎక్కడ ఉండవచ్చనేది నాకు తెలుసు. ఆమెను ఎందుకు పట్టి తెప్పించారో చెబితే, నేను కూడ ఆమె ఎక్కడ ఉండవచ్చనేది చెప్పవచ్చు..."

"పూంగుళలీ! అది పెద్ద రాజ్యాంగ విషయం. అంతఃపుర రహస్యాన్ని నీకు చెప్పలేను."

"నేను కూడ చెప్పలేను."

"ఈ పిల్లతో మాట్లాడి సాధించలేం."

"అయ్యా! ఒక నిబంధనకు ఒప్పుకొంటే..."

"ఆహా! ఈ పిల్ల నాకు నిబంధన విధిస్తోంది. అదేమి?"

"నా అత్తను తంజావూరు సింహాసనం మీద కూర్చోబెట్టి మణిమకుటం ధరింపజేస్తే, ఆమెను నేనే పిలుచుకొని వస్తాను..."

"తిరుమలై! ఈ పిల్లకు పిచ్చి పట్టినట్లుంది...!"

"దాన్ని ఇప్పుడే కనుగొన్నారా, గురుదేవా? ఈమెను ఏమీ అడగనే వద్దు. ఈమె అత్త ఉండే చోటు నాకు తెలుసు. ఈమె అత్త కొడుకు సేందన్ అముదన్ కోటకు కాస్త దూరాన పూదోటలో ఉన్నాడు. అతడు, అతని తల్లి తళికుళత్తార్ కోవెలకు ప్రతిరోజు పుష్పకైంకర్యం చేస్తున్నారు. మీరు వెతుకుతున్న స్త్రీమణి అక్కడే ఉంది. నాతో కొందరు మనుషులను పంపిస్తే నేనే పిలుచుకొని వస్తాను!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

పూంగుళలి తిరుమలైని కాల్చేసేటట్లు ఒక్క చూపు చూసేసి, "అలా ఏమైనా చేస్తే, నేను ఇప్పుడు చక్రవర్తి అంతఃపురం ముందు వెళ్ళి మొరపెట్టుకొంటాను! మీరు చేసే అక్రమాలు ఊరంతా తెలిసేటట్లు చేస్తాను!" అన్నది.

"తిరుమలై! ఈమెను పాతాళ చెరసాలకు పంపించేయవలసిందే; వేరు దారి లేదు!" అన్నారు అనిరుద్ధులు.

"ఎవరైనా నన్ను సమీపిస్తే, చంపేస్తాను!" అంటూనే బొడ్లో దోపుకొన్న చురకత్తిని తీసింది పూంగుళలి.

"అయ్యా! ఈ అమ్మాయిని పాతాళ చెరసాలకు పంపించనవసరం లేదు. దానికి బదులు యువరాకుమారి కుందవై దేవి అంతఃపురానికి పంపిద్దాం. యువరాకుమారి ఇప్పుడు ఇక్కడే కద ఉన్నారు? వారు ఈ పిల్ల పిచ్చిని దింపుతారు! యువరాకుమారికి కూడ ఈ పిల్ల వల్ల కాగల కార్యాలుండవచ్చు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఎందువల్ల అలా అంటున్నావు? యువరాకుమారికి ఈ పిల్ల వల్ల కాగల కార్యమేముండగలదు?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"గురుదేవా! మీకు తెలియదా? నిన్న సాయంత్రం వీచిన సుడిగాలి చోళరాజ్యపు సముద్రతీరం వెంబడి చాల భీభత్సం కలిగించివుండవచ్చు! తమ అంతఃపురం వాకిట నలుదిక్కులనుంచి వచ్చిన దూతలు వేచివున్నారు..."

"అవునవును! నేనిప్పుడు వారందరినీ చూడాలి. అంతలోపల ఈ పిల్లతో మాటల్లో పడి చాల సమయం వ్యర్థమైపోయింది. ఈ పిల్ల మూగదిగానే పుట్టివుంటే చాల మంచిదయ్యేది..."

"అడగనవసరం లేకనే కీడు చేయవచ్చు కద!" అని తనలో తానే గొణుక్కొంది పూంగుళలి.

"నాగపట్టణానికి పెద్ద ఆపద అని విన్నాను. కడలి పొంగి వచ్చి నాగపట్టణాన్ని ముంచేసిందని అంటున్నారు...!"

ఈ వార్త విని ముఖ్యమంత్రి అనిరుద్ధులు, పూంగుళలి ఇద్దరూ అదిరిపడ్డారు.

"ఆ విషయమై మిమ్మల్ని విచారించేందుకు యువరాకుమారి ఇక్కడికే వచ్చినా రావచ్చు!" అని చెప్పి ముగించాడు ఆళ్వార్ కట్టియాన్.

అతడది చెప్పి ముగించేలోపు అంతఃపురం వాకిట జయఘోషలు వినిపించాయి.

"తిరుమలై! నీకెప్పుడు దివ్యదృష్టి సిద్ధించింది? యువరాకుమారే వస్తున్నట్లుంది!" అని చెబుతూనే ముఖ్యమంత్రి లేచి వాలికివైపు నడిచారు.

అంతలో అదే వాకిలి గుండా కుందవై, వాణతి లోపల ప్రవేశించారు.

పూంగుళలి అక్కడ నిలబడివుండడాన్ని చూడగానే, యువరాకుమారి దివ్యవదనంలో గూడు కట్టుకొన్న దిగులు ఎగిరిపోయి, ఆశ్చర్యం, ఉత్సాహం ప్రతిఫలించాయి.

~~~
~~~

# అధ్యాయము - 24

## యువరాకుమారి ఆదుర్దా!

**రాకుమార్తెలకు** రాజోపచారాలు చేసి, వారిని పీఠాలపై ఆసీనులను చేసిన తర్వాత, ముఖ్యమంత్రి తాము కూడ  ఆసీనులైనారు.

"దేవీ! నన్ను చూడాలని చెప్పి పంపిస్తే నేనే వచ్చేవాడిని కద? ఇంత తొందరగా వచ్చిన కారణమేమి? చక్రవర్తి క్షేమంగా ఉన్నారు కద?" అని అడిగారు.

"చక్రవర్తి దేహారోగ్యం ఎప్పటిలాగే ఉందయ్యా! కానీ మనసే కాస్త సరిగ్గా లేదు. నిన్న రాత్రి వీచిన సుడిగాలి ఆయన మనసును చాల వేధించింది. రాత్రంతా ఆయన నిద్ర పోలేదు. గుడిసెల్లో నివసించే పేద ప్రజలు ఏం కష్టాలు పడుతున్నారోనని ఎంచి తరచూ వాపోతున్నారు. పొద్దు పొడవగానే వెళ్ళి మిమ్మల్ని చూడమన్నారు. సుడిగాలి వల్ల కష్టనష్టాలు కలిగినవారికల్లా వెంటనే తగిన సహాయం ఏర్పాటు చేయాలి. అది మీకు చెప్పడానికే ముఖ్యంగా మీ దగ్గరికి వచ్చాను!" అన్నది యువరాకుమారి కుందవై.

"దేవీ! ఈ ముసలివాడు ఏం చేయగలడు? ముఖ్యమంత్రి అన్నది పేరుకు మాత్రమే అని మీకు తెలియదా? పెద్ద పళువేట్టరయ్యర్ ఈ సమయాన ఊరు వదిలి వెళ్ళివున్నారు. బొక్కసానికి గట్టిగా తాళం వేసుకొనే వెళ్ళివుంటారు. ఆయన అనుమతి లేనిదే చిన్న పళువేట్టరయ్యర్ కూడ బొక్కసాన్ని తెరవలేరు కద? కష్టనష్టాల పాలుపడ్డవారికి నేనేం సహాయం చేయగలను? వాకిట పలువురు దూతలు వచ్చి వేచివుండడాన్ని మీరు చూసేవుంటారు. కానీ వారిని చూసేందుకే నాకు సిగ్గుగా ఉంది. అందుకే బయటికి చెప్పుకోవడానికి జంకుతున్నాను" అని  అనిరుద్ధ బ్రహ్మరాయలు అసహాయం పాట పాడారు.

"అయ్యా! అందు గురించి మీరు దిగులుపడకండి.. నా సొంత నగలనన్నిటినీ ఇస్తాను. నా తల్లి కూడ అ విధంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. చక్రవర్తి అంతఃపురంలో ఉన్న వస్తువులనన్నిటినీ మీరు తీసుకోవచ్చు. పేదల కష్టాలను తీర్చేందుకు తక్షణం ఏదైన ఏర్పాటు చేయాలి..."

"తమ సొంత నగలు ఏనుగు ఆకలికి అటుకులిచ్చినట్లే అవుతుంది. నిన్న చోళనాడంతటా సుడిగాలి వీచింది. ఎక్కడెక్కడ ఏమేమి జరిగాయోనన్న వార్తలే ఇంకా అందలేదు. ఇదిగో ఇక్కడ నిలబడ్డాడే నా పరమానంద శిష్యుడు, వీడు అతి భయంకరమైన వార్తను చెబుతున్నాడు. కడలి పొంగి, కోడిక్కరైనుంచి నాగపట్టణం వరకు సముద్రతీరానున్న ఊళ్ళనన్నింటినీ ముంచేసిందట...!"

ఈ వార్త వినగానే అక్కడున్న ముగ్గురు స్త్రీల ముఖాల్లోను భీతి గోచరించింది. వెంటనే అనిరుద్ధులు ఓదార్పుగా ఇలా అన్నారు:-

"కానీ దాన్ని నేను నమ్మడం లేదు. వీడు చెబుతున్నది ఒట్టి వదంతి మాత్రమే. సుడిగాలికన్న

వేగంగా వదంతి వ్యాపించింది. సముద్రతీరం నుంచి వార్త వచ్చేందుకే ఇంకాసేపు పడుతుంది. దూతలు గుర్రాల మీద అతివేగంగా వచ్చినాకూడ మధ్యాహ్నం తర్వాతే ఇక్కడికి వచ్చి చేరగలరు. ఇంతలోపల మన వల్ల చేయదగిన సహాయమంతా చేసేందుకు ఏర్పాటు చేయవచ్చు."

యువరాకుమారి తన ఆందోళనను కాస్త సమాధానపరుచుకొని, "అయ్యా! నాగపట్టణం గురించిన వదంతి నా చెవిన కూడ పడింది. అందుగురించి కూడ మీవద్ద మాట్లాడుదామని వచ్చాను. ఇప్పుడేకద మనం చూడామణి విహారానికి కైంకర్యాలు చేసి వచ్చాము? విహారానికి ఆపద వస్తే, పాపం అందులోవున్న భిక్షువులేం కావాలి?" అని చెప్పి, పూంగుళలి నిలబడివున్న వైపు చూసింది.

"అయ్యా! ఈ పిల్ల ఇక్కడికెలా వచ్చింది? కోడిక్కరై త్యాగవిడంగర్ కుమార్తె పూంగుళలి కద ఈమె?" అని ఆశ్చర్యంతో అడిగింది.

"అవును. త్యాగవిడంగర్ కుమార్తే. కానీ ఆయనలాగ సాధువు కాదు - మాచెడ్డ పిల్ల. తనకు సంబంధంలేని విషయాల్లో తలదూర్చి ఇబ్బంది కలిగిస్తుంది!" అన్నారు అనిరుద్ధులు.

యువరాకుమారికి ఇంకొక విధమైన సందేహం కలిగింది. అరుళ్మొళి గురించి ఆరా తీసేందుకే ఈ పిల్లని అనిరుద్ధులు ఇక్కడికి రప్పించారా, ఏమి? తంత్రవిద్యల్లో ఆరితేరిన ముఖ్యమంత్రి కద? ఏదెలావున్నా కూడ, పూంగుళలి పక్షాన తానుండాలని తీర్మానించుకొని, "అలా ఏం లేదే? పూంగుళలి చాల మంచి పిల్ల! ఇక్కడ రామ్మా! ముఖ్యమంత్రి ఎందుకు నీమీద కోపంగొనివున్నారు? ఆయనకేమైన ఇబ్బంది కలిగించావా?" అని అడిగింది.

పూంగుళలి కాస్త దగ్గరికి వచ్చి, "దేవీ! ముఖ్యమంత్రిగారిని మీరే అడగండి! నేనాయనకు ఇబ్బంది కలిగించానో, లేక ఆయన నాకు ఇబ్బంది కలిగించారోనని మీరే అడగండి!" అన్నది.

"ఓహో! నీవూ కోపంగానే ఉన్నావు! ఇక్కడికి రా, అమ్మాయ్! నా దగ్గర కూర్చో!" అని చెప్పి కుందపై పూంగుళలిని తన దగ్గర కూర్చోబెట్టుకొంది.

"అయ్యా! ఈ అమ్మాయిని ఎందుకు పిలిపించారు? ఏదైన ముఖ్యమైన కార్యమా?" అని అడిగింది.

"అమ్మా! నేనీ పిల్లను పిలిపించలేదు. ఇలాంటి గడుగ్గాయి పిల్ల ఒకతె ఉందని నాకు తెలియను కూడ  తెలియదు. ఈ పిల్లవల్లే..." అని ముందుకు చెప్పడానికి కాస్త జంకారు ముఖ్యమంత్రి.

"దేవీ! ముఖ్యమంత్రి ఎందుకు సంకోచిస్తున్నారు? మిగిలింది కూడ చెప్పమనండి!" అన్నది పూంగుళలి.

"ఈ అమ్మాయే తన అత్తను వెతికి తీసుకొని వచ్చింది."

"ఎవరీమె అత్త? సేందన్ అముదన్ తల్లా? కోట బయటే కద వారి ఇల్లుంది?"

"కాదు; అముదన్ తల్లి కాదు; ఈమెకు ఇంకొక మూగ అత్త ఉంది. రాకుమారీ! తమకు

తెలియవలసిన విషయమే. లంకలోని అడవుల్లో పిచ్చిపట్టినదానిలాగ తిరుగుతున్న ఒక స్త్రీ ఉంది. ఆ స్త్రీమణిని ఇక్కడికి ఒక ముఖ్యమైన కార్యంమీద పిలుచుకొని రావాలని ఆశించాను. అందుకని బృహత్ప్రయనం చేశాను; చివరికి విజయం లభించింది; ఆ సమయాన..."

కుందవై ఆపుకోలేని ఆదుర్దాతో, "నిజంగానా? ఆ స్త్రీమణి ఇప్పుడిక్కడే ఉందా? ఆమెను నేను వెంటనే చూడాలి" అంటూనే తన పీఠంనుంచి లేచింది.

"మన్నించాలి, దేవీ! గెలుపు చేతికి చిక్కే సమయాన ఈ పిల్ల అడ్డుపడి కార్యాన్ని చెడగొట్టేసింది!" అన్నారు అనిరుద్ధులు.

కుందవై మిక్కిలి ఆశాభంగంతో మళ్ళీ పీఠంపైన కూర్చొని, "పూంగుళలీ! ఇది నిజమేనా? ఎంత పని చేశావు!" అన్నది.

"దేవీ! నా అత్తను పిలుచుకొని వచ్చేందుకు ముఖ్యమంత్రి చేబట్టిన విధానాన్ని అడగండి. అప్పుడు నా మీద నింద మోపరు!" అన్నది పూంగుళలి.

తర్వాత ముఖ్యమంత్రి జరిగినదంతా క్లుప్తంగా చెప్పారు.

వింటున్న కుందవై, "అలాగైతే ఈ కోట చుట్టుపక్కలే ఎక్కడో ఉండాలి! వెతికి చూడవచ్చు కద?" అన్నది.

"అదృష్టవశాత్తు వెతకవలసిన అవసరం కూడ లేదు. సేందన్ అముదన్ గుడిసెలో ఈ రోజు ఉదయాన చూసినట్లు చెబుతున్నాడు నా శిష్యుడు" అన్నారు ముఖ్యమంత్రి.

"అలాగైతే ఎందుకు వృధా కాలయాపన? తక్కిన కార్యాలనీ తర్వాత చూసుకొందాం. మనమే వెళ్ళి పిలుచుకొని వద్దాం; మీరు రాలేకపోతే నేను వెళ్ళి వస్తాను. వాణతీ! పద, వెళదాం!" అన్నది.

అప్పుడు ఆళ్వార్ కట్టియాన్ అడ్డుపడి, "దేవీ! ఇది కాస్త ఆలోచించి చేయవలసిన కార్యం. కొత్త మనుషులు గుంపుగా రావడం చూస్తే ఆ అమ్మ భయపడి పారిపోవచ్చు. తర్వాత సుడిగాలిని పట్టవచ్చుగాని, ఆ అమ్మను పట్టుకోలేము!" అన్నాడు.

"అవును, తిరుమలై చెబుతున్నది నిజమే. కొత్తవాళ్ళని చూడగానే పారిపోవచ్చు. మన ప్రయత్నమంతా వృధా అయిపోతుంది! నీవేం ఉపాయం చెబుతావు, తిరుమలై?" అని అడిగారు అనిరుద్ధులు.

"ఈ అమ్మాయినే వెళ్ళి పిలుచుకొని రమ్మనండి. ఈ లోకంలోనే ఆ స్త్రీమణిని కట్టుబాటు చేయగలవారు ఇద్దరు మాత్రమే! ఆ ఇద్దరిలో ఈ అమ్మాయి ఒకతె!"

"ఇంకొకరెవరు?" అని ముఖ్యమంత్రి అడగగా, ఆళ్వార్ కట్టియాన్ కాస్త జంకుతూ, "ఇంకొకరు కడలిలో మునిగిపోయారని లోకమంతా ఒక వదంతి వ్యాపించివుంది!" అన్నాడు.

కుందవై అది విననట్లు నటించి, పూంగుళలివైపు చూసి, "అమ్మాయీ! వెంటనే వెళ్ళి నీ అత్తను

పిలుచుకొని రా! ఆమెకు ఇక్కడే హానీ కలగదు. అతిముఖ్యమైన విషయమై నీ అత్తను నేను చూడవలసివుంది! నాకీ సహాయం చేస్తావు కదూ?" అన్నది.

"అలాగేనమ్మా! ప్రయత్నించి చూస్తాను. అయినా కూడ, ముఖ్యమంత్రి ఇటువంటి ఉపాయాన్ని ప్రయోగించి ఉండకూడదు. ముందుగా నాకు తెలిసివుంటే..."

"అవును; విషయాలను మరుగ్గా ఉంచడం వల్ల ఇటువంటి అసందర్భాలు కలగనే కలుగుతాయి. దాన్ని నాకు నేనే గ్రహించి విచారిస్తున్నాను. శీఘ్రంగా అత్తను పిలుచుకొని రా! ఆ తర్వాత నీకింకొక ముఖ్యమైన పనివుంది!" అన్నది యువరాకుమారి.

"తిరుమలై! నీవు కూడ ఈ పిల్లతో వెళ్ళి రా! కోట వాకిలిగుండా మీరు రావడంలో ఏదైనా కష్టం ఉంటే అంతఃపురానికి రహస్యంగా వచ్చే మార్గం గుండా పిలుచుకొని రా!" అన్నారు అనిరుద్ధులు.

పూంగుళలి, ఆళ్వార్ కట్టియాన్ వెళ్ళిన తర్వాత కుందవై ముఖ్యమంత్రిని చూసి, "వాకిట వచ్చి వేచివున్నవారికి చెప్పవలసింది చెప్పి పంపించేసి రండి. అతిముఖ్యమైన కార్యాలగురించి మిమ్మల్ని సలహా అడగవలసివుంది!" అన్నది.

"ఇదిగో వచ్చేశాను, తల్లీ! నేను కూడ తమతో మాట్లాడవలసివుంది!" అని చెప్పి ముఖ్యమంత్రి వెళ్ళారు.

ఇంతసేపూ మౌనంగా ఉన్న వాణతి, "అక్కా! పూంగుళలికి ఇంకొక పని ఉందని చెప్పారు కద, ఏమది? మళ్ళీ నాగపట్టణానికి పంపబోతున్నారా?" అని అడిగింది.

"అవును, వాణతీ! నీవు ఊరకే దిగులుపడకు! పొన్నియిన్ సెల్వన్‌కి ఎటువంటి ఆపద కూడ రానేరదు."

"నేను కూడ ఆమెతో నాగపట్టణానికి వెళతానక్కా!"

"నీవెళ్ళి ఏం చేస్తావు? నీ రక్షణకు ఇంకొకరెవరైనా కావాలి కద?"

"ఆ పడవ నడిపే పిల్లకు నేను నచ్చనేలేదక్కా!"

"అదెలా నీవు తెలుసుకొన్నావు?"

"నాతో మాట్లాడనే లేదు."

"నీవూ ఆమెతో మాట్లాడలేదు; ఆమె కూడ నీతో మాట్లాడలేదు."

"నేను తరచూ ఆమె ముఖాన్ని చూస్తూ ఉన్నాను. కానీ ఆమె ఒక్కసారి కూడ నన్ను తిరిగి చూడలేదు; ఆమెకు నామీదెందుకో కోపం!"

"అవునే, వాణతీ! ఈ నాడులో ఉన్న కన్నెపిల్లలందరికీ నీవంటే కోపంగానే ఉంటుంది. అందుకు నీవు విచారించి ప్రయోజనం లేదు!" అన్నది యువరాకుమారి కుందవై.

~~~
~~~

# అధ్యాయము - 25

## అనిరుద్ధుల నేరం

ముఖ్యమంత్రి అనిరుద్ధులు తమ అంతఃపురం ప్రధానద్వారం వద్ద వేచివున్నవారిని చూసి, మాట్లాడి పంపించేసి త్వరగానే తిరిగి వచ్చారు.

'అమ్మా! ఏదో నా చేతనైనంతవరకు ఏర్పాట్లు చేశాను. సుడిగాలి వల్ల కలిగిన నష్టాలను తెలుసుకొని రావడానికి నలువైపులకు మనుషులను పంపించాను. చిన్న పళువేట్టరయ్యర్‌కి కూడ చెప్పి పంపించాను, మన ఇద్దరి బాధ్యతమీద బొక్కసాన్ని తెరిపించమని."

"అయ్యా! పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురం పక్కనే ఒక నేలమాళిగలో ఒక బొక్కసముందట కద? అందులో అంతులేని ధనరాశులున్నాయట కద? పెద్ద రాణి ఒకసారి చెప్పారు."

"దాన్ని తెరిస్తే అందులో ఉన్న ధనరాశులతో వేయి కొత్త గుళ్ళు కట్టించవచ్చు కద అని ఆ అమ్మగారి ఆశ, ఉద్దేశం. నేను కూడ ఆ నేలమాళిగ లోపలికి వెళ్ళలేదమ్మా! దాని లోపలికి ఒకసారి వెళ్ళినవారు ప్రాణాలతో తిరిగి రారు" అన్నారు ముఖ్యమంత్రి.

"అది పోనివ్వండి! ఆ మూగతల్లిని వీరు తప్పక పిలుచుకొని వస్తారా? చేతికి చిక్కింది నోటికి అందదేమో అని నాకు దిగులుగా ఉంది" అన్నది కుందవై.

"తల్లీ! ఆ మహాతల్లి గురించి మీకేమి తెలుసు? ఎలా? మీరావిడ గురించి ఎందుకింత ఆసక్తి, ఆదుర్దా కనబరుస్తున్నారు....?" అన్నారు అనిరుద్ధులు.

"అయ్యా! కొన్నాళ్ళ క్రితం చక్రవర్తే ఆవిడ గురించి నాకు చెప్పారు."

"ఏమి? ఆమె సజీవంగా ఉన్నట్లు చెప్పారా, ఏమి?"

"లేదయ్యా! ఇరవైయైదేళ్ల క్రితం జరిగిన సంఘటనల గురించి చెప్పారు. ఆమె చనిపోయినట్లే భావిస్తున్నారు చక్రవర్తి. ఆమె వల్లే ఆయన మనసు కలతబారిపోయివుంది. ఆ మూగవనిత కడలిలో దూకి చనిపోయిందని మీరే కద తెలుసుకొని వచ్చి ఆయనకు చెప్పారట? తర్వాత, ఆమె సజీవంగా ఉన్న విషయం మీకెలా తెలిసింది?"

"తమను అదే ప్రశ్న అడుగుదామనుకొన్నాను. మీకెలా తెలిసింది, దేవీ?"

"తప్పక చెబుతాను. లంకకు వెళ్ళి తిరిగి వచ్చిన ఆ వాణర్‌కుల వీరులే మొదట చెప్పారు. తర్వాత నా తమ్ముడు అరుళ్మొళి..." అని చెప్పేసి, కుందవై తన పొరబాటును తానే గ్రహించి నోటిని చేత్తో మూసుకొంది.

"దేవీ! యువరాజు అరుళ్మొళివర్మ గురించి మీరు నావద్ద చెప్పడానికి ఇష్టపడకపోతే,

చెప్పకండి. మీరు ఆయన పేరును ఉఛ్ఛరించిన విషయాన్ని అడుగంటా మరిచిపోతాను."

"లేదయ్యా! మీ దగ్గర అన్ని విషయాలను చెప్పేయాలన్న ఉద్దేశంతోనే వచ్చాను. విషయాలను కప్పిపుచ్చడం వల్ల కీడేగాని, మేలు జరగదని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాను. నిన్న రాత్రి అది నాకు బాగ తెలిసివచ్చింది. అయ్యా! నా తమ్ముని కడలి తీసుకొని పోలేదు. పొన్నియిన్ సెల్వన్ని సముద్రరాజు కాపాడి తీరానికి చేర్చాడు. వాడిప్పుడు నాగపట్టణంలో ఉన్న చూడామణి విహారంలో ఉన్నాడు. వాడిని చూసేందుకే నేను నాగపట్టణానికి వెళ్ళాను. కానీ మీకిదంతా తెలుసని అనుకొన్నాను."

"తమ సందేహం న్యాయమైనదే; కానీ దేవీ, తెలుసని నేను చూపించుకోలేను కద? ఇంకెవరి కార్యంలో తలదూర్చినా కూడ, తమ కార్యంలో తల దూర్చనని ఒక నియమం పెట్టుకొన్నాను. నా మనుషులకు కూడ అలాగే ఆజ్ఞాపించాను. తమరు చేసేదేదైనా ఉచితంగానే ఉంటుందని నా నమ్మకం. నేను, మలైయమాన్, కొడుంబాళూర్ వేళార్ తరచూ ఇలా మాట్లాడుకొనేవాళ్ళం; 'యువరాకుమారి గనక మగపిల్లాడిగా పుట్టివుంటే, ఈ లోకాన్నే చోళనాడు ఛత్రం కింద ఏలేది' అని."

"అలాంటి ఉద్దేశం నాకుండేది, నిజమే. నేను ఆడపిల్లగా పుట్టినా కూడ, నా సహోదరుల మూలంగా నా మనోరథం నెరవేరుతుందన్న ఆశ ఉండేది. ఆ ఆశను ఇప్పుడు వదిలేస్తున్నానయ్యా! రాజకీయ విషయాలలో స్త్రీలు తలదూర్చనే కూడదని నిశ్చయించుకొన్నాను! చూడండి! నా సహోదరుని చూడామణి విహారంలో తలదాచుకొనేలా చేశాను. దాని విపరీత ఫలితాలను చూడండి!"

"ఏమీ కాలేదు, తల్లీ! పొన్నియిన్ సెల్వన్ని నడిసముద్రంలో కాపాడిన సముద్రరాజు, ఇప్పుడు తీరాన భద్రంగా ఉన్నప్పుడు కీడు కలగనిస్తాడా?"

"అయ్యా! మీరు నా తండ్రి వద్దకు వచ్చి ఇలా ధైర్యవాక్యాలు చెప్పండి."

"ఆహా! చక్రవర్తికి తెలుసా ఏమి, యువరాజు చూడామణి విహారంలో ఉన్న విషయం?"

"నిన్న రాత్రే చెప్పాను; చెప్పవలసిన పరిస్థితి వచ్చింది."

"ఆహా! ఇంకొన్నాళ్ళు చెప్పకుండివుంటే బాగుండేది. మీరు చేసింది చాల మంచి ఏర్పాటని భావించాను. దేవీ! చోళనాడంతా చాల ఆందోళనలో మునిగివుంది. నిన్న రాత్రి వీచిన సుడిగాలి వల్ల బయట ఏర్పడ్డ కల్లోలం కొన్నాళ్ళుగా చోళనాడు ప్రజల మనసుల్లో ఉప్పొంగుతూంది. మధురాంతకుల మీద, పళువేట్టరయ్యర్ల మీద ప్రజలు చాల కోపంగొనివున్నారు.. యువరాజును చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఓడలను పంపిన విషయం కూడ ప్రజలందరికీ తెలుసు. యువరాజును పళువేట్టరయ్యర్లే సముద్రంలో ముంచేశారని పలువురు నమ్ముతున్నారు. ఈ సమయాన యువరాజు ఈ చోళనాడులోనే ఉన్నారని తెలిస్తే ప్రజలు పేట్రగిపోతారు/ఉడికిపోతారు. యువరాజు శిరస్సున ఇప్పుడే మణిమకుటాన్ని పెట్టేయాలని ఆందోళన ప్రారంభిస్తారు. పళువేట్టరయ్యర్లు కూడ ఎప్పుడు యుద్ధానికి సాకు దొరుకుతుందా అని ఎదురుచూస్తున్నారు. కొడుంబాళూర్ పెద్ద వేళార్ ఒక పెద్దసైన్యాన్ని కూడదీసుకొని తంజావూరు వైపే

వస్తున్నారు. దేవీ! చోళనాడులో రక్తపుటేరులు పారబోతున్నాయని భయపడుతున్నాను. అలాంటిదేమీ జరగకూడదని రాత్రింబగళ్ళు శ్రీరంగనాథుని ప్రార్థిస్తున్నాను."

"నా ప్రార్థన కూడ అదేనయ్యా! నా సహోదరులు ఈ చోళసామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించాలనే ఆశను వదిలేసుకొన్నాను. నా మటుకు మధురాంతకునికి పట్టం కట్టడంలో నాకెటువంటి అభ్యంతరమూ లేదు."

"మీకాక్షేపణ లేదు, కానీ ప్రజలకుంది కద? చక్రవర్తి నూరేళ్ళు జీవించుగాక. కానీ విధివశాత్తు ఆయనకేమైన అయితే, ఆ రోజే ఈ చోళరాజ్యం రణరంగమైపోతుంది..."

"అయ్యా! అటువంటి దుర్గతి త్వరలోనే వచ్చేస్తుందేమోనని నాకు చాల భయంగా ఉంది. నిన్న రాత్రి చక్రవర్తి పరిస్థితి చాల ఆందోళనకరంగా మారింది. అందుకే ఆయనకు పొన్నియిన్ సెల్వన్ క్షేమంగా ఉన్నాడని చెప్పవలసివచ్చింది. కానీ, ఆయన నమ్మలేదు! ఆయనకు నేను ఊరకే ఊరడింపు మాటలు చెబుతున్నాననుకొన్నారు. చాలయేళ్ళ క్రితం చనిపోయిన 'పగ తీర్చుకొనే పాతకి' తమ కుమారులమీద పగ తీర్చుకోబోతుందని భ్రమపడుతున్నారు..."

"అయ్యో, భగవాన్! ఇదేం విపరీతం? నిన్న రాత్రి జరిగిందంతా వివరంగా చెప్పండి!"

"అందుకే వచ్చానయ్యా! చెప్పి, మిమ్మల్ని సలహా అడగాలనే వచ్చాను. మునుపొకసారి సుందరచోళ వైద్యశాల ఉద్ఘాటన కోసం ఇక్కడికి వచ్చినప్పుడు, చక్రవర్తి ఆ పాత వృత్తాంతాన్ని వివరించారు. లంకకు సమీపానున్న ఒక దీవిలో తాము దాక్కోవలసివచ్చినప్పుడు, బెస్తవారి కూతురొకామె తాము ఎలుగుబంటికి ఎరగాకుండ కాపాడిన విషయాన్ని వివరించారు. తర్వాత కొన్ని మాసాలపాటు స్వప్నస్వర్గలోకంలో ఉల్లాసంగా జీవించినట్లు కాలం గడిపిన విషయాన్ని కూడ చెప్పారు. తర్వాత ఈ తంజావూరుకు పిలుచుకొని రాబడ్డ విషయాన్ని కూడ చెప్పారు. అప్పుడు అంతఃపురం వాకిట గుమిగూడిన ప్రజాసమూహంలో ఆమె మళ్ళీ కనిపించగా, తమ ప్రాణస్నేహితులైన మిమ్మల్ని వెళ్ళి ఆమెను వెతికి పిలుచుకొని రమ్మని పంపిన విషయం, మీరు వెళ్ళి వెతికి, చివరికి ఆమె కడలిలో పడి చనిపోయిందని తెలియజేసిన విషయాన్ని చెప్పారు. అప్పటినుంచి ఆమె ఆత్మరూపంలో వచ్చి ఆయన్ని వేధిస్తూందని, ఇటీవల ఆమె అలా రావడం అధికమైందని చెప్పి వాపోయారు..."

"దేవీ! మీరదంతా నమ్మారా?"

"తండ్రి చెప్పిన వృత్తాంతమంతా చాల విచిత్రంగా ఉండడంవల్ల నా మనసంతా చాల గందరగోళమైంది. చనిపోయిన మనిషి ఆత్మ వచ్చి ఆయన్ని వేధించడం ఆయన చిత్తభ్రమే కావచ్చని భావించాను. తర్వాత ఆలోచించి చూడగా, చూడగా ఇంకొన్ని సందేహాలు తలెత్తాయి. వాణతి ఒకరాత్రి చక్రవర్తి కేకలేయడం విని వెళ్ళి చూసింది. పళువూర్ యువరాణిలాంటి ఒక రూపం చక్రవర్తి ముందు నిలబడివుండడం చూసి అదిరిపడి మూర్ఛిల్లింది.అప్పటినుంచి, ఆ బెస్తవారి కూతురికి, పళువూర్

యువరాణికి ఏదో సంబంధం ఉండే తీరాలని అనిపించసాగింది. వంతిదేవులు, అరుళ్మొళి చెప్పినదానినుంచి, అది రూఢి అయ్యింది. అయ్యా! నందినీదేవి ఒకవేళ ఆ సముద్రతీరవాసి కుమార్తె కాగల సాధ్యమా?"

"మీలాగే నేను కూడ ఊహించుకోవడానికి మాత్రమే సాధ్యం, తల్లీ! రూపం పోలిక చూస్తే అలాగే అనుకోవలసివస్తూంది. కానీ, ఆ ఒక్క విషయాన్ని మాత్రమే ఆధారం చేసుకొని నిర్ధారించగలమా? ఒకవేళ నందిని ఆ బెస్తవారి కూతురి చివరి చెల్లలు కూడ కావచ్చు. ఇదంతా ఖచ్చితంగా తెలిసినవారు ఇప్పుడు ముగ్గురున్నారు..."

"వారెవ్వరు, స్వామీ?"

"ఒకరేమో పెద్ద మహారాణి శెంబియన్ మహాదేవి. వారి మనసులో ఏదో ఒక రహస్యం దాగివుండి వారిని వేదనకు గురి చేస్తూంది. కానీ అది ఏమని వారే నోరు విప్పి చెబితే తప్ప, మనం అడిగి తెలుసుకోలేము. మహానుభావులైన గండరాదిత్యులు మరణించే తరుణాన మహారాణి దాన్ని ఆయనకు చెప్పారన్నది నాకు తెలుసు. గండరాదిత్యులు నాకు చెప్పనారంభించారు. రెండు మాటలు చెప్పేలోపు వారి శ్వాస ఆగిపోయింది..."

"తక్కిన ఇద్దరెవ్వరయ్యా?"

"తక్కిన ఇద్దరూ మాట్లడలేని మూగవారు. సేందన్ అముదన్ తల్లి, పెదతల్లే వారిద్దరూను. ఇందులో సేందన్ అముదన్ తల్లి దగ్గరినుంచి మనం ఏమీ తెలుసుకోలేము. శెంబియన మహాదేవి పట్ల ఆమె ఎనలేని భక్తిభావం కలది. ఆ మహారాణి సజీవంగా ఉన్నంతవరకు ఈమె ఏమీ తెలియజేయదు. అందుకే ఆమె అక్కగారైన మందాకినీదేవిని ఇక్కడికి రప్పించడానికి నేను పెద్ద ప్రయత్నం చేస్తూ వచ్చాను..."

"ఆహా! ఆ బెస్తవారి కుమార్తె పేరు మందాకినా? ఆమె బతికేవుందని మీకెప్పుడు తెలిసింది?"

"దేవీ! ఇరవైయైదేళ్ళ క్రితమే నాకది తెలిసిన విషయమే."

"ఏమేమి? ఇరవైయైదేళ్ళుగా తెలిసికూడ మీరు నా తండ్రికి చెప్పలేదా? ఆమె చనిపోయిందనే భావిస్తున్నందువల్ల నా తండ్రి ఎంతటి మనోవేదనకు లోనైనారన్నది మీకు తెలియదా?"

"తెలుసు, తల్లీ! తెలుసు."

"తెలిసికూడానా ఆయనకు నిజం చెప్పకున్నారు ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు?"

ఆయన పెద్దగా నిట్టూర్చారు. ఆయన మనసులో ఒక పెద్ద పోరాటం జరుగుతూందని ఆయన ముఖం ఎత్తిచూపింది. తర్వాత ఆయన ఇలా చెప్పుకొచ్చారు:-

"దేవీ! ఇరవైయైదేళ్ళ క్రితం నేనొక నేరం చేశాను. మొట్టమొదటగా దాన్ని మీకే చెబుతున్నాను. తీరవాసి కుమార్తెను వెతికి రమ్మని మీ తండ్రి నన్ను పంపించారు కద? గుర్రాలమీద వేగంగా వెళ్ళే మనుషులతో నేను కూడ వెళ్ళాను; కోడిక్కరైకి వెళ్ళి చేరాము. అక్కడ ఆమె కల్లోలసముద్రంలో దీపస్తంభం శిఖరంనుంచి పడిపోయిందని తెలుసుకొన్నాము. ఆ భయంకర దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసినవారే మాకు

చెప్పారు. త్యాగవిడంగరే వణుకుతున్న స్వరంతో ఆ విషాద సమాచారాన్ని చెప్పారు. దాన్నే నేను తంజావూరుకు తిరిగి వచ్చి నా స్నేహితునికి చెప్పాను..."

"ఇందులో మీ నేరం ఏమయ్యా? ఏమీ లేదు కద?" అన్నది కుందవై.

"నేరమదే. బెస్తవారి కుమార్తె సముద్రంలో పడిపోయిందిగాని, మునిగి చనిపోలేదు. ఆ కల్లోలిత సముద్రంలో పడవ నడుపుకొస్తున్న ఒకతను ఆమెను చూసి, పడవలోకెక్కించుకొని కాపాడాడు. కోడిక్కరైకి చాల దూరాన వచ్చి తీరం చేరాడు. తిరిగి వచ్చేదారిన నేనా పడవను చూశాను. అందులో ఉన్న అమ్మాయి ఎవరని కూడ తెలుసుకొన్నాను. ఆ పడవ మనిషికి చాల ధనమిచ్చి ఆమెను లంకకు క్షేమంగా తీసుకొని వెళ్ళాలని, అక్కడే ఉండాలని చెప్పాను; వాడు కూడ అందుకు ఒప్పుకొని వెళ్ళాడు. నేను తంజావూరుకు తిరిగి వచ్చి, ఆ బెస్తవారి కూతురు సముద్రంలో పడి చనిపోయిందని చెప్పాను. తమ తండ్రికి మేలు చేస్తున్నట్లే ఎంచి బుద్ధిపూర్వకంగానే అలాంటి నేరాన్ని చేశాను. ఆ నేరం ఇన్నాళ్ళ తర్వాత ఇటువంటి విపరీత పరిణామాలకు దారి తీస్తుందని ఎదురుచూడలేదు..."

యువరాకుమారి కుందవై అప్పుడు అడ్డుపడి, "మీరు చేసింది నేరమైనా, నా తండ్రికి మేలు చేసే ఉద్దేశంతో అలా చేశారు. తర్వాత ఆ బెస్తవారి కూతురు గురించి మీరు విన్నారా?" అని అడిగింది.

"ఏల? తరచూ వింటూనే వస్తున్నాను. యువరాజు పట్టం కట్టుకొన్న వెంటనే చక్రవర్తి మదురై యుద్ధరంగానికి వెళ్ళారు. నేను కాశీక్షేత్రానికి వెళ్ళాను. కొన్నేళ్ళు అక్కడే ఉండి, వేదాలు, శాస్త్రాలు పఠించి తిరిగి వచ్చాను. అప్పుడు పళైయారైలో ఈశాన్యభట్టుగారి తండ్రి ఆ బెస్తవారి కూతురితో అంతరంగంగా మాట్లాడుతుండడాన్ని చూసి విస్తుపోయాను. ఆయన ఒక విచిత్రమైన సంగతి నాకు తెలియజేశారు. ఆమె పెద్ద మహారాణి అంతఃపురం తోటలో కొన్నాళ్ళు వసించిందని, అక్కడే కవల పిల్లల్ని కని, ఆ బిడ్డలను అక్కడే వదిలేసి పారిపోయిందని చెప్పారు. ఎప్పుడైనా జ్ఞాపకం చేసుకొని పిల్లలను చూసేందుకని రహస్యంగా వచ్చేదని చెప్పారు. పిల్లలేమైనారని అడిగాను. ఆయన చెప్ప నిరాకరించారు. అది శెంబియన్ మహాదేవికి మాత్రమే తెలిసిన రహస్యమని చెప్పారు. నేను కూడ ఆ విషయాన్ని ఇంకా కెలకడం మంచిది కాదని వదిలేశాను. దేవీ! అరుళ్మొళి చిన్న బిడ్డగా ఉన్నప్పుడు కావేరి నదిలో పడిపోయినప్పుడు, అతన్ని కావేరీమాత కాపాడిందని అందరూ చెబుతారు కద? అలా కాపాడింది ఆ బెస్తవారి కూతురే అని అప్పుడే నా మనసులో తోచింది..."

"మీ మనసులో తోచింది నిజమేనయ్యా! అరుళ్మొళి లంకలో ఆ స్త్రీమణిని చూసేసి వచ్చి ఆ విధంగానే చెప్పాడు. కానీ ఈ వింతను వినండి! నా తండ్రి ఏమని భావిస్తున్నారో తెలుసా? కడలిలో మునిగి చనిపోయిన ఆ తీరవాసి కుమార్తే ఆత్మరూపంలో వచ్చి తన పిల్లలమీద పగ తీర్చుకొంటూందని భావిస్తున్నారు. నిన్నరాత్రి బయట సుడిగాలి వీస్తున్నప్పుడు, నా తండ్రి మనసులోని కల్లోలచండమారుతం వేగాన్ని పుంజుకొంది. రాత్రంతా ఆయన నిద్ర పోనేలేదు; నన్ను కూడ నిద్రపోనివ్వలేదు. పాతకథలన్నీ

మళ్ళీ చెప్పారు. 'కడలిలో పడి చనిపోయిన ఆ పగ తీర్చుకొనే పాతకే ఇప్పుడు నా మీద పగ తీర్చుకొంటోంది. ఆమే నా అరుళ్మొళిని సముద్రంలో ముంచి చంపేసింది! కరికాలన్ మీద కూడ పగ తీర్చుకోక వదలదు!' అని తరచూ కేకలేశారు. 'నా ఒక్క కొడుకైనా సజీవంగా ఉన్నప్పుడే నన్ను తీసుకొని పోవా, యముడా!' అని ఏడ్చారు. ఆయనను నేనెంత సమాధానపరిచినా కూడ ప్రయోజనం లేకపోయింది. అప్పుడే నాగపట్టణంలోని చూడామణి విహారంలో అరుళ్మొళివర్మ క్షేమంగా ఉన్నాడని ఆయనకు చెప్పవలసి వచ్చింది..."

"అది విన్న తర్వాత చక్రవర్తి కాస్త ఊరట పొందారా?"

"అదే లేదు; ఆ తర్వాత చిత్తభ్రమ ఇంకా ఎక్కువైంది! మొదట ఆ వార్తను ఆయన నమ్మనే లేదు. కానీ ప్రత్యక్షంగా చూసి వచ్చానని చెప్పిన తర్వాత నమ్మారు. ఎందుకు వాడిని పిలుచుకొని రాలేదని అడిగారు. చలిజ్వరం తర్వాత ప్రయాణానికి కావలసిన దేహబలం ఇంకా రాలేదని, త్వరలోనే పిలుచుకొని రావడానికి ఏర్పాట్లు చేస్తానని చెప్పాను. కానీ వాడినిప్పుడు ఇక్కడికి (తంజావూరుకు) పిలుచుకొని వస్తే రాజ్యంలో ఏర్పడగల కల్లోలం గురించి కూడ సూచించాను. ఇది వినగానే ఆయన మనసు పోకడ ఇంకో విధంగా మారిపోయింది. 'ఈ రాజ్యమే నా పిల్లలకు యముడిగా మారిపోయింది. రాజ్యహక్కు వారికి లేదని తీర్మానమైతే, వారు క్షేమంగా ఉంటారు. అందుకే వారిద్దరినీ ఇక్కడికి పిలుచుకొని రావడానికి ఇంత తొందరపడుతున్నాను!' అన్నారు. ఉన్నట్లుండి ఆయన మనసులో ఇంకొక భీతి పుట్టింది. ఉగ్రమైన సుడిగాలి వల్ల నిన్నరాత్రి అంతఃపురమంతా తల్లడిల్లిపోయింది. ఒకసారి పెద్ద పిడుగు పడి సద్దు మణిగిన తర్వాత నా తండ్రి వెర్రి అధికమైపోయింది. 'కూతురా! అరుళ్మొళిని నేనిక చూడబోను. దక్షిణసముద్రంలో లేచే సుడిగాలి గురించి, సుడిగుండాల గురించి నాకు బాగ తెలుసు. ఈ రాత్రి వీస్తున్న సుడిగాలి వల్ల సముద్రతీరాన కొబ్బరిచెట్టంత ఎత్తైన అలలు లేస్తాయి. సముద్రం చాల లోపలికి చొచ్చుకొని వచ్చి చాల ప్రదేశాలను ముంచేస్తుంది. ఒకనాడు కావేరిపట్టణాన్ని కడలి తీసుకొని పోయినట్లు నాగపట్టణాన్ని తీసుకొని పోయినా పోవచ్చు. అందులోను సముద్రతీరానికి, కాలువకు మధ్య ఉన్న చూడామణి విహారం ఒక్కరోజు కూడ బతకలేదు. ఆ పగ తీర్చుకొనే పాతకి నా కొడుకును కడలిలో ముంచి చంపలేకపోయింది. అందువల్ల తీరానికే వచ్చి నా కొడుకును చంపబోతూంది! ఇదిగో నేనిప్పుడే వెళ్ళి ఆ పాతకిని అడ్డుకొని నా కొడుకును కాపాడుకొంటాను!' అని అరుస్తూ లేవడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో పట్టుజారి పడకనుంచి కింద పడ్డారు. అప్పుడు నా తండ్రి ఏడుపును వింటే రాళ్ళు, కొండలు కరిగిపోయేవి!" అన్నది యువరాకుమారి కుందవై. అప్పుడామె కళ్ళనుంచి ధారగా కన్నీళ్ళు ప్రవహించసాగాయి.

~~~
~~~

# అధ్యాయము - 26

## వీధిలో కలకలం

**కుందవై** కన్నీళ్లను చూడగానే వాణతి కూడ ఏడ్వనారంభించింది. ఈ లోకంలో ఎన్నో సుఖదుఃఖాలను చూసిన అనిరుద్ధుల వజ్రహృదయం కూడ కరిగింది.

"తల్లీ! చక్రవర్తి ఇప్పుడు పడుతున్న వేదనలకు, కష్టాలకు ఈ పాపిష్టి కారణం. ఏం ప్రాయశ్చిత్తం చేసి ఆ పాపాన్ని నివృత్తి చేసుకోబోతున్నానో తెలియడం లేదు!" అన్నారు.

"అయ్యా! మీకు తెలియనిదేమీ లేదు. అయినా కూడ, నాకు తెలిసింది చెబుతాను. ఆ సముద్రతీరవాసి కుమార్తె చనిపోలేదు, సజీవంగానే ఉందని తండ్రికి తెలియజెప్పేస్తే, ఆ దుఃఖం తీరి మనసు కుదుటపడుతుంది. అది చెప్పేందుకే మీ దగ్గరకు వచ్చాను. ఎలాగైనా నా పెదతల్లిని పిలుచుకొని రావడానికి ఏర్పాటు చేయమని అడిగేందుకే వచ్చాను. కానీ అందుకు మీరే ఏర్పాట్లు చేసేశారు!" అన్నది కుందవై.

"అవునమ్మా! నేను కూడ అటువంటి తీర్మానానికే వచ్చాను. మందాకినీదేవి సజీవంగా ఉన్న విషయాన్ని చక్రవర్తికి చెప్పేయాలనే తీర్మానించాను. కానీ ఊరకే చెబితే ఆయన నమ్మరు. ముందు నేను చెప్పింది అబద్ధం, ఇప్పుడు చెబుతున్నదే నిజమని ఆయనను ఎలా నమ్మించడం? అందుకే ఆ దేవిని ఇక్కడికి రప్పించిన తర్వాతే చెప్పాలనుకొన్నాను. ప్రత్యక్షంగా చూస్తే నమ్మే తీరాలి కద? ఆ ముఖ్యకారణం మీదే లంకకు వెళ్ళాను. కానీ నేను తమ తమ్మునితోను, పెద్ద వేళార్‌తోను కుట్ర పన్నేందుకే లంకకు వెళ్ళానని పళువేట్టరయ్యర్లు చక్రవర్తికి చాడీ చెప్పారు. అది నిజం కాదని నిరూపించడానికే మందాకినీదేవిని పిలుచుకొని వెళ్ళి చక్రవర్తి ముందుంచబోతున్నాను!" అన్నారు ముఖ్యమంత్రి.

"అయ్యా! అలా ఉన్నట్లుండి పిలుచుకొని వెళ్ళి నిలబెడితే, తండ్రికి ఏదైన హాని కలిగినా కలగవచ్చు. ముందు తెలియజేసిన తర్వాతే, ఆమెను పిలుచుకొని వెళ్ళి చూపించాలి!" అన్నది కుందవై.

"అవునమ్మా! అలాగే చేయాలని నా ఉద్దేశం కూడాను. ఈ ఇంటికి మందాకినీదేవి వచ్చి చేరిన వెంటనే వెళ్ళి చెబుదామనుకొన్నాను. ఈ రోజు ఉదయాన అంతఃపురానికి రావాలనే అనుకొన్నాను. అంతలో ఆ త్యాగవిడంగర్ కూతురు మధ్య తలదూర్చి నన్ను మోసం చేసింది. ఆ గడుసు పిల్లకు ఒకరోజు తగిన శిక్ష విధించబోతున్నాను!" అన్నారు ముఖ్యమంత్రి.

"అయ్యో! అలా ఏమీ చేయవద్దు. ఆ పిల్ల మంచిదో, చెడ్డదో నేనెరుగను. కానీ అరుళ్మొళి కడలిలో మునిగిపోకుండ కాపాడింది ఆ పిల్లే కద?"

"దేవుడు కాపాడాడు అని చెప్పండి, తల్లీ! పాలసముద్రంలో విలసిల్లిన భగవానుడు కాపాడాడు. ఆయన దయ/కృప లేకపోతే, ఈ చిన్నపిల్ల ఏం చేయగలదు? జ్యోతిష శాస్త్రం నిజమైతే, గ్రహాలు, నక్షత్రాల

సంచార బలం నిజమైతే, యువరాజును కడలిగాని, సుడిగాలిగాని, అగ్నిగాని, భూకంపంగాని ఏం చేయలేవు…"

"దేవుని దయ లేకపోతే ఏదీ జరగదు, నిజమే. కానీ భగవంతుని శక్తి కూడ మనుష్యరూపంలోనే కద ప్రత్యక్షమవ్వాలి? పూంగుళలిని మళ్ళీ నాగపట్టణానికి పంపించాలని అనుకొంటున్నానయ్యా! లేక, మీరు ఇంకొక విధంగా ఆలోచిస్తుంటే - అరుళ్మొళిని ఇక్కడికి బహిరంగంగానే రప్పిద్దామని అనుకొంటూంటే…"

"లేదు, తల్లీ! లేదు! సింహాసనం ఎవరికని నిశ్చయమయ్యేంతవరకు అరుళ్మొళివర్మ గురించి ప్రజలకు తెలియకుండడమే మంచిది. తమ తండ్రిగారిని నేడు చివరిమాటగా అడిగేయాలని అనుకొంటున్నాను. మధురాంతకులకు పట్టం కట్టేటట్లయితే, తమ తమ్ముని మళ్ళీ లంకకే పంపించేయడం మంచిది. అరుళ్మొళివర్మ ఇక్కడ ఉన్నప్పుడే మధురాంతకులకు పట్టం కట్టేందుకు చోళనాడు ప్రజలు ఏనాడూ ఒప్పుకోరు. చోళనాడు ఒక మహారణరంగమవుతుంది; చోళనాడు నదుల్లో రక్తమే వెల్లువై ప్రవహిస్తుంది…"

"అయ్యా! అలాగైతే పూంగుళలిని, సేందన్ అముదన్ని మళ్ళీ నాగపట్టణానికి పంపించడం మంచిది కద?"

"అదే మంచిది. చక్రవర్తి కోరుకొంటే, ఒకసారి అరుళ్మొళి రహస్యంగా తంజావూరుకు వచ్చి తిరిగి వెళ్ళవచ్చు!"

"అవును! మందాకినీదేవి, అరుళ్మొళి సజీవంగానే ఉన్నారని ఒకసారి కళ్ళారా చూసి తెలుసుకొంటేనే చక్రవర్తికి నెమ్మది."

"పెద్ద యువరాజు గురించి తమ తండ్రికి ఎలాంటి దిగులు లేదు కద?"

"ఏమాత్రం లేదు. ఆదిత్య కరికాలన్‌కి అపాయం కలిగించగలవారు ఈ లోకంలోనే లేరని ఆయన నమ్మకం. మీరేమనుకొంటున్నారు?"

"నాకేమో అంత గట్టి నమ్మకంలేదు. యుద్ధరంగంలో పెద్ద యువరాజు అసహాయ శూరులే. కానీ తక్కిన స్థలాల్లో ఆయన్ని మోసం చేయడం, వంచించడం కష్టం కాదు. పళువేట్టరయ్యర్లు ఆయనను విరోధిస్తున్నారు. పళువూర్ యువరాణి ఆయనకు వ్యతిరేకంగా ఏదో భయంకరమైన కుట్ర పన్నుతూంది. ఈ రెండు సంగతులను కరికాలన్‌కి నా శిష్యుని ద్వారా చెప్పి పంపాను. కానీ ఫలితం లేదు; తంజావూరుకు రమ్మని ఎంత చెప్పి పంపినా రానివారు కడంబూర్ మాళిగకు వెళ్ళివున్నారు…"

"అయ్యా! పళువూర్ యువరాణి మా అక్క కావచ్చనే సందేశాన్ని నేను నా అన్నకు పంపించాను. దగ్గరుండి కాపాడమని వాణర్ కులవీరులకు చెప్పి పంపాను. ఆహా! ఆ వల్లవరయ్యర్ ఇప్పుడిక్కడుంటే నాగపట్టణానికి పంపవచ్చు…"

"ఆ అబ్బాయి ఏదైన సంకటంలో చిక్కుకోకుండ తోడుగా నా శిష్యుని కూడ పంపాను. ఇప్పుడు కూడ మీరు పూంగుళలిని పంపితే, వెనకే తిరుమలైని పంప ఉద్దేశిస్తున్నాను.."

"వెళ్ళినవాళ్ళు ఇంకా తిరిగి రాలేదు కద? నా పెదతల్లి వచ్చేస్తే నా మనసునుంచి మూడు పాళ్ళు భారం దిగిపోతుంది! ఆమె వచ్చిన వెంటనే, మీరు నా తండ్రిని కలిసి, ఆ విషయాన్ని చెప్పేస్తారు కద? నేను నా తల్లికి మొదటినుంచి అంతా చెప్పాలి.."

"ఆహా! మలైయమాన్ కుమార్తెకు ఎన్నెన్ని మనోవేదనలు? దీనికి తోడు, ఆ తిరుక్కోవలూర్ ముసలాయనకు ఇదంతా తెలిసినప్పుడు అతడేం చేయబోతాడో కద? తన మనుమలకు పట్టం లేదని తెలిస్తే, ఈ చోళనాడునే తుడిచిపెట్టేస్తానని బయల్దేరవచ్చు..."

"నా తాతను కట్టుబాటులో ఉంచే పనిని నాకు వదిలేయండి. ఈ పిల్ల వాణతి ఉంది చూడండి, దీని పెదనాన్న గురించే నాకు దిగులుగా ఉంది. ఈ కొడుంబాళూర్ అమ్మాయి ఒకరోజు చోళసింహాసనమధిష్టించబోతుందని ఆయన ఆశపడుతున్నారట. ఈ పిల్ల మనసులో కూడ అలాంటి ఆశ ఉంది..."

వాణతి ఉక్రోషం నిండిన గొంతుతో, "అక్కా!" అని ఇంకా ఏదో చెప్పబోయింది. అంతలో పూంగుళలి లోపల ప్రవేశించింది.

ఆమె ఒంటరిగా రావడం చూసి ముగ్గురూ కాస్త ఉలిక్కిపడ్డారు.

"పూంగుళలీ! నీ అత్త ఎక్కడ? తిరుమలై ఎక్కడ?" అని ముఖ్యమంత్రి ఆదుర్దాగా అడిగారు.

"అయ్యా! నాకు గర్వభంగమైంది; నేను మాటిచ్చిన ప్రకారం నా అత్తను ఇక్కడికి పిలుచుకొని రాలేకపోయాను."

"మీరు వెళ్ళేటప్పటికే కనిపించలేదా? లేక, రా నిరాకరించిందా? అలాగైతే..."

"లేదయ్యా! కోట లోపలికి పిలుచుకొని వచ్చేశాము. ఆ తర్వాతే జనసందోహంలో చిక్కుబడి అత్త కనిపించికుండపోయింది!" అన్నది పూంగుళలి. తర్వాత జరిగినది ఇలా వివరించింది:-

మందాకినీదేవి మంచివేళగా సేందన్ అముదన్ ఇంట్లోనే ఉండింది. ఆమె అక్కడే ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతరాత్రి వీచిన సుడిగాలిలో అముదన్ ఇల్లు ఛిన్నాభిన్నమైపోయింది. తోటలో ఉన్న ఒక చెట్టు ఇంటి కప్పుమీదే పడిపోయింది. సేందన్ అముదనేమో క్రితం రాత్రి వానలో బాగా తడిసిపోయినందువల్ల జ్వరం వచ్చి మంచం పట్టాడు. అక్కచెల్లెళ్ళిద్దరు పడిపోయిన చెట్లను పక్కకు జరిపి ఇంటిని చక్కబెట్టుకొనే కార్యంలో నిమగ్నమైనారు. పూంగుళలిని చూడగానే మందాకిని చాల సంతసించింది. తిరుమలైని చూసి కాస్త జంకింది. అతడు మనవాడేనని పూంగుళలి చెప్పిన తర్వాత కాస్త ధైర్యం తెచ్చుకొంది. అక్కడికి రాకమునుపే పూంగుళలి, తిరుమలై ఆ మూగరాణికి ఏం చెప్పాలి, ఎలా చెబితే ఆమె బెదిరి పారిపోకుండ తమతో వస్తుందని మాట్లాడి తీర్మానించుకొన్నారు. ఆ విధంగానే పూంగుళలి తన అత్తకు

(సైగలతో) చెప్పింది. చక్రవర్తి జబ్బుపడి మంచం పట్టారని, ఏ క్షణమైన ఈ భూలోకాన్ని విడిచి వెళ్ళిపోవచ్చని, తమ ఊపిరి ఆగిపోక మునుపు మూగరాణిని ఒకసారి చూడాలని ఆశపడుతున్నారని, ఆమెను చక్రవర్తి ఇంతకాలమూ మరవలేదని, ఆమెను చూస్తే కొత్తగా బలం పుంజుకొని ఇంకొంత కాలం జీవించవచ్చునని సైగలతో తెలియజేసింది. అందుకోసమే ముఖ్యమంత్రి ఆమెనెలాగైనా పట్టి తీసుకొని రమ్మని మనుషులను పంపించారని, ఆయన అంతఃపురంలోనే తాను గతరాత్రి బస చేసిందని కూడ చెప్పింది పూంగుళలి.

చక్రవర్తి ప్రియపుత్రిక కుందవైదేవి మూగరాణిని చక్రవర్తి వద్దకు పిలుచుకొని వెళ్ళడానికి ముఖ్యమంత్రిగారి ఇంట్లోనే వేచివుందని కూడ తెలియజేసింది. ఇదంతా ఒకింత తెలుసుకొన్న తర్వాత మందాకిని పూంగుళలి, తిరుమలైలతో రావడానికి ఒప్పుకొంది. కోటవాకిలి దగ్గరికి వారు వచ్చి చేరినప్పుడు, చక్రవర్తికి కాపలా కాసే వేళక్కార దండు వీరులు కోట లోపల ప్రవేశిస్తున్నారు. వారు వెళ్ళనీ అని ముగ్గురూ పక్కకు ఒదిగి నిలబడ్డారు. వేళక్కర వీరులను మందాకిని కళ్ళార్పకుండ చాల ఆసక్తితో చూస్తూంది. వేళక్కర దండు వెనకే ఒక పెద్ద జనకూటమి కోటలో ప్రవేశించింది. వారిని అడ్డగించి ఆపడానికి, కోటవాకిలి మూయడానికి కాపలావాళ్ళు చేసిన ప్రయత్నం ఫలించలేదు. "ఈ కూటమితో మనం వెళ్ళవద్దు; ముఖ్యమంత్రి అంతఃపురానికి వెళ్ళడానికి ఒక ప్రత్యేకమైన సొరంగమార్గముంది. ఆ దారిన వెళదాం" అన్నాడు తిరుమలై. ఆ విషయాన్ని పూంగుళలి తన అత్తకు చెప్పడానికి ప్రయత్నించింది. కానీ ఆమె దాన్ని పట్టించుకోకుండ కోట లోపలికి వెళుతున్న జనాలతో చేరి వెళ్ళసాగింది. పూంగుళలి, తిరుమలై ఆమె వెనకే వేగంగా వెళ్ళారు. కోట లోపలికి ప్రవేశించిన తర్వాత కూడ, తిరుమలై ఇంకొక ప్రత్యేకమైన దారిగుండా వెళదామని చెప్పింది ఆమె పట్టించుకోనేలేదు. కూటమితో కలిసే వెళ్ళింది. గుంపును చూసి బెదిరే స్వభావం కల ఆ మూగరాణి ఇలా ప్రవర్తించడాన్ని చూసి తక్కిన ఇద్దరూ ఆశ్చర్యపోయారు. కాస్త దూరం వెళ్ళిన తర్వాత గుంపులో కొందరు మందాకినిని నిశితంగా చూడనారంభించారు. "ఈ అమ్మను చూస్తే పళువూర్ యువరాణి పోలిక లేదూ?" అని ఒకరితోనొకరు మాట్లాడుకోనారంభించారు. తిరుమలైకి, పూంగుళలికి ఇది చాల కంగారు పుట్టించింది. వారు మందాకిని కన్న ముందు వెళ్ళి ఆమెనడ్డుకోజూశారు.

ఇంతలో ఆళ్వార్ కట్టియాన్ని (తిరుమలై) చూసిన కొందరు, "వీడెవడ్రా స్త్రీలను ఇబ్బంది పెడుతున్నవాడు?" అన్నారు. ఈ మాట చెవిన పడ్డ కొందరు వేళక్కార దండు వీరులు కొందరు వెనక్కి తిరిగారు. మూగరాణి చుట్టూ చేరి, తక్కినవారిని అవతలికి వెళ్ళేలా చేశారు. ఈ తొక్కిసలాటలో పూంగుళలి, తిరుమలై కూడ అవతలికి పోవలసివచ్చింది. వేళక్కర దండులో ఒకడు మందాకినీదేవిని చూసి, "అమ్మా! నీవెవరు? నిన్ను ఇబ్బంది పెడుతున్నవారెవరు, చెప్పు! ఇప్పుడే వారిని ఇక్కడే ఉరి వేసేస్తాము!" అని అడిగాడు. మూగరాణి బదులు చెప్పక నిలబడింది. ఇంకొందరు అడిగినప్పటికీ ఆమె బదులు చెప్పలేదు. ఇంతలో ఒకడు, "ఈమెను చూస్తే పళువూర్ యువరాణిలాగ లేదూ?" అన్నాడు. ఇంకొకడు, "అలాగే

ఉండాలి; అందుకే ఇంత గర్వంగా ఉంది!" అన్నాడు. "పళువూర్ గుంపే గర్విష్టి గుంపు!" అన్నాడు ఇంకొకడు. ఈ సంఘటనలు చిన్న పళువేట్టరయ్యర్ అంతఃపురానికి సమీపంగానే జరిగాయి. కాబట్టి ఏమిటీ గలాటా అని తెలుసుకోవడానికి పళువూర్ వీరులు కొందరు వచ్చారు. "పళువూర్ గుంపే గర్విష్టి గుంపు!" అని ఒక వేళక్కార వీరుడు చెప్పింది వారి చెవిన పడింది. "ఎవడ్రా పళువూర్ గురించి నిందారోపణ చేస్తున్నది? రండి ముందుకు!" అన్నాడొక పళువూర్ వీరుడు. "నేనే అన్నాను. ఏం చేసేస్తావు రా?" అని ముందుకొచ్చాడా వేళక్కార దండు వీరుడు. "మీరేరా గర్విష్టులు. మీకు గర్వభంగమయ్యే రోజు దగ్గర పడుతూంది!" అన్నాడు పళువూర్ వీరుడు. "ఆహా! మా యువరాజును సముద్రంలో ముంచేసినందువల్ల ఇలా మాట్లాడుతున్నావా? మీలాంటి పాతకులుండడం వల్లనే సుడిగాలి వీచి ఊళ్ళన్నీ నాశనమైనాయి!" అన్నాడు గుంపులో ఒకడు. పళువూర్ వీరుడు, "ఏమన్నావురా?" అని అలా అన్నవాడిని కొట్టబోయాడు. వేళక్కార వీరుడు వాడిని అడ్డగించాడు. తర్వాత కూటమిలో చేతులు, చేతులు కలిసి దెబ్బలాటలు, గందరగోళం మొదలైనాయి. "పళువూర్ ఏలికలకు జయహో!" అని కొందరు, "ముల్లోకాలేలే సుందర చోళ చక్రవర్తికి జయహో!" అని కొందరు ఘోషించారు. "కొడుంబాళూర్ వేళార్‌కి జయహో!", "తిరుక్కోవలూర్ మలైయమాన్‌కి జయహో!" అన్న ఘోషలు కూడ లేచాయి. ఆ సమయాన చిన్న పళువేట్టరయ్యరే గుర్రం మీద అక్కడికి వచ్చి చేరారు. ఆయనను చూడగానే దెబ్బలాటలు ఆగిపోయాయి. జనాలు కూడ చెదరి నలువైపులా పారిపోయారు. వేళక్కార దండు వీరులు ముందు వెళ్ళారు. పళువూర్ వీరులు చిన్న పళువేట్టరయ్యర్ చుట్టూ చేరి, జరిగిందంతా వివరించారు. పూంగుళళి, ఆళ్వార్ కట్టియాన్ వీధిలో ఒక వారగా ఒదిగి నిలబడ్డారు. చుట్టుపక్కల గుచ్చి చూశారు. మందాకిని కనిపించలేదు.

"అయ్యో! ఇదేమి? ఇలా అయిపోయిందే! రాజధానిలో పరిపాలన భలే భేషుగా నడుస్తూంది! అత్తను ఎలా కనిపెట్టడం? ఆమెకేదైనా హాని కలుగుతుందా? ఎవరైనా ఆమెను పట్టుకొని వెళ్ళిపోయారా?" అని దిగులుపడింది పూంగుళళి. చిన్న పళువేట్టరయ్యర్, వారి వీరులు వెళ్ళిన తర్వాత నలువైపులా వెతికి చూశారు. మందాకిని కనిపించలేదు. తిరుమలై, "నేనింకాసేపు వెతికి చూస్తాను. నీవు వెంటనే వెళ్ళి ముఖ్యమంత్రికి, యువరాకుమారికి జరిగిందంతా తెలియజెప్పు; మనమిద్దరం మాత్రం వెతికితే చాలదు. ముఖ్యమంత్రి, యువరాకుమారి ఏదైనా ఏర్పాటు చేస్తారు!" అన్నాడు. పూంగుళళి వెళ్ళడానికి జంకింది. మళ్ళీ ఆళ్వార్ కట్టియాన్, "నేను చెప్పేది విను. నీ అత్తకు ఏమీ కాదు. జనకూటమిలో ఎవరో తెలిసిన మనిషి ఒకడు ఆమెను చూసినట్లుంది. ఆమె ఒక దిక్కునే శ్రద్ధగా చూసినందుల్ల అలా ఊహిస్తున్నాను. అందుకే గుంపుతో చేరి వచ్చింది. ఇప్పుడు కూడ వాడి వెనకే వెళ్ళినట్లు తోస్తూంది. ఎలాగూ అది మనం కనిపెట్టేయవచ్చు; నీవెళ్ళి ముఖ్యమంత్రికి చెప్పు!" అన్నాడు. పూంగుళళి ముఖ్యమంత్రి అంతఃపురానికి వచ్చి చేరింది...

ఇదంతా విన్న కుందవై చాల దిగులుపడింది. అనిరుద్ధులు అంతగా దిగులుపడ్డట్లు

అగుపించలేదు. “చూశారా, రాకుమారీ! కలహపిశాచి ఎప్పుడు సందర్భం దొరుకుతుందా అని పొంచివుండడాన్ని? అరుళ్మొళివర్మ సజీవంగా ఉన్నారని తెలియాలంతే - రాజ్యమంతా నిప్పంటుకొంటుంది!” అన్నారు.

“మీరు ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు అలా ఏమీ జరగదు. ఇప్పుడు నా పెదతల్లి గురించి చెప్పండి. నేను భయపడినట్లే అవుతుంది లాగుందే! వారిని ఎలా కనిపెట్టడం?” అని అడిగింది.

“ఆ దిగులు మీకు వద్దు; కోట లోపలికి వచ్చేసినందువల్ల ఇక నాకు తెలియకుండ బయటకు వెళ్ళలేదు. అందుకు తగిన ఏర్పాట్లు చేసేస్తాను; వెతికేందుకు కూడ ఏర్పాట్లు చేస్తాను. ఇక చక్రవర్తిని చూడకుండ మందాకినీదేవి ఈ చోటు విడిచి వెళ్ళదు!” అన్నారు ముఖ్యమంత్రి.

~~~
~~~

# అధ్యాయము - 27

## నేలమాళిగ బొక్కసంలో

**పూంగుళలి** మందాకినీదేవిని విడిచి వేరుపడ్డ చోట మనమిప్పుడు ఆవిడ వెంబడి వెళ్ళవలసివుంది. ఆమె గుంపులోను, గందరగోళంలోను మరుగైన కారణం గురించి ఆళ్వార్ కట్టియాన్ ఊహించి చెప్పింది నిజమే. కోట లోపల వేళక్కార దండుతోబాటు చొరబడిన జనాల్లో మందాకిని, రవిదాసనే కుట్రదారుని చూసేసింది. పుట్టుకతో ఏదైన ఒక ఇంద్రియలోపం ఉన్న వారికి తక్కినవి ఇంకా బాగ పనిచేయడం సహజమే కద? మందాకినికేమో చెవులు వినిపించవు, మాట రాదు. కాబట్టి కంటిచూపు చాల నిశితంగా, చురుగ్గా ఉంది. పూంగుళలి, ఆళ్వార్ కట్టియాన్ ఇద్దరూ మందాకినీదేవినే గమనిస్తున్నారు. కాబట్టి వారి కంట పడని రవిదాసు మందాకిని కంట పడ్డాడు.

రాబోయే మంచి చెడులను ముందుగానే తెలుసుకోగల అతీంద్రియశక్తి మందాకినికి ఉంది. కాబట్టి రవిదాసు ఏదో కీడు చేసేందుకే ఇక్కడికి వచ్చాడని ఆమె గ్రహించింది. ఇప్పటికే లంకనాడులో అరుళ్మొళివర్మను రవిదాసు చంప ప్రయత్నించిన విషయం ఆమెకు తెలుసు కద? కాబట్టి గుంపులో గుంపుగా తంజావూరు వీధుల్లో వెళ్ళినప్పుడు ఆమె చూపు రవిదాసును విడిచి అణుమాత్రమైనా కదలలేదు.

కలకలం/గందరగోళం తీవ్రస్థాయిని చేరినప్పుడు చిన్న పళువేట్టరయ్యర్ గుర్రం మీద రాగానే జనాలు చెదరిపోయారు కద? అప్పుడు రవిదాసు, ఇంకొక మనిషి ఒక సందులో దూరడాన్ని మందాకిని గమనించింది. వెంటనే ఆ దిక్కునే గురిగా పెట్టుకొని వేగంగా వెళ్ళి అదే సందులో ప్రవేశించింది.

ఇది జరిగిన ఒక నిమిషంలోపల, జనాల చేత తోయబడ్డ తిరుమలై, పూంగుళలి మందాకినిని గమనించలేకపోయారు. తర్వాత చూస్తే, ఆమె కనిపించనే లేదు. మందాకిని ఆ సందులో దూరిన తర్వాత ఒకటి రెండుసార్లు పూంగుళలి, తిరుమలై వస్తారేమోనని తిరిగి చూసింది. వారు కానరాలేదు. అయినా కూడ, రవిదాసు వెన్నంటి వెళ్ళడమే ముఖ్యమైన కార్యమని తీర్మానించుకొంది. ఈ కథ మొదట్లో వంతిదేవుడు చిన్న పళువేట్టరయ్యర్ మనుషులనుంచి ఏ దారిన తప్పించుకొని పారిపోయాడో, ఇప్పుడు రవిదాసు, అతడి తోటి మనిషి కూడ అదే దారిన వెళ్ళారు. రవిదాసుని స్నేహితుడు కూడ మనకెరుకే. తిరుప్పురంపయం పళ్ళిప్పడైలో నడిరాత్రి సమావేశమైన కుట్రదారుల కూటమికి చెందిన సోమన్ శాంభవనే అతడు.

వారిద్దరూ అతివేగంగా సందుగొందుల్లో దూరి వెళ్ళారు. అక్కడక్కడ సుడిగాలికి కింద పడ్డ చెట్లను లెక్కచేయక వాటి మీదుగా ఎగిరి దూకి దాటుకొంటూ వెళ్ళారు. వాన నీటివల్ల ఏర్పడ్డ బురద

గుంటలను కూడ లెక్కచేయక పరుగెత్తారు. ఇంకా మెల్లగా గాలి వీస్తుండడం వల్ల చెట్ల కొమ్మలు అటూ ఇటూ మెల్లగా కదులుతున్నాయి. కాబట్టి చెట్ల ఆకులనుంచి అప్పుడప్పుడు వాననీటి బిందువులు రాలుతున్నాయి. తమను ఎవరైనా వెన్నంటి రావచ్చనే ఆలోచన కూడ వారికి కలగలేదు. కాబట్టి వారు తిరిగి చూడకనే వేగంగా వెళ్ళారు. తిరిగి చూసినా కూడ వారు మందాకినీదేవిని చూసివుండలేరు.

చివరికి, వారి త్వరిత ప్రయాణం పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురం తోట వెనకవైపున్న ప్రాకారం గోడ వద్ద ఆగింది. సుడిగాలి వల్ల వేళ్ళతో పెకలించుకొని కూలిపోయిన చెట్టొకటి ఆ గోడమీద పడివుంది. రవిదాసు, సోమన్ శాంభవన్ సునాయాసంగా ఆ చెట్టెక్కి గోడ దాటి తోట లోపలికి దూకారు. వారు లోపలికి దూకడాన్ని చూస్తూన్న మందాకినీదేవి కూడ వారిలాగే చెట్టెక్కి గోడ దూకి తోటలో దిగింది.

రవిదాసు, సోమన్ శాంభవన్ని కాస్త దూరాన ఆపేసి, తాను మాత్రం పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురాన్ని సమీపించాడు. పళువేట్టరయ్యర్, యువరాణి లేనందువల్ల అంతఃపురం శూన్యంగా అగుపించింది. అయినా కూడ కొందరు స్త్రీలు మాట్లాడుతుండడం వినిపించింది. ఒకసారి ఇద్దరు దాదులు ఆ అంతఃపురం వెనక వసారాకు వచ్చారు. తోటలోని చాల చెట్లు విరిగి పడివుండడాన్ని చూశారు.

"ఆహా! హనుమాన్ ధ్వంసం చేసిన అశోకవనంలాగ కద ఉంది?" అన్నది ఒకతె.

"మన సీతాదేవి ఇప్పుడిక్కడ ఉంటే చాల వేదన పడేది!" అన్నది ఇంకొక దాది.

కాసేపు వారిలా మాట్లాడుకొని, లోపలికి వెళ్ళిన తర్వాత, రవిదాసు గుడ్లగూబలాగ ఒకసారి కూశాడు. దాదులిద్దరూ తిరిగి చూశారు. రవిదాసు వారికి కనిపించనట్లు బాగ మరుగ్గా నిలబడివున్నాడు.

దాదుల్లో ఒకతె, "చూడవే! పట్టపగలే గుడ్లగూబెలా కూస్తూందో! నిన్న వీచిన సుడిగాలికి దానికి కూడ బుద్ధి చెదరిపోయినట్లుంది!" అన్నది.

ఇంకొకతె ఏమీ చెప్పలేదు.

కాసేపటికల్లా ఏమీ బదులు చెప్పని ఆ రెండో దాది తిరిగి వచ్చింది. పళువూర్ అంతఃపురానికి, బొక్కసపు నేలమాళిగకు మధ్యనున్న వసంతమంటపానికి వచ్చి చేరింది. ఈ మంటపంలోనే వంతిదేవుడు నందినిని (పళువూర్ యువరాణి) కలిశాడన్నది పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ఆ దాది/చెలికత్తె తోటను నిశితంగా, పరీక్షగా చూసింది. మళ్ళీ గుడ్లగూబ కూత వినిపించింది. కూత వినిపించిన చోటు గమనించి అటువైపు నడిచి వచ్చిందామె. చెట్టు చాటునుంచి రవిదాసు కూడ ముందుకొచ్చాడు.

"మంత్రవాదీ/మాంత్రికా! వచ్చావా? రాణికూడ ఇక్కడ లేదు కద? ఎందుకొచ్చావు?" అని అడిగింది దాది.

"అమ్మాయీ! యువరాణి పంపినందువల్లే వచ్చాను!" అన్నాడు రవిదాసు.

"వెళ్ళిన చోట కూడ నీవు యువరాణిని వదల్లేదా? ఇక్కడికెందుకొచ్చావు? ఎవరికైనా తెలిస్తే..."

"తెలిస్తే ఏం మునిగిపోతుంది?"

"అలా అనకు! చిన్న పళువేట్టరయ్యర్ మా మీద సందేహంగొనివున్నారు. నన్ను ఒకరోజు పిలిపించి కఠినంగా హెచ్చరించారు. మళ్ళీ మంత్రవాది వస్తే తమకు వచ్చి చెప్పాలని ఆజ్ఞాపించారు..."

"వాడు పాడైపోనీ, పో! వాళ్ళ పోగాలం దగ్గరపడుతూంది! నీవేమీ దిగులుపడక! నేలమాళిగ తాళం చెవి కావాలి! త్వరగా వెళ్ళి తీసుకొని రా!" అన్నాడు రవిదాసు.

"అయ్యయ్యో! నావల్ల కాదు!"

"ఇదిగో చూడు, నీ యజమానురాలి రాజముద్ర పొదిగిన ఉంగరం!" అని రవిదాసు యువరాణి రాజముద్రగల ఉంగరాన్ని తీసి చూపించాడు.

"దీన్ని నీవెక్కడ దొంగిలించి తెచ్చావో, ఎవరికి తెలుసు?"

"ఒసే, పాపీ! నన్నే దొంగ అంటావా? యువరాణే నన్ను చూసి వణకడం చూసి కూడానా ఇలా మాట్లాడుతున్నావు? చూస్తూండు! ఈ రోజు రాత్రి తొమ్మిది దెయ్యాలు వచ్చి నిన్ను సజీవంగా శ్మశానానికి ఎత్తుకెళ్ళి..."

"వద్దు, వద్దు! నీ పిశాచాలన్నీ నీదగ్గరే ఉండనీ. నాకేమి? యువరాణి ఉంగరాన్ని చూపించి నీవేం కావలంటే అది తీసుకొని వచ్చి ఇస్తాను. కానీ తొందరపడకు! తోట నాశనమైవుండడాన్ని చూసేందుకు దాది అమ్మాయిలు అప్పుడప్పుడూ వచ్చి వెళుతున్నారు. అందరూ భోంచేసేటప్పుడు నేను తాళం చెవిని తీసుకొని వచ్చి ఇస్తాను. అంతవరకు ఓపిక పట్టు...!"

"అలాగే కానీ; నాక్కూడా కాస్త భోజనం తీసుకొని రా! భోంచేసి రెండు రోజులైంది. చాల భోజనం తీసుకొని రా!" అన్నాడు రవిదాసు.

దాది పిల్ల వెళ్ళిన తర్వాత, రవిదాసు, సోమన్ శాంభవన్ విరిగిపడ్డ ఒక చెట్టు మీద కూర్చొని మాట్లాడుకొన్నారు. వారికి తెలియనట్లు మందాకిని కూడ ఒక చోట మరుగ్గా కూర్చొంది. దాది పిల్ల, రవిదాసు మాట్లాడుకొన్నది ఏమీ ఆమెకు అర్థంకాకపోయినా కూడ, ఏదో జరగబోతుందని ఊహించి తెలుసుకొంది. చాలసేపైన తర్వాత ఆ దాది పిల్ల తిరిగి వచ్చింది. రవిదాసు లేచి ముందుకు వెళ్ళాడు. ఆమె తీసుకొచ్చిన అన్నం మూటను, తాళం చెవుల గుత్తిని తీసుకొన్నాడు. తర్వాత, వసంతమంటపానికి వెళ్ళి, అక్కడినుంచి బొక్కసపు నేలమాళిగకు వెళుతున్న దారి వెంబడి ఇద్దరూ వెళ్ళారు. ఒకటి, రెండు, మూడో తాళం చెవి వేసి తిప్పిన తర్వాత తాళం తెరుచుకొంది. నేలమాళిగ లోపల చిమ్మచీకటిగా ఉంది.

రవిదాసు దాది పిల్లను చూసి, "అరెరె! నేనొకటి మరిచిపోయాను కద! ఈ చీకటి గదిలోకి దీపం లేకుండ ఎలా వెళ్ళడం? ఒక దీపంగాని, దివిటీగాని తీసుకొని రా!" అన్నాడు.

"పట్టపగలే దివిటీగాని, దీపంగాని ఎలా తీసుకొని రావడం? ఎవరైనా చూసి సందేహిస్తే...?"

"అదంతా నాకు తెలియదు! నీకామాత్రం సామర్థ్యం లేదనా అంటున్నావు? నేను నమ్మను. ఏదైన ఒక ఉపాయం పన్ని తీసుకొని రా! లేకపోతే రాత్రి పన్నెండు కొరివిదెయ్యాలను పంపి..."

“అయ్యయ్యో! వద్దు ఊరుకో! ఎలాగైనా తీసుకొని వచ్చి ఇస్తాను!” అన్నదా దాది పిల్ల.

“అంతలో నేను భోంచేస్తాను" అన్నాడు రవిదాసు.

ఆ దాది పిల్ల అంతఃపురంవైపు వెళ్ళిన తర్వాత రవిదాసు అన్నం మూట తీసుకొని తోటలో ప్రవేశించి, సోమన్ శాంభవన్ దగ్గరికి వచ్చాడు.

అతడికి ఆ అన్నం మూటనిచ్చి, “ఒకవేళ రెండు మూడు రోజులు నేలమాళిగలోనే ఉండవలసి రావచ్చు. సరైన సందర్భం దొరకాలి కద? కాబట్టి ఈ అన్నం మూటను పెట్టుకో. శూలాన్ని తీసుకొని సద్దు చేయకుండ నాతో రా! ఆ పిల్ల దివిటీ తీసుకొని రావడానికి వెళ్ళింది. అంతలోపల నీవు నేలమాళిగలోపల దూరాలి!” అన్నాడు. ఇద్దరూ త్వరత్వరగా వెళ్ళారు. మందాకిని కూడ వారికి తెలియకుండ వారి వెన్నంటి వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 28

## పాతాళమార్గం

**నలువైపులా** బాగ పరికించి చూసిన తర్వాత రవిదాసు తెరిచివున్న నేలమాళిగ తలుపును సోమన్ శాంభవన్‌కి చూపించి దాని లోపలికి వెళ్ళమన్నాడు.

"మొదట చీకటిలో కళ్ళు కనిపించవు. అందుకని తలుపు దగ్గరే ఆగిపోకు. కాస్త లోపలికే వెళ్ళి నిలబడు!" అన్నాడు.

సోమన్ శాంభవన్ లోపలికి వెళ్ళగానే అతన్ని చీకటి మింగేసినట్లు తోచింది. తర్వాత రవిదాసు వెనుదిరిగి కాలిబాట వెంబడి నందినీదేవి వసంతమంటపం వరకు వెళ్ళాడు. అక్కడినుంచి పళువేట్టరయ్యర్ అంతఃపురాన్ని పరీక్షగా చూస్తూ నిలబడ్డాడు. దాదిపిల్ల తప్ప ఇంకెవరైనా వస్తే తాను కూడ తొందరగా వెళ్ళి నేలమాళిగలో దూరి తలుపు మూయవలసిన పరిస్థితి రావచ్చు కద?

అప్పుడు, మందాకినీదేవి ఏమాత్రం శబ్దం చేయకుండ వచ్చి తెరిచివున్న నేలమాళిగ తలుపు గుండా లోపల ప్రవేశించింది. దట్టమైన అడవుల్లో నడిరాత్రి ఎన్నోసార్లు సంచరించిన ఆమెకు ఈ చీకటి ఒక లెక్కా? కొన్ని క్షణాల్లో కళ్ళు కనిపించసాగాయి. రవిదాసుతో వచ్చినవాడు కాస్త దూరాన ఒక స్తంభానికి గుద్దుకొని అవస్థపడ్డాన్ని చూసింది. చూసి, ఆమె అందుకు వ్యతిరేకదిశలో వెళ్ళింది. అక్కడ ఒక మెట్లవరుస కనిపించింది. నేలమాళిగ బాట అక్కడ కిందికి సాగింది. మెట్ల వెంబడి దిగి చివరి మెట్టు మీద నిలబడింది.

సోమన్ శాంభవన్‌కి ఏదో చిన్న శబ్దం వినిపించివుండాలి.

"ఎవరది? ఎవరది?" అని గట్టిగా అన్నాడు.

అది తెరిచివున్న వాకిలి గుండా బయటకు వెళ్ళి రవిదాసు చెవిన మెత్తగా పడింది. అదే సమయాన అంతఃపురంనుంచి దాది పిల్ల చేత దివిటీతో రావడాన్ని చూశాడు రవిదాసు. తాను ముందుగా వెళ్ళి సోమన్ శాంభవన్ని హెచ్చరించడానికి వేగంగా నడిచి వెళ్ళాడు.

నేలమాళిగ వాకిలి లోపల ప్రవేశించగానే, "శాంభవా? ఎక్కడున్నావు? నన్ను పిలిచావా?" అన్నాడు.

"అవును, పిలిచాను!"

"అంతలోపల ఏం తొందర? నీ గొంతు బయట ఎవరికైనా వినిపిస్తే ఏం చేయడం? నిన్ను ఇక్కడిలాగే వదిలిపెట్టి వెళ్ళిపోతాననుకొన్నావా?"

"లేదు, లేదు! ఒక విషయం అడిగేందుకే పిలిచాను" అని చెబుతూనే సోమన్ శాంభవన్ రవిదాసును సమీపించాడు.

ఈ సమయాన నేలమాళిగ వాకిలి దగ్గర ప్రకాశవంతమైన వెలుతురు తోచింది. "ఓహో! ఆ పిల్ల దివిటీతో వచ్చేసింది; నిన్ను చూసేస్తుంది! పో! పో! దూరంగా వెళ్ళి స్తంభం వెనక మరుగ్గా నిలబడు!" అన్నాడు.

శాంభవన్ అలాగే వెళ్ళి దాక్కొన్నాడు. మరుక్షణం చేత దివిటీతో దాది పిల్ల వచ్చి వాకిలి దగ్గర నిలిచింది.

"మాంత్రికా! మాంత్రికా! ఎక్కడ పోయావు?" అని పిలిచింది. "ఎక్కడికీ పోలేదు. నీకోసమే వేచివున్నాను" అంటూనే రవిదాసు ఆమెను సమీపించి దివిటీని ఆమె చేతినుంచి తీసుకొన్నాడు.

"అమ్మాయీ! బయట తలుపు తాళం వేసుకో. ఇంకొక గడియకల్లా తాళం చెవితో మళ్ళీ రా! తలుపు తట్టి చూడు. నేను బదులిస్తే తలుపు తెరు! ఎవరూ లేని సమయం చూసి తెరు!" అన్నాడు రవిదాసు.

"అలాగే మంత్రవాదీ! అయినా కూడ నిన్ను హెచ్చరిస్తున్నాను. చిన్న పళువేట్టరయ్యర్‌కి ఏదో సందేహం పుట్టింది. నీవు దొరికిపోతే నన్ను పట్టివ్వకు!" అని వేడుకొంది దాదిపిల్ల.

"అమ్మాయీ! అనవసరంగా దిగులుపడకు! నేను చెప్పానుగా? కాలాంతక గండనికే మూడిందని?"

"నన్నెందుకు మళ్ళీ వచ్చి తలుపు తెరవమంటున్నావు? నేలమాళిగనుంచి బయటికి వెళ్ళడానికి ఇంకొక దారి ఉండనే ఉంది కద?"

"ఆ దారి ఈరోజు నాకు ఉపయోగపడదు; నదిలో వెల్లువ గట్టు మీదుగా పొర్లుతూ పారుతూంది. నువ్వెళ్ళు! సరిగ్గా ఒక గడియ తర్వాత రా!"

దాదిపిల్ల బయటికి వెళ్ళి తలుపు వేసింది. ఆమె బయట తలుపుకు తాళం వేసిన అదే సమయాన రవిదాసు లోపల గొళ్ళెం పెట్టాడు. తర్వాత చేత దివిటీని ఎత్తి పట్టుకొని సోమన్ శాంభవన్ ఉన్నచోటికి వేగంగా వచ్చాడు.

"శాంభవా! నన్నేదో అడగాలన్నావు కద? ఇప్పుడడుగు!" అన్నాడు.

"నీవింతకు మునుపు ఇక్కడికి వచ్చావా?" అని అడిగాడు శాంభవన్.

"ఒక్కసారేమి? చాలసార్లు వచ్చాను. మనం కూడబెట్టిన ధనమంతా ఇంకెక్కడినుంచి వచ్చిందనుకొన్నావు?" అన్నాడు రవిదాసు.

"నేనందుగురించి అడగలేదు. నీవు కాసేపటి క్రితం నన్నిక్కడ వదిలిపెట్టి వెళ్ళావు కద? మళ్ళీ..."

"ఇప్పుడు వచ్చేశాను కద?"

"మధ్య ఇంకొకసారి వచ్చావా?"

"మధ్య ఇంకొకసారి రాలేదు; ఎందుకని అడుగుతున్నావు?"

"నీవెళ్ళిన కాసేపటికల్లా వాకిట చటుక్కున వెలుతురు మరుగైంది. నేను స్తంభానికి గుద్దుకొన్నాను."

"ఒకవేళ తలుపు తనకు తానే మూసుకొని తెరుచుకొని ఉండవచ్చు."

"ఏదో ఒక ఆకారం లోపలికొచ్చినట్లు తోచింది; కాలిచప్పుడు కూడ బాగ వినిపించింది."

"నీ చిత్తభ్రమే అదంతా. ఈ నేలమాళిగే అలాంటిది. చీకటిలో నీడలాగ కనిపిస్తుంది. ఉన్నట్లుండి వెలుతురు కనిపించి మాయమౌతుంది. విచిత్రమైన శబ్దాలు వినిపిస్తాయి. ఇక్కడ దూరినవాళ్ళు కొందరు భయభ్రాంతులవల్లే చచ్చిపోయారు. వారి అస్తిపంజరాలు అక్కడక్కడా పడివున్నాయి. పళువేట్టరయ్యన్ కావాలనే ఆ ఎముకలగూళ్ళను తీసి పారేయకుండ అలాగే ఉంచాడు. ఎవరికీ తెలియకుండ ఈ నేలమాళిగలో ప్రవేశించినవాళ్ళు ఆ అస్తిపంజరాలను చూసి చావనీ అని."

"అలా ఎవరికీ తెలియకుండ ఈ నేలమాళిగలో ఎవరైనా ప్రవేశించగలరా, ఏమి?"

"సాధరణంగా ఎవరూ ప్రవేశించలేరు. నేను తప్ప ఇంకెవరూ అలా లోపలికి దూరివుంటారని తోచడం లేదు. నేను కూడ యువరాణి లేదా ఆమె చెలికత్తె సహాయంతోనే ఇక్కడికి రాగలిగాను..."

"మరి, మనుషుల ఎముకలగూళ్ళ గురించి చెప్పావు కద?"

"అదా? పళువేట్టరయ్యన్ ఎవరికైనా భయంకరమైన శిక్ష విధించదలిస్తే, నేలమాళిగ తలుపును మెత్తగా తీసి వదిలేస్తాడు. బొక్కసం నేలమాళిగ గురించి అప్పటికే విన్నవారు ధనాశతో లోపలికి దూరుతారు. తర్వాత ఇక్కడినుంచి బయటపడలేరు, పడరు."

"నీవొక్కడివి తప్ప దీని లోపల వచ్చినవాళ్ళెవరూ బయటపడలేదంటున్నావా?"

"మునుపల్లా అలాగే ఉండేది. కానీ ఇప్పుడు ఇద్దరి గురించి సందేహం కలుగుతూంది..."

"ఎవరి గురించి అంటున్నావని నాకు తెలుసు. వంతిదేవుడు, గందమారన్ గురించే కద?"

"అవును."

"వాళ్ళని మనమింకా ప్రాణాలతో వదిలిపెట్టాం కద?"

"నీకెన్నిసార్లు చెప్పాలి? వల్లవరయ్యన్ని ఒక ముఖ్యమైన కార్యంకోసమే యువరాణి వదిలిపెట్టింది. సుందరచోళుని వంశం నశించేటప్పుడు వల్లవరయ్యన్ కూడ ఛస్తాడు. దానికి సమయం దగ్గరపడుతూంది. రా! రా! ఈ నేలమాళిగలో ఉన్న సొరంగమార్గాలనన్నిటినీ నీకు చూపుతాను. ఒక కార్యంలో మాత్రం జాగ్రత్తగా ఉండు! ఇక్కడ నవరత్నమంటపం ఒకటుంది. అందులో చోళులు గత నూరేళ్ళుగా కూడబెట్టిన నవరత్నాలు కుప్పలు, కుప్పలుగా పడివున్నాయి. వాటిని చూసి వాటి మోహంలో పడ్డావో, ఇక్కడికి వచ్చిన కార్యాన్నే మరిచిపోగలవు!"

"రవిదాసా! ఎవరిని చూసి ఈ మాటంటున్నావు? నీలాగ నేను కూడ వీరపాండ్యుని తల లేని

మొండెం మీద చేయుంచి సత్యప్రమాణం చేసినవాడిని కద?"

"ఎవరు కాదన్నారు? ఆ నవరత్నాల కుప్పలను చూసినప్పుడు, నా మనసు కూడ కాస్త చలించింది; అందుకే హెచ్చరించాను. అది పోనీ. మనం పోదాం, రా. మొదట చోళుని అంతఃపురానికి వెళ్ళే సొరంగమార్గాన్ని చూపుతాను. దాన్ని చూపించేసి నేను వెళ్ళిన తర్వాత నీవే నిదానంగా ఈ నేలమాళిగంతా తిరిగి చూసి, తక్కిన రహస్యాలను తెలుసుకో. రాబోయే కాలంలో ఉపయోగపడవచ్చు." రవిదాసు దివిటీ పట్టుకొని ముందుకు నడిచాడు. సోమన్ శాంభవన్ అతడి పక్కనే నడిచి వెళ్ళాడు.

మునుపొకసారి పెద్దపళువేట్టరయ్యర్, నందిని వెళ్ళినదారినే వారిప్పుడు వెళ్ళారు. పొగచూరిన దివిటీ వెలుతురులో ఆ నేలమాళిగలోని స్తంభాలు, వాటి నీడలు నల్లటి పెద్ద భూతల్లాగ తోచాయి. చీకటిలో నివసించే గబ్బిలాలు పిల్లదెయ్యాల్లాగ కనిపించాయి. నేలమీదేమో విచిత్రమైన ఆకారాలుగొన్న కొన్ని జీవరాశులు అక్కడక్కడా తిరుగాడుతున్నాయి. వాటిలో కొన్ని అతివేగంగాను, కొన్ని అతిమెల్లగాను వెళుతున్నాయి. రవిదాసు చెప్పినట్లే, గుర్తు తెలియని పలువిధాలైన శబ్దాలు వినవచ్చాయి. బయట ఇంకా వీస్తున్న సుడిగాలి శబ్దం ఎలాగో ఎక్కడినుంచి ఆ నేలమాళిగ లోపల దూరి ప్రతిధ్వనిస్తూంది.

సోమన్ శాంభవన్ ఉన్నట్లుండి అదిరిపడి ఉన్నచోటే నిలబడి, "రవిదాసా! ఏదో అడుగుల చప్పుడులాగ వినిపించడం లేదా?" అన్నాడు.

"వినిపించకేం? మన కాలిచప్పుడే విన్పిస్తోంది. అనవసరంగా గాభరా పడకు! నేనిక్కడ ఉన్నప్పుడే నీవిలా భయపడుతుంటే, రెండుమూడు రోజులు ఇక్కడ ఎలా ఉంటావు?" అన్నాడు రవిదాసు.

"నేనేమీ భయపడలేదు; నీవు వెళ్ళిపోయిన తర్వాత ఒట్టి భయభ్రాంతులకు లోనుకావడం కన్న, నీవున్నప్పుడే అడిగి తెలుసుకోవడం మంచిదని అనుకొంటున్నాను. ఈ నేలమాళిగ లోపల దూరినవాళ్ళు కొందరు ఇక్కడే చచ్చిపోయారన్నావు కద?" అన్నాడు సోమన్ శాంభవన్.

"అవును; వారి ఆత్మలు ఇక్కడే తిరుగాడుతుంటాయి. దానివల్లనేమి? దెయ్యాలే మనని చూసి భయపడి పారిపోతాయి కద? ఆ పిల్లాడు వంతిదేవుడు ఈ నేలమాళిగనుంచి ఎలాగో తప్పించుకొని బయటపడ్డాడు. ఎన్నో దెయ్యాలు, పిశాచాలను చూసిన మనం ఎందుకు భయపడాలి?"

"దెయ్యాలు, పిశాచాలు అలా ఉండనీ. వాటికి మనం భయపడం. కానీ ఇతర ప్రాణులు - విష జంతువులు - ఉండవచ్చు కద?"

"పాములకు, తేళ్ళకు భయపడబోతున్నావా?మనని చూస్తేనే అవి భయపడి దాక్కొంటాయి..."

"అయినా కూడ, ఇక్కడే రెండుమూడు రోజులుండడమంటే, కాస్త ఆలోచించవలసివుంది, రవిదాసా! అంతకు మునుపే ఒకవేళ సందర్భం దొరికితే..."

"వద్దు, వద్దు! ఆ పొరబాటు మాత్రం చేయకు! నేడు మంగళవారం. బుధ, గురువారాలు నీవు తప్పక వేచివుండాలి. సుందర చోళుడు ఒంటరిగా ఉండే సమయమేదని గమనించి తెలుసుకో. సుందర

చోళుని పట్టమహిషి ఎప్పుడూ వాడి దగ్గరే ఉంటుంది. శుక్రవారం రాత్రి తప్పక దుర్గాపరమేశ్వరి ఆలయానికి వెళుతుంది. ఆ రోజు రాత్రే నీవు కూడ నీ కార్యాన్ని ముగించాలి. సుందర చోళుని కులం నిర్మూలమయ్యే రోజు శుక్రవారమే. ఏదైన అవకతవకలు జరిగితే కార్యం చెడిపోతుంది!" అన్నాడు రవిదాను.

ఇలా మాట్లాడుకొంటూనే ఇద్దరూ వేగంగా నడిచివెళ్ళారు. సోమన్ శాంభవన్ మాత్రం చుట్టుపక్కల పరికించి చూస్తూనే వెళ్ళాడు. అయినా కూడ వారికి తెలియకుండ స్తంభాలచాటునే దాక్కొని, ఏమాత్రం సద్దు చేయకుండ వారిని వెంబడించి వస్తున్న మూగరాణి వారి కంట పడలేదు. నేలమాళిగ సొరంగమార్గం ఒక చివరినుంచి ఇంకొక చివరికి వచ్చి చేరారు.వారికెదురుగా ఒక పెద్ద గోడ నిలిచింది. దానిలో ఎక్కడా వాకిలే ఉన్నట్లు అగుపించలేదు. కానీ గోడ పైనున్న ఒక గవాక్షం గుండా కాస్త వెలుతురు వస్తూంది.

రవిదాసు దివిటీని సోమన్ శాంభవన్‌కిచ్చి, ఆ నిటారైన గోడలో అక్కడక్కడా పొడుచుకొచ్చిన కొన్ని కొయ్యముక్కలు, రాళ్ళను పట్టుకొని పైకెక్కాడు.గవాక్షం గుండా కాసేపు నిశితంగా చూసేసి, గబగబా కిందికి దిగాడు.

"ఆ గవాక్షంగుండా బయటికి దూకాలా? అదేనా దారి?" అని అడిగాడు సోమన్ శాంభవన్.

"కాదు, కాదు. దాని గుండా ఎలుక మాత్రమే దూరి వెళ్ళగలదు. కానీ దాని గుండా చూస్తే చోళుని అంతఃపురం కనిపిస్తుంది. ఆ అంతఃపురంలోను అతిముఖ్యమైన చోటు కనిపిస్తుంది" అన్నాడు రవిదాసు.

"సుందర చోళుడు పడుకొనే చోటా?"

"అవును. అక్కడ జనసంచారం ఎలా ఉందని నీవు ఈ గవాక్షం గుండా చూసి తెలుసుకోవచ్చు. ఇప్పుడు నాతో రా! నేను చేసేది బాగ చూసుకో!"

ఇలా చెప్పి రవిదాసు కిందికి వంగాడు. పరీక్షగా చూసి, వర్తులాకారంగా ఉన్న ఒక రాతిని తొక్కి పట్టుకొని, రెండు చేతులతోను చతురస్రాకారంలో ఉన్న ఒక రాతిని తోశాడు. కింద ఒక దారి కనిపించింది.

"భగవాన్! నేలమాళిగ లోపల ఇంకొక పాతాళమార్గమా?" అని ఆశ్చర్యపోయాడు సోమన్ శాంభవన్.

"అవును; ఇక్కడ ఈ రహస్యమార్గమున్న విషయం పెద్ద పళువేట్టరయ్యన్‌కి, యువరాణికి తప్ప ఇంకెవరికీ తెలియదు. మూడోదిగా నాకు తెలుసు. ఇప్పుడు నీకూ తెలుసు! దారిని తెరవడం ఎలా అని తెలుసుకొన్నావు కద?"

ఇద్దరూ ఆ రహస్యమార్గంలో దిగి వెళ్ళారు. దివిటీ వెలుతురు కాసేపటికల్లా మరుగైంది. మూగరాణి తాను దాక్కొని ఉన్న చోటునుంచి ఒక్క దూకున అక్కడికి వచ్చింది. తెరిచివున్న దారిని గుచ్చి చూసింది. అందుకో దిగేందుకు ఒక అడుగు పెట్టింది. తర్వాత పునరాలోచన చేసి చటుక్కున కాలు వెనక్కి

తీసేసుకొంది.

కాసేపాలోచించి, ఇంతకు మునుపు రవిదాసు ఎక్కిన గోడవైపు చూసింది. ఒక్కదూకున అక్కడికి వెళ్ళి రవిదాసులాగే ఆ గోడనెక్కింది. గవాక్షాన్ని చేరగానే, అందులో కూర్చొని దాని గుండా చూసింది. గోడ పక్కనే అందమైన తోట, దానికవతల అంతఃపురం మేడ కనిపించాయి. ఆ మాళిగను చూడగానే అమె ఒళ్ళు పులకరించింది. అందులో తన ప్రాణానికి ప్రాణమైనవారున్నారని ఆమె అంతర్వాణి చెప్పింది. రహస్యమార్గం గుండా వెళ్ళినవాళ్ళు తనకు ప్రియమైనవారు, ఆత్మీయులైనవారికి హాని చేసే ఉద్దేశం కలవారని కూడ గ్రహించింది. వారి దురుద్దేశాన్ని అడ్డుకొనే శక్తిని తనకు ప్రసాదించమని తన అంతరాత్మలోవున్న దైవాన్ని ప్రార్థించింది.

కిందకు దిగుదామా అని ఆమె అనుకొన్నప్పుడు కాస్త దూరాన ఉన్న మేడ పైభాగాన ఒక విచిత్రమైన దృశ్యం కనిపించింది. కాసేపటి క్రితం ఆ నేలమాళిగలోవున్న రవిదాసు, సోమన్ శాంభవన్ ఇప్పుడు ఆ మేడపైకెక్కి స్తంభాల వెనక దాక్కొన్నారు. అంతఃపురం లోపలికి గుచ్చి గుచ్చి చూశారు. అప్పుడు పగటిపూట కాబట్టి మేడ పైభాగం బాగ కనిపించింది. రవిదాసు చేతిలో దివిటీ లేదు. శాంభవన్ చేత శూలం మాత్రం ఉంది. రవిదాసు ఆ శూలాన్ని తీసుకొని అంతఃపురం లోపలికి దాన్ని విసిరేందుకు గురి చూశాడు. మూగరాణి గుండె ఆ సమయాన ఆగిపోయినట్లనిపించింది. అదృష్టవశాత్తు రవిదాసు శూలాన్ని విసరలేదు. విసిరేటట్లు నటించి, తర్వాత దాన్ని సోమన్ శాంభవన్‌కి తిరిగి ఇచ్చేశాడు. మరుక్షణం వారిద్దరూ అక్కడినుంచి మాయమైనారు.

మూగరాణి కూడ గవాక్షంనుంచి గోడమీదుగా కిందికి దిగింది. సొరంగమార్గం కనిపించిన చోటునే చూస్తూ మరుగ్గా నిలబడింది. ఇంకాసేపటికల్లా ఆ మార్గాన దివిటీ వెలుతురు అగుపించింది. ఇద్దరూ బయటికొచ్చి సొరంగమార్గాన్ని మూశారు.

“దాన్ని తెరిచే పద్ధతిని బాగ తెలుసుకొన్నావు కద?” అని అడిగాడు రవిదాసు.

“తెలుసుకొన్నాను. ఇక నీకు దిగులవసరం లేదు. ఒప్పుకొన్న కార్యాన్ని తప్పక చేసి ముగిస్తాను! సుందరచోళుని జీవితం శుక్రవారంతో ముగుస్తుంది! ఇలాగే మీరు కూడ మీ కార్యాలను చేయండి!” అన్నాడు సోమన్ శాంభవన్.

“యువరాణి కరికాలన్ని చూసుకొంటుంది. దాని గురించి దిగుల్లేదు. ఆ పిల్లపులి కడలినుంచి తప్పించుకొని వచ్చి నాగపట్టణంలో దాక్కొనివున్నట్లు తోస్తూంది. కానీ ఈసారి వాడు తప్పించుకోలేడు. వాడిని కాపాడుతూ వచ్చిన ఇద్దరు ఆడదెయ్యాలూ ఇప్పుడు తంజావూరులోనే ఉన్నాయి. పడవ నడిపే పిల్లని, మూగదాన్ని గుంపులో చూశాను. ఆ వీరవైష్ణవద్రోహి కూడ ఇక్కడే ఉన్నాడు. కాబట్టి చిన్నపులి కూడ ఇక తప్పించుకోలేడు. నాగపట్టణానికి క్రమవిత్తుని పంపించాను. సుందర చోళుని కులం ఈ శుక్రవారంతో నశిస్తుంది...”

“తర్వాత మధురాంతకుడు ఉంటాడు కద?”

“వాడుంటే ఉండనీ. అలాంటి దద్దమ్మ ఇంకొన్నాళ్ళు చోళసింహాసనం మీద ఉంటే మనకే మంచిది. పాండ్యచక్రవర్తికి కూడ యుక్తవయసు రావాలి కద?”

ఇలా మాట్లాడుకొంటూనే రవిదాసు, సోమన్ శాంభవన్ వచ్చిన దారినే వేగంగా తిరిగి వెళ్ళారు.

~~~
~~~

# అధ్యాయము - 29

## రాజదర్శనం

**వారు** మరుగైన తర్వాత మూగరాణి సొరంగమార్గం తెరుచుకొన్న చోటికి వచ్చింది. గుచ్చి గుచ్చి చూసి సొరంగమార్గాన్ని తెరవడానికి ప్రయత్నించింది; సాధ్యం కాలేదు. రవిదాసు దాన్ని తెరిచేటప్పుడు ఆమె దూరాన మరుగ్గా నిలబడింది కాబట్టి అతడు దాన్ని ఎలా తెరిచాడో చూడలేకపోయింది. ఇద్దరిలో ఒక్కడైనా మళ్ళీ అక్కడికి వస్తాడని ఆమెకు బలంగా తోచింది. కాబట్టి అలాగే వేచివుండాలని తీర్మానించుకొంది.

ఆమె ఎదురుచూసింది వృధాకాలేదు. రవిదాసును బయటికి పంపించేసి సోమన్ శాంభవన్ అక్కడికి తిరిగి వచ్చాడు. వాడి చేత దివిటీ ఉంది. కానీ అది మునుపటికన్న మసగ్గా వెలుగుతూంది. రవిదాసు ముందు వాడు చాల ధైర్యంగానే మాట్లాడాడు. కానీ వాడి మనసులో భీతి పోలేదన్నది వాడు అటూ ఇటూ కంగారుగా చూస్తూ రావడంనుంచే తెలుస్తూంది.

వాడు సొరంగమార్గం తెరుచుకొన్న చోటికి వచ్చి భయపడుతూ కూర్చొన్నాడు. కాసేపటికల్లా దివిటీ ఆరిపోయింది. తర్వాత వాడు గోడ పైనున్న గవాక్షాన్నే తరచూ తలెత్తి చూడసాగాడు. దానిగుండా లోపలికొస్తున్న వెలుతురు క్రమేణా సన్నగిల్లిపోసాగింది. వెలుతురు బాగ తగ్గి సూర్యుడు అస్తమించాడని తెలిసిన తర్వాత వాడు సొరంగమార్గాన్ని మళ్ళీ తెరవసాగాడు. మందాకిని ఇప్పుడు దాని సమీపానికొచ్చి నిలబడింది. మార్గం తెరుచుకొంది; సోమన్ శాంభవన్ దానిలోకి దిగబోయాడు.

అప్పుడు ఆ నేలమాళిగలో వాడికి అతిసమీపాన 'కీచు'మన్న ఒక సుదీర్ఘమైన కేక వినిపించింది. సోమన్ శాంభవన్ తన జీవితకాలంలో ఎన్నో భయంకరాలను చూసినవాడే. కానీ అలాంటి ఒక అమానుషమైన శబ్దాన్ని వాడు ఇప్పటిదాక వినలేదు. దెయ్యమనేది ఒకటుండి, దానికే గొంతువుంటే, అది ఇలాగే ఉండాలి అనిపించింది వాడికి. మొదటిసారి ఆ గొంతు వినిపించినప్పుడు శాంభవన్ బెదిరి ఆగాడు; దాని ప్రతిధ్వని ఆగేవరకు వేచివున్నాడు. రెండవసారి ఆ కేక వినిపించగానే వాడి ఒంటిమీదున్న వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకొన్నాయి. మూడోసారి ఇంకా దగ్గరగా వినిపించగానే వాడి ధైర్యం పూర్తిగా సడలిపోయింది. ఆ చీకటి కమ్ముకొన్న నేలమాళిగలో దారితెన్నులు చూసుకోక అడ్డదిడ్డంగా పరుగెత్తనారంభించాడు.

వాడు మరుగైపోగానే మూగరాణి సొరంగమార్గంలోకి దిగింది. కొన్ని మెట్లు దిగిన తర్వాత సమతలమైన నేల తగిలింది. ఆ దారి వెంబడి చరచరా నడిచి వెళ్ళింది. సోమన్ శాంభవన్ ఆమె దిగడం చూసి, తిరిగివచ్చినా ఆమెను పట్టుకోలేకపోయేవాడు. అంత వేగంగా వెళ్ళిందామె.

నరకానికి వెళ్ళే అంతులేని చీకటిమార్గంలాగ తోచిందా మార్గం. కానీ దానికి కూడ ఒక అంతుంది. నిటారైన గోడ దగ్గర ఆ మార్గం ముగిసిన చోట గోడపైన కాస్త వెలుతురు కనిపించింది. కొన్ని మెట్లు కూడ కనిపించాయి. వాటిమీదుగా ఎక్కి వెళ్ళినప్పుడు తలకు ఉన్నట్లుండి చూరు గుద్దింది. పాతాళమార్గం మెట్లకు, పైన తల కొట్టుకొన్న చోటికి మధ్య చిన్న చిన్న గవాక్షాలు కనిపించాయి. వాటిలో ఒకదాని లోపల దూరి బయటికొచ్చింది మూగరాణి. చుట్టూ పెద్ద పెద్ద భూతాకారాలు కనిపించాయి. లంకాద్వీపంలో బ్రహ్మాండమైన శిల్పాకారాలను చూసివున్నందువల్ల ఇవేమంత ఆశ్చర్యాన్ని కలిగించలేదామెకు. తాను బయటపడ్డ మార్గం ఎక్కడ ముగుస్తోందన్నది బాగ చూసుకొంది.

పది తలల రావణుడు తన ఇరవై చేతులతో కైలాసగిరిని పెకలించి లేపుతున్నాడు. కొండపైన శివుడు, పార్వతి కొలుగుదీరివున్నారు. రావణుడు కొండనెత్తిన చోట కింద పల్లంగా ఉంది. పైకెత్తిన కొండను వాడి ఇరవైచేతులు మోస్తున్నాయి. వాటిలో రెండు చేతులకు మధ్యనున్న సందు/తెంపు గుండా తాను బయటికొచ్చానని చూసి తెలుసుకొంది. కైలాసగిరి కింద అలాంటి సొరంగమార్గమొకటుందని మామూలుగా చూసేవారికెవ్వరికీ తెలియనే తెలియదు. సరైన సమయాన దాక్కోవడానికి కూడ అది తగిన చోటే.

కాసేపు ఆ శిల్పసొరంగమార్గపు విచిత్రాన్ని చూస్తూండిపోయి, తర్వాత మందాకిని ఆ శిల్పమంటపాన్ని చుట్టు తిరిగి వచ్చింది. వెలుతురు మసగ్గా ఉన్నా కూడ, రాత్రివేళలో కూడ చక్కగా చూడగల నిశితమైన కంటిచూపుగల మందాకినికి అంతా స్పష్టంగానే అగుపించింది. ఒకచోట చోళకుల పూర్వీకులలో ఒకడైన శిబిచక్రవర్తి ఒక పావురాన్ని కాపాడేందుకు తన శరీరాన్నే కోసి ఇస్తున్న దృశ్యం శిల్పరూపంలో చెక్కబడివుంది. శిబి చక్రవర్తి కులంలో పుట్టినందువల్లనే కద చోళులకు 'శెంబియన్' అన్న బిరుదు వచ్చింది? ఆ శిల్పాన్ని పరీక్షగా చూసిన తర్వాత మూగరాణి ముందుకు సాగింది.

బ్రహ్మాండమైన శివపరమాత్మ శిరస్సునుంచి గంగ దూకుతున్న దృశ్యం ఒకచోట శిల్పరూపంలో చెక్కబడివుంది. సమీపాన భగీరథుడు చేతులు జోడించి నిలబడివున్నాడు. కింద పడ్డ భాగీరథి నది ఒక బ్రహ్మాండమైన ఋషి నోటిగుండా దూరి చెవి గుండా బయటికి వస్తూంది. అలా బయటికి పారిన గంగానదిలో ఒక చిన్న ముని తన కమండలాన్ని ముంచి నీళ్ళు నింపుకొంటున్నాడు. ఆయనే అగస్త్యమహాముని అయివుండాలి. ఆ కమండలం నీటిని ఆయన ఒక చిన్న కొండ మీద వంపారు. కమండలంనుంచి దూకిన ఆ నది రాను రాను పెరగసాగింది. ఈ శిల్పగంగలోను, కావేరిలోను వాటిని అమర్చినప్పుడు నీరు పొంగేందుకు ఏర్పాట్లు చేసివుండాలి, కానీ ఇప్పుడు ఆ శిల్పగంగలో నీళ్ళు లేదు. కావేరినది సుదీర్ఘంగా కొండలు, గుట్టల మీదుగాను, అడవుల వెంబడి పారుతూ వెళ్ళింది. ఆ నది రెండు గట్ల వెంబడి అనేక శివాలయాలున్నాయి. చివరిగా ఆ నది సముద్రంలో కలిసే చోట శిల్పమంటపం ప్రాకారపుగోడ కనిపించింది.

ఏదో సందేహమొచ్చి మూగరాణి ఆ గోడ మీద చేయి పెట్టి ఒత్తింది. ఒక చిన్న తలుపు తెరుచుకొంది. దాని గుండా బయటికి చూస్తే అంతఃపురం తోట. దానికవతల అతిసమీపానే అంతఃపురపు

ఎత్తైన మేడలు కనిపించాయి. చుట్టుపక్కల చూసింది; సాయంసంధ్యాకాలపు మసక వెలుతురులో తోటలో ఎవరూ లేరని తెలిసింది.

పళువేట్టరయ్యర్ తోటలో విరిగిపడివున్నట్లే ఇక్కడ కూడ చాల చెట్లు విరిగిపడివున్నాయి. కాబట్టి తోటలో ఎవరైనా ఉన్నా కూడ ఆమె శిల్పమంటపంనుంచి బయటికి రావడాన్ని చూడలేరు. ఇంకా బాగ చీకటి పడనీ అని శిల్పమంటపం పక్కనే ఒదిగి నిలబడింది. ఒకవేళ చేత శూలం పట్టుకొన్న ఆ యమకింకరుడు వచ్చినా రావచ్చు. కాబట్టి శిల్పమంటపంలోకి కూడ అప్పుడప్పుడూ తొంగి చూడసాగింది.

అంతఃపురం దీపాలు ఒక్కొక్కటిగా వెలగసాగాయి. కాసేపటికల్లా అంతఃపురం ప్రకాశవంతమైంది. కింది గదుల్లో వెలిగించబడ్డ దీపాలు కిటికీలు, గవాక్షాల గుండా కాంతులీనుతున్నాయి. పైమేడల్లో వెలిగించిన దీపాలు ఆకాశంలోని నక్షత్రాలతో పోటీపడుతూ ప్రకాశిస్తున్నాయి.

"అయ్యో! పగటికన్న రాత్రే ఎక్కువ అపాయకరంగా తోస్తూందే!" అనుకొన్నది మూగరాణి.

అంతఃపురాన్ని నలువైపులా బాగ పరీక్షగా చూసింది. శిల్పమంటపానికి సమీపంగా ఉన్న అంతఃపురభాగంలో మాత్రం దీపాలంతగా లేవని చూసి తెలుసుకొంది. కావేరి వెల్లువనుంచి తాను ఎత్తి కాపాడిన తన ప్రాణానికి ప్రాణమైన ముద్దులబిడ్డను లంకలో చంపజూసిన ఆ పాతకుడు, వాడి స్నేహితుడు అంతఃపురంలో ఈ భాగంలోనే పైమేడకెక్కి నిలబడ్డారు. రవిదాసు ఇంకొకడినుంచి శూలాన్ని తీసుకొని ఎవరిమీదో విసిరేటట్లు గురి చూసింది కూడ ఈ చోటినుంచే. మంచివేళగా ఈ భాగాన దీపాలంతగా లేవు. అందుకు కారణం ఏమైవుండవచ్చు? ... సరే; అది కూడ త్వరలోనే తెలిసిపోతుంది.

బాగ అస్తమించి అంతఃపురపు తోటలో చీకటి పూర్తిగా కమ్ముకొన్న తర్వాత మందాకిని శిల్పమంటపం వాకిలినుంచి బెదిరిన జింకలాగ అతివేగంగా దూకి వెళ్ళి అంతఃపురాన్ని చేరింది. అంతఃపురపు ఆ వెనుక భాగాన వర్తులాకారంలో ఉన్న వరాండాలు, వాటిలో వరుసగా స్తంభాలు, పలుచోట్ల పైమేడకు వెళ్ళే మెట్లు అగుపించాయి. వరాండాలలో పెద్ద పెద్ద విందుభోజనాలకు వంట చేసేందుకు బ్రహ్మాండమైన రాగి పాత్రలు, పాతబడిపోయిన దంతపు పల్లకీలు, విరిగిపోయిన సింహాసనాలు మొదలైన పలు వస్తువులు కనిపించాయి. వాటిమధ్య కాసేపు తిరిగి వచ్చిన తర్వాత ఒక మెట్టుమీదికి దూకింది మందాకిని.  కిందవున్నట్లే పైన కూడ వర్తులాకార వరాండాలు, వాటి చూరును మోస్తున్న చిత్రవిచిత్రమైన స్తంభాలు, కిటికీలు, వెన్నెల డాబాలు, ఆ డాబాల్లో పాలరాతి మేడలు కనిపించాయి. మనుష్యసంచారం కనిపించని ఆ పైమేడ భాగాల్లో మందాకిని చుట్టూ తిరిగి తిరిగి వచ్చింది. డాబాల లోపలి మూలలకు వెళ్ళడానికి ఆమె చాల జంకింది. ఒకచోట లోపలి భాగాన కిందనున్న దీపాలనుంచి వెలుతురు రావడాన్ని గమనించి అక్కడికి వెళ్ళి స్తంభం చాటునుంచి తొంగి చూసింది. ఆహా! ఆమె ఏం చూసింది? చూసిన కళ్ళను తిప్పుకోలేని దృశ్యాన్ని చూసింది.

ఒక విశాలమైన మంటపం మధ్యలో ఒక అందమైన పట్టెమంచంమీద ఒకరు ఆనుకొన్నట్లు

పడుకొనివున్నారు. వారి చుట్టూ నలుగురు స్త్రీలు, ఇద్దరు పురుషులు నిలబడివున్నారప్పుడు. పడుకొన్నవారి పట్ల వారు భయభక్తులుగొన్నారని వారి తీరే చెబుతూంది. కాస్త దూరాన మరింత గౌరవమర్యాదలతో ఇద్దరు దాదులు నిలబడివున్నారు.

ఆ మంటపంలో ఒకేఒక దీపం మాత్రమే వెలుగుతూంది. అది కూడ మంచం దగ్గరున్న ఒక దీపస్తంభం మీద అమర్చబడి, మసక మసక వెలుతురునిస్తూంది. మందాకిని మొదట చుట్టూ నిలుచొన్నవారిని చూసింది. వారిలో ఒకతె తన ప్రాణానికి ప్రాణమైన సహోదరుని కూతురైన పూంగుళలి అని గ్రహించింది. తక్కినవారిని కూడ ఆమె మునుపు కొన్నిసార్లు మరుగైన చోట్ల నిలబడి చూసినట్లుంది. కానీ వారందరూ ఎవరెవరని స్పష్టంగా తెలియదు.

చుట్టూ నిలబడివున్నవారిని చూసిన తర్వాత అతిసంకోచంతో మంచాన పడుకొన్నవారిని చూసింది మందాకిని. ఆమె మనసు ఒక క్షణం స్తంభించిపోయింది.

అవును, ఆయనే! ఎన్నో యుగాలనిపించే చాల కాలం క్రితం, తాను చిన్నపిల్లగా అడవిలో ఆడుతూ పాడుతూ ఉన్నప్పుడు, ఒకచోటికి వచ్చి దాక్కొని, తన మనసును దోచుకొన్న వ్యక్తి ఆయనే. తాను వసించిన భూతదీవిని కొంతకాలంపాటు స్వర్గలోకంగా మార్చేసిన ఆయనే. పెద్ద ఓడలో గుంపుగా వచ్చిన మనుషులు పిలుచుకొని వెళ్ళింది కూడ ఆయన్నే! ఆహా! ఆయన ఇప్పుడు ఎంత మారిపోయారు!

పూర్వజన్మ అని చెప్పదగ్గ ఆ రోజుల తర్వాత కూడ మందాకిని ఆయన్ని కొన్నిసార్లు ఆయనకు తెలియకుండ చూసివుంది. కావేరినదిలో ఉల్లాసంగా కుటుంబసమేతంగా పడవలో వెళుతుండగా ఒడ్డునున్న దట్టమైన పొదల మాటున నిలబడి చూసింది కొన్నిసార్లు. నగరవీధుల్లో తెల్లటిగుర్రాలు పూన్చిన రథమెక్కి ఊరేగింపు వెళుతున్నప్పుడు గుంపులో గుంపుగా నిలబడి చూసింది. కానీ చివరిగా ఆయన్ని చూసి చాలకాలమైంది. ఆ కాలవ్యవధిలోనే ఆయనిలా మారిపోయారు. ముఖాన గడ్డం, మీసాలు పెరిగాయి. కళ్ళు లోతుకు పోయాయి. ఆహా! ఆ కళ్ళనుంచి ఒకప్పుడు వీచిన అయస్కాంతశక్తి ఇప్పుడు ఏమైంది? దైవమా! మనుషులు ఇంతగా మారిపోతారా? మందాకిని లంకాద్వీపంలో చలిజ్వరం సోకినవారిని, ఆ జ్వరం చాలరోజులు పీడించిన తర్వాత చూసినదుంది.

ఆహా! ఒకప్పుడు స్వర్ణసూర్యునిలాగ ప్రకాశించిన ఆయన ముఖం ఇప్పుడు ఎంతగా మారిపోయి కళావిహీనంగా ఉంది కద! ఒకవేళ ఈయన అంతిమకాలం దగ్గరపడిందో, ఏమో! ఉన్నట్లుండి మందాకినికి ఆ రోజు సాయంత్రం తాను చూసిన భయంకర దృశ్యం గుర్తుకొచ్చింది. అప్పుడామె నిలబడ్డ చోటే రవిదాసు అనబడే ఆ హంతకుడు, వాడి తోటి హంతకుడు నించొన్నారా సాయంత్రం. అక్కడినుంచే శూలం విసిరేందుకు గురి చూశారు. ఒకవేళ మంచాన పడుకొన్నవారి మీద విసిరేందుకే గురిచూశారా? ఈ ఆలోచన రాగానే మందాకిని ఒళ్ళంతా గడగడ వణికింది. కళ్ళు తిరిగాయి; మైకం కమ్ముకొస్తున్నట్లనిపించింది. స్తంభాన్ని పట్టుకొని కాళ్ళను గట్టిగా ఊని సంభాళించుకొంది.

# అధ్యాయము - 30

## నిందారోపణ

**సుందర** చోళ చక్రవర్తి మనసు, దేహం కూడ కొన్నిరోజులుగా చాల కుంగిపోయివున్నాయి. సుడిగాలి వీచిన రాత్రి ఆయన నిద్రపోనేలేదని యువరాకుమారి ముఖ్యమంత్రికి చెప్పింది అతిశయోక్తి కాదు. ఆరోజు పగలంతా ఆయన మనసు చాల కలవరపడుతూంది. మధ్యాహ్నానికి ముందు చిన్న పళువేట్టరయ్యర్ వచ్చి ఆయన గాభరాను అధికం చేసేశారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి అనిరుద్ధుల మీద ఆయన చాల నిందలు ఆరోపించారు. ఆయన తంజావూరుకు వచ్చినప్పటినుంచి కోట లోపలికి రావడానికి విధించిన కట్టుబాట్లన్నీ విరిగిపోయాయని చెప్పారు. ముఖ్యమంత్రిని చూడబోతున్నామనే నెపంతో దారిన పోయేవాళ్ళందరూ కోట లోపల దూరుతున్నారని, ఇందువల్ల చక్రవర్తి రక్షణకే ఆపాయం కలగవచ్చని సూచించారు. ఆ రెండు నిందలను విన్న చక్రవర్తి తమలో తామే నవ్వుకొన్నారు. వాటిని ఆయన అంతగా లెక్కచేయలేదు.

కానీ, కోట దళపతి మోపిన తక్కిన నిందలను అంత సులభంగా తీసివేయలేకపోయారు / నిర్లక్ష్యం చేయలేకపోయారు. ఆ రోజు లోపలికొచ్చిన జనాలకు, వేళక్కార దండు సైనికులకు మధ్య వీధిలో వివాదం ముదిరి, అపాయకర పరిస్థితికి చేరుకొందని, మంచివేళగా తాము అప్పుడక్కడికి వెళ్ళడం జరిగినందువల్ల, అది విపరీత పరిణామాలకు దారి తీయలేదని, తాము దాన్ని అడ్డుకొని ఇరు పక్షాలను సమాధానపరిచి పంపించామని చెప్పారు. ముఖ్యమంత్రిగారి నీతినియమాలు జగత్ప్రసిద్ధమై ఉండగా, ఆయన నడవడిక అందుకు వ్యతిరేకంగా ఉందని, కోడిక్కరైనుంచి ఎవరో ఒక స్త్రీని ఆయన బలవంతంగా పట్టి తీసుకొచ్చారని, పళువూర్ అంతఃపురపు పల్లకిని, మనుషులను ఈ కార్యానికి ఉపయోగించుకొన్నారని, ఎందుకని తెలియక తాము మనుషులను, పల్లకిని పంపించారని, ఏదైన అపకీర్తి వస్తే అది పళువూర్ కుటుంబం తల మీద పడుతుందని చెప్పారు.

చివరిగా, ఇంకొక సందేహాస్పదమైన సంభవాన్ని వివరించారు. "పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురానికి ఎవరో ఒక మాంత్రికుడు తరచూ వచ్చి వెళుతుండడం గురించి నేను చాల విచారంగొనివున్నాను. వాడు యువరాణిని చూసేందుకు వస్తున్నట్లు చెప్పినందువల్ల నేనే చర్య తీసుకోలేదు. అయినా కూడ, ఆ అంతఃపురం మీద ఒక కన్నేసి ఉంచమని ఒక గూఢచారికి చెప్పాను. ఈ రోజు ఎవరో ఒకడు పళువూర్ అంతఃపురపు తోట వెనుక గోడ దూకడాన్ని చూశానని గూడచారి చెప్పాడు. వెంటనే వాడిని పట్టి తెమ్మని కొందరు మనుషులను పంపాను. వాడు అంతఃపురం తోటలో ఉండగానే నావాళ్ళు పట్టి తీసుకొచ్చారు. ఎవరని చూస్తే, ముఖ్యమంత్రి ప్రియశిష్యుడైన ఆళ్వార్ కట్టియానే అని

తెలిసింది.

'ఎందుకని గోడెక్కి దూకావు?' అని అడిగినందుకు వాడు ఉత్తరం ఇవ్వ నిరాకరించాడు. 'ముఖ్యమంత్రి ఆజ్ఞ' అన్నాడు. చక్రవర్తీ! ముఖ్యమంత్రి ఇలాగ చేస్తూంటే, తంజావూరు కోట రక్షణకు నేనెలా బాధ్యత తీసుకోగలను? నా అన్నగారు కూడ ఊళ్ళో లేకుండడం వల్ల ఇదంతా మీ చెవిన వేయవలసి వచ్చింది!"

ఇలా చిన్న పళువేట్టరయ్యర్ మొరపెట్టుకోవడం చక్రవర్తి మనసును మరింత కల్లోలపరిచింది. "అలాగే. ఈ రోజు సాయంత్రం అనిరుద్ధులు ఇక్కడికే వస్తున్నారు. ఇందు గురించి అంతా విచారిస్తాను. ముఖ్యంగా, కోడిక్కరైనుంచి ఒక స్త్రీని బలవంతంగా పట్టి తీసుకొని వచ్చిన విషయం నా మనసును చాల బాధపెడుతూంది. అది నిజమే కద? దళపతీ! ఏమాత్రం సందేహం లేదు కద?" అని అడిగారు.

"సందేహమే లేదు! పల్లకీ బోయీలతో వచ్చిన వీరులు నిన్న నడిరాత్రి వచ్చి నాకు చెప్పారు. తంజావూరు కోటను సమీపిస్తున్నప్పుడు సుడిగాలిలో చిక్కుకొన్నారట. బాట పక్కనుక్క ఒక చెట్టు పెకలించుకొని కింద పడి కొందరికి అపాయమేర్పడిందట. పల్లకి మీద అది పడకపోవడం చాల అదృష్టమని చెప్పారు. మంచివేళగా స్త్రీహత్యాదోషం కలగలేదు! ఇందు గురించి విచారించడంతోబాటు ఆళ్వార్ కట్టియాన్ పనులను కూడ చక్రవర్తి పూర్తిగా విచారించాలి!" అని చెప్పేసి, కోట దళపతి చక్రవర్తి వద్ద సెలవు తీసుకొన్నారు.

అనిరుద్ధులు వచ్చేసమయాన చిన్న పళువేట్టరయ్యర్ అక్కడ ఉండేందుకు ఇష్టపడలేదు. ముఖ్యమంత్రి తమని ఏపైన సంబంధంలేని ప్రశ్నలడిగి ఇరికించేయవచ్చన్న భయం ఆయనకు కలిగింది. ముఖ్యంగా, సుడిగాలి వల్ల కష్టనష్టాలకు లోనైన ప్రజలకు సహాయం చేసేందుకు బొక్కసాన్ని తెరిచేందుకు చక్రవర్తి వద్దనుంచి ఉత్తర్వు అడిగి తీసేసుకొంటే, చాల ఇబ్బందయిపోతుంది. రేపు అన్నగారి ముందు మొహమెలా చూపించడం?

అనిరుద్ధుల రాకను ఆ రోజు ఉదయంనుంచే చక్రవర్తి ఎదురు చూస్తున్నారు. కానీ సూర్యుడస్తమించే సమయాన ముఖ్యమంత్రి వచ్చారు. ఆయన గట్టి మనసు కూడ ఇప్పుడు కాస్త కలతబారివుంది. ఆయన ఎంతో దిట్టంగా వేసిన పథకం ఇప్పుడు వమ్మయిపోయింది. మందాకిని గురించి ఏదైన సమాచారం దొరుకుతుంది, తర్వాత చక్రవర్తిని వెళ్ళి చూద్దాం అని ఎంచి ఆయన అంతఃపురానికి వెళ్ళడాన్ని దాటవేస్తూ వచ్చారు. మధ్యాహ్నం ఆళ్వార్ కట్టియాన్ వచ్చి చాల ధర్మసంకటమైన సమాచారాన్ని అందజేశాడు. మూగరాణి వెళ్ళివుండవచ్చని తాను ఊహించిన ఇరుకైన సందుల్లోనే వెళ్ళిందని, ఒక స్త్రీ పళువేట్టరయ్యర్ తోట ప్రాకారం గోడెక్కి దూకినట్లు తోచిందని, అది మూగరాణి కావచ్చని ఎంచి తాను కూడ ఆ గోడెక్కి దూకాడని, తోటలో వెతకనారంభించే లోపలే చిన్న పళువేట్టరయ్యర్ మనుషులు వచ్చి తనని పట్టుకొన్నారని చెప్పాడు. "వారి వద్ద నిజమైన కారణాన్ని చెప్పలేకపోయాను.

అయ్యా! అందుకే తమ పేరు చెప్పి విడిపించుకోవలసి వచ్చింది!" అన్నాడు.

ఈ వివరాలు ముఖ్యమంత్రికి చాల దిగులు కలిగించాయి. "ఈ తంజావూరులో ఇన్ని అంతఃపురాలున్నప్పుడు, పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురంలోనే ఆమె ఎందుకు ప్రవేశించాలి? బహిరంగంగా మనుషులను నియమించి వెతకలేము కద? కానీ చూద్దాం. పెద్ద పళువేట్టరయ్యర్ ఊళ్ళో లేకపోవడం ఒక విధంగా మంచిదైంది. అంతఃపురం చుట్టూ కాపలా వేయిద్దాం. ఆ అంతఃపురం లోపల కూడ నా మనిషొకడున్నాడు. వాడికి చెప్పి పంపుతాను! అయినా కూడ ఈ పడవ నడిపే పిల్ల మనని ఎంతటి ధర్మసంకటంలో ఇరికించేసింది?" అన్నారు ముఖ్యమంత్రి.

"స్వామీ! పడవ పిల్ల అడ్డుపడకున్నా మూగరాణి మీ కోరిక మేరకు నడుచుకొని ఉంటుందన్నది నిశ్చయం కాదు. ఎలాగైనా పారిపోవడానికే ప్రయత్నించివుండేది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"నాకేమో ఒక నమ్మకముంది, ఇంత దూరం వచ్చినావిడ చక్రవర్తిని చూడకుండ తిరిగి వెళ్ళదని. మన వల్ల సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేసి చూద్దాం. కానీ, ఇక మీదట కూడ చక్రవర్తిని చూడడానికి వెళ్ళకుండ కాలయాపన చేయడం సముచితం కాదు. నీవు కూడ ఆ పడవపిల్లను పిలుచుకొని నాతో రా! ఇద్దరు యువరాజుల గురించిన సంగతులన్నీ చక్రవర్తికి తెలియజేసేద్దాం. చిన్న యువరాజును కడలిలో మునిగిపోకుండ కాపాడిన ఆ పడవపిల్లే స్వయంగా ఆ విషయాన్ని చెబితే చక్రవర్తి నమ్ముతారు కద?" అన్నారు ముఖ్యమంత్రి.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు, ఆయన శిష్యుడు ఆళ్వార్ కట్టియాన్, పూంగుళలి చక్రవర్తి అంతఃపురానికి వెళ్ళారు. అంతఃపురం ముఖద్వారంవద్దే యువరాకుమారి, వాణతి వారికోసం వేచివున్నారు. మూగరాణి కనిపించలేదన్న సంగతి యువరాకుమారికి కూడ చాల కలవరపాటును కలిగించింది. ఆమె పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురం తోటలో దూరిందన్న సంగతి ఆమె కలవరాన్ని, గాభరాని మరింత అధికం చేసింది. ఇందువల్ల విపరీతపరిణామాలేవీ జరగకుండాలి కద అని దిగులుపడింది.

"అయ్యా! పెద్ద పళువూర్ రాజుగారి అంతఃపురానికి బయటినుంచి సొరంగమార్గముందట కద? దానిగుండా వెళితే...?"

ముఖ్యమంత్రికి వంతిదేవుడు గుర్తుకొచ్చాడు. "తల్లీ! ఆ మార్గాన్ని కనిపెట్టడం అంత సులభసాధ్యమా? అందరూ ఆ వాణర్ కులయువకుడిలాగ అదృష్టవంతులైవుంటారా? అయినా కూడ కోట బయట చుట్టూ మనుషులను కాపలా ఉంచడానికి ఏర్పాట్లు చేస్తాను!" అన్నారు.

తర్వాత ఆళ్వార్ కట్టియాన్ని, పూంగుళలిని యువరాకుమారితో వదిలిపెట్టి, తాము మాత్రం చక్రవర్తిని చూడడానికి వెళ్ళారు. చక్రవర్తికి, పట్టమహిషి వాణమాదేవికి సంప్రదాయప్రకారం గౌరవమర్యాదలు చేసిన తర్వాత, గతరాత్రి వీచిన సుడిగాలి వల్ల విపరీతమైన కష్టనష్టాలు కలిగినందువల్ల బాధితులైన ప్రజలకు తగిన సహాయం చేయడానికి ఏర్పాట్లు చేస్తుండడంవల్ల చక్రవర్తిని దర్శించడానికి రావడం

ఆలస్యమైందని వివరించారు. ఆ ఏర్పాట్లను గురించిన వివరాలను తెలుసుకొన్న తర్వాత చక్రవర్తి మనసు కాస్త కుదుటపడింది.

"ధనాధికారి లేని సమయాన మీరైన ఇక్కడ ఉన్నారు కద? అదే నాకు కొండంత బలం! కానీ నేను విన్నదేమి? కోడిక్కరైనుంచి ఎవరో ఒక స్త్రీని బలవంతంగా పట్టి తీసుకొని వచ్చారట కద? కాసేపటి క్రితం కోట దళపతి వచ్చి చెప్పారు. ముఖ్యమంత్రీ! మీనుంచి ఇలాంటి నడవడికను నేనెదురు చూడలేదు! ఒక వేళ అందుకు అతి ముఖ్యమైన కారణం ఉండివుండవచ్చు. అలాగైతే నాకు తెలియజేయవచ్చు కద? లేక, మీరందరూ నేనెలాగూ రోగినైపోయాను కాబట్టి నాకేమీ చెప్పనవసరం లేదని, నన్ను సంప్రదించనవసరం లేదని తీర్మానించేసుకొన్నారా, ఏమి? అరుళ్మొళివర్మ కడలిలో మునిగిపోక, తీరం చేరుకొని నాగపట్టణపు చూడామణి విహారంలో ఉన్నాడని కుందవై చెప్పింది. అందు గురించి సంతోషపడాలో, విచారపడాలో తెలియడం లేదు. గట్టిక్కినవాడు ఇక్కడికెందుకు రాలేదు? వాడు తప్పించుకొని, బతికి బయటపడి క్షేమంగా ఉన్న విషయాన్ని ఇంతవరకు నాకెందుకు ఎవరూ చెప్పలేదు? ముఖ్యమంత్రీ! నా చుట్టూ నాకు తెలియకుండ ఏవేవో జరుగుతున్నాయి. నా రాజ్యంలో నాకు తెలియకుండ పలుకార్యాలు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో బతికుండడం కన్న..." అని చక్రవర్తి చెప్పుకొచ్చినప్పుడు ఆయన గొంతు పూడుకుపోయింది; కళ్ళలో నీళ్ళుబికాయి.

చక్రవర్తి మాట్లాడుతున్నప్పుడు మధ్య అడ్డుకోవడం మర్యాద కాదని అంతవరకు ఊరకున్న ముఖ్యమంత్రి అప్పుడు, "చక్రవర్తీ! ఆపండి. మన స్నేహం నిన్నటిది, నేటిది కాదు; నలభైయేళ్ళకు పైబడ్డది. ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు మీ మంచికి వ్యతిరేకంగా ఏ కార్యమూ చేయలేదు; ఇక ముందు కూడ చేయను. మీకు అనవసరంగా ఇబ్బంది, కలవరం కలిగించడం ఇష్టంలేక ఒకట్రెండు విషయాలను మీకు చెప్పక వదిలేసివుండవచ్చు. అది నేరమైతే మన్నించండి. ఇప్పుడు మీరడిగే ప్రశ్నలన్నిటికీ ఉత్తరమిస్తాను. దయవుంచి శాంతంగా ఉండాలి" అని వేడుకొన్నారు.

"ముఖ్యమంత్రీ! ఈ జన్మలో నాకిక మనశ్శాంతి లేదు. మరుజన్మలోనైన మనశ్శాంతి దొరుకుతుందేమో తెలియదు. నా ముద్దు బిడ్డలు, నా ప్రాణస్నేహితుడైన ముఖ్యమంత్రే కూడబలుక్కొని నాకెదురుగా కుట్ర పన్నుతున్నప్పుడు..."

"ప్రభూ! మీకెదురుగా కుట్ర పన్నుతున్నవారెవరని త్వరలోనే తెలుసుకొంటారు. ఆ పాతకానికి నేను పూనుకోలేదు. నా ఈ ముఖ్యమంత్రి పదవి పేరుకు మాత్రమే. పెద్ద పళువేట్టరయ్యర్‌కే ఈ పదవిని ఇచ్చేస్తానని తమకు పలుసార్లు విన్నవించుకొన్నాను. ఇప్పుడు కూడ అందుకు సిద్ధంగా ఉన్నాను. నా గురించి మీకు అణుమాత్రం అసంతృప్తి ఉన్నా కూడ..."

"అవును, ముఖ్యమంత్రీ, అవును! ఏ క్షణానైన నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోవడానికి మీరందరూ సిద్ధంగా ఉన్నారు. నా ఊపిరి పోయేవరకు నాతోనే ఉండి, నాతోనే ఊపిరి వదలబోయేది ఈ మలైయమాన్

కుమార్తె ఒక్కతే. నేను చేసిన ఎన్నెన్నో పాపాలకు మధ్య ఏదో కొంత పుణ్యం చేశాను. అందుకే ఈమెను నా జీవనసహచరిగా పొందాను!" అన్నారు చక్రవర్తి భావోద్వేగంతో.

ఈ మాట వినగానే చక్రవర్తికి సమీపంగా ఇంకొక పట్టె మంచం మీద ఆసీనురాలైవున్న వాణమాదేవికి వెక్కిళ్ళతో ఏడుపొచ్చేసింది. ఆమె వెంటనే లేచి పక్కగదిలోకి వెళ్ళింది.

"రారాజా! మలైయమాన్ కుమార్తె గురించి మీరు చెప్పిన ప్రతిమాటా సత్యం. వారి దివ్యగర్భంలో జనించిన తమ బిడ్డలు కూడ మీమీద ఎనలేని భక్తిశ్రద్ధలుగొనివున్నారు."

"అయినా కూడ వాళ్ళు నా మాట లెక్క చేయడం లేదు. నా ఆజ్ఞకు కూడ లోనుకావడం లేదు. నాకు తెలియకుండ ఏవేవో చేస్తున్నారు. మీరు కూడ వారితో చేరిపోయారు! అరుళ్మొళివర్మ కడలినుంచి గట్టెక్కి నాగపట్టణపు బౌద్ధవిహారంలో ఉన్న సంగతి మీకు మునుపే తెలుసు కద? ఎందుకు నాకు చెప్పలేదు?"

"మన్నించాలి ప్రభూ! ఆ వివరం నిన్నటివరకు నాకు తెలియనే తెలియదు. యువరాజు ప్రాణానికి ఏ అపాయమూ వచ్చివుండదని ఒక దృడనమ్మకంతోనే నిన్నటివరకు ఉన్నాను. ఆయన జన్మనక్షత్రాన్నిబట్టి జ్యోతిష్కులు చెప్పింది అబద్ధం కాజాలదు కద?"

"ముఖ్యమంత్రీ! జ్యోతిష్యంవల్ల కాగల అనర్థాలకు అంతే లేదు. ఈ రాజ్యంలోని అందరు జ్యోతిష్కులనూ ఈ రాజ్యంనుంచి బహిష్కరించేయాలని అనుకొంటున్నాను. అరుళ్మొళి జాతకాన్ని సూచించిన జ్యోతిష్కులు చెప్పిన మాటను పట్టుకొనే, నేను సజీవంగా ఉన్నప్పుడే వాడిని సింహాసనమెక్కించడానికి అందరూ ప్రయత్నాలు చేస్తున్నారు; మీరు కూడ ఆ కూటమిలో చేరినవారే కద?"

"సత్యప్రమాణంగ లేదు; ప్రభూ! అందుకు బదులు, చిన్న యువరాజు కొన్నాళ్ళపాటు ఈ చోళరాజ్యంలోకే రాకుండ ఉంటే చాల మంచిదని ఎంచాను. లంకకు వెళ్ళినప్పుడు యువరాజుకు ఆ విధంగానే చెప్పి వచ్చాను. కానీ నేనిటు రాగానే పళువేట్టరయ్యర్‌గారి మనుషులు యువరాజును చెరపట్టి తేవడానికి వచ్చారక్కడికి. మీరు కూడ అందుకు సమ్మతం తెలిపారు. ఈ వార్త రాజ్యమంతటా వ్యాపించివున్నందువల్ల, ప్రజలు పళువేట్టరయ్యర్ల మీద విపరీతంగా కోపంగొనివున్నారు. వారే యువరాజు ఎక్కి వచ్చిన ఓడను నడిసముద్రంలో ముంచేశారని ప్రజలు చెప్పుకొంటున్నారు..."

"అబద్ధం, అమాత్యశేఖరా, అబద్ధం! అంతా పచ్చి అబద్ధం! పార్థిబేంద్రపల్లవుడు నాకంతా చెప్పేశాడు. పళువేట్టరయ్యర్లు పంపిన ఓడలో యువరాజు తిరిగి రాలేదు. పార్థిబేంద్రుని ఓడెక్కి వచ్చాడు. దారిలో కావాలనే కడలిలోకి దూకాడు. కాలిపోతున్న ఇంకొక ఓడలో ఉన్న ఎవరినో కాపాడేందుకని చెప్పి, పార్థిబేంద్రుడు వద్దని అడ్డుకొన్నా వినక, కల్లోలితమైవున్న కడలిలోకి దూకాడు. ఇప్పుడు ఆలోచించి చూస్తుంటే, అంతా అబద్ధమని, నన్ను ఏమార్చేందుకే చేసిన కుట్ర అని అనిపిస్తోంది. ఈ కుట్రలో కుందవైకి కూడ భాగముందని ఎంచినప్పుడే నాకు తట్టుకోలేని వేదన కలుగుతోంది. ఈ లోకమే నాకెదురు తిరిగినా

కూడ కుందపై నాతో ఉంటుందని అనుకొన్నాను. ఒక తండ్రి తన కూతురికి సాధారణంగా చెప్పడానికి జంకే వృత్తాంతాలను కూడ వివరించాను...”

“చక్రవర్తీ! యువరాకుమారి మీకు విరుద్ధంగా కుట్ర పన్నుతోందని లోకమంతా చెప్పినా కూడ నేను నమ్మను; మీరు కూడ నమ్మకూడదు. ఆమె ఒక విషయాన్ని మీకు చెప్పలేదంటే, అందుకు బలమైన కారణం ఉండే తీరుతుంది. చిన్న యువరాజు తమ స్నేహితుని కాపాడేందుకు సముద్రంలోకి దూకారనడంలో అబద్ధమేమీ లేదు.  యువరాజును, ఆయన స్నేహితుని కడలిలో మునిగిపోకుండ కాపాడిన పడవ నడిపే పిల్ల ఇదిగో పక్కగదిలోనే ఉంది. లంకలో జరిగిందంతా ప్రత్యక్షంగా చూసి ఎరుగును. రాజా! ఆమెను పిలవనా?” అన్నారు అనిరుద్ధులు.

చక్రవర్తి చాల ఆతురతతో, “అలాగా? ఆమెను వెంటనే పిలిపించండి. ముఖ్యమంత్రీ!... కోడిక్కరైనుంచి మీరు బలవంతంగా పట్టి తీసుకొచ్చిన స్త్రీ ఆమేనా...?” అన్నారు.

“పళువేట్టరయ్యర్ పల్లకిలో వచ్చినామె పక్కగదిలో వేచివుంది. ఇదిగో పిలుచుకొస్తున్నాను" అని చెప్పేసి, అనిరుద్ధులు చేతులు చరచగానే, పూంగుళలి, ఆళ్వార్ కట్టియాన్ లోపల ప్రవేశించారు.

~~~
~~~

# అధ్యాయము - 31

## సాయంకాల స్వప్నం

**చక్రవర్తి** పూంగుళలిని పరీక్షగా చూసేసి, "ఈ అమ్మాయిని నేనింతకు మునుపు చూడలేదు కద? కానీ ముఖం కాస్త పరిచితంగా ఉన్నట్లుండి కద? బ్రహ్మరాయలుగారూ? ఈ పిల్ల ఎవరు?" అని అడిగారు.

"ఈమె కోడిక్కరై త్యాగవిడంగర కుమార్తె; పేరు పూంగుళలి!"

"ఆహా! అలా చెప్పండి!" అన్నారు చక్రవర్తి. తర్వాత తనలోతానే, 'ఈమె తన అత్తను పోలివుంది! కానీ ఆమెలా లేదు; చాల తేడా ఉంది' అని గొణుక్కొన్నారు.

ఆయన సన్నగ గొణిగింది పూంగుళలి చెవిన మెత్తగా పడింది. పూంగుళలి చక్రవర్తిని అంతవరకు చూడలేదు. ఆయన అందంలో మన్మధుని మించినవారని వినివున్నది. యువరాజును కన్న తండ్రి అలాగే ఉండాలని ఎంచింది. కానీ ఇప్పుడు ఒడలు, మనసు అనారోగ్యంతో పీడించబడి ఆయన చాల వికారంగ కనిపిస్తుండడాన్ని చూసి తీవ్రంగా ఆశ్చర్యపడింది. తన అత్తను వదిలిపెట్టేసిన విషయమై చక్రవర్తితో దెబ్బలాడాలని నిశ్చయించుకొన్న విషయం గుర్తుకొచ్చింది. భయంవల్లను, ఆశ్చర్యంతోకూడిన అదురు వల్లను, సంకోచం వల్లను చక్రవర్తికి నమస్కరించాలన్న విషయాన్ని కూడ మరిచింది.

"అమ్మాయీ! నీ తండ్రి త్యాగవిడంగర్ క్షేమమేనా?" అని చక్రవర్తి ఆమెను అడిగారు. అప్పుడే పూంగుళలికి స్పృహ వచ్చింది. లంకనుంచి కృష్ణానది వరకు ఏకఛత్రాధిపత్యంతో పరిపాలిస్తున్న చక్రవర్తి సమక్షంలో తానున్నానని గ్రహించింది. వెంటనే సాష్టాంగనమస్కారం చేసి, లేచి నిలబడి చేతులు జోడించింది.

సుందరచోళులు అనిరుద్ధులను చూసి, "ఈ అమ్మాయికి మాట వస్తుంది కదా? ఒకవేళ తన అత్తలాగ ఈమె కూడ మూగదా?" అని అడిగినప్పుడు, ఆయన ముఖం మనోవేదనతో కుంచించుకుపోయింది.

"చక్రవర్తీ! ఈ పిల్లకు మాట వచ్చు. తొమ్మిదిమంది స్త్రీలు మాట్లాడే మాటలను తను ఒక్కతే మాట్లాడేయగలదు! తమను దర్శించిన అదిరిపాటు వల్ల అవాక్కైంది!" అన్నారు ముఖ్యమంత్రి.

"అవును; నన్ను చూసి అందరూ మౌనందాలుస్తున్నారు. ఎవరూ నాకు ఏమీ చెప్పడం లేదు!" అన్నారు చక్రవర్తి.

మళ్ళీ పూంగుళలిని చూసి, "అమ్మాయీ! యువరాజు అరుళ్మొళివర్మను నీవు కల్లోలితమైన సముద్రంలో మునిగిపోకుండ కాపాడావంటున్నారు. అది నిజమేనా?" అని సుందర చోళులు అడిగారు.

పూంగుళలి చాల జంకుతూ, “అవును, ప్రభూ! అది నేరమయితే...” అన్నది.

చక్రవర్తి నవ్వారు. కాని ఆ నవ్వు భయంకరంగా ధ్వనించింది.

“బ్రహ్మరాయా! ఈ అమ్మాయి చెప్పేది వినండి! 'అది నేరమైతే...' అన్నది. యువరాజు ప్రాణం కాపాడింది 'నేరమైతే' అంటూంది. నా కుమారుడు సముద్రంలో మునిగి చావాలని నేను కోరుకొంటున్నట్లుంది. అటువంటి రాక్షసుడిని నేనని ఈ పిల్లకి ఎవరో చెప్పినట్లుంది. ముఖ్యమంత్రీ! దేశప్రజలంతా నా గురించి ఇలాగే అనుకొంటున్నారా?” అని అడిగారు సుందరచోళ చక్రవర్తి.

“ప్రభూ! ఈమె భయభ్రాంతులవల్ల అస్తవ్యస్తంగా మాట్లాడుతూంది. అదంతా మీరు పట్టించుకోకండి. అమ్మాయీ! యువరాజును కాపాడినందుకు ఈ చోళరాజ్యమే నీకెంతో ఋణపడివుంది. చక్రవర్తి కూడ మిక్కిలి సంతోషపడ్డారు. దానికి నీకేం బహుమానం కావాలన్నా కూడ అడిగి తీసుకోవచ్చు. ఇప్పుడు జరిగిందంతా చక్రవర్తికి వివరంగా చెప్పమ్మా! భయపడకుండ చెప్పు!” అన్నారు ముఖ్యమంత్రి.

“ఈ అమ్మాయి మొదట ఒక విషయాన్ని చెప్పనీ. యువరాజును కడలినుంచి కాపాడిందని చెబుతోంది కద, అతడు యువరాజేనని ఈమెకెలా తెలుసు? మునుపెప్పుడైనా చూసిందా?” అన్నారు చక్రవర్తి.

“అవును, ప్రభూ! మునుపొకసారి యువరాజు సైనికవీరులతో ఓడెక్కి వచ్చినప్పుడు చూశాను. ఒకసారి యువరాజు నన్ను 'సముద్రకుమారి' అని పిలిచారు!” అన్నది పూంగుళలి.

“ఆహా! ఈ అమ్మాయికి ఇప్పుడు మాట వస్తూంది!” అన్నారు చక్రవర్తి.

తర్వాత, ముఖ్యమంత్రి అప్పుడప్పుడూ ప్రశ్నలడిగి ప్రోత్సహించగా, వంతిదేవుని కోడిక్కరైనుంచి లంకకు పడవలో పిలుచుకొని వెళ్ళినప్పటినుంచి యువరాజును నాగపట్టణం చూడామణి విహారానికి తీసుకొని వెళ్ళి చేర్చినప్పటి వరకు అన్నీ వివరించింది పూంగుళలి. కానీ ముఖ్యమంత్రి ముందుగానే హెచ్చరించినందువల్ల మందాకిని గురించి మాత్రం ఏమీ చెప్పలేదు.

అంతా విన్న తర్వాత చక్రవర్తి, “అమ్మాయీ! నీవు చోళకులానికి అమూల్యమైన సహాయం చేశావు. దానికి సాటిగా నీకు చేయదగిన సహాయమేమీ లేదు. కానీ ఒకటి అడుగుతాను, చెప్పు! కోడిక్కరైలో యువరాజును గట్టెక్కించిన తర్వాత ఇక్కడికెందుకు పిలుచుకొని రాలేదు? ఎందుకు నాగపట్టణానికి పిలుచుకొని వెళ్ళావు?” అని అడిగారు.

“స్వామీ! యువరాజు తీవ్రజ్వరం వల్ల తెలివితప్పి పడివున్నారప్పుడు. నాగపట్టణపు బౌద్ధవిహారంలో మంచి వైద్యులున్నారని విని అక్కడికి తీసుకొని వెళ్ళాము. భిక్షువులు యువరాజు పట్ల చాల భక్తిగొన్నారన్న విషయం మాకు తెలిసిందే. యువరాజును ఆ స్థితిలో పడవలో ఎక్కించి తీసుకొని వెళ్ళగలమేగాని, గుర్రం మీదో, బండిలోనో పిలుచుకొని వెళ్ళడం అసాధ్యం...”

“ఆ సమయాన కోడిక్కరైలో పళువేట్టరయ్యర్ ఉన్నారు కద, ఆయనకెందుకు

తెలియజెప్పలేదు?"

పూంగుళలి కాస్త జంకి, తర్వాత గంభీరంగా, "చక్రవర్తీ! పళువేట్టరయ్యర్ యువరాజుకు విరోధి అని దేశమంతా తెలుసు. అలా ఉండగా, యువరాజును పళువేట్టరయ్యర్‌కి ఒప్పజెప్పడానికి నాకు మనసెలా వస్తుంది?" అన్నది.

"అవునవును! నా బిడ్డలకు పళువేట్టరయ్యర్లు మాత్రమేనా విరోధులు? నేను కూడ విరోధినే. లోకమలాగే అనుకొంటూంది. అది పోనీ. ముఖ్యమంత్రీ! నిన్న ఇక్కడ వీచిన సుడిగాలి నాగపట్టణంలో ఇంకా బలంగా వీచివుంటుంది కద? యువరాజుకు మళ్ళీ ఏదైన అపాయం కలుగుతుందేమోనని నా మనసు తల్లడిల్లిపోతూంది!" అన్నారు చక్రవర్తి.

"ప్రభూ! చోళనాడు అదృష్టం చేసిన నాడు. ఈ నాడుకు మహత్తరమైన యోగం. కాబట్టి..."

"చోళనాడు అదృష్టంగల నాడే; కానీ నేను దురదృష్టశాలిని కద, బ్రహ్మరాయా! నేను కన్ను మూసేలోపల నా కుమారులను ఒక్కసారి చూడాలని కోరుకొంటున్నాను..."

"అయ్యో! అలా అనకండి. ఇటువంటి కుమారులను, కుమార్తెను పొందిన మీవంటి భాగ్యశాలి ఇంకెవరున్నారు? ఇదిగో ఇప్పుడే మనుషులను పంపిస్తాను. యువరాజును క్షేమంగా పిలుచుకొని రావడానికి నా శిష్యుడైన తిరుమలైని కూడ పంపిస్తాను!" అన్నారు ముఖ్యమంత్రి.

అప్పుడే చక్రవర్తి తమ చూపులను ఆళ్వార్ కట్టియాన్‌వైపు సారించారు. "ఆహా! ఇతడింతసేపూ ఇక్కడే నిలబడివున్నాడా? చిన్న పళువేట్టరయ్యర్ ఇతని గురించే కద చెప్పారు? పళువూర్ అంతఃపురం గోడెక్కి దూకింది ఇతడే కద?"

"ప్రభూ! అందుకు తగిన కారణం ఉంది. అందుగురించి రేపు తెలియజేయడానికి అనుమతివ్వండి. ఇప్పటికే చాల అలిసిపోయారు!" అన్నారు ముఖ్యమంత్రి.

ఈ సమయాన మలైయమాన్ కుమార్తె (అంటే పట్టమహిషి), కుందవై, వాణతి చక్రవర్తి గదిలోపల ప్రవేశించారు. "ముఖ్యమంత్రీ! ఈ రోజుకు ఇక్కడితో ఆపండి. చక్రవర్తి ఎక్కువ అలిసిపోకూడదని వైద్యులు కట్టుబాటు చేశారు!" అన్నది మహారాణి. తర్వాత, "ఈ అమ్మాయి చాల ఇంపుగా పాడుతుందట. ఒక దేవారాన్ని పాడమనండి. చక్రవర్తికి గానమంటే చాల ఇష్టం" అన్నది.

"అలాగేనమ్మ! నా శిష్యుడు తిరుమలై కూడ పాశురాలను చాల బాగ పాడుతాడు. వాడిని కూడ పాడమంటాను!" అన్నారు ముఖ్యమంత్రి.

పూంగుళలి అప్పర్ పెరుమాళ్ళ దీవారమొకదాన్ని పాడింది. ఆళ్వార్ కట్టియాన్ 'బంగారు మేనుగలవాడిని కన్నాను (=చూశాను)' అన్న పాశురాన్ని పాడాడు.

పాట మొదలవగానే చక్రవర్తి కళ్ళు మూసుకొన్నారు. కాసేపటికల్లా ఆయన ముఖాన ప్రశాంతత, నెమ్మది నెలకొన్నాయి. ఊపిరి కూడ నెమ్మదిగా ఆడసాగింది. గాఢనిద్రలో మునిగారని అందరూ

గ్రహించారు. చీకటయ్యే సమయమైంది కాబడి దాది పిల్ల దీపం వెలిగించి తీసుకొచ్చింది. ముఖ్యమంత్రితోబాటు అందరూ ఆ గదినుంచి బయటికి వెళ్ళారు. మలైయమాన్ కుమార్తె మాత్రం చక్రవర్తి సమీపాన కాసేపుంది. పక్కగది గడపనుంచి కుందపై ఆమెకు ఏదో సంజ్ఞ చేయగా ఆమె కూడ లేచి వెళ్ళింది. తర్వాత ఆ గదిలో మౌనం నెలకొంది. చక్రవర్తి ఊపిరి వదిలే శబ్దం మాత్రం మెత్తగా వినిపించింది

గతరాత్రి ఏమాత్రం నిద్రపోలేకపోవడం వల్లను, చాల అలిసిపోయివుండడం వల్లను, పూంగుళలి, ఆళ్వార్ కట్టియాన్ పాడిన భక్తిగీతాల మాధుర్యం వల్లను సాయంసంధ్యాసమయమే గాఢనిద్రలో మునిగిన చక్రవర్తి ముఖాన సరికొత్త ప్రశాంతత నెలకొంది. పాత జ్ఞాపకాలు, కొత్త జ్ఞాపకాలు, నిజంగా జరిగిన సంఘటనలు కలగలిసిన కల్పనలు కలల రూపంగొని ఆయనను చిత్రవిచిత్రమైన అనుభవాలకు గురిచేశాయి.

ప్రశాంతత నెలకొన్న నీలికడలిలో ఆయన, పూంగుళలి పడవలో వెళుతున్నారు. పూంగుళలి పడవ నడుపుతూనే ఒక ఇంపైన పాటను పాడింది.

<< ఆ ఇంపైన గీతాన్ని అనువదించవలసివుంది >>

ఈ గీతాన్ని విని చక్రవర్తి పులకించిపోయారు. ఆయన మనసులో గూడుకట్టుకొన్న అలసట తీరి, ఉత్సాహం పొంగింది. “ఇంకా పాడు! ఇంకా పాడు!” అని పూంగుళలిని ప్రోత్సహించారు. నడిసముద్రంలో తేలుతూ వెళుతూంది పడవ.

ఉన్నట్లుండి చీకటి కమ్ముకొని, పెనుగాలి వీచసాగింది. కాసేపటి వరకు ప్రశాంతంగా ఉన్న కడలిలో కొండెత్తు అలలు లేచి పడసాగాయి. కాసేపటిదాక ఊయలలాగ ఊగుతున్న పడవ ఇప్పుడు ఆ అలల ఉధృతానికి మేఘమండలానికి ఎగసి, మరుక్షణం అధోపాతాళానికి నొక్కబడింది. పడవ తెరచాపలు ముక్కలు ముక్కలుగా చిరిగిపోయి గాల్లో ఎగిరిపోయాయి. అయినా కూడ పడవ మునిగిపోక, తలకిందులైపోక ఎలాగో నిలదొక్కుకొంది. అప్పుడు పూంగుళలి పడవ నడిపే సామర్థ్యాన్ని చూసి అచ్చెరువొందారు చక్రవర్తి.

సుడిగాలి వచ్చినంత వేగంగానే నిలిచిపోయింది. కడలిలో కల్లోలం క్రమేణ తగ్గుముఖం పట్టింది. మళ్ళీ మునుపటిలాగ ప్రశాంతత నెలకొంది. తూర్పున ఆకాశం కింది అంచున అరుణోదయమయ్యే సూచనలు కానవచ్చాయి. కాసేపటికల్లా బంగారువన్నె సూర్యుడుదయించాడు. సముద్రపు నీరు కూడ బంగారు వన్నె అబ్బుకొని ధగధగ మెరవసాగింది. కాస్త దూరాన పచ్చని కొబ్బరితోటలతో నిండిన దీవులు కనిపించాయి. ఆ దీవులనుంచి పక్షుల కిలకిలారావాలు వీనులకింపుగా వినవచ్చాయి. లంకాదేశపు తీరం వెంబడి ఉన్న దీవులే అవని సుందర చోళులు గ్రహించారు. వాటిలో ఒక దీవిలోనే ఆయన తన పూర్వజన్మలో మందాకినిని కలిశారని గుర్తుకొచ్చింది.

ఆ దీవివైపు చూస్తూనే, “పూంగుళలీ! చివరిగా నన్ను స్వర్గలోకానికే తీసుకొని వచ్చి చేర్చేశావు

కద? నీకు నేనేవిధంగా కృతజ్ఞతలు తెలుపుకోబోతున్నాను?" అన్నారు. పూంగుళలి బదులు చెప్పకపోవడంతో ఆమెవైపు తిరిగి చూశారు. చూసినాయన అలాగే స్తంభించిపోయారు. ఎందుకంటే పడవలో ఇంకొకవైపు ఉన్నది పూంగుళలి కాదు, మందాకిని! ముప్పైయేళ్ళ క్రితం ఎలా ఉండేదో ఇప్పుడు కూడ అలాగే ఉంది!

కాసేపలాగే మాట, చేష్టలుడిగిపోయి ఉన్న తర్వాత, "మందాకినీ! నీవేనా? నిజంగా నీవేనా? పూంగుళలిలాగ మారువేషం వేసుకొని నన్ను పిలుచుకొని వచ్చింది నీవేనా?" అని అడిగారు. తాము మాట్లాడేది ఆమెకు వినిపించదని గుర్తుకొచ్చింది. కానీ పెదవుల కదలికనుంచి తాము చెబుతున్నది ఇదీ అని అర్థంచేసుకొన్నదానిలాగ ఆమె చిరునవ్వు నవ్వడాన్ని చూశారు. ఆమెకు దగ్గరగా వెళ్ళి చెప్పాలని ఎంచి లేవడానికి ప్రయత్నించారు. కానీ ఆయన లేవలేకపోయారు. తమ కాళ్ళు చచ్చుబడిపోయాయన్న విషయం గుర్తుకొచ్చింది.

"మందాకినీ! నేను రోగినైపోయాను. నేను నీ దగ్గరికి రాలేను; నీవే నా దగ్గరికి రావాలి. ఇదిగో చూడు, మందాకినీ! ఇంకొకసారి నన్ను ముల్లోకాలకు చక్రవర్తిని చేస్తానని ఎవరైనా ఆహ్వానించినా కూడ నిన్ను విడిచి వెళ్ళను. ఈ లంకాదేశం చుట్టూ ఉన్న దీవులకు మనం వెళ్ళవద్దు. ఇక్కడికి ఎవరైనా వస్తూనే ఉంటారు. పడవను నడిసముద్రానికి తీసుకొని పో! చాల దూరం, ఏడు సముద్రాలకవతల ఉన్న ద్వీపాంతరాలకు మనం వెళ్ళిపోదాం!" అన్నారు సుందర చోళులు. ఆయన చెప్పిందంతా అర్థం చేసుకొన్నట్లు చిరునవ్వు నవ్వింది మందాకిని.

కావేరినదిలో రాయంచ (=రాజహంస) లాగ అలంకరించబడ్డ పడవలో సుందర చోళ చక్రవర్తి, ఆయన పట్టమహిషి, బిడ్డలు ఉల్లాసంగా ప్రయాణం చేస్తున్నారు. గానవిద్యలో మంచి నైపుణ్యం ఉన్నవారు పాడుతున్నారు. వీనులవిందైన ఆ గానాన్ని ఆస్వాదిస్తూ సుందరచోళులు అర్ధనిమీలితనేత్రులైవున్నారు. ఉన్నట్లుండి "అయ్యో! అయ్యో!" అన్న కేకలు వినిపించి కళ్ళు తెరిచారు. "బిడ్డ కనిపించడం లేదు! అరుళ్మొళి కనిపించడం లేదు!" అని పలువురు గాభరాగా అనడం వినిపించింది. సుందర చోళులు ఆదుర్దాగా అటూ ఇటూ చూశారు. కావేరి వెల్లువలో ఆయన ముద్దులకొడుకైన అరుళ్మొళిని ఎవరో ఒక స్త్రీ చేతులతో అదిమి ముంచేయడానికి ప్రయత్నిస్తుండడం కనిపించింది. ఎనలేని భీతిగొన్న సుందరచోళులు నదిలోకి దూకబోయారు. ఆ సమయాన ఆ స్త్రీ ముఖం ఆయనకు కనిపించింది. అది వికారమైపోయిన మందాకిని ముఖమేనని గ్రహించారు. వెంటనే ఆయన శరీరం జీవశక్తి ఉడిగిపోయిన జడపదార్థంలాగ అయిపోయింది. నదిలోకి దూకబోయినవారు పడవలోనే ధడేల్మని పడిపోయారు.

పడవలో పడ్డ అదిరిపాటు వల్లనో ఏమో, సుందరచోళులు స్వప్నలోకంనుంచి బయటపడ్డారు. సుడిగాలి వల్ల మామూలు కన్న ఇంకా చలిగా ఉన్న ఆ వాతావరణంలో ఆయన ఒళ్ళు చెమర్చసాగింది. ఇంతసేపు తాను చూసిందంతా కలలోనే అని గ్రహించగానే ఆయన మనసు కుదుటపడింది. తమకెదురుగా

చూశారు. గదిలో ఎవరూ లేరు. దీపం మాత్రం వెలుగుతూంది. తాము నిద్రలోకి జారుకొన్నందువల్ల అందరూ పక్కగదిలో ఉన్నారు కాబోలు! చేతులు తట్టి పిలుద్దామా అనుకొన్నారు. "కాసేపు గడవనీ; కలలో కలిగిన ఉలికిపాటు తగ్గనీ" అని ఎంచి ఊరుకొన్నారు. అప్పుడు పైమేడనుంచి అతిమెల్లని శబ్దమేదో వినిపించింది. అది ఏమైవుంటుంది? ముఖాన్ని కాస్త తిప్పి శబ్దం వచ్చినవైపు చూశారు. పైమేడ స్తంభాన్ని పట్టుకొని అంచు వెంబడి ఒక ఆకారం కిందికి జారుతున్నట్లు అగుపించింది.

~~~
~~~

# అధ్యాయము - 32

## "ఎందుకు నన్ను వేపుకు తింటున్నావు?"

**సుందర** చోళులు చాల అచ్చెరువొందారు. పైమేడనుంచి స్తంభం మీదుగా జారుతూ ఎవరు కిందికి దిగి వస్తున్నారు? ఎందుకు? ఆయనకు ఇంతవరకు తాము కన్న విచిత్రమైన కలలు గుర్తుకొచ్చాయి. తానిప్పుడు చూస్తున్నది కూడ కలేనా? ఈ సందేహాన్ని తీర్చుకోవడానికి ఆయన మళ్ళీ కళ్ళు మూసుకొన్నారు. ఒక నిమిషంపాటు అలా ఉన్నతర్వాత కళ్ళు తెరిచి ఆ ఆకారం కనిపించిన దిక్కుగా చూశారు. అక్కడ ఇప్పుడేమీ లేదు. ఆహా! ఆ దృశ్యం ఒట్టి భ్రమే అయివుండాలి.

ఆయన నిద్రపోవడానికి ముందు జరిగిన విషయాలన్నీ గుర్తు చేసుకొన్నారు. ముఖ్యమంత్రి, ఆయన శిష్యుడు, తీయని గొంతుతో పాడిన ఆ త్యాగవిడంగర్ కుమార్తె తాము నిద్రపోయిన తర్వాత అవతలికి వెళ్ళిపోయారు కాబోలు. మలైయమాన్ కుమార్తె, దాదులు మాత్రం అలవాటు ప్రకారం పక్కగదిలో వేచివున్నారు కాబోలు. కుందవై గురించి తాము ముఖ్యమంత్రితో కొరతగా మాట్లాడింది తలుచుకొని విచారపడ్డారు. కుందవై సాటిలేని వివేకం, ముందాలోచన కలది. రాజ్యంలో కల్లోలం, సంక్షోభం కలగకుండేందుకై యువరాజును నాగపట్టణంలో దాచిపెట్టింది. అందు గురించి పొరబాటుగా ఎంచింది తమ తప్పేగాని ఆమె నేరం కాదు. కొన్నాళ్ళుగా తమ బుద్ధి నిలకడగా లేదన్న విషయం ఆయనకే తెలుసు. మరి యువరాకుమారి మీద కోపించుకొని ఏం ప్రయోజనం? ఏదైన ఆమె ఆలోచన ప్రకారం చేయడమే మంచిది. ఇప్పుడు ముఖ్యంగా చేయవలసింది నాగపట్టణంనుంచి యువరాజును ఇక్కడికి పిలుచుకొని రావడమే. సుడిగాలిలో వాడికే ఆపద కలగకుండాలి కద! వెంటనే కుందవైని ఆ విషయమై అడగాలి. పక్కగదిలో ఉన్నవారిని పిలిచేందుకు సుందర చోళ చక్రవర్తి చేతులు చరచబోయారు...

కానీ ఇదేమి? తమ తలదిండు వెనుక ఎవరో నడుస్తున్నట్లుంది కద? కానీ మెత్తగా, ఏమాత్రం చప్పుడు చేయకుండ – పిల్లి, పులిలాంటి మృగాలు నడిచేటట్లు - నడుస్తున్నట్లుంది. ఎవరై ఉండవచ్చు? ఒకవేళ మలైయమాన్ కుమార్తేనా? తమ కుమార్తెనా? దాది పిల్లా? తమకు నిద్రాభంగం కాకూడదని అలా మెత్తగా నడుస్తున్నారా? "ఎవరది?" అని మెత్తని స్వరంతో అన్నారు చక్రవర్తి. బదుల్లేదు. "ఎవరది? ఇలా ఎదురుగా రా!" అని కాస్త పెద్దగా అన్నారు. అందుక్కూడ బదుల్లేదు.

సుందరచోళులకు ఒక ఆలోచన తట్టింది. ఒకవేళ ఆమే అయివుండవచ్చా? అలా అనుకోగానే కలవరపాటు, దిగులు అధికమైనాయి. 'ఆమేనా? లేక ఆమె ఆత్మా? కలలో కనిపించే కిరాతకి ఇప్పుడు ప్రత్యక్షంగానే వచ్చేసిందా? మధ్యరాత్రి సర్వాలంకార భూషితురాలై తనను వేధించడం కద పరిపాటి? ఈ రోజేమి సాయంసంధ్యాకాలమే వచ్చేసిందే? లేక ఒకవేళ ఇది నడిరాత్రా? మనమంతసేపు నిద్రపోయామా,

ఏమి? అందుకేనేమో మలైయమాన్ కుమార్తె, తమ కుమార్తె ఇక్కడ లేరేమో? దాది అమ్మాయిలు కూడ నిద్రపోయారా? అయ్యో! వాళ్ళెందుకు నన్ను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళిపోయారు? ఆ పాతకి బెస్తవారి కూతురే అయితే, తమని ఊరకే వదిలిపెడుతుందా?'

"ఒసే పాతకీ! నిజంగా నీవే అయితే నా ముందుకు రా! నన్నెన్ని విధాల వేధించాలో అన్ని విధాలుగా వేపుకు తిను! ఎందుకు నేను చూడలేనట్లు నా తల వెనక తిరుగాడుతూ నా ప్రాణాలు తీస్తున్నావు? ముందుకు రా! రక్తబలి అడిగేందుకు వచ్చావా? రా! రా! నీవే కద బొడ్లో కత్తి దోపుకొన్నావు? పులుల్ని, ఎలుగుబంట్లని చంపిన అదే కత్తితో నన్ను కూడ చంపేసి వెళ్ళిపో! నా బిడ్డలను మాత్రం ఏమీ చేయకు! నేను చేసిన నేరాలకు వారి మీద పగ తీర్చుకోకు! వాళ్ళు నీకే ద్రోహం చేయలేదు! నేను మటుకు నీకేం ద్రోహం చేశాను? దీపస్తంభ గృహం పైనుంచి సముద్రంలో దూకి చావమని నేను చెప్పలేదు కద? నీవు చేసిన ఆ ఘోరకృత్యానికి నన్నెందుకు వేపుకు తింటున్నావు?"

సుందర చోళులు తమ తల వెనుక అతి సమీపాన ఏదో ఒక ఆకారం వచ్చి నిలబడివుందని గ్రహించారు. భయంతో ఆయన ఒళ్ళు వణికింది. కడుపులో పేగులు మెలిపెట్టినట్లనిపించింది! ఎవరో తమ గుండెలమీద కూర్చొని గొంతు నొక్కుతున్నట్లనిపించింది. కనుగుడ్లు వెళ్ళుకొచ్చేస్తాయేమోననిపిస్తూంది! ఆమే. సందేహం లేదు. ఆమె ఆత్మే వచ్చి నిలబడివుంది. తామనుకొన్నట్లే చివరికి తమని బలి తీసుకోవడానికి వచ్చింది. గుండెల్లో కత్తిని దించి చంపబోతూంది. లేక, ఒట్టి చేతులతోనే గొంతు పిసికి చంపబోతూందో, ఏమో! ఏవిధంగానైన ఆ పాతకి లక్ష్యం నెరవేరి తీరుతుంది! తామిక బతికి ఉండడం వల్ల ఎవరికీ ఎటువంటి ఉపయోగం లేదు కూడాను. ఆ దెయ్యం తమ మీద పగ తీర్చుకొని తొలగిపోతే తమ బిడ్డలు గండం తప్పుతుంది కద?

ఇంకాస్త నిటారుగా కూర్చొని తలెత్తి చూస్తే ఆ మందాకిని దెయ్యం స్పష్టంగా కనిపిస్తుందనిపించింది ఆయనకు. ఆ ఆకారం నీడ కూడ ఆయన ముఖం మీద పడుతున్నట్లనిపించింది. ఒక్కక్షణం తలెత్తి చూద్దామనుకొన్నారు. ధైర్యం చాల్లేదు. 'నేను కళ్ళు గట్టిగా మూసుకొంటాను. ఆ దెయ్యం తాను చేసేది చేసేసి పోనీ' అని ఎంచి కళ్ళు గట్టిగా మూసుకొన్నారు.

కాసేపలాగే ఉన్నారు; కానీ ఆయన ఎదురు చూసినట్లు ఆయన గుండెల్లో ఏ కత్తీ దిగలేదు. ఆయన గొంతును ఏ దెయ్యపు రెండు చేతులూ పిసకలేదు. ఆ ఆకారం ఆయన తల వెనుక భాగం నుంచి అవతలికి కదిలి వెళ్ళిపోయినట్లుంది. ఆహా! ఆ బెస్తవారి కూతురు నన్నంత సులభంగా వదిలిపెడుతుందా? ఇంకెంత కాలం నన్ను సజీవంగా చిత్రహింస పెట్టబోతుందో, ఏమో? ఈ రోజు నా కంట పడకనే తొలగిపోయింది కాబోలు! సరే, సరే ఎవరినైనా పిలుద్దాం. ఎవరైనా ఈ గదిలోపలికి వస్తే, ఈ దెయ్యం ఇంకా ఈ గదిలోనే ఉంటే, మరుగైపోతుంది!

"ఎవరక్కడ? అందరూ ఎక్కడికేగారు?" అని పెద్దగా అంటూనే కళ్ళు తెరిచారు సుందర చోళ

చక్రవర్తి. ఆఁ! మంచం కింది పట్టీకవతల నిలబడివున్నదెవరు? ఆమే, సందేహం లేదు! ఆ మూగదాని దెయ్యమే, తలవిరబోసుకొని నిలబడివుంది! దాని తలనుంచి నెత్తురు కారుతోంది! 'రక్తంతో పగ తీర్చుకోవడానికి వచ్చాను' అని చెబుతూంది కాబోలు! ఆ ఆకారాన్ని చూస్తూ పిచ్చి ఆవేశంతో పెద్దగా ఇలా అరిచారు చక్రవర్తి:

"ఒసే మూగదెయ్యమా! నీవు ప్రాణాలతో ఉన్నప్పుడు కూడ నోరు తెరిచి మాట్లాడక నన్ను వేపుకు తిన్నావు; ఇప్పుడు కూడ నన్ను వేపుకొంటున్నావు! ఎందుకు వచ్చావు, చెప్పు! బలి తీసుకోవడానికి వచ్చావంటే నా మీద పగతీర్చుకొని వెళ్ళిపో! ఎందుకు ఊరక నిలబడ్డావు? ఎందుకిలా దీనంగా చూస్తున్నావు? ఏమైనా అడగాలని వచ్చావా? అలాగైతే చెప్పు! నోరు తెరిచి మాట్లాడలేకపోతే, సైగలతో చెప్పు! ఊరకే నిలబడి నన్ను వేధించకు. నీ కళ్ళలో ఎందుకు కన్నీళ్ళుబుకుతున్నాయి? అయ్యో! వెక్కి వెక్కి ఏడుస్తున్నావా? నేను ఓర్చుకోలేను! ఏమైన చెప్పాలనుకొంటే చెప్పు! లేకపోతే తొలగిపో. వెళ్ళవా? ఎందుకు వెళ్ళవు? నన్నేం చేయాలని అనుకొంటున్నావు? నా ముద్దుల కొడుకును చిన్న బిడ్డగా ఉన్నప్పుడే కావేరి నదిలో ముంచి చంపేయాలని చూశావు కద? దేవుని దయ వల్ల నీ లక్ష్యం నెరవేరలేదు. ఇక మీదట కూడ నెరవేరదు. ఒసే పాతకీ! ఇంకా ఎందుకు నా గుండెల్ని నీ చూపులతో పెకలించేటట్లు చూస్తున్నావు? పో! పో! పోవా? ఇదిగో నీవు వెళ్ళిపోయేలా చేస్తాను, చూడు...!"

ఇలా అరుస్తూనే సుందర చోళ చక్రవర్తి తమ చేతికందే దూరాన ఏం వస్తువుందా అని చుట్టూ చూశారు. పంచలోహాలతో చేసిన ప్రమిద ఒకటి మాత్రమే అలా చేతికందేలా దగ్గరగా కనిపించింది. దాన్ని చేత తీసుకొని, "పో! పో!" అని అరుస్తూ, ఆయన మందాకిని పిశాచరూపమని ఎంచిన ఆ ఆకారం ముఖాన్ని గురి చూసి దాన్ని విసిరారు. మహావిష్ణువు విసిరిన చక్రంలాగ అది ఆ స్త్రీరూపం వైపు దూసుకువెళ్ళింది.

అప్పుడు చక్రవర్తి దెయ్యమని ఎంచిన అ స్త్రీరూపం నోటినుంచి ఒక ఆర్తనాదంలాంటి ఒక శబ్దం వెలువడింది. అది విని సుందరచోళుల సర్వశక్తులూ పీల్చుకుపోయినట్లనిపించింది. దీపం ఆ ఆకారం ముఖాన్ని కొట్టలేదు. కాస్త ముందు, నేల మీద పడి దొర్లుకొంటూ వెళ్ళింది.

ఆ ప్రమిద కింద పడిపోయి ఆరిపోయినా కూడ, అదృష్టవశాత్తు ఆ గదిలో ఇంకొక మూల మరొక దీపం వెలుగుతూంది. దాని మసక వెలుతురులో, మందాకిని ఆత్మరూపం (ఆయన ప్రకారం) ఇంకా అక్కడే నిలబడివుండడాన్ని గమనించారు. ఆ ఆకారం ముఖంలో ఒక అనిర్వచనీయమైన వేదన ఒక్క క్షణంపాటు అగుపించింది. తర్వాత ఆ ఆకారం మరొక్కసారి చివరిగా చక్రవర్తిని అలవిగాని ఆందోళన నిండిన చూపులతో చూసేసి, అక్కడినుంచి నిష్క్రమించడానికి ప్రయత్నించింది.

ఆ సమయానే, మొట్టమొదటిసారిగా ఆయన మనసులో ఒక సందేహం పుట్టింది. ఇది మందాకిని ఆత్మారూపమా? లేక ఆమెనే పూర్తిగా పోలిన ఇంకొక స్త్రీనా? ఆమె కవలగా పుట్టిన సహోదరినా? లేక...ఒకవేళ...ఒకవేళ...సాక్షాత్తు ఆమేనా? ఆమె చనిపోలేదా? ఇంకా బతికే ఉందా? తామనుకొన్నదంతా

తప్పా? ఒకవేళ ఆమే అయితే, ఆమె మీద తాము దీపాన్ని విసిరి కొట్టింది ఎంతటి క్రూరత్వం? కాసేపటి క్రితం ఆమె ముఖాన తోచిన పరితాపం మారి, ఎనలేని వేదన తోచింది కదా? తమ క్రూరత్వాన్ని ఎంచి ఆమె వేదనపడిందా? ఆఁ! అదిగో, ఆమె మళ్ళీ తిరిగివెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తూంది. ఎటువైపు వెళదామని చూస్తూంది.

"అమ్మాయీ! నీవు మందాకినివేనా? లేక ఆమె ఆత్మారూపానివా? లేక ఆమెతోబాటు పుట్టిన సహోదరివా? ఆగు! ఆగు! నీ నిజాన్ని చెప్పేసి వెళ్ళు...!" ఇలా సుందర చోళులు పెద్దగా అంటున్నప్పుడు దడదడమని పలువురు ఆ గదిలోకి ప్రవేశించారు. మలైయమాన్ కుమార్తె, కుందవై, వాణతి, పూంగుళలి, ముఖ్యమంత్రి, ఆయన శిష్యుడు - అందరూ ఒక్కసారిగా ఆ గదిలోపలికొస్తున్నారని ఆయన ఒక్కక్షణంలో చూసి తెలుసుకొన్నారు. "ఆపండి! ఆమెను పరుగెత్తిపోకుండ ఆపండి! ఆమె ఎవరు, ఎందుకు వచ్చిందని అడిగండి!" అని అరిచారు చక్రవర్తి.

లోపలికొచ్చినవారందరూ ఎదురుచూడని ఆ సంఘటనవల్ల చేష్టలుడిగి ఒక్కక్షణంపాటు అవాక్కైనారు. పిచ్చిపట్టినట్లున్న సుందర చోళుల ముఖం, ఆయన కేకల్లో ధ్వనించిన భీతి, వారికి కూడ భీతిని కలిగించింది. మందాకినీదేవిని అక్కడ చూడగానే వారు అలవిగాని ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరైనారు. ఏం చేయాలో తోచక అందరూ చేష్టలుడిగి నిలబడిపోయారు. ముఖ్యమంత్రి అనిరుద్ధులు పరిస్థితి ఇదీ అని, అది ఏవిధంగా సాధ్యమైవుండవచ్చన్నది ఒకింత ఊహించి, గ్రహించారు.

ఆయన పూంగుళలిని చూసి, "అమ్మాయీ! ఈమే కద నీ అత్త?" అని అడిగారు.

"అవునయ్యా!" అన్నది పూంగుళలి.

"తిరుమలై! ఎందుకు చెట్టులాగ నిలబడ్డావు? మందాకినీదేవి పారిపోజూస్తూంది! ఆమెను అడ్డగించి ఆపు! చక్రవర్తి ఆజ్ఞ!" అన్నారు.

ఆళ్వార్ కట్టియాన్ తన జీవితంలో మొట్టమొదటిసారిగా తన గురువు ఆజ్ఞను పాటించడానికి నిరాకరించాడు. "అయ్యా! దానికన్న సుడిగాలిని అడ్డుకొని ఆపమని నన్ను ఆజ్ఞాపించండి!" అన్నాడు.

ఇంతలో పూంగుళలి ఊరుకోలేదు. ఒక్కదూకున అత్త దగ్గరకు వెళ్ళి ఆమె భుజాన్ని పట్టుకొంది. మందాకిని ఆమెను విదిలించి తోసేసి పరుగెత్తింది.

ఆళ్వార్ కట్టియాన్ చటుక్కున ఒక పని చేశాడు. కాసేపటి క్రితం ముఖ్యమంత్రి మొదలైనవారు లోపలికి ప్రవేశించిన తలుపును మూసి గడియవేశాడు. తర్వాత తలుపును ఎవరూ తెరవలేనట్లు చేతులను చాచి అడ్డుపెట్టాడు. వేటగాళ్ళతో నలువైపులనుంచి చుట్టుముట్టబడ్డ జింకలాగ మందాకిని చుట్టూ బెదురు చూపులు చూసింది. తప్పించుకోవడానికి ఇంకేదారి లేదని, తాను దిగి వచ్చిన దారినే వెళ్ళాలని తీర్మానించుకొంది. ఆమె పైమేడను తలెత్తి చూసిన చూపునుంచి ఆమె ఉద్దేశాన్ని తక్కినవారు గ్రహించారు.

సుందర చోళులు, "పట్టుకోండి! ఆమెను పట్టి ఆపండి! ఆమె ఎందుకు వచ్చింది, ఎవరిమీద పగ

తీర్చుకోవడానికి వచ్చిందని అడగండి!" అని ఇంకా అరిచారు. స్తంభాల వెంబడి పైకెక్కి పారిపోవడానికి ఆయత్తమవుతున్న మందాకిని దగ్గరికి పూంగుళలి మళ్ళీ పరుగెత్తింది. ఈసారి ఆమెను పట్టి ఆపడానికి బదులు ఆమెకు సైగలతో ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. మందాకిని దాన్ని అర్థంచేసుకొన్నట్లు కింద పడివున్న ప్రమిదను వేలెత్తి చూపించింది.

ఇది గమనిస్తున్న కుందవై, "నాన్నా! పెద్దమ్మమీద మీరేనా ప్రమిదను విసిరింది?" అని అడిగింది.

"అవునమ్మా! ఆ దెయ్యం నన్ను చూసిన చూపును నేను తట్టుకోలేకపోయాను. అందుకే ప్రమిదను తీసి విసిరాను!" అన్నారు చక్రవర్తి.

"తండ్రీ! దెయ్యమూ కాదు, ఆత్మారూపమూ కాదు. సజీవంగా ఉన్న స్త్రీనే ఆమె. నాన్నా! పెద్దమ్మ చనిపోనేలేదు! ముఖ్యమంత్రిని అడగండి! అంతా చెబుతారు!" అని చెప్పి కుందవై పూంగుళలి, మందాకిని మధ్య జరుగుతున్న మౌన వాగ్వివాదాన్ని చూసింది. వెంటనే అక్కడికి ఒక్కదూకున వెళ్ళింది.

"కూతురా! దాని దగ్గరికి వెళ్ళకు! అది నీకేమైనా చేసేస్తుంది!" అంటూనే చక్రవర్తి కుందవైని అడ్డుకోవడానికి గాభరాగా పడకనుంచి లేవజూశారు. మలైయమాన్ కుమార్తె వాణమాదేవి చాల ప్రేమాదరాలతో ఆయన భుజాలను పట్టి పడకమీద మళ్ళీ పడుకోబెట్టింది. "ప్రభూ! కాస్త ఓపిక పట్టండి! మీ కుమార్తెకు ఎటువంటి అపాయమూ కలగదు!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 33

## "చోళకుల దైవం"

**కుందవై** తనను సమీపించగానే మందాకిని ఆమెను ఒక్క క్షణం పరీక్షగా చూసింది. అప్పుడు ఎవరూ ఎదురు చూడని ఒక కార్యాన్ని చేసింది యువరాకుమారి. నేల మీద సాష్టాంగంగా పడి మందాకిని కాళ్ళు తాకి నమస్కరించింది. మందాకిని కళ్ళల్లో నీళ్ళుబికాయి. వంగి కుందవైని ఎత్తి హత్తుకొంది. తర్వాత యువరాకుమారి మందాకినిని ఒక చేత్తో హత్తుకొని చక్రవర్తి పడుకొనివున్న చోటువైపు వచ్చింది.

చక్రవర్తిని అప్పుడే మొట్టమొదటిసారిగా మందాకిని ముఖాన్ని స్పష్టంగా చూడగలిగింది. ఆమె తలనుంచి రక్తం ధారగా ప్రవహిస్తుండడాన్ని చూసి, "మీరేనా దీపాన్ని విసిరి ఆమెను గాయపరిచారు? అయ్యో! ఎంత పని చేశారు!" అని గాభరాగా అన్నది.

"లేదు, లేదు! నేను విసిరిన దీపం ఆమెను తాకనే లేదు. ఇక్కడికి వచ్చినప్పుడే ఆమె తలమీద గాయమై రక్తం కారుతుండడాన్ని చూశాను. కానీ ఈ పాతకి నామీద నింద మోపినా ఆశ్చర్యం లేదు. మీరు కూడ నమ్మేస్తారు. ఇప్పుడు మీరందరూ ఆమె పక్షాన చేరిపోయారు. మలైయమాన్ కూతురా! నీవు కూడ ఈమె మీద జాలి చూపుతున్నావా? ఈమె ఎవరన్నది నీకు తెలుసా?" అని అడిగారు సుందర చోళ చక్రవర్తి.

"తెలుసు, స్వామీ! ఈమె నా కులదైవం. చోళకులానికే దైవం. నా ముద్దుల కొడుకు కావేరి నదిలో మునిగిపోకుండ కాపాడిన దైవం కద...?"

"ఆహా! నీవు కూడ అలా నమ్ముతున్నావా? ఒకవేళ కుందవై నీకలా చెప్పిందా?"

"నేనే కళ్ళార చూశాను. అప్పుడు కుందవై కూడ చిన్న పిల్లే కద? దానికెలా తెలిసివుంటుంది? అరుళ్మొళిని కాపాడడమే కాదు, చోళనాడుకే మీ ప్రాణాలను కాపాడి ఇచ్చిన దైవం కద? మీరు భూతదీవిలో ఎలుగుబంటికి ఎరగాకుండ కాపాడిన దైవం కద?"

"భగవాన్! అది కూడ నీకు తెలుసా? ఈమె ఇన్నాళ్ళు బతికే ఉందన్న విషయం కూడ నీకు తెలుసా?"

"కొంత కాలంగా తెలుసు; తెలిసినప్పటినుంచి ఈ దేవిని లంకనాడునుంచి పిలుచుకొని రమ్మని ముఖ్యమంత్రిని అడుగుతున్నాను..."

"అనిరుద్ధులుగారూ! మహారాణి చెబుతున్నదేమి? ఈమె నిజంగానే ఆ సముద్రతీరవాసి కూతురేనా? ఈమె నిజంగానే సజీవంగా ఉందా? ఈమె చనిపోయిందన్నది అబద్ధమా? ఈమె ఆత్మ నా

చుట్టూ తిరుగుతోందనడం నా భ్రమ మాత్రమేనా? ఇప్పటికే నా బుద్ధి చెడిపోయివుంది. అందరూ కూడబలుక్కొని నన్ను పూర్తి పిచ్చివాడిగా చేసేయకండి!" అన్నారు చక్రవర్తి.

"ప్రభూ! ఈమె ఆ సముద్రతీరవాసి కుమార్తె అన్నది నిజమే. ఈమె చనిపోలేదన్నది కూడ నిజమే. చక్రవర్తీ! నేను పెద్ద నేరస్థుడిని/దోషిని. నేను చేసిన నేరం క్షమించరానిదే. అయినా కూడ, మీ కరుణ వల్ల..."

"ముఖ్యమంత్రీ! ఇప్పుడు తెలుస్తూంది, కోడిక్కరైనుంచి మీరు బలవంతంగా పట్టి రప్పించిన స్త్రీ ఈమే! పల్లకిలో వచ్చింది పడవ నడిపే పిల్ల అని మీరు చెప్పింది నిజం కాదు...!"

"రారాజా! ఈ దాసుని మన్నించాలి!"

"ఆహా! మన్నించాలట! చక్రవర్తి అని, రారాజని పిలువబడే ఒకడు నాలాగ ఇలా మోసపోవడం ఈ లోకం పుట్టినప్పటినుంచి ఇప్పటిదాక సంభవించి ఉండదు గాక ఉండదు. నాకు తెలియకుండ ఎందుకీ పని చేయాలి? ముందే చెప్పలేదు? ఈ రోజు సాయంత్రం నాతో అంతసేపు మాట్లాడుతున్నారు కద? అప్పుడు కూడ ఎందుకు చెప్పలేదు? ముఖ్యమంత్రీ! నాకిప్పుడంతా అర్థమవుతూంది. పళుపేట్టరయ్యర్లు చెప్పేది నిజమే. మీరందరూ కూడబలుక్కొని నాకు విరుద్ధంగా కుట్ర పన్నుతున్నారు!"

"మేము కుట్ర పన్నినదేమో నిజమే. కానీ తమకు విరుద్ధంగా/వ్యతిరేకంగా కుట్ర పన్నలేదు. ఎలాగైన ఆ సముద్రతీరవాసి కుమార్తెను పిలుచుకొని వచ్చి మీ దగ్గరకు చేర్చాలనుకొన్నాము. ఆమె కడలిలో మునిగి చనిపోయిందని మీరు భావించడంవల్ల మీ మనసు చాల బాధపడుతోందని మహారాణి మూలంగా తెలుసుకొని నేనీ తీర్మానం తీసుకొన్నాను. మహారాణి కూడ అలాగే ఆజ్ఞాపించారు. కానీ ఆమెను పిలుచుకొని రావడం సులభసాధ్యం కాదు. వారు సజీవంగా ఉన్నారని చెబితే మీరు నమ్మకపోవచ్చు. కాబట్టి ఎలాగైనా వారిని ఈ ఊరికి (తంజావూరుకు) పిలుచుకొని వచ్చిన తర్వాతే మీకు తెలియజేయాలనుకొన్నాను. నిన్న సాయంత్రం ఇంచుమించు కోట వాకిలి దగ్గరికి వచ్చిన తర్వాత మందాకినీదేవి ఉన్నట్లుండి మాయమైపోయారు. వారికి బదులుగా ఈ పిల్ల పల్లకిలో వచ్చింది. ఈరోజంతా దేవిని వెతకడంలోనే నిమగ్నమైపోయాము. వారు పళువూర్ అంతఃపురం గోడ దూకడం చూసిన తర్వాతే నా శిష్యుడు కూడ అలాగే ఆ గోడెక్కి దూకాడు. కానీ ఈ దేవి కనిపించలేదు. తిరుమలైని పళువూర్ భటులు పట్టుకొని వచ్చారు. చక్రవర్తీ! నా శిష్యుడిని ఆ నేరానికై మన్నించగోరుతున్నాను..."

"మన్నించడానికి ఈ ఒక్క నేరం మాత్రమేనా? ఇంకా ఎన్నో ఉన్నాయి. తర్వాతేం జరిగిందో చెప్పండి!"

"తర్వాత, ఈరోజు సాయంత్రం వరకు వేచివుండి, పళువూర్ అంతఃపురంలో వెతికిచూసినా కూడ వీరు కనిపించలేదు. తమరు కాసేపటి క్రితం కళ్ళు మూసుకొని నిద్రలోకి జారినప్పుడు, పక్కగదిలో మేమంతా ఈ దేవి గురించే మాట్లాడుకొంటున్నాము. వీరు ఎక్కడ మాయమైవుండ సాధ్యం, ఇదంతా

మీకెలా చెప్పాలి, ఎవరు చెప్పాలి అని మాలో మేము చర్చించుకొంటున్నాము. ఇంతలో ఎలాగో వీరే తమ సన్నిధికి వచ్చేశారు. పండు జారి పాలలో పడ్డట్లయింది!"

చక్రవర్తి అప్పుడు మందాకినీదేవి ఉన్నవైపు చూశారు. కుందవై, పూంగుళలి మొదలైనవారు ఆ స్త్రీమణి తలమీద ఏర్పడ్డ గాయాన్ని తడిబట్టతో తుడిచి మందు వేస్తుండడాన్ని గమనించారు.

"విడంగర్ కూతురా! నీ అత్త తల మీద గాయమెలా ఏర్పడిందని అడిగి చెప్పగలవా?" అన్నారు.

పూంగుళలి రెండడుగులు ముందుకు వచ్చి, "అడిగాను, ప్రభూ! కానీ అత్త చెబుతున్న కారణం నాకే సరిగ్గా అర్థం కావడం లేదు..." అన్నది.

"సరే, ఏమని చెబుతూంది? నేను విసిరిన దీపంవల్ల ఏర్పడ్డ గాయమని చెబుతూందా?"

"లేదు, లేదు! కొండకు గుద్దుకోవడంవల్ల ఏర్పడ్డ గాయమని చెబుతూంది. రక్తం కారుతుండడాన్ని గమనించలేదని కూడ చెప్పింది..."

సుందర చోళులు అప్పుడు ఒక అపూర్వమైన కార్యాన్ని చేశారు. గలగలమని నవ్వారు! అలా ఆయన నవ్వడాన్ని తక్కినవారు చూసి, విని చాల ఏళ్ళైంది. మళ్ళీ మళ్ళీ ఆయన తలుచుకొని, తలుచుకొని నవ్వారు. అందరూ ఆయన్ని దిగులుతో చూడసాగారు. "ముఖ్యమంత్రీ! ఎందుకు మీరందరూ నన్నిలా తదేకంగా చూస్తున్నారు? నాకు కొత్తగా పిచ్చెక్కలేదు. పాతపిచ్చే ఇంకా మిగిలివుంది. నేనిప్పుడు నవ్వడానికి కారణం మీకు తెలియడంలేదా? సారవంతమైన బయలుసీమైన ఈ చోళనాడులో ఈమె కొండకు గుద్దుకొని గాయపడ్డానంటోంది కద? అది వినే నవ్వొచ్చింది. కొండ గురించి చెప్పనేల? ఇక్కడ ఒక చిన్న విగ్రహం చెక్కడానికి కూడ రాయి దొరకదు కద? చోళ చక్రవర్తి తల మీద ఎవరైనా రాయి వేయాలనుకొన్నా, అందుకూ ఒక రాయి కూడ దొరకదు కద? మరీమె కొండకు గుద్దుకొన్నానంటూంది కద? ఏ కొండకు గుద్దుకొంది? పూంగుళలీ! మరొకసారి సరిగ్గా అడుగు!" అన్నారు.

ఇదంతా వింటూన్న వాణతి ముఖంలో చటుక్కున ఒక మెరుపు మెరిసింది. ఆమె రెండడుగులు ముందుకు వేసి చక్రవర్తికి నమస్కరించి, "అయ్యా! నాకు ఒక ఆలోచన తడుతూంది. ఆజ్ఞాపిస్తే విన్నవించుకొంటాను!" అన్నది.

"వేళార్ ముద్దుల కూతురా! నీవు కూడ ఇక్కడ ఉన్నావా? నిన్ను నేనింతవరకు గమనించనే లేదు! ఇంతటి గందరగోళంలో కూడ నీవు మూర్ఛిల్లకుండడం ఆశ్చర్యమే! నీకేం ఆలోచన తడుతోంది? దేని గురించి? చెప్పమ్మా!" అన్నారు చక్రవర్తి.

"ఈ దేవి కొండకు గుద్దుకొని గాయపడిందన్నారు కద? అందుగురించే నాకొక ఆలోచన తట్టింది!"

"ఏమది? నీవు చాల తెలివిగలదానివి! నీకేదైన ఆలోచన తట్టివుంటుందనడంలో ఆశ్చర్యం

లేదు. త్వరగా చెప్పు! లంకలో గాయపడి, నెత్తురోడుతున్న ఆ గాయంతోనే ఇక్కడికి వచ్చిందని చెబుతూందా?"

"లేదయ్యా! ఈ అంతఃపురం తోటలో ఒక శిల్పమంటపం ఉంది కదా? అందులో పది తలల రావణుడు ఎత్తి పట్టుకొన్న కైలాసగిరి ఉంది. బహుశ ఆ కొండకే ఈ దేవి గుద్దుకొనివుండవచ్చు!"

ఇలా వాణతి చెప్పగానే అందరూ ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయారు.

"కావచ్చు! కావచ్చు!", "అలాగే జరిగివుండాలి!" అని ఒకరికొకరు చెప్పుకొన్నారు.

కుందవై వాణతి తల నిమిరి, దిష్టి తీసే సూచనగా మెటికలు విరిచి, "నా ముద్దుల కన్నా! ఎంతటి తెలివైనదానివి నీవు! మా అందరికి తట్టని ఆలోచన నీకు తట్టింది!" అన్నది.

పూంగుళలి అదంతా కోపం నిండిన చూపులతో చూసేసి, తన మూగత్త వైపు తిరిగి, సంజ్ఞాభాషలో ఏదో అడిగింది. తర్వాత తక్కినవారిని చూసి, "అవునట! అత్త ఆ శిల్పమంటపంలో ఉన్న కొండకే గుద్దుకొందట! నేనది చూడలేదిందత వరకు. చూసివుంటే నాకూ ఆ ఆలోచన తట్టేదే!" అన్నది.

చక్రవర్తి మందాకినిని పరీక్షగా చూసి, "అవును; దారి తెలియక అటూ ఇటూ వెళుతూ, శిల్పమంటపంలోని కొండకు గుద్దుకొన్నట్లుంది. ఎక్కడికి వెళ్ళడానికి దారి వెతుకుతూందో తెలియదు. చివరికి ఇక్కడికి వచ్చి చేరింది!" అన్నారు.

"తమ చెంతకు వచ్చేందుకే దారి వెతికారు. అందులో ఏమాత్రం సందేహం లేదు. నేనే వీరందరితో చెబుతున్నాను, మిమ్మల్ని దర్శించనిదే దేవి తిరిగివెళ్ళరని..."

"నేను నమ్మను. ముఖ్యమంత్రీ! నా దగ్గరికి వచ్చేందుకే అయితే ఇంతకు మునుపే వచ్చివుండాలి కదా? ఇరవైయైదేళ్ళుగా రాకపోయిందా? ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు వేచివుండి ఇప్పుడు రానేల? దెయ్యమై నా చుట్టూ తిరగనేల? అవునవును! ఈమె దెయ్యం రూపంలో ఉందనుకొన్నాను. అది కూడ నిజమే కదా? దెయ్యంలాగనే లంకనాడులోని కొండలు, అడవుల్లో తిరుగాడి, తిరుగాడి చివరికి ఇక్కడికి వచ్చింది. నేనింతకాలం అంతఃపుర సుఖభోగాల్లో మునిగి కాలం గడుపుతూ వచ్చాను. ఈమెను పోలిన రూపాన్ని చూసి నేనెన్నిసార్లు భ్రమపడ్డానో కదా! ఇప్పుడు వచ్చినట్లు, ఇంత క్రితం ఇంకెన్నిసార్లు వచ్చి వెళ్ళిందో ఏమో? ఎవరికి తెలుసు? నేను పిశాచి అని ఎంచి బెదిరిపోయేవాడిని...! ఇరవైయైదేళ్ళు! ఇరవైయైదు యుగాలు!"

ఇలా తమలోతామే మాట్లాడుకొంటున్న చక్రవర్తి ఉన్నట్లుండి అనిరుద్ధులని చూసి, "ముఖ్యమంత్రీ! మీరేదో నేరం చేశారని, అందుకు క్షమించాలని కోరుకొన్నారు కదా? అదేమి?" అని ఉద్రేకంతో అడిగారు.

అనిరుద్ధులు, "చక్రవర్తీ! నేరస్థుడినే తన నేరమేమని అడగడం ధర్మమా?" అన్నారు.

"మరి, ఎవరిని అడగాలి? అవును, ఒకరిని అడగనవసరం లేదు. మీ ముఖానే రాసినట్లు

కనిపిస్తూంది. ఆమె సముద్రంలో పడి చనిపోయిందని వచ్చి చెప్పారు కద? అదే అబద్ధం! ఇరవైయైదేళ్ళుగా ఆ అబద్ధాన్ని మీరు కప్పిపుచ్చారు.  నేనూ నమ్ముతూ వచ్చాను. ముఖ్యమంత్రీ! మీ ఈ నేరం నిజంగానే భయంకరమైనది...!"

"అందుకు నేను మాత్రమే బాధ్యుడిని కాను, చక్రవర్తీ! ఆ బెస్తవారి కూతురు కూడ బాధ్యురాలే! వారు కడలిలో పడిపోయిందేమో నిజమే. కానీ తర్వాత బతికి బయటపడింది. తమకు వారు సజీవంగా ఉన్న విషయాన్ని చెప్పకూడదని మాట తీసుకొన్నారు; నేనలా మాటివ్వకపోతే, మళ్ళీ నిజంగానే చనిపోతానన్నారు. ఇదంతా నిజమో కాదో వారినే మీరు అడిగి తెలుసుకోవచ్చు."

"అడగనవసరమే లేదు! అలాగే ఉండనీ. అయినా కూడ మీరందరూ కూడబలుక్కొని నాకు విరుద్ధంగా కుట్ర పన్నారనడంలో తప్పేమీ లేదు కద?" అన్నారు సుందర చోళులు.

"నేను చేసిన నేరానికి మన్నింపు లేదు, నిజమే. క్షమించమని నేను అడగడమూ లేదు. అయినా కూడ చాలయేళ్ళుగా నా మనసులో ఉన్న భారం ఇప్పుడు దిగిపోయింది. ఇక నాకు సెలవివ్వండి. శ్రీరంగానికి వెళ్ళి శ్రీరంగనాథుని సేవలో నా శేషజీవితాన్ని గడపడానికి అనుమతివ్వండి."

"అది సాధ్యం కాదు, అనిరుద్ధులుగారూ! మీరానాడు చేసిన నేరంవల్ల ఇప్పుడు ఎన్నెన్నో సమస్యలు ఏర్పడ్డాయి. వాటన్నిటినీ పరిష్కరించిన తర్వాతే కద మీరు శ్రీరంగనాథుని సేవకు వెళ్ళాలి?" అన్నారు చక్రవర్తి.

~~~
~~~

# అధ్యాయము - 34

## రావణుడికి ఆపద!

**సుందర** చోళులు తమ ప్రియపుత్రికను చూసి, “కుందవై! నేను ముఖ్యమంత్రితో కాస్త రాజ్యకార్యాల గురించి మాట్లాడాలి. మీరు వెళ్ళి మీ పనులు చూసుకోండి. వెళ్ళేటప్పుడు దీన్ని కూడ పిలుచుకొని వెళ్ళండి! నీ తల్లి మాత్రం ఇక్కడ కాసేపుండనీ!” అన్నారు.

చక్రవర్తి 'దీన్ని కూడ' అని సూచించింది మందాకినినే. అలా సూచించడడంనుంచి ఆమె పట్ల ఆయనకున్న ఏహ్యాభావం తెలియవచ్చింది. కుందవై మనసు చివుక్కుమనగా, తండ్రిని బాధనిండిన కళ్ళతో చూసింది.

అది గమనించిన చక్రవర్తి, “ఈమె గుద్దుకొన్నది శిల్పమంటపంలో ఉన్న కైలాసపర్వతమేనా అని తెలుసుకోవడం మంచిది! ఈమెను అక్కడికే పిలుచుకొని వెళ్ళి చూపించి తెలుసుకోండి! ఈమె ఇంకా ఇక్కడే నిలబడివుండడాన్ని నేను సహించలేకున్నాను” అన్నారు.

కుందవై నిరాశ నిండిన కళ్ళతో మందాకినిని చేయి పట్టి పిలుచుకొని వెళ్ళింది. అప్పుడు మలైయమాన్ కుమార్తె (మహారాణి) కుందవై దగ్గరకు వచ్చి, ఆమెకు మాత్రం విన్పించేటట్లు ఆమె చెవిలో, “బిడ్డా! ఈమె ఇప్పుడు చూడ అసహ్యంగానే ఉంది కద? నాన్న మాటకు విచారపడి ఏం ప్రయోజనం? నీ అలంకార కళానైపుణ్యాన్నంతా ఈమె మీద చూపించు, చూద్దాం!” అన్నారు. కుందవై చిరునవ్వుతో తన సమ్మతాన్ని తెలియజేసి మందాకిని సమేతంగా అక్కడినుంచి బయలుదేరింది. వారితోబాటు వాణతి, పూంగుళలి కూడ వెళ్ళారు.

తర్వాత చక్రవర్తి ముఖ్యమంత్రిని, మలైయమాన్ కుమార్తెను మార్చి మార్చి చూస్తూ, “మీరిద్దరూ కూడబలుక్కొని ఎందుకీ కార్యాన్ని చేశారో తెలియడం లేదు. నాకిందువల్ల సంతోషం కలుగుతుందని మీరు భావిస్తే అది పెద్ద పొరబాటు! ముఖ్యమంత్రీ! మీరెందుకు ఇంత ప్రయత్నం చేసి కోడిక్కరైనుంచి ఈ అడవిమృగాన్ని పట్టి రప్పించారు? ఇప్పుడైనా నిజాన్ని చెప్పండి! ఇకమీదటైనా నా దగ్గర ఏదీ దాచడానికి ప్రయత్నించకండి!” అన్నారు.

అప్పుడు ముఖ్యమంత్రి అనిరుద్ధులు భావోద్వేగంతో ఇలా అన్నారు: “ఒకసారి చేసిన తప్పును మళ్ళీ చేయను. ఇకమీదట నేను చేయదలుచుకొన్న ఏ కార్యాన్నీ మీ దగ్గర దాచను. నిజం బయటపడాలనే నేనింత ప్రయత్నించవలసివచ్చింది. మీవల్ల ఒక స్త్రీ సముద్రంలో పడి చనిపోయిందని మీ మనసు చాల వేదనపడేది. మీరా సంభవాన్ని మరిచిపోయారని నేను చాలకాలంపాటు భావిస్తూ వచ్చాను. కానీ పోను పోను ఆ జ్ఞాపకం మీ మనసులో ఇంకా గట్టిగా పదిలమై మీ మనసులోని వేదనను అధికం

చేస్తూందని గ్రహించాను. నిద్రలో మీరు చాలసార్లు ఆ సంభవాన్ని గుర్తుచేసుకొని పిచ్చిపిచ్చిగా కేకలు వేస్తున్నారని మహారాణి తెలియజేశారు. అందువల్ల మీకన్న మలైయమాన్ కుమార్తె అధికంగా వేదనపడ్డారు. కొంతకాలం క్రితం నన్ను సలహా అడిగారు. ఆ ప్రకారమే మేము ఈ ప్రయత్నం చేయాలనే తీర్మానానికి వచ్చాము. మీవల్ల చనిపోయిందని మీరు విచారిస్తున్న ఆ స్త్రీమణిని ఎలాగైన పిలుచుకొని వచ్చి మీముందు నిలబెట్టి, ఆ మీ అపోహను తొలగించాలని ఉద్దేశించాము. ప్రత్యక్షంగా పిలుచుకొని వచ్చి చూపిస్తేనే మీరు నమ్ముతారని భావించాము. ఇది నేరమైతే, దయవుంచి మన్నించాలి!"

చక్రవర్తి ఉక్రోషం పట్టలేక, "అవును, నేరమే! పెద్దనేరం! ఇన్నాళ్ళు ఈమె దెయ్యమై నా చుట్టూ తిరుగాడుతుండేది! కలలో వచ్చి వేధించేది. దెయ్యానికి బదులు ఈ పిచ్చిదాన్ని తీసుకొచ్చి నాముందు నిలబెట్టారు. ఇది నాకు సంతోషాన్నిస్తుందనుకొన్నారా? ఏ నాడూ కాదు, కాజాలదు. మీరు నాకు ముందుగానే నిజాన్ని చెప్పివుంటే ఈమెను ఇక్కడికి పిలుచుకొనివచ్చే ప్రయత్నాన్ని తప్పక తిరస్కరించేవాడిని. పోతే పోనీ, ఏదో చేసేశారు. ఎంతో కష్టపడి ఈ మూగపిచ్చిదాన్ని ఇక్కడికి పిలుచుకొని వచ్చారు కద? మళ్ళీ ఈమెను ఎప్పుడు ఎలా ఇక్కడినుంచి  తిరిగి పంపించేయబోతున్నారు?"

సుందర చోళులు ఇలా అడగగానే, అనిరుద్ధులు నిజంగానే అవాక్కై నిలబడిపోయారు.

అప్పుడు చక్రవర్తిని, "స్వామీ! నా సహోదరిని ఇక్కడినుంచి తిరిగి పంపే ఉద్దేశమే లేదు నాకు. ఈ అంతఃపురంలో వారు నాతోబాటే ఉంటారు. నాకన్న ముందు జన్మించిన అక్కలాగ భావించి పూజించుకొంటాను!" అన్నది.

"దేవీ! నీకు నామీదున్న భక్తిని ఇలా నిరూపించుకోనవసరం లేదు. నీవు కణ్ణగికన్న మేలైన శీలవతివని ఈ ఇరవైయైదేళ్ళలో తెలుసుకొన్నాను. నేను జబ్బుపడ్డప్పటినుంచి నీవు నీ ముద్దుబిడ్డలను కూడ మరిచి, నాకు సేవలు చేస్తూ, నాకు నయం కావాలని నోములు నోస్తూండడం నేనెరుగుదును. అడవిలో తిరుగుతున్న ఈ మూగపిచ్చిదాన్ని పిలుచుకొని వచ్చి నాముందుంచి నీకు నాపట్ల ఉన్న భక్తిని ప్రదర్శించనవసరం లేదు. మలైయమాన్ కూతురా! ఇది విను! ముఖ్యమంత్రీ! మీరు కూడ బాగ వినండి. ఎప్పుడో ఒకానొకప్పుడు నేను ఒంటరిగా, మనుష్యసంచారం లేని ఒక దీవిలో సంచరిస్తున్నప్పుడు ఈ మూగపిచ్చిదాన్ని చూశాను. అప్పుడు ఆమె మీద నాకు ప్రేమ కలిగిందనడం నిజమే. లేదని చెప్పడం లేదు. అందువల్లే నేనింకా ఆమె గురించి తలుచుకొంటూ బెంగపడుతున్నానని మీరు భావిస్తే దానికన్న పెద్ద పొరబాటు ఉండబోదు. అప్పుడు నాకీమె మీద ప్రేమ పుట్టడానికి ఎన్నో కారణాలుండేవి. ఆ ప్రేమ ఈ ఇరవైయైదేళ్ళ కాలంలో ద్వేషంగాను, అసహ్యంగాను మారిపోయింది. కలలోను, స్పృహలోను ఈమె నన్నంతగా వేధించింది. ఈమె అంతఃపురంలో ఉన్నదన్న విషయాన్నే నేను సహించలేకున్నాను. వెంటనే ఈమెనిక్కడినుంచి పంపించేసి తర్వాతి పని చూడండి. ఈమెను దెయ్యమని భావించినందివల్ల ఈమె మీదికి దీపాన్ని విసిరాను. సజీవంగా, సదేహంగా ఉన్నదని తెలిసివుంటే, ఏం చేసేవాడినో తెలియదు!"

ఇలా చక్రవర్తి క్రోధపూరిత స్వరంతో అన్న కఠోరవాక్కులను విని చక్రవర్తిని, ముఖ్యమంత్రి దిగ్భ్రాంతులైనారు. చక్రవర్తి ఇలా అంటారని వారు ఎదురుచూడనే లేదు. అనిరుద్ధులు తాము చేసిన పాత నేరానికి మాత్రమే చక్రవర్తి తమని ఖండిస్తారని భావించారు. మహారాణేమో చక్రవర్తి నోరు తెరిచి బహిరంగంగా చెప్పకపోయినా కూడ, మనసులో సంతోషపడి తన ఉదాత్తకార్యాన్ని చాల మెచ్చుకొంటారని ఎదురుచూసింది.

కానీ ఎదురుచూడని చక్రవర్తి కటువైన మాటలు ఆమెకు ఆశాభంగంతోబాటు చిరాకు, కోపాన్ని కలిగించాయి. చక్రవర్తి, ఇంతవరకన్న మాటలన్నిటినీ మించిపోయేటట్లు, "ఛీఛీ! ఈ మూగ పిచ్చిది ఈ ప్రపంచంలో జీవించివుండకపోతే నష్టమేమిటట? ఇది సముద్రంలో పడ్డప్పుడు నిజంగానే చచ్చిపోయివుంటే ఎంత బాగుండేది! ఏ దద్దమ్మ దీన్ని బయటికి తీసి బతికించాడు?" అన్నారు.

ఇది విన్న తర్వాత మలైయమాన్ కుమార్తె ఇక ఓర్చుకోలేకపోయింది. భావోద్వేగం నిండిన స్వరంతో, "స్వామీ! మీ నోటితోనే అలా అన్నారా? మహాపాపం! చేసిన మేలు మరిచిపోవడం ఎంతటి మహాపాతకమో పెద్దలు చెప్పలేదా? మీ ప్రాణాలను ఈ మహిళామణి కాపాడిన విషయాన్ని కావాలంటే మరిచిపోండి. కానీ మన ముద్దుబిడ్డ అరుళ్మొళిని కాపాడింది మరిచిపోవచ్చా? మీరు మరిచిపోయినా కూడ, నేను మరువలేను. పధ్నాలుగు జన్మలెత్తినా కూడ ఈ దైవసమానురాలికి నేను ఋణపడివుంటాను!" అన్నది.

"దేవీ! ఆ కథను మళ్ళీ చెబుతున్నావా?" అని చక్రవర్తి ఇంకా ముందుకు మాట్లాడేలోపు మహారాణి అడ్డుపడి, "కథ కాదు, స్వామీ! మన బిడ్డ అరుళ్మొళే నాకు చెప్పాడు. కావేరి వెల్లువలో మునిగిపోకుండ కాపాడిన ఆ దేవే తనని లంకలో పలుసార్లు కాపాడిందని చెప్పాడు. మంచివేళగా, వాడు నాగపట్టణానికి వచ్చి చేరి, అక్కడ క్షేమంగా ఉన్నాడు. వాడిని రమ్మనండి. మీరే అడిగి తెలుసుకోవచ్చు!"

"అవునవును! అరుళ్మొళి నాగపట్టణంలో ఉన్నాడు. కానీ వాడు క్షేమంగా ఉన్నాడని ఏం నిశ్చయం? నిన్న వీచిన సుడిగాలిలో వాడికేమైనా ఆపద కలిగిందో, ఏమో? ముఖ్యమంత్రీ! నా మనసు నెమ్మదిగొనలేదు! ఇదీ అని తెలియని అపాయమేదో నా కులాన్ని సమీపిస్తూంది. ఈ సమయాన ఈ మూగ పిచ్చిది ఇక్కడికి వచ్చింది కూడ ఒక అపశకునంలాగే అనిపిస్తూంది..."

"స్వామీ! ఆ సముద్రతీరవాసి కూతురు ఇప్పుడిక్కడికి వచ్చింది అపశకునం కాదు; మంచి శకునం. ఈమె ఇక్కడ ఉండడమే మన కులానికి పెద్ద రక్ష. నేను నిరంతరం పూజిస్తున్న దుర్గాపరమేశ్వరిదేవే నన్ను కరుణించి ఈదేవిని ఇక్కడికి పంపించింది..."

"కానే కాదు! దుర్గాపరమేశ్వరి కాదు, శనీశ్వరుడు పంపించాడు. ఆ పిచ్చిదాన్ని వెంటనే తిరిగి వెళ్ళమని చెప్పేసి, తర్వాతి పని చూడండి. మీరు వీలుకాదంటే, నేనే ఆ కార్యాన్ని చేయవలసివుంటుంది..."

"స్వామీ! నామీద మిక్కిలి కరుణించి నాకీ వరాన్నివ్వండి. అరుళ్మొళి వచ్చి చేరేంతవరకు వారు

ఈ అంతఃపురంలో ఉండేందుకు అనుమతివ్వండి!" అని చక్రవర్తి భావోద్వేగపూరితమైన స్వరంతో చెప్పి, చక్రవర్తి పాదాలను తాకి వేడుకొంది.

"ముఖ్యమంత్రీ! విన్నారా? తెల్లనివన్నీ పాలని ఎంచే మలైయమాన్ కూతురి కోరిక విన్నారా? భగవాన్! ఈ లోకంలో కల్లాకపటం తెలియని ఇంతటి సాధువు కూడ ఉండ సాధ్యమా? ఈమె నన్నేమీ కోరదు. ఇప్పుడేమో ఇలాంటి వరాన్ని కోరుతూంది. దాన్ని నిరాకరించడానికి మనసు రావడం లేదు. కానీ ఆ మూగది ఇక్కడున్న ప్రతినిమిషమూ నాకు నరకవేదనే. కాబట్టి, నాగపట్టణంనుంచి యువరాజును పిలుచుకొని రావడానికి వెంటనే ఏర్పాట్లు చేయండి!"

"అలాగే, ప్రభూ! గజదళాన్ని, అశ్వదళాన్ని పంపించి బహిరంగంగానే పిలుచుకొని రావడమా, లేక..."

"మారువేషం వేయించి రహస్యంగా రప్పిద్దామా అనే కద అడుగుతున్నారు? యువరాజు బహిరంగంగా వస్తే చోళనాడులో చాల సంక్షోభం, కలకలం కలుగుతుందని భావిస్తున్నారు కద?"

"నేననుకోవడం మాత్రమే కాదు, ప్రభూ! ఖచ్చితంగా తెలుసు. ప్రజలు పలుకారణాలవల్ల ప్రకోపించివున్నారు. ఏదైన ఒక నెపం దొరకాలంతే. వెంటనే ప్రజల మనసులో ఉన్న కోపం బయటికి పొంగుతుంది. పళువేట్టరయ్యర్లు, మధురాంతక దేవరు ఏ గతి పాలవుతారో చెప్పలేము..."

"ఇదేం మాట, ముఖ్యమంత్రీ! ప్రజలలా మూర్ఖంగా ప్రవర్తిస్తే, చోళనాడు వీరసైనికులేమైనారు?"

"సైన్యంలోనే ఉద్రిక్తత అధికంగా ఉంది, ప్రభూ! ప్రజలైతే ఒట్టి కేకలతో సరిపెట్టుకొంటారు. సేనవీరులైతే, తంజావూరు కోటనే ఛిన్నాభిన్నం చేసేసి, పళువేట్టరయ్యర్లని, మధురాంతకులను చెరలో వేసేసి, లంకను జయించిన వీరాధివీరులైన అరుళ్మొళిని సింహాసనంమీద కూర్చోబెట్టేంతవరకు ఆగరు..."

"అలా జరగాలని మీరు కూడ మనసులో ఆశపడుతున్నారు. మూర్ఖజ్యోతిష్కులు కట్టిన కథలను నమ్మి దేశప్రజల బుద్ధి కూడ గతి తప్పింది. కానీ మీ మనసులో ఒకటి గట్టిగా పదిలపరుచుకోండి. నా పెద్దనాన్న గండరాదిత్యుల కుమారుడైన మధురాంతకుడే చోళ సింహాసనానికి వారసుడు, హక్కుగలిగినవాడు. వాడికే పట్టం కట్టాలని తీర్మానించేశాను. ప్రజలందుకు ఒప్పుకోకపోయినా సరే, త్రిమూర్తులు వచ్చి అడ్డుకొన్నా సరే, నేను వినను. నా కొడుకులు అందుకు అడ్డుగా నిలబడితే..."

"స్వామీ! అలా ఏనాడూ జరగదు. మీ కోరికకు విరుద్ధంగా మన బిడ్డలు ఏనాడూ అడ్డు చెప్పరు. అరుళ్మొళికి రాజ్యంమీద ఆశే లేదు. లంకారాజ్యపు మణిమకుటాన్ని వాడికిచ్చారు. దాన్ని వాడు వద్దని నిరాకరించాడు. అటువంటి వాడా మీమాటకు ఎదురు చెబుతాడు? కరికాలన్ మాత్రమేమి? వాడికి మీరే యువరాజపట్టాభిశేకం చేశారు. అందువల్ల ఒప్పుకొన్నాడు. వాడి శౌర్యపరాక్రమాలను గురించి నేను చెప్పాలా? వాడు ఆశపడితే, తన చేతనున్న కరవాలం సహాయంతో తానే ఒక పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించుకోగలవాడు కద? కానీ వాడికీ రాజ్యమేలే ఆశ లేదు. మీరు వాడి దగ్గర మీ కోరిక ఇదీ అని ఒక్క

మాట చెప్పాలంతే..."

"నేనా మాటను ఎక్కడ అనబోతున్నాననే కద, ఎన్నిసార్లు చెప్పి పంపినా ఇక్కడికి రాకుండ నాతో చెలగాటమాడుతున్నాడు?"

"చక్రవర్తీ! పట్టపు యువరాజు కంచిలో అద్భుతమైన బంగారు మాళిగను కట్టించి, మీరాక కోసం ఎదురుచూస్తున్నారు..."

"ఎందుకు పేచివున్నాడన్నది నాకు తెలుసు. కంసుడు తన తలిదండ్రులను చెరలో వేసి, తాను సింహాసనమెక్కినట్లు మమ్మల్ని చెరలో వేసి చోళసింహాసనమెక్కాలని చూస్తున్నాడు. వాడు కట్టించింది బంగారు మాళిగో, లేక లక్క మాళిగో ఎవరికి తెలుసు?"

"స్వామీ! కరికాలన్ గురించి మీరిలా మాట్లాడడం చాల క్రూరం!" అన్నది మలైయమాన్ కుమార్తె.

"చక్రవర్తి మనసులో అంత లోతుగా విషమెక్కించివున్నారు!" అన్నారు ముఖ్యమంత్రి.

"ఇంకెవరో కాదు, నా మనసులో విషమెక్కించింది కరికాలనే! వాడు నాకు నిజమైన కొడుకైతే, ఇన్నిసార్లు చెప్పి పంపించినా ఎందుకు రాలేదు?" అని అడిగారు సుందర చోళులు.

"అందుకు ఇంకేపైనా సరైన కారణాలుండవచ్చు కద?"

"మీరే ఒక కారణాన్ని ఊహించి చెప్పండి, చూద్దాం!"

"కరికాలన్ కొళ్ళిడం నదిని దాటి ఇవతలికి వస్తే పళువేట్టరయ్యర్లు ఆయన్ని చెరలో వేస్తారని దేశమంతా చెప్పుకొంటున్నారు..."

"అలా చెప్పి నా కొడుకు మనసునెవరో చెడగొట్టారు! ఈమె తండ్రి తిరుక్కోవలూర్ మలైయమాన్ ఒకడు; కొడుంబాళూర్ వేళార్ ఇంకొకడు. మీరూ వారితో చేరారో ఏమో, తెలియదు."

"స్వామీ! నాకు ఎవరి గురించి కూడ వారి వెనక మాట్లాడే అలవాటు లేదు. కాసేపటి క్రితం మీరే అపాయం గురించి మాట్లాడారు. మీ మనసులో అలా తోస్తూందని చెప్పారు. మీ మనసులో తోచింది పూర్తి నిజం. చోళకులానికి అపాయం దగ్గరవుతూంది. అది రెండు దారుల్లో వస్తూంది. ఈ నాడులో రెండు విధాలైన కుట్రలు జరుగుతున్నాయి. పళువేట్టరయ్యర్లు, శంబువరయ్యర్లు..."

"ముఖ్యమంత్రీ! ఆపండి! పళువూర్ వంశస్థులు నూరేళ్ళుగా చోళవంశానికి సేవ చేస్తూన్నారు. పెద్ద పళువేట్టరయ్యర్ ఇరపై యుద్ధాల్లో ముందు నిలబడి పోరాడి తమ ఒంటి మీద అరవైనాలుగు గాయాలను భరించినవారు. అటువంటాయన చోళకులానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారనడంకన్న, సూర్యుడస్తమించాడని, సముద్రంలో నీరింకిపోయిందని చెబితే నమ్మవచ్చు..."

"చక్రవర్తీ! సూర్యుడికి కూడ గ్రహణం పడుతూంది. సముద్రంలో కూడ బడబాగ్ని రగులుతూంది. కానీ నేను దాన్ని గురించి చెప్పడం లేదు. పళువేట్టరయ్యర్లు చోళకులానికి ఎదురుగా కుట్ర

పన్నుతున్నారని నేను చెప్పడమే లేదు. మధురాంతకులకు పట్టం కట్టేందుకు వారు పెద్ద ప్రయత్నం చేస్తూన్నారు...”

“మహా శివభక్తులైన గండరాదిత్యుల కుమారునికి పట్టం కట్టాలనుకోవడంలో తప్పేమి? న్యాయంగా చూడబోతే మధురాంతకుడే కద సింహాసనానికి అర్హుడు?” అన్నారు చక్రవర్తి.

“నేనూ అదే చెబుతున్నాను. పైగా, మీరే మనసారా మధురాంతకులకు చోళవంశ మణిమకుటాన్ని ధరింపజేయడానికి తీర్మానించేశారు. అలా ఉన్నప్పుడు పళువేట్టరయ్యర్ల నేరమేమి? మీ కోరికను నెరవేర్చేందుకే వారు ప్రయత్నిస్తున్నారు...”

“కాబట్టి వారు నా కృతజ్ఞతకు మరింత పాత్రులైవున్నారు.”

“కానీ, చక్రవర్తీ! మీ అనుమతి తీసుకోకుండ వారు కొన్ని కార్యాలను చేశారు. రాజ్యాన్ని రెండుగా విడగొట్టి కావేరికి దక్షిణంగా ఉన్న భాగాన్ని మధురాంతకులకు, ఉత్తరాన ఉన్న భాగాన్ని పెద్ద యువరాజుకు (కరికాలన్) ఇచ్చేసేటట్లు మంత్రాలోచన చేస్తున్నారు. శంబువరయ్యర్ మాళిగలో ఇప్పుడు ఆ విషయమై మాట నడుస్తూంది. చక్రవర్తీ! నూరేళ్ళుగా మీ పూర్వీకులు కష్టపడి విస్తరించిన రాజ్యాన్ని, విజయాలయ చోళులు, ఆదిత్యులు, మహాపరాంతక చోళులు లంకనుంచి గోదావరి వరకు విస్తరింపజేసిన మహాసామ్రాజ్యాన్ని రెండుగా విడగొట్టడం మీకు సమ్మతమేనా?”

“ముఖ్యమంత్రీ! అందుకు నేనేనాడూ సమ్మతించను. చోళరాజ్యాన్ని విడగొట్టే ముందు నన్నే రెండుగా చీల్చేయండని చెబుతాను. పళువేట్టరయ్యర్ అటువంటి ప్రయత్నంలోకి దిగారంటే నేను నమ్మను. ఒకవేళ అది నాకు ఇష్టమైన కార్యమని వారికి తోచివుండవచ్చు. నా కుమారునికి సగం రాజ్యమైనా వస్తుంది కద అని నేను సంతోషపడతానని వారు భావించి ఈ ఆలోచనను చేబట్టివుండవచ్చు. అది నాకిష్టం లేదని తెలిస్తే వదిలేస్తారు. ముఖ్యమంత్రీ! ఈ చోళరాజ్యంలో ఒక్క అంగుళం కూడ తగ్గించక పూర్తి రాజ్యాన్ని మధురాంతకునికి కట్టబెడతాను. దాన్ని నా బిడ్డలే ఎదిరించినా సరే, పళువేట్టరయ్యర్లు ఎదిరించినా సరే, నేను వినను...”

“చక్రవర్తీ! పళువేట్టరయ్యర్లు ఎదిరిస్తే/వ్యతిరేకిస్తే పట్టించుకోనవసరం లేదు. తమ కుమారులేమో ఎదిరించబోవడం లేదు. కానీ మధురాంతకులకు పట్టం కట్టడానికి అడ్డం వస్తున్నది చాల పెద్ద చోటునుంచి. మీరు, నేను, ఈ సమస్త చోళసామ్రాజ్య ప్రజలు పూజించే దైవసమానులైన స్త్రీమణి నుంచి వస్తూంది అభ్యంతరం. కొన్నాళ్ళ క్రితం కూడ వారితో మాట్లాడి చూశాను...”

“మీరు శెంబియన్ మహాదేవిని సూచిస్తున్నారు. ఆ మహిళామణి మనసును కూడ ఎవరో చెడగొట్టారు. నేను నా కుమారులకు పట్టం కట్టాలని ఆశపడుతున్నానని పెద్ద మహారాణి భావిస్తున్నారు. వారిని వెంటనే ఇక్కడికి పిలుచుకొని రావడానికి ఏర్పాట్లు చేయండి. నేను వారి మనసును మార్చేస్తాను...”

“చక్రవర్తీ! అదంత తేలిక కాదు. మహానుభావులైన గండరాదిత్యులు తమ ధర్మపత్నికి అలా

ఆజ్ఞ విధించి వెళ్ళారు. ఆయన మరణించే ముందు నేనాయన పక్కనే ఉన్నాను. 'మధురాంతకునికి పట్టం కట్టకూడదనానికి ముఖ్యకారణముంది; అది నా జీవనసహచరికి తెలుసు' అని తమ పెదనాన్న చెప్పి వెళ్ళారు..."

"ముఖ్యమంత్రీ! అటువంటి అడ్డంకి నిజంగానే ఉందా? ఉంటే అదేమని మీకు తెలుసా?"

"తెలిస్తే, మీరడిగేంతవరకు వేచివుంటానా? పెద్ద మహారాణిని పిలిపించి మీరే వారిని అడిగి తెలుసుకోవాలి..."

"అవును; ఆ ఒక్క విషయం మాత్రమే నాకు ఇబ్బంది కలిగిస్తూంది. పెద్ద మహారాణిని పిలుచుకొని రావడానికి వెంటనే ఏర్పాట్లు చేయండి. ఎటువంటి పెద్ద ఆటంకమైనా, దాన్ని నేను నివృత్తి చేస్తాను. వారిని పిలుచుకొని రావడానికి ఎవరిని పంపిద్దాం? ఏల, నా కుమార్తెనే పంపిస్తాను. దేవీ! కుందవైని వెంటనే ఇక్కడికి పిలుచుకొని రా!" అని సుందర చోళ చక్రవర్తి మలైయమాన్ కుమార్తెకు చెప్పారు.

చక్రవర్తికి, ముఖ్యమంత్రికి మధ్య జరుగుతున్న సంభాషణను వాణమాదేవి ఒక చెవితో వింటూన్నా కూడ, ఆమె ధ్యానమంతా కాసేపటి క్రితం అక్కడినుంచి అవతలికి వెళ్ళిన మూగరాణిమీదే ఉంది. కాబట్టి చక్రవర్తి కుందవైని పిలుచుకొని రమ్మనగానే మలైయమాన్ కుమార్తె వేగంగా అంతఃపురంలోకి వెళ్ళింది. ఆమె అంతఃపురం చేరినప్పుడు కుందవై, వాణతి, పూంగుళలి మొదలైనవారు చాల దిగులులో మునిగివుండడాన్ని గమనించింది. అందుకు కారణాన్ని కూడ మహారాణి వెంటనే తెలుసుకొంది. మూగరాణి అక్కడ అగుపించలేదు. ఎక్కడని మహారాణి చాల దిగులుతో అడినప్పుడు కుందవై ఇలా ఉత్తరమిచ్చింది: "అమ్మా! తమ ఆజ్ఞను నెరవేర్చడం అంత సులభసాధ్యంగా లేదు. అయినా కూడ మేము ముగ్గురం చేరి మందాకినీదేవికి స్నానం చేయించాము. తర్వాత కొత్త బట్టలు కట్టించాము. వాణతి వారి తల దువ్వి జడ వేస్తూంది. పూంగుళలి పూలు తొడుగుతూంది. ఆభరణాలను తీస్తున్నప్పుడే, ఈమె కేక వినిపించింది. తిరిగి వచ్చి చూస్తే మందాకినీ దేవి లేదు. వెంట్రుకలు దువ్వి ముడివేయగానే, ఉన్నట్లుండి వారు లేచి పారిపోయారట. చుట్టుపక్కల గదుల్లో ఎక్కడా కనిపించలేదు. ఇంకా వెతుకుతున్నాము!"

ఇది విన్న మలైయమాన్ కుమార్తె చిరునవ్వు నవ్వింది. "వారికి అలంకారం చేస్తున్నప్పుడు ఎదురుగా అద్దముందా?" అని అడిగింది.

"అవును; కాస్త దూరాన" అన్నది వాణతి.

"వారి అలంకృత రూపాన్ని యధాలాపంగా అద్దంలో చూసివుంటారు. అది వారికి సిగ్గు కలిగించివుంటుంది. అందుకని పరుగెత్తి పారిపోయి ఎక్కడైన దాక్కొనివుంటారు. ఇంకా బాగ వెతికిచూడండి. ఒకవేళ అంతఃపురం పూలతోటలోకి వెళ్ళి దాక్కొనివున్నా ఉండవచ్చు. గోడెక్కి దూకడం, పైమేడనుంచి స్తంభాల వెంట కిందికి దిగడంలాంటి కార్యాలు వారికి అలవాటే కద?" అన్నది చక్రవర్తిని.

తర్వాత అందరూ నందనవనానికి వెళ్ళి వెతికారు. అక్కడ మూగరాణి కనపడలేదు; వారి దిగులు అధికమైంది. ముఖ్యమంత్రికి, చక్రవర్తికి వెళ్ళి తెలియజేద్దామా అని వారనుకొంటున్నప్పుడే ఎక్కడినుంచో 'ఠనేల్ ఠనేల్మని' ఒక శబ్దం వినిపించింది. నల్లరాతిని ఇనుపసుత్తితో కొడుతుండడంలాంటి శబ్దం. అదెక్కడినుంచి వస్తూందని చెవులు రిక్కించి విన్నారు. శిల్పమంటపంనుంచి వస్తూందని తెలిసింది. వెంటనే ఒక దాదిపిల్లని దీపం తీసుకొని రమ్మని చెప్పేసి అందరూ శిల్పమంటపానికి వెళ్ళారు. అప్పుడక్కడ వారొక వింతైన దృశ్యాన్ని చూశారు. ఒకింత వస్త్రాభరణాలు ధరించివున్న మందాకినీదేవి చేత ఒక పొడవాటి పిడివున్న సుత్తి పట్టుకొని కైలాసగిరిని ఎత్తిపట్టుకొన్న రావణుని చేతులను బలంగా కొడుతూంది. చాల గట్టిరాతితో చేసినందువల్ల రావణుని శిల్పం అంతవరకు ఆ సుత్తి దెబ్బలకు ఏమాత్రం చెక్కుచెదరలేదు. కానీ ఆ రావణునికి త్వరలోనే ఆపద వస్తుందనిపించింది. కైలాసగిరిని ఎత్తిపట్టుకొన్న రావణుని చేతులలో ఒకట్రెండు విరిగితే ఆ పర్వతం వచ్చి వాడి తలలమీదే కూర్చొంటుంది! తలలు ముక్కలుచెక్కలైపోవచ్చు! అటువంటి క్లిష్టపరిస్థితిలోనే కుందవై మొదలైనవారు ఆ శిల్పమంటపంలోకి ప్రవేశించారు.

వారి రాకను చూడగానే ఆమె తన చేతనున్న సుత్తిని కింద పడవేసి వచ్చినవారిని చూసి చిరునవ్వు నవ్వుతూ నిలబడింది.మంటపంలో ప్రవేశించినవారిలో పూంగుళలి తప్ప తక్కిన వారందరూ "ఈమె నిజంగా పిచ్చిదే! చక్రవర్తి ఈమెను చూసి అసహ్యించుకోవడంలో ఆశ్చర్యంలేదు!" అనుకొన్నారు.

మలైయమాన్ కుమార్తె తక్కినవారిని చూసి, "అమ్మాయిలూ! ఈ సంఘటన గురించి చక్రవర్తి ముందు ప్రస్తావించకండి!" అని హెచ్చరించింది.

~~~
~~~

# అధ్యాయము - 35

## చక్రవర్తిని కోపం

**మందాకినిని** చక్రవర్తిని, తక్కిన అంతఃపురస్త్రీలు శిల్పమంటపంలో కనిపెట్టిన సమయాన చక్రవర్తికి, ముఖ్యమంత్రికి మధ్య తీవ్రమైన వాగ్వివాదం నడుస్తూంది. మలైయమాన్ కుమార్తె అక్కడినుంచి వెళ్ళగానే ముఖ్యమంత్రి అనిరుద్ధులు, "రారాజా! స్త్రీమణులున్నప్పుడు కొన్ని విషయాలు చెప్పకూడదని చెప్పలేదు. ఇప్పుడు వాటిని చెప్పి తీరాలి. వీరపాండ్యుని ఆపత్కాల సహాయకులు ఇంకా ఈ చోళనాడులో రహస్యంగా తిరుగాడుతున్నారు. వారు చేసిన క్రూరమైన, కఠినమైన శపథాన్ని నెరవేర్చేందుకు తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నారు" అన్నారు.

"ఇదేమీ కొత్త విషయం కాదు కద? నాకు తెలిసిన వార్తే కద? పళువేట్టరయ్యర్లు ఆ కారణంగానే నాకింత బలమైన రక్షణ ఏర్పాటు చేశారు కద?" అంటూ చక్రవర్తి హేళనగా నవ్వారు.

"ఆపత్కాల సహాయకుల విషయం మీకు తెలిసిందే. కానీ ఆ కుట్రదారులకు చోళరాజ్యపు బొక్కసంనుంచే ధనసహాయం వెళూతూందన్న విషయం మీకు తెలియసాధ్యం లేదు!" అన్నారు ముఖ్యమంత్రి.

"ఆహా! ఇదేం కట్టుకథ!" అన్నారు చక్రవర్తి.

"దీనికన్న విపరీతమైన కట్టుకథలు కొన్నింటిని నేను మీకు చెప్పవలసివుంది. పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసంనుంచి కొత్త బంగారు కాసులు ఆ కుట్రదారులకు ధారాళంగా సరఫరా అవుతున్నాయి. కళ్ళారా చూసిన నా శిష్యుడు తిరుమలై ఇదిగో ఇక్కడే ఉన్నాడు. మీరు అనుమతిస్తే అదంతా వివరంగా చెబుతాడు..."

"అవసరం లేదు; తరతరాలుగా చోళకులానికి తమ ప్రాణాలొడ్డి, రక్తం చింది సేవ చేస్తూన్నవారు పళువేట్టరయ్యర్లు. వారు నన్ను హత్య చేసేందుకు కుట్రదారులకు నా బొక్కసంనుంచే ధనరాసులను తీసి ఇస్తున్నారని హరిశ్చంద్రుడే వచ్చి చెప్పినా నమ్మను."

"మన్నించాలి. పళువేట్టరయ్యర్లమీద నేనటువంటి నిందను మోపడంలేదు. వారికి తెలియకుండానే మన బొక్కసంనుంచి ధనరాసులు వెళుతూండవచ్చు కద?"

"అదెలా సాధ్యం? యముడికి తెలియకుండ ప్రాణాలు పోవడం సాధ్యమా?"

"ఒకవేళ యముడు వృద్ధాప్యంలో ఒక యవ్వనవతిని వివాహమాడివుంటే అది కూడ సాధ్యం ప్రభూ!"

"పెద్ద పళువేట్టరయ్యర్ ఈ వయసులో పెళ్ళిచేసుకొన్న విషయం నాకు కూడ నచ్చలేదు. దాన్ని

సేనాయనకే చెప్పాను కూడ. అందుకని ఇలాగ ఆయన మీద ద్రోహనింద మోపడాన్ని నేను సహించలేను."

"చక్రవర్తీ! పళువేట్టరయ్యర్ మీద నేను ద్రోహనింద మోపడం లేదు. ఆయన పెళ్ళిచేసుకొన్న యువరాణి మీదే నింద మోపుతున్నాను."

"మగవాళ్ళమీద నింద మోపడాన్నైనా ఓర్చుకోవచ్చు. దౌర్భాగ్యవతియైన ఒక అబల మీద మీరు నింద మోపడం నాకు ఏవగింపును కలిగిస్తోంది."

"ఎంత ఏవగింపైన, పళువూర్ యువరాణి గురించిన కొన్ని నిజాలను నేను మీకు చెప్పి తీరాలి. ఒకసారి తమకు ఒక నిజాన్ని సరైన సమయాన చెప్పకపోవడం వల్ల తర్వాత నేను విచారపడవలసివచ్చింది. కాసేపటి క్రితం తమరు కూడ కోపించుకొన్నారు. కాబట్టి కాస్త ఓపికగా వినాలి."

ముఖ్యమంత్రి చతురభాషణను విని చక్రవర్తి చిరునవ్వు నవ్వారు.

"నా మాటనే నామీదకు తిప్పుతున్నారు. అది నా వ్యక్తిగత విషయం. దానికీ, దీనికీ ఏ సంబంధమూ లేదు. కానీ  చెప్పండి, వింటాను" అన్నారు.

"పళువూర్ పెద్ద అంతఃపురానికి మూడేళ్ళ క్రితం యువరాణి నందినీదేవి వచ్చారు. అప్పటినుంచి పళువూర్ అంతఃపురానికి కొందరు మాంత్రికులు వస్తూ పోతున్నారు. ఇది చిన్న పళువేట్టరయ్యర్‌కి కూడ తెలుసు. ఆయనక్కూడ అలా ఆ మాంత్రికులు వస్తూ పోతూండడం నచ్చలేదు. అయినా కూడ అన్నగారిని ఎదిరించి మాట్లాడలేక ఊరకున్నారు."

"సహోదరులంటే, ఇలాగే ఉండాలి!"

"సహోదరవిశ్వాసం వల్ల రాజ్యానికి ఆపద రాకూడదు కద?"

"ఇప్పుడు రాజ్యానికి ఏం కీడొచ్చింది?ఒక పేద పిల్ల మాంత్రికులను పిలిపించుకొని మంత్రం వేయించుకొంటే రాజ్యమే నాశనమైపోతుందా? పళువూర్ యువరాణి మంత్రం వేసినందువల్లే నేను జబ్బు పడ్డానంటున్నారా?"

"చక్రవర్తీ! పళువూర్ యువరాణిని చూడవచ్చేవారు నిజానికి మాంత్రికులు/మంత్రవాదులు కారు. మాంత్రికులని చెప్పుకొంటూ లోపలికొస్తున్న కుట్రదారులని సందేహిస్తున్నాను. వారి ద్వారా మన బొక్కసంనుంచి ధనరాసులు వీరపాండ్యుని ఆపత్కాలసహాయకులకు వెళుతూందని కూడ బలంగా సందేహిస్తున్నాను."

"దేని గురించైన, ఎవరి గురించైన సందేహించవచ్చు. కానీ ఋజువేమిటి?"

"రారాజా! నేడే పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురాన్ని సోదా చేస్తే ఋజువు దొరుకుతుంది."

"దీనికన్న ఏవగింపైన కార్యాన్ని చేయమని నాకెవరూ ఇంతవరకు చెప్పలేదు. అనిరుద్ధులుగారూ! మీరు నాకు మాత్రమే స్నేహితులు. పళువేట్టరయ్యర్లు నాకు మునుపు మూడుతరాల చోళవంశ చక్రవర్తులకు ప్రాణస్నేహితులు. చోళకులానికి ఉక్కు కవచంలాంటి వారు. చోళుల పగవారికి

ఇంద్రుని వజ్రాయుధంలాంటివారు. అటువంటివారి మాళిగను వారు లేనప్పుడు శోధించడమా? పళువేట్టరయ్యర్ తమ అంతఃపురంలో కుట్రదారులకు తావిచ్చారని నమ్మడంకన్న, మలైయమాన్ కుమార్తె నాకు మందని చెప్పి విషాన్నిస్తూందని చెబితే నమ్ముతాను..."

"చక్రవర్తీ! నేను కోరుకొనేదీ అదే. నందినీదేవి కోపాన్ని చల్లార్చేందుకు ఇంకా కొన్ని ముఖ్యమైన కారణాలున్నాయి. నందిని వచ్చి చేరేంతవరకు లంకారాణి మన అంతఃపురంలో ఉండేందుకు అనుమతి కావాలి..."

"ఆహా! ఆమెకు 'లంకారాణి' అని పట్టం కట్టేశారు కద? పోతే పోనీ. ఆమెకు, పళువూర్ యువరాణికి ఏం సంబంధం?"

"అదే కనిపెట్టాలి, ప్రభూ! ఇద్దరూ ఒకరినొకరు ప్రత్యక్షంగా చూస్తే బహుశ ఆ సంబంధమేమని తెలియరావచ్చు. నందినీదేవి చోళకులంమీదగొన్న పగ కూడ ఒక వేళ మారవచ్చు..."

"ముఖ్యమంత్రీ! ఒక స్త్రీ పగ గురించి మీరింతగా దిగులు చెందడం నాకు చాల ఆశ్చర్యంగా ఉంది.."

"నందినీదేవి పగ గురించి దిగులుపడేందుకు చాల ముఖ్యమైన కారణముంది. అది నేను చెప్పడం ఉచితమేనా అని జంకుతున్నాను..."

"మీరే నాకు చెప్పడానికి జంకితే ఇంకెవరు నాకు చెప్పగలరు? మిగల్చకుండ అంతా చెప్పేయండి!" అన్నారు చక్రవర్తి.

ముఖ్యమంత్రి కాసేపాలోచించిన తర్వాత ఇలా చెప్పారు: "రారాజా! ఇప్పుడు నేను చెప్పబోయేది చాల చిక్కులతో కూడుకొన్న విషయం. మీకది వినడం ఇష్టం లేకపోవచ్చు. అయినా కూడ ఓపికతో వినండి. నందినీదేవిని, మందాకినీదేవిని చూసినవారందరూ వారి ముఖకవళికల్లోని పోలికలను చూసి అమితాశ్చర్యంగొన్నారు..."

"లోకంలో ఇలాంటి విచిత్రాలెన్నో ఉన్నాయి. ఒక చెట్టులాగే ఇంకొక చెట్టు ఉండవచ్చు, ఉంటుంది. ఒక పిచ్చిదానిలాగ ఇంకొక పిచ్చిది ఉంటూంది..."

"కానీ ఒక చెట్టు ఇంకొక చెట్టులాగ వేషం వేసుకొని నడవడం లేదు. ఒక పిచ్చిది ఇంకొక పిచ్చిదాని ఆత్మారూపంలాగ వచ్చి చక్రవర్తిని హింసించడం లేదు..."

"ఏమంటున్నారు, ముఖ్యమంత్రీ?"

"మందాకినీదేవి ఆత్మ రాత్రుల్లో వచ్చి తమను హింసిస్తూందని ఎంచి మీరు మనోవేదన అనుభవించేవారు..."

"ఆమె ఆత్మ రాలేదు, ఆమే వచ్చిందంటున్నారా?"

"లేదు, లేదు. పళువూర్ యువరాణి, మందాకినీదేవి ఆత్మలాగ వచ్చి తమను

హింసించివుండాలి అంటున్నాను."

సుందర చోళ చక్రవర్తి కాస్త నిటారుగా కూర్చొని, కోపోద్వేగంతో, "మీరిప్పుడు చెబుతున్నది గనక నిజమని నిరూపించబడితే, ఆ రాక్షసిని నా చేతులతోనే గొంతు పిసికి..." అని చెప్పబోయేలోపు, ముఖ్యమంత్రి అడ్డుపడి, "వద్దు, చక్రవర్తీ! మీ నోట అటువంటి మాట రానే రాకూడదు!" అని కంగారుతో అన్నారు.

"ఏల? దానీమీద మీకేమంత కనికరం? నన్నింతగా బాధించినదాన్ని ఏం చేస్తేనేం?" అని సుందర చోళులు ఉక్రోషం వెళ్ళగక్కారు.

"ఎంత కష్టపెట్టివున్నా కూడ, అలా కష్టపెట్టినవారు తమకు చాల దగ్గరి బంధువైన పక్షాన...ఒకవేళ సొంత కూతురైతే..." అంటూ కాస్త జంకుతూ ఆగారు ముఖ్యమంత్రి.

"ముఖ్యమంత్రీ! ఇదేం ప్రేలాపన?" అన్నారు చక్రవర్తి.

"చక్రవర్తీ! తమ ఓపికను నిజంగానే పరీక్షించేశాను. అందుకు నాకు తగిన శిక్ష విధించండి. కానీ నందినీదేవిని శిక్షించడం గురించి మాత్రం మాట్లాడకండి. నందినీదేవి ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ యువరాణి మాత్రమే కాదు; ముల్లోకాలనేలే సుందర చోళ చక్రవర్తి కుమార్తె. వారిని ఏ నేరానికైన ఎవరు శిక్షించగలరు?" అన్నారు అనిరుద్ధ బ్రహ్మరాయలు.

ఇది విన్న చక్రవర్తి కాసేపు ముఖ్యమంత్రిని అలవిగాని దిగ్భ్రాంతితో చూస్తూండిపోయారు. తర్వాత 'గొల్లు'మని నవ్వారు.

"చక్రవర్తీ! ఈరోజు చాల మంచిరోజు/శుభదినం. రెండుసార్లు మీరు నవ్వగా విన్నాను" అన్నారు ముఖ్యమంత్రి.

"బ్రహ్మరాయా! ఈ అంతఃపురంలో ఇప్పుడు ఒక పిచ్చిది మాత్రమే ఉందనుకొన్నాను. మీరు ఆమె కన్న పెద్ద పిచ్చివారని ఇప్పుడు గ్రహించాను. ఆమె మాట్లాడలేని మూగపిచ్చిది; మీరు మాట్లాడే పిచ్చివారు!" అనేసి సుందర చోళ చక్రవర్తి మళ్ళీ మళ్ళీ నవ్వారు.

~~~
~~~

# అధ్యాయము - 36

## నడిరాత్రి తర్వాత

**సుందర** చోళులు అలా నవ్వుతున్నప్పుడే, స్త్రీమణులక్కడికి వచ్చి చేరారు. ముందుగా మహారాణి, వారి వెనుక కుందవై ఒకవైపు, వాణతి ఇంకొకవైపు పట్టి లాక్కొని రాగా మందాకిని, వారి వెనుక పూంగుళలి, ఒక దాది పిల్ల అంతా ఒక ఊరేగింపులాగ వచ్చారు. సుందరచోళుల నవ్వు వారికి కూడ కాస్త కుతూహలాన్ని కలిగించింది. మందాకినేమో చక్రవర్తిని ఒక క్షణం తలెత్తి చూడడం, మరుక్షణం నేలను చూడడంగా ఉంది. ఆమె అలంకారం ఇప్పుడు పూర్తయింది. కుందవై యువరాకుమారి అలంకారకళలో సాటిలేని మేటి నైపుణ్యత కలదని ఆ కాలంలో పేరుప్రఖ్యాతులు గాంచింది. అందుకోసమే చిన్నరాజులు, సామంతరాజులు తమ కుమార్తెలను కుందవైదేవికి చెలికత్తెలుగా ఉండడానికి పళైయారైకి పంపేవారు. కుందవై తన సమస్తనైపుణ్యాన్ని మందాకినిని అలంకరించడంలో చూపించింది. మనసు లోలోపల కలిగిన ఒక గుర్తు తెలియని అనుభూతి ప్రేరేపించగా, మందాకినికి జడవేసేటప్పుడు, నందినిలాగే అండాళ్ తలకట్టులాగ అలంకరించింది. ఈ అలంకారం ముగియగానే ఆ స్త్రీమణులందరికీ ఆమె అచ్చం నందినిలాగే ఉండడం చక్కగా తెలిసిపోయింది. అడవిలో తిరుగాడి మంచి దేహదారుఢ్యం కలిగివుండడం వల్ల వయసులో ఇరవైయైదేళ్ళ తేడా ఉన్నా కూడ అది తెలియలేదు. తక్కిన స్త్రీలు మందాకినిని కాస్త గర్వంగానే పిలుచుకొని వచ్చారు. ఒక్కొక్కరు ఒక్కొక్క కారణంవల్ల అలా గర్వపడసాగారు.

ఈ చారిత్రక వృత్తాంతం జరిగిన రోజుల్లో, తమిళనాడులో పెద్ద రాజులు, చిన్నరాజులు బహుభార్యాసంప్రదాయాన్ని పాటించడం పరిపాటిగా ఉండేది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. ఆ యుద్ధాల్లో రాకుమారులెప్పుడూ ముందుండేవారు. కాబట్టి రాజవంశం నశించిపోకుండేందుకు రాజవంశస్త్రీలు పలువురిని వివాహమాడడం పరిపాటిగా ఉండేది. పట్టమహిషి తక్కిన రాణులను ద్వేషించకుండ వారిని ఆదరంగా చూసుకోవడం ఒక మహత్తరమైన గుణంగా ఉండేది. ఆ విధంగానే మలైయమాన్ కుమార్తె ఇప్పుడు ఉత్సాహంగోనివుంది. కుందవై అలంకారనైపుణ్యాన్ని చూసి మెచ్చుకొంది. పిచ్చిదానిలాగ కనిపిస్తున్న ఒక ఆడదాన్ని సాటిలేని యవ్వనసౌందర్యవతిగా కద కుందవై మార్చేసింది? పూంగుళలేమో తన అత్తకు అంతఃపురంలో ఇంతటి రాజోపచారాలు జరగడం చూసి విస్తుపోయింది. ఆమె ఎదురుచూసినదానికి వ్యతిరేకంగ కద అంతఃపురస్త్రీలు నడుచుకొంటున్నారు?

ఇలా గర్వోత్సాహాలతో ఆ గదిలో ప్రవేశించిన ఆ అంతఃపురస్త్రీల ఊరేగింపును తల తిప్పి చూశారు చక్రవర్తి. వారి నవ్వు ఆ క్షణమే ఆగిపోయింది. మందాకిని నూతనరూపం ఆయనకే అలవిగాని ఆశ్చర్యాన్ని కలిగించింది. తాము తమ కళ్ళముందు చూస్తున్నది నిజమేనా అని నిశ్చయం చేసుకోవడానికి

కళ్ళు రుద్దుకొని మళ్ళీ పరీక్షగా చూశారు. కాసేపటి క్రితం ముఖ్యమంత్రి చెప్పిన వివరాలన్నీ ఆయన మనసులో గట్టిగా పదిలమైవున్నాయి. కొంతకాలంగా నడిరాత్రి తనకెదురుగా కనిపించి తనని వేపుకు తింటున్న రూపానికి, మందాకిని రూపానికి ఉన్న పోలిక ఆయనకు బాగ తెలిసివచ్చింది. అదే సమయాన కొన్ని తేడాలను కూడ గమనించారు. ఇందు గురించిన మర్మాన్ని పూర్తిగా ఆరా తీసి నిజం తెలుసుకోవాలన్న కోరిక ఆయన మనసులో గట్టిగా కలిగింది. కానీ మందాకిని మీద ఆయనకు మొదట కలిగిన చిరాకు, ఏవగింపు మాత్రం మారలేదు. కానీ దాన్ని బయటికి చూపించుకోకూడదని తీర్మానించుకొన్నారు.

ఆయన అనిరుద్ధులను చూసి, “ముఖ్యమంత్రీ! కాసేపటి క్రితం నేను మిమ్మల్ని పిచ్చివారన్నాను. భ్రమ, పిచ్చి అంతా నాకు మాత్రమే అనుకొన్నాను. ఇకమీదట ప్రతిరోజు వైద్యులు మాత్రం వచ్చి నన్ను చూసి వెళితే చాలదు; మందాకినిని కూడ పంపించవలసిందే. పళువూర్ రాణిని చూసేందుకు వచ్చే మాంత్రికుడిని పట్టి ఇక్కడికి పంపించినా కూడ ఫరవాలేదు!” అని మెల్లగా అన్నారు.

అనిరుద్ధుల మనసులో ఒక చిన్న భయం తలెత్తింది. 'ఆ మంత్రవాదుల్లో ఎవడూ చక్రవర్తిని సమీపించకుండుగాక' అని మనసులోనే అనుకొని, “రారాజా! మాంత్రికులెందుకు? మంత్రాలెందుకు? శ్రీమన్నారాయణుని నామంకన్న శక్తివంతమైన మంత్రం ఇంకేదీ లేదు!” అన్నారు.

కుందవై యువరాకుమారి, “నాన్నా! నన్ను రమ్మన్నారట? పళైయారైకి వెళ్ళాలన్నారట? మేమందరమూ వెళ్ళవచ్చా?” అన్నది.

చక్రవర్తి అందుకు ఉత్తరమివ్వక, ముఖ్యమంత్రిని చూసి, “అనిరుద్ధులుగారూ! నేను నా మాటను మార్చేసుకొంటున్నాను. ఈ స్త్రీలు ఎందుకో చాల ఉత్సాహంగ ఉన్నారు. ఇంటికి కొత్త కోడలు వచ్చినట్లు మురిసిపోతున్నారు. ఈ సమయాన వీరిని విడదీయడం నాకిష్టం లేదు. మీరు కాసేపటి క్రితం చెప్పినట్లు వీరందరూ కొన్నాళ్ళపాటు ఇక్కడే ఉండనీ. శెంబియన్ మహాదేవి మీపట్ల చాల నమ్మకం, గౌరవం కలిగినవారు. కాబట్టి మీరే వెళ్ళి స్వయంగా వారిని పిలుచుకొని రండి! తమ శిష్యుని నాగపట్టణానికి పంపండి. పెద్ద పళువేట్టరయ్యర్ని, వారి యువరాణిని వెంటనే పిలుచుకొని రావడానికి ఏర్పాట్లు చేయమని నేనే చిన్న పళువేట్టరయ్యర్‌కి చెబుతాను!” అన్నారు.

“అలాగే చేద్దాం, చక్రవర్తీ! కానీ అందరూ వచ్చి చేరేందుకు కొన్నిరోజులు పట్టవచ్చు. నిన్న వీచిన సుడిగాలి వల్ల నదులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి!” అన్నారు ముఖ్యమంత్రి.

“అందువల్ల ఇబ్బందేమీ లేదు; ఇన్నాళ్ళు ఓపిక పట్టిన మనం ఇంకొన్నాళ్ళు ఓపిక పట్టడంవల్ల నష్టమేమీ లేదు. కరికాలన్ని కూడ పిలుచుకొని రావడానికి ఏర్పాట్లు చేస్తే అన్ని విషయాలను కూడ మాట్లాడి తీర్మానించవచ్చు. వాడింకా రావడానికి నిరాకరిస్తే నేనే బయల్దేరి వెళ్ళవలసిందే. దాని గురించి తర్వాత మాట్లాడుకొందాం. మీరు రేపే బయల్దేరి వెళ్ళి పెద్ద మహారాణిని మీతోటే పిలుచుకొని రండి! వెళ్ళే

దారిన సుడిగాలి వల్ల కష్టనష్టాలకు లోనైన ప్రజలను కూడ కాస్త గమనించండి. మన కుటుంబ విషయాల్లో మునిగిపోయి ఆ ముఖ్యమైన కార్యాన్ని మరిచేపోయాము" అన్నారు చక్రవర్తి.

"లేదు, ప్రభూ! అది నేను మరిచేపోలేదు. అన్ని కార్యాలు కూడ సజావుగా జరుగుతాయి; మీరు నెమ్మదిగా ఉండండి" అని చెప్పేసి ముఖ్యమంత్రి సెలవు తీసుకొని వెళ్ళారు.

ఆ రాత్రి చక్రవర్తి నిజంగానే ఇన్నాళ్ళు అనుభవించని నెమ్మదిని అనుభవించారు. మందాకిని చనిపోలేదన్న నిజం ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళుగా ఆయన మనసులో గూడుకట్టుకొన్న ఒక పెద్ద భారాన్ని తొలగించింది. అరుళ్మొళివర్మ నాగపట్టణంలో ఉన్నాడన్న వార్త కూడ ఆయనకు ఊరట కలిగించింది. చూడామణి విహారం చాల బలమైన కట్టడం కాబట్టి అందులో ఉన్నవారికి ఎటువంటి అపాయం కూడ కలగదని ఆయన ధైర్యంగొన్నారు. పళువూర్ యువరాణి ఆయన కుమార్తె అయివుండవచ్చని ముఖ్యమంత్రి చెప్పిన విషయం ఆయనకు చాల వింతగా/చోద్యంగా అనిపించింది. ఇది చక్రవర్తి ముఖంలో అప్పుడప్పుడు చిరునవ్వును పుట్టించింది.

మలైయమాన్ కుమార్తె మొదలైన అంతఃపురస్త్రీలతో ఆయన కాసేపు ఉల్లాసంగా మాట్లాడుతూ కాలం గడిపారు. కుందవై అలంకార నైపుణ్యాన్ని మెచ్చుకొన్నారు. "అడవిజంతువులాగ అగుపించిన ఈమెను దేవలోకపు ఇంద్రాణిగా మార్చేశావు కద? కానీ దానికంతా ఈ ముదుసలే దొరికిందా? వాణతిలాంటి చిన్న పిల్లల దగ్గర కద నీ నైపుణ్యాన్ని చూపించాలి?" అని పరిహాసం చేశారు. తర్వాత పూంగుళలి దగ్గర అరుళ్మొళి గురించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

ఆ తర్వాత పూంగుళలి, "స్వామీ! నేను కోడిక్కరైకి తిరిగి వెళ్ళడానికి అనుమతివ్వండి. రేపే నేను బయలుదేరవచ్చు కద? నా అత్త గురించిన దిగులు నాకిక లేదు!" అన్నది.

"నీ అత్త కొడుకొకడు జ్వరమొచ్చి మంచమెక్కాడన్నావు కద? వాడి గురించి కూడ దిగుల్లేదా? తిరిగి వెళ్ళేందుకు నీవంతగా తొందరపడకు. కొన్నాళు ఇక్కడే ఉండేసి వెళ్ళు!" అన్నారు చక్రవర్తి. పూంగుళలి మౌనందాల్చింది.

ఆ రాత్రి సుందర చోళ చక్రవర్తి నెమ్మదిగా నిద్రపోయారు. కలలు కూడ అంతగా రాలేదు. వచ్చినవి కూడ మంచి కలలే, పీడకలలు కావు. ఆయన గదికి పక్కనున్న గదిలో అంతఃపురస్త్రీలు కూడ నెమ్మదిగానే నిద్రించారు. వారిలో నెమ్మదిగా నిద్రపోనిది మందాకిని ఒక్కతే. ఈరోజు జరిగిన సంఘటనలన్నీ ఆమె మనసులో చాల కలవరాన్ని పుట్టించాయి. ముఖ్యంగా ఆమె ఆలోచనలు బొక్కసపు నేలమాళిగకు, సొరంగమార్గానికి మధ్య ఊగిసలాడాయి. రావణుని చేతులను విరగగొట్టి ఆ సొరంగమార్గాన్ని మూసేయడానికి తాను చేసిన ప్రయత్నం ఫలించకపోవడం గురించి ఆమె తలుచుకొని చాల తల్లడిల్లిపోయింది. నిద్రాదీపం మసక వెలుతురులో అటూ ఇటూ చూస్తూనే ఉంది. ముఖ్యంగా పైమేడను తరచూ పరీక్షగా చూడసాగింది.

నడిరాత్రి దాటింది. రాత్రి మూడోజాము మొదలై, ఇంచుమించు ముగిసింది. అప్పుడు పైమేడ డాబా మీద ఒక దృశ్యం ఆమె కంటపడింది. ఒక ఘోరభయంకరమైన ముఖం ఆ డాబానుంచి, గదిలోకి తొంగి చూస్తూంది. ఆ ముఖం ఫలానా మనిషిదన్న విషయం కూడ ఆమెకు తెలిసిపోయింది. అదిరిపడి లేచి నిలబడింది. మళ్ళీ ఆ డాబావైపు చూసింది. ఆ ఆకారం కనిపించలేదు. పక్క గది గడపదాక మెల్లగా నడుచుకొంటూ వెళ్ళి తొంగి చూసింది. అక్కడ చక్రవర్తి నెమ్మదిగా నిద్రిస్తుండడాన్ని చూసింది. ఆ గదిలోని పైమేడను కూడ పరీక్షగా చూసింది. ఏమీ అగుపించలేదు.

తిరిగివచ్చి ఏమాత్రం శబ్దం చేయకుండ పూంగుళలిని తట్టి లేపింది. గాఢంగా నిద్రిస్తున్న పూంగుళలి కళ్ళు తెరిచింది. మూగరాణి ముఖకవళికలను చూసి అదిరిపడింది. ఆమె సైగలతో తనను వెన్నంటి రమ్మని చెప్పింది పూంగుళలికి. అత్తమీద ఎనలేని భక్తివిశ్వాసాలుగొన్న పూంగుళలి సద్దు చేయకుండ లేచి ఆమె వెంట వెళ్ళింది.

మూగరాణి శిల్పమంటపంవైపు వెళ్ళింది. వెళ్ళేటప్పుడు దారిలో ఉన్న ఒక నిద్రాదీపాన్ని చేత తీసుకొంది. శిల్పమంటపాన్ని చేరగానే పూంగుళలికి దిగులు పట్టుకొంది. మళ్ళీ ఈమె రావణుని శిల్పాన్ని విరగగొట్టబోతుందా, ఏమి? అలాగైతే ఆ శబ్దంవల్ల అంతఃపురంలో ఉన్న అందరూ మేలుకొంటారు కద? తన అత్త పిచ్చిదే అని దృఢపడిపోతుంది కద?

అత్త ఆ ప్రయత్నంలోకి దిగితే తాను దాన్ని అడ్డుకొనే తీరాలి. సుత్తిని బలవంతంగానైన లాక్కొని అడ్డుకోవాలి. ఇలా అనుకొంటూనే పూంగుళలి అత్త వెంబడే శిల్పమంటపంలో ప్రవేశించింది. ఆః! ఇదేమి? ఈ రావణుని తల ఒకటి కదులుతూందేమి? లేదు, లేదు! రావణుని తల కదలడం లేదు. రావణుని తలలకు, పైనున్న కైలాసగిరికి మధ్య ఒక మనిషి తల కనిపిస్తున్నట్లుంది! వెంటనే అది మాయమైంది. ఒట్టి భ్రమ! నిద్ర మత్తు...దీపం వెలుతురు వల్ల ఏర్పడే శిల్పాల క్రీనీడల దోబూచులాట కాబోలు...!

మందాకినికి కూడ ఆ దృశ్యం కనిపించిందో లేదో, తెలియదు; కానీ ఆమె రావణుని శిల్పంవైపే వెళ్ళింది. మంచివేళగా పక్కనున్న సుత్తిమీద ఆమె చూపు పడలేదు. రావణుని తలలు - చేతులకు, ఆ చేతులు ఎత్తి పట్టుకొన్న కైలాసగిరికి మధ్యనున్న చీకటి కమ్ముకొన్న భాగాన్ని కాంతిమయం చేసేలా దీపాన్ని ఎత్తి పట్టుకొంది. అక్కడ ఒక ద్వారం ఉండడం కనిపించింది. పూంగుళలి ముందు ఊహించింది సరియైనదే. అక్కడ ఒక సొరంగమార్గపు బాహ్యద్వారం ఉంది. అది అక్కడున్నట్లు ఎవరూ సందేహించలేనంత సామర్థ్యంగా అది అమర్చబడివుంది. ఆ సొరంగమార్గపు ద్వారాన్ని మూసేసేందుకే అత్త రాత్రి తొలిజాము ప్రయత్నించింది. అది తెలుసుకోకుండ తక్కినవారు ఆ ప్రయత్నాన్ని అడ్డుకొని ఆపేశారు.

పూంగుళలి ఇలా ఆలోచిస్తుండగానే మూగరాణి తన మేనకోడలిని తనతోబాటు రమ్మని సైగ చేసి, చేత దీపంతో ఆ సొరంగమార్గంలో అతికష్టంమీద దూరి కిందకు దిగి వెళ్ళసాగింది. కొద్ది కొద్దిగా ఆమె శరీరం మరుగై, చివరికి ఆమె తల, చేతనున్న దీపం కూడ మరుగైనాయి. కాస్త వెలుతురు మాత్రం

అగుపించింది. తర్వాత పూంగుళలి కూడ కష్టపడి ఆ సొరంగమార్గంలో దిగింది. కొద్ది క్షణాలకల్లా ఆమె కూడ మరుగైంది. దీపం వెలుతురు కూడ మరుగైంది. శిల్పమంటపంలో చీకటి అలముకొంది.

పొద్దున మలైయమాన్ కుమార్తె, కుందవై, వాణతి నిద్రలేచి చూసినప్పుడు మూగరాణి, పూంగుళలి కనిపించకపోగా, అదిరిపడ్డారు. అంతఃపురమంతట, తోటలో, శిల్పమంటపంలో వెతికి చూసినా కూడ వారు కనిపించలేదు. వారెలా మాయమైనారన్నది ఎవరూ ఊహించలేకపోయారు. చక్రవర్తికి ఈ విషయాన్ని తెలియజేసినప్పుడు మొదట ఆయన కాస్త విచారపడ్డారు. తర్వాత, “ఆ పిచ్చిమొహాలు తొలగిపోయిందే మంచిది. ఎక్కడికి పోతేనేమి!” అన్నారు. అయినా కూడ ఆయన మనసులో కూడ ఇదీ అని తెలియని దిగులు, భయమూ నెలకొన్నాయి.

~~~
~~~

# అధ్యాయము - 37

## కడంబూరులో కలకలం

**ఆదిత్య** కరికాలన్ కడంబూర్ మాళిగకు వచ్చినప్పటినుంచి ఆ మాళిగలో నిరంతరంగా వసిస్తున్న వారికి, ఇతర అతిథులకు ముళ్ళమీద కూర్చొన్నట్లు, నిప్పులమీద నడుస్తున్నట్లు కాలం గడుస్తూంది. యువరాజు నోటినుంచి ఎప్పుడు ఎలాంటి అస్త్రం వెలువడుతుందో ఎవరూ ఊహించలేకున్నారు. కాబట్టి అందరూ పడరాని పాట్లు పడుతున్నారు.

చోళసింహాసనం మీద మధురాంతకుని కూర్చోబెట్టడానికి జరుగుతున్న కుట్రాలోచనల గురించి కరికాలన్ తరచూ చూచాయగా అడుగుతూ అందరినీ విలవిల్లాడేలా చేస్తున్నాడు. పెద్ద పళువేట్టరయ్యర్ ఇది సహించలేకపోయారు. చిన్నరాజుల అభిప్రాయాన్ని యువరాజుకు బాహాటంగా తెలియజెప్పేయాలని శంబువరయ్యర్ వద్ద చెప్పుకొన్నారు. శంబువరయ్యరేమో, “కాస్త ఓపిక పట్టండి; ఎలాగూ మన అతిథిగా వచ్చాడు; ఒట్టి మొరటువాడిగా కూడ ఉన్నాడు. మనం ఒకటి తలవగా అది ఇంకొక విధంగా ముగిసిందంటే, తర్వాత ఏం చేయడం? మంచి సమయం, సందర్భం చూసి చెబుతాం" అని దాటేస్తూ వచ్చారు.

ఎలా ఆ ప్రస్తావన తేవాలని వారు ధర్మసంకటంలో కొట్టుమిట్టాడుతుండగా, కరికాలనే ఒకరోజు అందరూ సమావేశమైవున్నప్పుడు బాహాటంగా ఆ విషయాన్ని అడిగేశాడు. “పళువూర్ తాతను, కడంబూర్ మామను ఒక ముఖ్యమైన విషయం గురించి మంత్రాలోచన అడిగేందుకే నేనిక్కడికి వచ్చాను. దాన్ని ఇప్పుడు అడిగేస్తున్నాను. మూడేళ్ళ క్రితం నా తండ్రి నాకు పట్టపుయువరాజుగా పట్టం కట్టారు. అందుకు మీరందరూ సమ్మతించారు. ఇప్పుడు చక్రవర్తి తమ అభిప్రాయాన్ని మార్చుకొన్నట్లు తెలుస్తూంది. మధురాంతకుని సింహాసనం మీద కూర్చోబెట్టి పట్టం కట్టాలని కోరుకొంటున్నారట. అందుకోసమే నన్ను తంజావూరుకు రమ్మని పిలుపు మీద పిలుపు పంపుతున్నారు. నేనూ వెళ్ళకుండ దాటేస్తున్నాను. ఎందుకు తంజావూరుకు వెళ్ళాలి? వెళ్ళి ఎందుకు నా తండ్రి మాటను ఆయన ముందే నిర్లక్ష్యం చేయాలి? దాని కన్న వెళ్ళకుండడమే మంచిది కద? పళువూర్ తాతా! కడంబూర్ మామా! మీరు పెద్దలు. అన్ని న్యాయధర్మాలు తెలిసినవారు. మీరే చెప్పండి. రాజ్యాన్ని మధురాంతకునికి ఇచ్చేయమని ఇన్నేళ్ళ తర్వాత నా తండ్రి అడగడం న్యాయమవుతుందా? దాన్ని నేను తిరస్కరిస్తే నేరమవుతుందా?” అని ఆదిత్య కరికాలన్ తేటతెల్లగా అడగగానే అందరూ మ్రాన్పడిపోయారు.

పళువేట్టరయ్యర్ గొంతు సవరించుకొని, సమాధానం చెప్పేందుకు కాస్త జాప్యం చేద్దామని, “యువరాజా! ఈ విషయమై తమ మలైయమాన్ తాతగారిని సంప్రదించేవుంటారు కద? ఆయనేమంటున్నారు?” అన్నారు.

"ఆహా! ఆ ముసలాయన స్వభావం మీకు తెలుసు కద? తన మనుమడి సింహాసనాన్ని ఇంకొకరికి ఇచ్చేయడానికి ఒప్పుకొంటారా? దాని కన్న నన్ను, నన్ను కన్న తల్లిని నరికేస్తారాయన! ఇప్పుడు మలైయమాన్ సైన్యాన్ని కూడదీయనారంభించేశారు - ఆయన మనుమడి సింహాసనపు హక్కును నెలకొల్పేందుకు! కానీ నేనాయన మాటను మాత్రమే విని నడుచుకోబోవడం లేదు. మీరందరూ ఎలా చెబితే అలా నడుచుకొంటాను!" అని కరికాలన్ చాల సాధువైన అబ్బాయిలాగ అన్నాడు.

ఆ తీయటి మాటలకు మోసపోయిన పళువేట్టరయ్యర్, "మలైయమాన్‌లాగ తండ్రినెదిరించేటట్లు తనయుని పురిగొల్పేవారం కాదు మేము. చక్రవర్తి ఆజ్ఞ ఏదైతే దాని ప్రకారం నడుచుకోవడానికి బాధ్యులైనవారం. కానీ న్యాయం ఇదీ అని చెప్పే బాధ్యత మనకుంది. ఈ విషయంలో చక్రవర్తి చెబుతున్న మాటలో న్యాయమే లేదని చెప్పలేము. ఈ చోళరాజ్యం మీద మధురాంతకులకు హక్కే లేదని కూడ చెప్పలేము. యువరాజా! మీరడుగుతున్నందువల్ల మా మనసు విప్పి చెబుతున్నాము. తీర్మానం మీ ఇష్టప్రకారమే. ఈ వివాదం ఇంకా పెరుగుతూ పోతే అది రాజ్యానికి చాల అపాయకరమని భావిస్తున్నాము. కాబట్టి ఏదైన ఒక సమరసమైన తీర్మానానికి రావడం మంచిది. ఇప్పుడు చోళరాజ్యం మునుపటిలాగ రెండు నదులకు మధ్య ఇరుగ్గా లేదు. కన్యాకుమారినుంచి కృష్ణానది వరకు విస్తరించివుంది. దీన్ని రెండుగా విడదీసినా, రెండు భాగాలూ పెద్ద పెద్ద రాజ్యాలుగా ఉంటాయి. అలాగ కొళ్ళిడం నదికి దక్షిణభాగాన్ని మధురాంతక దేవరికి, ఉత్తరంగా ఉన్న భాగాన్ని మీకు ఇచ్చేటట్లు చేస్తే అది న్యాయంగా ఉంటుందని భావిస్తున్నాము. ఇది మా చివరిమాట. దీనికి మీరు ఒప్పుకొంటే తదుపరి చేయవలసిన పనులను చేయవచ్చు. ఇందుకు చక్రవర్తిని ఒప్పించే బాధ్యతను నేనే తీసుకొంటాను!" అన్నారు.

అప్పుడు ఆదిత్య కరికాలన్ గలగలమని నవ్విన నవ్వు పళువేట్టరయ్యర్ కడుపులో నిప్పు రగిల్చినట్లనిపించింది. "తాతా! రాజ్యాన్ని రెండుగా విభజించి దక్షిణభాగంలో పళువేట్టరయ్యర్లు, ఉత్తరభాగంలో శంబువరయ్యర్లు అధికారం చెలాయించడం భలే పంపకమే. మీ రెండు కుటుంబాలు మా తాతగారి తండ్రి కాలంనుంచి చేస్తూ వస్తున్న సేవకు తగిన బహుమతే. కానీ రాజ్యాన్ని అలా విడగొట్టడం నాకేమాత్రం ఇష్టం లేదు. తరతరాలుగా వస్తున్న రాజ్యాన్ని భాగాలు వేసుకోవడమూ ఒకటే; తాళి కట్టిన పెళ్ళాన్ని భాగాలు వేసుకోవడమూ ఒకటే. ముసలివాళ్ళయిన మీకది సమ్మతం కావచ్చు! నాకు సమ్మతం కాదు!" అని కరికాలన్ అన్నప్పుడు పళువేట్టరయ్యర్ కళ్ళనుంచి నిప్పురవ్వలు ఎగిరాయి. ఆయన ఉడికిపోతూ లేచి నిలబడ్డారు. ఒరనుంచి కత్తిదూయడానికి ఆయత్తమైనారు.

కరికాలన్ అప్పుడు, "తాతా! ఇంతలోపల లేచి వెళ్ళిపోదామని చూస్తున్నారా? నా ఆలోచనను పూర్తిగా వినేసి వెళ్ళండి. చోళరాజ్యాన్ని విడగొట్టడం నాకిష్టంలేదు. నా కులపూర్వీకులు, మీరు, మీ కులపూర్వీకులు ఐదు తరాలుగా ఎంతో కష్టపడి ఎందరో వీరాధివీరులు తమ ప్రాణాలను బలిచ్చి చోళసామ్రాజ్యాన్ని ఈ ఉన్నతస్థితికి తీసుకొచ్చారు. దీన్ని విభజించి రెండు చిన్న భాగాలుగా చేయడం

పాపమవుతుంది. వీరస్వర్గంలో ఉన్న రాజాదిత్యులు మొదలైనవారు మనని శపించడానికి హేతువవుతుంది. కాబట్టి ఆ ఆలోచనను విడిచిపెట్టండి. ఈ పెద్ద చోళసామ్రాజ్యాన్ని పూర్తిగా మధురాంతకునికే ఇచ్చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను; అందులో న్యాయం కూడ ఉంది. నా పెద్ద తాత కొడుకు మధురాంతకుడు. కాబట్టి నా తండ్రికి బదులుగా మధురాంతకునికే పట్టం కట్టివుండాలి. పరాంతక చక్రవర్తి చేసిన ఏర్పాటువల్ల నా తండ్రి పట్టం కట్టుకోవలసివచ్చింది. ఆ పొరబాటు వారితో పోనీ. 'తండ్రి తర్వాత కొడుకు' అన్న నీతి ప్రకారం నాకీ రాజ్యం మీద పూర్తి అధికారం, హక్కు ఉన్నప్పటికీ దాన్ని నేను వదిలిపెట్టుకొంటాను. కానీ అందుకు ఒక నిబంధన ఉంది. ఉత్తరదిశగా దండెత్తి వెళ్ళడానికి మూడులక్షల సైనికులున్న సైన్యం నాకు కావాలి. సైన్యానికి కావలసిన సామగ్రి, ఒక సంవత్సరానికి సరిపడ ఆహారపదార్థాలు చేకూర్చి ఇవ్వాలి. మహాసముద్రంలో పయనించగల మూడువందల ఓడలు కూడ కావాలి. పార్థిబేంద్రుని నౌకాదళానికి అధిపతిగా నియమించి, అతడు సముద్రతీరం వెంబడి రాగా, నేను భూమార్గం వెంబడి ఉత్తరదేశం మీద దండెత్తి వెళతాను. గంగానది ముఖద్వారం వద్ద నేను, పార్థిబేంద్రుడు కలుసుకొంటాము. తర్వాత ఇంకా ఉత్తరంగా వెళతాము. నా కులపూర్వీకుడు, నాపేరుగొన్న కరికాల్ వలవన్ హిమవత్పర్వతం మీద పులిజెండా ఎగురవేశాడని కవులు చెప్పారు. నా పూర్వీకులు సాధించింది నేనిప్పుడు మళ్ళీ సాధిస్తాను. నా కత్తి బలంతోను, నాతో వచ్చే వీరుల భుజబలంతోను కృష్ణానదికి ఉత్తరంగా నేను జయించే దేశాలన్నిటికీ నేనే చక్రవర్తినవుతాను. లేక, యుద్ధంలో మరణిస్తే, చోళకుల వీరకీర్తిని నెలకొల్పామన్న సంతోషంతో వీరస్వర్గం చేరుతాను. పళువూర్ తాతా! కడంబూర్ మామా! ఏమంటారు? ఈ నిబంధనను నెరవేర్చడానికి మీరొప్పుకొంటారా?"

ఇలా గంభీరంగా చెప్పి ఆపాడు కరికాలన్. ఇది విన్న ముసలివాళ్ళిద్దరూ అవాక్కైనారు. పళువేట్టరయ్యర్ తడబడుతూ, "యువరాజా! తమ నిబంధనను ఒప్పుకోవడానికి మేమెవరం? చక్రవర్తిని కద అడగాలి?" అన్నారు.

కరికాలన్ కోపోద్రిక్తుడై లేచి నిలబడి, పిడుగులాంటి గొంతుతో ఇలా గర్జించాడు: "తాతా! చక్రవర్తి పేరు చెప్పి ఎవరిని మోసం చేయజూస్తున్నారు? నన్ను మోసం చేయలేరు! నా తండ్రిని అంతఃపురంలో చెరపట్టివుంచి మీరాడించినట్లు ఆడే ఆటబొమ్మలాగుంచారు! అది నాకు తెలియదనుకొన్నారా? చిన్న పళువేట్టరయ్యర్ అనుమతి లేక ఎవరైన నా  తండ్రిని సందర్శించగలరా? నా తమ్ముని లంక నుంచి చెరపట్టి తెమ్మని నా తండ్రి ఆజ్ఞ జారీ చేసింది తమ స్వయేచ్ఛ ప్రకారమా? లేక మీ ఒత్తిడి వల్లా? దేశప్రజల కంటి పాపలాంటి ప్రియపుత్రుని, వీరాధివీరుని, చెరపట్టి తెమ్మని ఏ తండ్రైనా ఇష్టపడి ఆజ్ఞాపిస్తాడా? అరుళ్మొళిని చెరపట్టి తెచ్చి నడిసముద్రంలో ముంచేశారని దేశప్రజలంతా మీమీద నింద మోపి, కోపోద్రిక్తులై ఉన్నారు..."

"యువరాజా! అటువంటి ఘోరమైన నిందను మీ చెవిన వేసిందెవరు? అలా అన్నవాడి నాలుకను తెగగోసి, వాడిని కూడ ముక్కలు ముక్కలుగా నరికేస్తాను..." అని ఘోషించారు పళువేట్టరయ్యర్.

"నింద మోపేవారు ఒక్కరే అయితే మీరు చెప్పినట్లు ఖండఖండాలుగా నరికేయవచ్చు. లక్షలాది ప్రజలు అలా అంటున్నారు. అంతమందినీ మీరు శిక్షించదలిస్తే చోళసామ్రాజ్యమే వల్లకాడైపోతుంది. శివభక్తుడైన మధురాంతకుడు పరిపాలించేందుకు చోళనాడు తగిన రాజ్యమవుతుంది! కానీ, తాతా! ఆ మాటను నేను నమ్మడం లేదు. ప్రజలు తెలివిలేని మూర్ఖులు. పరిశోధించి చూడక ఒకడు కట్టిన కథను ఇంకొకడు చెప్పుకొంటూ వెళతాడు. చోళకులానికి తరతరాలుగా తోడుగా ఉంటున్న మీరు అటువంటి పాతకాన్ని ఏనాడూ చేయరు. అరుళ్మొళి కడలిలో మునిగివుంటే అది వాడి తలరాత వల్ల మాత్రమే అయివుంటుంది. 'ముల్లోకాలను ఏలడానికి పుట్టినవాడు' అన్న జ్యోతిష్కులు, హస్తసాముద్రికుల నోట్లో మట్టి కొట్టడానికే వాడలా చేసివుండాలి! తాతా! మీరెంత వీరాధివీరులైనా కూడ నడిసముద్రంలో సుడిగాలి రప్పించేందుకు, ఓడ తెరచాప మీద పిడుగు పడేటట్లు చేసేందుకు మీ వల్ల కూడ సాధ్యం కాదు. ఒకవేళ అది పాండ్యనాడు మంత్రవాదుల పనైవుండవచ్చు; మీరందుకు బాధ్యులు కారు. కాబట్టి అరుళ్మొళి గతికి మీరు బాధ్యులు కారు. కానీ 'చక్రవర్తిని అడిగి చెప్పాలి' అని మాత్రం నాదగ్గర అనకండి. తర్వాత ఆ అనిరుద్ధ బ్రహ్మరాయలను కూడ అడిగి చెప్పాలంటారు. చక్రవర్తి, ముఖ్యమంత్రి ఏదో ఆ బిరుదులను మోస్తున్నారంతే. మీ కోరికను మీరి వారేం చెయ్యలేరు. కావాలంటే పళువూర్ బామ్మ నందినిని అడిగి చెబుతానని చెప్పండి!"

ఆ సమయాన గందమారన్ అడ్డుపడి, "అయ్యా! మా ఇంటికి అతిథిగా వచ్చినవారిని..." అంటూ తడబడుతూ ఏదో చెప్పనారంభించాడు.

కరికాలన్ అతడివైపు నిప్పులుగక్కే దృక్కులతో చూసి, మన్మధుని భస్మం చేసిన శివుడిలాగ చిరునవ్వు నవ్వి, "గందమారా! ఇది మీ ఇల్లా? మరిచేపోయాను! కొల్లిమలై వల్విల్ ఓరి వంశంలో పుట్టిన వీరాధివీరుడవని కూడ మరచాను. నీ ఇంట్లో, అదీ నీవున్న చోట కాస్త భయంతోనే మాట్లాడాలి! పొరబాటుగా ఏమన్నాను? మీ ఇంటి అతిథులను ఏం చేసేశాను...? గందమారా? ఎందుకు నీ కాళ్ళు చేతులు వణుకుతున్నాయి? లంకలో వ్యాపించిన చలిజ్వరం నీకూ సోకిందా? నీవు లంకకు కూడ వెళ్ళలేదు కద?" అన్నాడు.

వంతిదేవుడు అప్పుడు కలగజేసుకొని, "యువరాజా! గందమారన్‌కి చలిజ్వరం సోకలేదు. పళువూర్ యువరాణిని మీరు ముసలమ్మ అనడం వాడికి కోపాన్ని తెప్పించింది!" అన్నాడు. గందమారన్ వంతిదేవుని కోపంతో చూస్తూ కత్తి పిడిమీద చేయివేశాడు. పార్థిబేంద్రుడు అతడి చేయి పట్టి లాగి కూర్చోబెట్టి అతడి చెవిలో ఏదో చెప్పాడు. గందమారన్ చల్లబడ్డాడు గాని ఒళ్ళు మాత్రం కాసేపు వణుకుతూనే ఉంది.

కరికాలన్ అతడివైపు చూసి ఒక నవ్వు నవ్వేసి, తర్వాత పళువేట్టరయ్యర్ వైపు తిరిగి, "తాతా! కోడెవయసు యువకులు ఇలాగే ఒక్కోసారి కట్టుబాట్లకు లొంగకుండ ఎగిరిపడుతుంటారు. వాళ్ళని మీరు పట్టించుకోకండి. మీరు నాకు తాతైతే, మీ యువరాణి నాకు బామ్మే కద కావాలి? నేనలా పిలవడంలో నా బామ్మకు కూడ అభ్యంతరమేమీ లేదు; మీకూ విచారం లేదు. ఈ పిల్లగాళ్ళకు ఎందుకు ఉక్రోషం

పొంగుకొస్తూంది? పోతే పోనీ! నేను మొదలుపెట్టిన విషయాన్ని వదిలిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాను. నా తండ్రి - చక్రవర్తి పేరు మీద మీరు భారాన్ని వేయకండి. మీరు సమ్మతిస్తే నా తండ్రి కూడ సమ్మతించినట్లే. బొక్కసం మీ చేతిలో ఉంది. ఉత్తరదిశగా దండెత్తి వెళుతున్నానంటే, చోళనాడునుంచి మూడులక్షలేమి, ముప్పైలక్షల వీరులు పోటీపటి వచ్చి చేరుతారు. మూడువందల ఓడలను/నౌకలను సేకరించివ్వడంలో కూడ కష్టమేమీ లేదు. మీరు సమ్మతించాలి! మధురాంతకుడు కూడ సమ్మతించాలి! అంతే! ఏమంటారు?" అన్నాడు కరికాలన్.

ఉక్కిరిబిక్కిరై, దిక్కుతోచక చివరికి ఎలాగో గొంతు సవరించుకొని పెద్ద పళువేట్టరయ్యర్ ఇలా అన్నారు: "యువరాజా! మీ విచిత్రమైన కోరికకు నేను సమ్మతించినా కూడ, మధురాంతక దేవుల సమ్మతం ఎలాగూ కావాలి కద? చక్రవర్తి వద్ద సెలవు తీసుకోకుండ తమరు దిగ్విజయానికి బయలుదేరగలరా? కాబట్టి అందరూ తంజావూరుకు వెళదాం..."

"అది మాత్రం సాధ్యం కాదు; తాతా! తంజావూరుకు వెళితే, అక్కడ చక్రవర్తి ఇంకోవిధంగా ఆజ్ఞాపిస్తే, నేనది మీరజాలను. పైగా అక్కడ నా తల్లి, మలైయమాన్ కుమార్తె, ఉంది. నా సహోదరి యువరాకుమారి ఉంది. వారికి నేనిలా దేశాంతరాలు వెళ్ళడం ఇష్టం ఉండదు. వారి మాట మీరడం కూడ కష్టమైపోతుంది. తాతా! ఈ విషయం ఈ కడంబూర్ మాళిగలోనే తీర్మానించబడాలి. మీరు తంజావూరుకు వెళ్ళి మధురాంతకుని పిలుచుకొని రండి. మనలో మనం మాట్లాడి ముగించిన తర్వాత తండ్రికి తెలియజేద్దాం. దండయాత్రకు అంతా సిద్ధమైన తర్వాత నేను తంజావూరుకు వచ్చి నా తలిదండ్రులవద్ద సెలవు తీసుకొని బయల్దేరుతాను. లేక మధురాంతకునికి ఇప్పుడే పట్టం కట్టేసి నా కన్నవారు కంచికి రానీ. అక్కడ నేను కట్టించిన బంగారు మాళిగలో వారిని ఉంచి నేను దండయాత్రకు బయల్దేరుతాను" అన్నాడు.

పళువేట్టరయ్యర్ శంబువరయ్యర్వైపు చూశారు. ఆయనేమో చూరువైపు చూస్తున్నారు. వారి దగ్గరినుంచి తమకు సహాయమేమీ లభించదని గ్రహించి, "యువరాజా! తమ ఆజ్ఞకు బదులుగా నేనేం చెప్పగలను?" అన్నారు పళువేట్టరయ్యర్. "అలాగే కానీ" అని చెప్పేసి మళ్ళీ గొంతు సవరించుకొన్నారా వృద్ధవీరులు.

"చాల వందనాలు, తాతా! అలాగైతే త్వరగా బయల్దేరడానికి ఏర్పాట్లు చేయండి! మధురాంతకుని బహిరంగంగానే ఏనుగు పైనెక్కించి ఇక్కడికి పిలుచుకొని రండి. లేక, బంగారు రథంలో ఎక్కించి పిలుచుకొని రండి. వయసులోవున్న బామ్మ మూసిన పల్లకి మాత్రం ఈసారి వద్దు!" అని చెప్పేసి నవ్వాడు కరికాలన్.

తర్వాత గందమారన్ మొదలైనవారిని చూసి, "గందమారా! నీకు పట్టిన యోగమే యోగం! నీ ఇంటికి ఇంకా అతిథులు రాబోతున్నారు. సుందరచోళుల తర్వాత చోళ చక్రవర్తి కాబోతున్న మధురాంతకులు రాబోతున్నారు. ఆయనకు పట్టమహిషి కాబోయే చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెను

కూడ పిలుచుకొని వస్తే రావచ్చు. కడంబూర్ మాళిగ చాల కోలాహలంగా ఉండబోతుంది. పళువూర్ తాత తంజావూరుకు బయల్దేరనీ. మనం వేటకు బయల్దేరుదాం. రండి! ఒకప్పుడు విలువిద్యలో నేను సాటిలేని మేటిగా ఉండేవాడిని. 'అర్జునుని తర్వాత ఆదిత్య కరికాలనే' అన్న పేరు పొందాను. మూడేళ్ళుగా విల్లును తాకక విలువిద్యే మరిచిపోయాను. మళ్ళీ అలవాటు చేసుకోవాలి. పార్థిబేంద్రా! వంతిదేవా! అందరూ బయల్దేరండి! వేటకు ఎక్కడికి వెళదాం? కొల్లిమలైకి (మలై = కొండ) వెళదామా?" అని సామూహికంగా అడిగాడు కరికాలన్.

ఇంతవరకూ సంభాషణలో పాల్గొనని శంబువరయ్యర్ అప్పుడు కలగజేసుకొని, "యువరాజా! కొల్లిమలై ఇక్కడికి చాలదూరం. దానికన్న, పక్కనే ఉన్న వీరనారయణపురం చెరువుకు దక్షిణాన దండకారణ్యంలాంటి దట్టమైన అడవుంది. అందులో వేటకు కావలసినన్ని అడవిమృగాలు కూడ ఉన్నాయి. మా వేటమంటపంలో ఉన్న అడవిమృగాలన్నీ ఆ అడవిలో వేటాడినవే. పొద్దున బయల్దేరితే రాత్రికల్లా తిరిగి వచ్చేయవచ్చు!" అన్నారు.

"అలాగే కానివ్వండి! నేనీ మాళిగలో అతిథిగా ఉన్నంతవరకూ, నాకు మీరు వేసిందే చట్టం. మీ కుమార్తె మణిమేఖలను కూడ పిలుచుకొని వెళ్ళవచ్చా? ఆ అమ్మాయి ఎక్కడుంటే అక్కడ ఎప్పుడూ నవ్వులూ కేరింతలతో సందడిగా ఉంటుంది!" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"నాకభ్యంతరం లేదు; మణిమేఖలను అడిగి చూడండి" అన్నారు శంబువరయ్యర్.

అప్పుడు గందమారన్, "వేటకు వెళ్ళేచోట అమ్మాయిలెందుకు? వారు క్షేమంగా ఉన్నారా లేరా అని చూసుకోవడమే సరిపోతుంది. వేటమీద ధ్యానముంచలేము. నందినీదేవికి ఇక్కడ తోడు కావాలి కద?" అన్నాడు.

"అవునవును! గందమారన్‌కి ఎప్పుడు పళువూర్ బామ్మ గురించే దిగులు. మణిమేఖలను పిలుచుకొని వెళ్ళడంలో ఇంకొక ఇబ్బంది కూడ ఉంది. ఆమె తుళ్ళుతూ గెంతుతూంటే, జింకేమోనని పొరబాటున ఆమె మీదికి ఎవరైనా బాణం వదిలే అపాయముంది. స్త్రీలు అంతఃపురంలోనే ఉండనీ. మనం వేటకు వెళదాం. రేపు పొద్దుపొడవక ముందే బయల్దేరాలి. ఈరోజు రాత్రి కురవై ఆటను తొందరగా ముగించేసి, అందరూ తమతమ స్థలాలకు వెళ్ళి నిద్రపొండి. అయ్యా! వేటగాళ్ళందరికీ ఇప్పుడే చెప్పివుంచండి. వంతిదేవా! రా, మన చోటికి వెళదాం!" అని చెప్పేసి కరికాలన్ వంతిదేవుని చేయి పట్టుకొని లాక్కొని వెళ్ళాడు.

గందమారన్, పార్థిబేంద్రుడు వారిని కాస్త అసూయతో చూస్తూ నిలబడ్డారు. శంబువరయ్యర్ వేటగాళ్ళకు ఆజ్ఞా జారీ చేసేందుకు బయల్దేరారు. పళువేట్టరయ్యర్ నందినిని వెతుక్కొంటూ అంతఃపురానికి వెళ్ళారు.

~~~
~~~

# అధ్యాయము - 38

## నందిని తిరస్కరించింది

**పళువేట్టరయ్యర్** కాస్త ఉత్సాహంతోనే నందినిని చూడ వెళ్ళారు. కడంబూరుకు బయల్దేరేటప్పుడు ఏ ఆశలతో వచ్చారో వాటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. చిన్నపిల్లాడైన ఆదిత్య కరికాలన్ని కడంబూర్ మాళిగకు రప్పించుకొంటే, నయానో భయానో తమ కోరిక ప్రకారం నడిపించుకోవచ్చని ఎంచారు. తాము, శంబువరయ్యర్ చెప్పే మాటకు అతడు కట్టుబడే తీరాలని అనుకొన్నారు. సమస్త చోళసామ్రాజ్యానికి మధురాంతకుని పట్టాభిశిక్తుని చేయడంలో ఉన్న అపాయం ఆయనకు తెలిసిందే. ఉత్తరాన మలైయమాన్, దక్షిణాన కొడుంబాళూర్ వేళార్ అందుకు విరుద్ధంగా ఉన్నారు. కరికాలన్ వారితో చేరితే, చోళనాడులో అంతర్యుద్ధం తథ్యం. అది ఎలా ముగుస్తుందో ఎవరికి తెలుసు? సాధారణ ప్రజల్లో చాలవరకు సుందరచోళుల కుమారుల పక్షమే ఉంటారు. మధురాంతకుని తల్లే మధురాంతకునికి విరుద్ధంగా ఉంది. కాళాముఖుల మాట విని అంతర్యుద్ధంలో దిగగలమా? పాండ్యనాడులోను, చేరనాడులో కూడ కలకలం లేవవచ్చు. కాబట్టి, ప్రస్తుతానికి మధురాంతకునికి సగం రాజ్యం అని విభజిస్తే, అందులోను తంజావూర్ రాజధానిగా ఉండేటట్లు దక్షిణనాడును ఎంపిక చేసుకొంటే, తర్వాత చూసుకోవచ్చు. కొడుంబాళూర్ వేళార్ పలుకుబడిని తుడిచిపెట్టేయవచ్చు. తర్వాత ఉత్తరాన తిరుక్కోవలూర్ మలైయమాన్ని కూడ ఒక్క దెబ్బతో మట్టుపెట్టవచ్చు. కరికాలన్ ఒట్టి మొరటువాడు; ఎప్పుడైన ఒకరోజు ఏదైన తగనిపనిలో దిగి అల్పాయుష్షులోనే పోవచ్చు. అలా జరిగితే, అన్ని దిగుళ్ళూ తీరిపోతాయి. ప్రస్తుతానికి సగం రాజ్యమని ఏర్పాటు చేసుకోవడం మంచిది.

యువరాణి నందినిని సంప్రదించి, ఈ తీర్మానానికి వచ్చిన తర్వాతే పెద్ద పళువేట్టరయ్యర్ కడంబూరుకు వచ్చారు. కరికాలన్ని కూడ అక్కడికి రప్పించారు. కానీ ఎదురుచూసినట్లు ఏదీ జరగలేదు. పెద్దలకు ఒదిగి నడుచుకోవడానికి బదులు పెద్దలనే దబాయించి, గద్దించి అధికప్రసంగం చేస్తూన్నాడు. అతడి గేలి మాటలను, ద్వంద్వార్థాలతో కూడిన మాటలను ఆయన సహించలేకపోయారు. ముఖ్యంగా ఆయన గురించి వయసు మళ్ళిన ముసలాయన అని, యువరాణిని 'బామ్మ' అనడం పదునైన విషబాణాల్లాగా ఆయన్ని బాధించసాగాయి. అది చాలనట్లు శంబువరయ్యర్ పోకడ కూడ అంత తృప్తికరంగా లేదు. తమకు పక్కబలంగా ఉండి కరికాలన్ అధికప్రసంగాన్ని అణచడానికి బదులు, శంబువరయ్యర్ చాల వరకు నోరు మెదపక మౌనంగా ఉంటున్నారు. ఏదైన మాట్లాడినా కూడ, జంకుతూ, వినయంగా మాట్లాడుతున్నారు. కరికాలన్ తమ మాళిగకు అతిథిగా వచ్చినందువల్ల ఏదైనా తారుమారుగా జరగకూడదని అలా జాగ్రత్తగా నడుచుకొంటున్నారు కాబోలు! కారణమేదైన, శంబువరయ్యర్ పోకడ పెద్ద

పళువేట్టరయ్యర్‌కి ఏమాత్రం తృప్తినివ్వలేదు.

ఈరోజు కరికాలన్ ఆడిన మాటల్లో ఎంత వరకు నిజం, ఎంత వరకు వ్యంగ్యపూరిత వాక్కులు, ఎంత వరకు సత్యదూరం అని కనిపెట్టడం కూడ అంత సులభంగ లేదు. మధురాంతకుని కూడ ఇక్కడికి రప్పించిన తర్వాత ఏదైనా విపరీతకార్యం చేయదలచాడో ఏమో, ఎవరికి తెలుసు? మలైయమాన్ని పెద్ద సైన్యంతో రప్పించి కడంబూర్ మాళిగను కైవసం చేసుకోవడానికి పన్నాగం పన్నుతున్నాడేమో?

ఇదంతా ఎంచినప్పుడు తంజావూరుకు తిరిగి వెళ్ళిపోవడమే మంచిది. తమ తమ్ముడు మంచి తెలివిపరుడు. వాడిని కూడ ఒక మాట అడిగి తర్వాత ఏం చేయాలన్నది నిర్ణయించుకోవచ్చు. మధురాంతకుని ఇక్కడికి రప్పించినా కూడ, అన్ని పరిస్థితులకు సిద్ధంగా ఉండేటట్లు చిన్న పళువేట్టరయ్యర్ సైన్యాన్ని కూడదీసుకొని కొళ్ళిడం నదీతీరాన వచ్చి సిద్ధంగా ఉండమనడం మంచిది. ఏదెలా ఉన్నా, యువరాణిని ఇంకా ఇక్కడే ఉంచి ఈ మూఢుల గేలి మాటలకు గురి చేయడం మంచిది కానే కాదు. ఆమెను పిలుచుకొని వెళ్ళి తంజావూరులో వదిలిపెట్టడం చాల అవశ్యం. అందుకు ఒక అవకాశం ఇప్పుడు ఏర్పడింది. దాన్ని చేజార్చుకోనేల?

ఇలా ఒక తీర్మానానికి రాగానే పెద్ద పళువేట్టరయ్యర్కి ఉత్సాహం పుట్టింది. విప్పారిన ముఖంతోనే నందిని అంతఃపురానికి వెళ్ళారు. అక్కడ ఆయన నందిని గదిని సమీపిస్తుండగా లోపలినుంచి గలగలమన్న నవ్వుల శబ్దాన్ని విన్నారు. ఎందుకో ఆ నవ్వుల ధ్వని ఆయనకు చిరాకును కలిగించింది. తంజావూరు అంతఃపురంలో నందిని ఇలా నవ్విందే లేదు. ఇప్పుడేం కుతూహలం పుట్టుకొచ్చేసింది? ఎందుకని నవ్వుతూంది? ఆమెతో చేరి నవ్వుతున్నదెవరు...? లోపల ప్రవేశించగానే అక్కడున్నది మణిమేఖల అని తెలిసింది. కాబట్టి ఆయన మనసు కాస్త కుదుటపడింది. ఆయనను చూడగానే నవ్వును ఆపుకోవడానికి మణిమేఖల రెండుచేతులతో తన నోటిని నొక్కుకొంది. అప్పటికీ నవ్వునాపుకోలేకపోవడంతో, నవ్వుతూనే ఆ గదినుంచి పరుగెత్తింది.

నందిని నవ్వు పళువేట్టరయ్యర్ని చూడగానే ఆగిపోయింది. ఆమె ముఖం కూడ అలవాటు ప్రకారం గంభీరంగ మారింది. “అయ్యా! రండి! మంత్రాలోచన ముగిసిందా?” అని అడిగింది.

“నందినీ! ఆ అమ్మాయి ఎందుకని అలా నవ్వింది? నవ్వుతూనే ఎందుకని పరుగెత్తి పారిపోయింది?” అని అడిగారు పెద్ద పళువేట్టరయ్యర్.

“అది చెప్పే తీరాలా? సరే, చెబుతాను. సభామంటపంలో జరిగిన సంభాషణల్లో కొన్ని మాటలు పక్కగదిలో ఉన్న మణిమేఖల చెవిన పడ్డాయట. యువరాజు తాతల గురించి, బామ్మల/అవ్వల గురించి పరిహాసంగా మాట్లాడింది విని ఆమెకు భలే నవ్వొచ్చిందట...”

“ఛీ! చెడ్డపిల్ల! ఆమెతో కలిసి నీవు కూడ నవ్వావేల?”

“అవును; ఆమెతో కలిసి నేను కూడ నవ్వాను. ఆమె అవతలికి వెళ్ళిన తర్వాత

ఏడుద్దామనుకొన్నాను. అంతలో మీరొచ్చేశారు!" అని చెప్పేసి నందిని తన కళ్ళలో ఉబికిన కన్నీటిని తుడుచుకొంది.

"ఆహా! నిన్నిలాంటి మూఢుల మధ్యకు పిలుచుకొచ్చింది నా పొరబాటు. రేపు పొద్దు పొడవగానే మనం తంజావూరుకు బయల్దేరి వెళదాం. ఈ రాత్రి మటుకు ఓర్చుకో!" అన్నారు.

"తంజావూరుకు బయల్దేరాలా? ఎందుకు? వచ్చిన పని నెరవేరిందా?" అని అడిగింది నందిని.

ఆ రోజు సభామంటపంలో జరిగిన మాటల సారాంశాన్ని నందినికి తెలియజేశారు పళువేట్టరయ్యర్.

అంతా విన్న నందిని, "స్వామీ! మీరు తంజావూరుకు వెళ్ళిరండి. నేను రాను. ఆదిత్య కరికాలన్‌కి బుద్ధి చెప్పేంతవరకు నేనిక్కడినుంచి కదలను. ఆ గర్విష్టి యువరాజు తాను ఆడిన మాటలకు మీ కాళ్ళమీద పడి క్షమాపణ కోరుకోవాలి, లేదా తమ కత్తికి ఎర కావాలి!" అన్నది.

"నందినీ! ఇవేం మాటలు? ఇటువంటి కిరాతకమైన ఆలోచనలు నీ మనసులో ఎప్పుడు, ఎలా పుట్టాయి?"

"అయ్యా! ఏది పాతకం? నన్ను చేయి పట్టి పెళ్ళాడిన తమను ఒకడు నిందిస్తూ మాటలాడితే, వాడిమీద పగ తీర్చుకోవాలని నేననుకోవడం పాతకమా? కిరాతకమా?"

"లేదు, నందినీ! ఇది విను! మన పళువూర్ వంశం చోళవంశంతో ఆరు తరాలుగా స్నేహం, బంధుత్వంగొన్నది. అదంతా మరిచి, ఏదో చిన్నపిల్లాడు తెలియక అన్న మాటలకు, నేను చోళకులానికి విరుద్ధంగా కత్తి ఎత్తగలనా? సుందర చోళుల కుమారుని, ఈనాటివరకు పట్టపు యువరాజుగా ఉన్నవాడిని, నేను నాచేత్తో చంపడమా? ఇదేం మాట?" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

కరికాలన్ ఆడిన మాటలను విన్నప్పుడు ఒక్కోసారి ఆయనకు ఓపిక నశించి చేయి కత్తి పిడి మీదికి వెళ్ళిన మాట నిజమే. కానీ ఎలాగో నిగ్రహించుకొన్నారు. తమ మనసులో మునుపు తోచిన ఆలోచనను నందిని బహిరంగపరచగానే ఆయనకు వణుకు మొదలైంది.

"అయ్యా! మీరు చోళకులంతో ఆరు తరాలుగా స్నేహంగొన్నవారు; బంధుత్వం కూడాను. కాబట్టి మీరు కత్తి ఎత్తడానికి వెనుకంజ వేయడం సహజమే. కానీ నాకటువంటి సంబంధమేమీ లేదు. చోళకులానికి నేను ఏవిధంగాను బాధ్యురాలిని కాను. ఆదిత్య కరికాలన్ మీ కాళ్ళమీద పడి క్షమాపణ కోరకపోతే, నాచేత కత్తి ఎత్తి నేనే వాడిని చంపుతాను!" అన్నది నందిని. అప్పుడామె కళ్ళెర్రబారి, కనుబొమలు ముడుచుకొని ఆమె రూపమే మారిపోయింది.

~~~
~~~

# అధ్యాయము - 39

## విపత్తు వస్తూంది!

**పళువేట్టరయ్యర్** నవ్వారు. నందిని మాటలను విని పరిహాసంగా నవ్వారు. ఆ నవ్వు ధ్వనికి ఆ గదిలోని వస్తువులన్నీ గడగడ వణికాయి.

తనను అవమానించిన వారిని నందిని తన చేత్తోనే కత్తితో పొడిచి చంపేస్తానని చెప్పింది తలుచుకొని ఆయన గర్వపడ్డారు. తమ గౌరవ మర్యాదలను కాపాడడంలో నందినికి అంత అక్కర ఉందని గ్రహించి ఆయనకు ఆశ్చర్యం కలిగింది. అదే ధోరణిలో ఆమె ఇంకా మాట్లాడితే వినాలని ఆశపడ్డారు. ఇంకొకవైపు ఆమె అలా మాట్లాడడం తనకిష్టం లేదని చూపించుకోవాలని కూడ ఆశపడ్డారు!

"అయ్యా! ఎందుకు నవ్వుతున్నారు? నా మాటల్లో మీకు నమ్మకంలేక నవ్వుతున్నారా?" అని అడిగింది నందిని.

"దేవీ! మందార పూరేకుల వంటి సున్నితమైన నీ మెత్తని చేతులతో నీవెలా కత్తిని ఎత్తుతావని తలుచుకొని నవ్వాను. పైగా నేనొకడిని రెండు పొడవైన, బలిష్టమైన చేతులతో ఉన్నప్పుడు..."

"అయ్యా! తమ చేతుల బలాన్ని, గొప్పతనాన్ని నేనెరుగుదును. ఏనుగు తొండంలాగ పొడవైన చేతులు; ఇంద్రుని వజ్రాయుధంలాగ బలమైన చేతులు; యుద్ధరంగంలో వేవేల శత్రువులను నరికి పోగేసిన చేతులు; చోళ చక్రవర్తుల శిరస్సున మణిమకుటాన్ని ధరింపజేసిన చేతులు. అయినాకూడ అదంతా ఈరోజు ఎంచి చూడలేదు. నిన్న పుట్టిన పిల్లలు మిమ్మల్ని 'ముసలాడు' అని హేళన చేసే రోజులొచ్చేశాయి. మీరేమో మంత్రంతో కట్టిపడేయబడ్డ పాములాగ చోళకులానికి రాజభక్తితో కట్టుబడి ఊరుకోవలసివుంది. నా చేతులు గాజులు తొడుక్కొన్న మెత్తని చేతులే. పూమాలలు కట్టేందుకు మాత్రమే తగిన చేతులు, నిజమే. కానీ అగ్ని సాక్షిగా తమను వివాహమాడిన కారణాన నా చేతులకు కూడ కాస్త శక్తి వచ్చింది. నా శీలాన్ని కాపాడుకొనేలోపు నా భర్త ప్రాణాన్ని కాపాడవలసివస్తే నా చేతులక్కూడ కత్తి ఎత్తే బలం వచ్చేస్తుంది. ఇదిగో చూడండి...!" అని చెప్పి నందిని మంచం కింద ఉన్న ఒక పేటికను తెరిచి దాని పైభాగంలోని బట్టలను పక్కకు తొలగించింది. అడుగున ధగధగ మెరుస్తున్న ఒక పొడవైన కత్తిని ఒక్క చేత్తో తీసి తలపైకెత్తి పట్టుకొంది.

~

పళువేట్టరయ్యర్ ఆ దృశ్యాన్ని కాసేపలా సంభ్రమించి చూస్తూ నిలబడిపోయారు. తర్వాత, "నీ పెట్టెలో ఈ కత్తి ఎన్ని రోజులుగా ఉంది? ఇందులో నీ వస్త్రాభరణాలు మాత్రమే కద ఉన్నాయనుకొన్నాను?" అన్నారు.

నందిని కత్తిని మళ్ళీ పెట్టెలో పెట్టేసి, "అవును; నా వస్త్రాభరణాలను ఈ పెట్టెలోనే ఉంచుకొన్నాను. నా ఆభరణాల్లో అతి ముఖ్యమైనది ఈ కత్తి. నా శీలాన్ని, నా భర్త గౌరవాన్ని కాపాడుకొనేందుకు" అన్నది.

"కానీ నీవు దీన్ని ఉపయోగించవలసిన అవసరమేమీ ఏర్పడబోదు. నేను ప్రాణాలతో ఉన్నంతవరకు!"

"అందుకే నేనీ కత్తిని బయటకు తీయడం లేదు. లంకనుంచి వేంగీదేశం వరకు చోళసామ్రాజ్యాన్ని కాపాడుతున్న మీ భుజబలం మీ గౌరవాన్ని కాపాడలేదా? లేక ఈ పేదరాలిని కాపాడలేదా? అయినా కూడ, ముఖ్యంగా రాజకీయ కార్యాలలో నిమగ్నమైన మీరు ఎప్పుడూ దగ్గరుండి నన్ను కాపాడగలరా? వీలు కాదు. మీనుంచి వేరుపడి ఉన్నప్పుడు నన్ను నేను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉండాలి కద?"

"దేవీ! దానికవసరమేమి? పోతే పోనీ. ఇక నేను నీనుంచి విడివడి ఉండనే ఉండను..."

"అయ్యా! నా కోరిక కూడ అదే. కానీ ఈ ఒక్కసారి మాత్రం నన్ను విడిచి తంజావూరుకు వెళ్ళి రండి..."

"ఇదేం హఠం? ఎందుకని ఈ ఒక్కసారి మాత్రం నేను నిన్నిక్కడ విడిచి వెళ్ళాలి?" అని పళువేట్టరయ్యర్ అడిగేటప్పుడు ఆయన కనుబొమలు ముడిపడ్డాయి.

"స్వామీ! అందుకు రెండు కారణాలున్నాయి. ఇప్పుడు మీరు నన్ను తమతో పిలుచుకొని వెళితే ఇక్కడి మూర్ఖులు మళ్ళీ మన గురించి పరిహాసంగా మాట్లాడుకొంటారు. 'ముసలాయనకు యువరాణిమీద అంత నమ్మకం!' అనుకొంటారు. అది తలుచుకొంటేనే నా రక్తం ఉడుకుతోంది. ఇంకొక కారణం, ఇంకా ముఖ్యమైనది. శంబువరయ్యర్ని మీ అత్యంత ముఖ్యమైన స్నేహితులని చెప్పుకొంటూ వచ్చారు; నమ్ముతూను వచ్చారు. కానీ యువరాజు వచ్చినప్పటినుంచి ఆయన మాటలోను, నడవడికలోను ఏర్పడ్డ మార్పును గమనించారా? మీరు గమనించకున్నా, నేను గమనిస్తున్నాను..."

"నేను కూడ ఆ మార్పును గమనిస్తున్నాను. ఆ మార్పుకు కారణమేమై ఉండవచ్చని ఆశ్చర్యపడుతున్నాను..."

"మీది కపటమెరుగని మనసు; కాబట్టి ఆశ్చర్యపడుతున్నారు. నాకు అందులో ఆశ్చర్యమేమీ లేదు. మనుషుల దురాశే శంబువరయ్యర్‌లోని మార్పుకు కారణం. యువరాజు ఆదిత్య కరికాలన్ స్త్రీలను

కన్నెత్తికూడ చూడరని వదంతి. ఇక్కడికి వచ్చినప్పటినుంచి అందుకు విరుద్ధంగా నడుచుకొంటున్న విషయాన్ని మీరు గమనించేవుంటారు. స్త్రీలున్న చోటుకు తరచూ వస్తున్నారు. వారితో మురిపెంగా మాట్లాడుతున్నారు. దీనికంతా కారణం ఆయన మనసు శంబువరయ్యర్ కుమార్తె మణిమేఖల మీదికి మళ్ళడమే. 'వేటకు వెళ్ళేటప్పుడు మణిమేఖలను వెంట పిలుచుకొని వెళ్ళనా?' అని కూడ అడిగారు కద? ఇది శంబువరయ్యర్‌కి కూడ తెలిసేవుంది. కాబట్టి ఆయన పాత ఏర్పాట్లన్నీ మరిచిపోయారు. తన ముద్దుల కూతురు తంజావూరు స్వర్ణ సింహాసనంమీద కూర్చొనే పర్వదినం గురించి కలలు కంటున్నారు..."

"అవును; నీవు చెబుతున్నదే కారణమైవుండాలి. శంబువరయ్యర్ ఇటువంటి నీచగుణం కలిగినవాడని కలలో కూడ అనుకోలేదు. రెండు నెలల క్రితమే కద ఇదే మాళిగలో మధురాంతకుని తంజావూరు సింహాసనం ఎక్కించేటట్లు అందరూ కలిసి శపథం చేశాం? ఛీఛీ! ఇలా మాట తప్పేవాడు ఒక మనిషేనా?" అని పళువేట్టరయ్యర్ ఛీత్కరించారు.

"స్వామీ! అందుకే నేను మీతో రానన్నాను. మీరు లేని సమయాన వీరు ఏం కుట్ర చేస్తారో గమనిస్తాను. ఏదైనా కుట్ర పన్నితే అది ఫలించకుండేందుకు ప్రయత్నిస్తాను."

"నందినీ! ఈ వ్యవహారాల్లో నీవెందుకు కాలు పెట్టాలి?"

"భర్త శిరసావహించిన కార్యాన్ని భార్యకూడ శిరసావహించాలి కద? 'జీవన సహచరి' అని మమ్మల్ని మరెందుకంటారు?"

"ఏదేమైనా, ఈ మూర్ఖులు, నీచుల మధ్య నిన్ను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళడమా? అది నాకేమాత్రం ఉచితమనిపించడం లేదు!"

"నాకిక్కడ తోడు లేకపోలేదు. మణిమేఖల ఉంది. నా కోసం ఆ అమ్మాయి ఏమైనా చేస్తుంది..."

"అది నిజమే. నేనూ గమనించాను. నీ మోహనశక్తి ఆమెను నీకు దాసోహం చేసింది. కానీ అది ఎంతవరకు నిలిచివుంటుంది? ఆదిత్య కరికాలన్ సింహాసనమెక్కి ఆమెను తన చక్రవర్తినిగా చేసుకొంటానని ఆశ చూపితే...?"

"అయ్యా! ఆ విషయంలో మీకు కించిత్తు సందేహంకూడ అవసరం లేదు. మణిమేఖల నా మాటను తోసిపుచ్చి దేవలోకపు ఇంద్రాణి పదవిని కూడ అంగీకరించదు. 'కరికాలన్ని ఈ కత్తితో పొడిచి చంపేసి రా' అని నేను చెబితే వెంటనే అలా చేసేసి వస్తుంది. నా మోహనశక్తి గురించి మీరే తరచూ చెబుతుంటారు కద? అది మణిమేఖలను పూర్తిగా వశపరుచుకొంది! కావాలంటే దాన్ని మీకు ఇప్పుడే నిరూపించి చూపిస్తాను!" అన్నది నందిని.

~

పళువేట్టరయ్యర్ వెలవెలబోయారు. ఆయన పెదవులు వణకనారంభించాయి. గొంతు పూడుకుపోతుండగా, తడబడుతున్న నాలుకతో, ఎలాగో నోరు పెగల్చి ఇలా అన్నారు:-"దేవీ! నీ శక్తిని

నేనెరుగుదును. కానీ కరికాలన్ విషయంలో నీవలా ఏదీ పరీక్ష చేయకు. వాడు ఏమీ తెలియని పిల్లాడు. ఏదో తెలియక పేలాడన్న విషయాన్ని మనం పెద్దగా పట్టించుకోకూడదు. కరికాలన్ మణిమేఖలను పెళ్ళాడేందుకు ఇష్టపడితే మనం అందుకు అడ్డు పోకూడదు!"

"అయ్యా! మనం అడ్డుపడకపోవచ్చు. కానీ విధి ఒకటుంది కద! దాన్ని ఎవరడ్డుకోగలరు? మణిమేఖల నాపైన ప్రీతిగొన్నట్లే నేనూ ఆమె పైన మమకారంగొనివున్నాను. నాతోబుట్టిన చెల్లెల్లాగ ఆమెపై ప్రేమగొన్నాను. అల్పాయుష్షులో చావబోయేవాడికి ఆమెనెలా ఇచ్చి పెళ్ళి చేయగలను?" అన్నది నందిని. అప్పుడామె చూపులు ఎక్కడో దూరాన జరుగుతున్న ఏదో సంభవాన్ని చూస్తున్నట్లు అగుపించాయి.

పళువేట్టరయ్యర్ ఇంకా అదిరిపడ్డారు. "నందినీ! ఇదేం మాట? చోళచక్రవర్తి వేళక్కార దండుకు (= రక్షక సైన్యం) నేను ఒకప్పుడు నాయకుడినిగా ఉండేవాడిని. చక్రవర్తిని, ఆయన సంతతిని నా ప్రాణాలొడ్డైనా కాపాడుతానని సత్యప్రమాణం చేశాను..."

"అయ్యా! ఆ ప్రమాణాన్ని మీరు మీరాలని నేను చెప్పలేదే?"

"నీవల్ల కరికాలన్కి ఏదైనా కీడు కలిగినా అది నాకే వర్తిస్తుంది. చిన్న పిల్లాడి వేళాకోళం మాటలను ఓర్చుకోలేక అతి పాతక కృత్యాన్ని చేశానని లోకం నన్ను నిందిస్తుంది. ఆరు తరాలుగా మా కులం చోళకులానికి రక్షగా ఉంటూ వచ్చి తెచ్చుకొన్న మంచిపేరు నాశనమవుతుంది..."

"అలాగైతే మీరు ఈ ఊరిని తక్షణమే విడిచి వెళ్ళడం అవసరం!" అని నందిని మర్మభూయిష్టమైన స్వరంతో అన్నది.

"ఎందుకలా అంటున్నావు?" అని అడిగారు పళువేట్టరయ్యర్.

"తమవద్ద ఎలా చెప్పాలని జంకాను. ఇప్పుడు చెప్పవలసిన అవసరం వచ్చేసింది. దుర్గాపరమేశ్వరి నాకు కొన్ని అపూర్వశక్తులనిచ్చింది. ఇది మీకే తెలుసు. సుందర చోళ చక్రవర్తి చిన్న వయసులో స్త్రీహత్యాదోషానికి పాలైనారన్న విషయాన్ని నా మంత్రశక్తివల్ల తెలుసుకొన్నాను. దాన్ని మీకు కూడ నిరూపించి చూపించాను. అదే విధంగా ఆదిత్య కరికాలన్ అంతిమ కాలం దగ్గరపడుతోందన్న విషయాన్ని కూడ నా అంతర్నేత్రంతో చూస్తున్నాను. అది మీ చేతినుంచి కాబోవడం లేదు; నా చేత్తోనూ కాబోవడం లేదు. కానీ యమపాశం వాడిని సమీపిస్తూందన్న విషయం మాత్రం నిజం. అడవిలో వేటకు వెళ్ళినప్పుడు అక్కడ కావచ్చు; లేక అంతఃపురంలో పడుకొని ఉన్నప్పుడు జరగవచ్చు; పులి, ఎలుగుబంటిలాంటి క్రూర జంతువుల వల్ల కావచ్చు; లేక వాడి స్నేహితులు వదిలే బాణం పొరబాటున వాడికి తగిలి చావవచ్చు. లేక ఒక స్త్రీ సున్నితమైన చేతి కత్తివల్ల అకాల మరణం పొందవచ్చు. కానీ వాడి మరణం మీరు పాణి గ్రహణం చేసి పెళ్ళాడిన నా వల్ల జరగదని సత్యప్రమాణం చేసి చెబుతున్నాను. బాట పక్కన, అనాధగా నిలబడ్డ నన్ను లోకమెరుగ పెళ్ళి చేసుకొని మీ యువరాణిగా చేసుకొన్నారు. అటువంటి మీమీద ఎటువంటి నిందా పడకుండ చూసుకొంటాను. అందుకే ఈ సమయాన మీరిక్కడ ఉండకూడదు,

వెళ్ళిపొండి అని నొక్కి చెబుతున్నాను. మీరిక్కడున్నప్పుడు కరికాలన్‌కి ఏ కీడు కలిగినా లోకం మీమీదే నింద మోపుతుంది. అరుళ్మొళి వర్మను సముద్రం పొట్టనబెట్టుకొన్నందుకు మీమీద నింద మోపలేదా? అలాగే దీనికీ మీపైన నింద మోపుతారు. కానీ తమ వజ్రాయుధంలాంటి చేతులు కూడ కరికాలన్‌కి కలగబోతున్న విపత్తును ఆపలేవు. కాబట్టి మీరు వెంటనే వెళ్ళిపోవాలి. నన్ను మీ వెంట తీసుకొని వెళితే, దాని గురించి కూడ లేనిపోని సందేహాలు కలుగుతాయి. ముందే తెలుసు కాబట్టి నన్ను కూడ వెంట తీసుకొని వెళ్ళారని అంటారు. కాబట్టి మీరు మాత్రమే వెళ్ళాలి. ఏం జరిగినా మీరు అపకీర్తి రాకుండ చూసుకోవడానికి నేనిక్కడుంటాను. అయ్యా! నా మీద మీకు అంతటి నమ్మకముందా?" అని అడిగి నందిని తన పెద్ద నల్లని కళ్ళతో పళువేట్టరయర్‌ని నిశితంగా చూసింది. పాపం! అ వీరవృద్ధుడు నందిని వాగ్బాణాల వల్ల ఇప్పటికే చాల కలతబారి ఉన్నారు. ఇప్పుడామె వీక్షణబాణాలతో మతి కోల్పోయారు.

~~~
~~~

# అధ్యాయము - 40

## జలకాలాట

**ఈ** కథ జరిగిన కాలానికి ఆరువందలేళ్ల మునుపు తమిళనాడులో మూవేందర్లు కాక చిన్న రాజులు సుమారు డెబ్బైమంది ఉండేవారు. వారికి 'వళ్ళళ్' అన్న బిరుదు కూడ పరంపరగా వచ్చేది. వారిలో ఒకడు 'కొల్లిమలై' (మలై = కొండ) నాయకుడైన 'ఓరి' అనబడే చిన్నరాజు. ఇతడు విలువిద్యలో సాటిలేని మేటి అన్న పేరుగాంచినవాడు. ఇతడు విల్లెక్కు పెట్టి నారి సారించి, బాణం వదిలితే అది రాముడు ఏడు తాటి చెట్లను ఒక్క బాణంతో కొట్టినట్లు మొదట ఒక పులిని కొట్టి, చివరికి ఒక చెట్టును కూడ పడగొట్టేదట. ఇలా అతడి విలువిద్య కవులచేత పొగడబడేది. దాని వల్ల అతన్ని 'వల్‌విల్ ఓరి' అని పిలవడం పరిపాటైంది.

కొల్లిమలై వల్‌విల్ ఓరి పైన ఆ రోజుల్లో బలవంతుడని పేరుగాంచిన చేరరాజు కోపంగొన్నాడు. అతడిపైన దండెత్తేందుకు మలైయమాన్ తిరుముడిక్కారి సహాయాన్ని కోరాడు. తిరుముడిక్కారి వీరత్వం ఓరి వీరత్వానికన్న తక్కువేమీ కాదు. అదీగాక, మలైయమాన్ తిరుముడిక్కారికి అంగబలం అధికంగా ఉండేది. మలైయమాన్ ఓరిపైన దండెత్తి వెళ్ళి, అతన్ని చంపడమేగాక అతడి కొండపైని కోటను కూడ నిర్మూలించాడు.

అదే కాలంలో కొల్లిమలై పక్కనున్న బయలుసీమలో 'అదిగమాన్ నెడుమాంజి' అన్న చిన్న రాజు పరిపాలిస్తుండేవాడు. వల్‌విల్ ఓరితో అతడు బంధుత్వం కలుపుకొన్నవాడు. ఓరిని చంపిన మలైయమాన్ కారిపైన పగ తీర్చుకోవాలనుకొన్నాడు. తానొక్కడే అది సాధించలేడని ఎంచి చోళ రాజైన కిళ్ళి వలవన్ సహాయాన్ని కోరాడు. మలైయమాన్ సైన్యబలం అధికంగా ఉండడం గురించి, అతడు చేరరాజుతో స్నేహంగొని ఉండడం గురించి కిళ్ళి వలవన్‌కి కోపంగా ఉండేది. కాబట్టి చోళుడు కిళ్ళి వలవన్, తగడూర్ అదిగమాన్ ఒకటై తిరుక్కోవలూర్ మలైయమాన్‌ని ముట్టడించారు. మలైయమాన్ యుద్ధరంగంలో వీరస్వర్గం చేరాడు. అతడి ఇద్దరు యువరాకుమారులను చోళవీరులు బంధించి తెచ్చారు. మలైయమాన్ వంశాన్నే తుడిచిపెట్టేయాలని ఎంచిన అదిగమాన్ ఆ ఇద్దరు చిన్న పిల్లలను నేలలో గొంతు వరకు పూడ్చి పెట్టి ఏనుగులతో తొక్కించమని ఆజ్ఞాపించాడు. మలైయమాన్ గొప్పతనాన్ని ఎరిగినవారు, అతడివల్ల లాభం పొందిన ఒక కవి ఆ సమయాన అక్కడికి వచ్చి చేరారు. మలైయమాన్ బిడ్డలను కాపాడమని చోళరాజును వేడుకొన్నారు

"వేందా! అదిగో చూడు! గొంతువరకు పూడ్చబడ్డ ఆ బిడ్డల ముఖాలను చూడు! ఆ ముఖాల్లో చిందులాడే చిరునవ్వును చూడు! తమను తొక్కేసేందుకు వస్తున్న ఏనుగులను చూసి, ఆడుతున్న వాటి తొండాలను చూసి, ఏదో తమాషా/వింత అనుకొని ఆ పిల్లలు నవ్వుతున్నారు! ఇటువంటి అమాయకులైన,

ఏ నేరమూ చేయని పిల్లలనా చంపబోతున్నావు? ఆ పిల్లలు ఏం పాపం చేశారు? తండ్రి చేసిన నేరానికి బిడ్డలను శిక్షించవచ్చా?" అన్నారు కవి.

అద్ విన్న చోళరాజు మనసు మారింది. తన ఆజ్ఞను వెంటనే మార్చాడు. బిడ్డలను భూమినుంచి బయటకు తీయమన్నాడు. తన అంతఃపురంలోనే పెంచాడు. వయసు వచ్చిన తర్వాత వారిలో పెద్దవాడికి తిరుక్కోవలూర్ రాజ్యాన్ని తిరిగి ఇచ్చేశాడు కూడాను.

~

అప్పటినుంచి, నూరేళ్ళ పరంపరగా తిరుక్కోవలూర్ మలైయమాన్ వంశస్థులు చోళకులానికి ఋణపడి, విశ్వాసంతోను, కృతజ్ఞతతోను మెలగసాగారు.

ఆ సంబంధం సుందర చోళ చక్రవర్తి కాలంవరకు కూడ కొనసాగింది. మలైయమాన్ కూతురైన వాణ మహాదేవిని సుందర చోళ చక్రవర్తి వివాహమాడి తన పట్టమహిషిగా చేసుకొన్నారు.

కొల్లిమలై ఓరి - తగడూర్ అదిగమాన్ - వీరి వంశస్థులు పూర్తిగా తుడిచేయబడ్డారు. అయినా కూడ వారి వంశం ఒక శాఖకు తాము చెందినవారని కడంబూర్ శంబువరయ్యర్ చెప్పుకోసాగారు. వారి పూర్వీకులు తిరుక్కోవలూర్ మలైయమాన్ వంశస్థులమీద కొన్న పగను కూడ వారు మరిచిపోలేదు. కాబట్టి మలైయమాన్ మనుమడు చోళసామ్రాజ్యానికి చక్రవర్తి కావడాన్ని వారిష్టపడకపోవడం సహజమే కద? ఆదిత్య కరికాలన్ అహంభావం, చిన్నరాజులకు కించిత్తు కూడ విలువివ్వకుండ ప్రవర్తించడం శంబువరయ్యర్కి ఇంకా కోపాన్ని తెప్పించాయి. అందుకే గండరాదిత్యుల కుమారుడైన మధురాంతకుని సింహాసనమెక్కించడంలో చాల ఆసక్తి కనబరుస్తున్నారు.

~

కానీ కరికాలన్ కడంబూర్కి వచ్చినప్పటినుంచి పెద్ద శంబువరయ్యర్ మనసు కొద్దికొద్దిగా మారసాగింది. ఆయన ముద్దుల కూతురైన మణిమేఖలే ఆ మార్పుకు కారణమైంది. ఆదిత్య కరికాలన్ మనసును మణిమేఖల చూరగొందనడానికి అనేక సూచనలు తోచసాగాయి. స్త్రీలను కన్నెత్తి కూడ చూడడని, బ్రహ్మచారిగానే కాలం వెళ్ళబుచ్చబోతున్నాడని అందరూ చెప్పుకొంటున్నారు. కానీ కడంబూరుకు వచ్చినప్పటినుంచి తరచూ స్త్రీల అంతఃపురానికి వెళ్ళడమూ, వారితో ఉల్లాసంగా మాట్లాడడమూ చేస్తున్నాడు. ముఖ్యంగా అతడు మణిమేఖల 'చురుకుతనం' గురించి తరచూ మెచ్చుకోలుగా మాట్లాడుతున్నాడు. కరికాలన్ వచ్చినప్పటినుంచి మణిమేఖల కూడ చాల ఉత్సాహంగా ఉంది. అందుకు కారణం మణిమేఖల మనసు కూడ అతడిమీదికి మళ్ళడమేనని శంబువరయ్యర్ అనుకొన్నారు. వారిద్దరి కుతూహలం చూసి శంబువరయ్యర్ కూడ ఉత్సాహంగొన్నారు. కరికాలన్ తన ముద్దుల కూతురిని పెళ్ళి చేసుకొంటే ఆమె చోళసామ్రాజ్యపు చక్రవర్తినిగా విరాజిల్లుతుంది! ఆమెకు పుట్టే బిడ్డ కూడ తంజావూరు సింహాసనానికి అర్హుడవుతాడు! ఇప్పుడు తిరుక్కోవలూర్ మలైయమాన్

అనుభవిస్తున్న పెద్దరికం తాను కూడ పొందవచ్చు. దానికంతా తామే ఎందుకు అడ్డుగా నిలబడాలి? తన ప్రియపుత్రిక పై అంతస్తుకు వెళ్ళేందుకు తామే ఎందుకు అడ్డు నిలవాలి?

~

శంబువరయ్యర్ తన కూతురిని మధురాంతకునికిచ్చి పెళ్ళి చేద్దామని ఇంతకు మునుపు అనుకొన్నది నిజమే. కానీ అతడికి ఇప్పటికే ఇద్దరు భార్యలున్నారు. చిన్న పళువేట్టరయ్యర్ కూతురిని అతడు పెళ్ళి చేసుకొన్నాడు కద? ఆమెకు ఒక మగపిల్లాడు కూడ ఉన్నాడు. కాబట్టి మధురాంతకుడు సింహాసనమెక్కితే, పళువేట్టరయ్యర్ వంశస్థులే వారసులౌతారు. మణిమేఖల తంజావూర్ అంతఃపురంలో ఉన్న పలువురు పనిపిల్లల్లో ఒకతెగా బతకవలసివుంటుంది.

కానీ ఆదిత్య కరికాలన్ మణిమేఖలను పెళ్ళాడితే, ఆమే పట్టపురాణి అవుతుంది. ఆమెకు పుట్టే బిడ్డే సింహాసనమెక్కుతాడు.

మధురాంతకునికి పట్టం కట్టడమనేది బ్రహ్మప్రయత్నమైన కార్యం. ప్రజలందుకు ఒప్పుకోరు. మలైయమాన్‌తోను, కొడుంబాబాళూర్ వేళార్‌తోను పోరాడి గెలిస్తేనే అది సాధ్యమవుతుంది. ముఖ్యంగా, మధురాంతకుని తల్లే అందుకు అడ్డుగా ఉంది. ఇంతటి కష్టభూయిష్టమైన కార్యాన్ని ఎందుకు చేపట్టాలి?

ఆదిత్య కరికాలన్‌కి పట్టం కట్టడమన్నది అప్పటికే తీర్మానించబడ్డ విషయం. దాన్ని నెరవేర్చడానికి ఏ విధమైన శ్రమకూడ అవసరం ఉండదు. పళువేట్టరయ్యర్ల హఠవాదమే/మంకుపట్టే పెద్ద ఆటంకంగా ఉంటుంది. వారిద్దరిలో పెద్ద ముసలాయనేమో యువరాణి మోహంలో మునిగివున్నాడు. ఇంకా ఎన్ని రోజులు ప్రాణాలతో ఉంటాడో తెలియదు. ఈ ముసలాయన్ని నమ్మి ఎందుకు ఒక పెద్ద అపాయకరమైన కార్యంలో తలదూర్చాలి?

మధురాంతకుని పక్షం తామున్నామని శపథం చేసినమాట నిజమే. అందువల్లనేమి? శపథానికి భంగం కలగకుండ కార్యం నెరవేర్చుకోవడానికి దారి లేకపోతుందా? మధురాంతకుడు ఒక వెర్రిబాగులవాడని అందరికీ తెలిసిందే. వాడి చేతనే, “నాకీ రాజ్యం వద్దు" అని చెప్పించవచ్చు. లేక, వాడి తల్లి సమ్మతం కావాలని చెప్పినా చాలు కద?

ఇలా శంబువరయ్యర్ మనసులో కొత్త ఆలోచనలు లేవసాగాయి. కాబట్టి పెద్ద పళువేట్టరయ్యర్ తంజావూరుకు వెళ్ళే ఆలోచనను కుతూహలంతో ఆమోదించారు. ఆయన లేని సమయాన ఆదిత్య కరికాలన్ మనసును బాగా తెలుసుకోవచ్చని, తర్వాత సమయోచితంగా నడుచుకొందామని అనుకొన్నారు. కాబట్టి పెద్ద పళువేట్టరయ్యర్ని ఆయనే త్వరితంగా పరివారసమేతంగా తంజావూరుకు సాగనంపారు.

~

పెద్ద పళువేట్టరయ్యర్ ప్రయాణమై వెళ్ళిన తర్వాత ఆదిత్య కరికాలన్, అతని స్నేహితులు వేటకు బయలుదేరారు. వారి వెంట మణిమేఖలను, తక్కిన చెలికత్తెలను పంపించేందుకు శంబువరయ్యర్

సిద్ధంగా ఉన్నారు. కానీ జరుగుతున్నదంతా మరో ఉద్దేశంతో గమనిస్తూ వస్తున్న గందమారన్ అందుకు అభ్యంతరం తెలిపాడు. మణిమేఖలమీద కరికాలన్ చూపిస్తున్న శ్రద్ధంతా నందినికి పెద్ద పీట వేయడం వల్లనే అని గందమారన్ అనుకొన్నాడు. దానితో అతనికి కరికాలన్ మీదున్న చిరాకు ఇంకా అధికమైంది. ఇదంతా తండ్రికి విశదంగా చెప్పలేకపోయాడు కూడాను. కాబట్టి, “వేటాడే చోటకు ఆడపిల్లలు ఎందుకు? వీరు క్షేమంగా ఉన్నారో లేరోనని చూసుకోవడానికే సమయం సరిపోతుంది. అదీగాక ఇది ఆశ్వయుజ మాసం. ఏ నిమిషమైనా జడివాన పడవచ్చు. చెరువు గట్టు తెగి వరదై పారుతుంది. ఆడవాళ్ళు చాల ఇబ్బంది పడతారు!” అని చెప్పాడు.

అందువల్ల శంబువరయ్యర్ కూడ ఆ ఆలోచనను వదిలిపెట్టారు. ఆదిత్య కరికాలన్ తన స్నేహితులైన పార్థిబేంద్రుడు, వంతిదేవుడు, గందమారన్, తక్కిన వేటగాళ్ళను తీసుకొని వేటకు బయలుదేరి వెళ్ళాడు.

~

అందరూ వెళ్ళిన తర్వాత మాళిగ బోసిగా అనిపించింది. నందిని మణిమేఖలను చూసి, “మగవాళ్ళు ఇంట్లో ఉన్నప్పుడు మనకు ఇబ్బందిగా అనిపిస్తుంది. కానీ వారు బయటకు వెళ్ళినప్పుడు కూడ మనకు సంకటంగానే ఉంటుంది - పరిహసించేందుకు ఎవరూ లేదు కద అని!” అన్నది.

“అవునక్కా! మనం కూడ వేటకు వెళ్ళివుండవచ్చు. నాకు వేట చూడడమంటే చాల ఇష్టం. మా నాన్నగారితోను, అన్నతోను కొన్నిసార్లు వేట చూసేందుకు వెళ్ళాను. కానీ ఇవాళేమో గందమారన్ హఠంపట్టి మనం రాకూడదనేశాడు. బహుశ మీకు ఇష్టం ఉండదని అలా చెప్పాడే, ఏమో?” అన్నది మణిమేఖల.

“అవును. నాకు వేట అంతగా ఇష్టం లేదు. రక్తం చూస్తేనే నాకు గాభరా పుడుతుంది. కానీ గందమారన్ అభ్యంతరం చెప్పింది ఆ కారణంవల్ల కాదు! నిన్ను, నీ ఇంటి అతిథుల్లో ఒకరిని విడివిడిగా ఉంచేందుకే అలా అడ్డు పడ్డాడు!” అన్నది నందిని.

మణిమేఖల బుగ్గలు ఎరుపెక్కాయి. కాసేపు నేలను చూస్తూండిపోయి, “మగవాళ్ళు ఎక్కడికైనా ఏగనీ, అక్కా! వారి సహవాసమే మనకు వద్దు. మనం చెరువు గట్టు మంటపానికి వెళ్ళి అక్కడ జలకాలాట ఆడేసి వద్దాం! వస్తారా?” అన్నది. నందిని కూడ అందుకు ఒప్పుకోగానే తండ్రికి చెప్పి అందుకు కావలసిన ఏర్పాట్లు చేయించింది మణిమేఖల.

~

వీరనారాయణపురం చెరువు దిగువభాగాన ఒక పెద్ద కాలువ ఉందని, దానినుంచి డెబ్బైనాలుగు చిన్న కాలువలు పారుతున్నాయని ఇప్పటికే చూశాం కద? చెరువు ఎగువ భాగాన అటువంటి పెద్ద కాలువ లేదు. చెరువు నేల మట్టం తగ్గుతూ వచ్చి ఆ దిగువభాగాన చెరువు సమతలంగా

ఉంది. పడమటివైపు దట్టమైన అడవి.

ఇలా చెరువు నీరు తగ్గి సమతలమయ్యే ప్రదేశంలో అక్కడక్కడ చిన్న దీవులు/లంకలు అగుపించాయి. ఆ దీవుల్లో ఒకదాంట్లో ఒక మెట్లున్న మంటపం కట్టబడివుంది. ఇక్కడికి కడంబూర్ అంతఃపురస్త్రీలు జలకాలాటకు, ఉల్లాసంగా కాలం వెళ్ళబుచ్చేందుకు రావడం పరిపాటి. ఆ చోటుకు వచ్చి చేరాలంటే రెండు కోసుల దూరం చెరువు చుట్టు తిరిగి రావాలి. లేదా పడవెక్కి చెరువు దాటి రావాలి. ఇందువల్ల, శంబువరయ్యర్ ఇంటి ఆడవాళ్ళు అక్కడికి స్నానానికి వస్తారని తెలిసివుండడం వల్ల, అక్కడికి అన్యులు రావడం జరగదు.

నందిని, మణిమేఖల పడవెక్కి ఆ దీవికి వచ్చి చేరారు. పడవ నడపడం తెలిసిన ఇద్దరు చెలికత్తెలు వెంట వచ్చారు. వంట చేసేందుకు కావలసిన సామగ్రిని కూడ పడవలో వెంట తెచ్చుకొన్నారు. నీటి మంటపం చేరగానే చెలికత్తెలు పడవనుంచి దిగి మంటపంలో వంట ప్రారంభించారు.

నందిని, మణిమేఖల మెట్ల మీద కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకొన్నారు. మణిమేఖల సహజమైన బుద్ధికుశలత కలది; చిలిపి కూడాను. ఆమె పెద్ద పళువేట్టరయ్యర్ ని, కరికాలన్, గందమారన్, పార్థిబేంద్రుడు, వంతిదేవుడు మొదలైన వారిని అనుకరిస్తు మాట్లాడింది. అదంతా చూసి, విని నందిని గలగల నవ్వి ఆనందించింది. కానీ ఆమె ధ్యానం పూర్తిగా మణిమేఖల మీద లేదని, ఆమె మనసు ఏదో ఒక అంతరంగ విషయం గురించి దీర్ఘంగా ఆలోచిస్తూందని సులభంగానే తెలియవచ్చింది.

ఉన్నట్లుండి మణిమేఖల అదిరిపడి లేచి నిలబడింది. “అక్కా! మనం వేటకు వెళ్ళలేదు; కానీ వేట మనని వెతుక్కొంటూ వస్తూంది!” అని పెద్దగా అంటూనే బొడ్లో దోపుకున్న చురకత్తిని తీసింది.

నందిని కూడ ఉలిక్కిపడి లేచి మణిమేఖల చూస్తున్న వైపు చూపులు సారించింది. అక్కడ వాలి విస్తరించివున్న ఒక చెట్టు కొమ్మ పైన చిరుతపులి ఒకటి కనిపించింది. ఆ చిరుత వారి మీదికి దూకుదామా, వద్దా అని ఆలోచిస్తున్నట్లు అగుపించింది.

అదే సమయాన కాస్త దూరాన గుర్రాలు నీట దిగి వేగంగా వస్తున్న శబ్దం కూడ వినిపించింది.

~~~
~~~

# అధ్యాయము - 41

## కరికాలన్ మారణోద్రేకం

**ఆదిత్య** కరికాలన్ తాను వేటాడి చాల కాలమైందని, విలువిద్య మరిచే పోయాడని అన్నాడు కద? ఆరోజు అతడు వీరనారాయణపురం చెరువు చుట్టుపక్కలున్న అడవిలో వేటాడగా చూసినవారు అలా ఎంచలేదు. అతడి విల్లునుంచి వెలువడిన బాణాలకు ఎన్నెన్నో అడవి మృగాలు బలైనాయి. కుందేళ్ళు, జింకలు, ఎలుగుబంట్లు, చిరుతలు చచ్చిపడ్డాయి. మృగాలేవీ కంట పడనప్పుడు, ఆకాశంలో ఎగిరే పక్షుల మీదికి అతడి బాణాలు దూసుకు వెళ్ళాయి. రాబందులు, డేగలు విలవిల్లాడుతూ నేల మీద పడ్డాయి. కరికాలన్ మారణోద్రేకం పొద్దు పోను పోను అధికం కాసాగింది. అతడితో వెళ్ళినవారికి పనెక్కువేమీ లేదు. మనుషులు, గుర్రాలు కేకలేస్తూ గుంపులుగా పరుగెత్తి వెళ్ళడంతో మృగాలు తమ తమ చోటు వదిలి బయటకు వచ్చి పారిపోసాగాయి. తక్కినవారు వేటలో చేసిన సహాయమంతే. కరికాలన్ తన మీదికి దూకవచ్చిన మృగాలమీదికి బాణాలను, శూలాలను విసిరేందుకు కూడ అనుమతివ్వలేదు. గందమారన్ ఒకసారి అలా కరికాలన్ మీదికి దూకవచ్చిన ఎలుగుబంటిమీదికి బాణం వదిలాడు. అప్పుడు కరికాలన్ అతడివైపు తిరిగి చూసి, "గందమారా! నీవు ఎలుగుబంటిని చంపజూశావా? లేక, నన్ను చంపజూశావా?" అని అడిగాడు. గందమారన్ ముఖాన నువ్వులు, మిరియాలు పేలాయి. తర్వాత అతడు విల్లెత్తనే లేదు.

ఇంచుమించు మిట్ట మధ్యాహ్నసమయానికి అందరూ అలిసిపోయారు. కాస్త సేదదీరి ఇంటికి వెళదామా అన్న ఆలోచన అందరి మనసుల్లోను కలిగింది. కానీ కరికాలనేమో అలిసిపోయిన గుర్రాన్ని ఇంకా అడవిదారుల్లో ముందుకు ఉరికించాడు.

~

ఉదయం పూటంతా గందమారన్ కరికాలన్ వెంటే ఉన్నాడు. "నన్ను చంపజూశావా?" అని కరికాలన్ అతన్ని అడిగిన తర్వాత గందమారన్ వెనక్కు తగ్గి, పార్థిబేంద్రునితో చేరి, అతని వెంట వెళ్ళాడు. అతనితో యువరాజు మొరటుతనం గురించి చెప్పుకోనారంభించాడు. పార్థిబేంద్రుడు అందుకు సమధానం చెప్ప మొదలెట్టాడు.

ఈ సమయం చూసి వంతిదేవుడు కరికాలన్ని సమీపించాడు. తర్వాత వారిద్దరు మాత్రమే ఒక్కటిగా ముందుకు సాగారు. వంతిదేవుడు విల్లంబులు తీసుకొని రాలేదు. అతడికి విలువిద్య అంతగా అభ్యాసం లేదు కూడాను. కాబట్టి కరికాలన్‌కి వేటలో అడ్డురాకుండ జాగ్రత్తగా మసలుకోసాగాడు. ఏదైనా అపాయం ఎదురైతే మాత్రం శూలాన్ని ప్రయోగించేందుకు సిద్ధంగా ఉంచుకొని ముందుకు సాగాడు. దాని అవసరం మిట్ట మధ్యాహ్నం వరకు రాలేదు.

~

గండమారన్ పార్థిబేంద్రునితో, "ఇవాళ ఇంత వేటాడింది చాలదా? ఈ ఒక్కరోజే ఈ అడవిలో ఉన్న జంతువులన్నింటినీ చంపి ముగించేస్తారులాగుందే? వీరి వేట పిచ్చి తగ్గేందుకు కొల్లిమలైకే వెళ్ళాలి. 'ఈరోజు వేటాడింది చాలు; ఇంటికి వెళదాం' అని చెప్పండి!" అన్నాడు.

అందుకు పార్థిబేంద్ర పల్లవుడు, "తమ్ముడూ! యువరాజు మనసు ఎందుకో కల్లోలితమైవుంది. ఒక పెద్ద సామ్రాజ్యాన్ని త్యాగం చేయడమంటే మాటలా? ఆ ఉక్రోషాన్నంతా ఈ అడవి జంతువుల మీద చూపుతున్నారు. అంతవరకూ మంచిదే. లేకపోతే నీపైనో, నాపైనో చూపేవారు. ఆయనే అలిసిపోయి, 'చాలు' అనేంతవరకు అడ్డు వెళ్ళడం మంచిది కాదు" అన్నాడు.

ఈ సమయాన ఆ అడవి ప్రాంతమంతా అదిరిపోయేటట్లు ఒక ఉరుము వినిపించింది.

వంతిదేవుని ముఖాన భీతి తాండవమాడింది. "అయ్యో! అడవి పంది! యువరాజును ఆగమనండి!" అని అరిచాడు.

"అడవి పంది అయితేనేం భయం? పులి, ఎలుగు, చిరుతలు యువరాజు చేత పడ్డ పాట్ల ముందు అడవి పంది ఒక లెక్కా?" అన్నాడు పార్థిబేంద్రుడు.

"మీరు తెలియక అంటున్నారు. ఈ అడవిలో ఉన్న అడవి పందులు పులుల్ని, ఎలుగుబంట్లని చీల్చి చెండాడేస్తాయి! ఏనుగులను గుద్ది కింద పడేస్తాయి! గుర్రాలు వాటికి లెక్కే లేదు. శూలాలు, బాణాలు అడవి పందుల భుజాలకు తగిలి చెదిరిపోతాయి తప్ప వాటి ఒంట్లోకి దిగవు...! అయ్యా! అయ్యా! ఆగండి!" అని గండమారన్ కేకలేశాడు.

అదే సమయాన అడవి పొదల్లో సుడిగాలి లాగ ఒక అల్లకల్లోలం లేచింది. మరుక్షణం గున్నఏనుగుల్లాంటి రెండు అడవి పందులు బయటికొచ్చాయి. ఒక క్షణం నిలబడి గుర్రాలను, వాటిమీదున్న మనుషులను పరీక్షగా చూశాయి.

గండమారన్ "జాగ్రత, అయ్యా! జాగ్రత్త!" అని మళ్ళీ కేకవేశాడు.

అంతలో వెంట వచ్చిన వేటగాళ్లలో కొందరు అక్కడికి వచ్చి చేరారు. వారు పలకలు, తప్పెటల్ని ప్రాణం పోయేటట్లు వాయిస్తూ, "కా...కూ..." అని కేకలేయనారంభించారు.

ఆ పందులు ఏమనుకొన్నాయో, ఏమో తెలియదు. ఒక వేళ వాటి పిల్లలను తలుచుకొని ఉండవచ్చు. తమ పిల్లలకు ఆపద రాకుండ అడ్డుకోవాలన్న ఆలోచనతో ప్రేరేపించబడ్డాయో, లేక తప్పెటల శబ్దం విని మొరాయించి ఉండవచ్చు. పందులు రెండూ వేర్వేరు దిక్కుల్లో పరుగెత్తనారంభించాయి.

గండమారన్ అది చూసి, "యువరాజా! ఆ పందులు ఎక్కడైనా వెళ్ళి చావనీ. ఐదారు వేటకుక్కల సహాయం లేకుండ వాటిని తరిమి చంపడం సాధ్యం కాదు!" అన్నాడు.

కరికాలన్ అది చెవిన వేసుకోక వింటిని సారించి బాణం వదిలాడు. అది వెళ్ళి ఒక పంది

వెన్నును తాకడం చూసి, "ఆహా!" అని ఉత్సాహఘోష చేశాడు. మరుక్షణం ఆ అడవి పంది తన ఒంటిని ఒక్కసారి విదిలించుకొంది. ఆ బాణం చెదిరి కింద పడింది; పంది ముందుకు పరుగెత్తింది.

~

గందమారన్ అప్పుడు నవ్విన నవ్వులో హేళన ధ్వనించింది. కరికాలన్ అతన్ని చూసి, "గందమారా! ఒక పందెం! నీవు, వంతిదేవుడు ఆ పందిని తరుముకొని వెళ్ళి చంపి తీసుకొని రండి! ఈ పందులు రెంటిని చంపకుండ అంతఃపురానికి తిరిగి వెళ్ళకూడదు!" అని చెబుతూనే గుర్రాన్ని అదిలించి వదిలాడు. వంతిదేవుడు కూడ అతనితోబాటు వెళ్ళాడు.

వారు తరుముకొంటూ వెళ్ళిన పంది ఏ దిశలో వెళుతూందో కాసేపటివరకు తెలుస్తూ వచ్చింది. ఎందుకంటే పంది వెళ్ళిన దారి పొడుగునా చెట్లు, పొదలు అల్లాడిపోయాయి. తర్వాత ఒక చిన్న కాలువ అడ్డం వచ్చింది. అది అడవిలో పడే వాన నీటిని చెరువుకు తీసుకొని వచ్చి చేర్చే కాలువ. ఆ చోటికి వచ్చిన తర్వాత పంది ఎలా వెళ్ళిందో తెలియలేదు. కాలువ దాటి అవతలున్న అడవిలోకి వెళ్ళిందా? లేక కాలువ దాటకుండ ఈ తీరం వెంబడే పరుగెత్తి పారిపోయిందా?

~

ఆ సమయాన కాలువ వెంబడే చూడగా విశాలమైన చెరువు మధ్య కనిపించిన ఒక దృశ్యం వారిని ఆకట్టుకొంది. ఆ నీటిలో ఒక పడవ వస్తూంది. అందులో వస్తున్నవారు స్త్రీలని తెలుస్తూంది. కానీ వారెవరని తెలియడం లేదు. ఆ సమయాన వంతిదేవుడు, కరికాలన్ ఉన్న వైపే వస్తున్నట్లు అగుపించింది. తర్వాత దాని దిశ కాస్త మారి, చెరువు గట్టు వెంబడి ఉన్న ఇంకొక దీవి వైపు వెళ్ళి మరుగైంది.

"వల్లవరయ్యా! పడవలో ఉన్నవారు ఎవరై ఉండవచ్చు? స్త్రీలలాగ కనిపిస్తున్నారు కద?" అన్నాడు కరికాలన్.

"స్త్రీలలాగే కనిపిస్తున్నారు. అంతకన్న నాకేమీ తెలియడం లేదు" అన్నాడు వంతిదేవుడు.

"ఒకవేళ శంబువరయ్యర్ ఇంటి ఆడవాళ్ళు కావచ్చు కద?"

"కావచ్చు. కానీ వాళ్ళు ఎందుకు ఇంత దూరం రావాలి?"

"అవును. వారై ఉండేందుకు సాధ్యం లేదు. పొద్దున శంబువరయ్యర్ బయలుదేరి వెళ్ళిపోయారు కద? ఖచ్చితంగా తెలుసా?"

"నిశ్చయంగా, అయ్యా! మాళిగ వాకిలి తెరవడం, వారు ఏనుగు పైన వెళ్ళడం నేనే చూశాను."

"ఆయన మాత్రమే వెళ్ళారా?"

"అవును. ముసలాయన మాత్రమే వెళ్ళారు. యువరాణి వెళ్ళలేదు."

"ఆ వృద్ధుని వంటి వీరాధివీరుని మళ్ళీ ఎక్కడ చూడబోతాము? నా తాత మలైయమాన్ కూడ పళువేట్టరయ్యర్ తర్వాతే అని చెప్పాలి."

"ఆ ముసలివాళ్ళ గురించి ఇతరులు చెప్పగా విన్నాను. కానీ మీ వీరత్వాన్ని నేను ప్రత్యక్షంగా యుద్ధరంగంలో చూశాను. కడంబూర్ అంతఃపురంలోను చూశాను. ముసలివాళ్ళు, యుక్తవయస్కులు - అందరినీ ఎలా గడగడ వణికించారు?" అన్నాడు వంతిదేవుడు.

"అది నిజమే. కానీ ఎందుకని అలా గాభరా పుట్టించానో, ఆ సందర్భం దగ్గరయినప్పుడు నా మనసు, శరీరం కూడ వణుకుతాయి. నాలాంటి పిరికిపంద ఈ చోళరాజ్యంలోనే కనిపించబోడు..."

"యువరాజా! ఈరోజు అడవిలో వేటాడుతున్నప్పుడు మీరలా భయపడి వణికినట్లు అగుపించలేదే? అడవి మృగాలు, పక్షులు, వెంట వచ్చినవారు - అందరినీ వణికించింది మీరే కద?"

"ఇదంతా ఒక ధైర్యమా? కేవలం ఒక వేటకుక్క ఒక వేంగై పులిమీదికి లంఘించి చంపగలదు. అడవిపంది మదపుటేనుగుతో కయ్యానికి కాలు దువ్వుతుంది. వేటాడే ధైర్యం ఒక ధైర్యమా? వల్లవరయ్యా! విను! నేను చేసిన కుట్ర ఫలించేసింది. పళువేట్టరయ్యర్ నందినిని ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళిపోయారు. కానీ ఆమెను ఒంటరిగా కలిసి మాట్లాడడమంటే నాకు భయం పుడుతోంది" అన్నాడు కరికాలన్.

"అయ్యా! అందుకు కారణముంది. ఇంతకాలమూ పళువూర్ యువరాణి గురించి ఓరకంగా అనుకొనేవాడిని. ఇప్పుడు ఆమె మీ సహోదరి అని మీరే తెలుసుకొన్నారు. వారేమో మీ చోళకులాన్నే తుడిచిపెట్టేందుకు కుట్ర పన్నుతున్న పాండ్యనాడు కుట్రదారుల పక్షాన చేరారు. ఇదంతా వారికి విశదంగా చెప్పడం కష్టమే. నాకే అందుకు ఒక సందర్భం దొరికినా చెప్పలేకపోయాను..."

"మిత్రమా! నీవు కనిపెట్టి తెలుసుకొని వచ్చిన ఒక్కొక్క వార్త నన్ను అదిరిపడేలా చేస్తున్నాయి. కానీ ఇంకా నేను నమ్మలేకపోతున్నాను. కానీ కొన్ని పాత సంగతులు ఆలోచించి చూస్తే, నిజమే కావచ్చని కూడ అనిపిస్తూంది. నాకూ, ఆమెకు మధ్య ఎప్పుడూ ఒక మాయ తెర ఉంటూ వస్తూంది. పళైయారై పెద్దరాణి - శెంబియన్ మహాదేవి - నందినితో నేను సహవాసం చేయకూడదని ఆ రోజుల్లో నొక్కి చెప్పి కట్టడి చేశారు. కానీ నిజాన్ని పూర్తిగా చెప్పలేదు. చెప్పివుంటే ఇందాకా వచ్చేదికాదు..."

"శెంబియన్ మహాదేవికి పూర్తి నిజం తెలిసివుండకపోవచ్చు. ఎవరో ఒక అనాధ మూగవనిత కని వదిలేసిన ఆడబిడ్డ అని మాత్రమే ఎరిగివుండవచ్చు. పళువూర్ యువరాణి సుందర చోళ చక్రవర్తి కూతురని తెలిసి ఉండకపోవచ్చు."

~~~
~~~

# అధ్యాయము - 42

## "ఆమె ఆడది కాదు!"

**ఆదిత్య** కరికాలన్ కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. చిన్నప్పటి జ్ఞాపకాలు ఉత్తుంగతరంగాలుగా లేచి అతని మనసును కల్లోలపరిచి, తర్వాత ఇంకేవో జ్ఞాపకాలకు తావిచ్చి మరుగైనాయి.

ఆ జ్ఞాపకాల కెరటాలను బలవంతంగా ఆపి, ఒక తీర్మానానికి వచ్చినట్లు పెద్దగా నిట్టూర్చి ఇలా చెప్పనారంభించాడు:-

"జరిగిన విషయాల గురించి ఇప్పుడు మాట్లాడవద్దు. జరగబోయేదాన్ని గురించి ఇప్పుడు మాట్లాడుకొందాం. అందుకే నిన్ను పేరుగా పిలుచుకొని వచ్చాను. పందెంలో మనం ఓడిపోయాము. పంది పారిపోయింది. ఇక ఏం చేయడం, ఎలా వెళ్ళడం అని ఆలోచించి తీర్మానిద్దాం. వల్లవరయ్యా! నందినికి నాకూ మధ్య ఉన్న సంబంధం గురించి తలుచుకొంటేనే భయం కలుగుతూంది. ఆమె ముఖాన్ని బాగ తేరిపార చూసేందుకు కూడ నాకు సాధ్యం కాలేదు. పొరబాటున చూసినప్పుడల్లా, వీరపాండ్యుని ప్రాణం కోసం ఆమె నన్ను బ్రతిమాలినప్పుడు ఎలా ముఖం పెట్టిందో అదే ముఖం కనిపిస్తూంది. ఆమె చూపులు నా హృదయాన్ని కత్తితో కోస్తున్నట్లున్నాయి. నా సహోదరి వీరపాండ్యుని మీద మనసుగొని అతని కోసం నన్ను ప్రాణభిక్ష అడిగిందని తలుచుకొన్నప్పుడల్లా నా గుండె బద్దలయిపోతూంది. వల్లవరయ్యా! నీ మాటేమి? ఇంకా ఆమెకు నిజం తెలియదనా అనుకొంటున్నావు? ఆమె సుందర చోళ చక్రవర్తి కుమార్తె అని, మా అందరికీ సహోదరి అని ఎరగదనుకొంటున్నావా?"

"యువరాజా! ఇదంతా తెలిసివుంటే పాండ్యనాడు కుట్రదారులతో చేయి కలిపేదా? చోళకులానికి విరుద్ధంగా ఒక చిన్న పిల్లాడిని సింహాసనంపైన కూర్చోబెట్టి పాండ్యనాడు రాజుగాను, చోళసామ్రాజ్యపు చక్రవర్తిగాను ఆ పిల్లాడికి పట్టం కడతారా? ఆ మణిమకుటానికి అండగా నిలబడుతానని చేత కత్తి ఎత్తి శపథం చేస్తారా? ఇదంతా పళ్ళిప్పడై సమీపాన అర్ధరాత్రి జరుగుతుండగా నేనే కళ్ళారా చూశాను..."

"ఇదంతా కళ్ళారా చూసిన నిన్ను నందిని ప్రాణాలతో వదిలిపెట్టిందంటే ఆశ్చర్యంగా ఉంది."

"అయ్యా! నాకందులో ఆశ్చర్యమేమీ లేదు. స్త్రీ హృదయంలో స్వాభావికంగా ఇండే కనికరమే కారణం కావచ్చు కదా?"

"వల్లవరయ్యా! నీవు లోకం తెలియనివాడివి. స్త్రీ హృదయంలో గూడు కట్టుకొని ఉండే వంచన ఇదీ అని తెలియనివాడివి. ఏ ఉద్దేశంతో ఆమె నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టిందో నేనెరుగను. కానీ నన్నెందుకు తాళపత్రం పంపి రప్పించిందో నా అంతరంగానికి తెలుసు."

"యువరాజా! అది ఏ కారణమై ఉండవచ్చు?"

"నన్ను చంపి వీరపాండ్యుని మరణానికి పగ తీర్చుకోవడానికే నన్నిక్కడికి రప్పించింది..."

"అయ్యా! అలా ఏదైనా విపరీతం జరగవచ్చనే యువరాకుమారి కుందవై, ముఖ్యమంత్రి ఇద్దరూ నన్ను తొందర తొందరగా ఇక్కడికి పంపించారు. కానీ వారు కడంబూరుకు వెళ్ళవద్దని చెప్పిన మాటను మీరు పట్టించుకోలేదు..."

"వల్లవరయ్యా! యువరాకుమారి, ముఖ్యమంత్రి చాల, చాల తెలివైనవారు. కానీ వారు విధికి అడ్డుపడి దాన్ని ఆపలేరు కద? అరుళ్మొళి గురించి జ్యోతిష్కులు చెప్పిందంతా నిజం కావడం కోసమే విధి నన్ను ఇక్కడికి తీసుకొని వచ్చిందేమో, ఎవరికి తెలుసు? వల్లవరయ్యా! గందమారన్ నా వెనుకనుంచి బాణం వదిలాడు కద? నిజంగానే ఎలుగుబంటిని గురి చూసి వదిలాడా? లేక, నన్ను గురి చూసి వదిలాడా? నీవు గమనించావా?"

"నేను గమనించలేదయ్యా! కానీ గందమారన్ అటువంటి ద్రోహం చేయగలవాడని నేనేనాడూ ఒప్పుకోను. ఇంటికి వచ్చిన అతిథిని, అందులోను చక్రవర్తి కుమారుని, వెనకనుంచి బాణం వదిలి చంపజూసేవాడా గందమారన్? వాడి బుద్ధి కుశలత గురించి, ఆలోచనా శక్తి గురించి నాకు పెద్ద అభిప్రాయం లేదన్నది నిజమే. వెన్నుపోటు పొడవబడి, మూర్ఛబోయినవాడిని నేను మోసుకెళ్ళి కాపాడాను. కళ్ళు తెరవగానే నన్ను చూశాడు కాబట్టి నేనే వాడిని వెన్ను పోటు పొడిచానని అనుకొన్నాడు. అప్పుడు వాడిమీద కలిగిన కోపం ఇంకా తగ్గలేదు. కానీ వాడి బుద్ధి కొంచెం మందమైనా, ద్రోహబుద్ధి కలవాడు కాడు..."

"మిత్రమా! ఒక స్త్రీ మోహనాస్త్రానికి ఎంత శక్తి ఉందో నీకు తెలియదు. ఎంత మంచివాడినైనా అది ద్రోహకార్యం చేసేందుకు పురికొల్పగలదు..."

"అయ్యా! స్త్రీ మోహన శక్తి గురించి నేను కూడ కాస్త ఎరుగుదును. దాని వల్ల నేనేనాడూ ద్రోహిగా మారను!"

"ఆహా! మణిమేఖల మంచిపిల్ల. నిన్ను ద్రోహకార్యం చేయమని పురికొల్పదు."

"నేను మణిమేఖల గురించి చెప్పడంలేదు. పూర్ణచంద్రుని చూసిన కనులకు మిణుగురు పురుగులు ఆకర్షణీయంగా అగుపిస్తాయా?"

"పూర్ణచంద్రుడని ఎవరినంటున్నావు?"

"యువరాజా! కోపగించుకోకండి! పళైయారై యువరాకుమరినే సూచించాను."

"ఒరే, అధిక ప్రసంగీ! ముల్లోకాల్లోని రాజాధిరాజులందరూ కుందవైని పెళ్ళాడాలని తపిస్తున్నారు. అటువంటి నా సహోదరి గురించి నీవు కలలోనైనా ఆలోచించేందుకు ఎంత ధైర్యం?"

"అయ్యా! పూర్ణచంద్రుని మోహన బింబాన్ని, వెలుగును చూసి చక్రవర్తులు ఆనందిస్తున్నారు;

పేదవాళ్ళు కూడ ఆనందిస్తున్నారు! వారిని ఎవరాపగలరు?"

"అవును; నీమీద కోపగించుకొని ప్రయోజనం లేదు. ఇదంతా తెలిసే నేను నిన్ను తాళపత్ర సందేశమిచ్చి నా సహోదరి వద్దకు పంపాను. నీవు కూడ ఆమెకు తృప్తికరంగా కార్యాన్ని నెరవేర్చావు, నడుచుకొన్నావు. కానీ పార్థిబేంద్రుని వద్ద ఇదంతా చెప్పకు! వాడు చోళకులానికి అల్లుడై తొండైనాడుకు రాజై విరాజిల్లాలని కలలుగంటున్నాడు..."

"అయ్యా! కొంతకాలం క్రితం వరకు అలా ఉండి ఉండవచ్చు. ఇప్పుడు గందమారన్, పార్థిబేంద్రుడు - ఇద్దరూ నందినీదేవి కాలితో చెప్పింది తలతో చేసేందుకు సిద్ధంగా ఉన్నారు..."

"అది నేనూ గమనిస్తున్నాను. అందుకే వారి విషయంలో నాకు భయంగా ఉంది..."

"అన్నిటినీ పరిగణనలోకి తీసుకొన్నప్పుడు మీరు యువరాణిని అతి త్వరలో కలిసి అన్ని నిజాలను చెప్పేయడం అవశ్యం అని గట్టిగా అనిపిస్తూంది!""

"మిత్రమా! నాకంత ధైర్యం వస్తుందని అనిపించడం లేదు. నాకు బదులుగా నీవే ఆమెను కలిసి నిజం చెప్పేస్తే ఏం?"

"యువరాజా! నేను చెబితే యువరాణికి నమ్మకం కుదరదు. ఒకసారి నేను వారిని ఏమార్చి తప్పించుకొని పారిపోయాను. కాబట్టి ఇది కూడ ఒక కుట్ర అని వారనుకోవచ్చు."

"కానీ నేను నందినిని ఒంటరిగా కలవడం ఎలా? ఆమేమో అంతఃపురంలో ఉంటుంది!"

"అయ్యా! మణిమేఖల మూలంగా అది సాధ్యం కాగలదు. అందుకు కావలసిన ఏర్పాటు నేను చేస్తాను."

"మణిమేఖలను నీవు బాగా మచ్చిక చేసుకొన్నట్లున్నావు. మంచిదే! ఏదేమైనా, మణిమేఖలను నీకిచ్చి పెళ్ళి చేయించేస్తే నా మనసు కొంతవరకు నెమ్మదిగొంటుంది...."

"అయ్యా! మణిమేఖలను నేను నా తోడబుట్టిన సహోదరిగా భావిస్తున్నాను. ఆమెకు ఇంకా పదిరెట్లు మేలైన అదృష్టం చేకూరుతుందని ఎదురు చూస్తున్నాను..."

"దేని గురించి చెబుతున్నావు?"

"తెలియలేదా, యువరాజా! మణిమేఖల చోళసామ్రాజ్యపు పట్టపు యువరాజు మనసును చూరగొందని ఊహిస్తున్నాను. కాసేపటికి మునుపు శంబువరయ్యర్ కుమార్తె గురించి ఒకలాగ మాట్లాడాను. నా మనసును మీకు తెలియజేసేందుకే అలా మాట్లాడాను. యువరాకుమారి ఒక్కరు తప్ప ఈ లోకంలో పుట్టిన ఇంకే స్త్రీ కూడ మణిమేఖలకు బుద్ధిలోను, గుణంలోను సాటి రారు. మీరు గనక మణిమేఖలను పెళ్ళి చేసుకొంటే మన కష్టాలన్నీ తీరిపోతాయి. శంబువరయ్యర్, గందమారన్ కూడ మన పక్షానికి వచ్చేస్తారు. పళువేట్టరయ్యర్లు ఒంటరైపోతారు. యువరాణి శక్తి కూడ తగ్గిపోతుంది. ఆ తర్వాత మధురాంతకులు రాజ్యం ఊసే ఎత్తరు. చిన్నరాజుల పన్నాగాన్ని, పాండ్యదేశపు కుట్రదారుల కుట్రను ఒకే దెబ్బతో కొట్టేసి విజయం

సాధించవచ్చు...."

"అదంతా సరే, తమ్ముడూ! కడంబూరుకు నేను పెళ్ళి చేసుకోవడానికి రాలేదు. ఏదో ఒక పెద్ద ఆపద దగ్గరవుతూందని నా మనసు హెచ్చరిస్తూంది. నేను చెబుతున్నాను, విను! పళువేట్టరయ్యర్ మధురాంతకునితో తిరిగి వచ్చేటప్పుడు ఒక పెద్ద సైన్యంతో రాబోతున్నారు..."

"అయ్యా! అలాగైతే మనం కూడ తిరుక్కోవలూర్ రాజుగారికి సందేశం పంపి ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని రమ్మంటే? దేనికీ ముందు జాగ్రత్త తీసుకోవడం మంచిది కద?"

"నేను కూడ అందు గురించి ఆలోచిస్తున్నాను. ఒక్కోసారి నాకేమనిపిస్తుందో తెలుసా? ఈ కడంబూర్ మాళిగను నేలమట్టం చేసేసి, ఇక్కడ కుట్ర పన్నుతున్న వారందరినీ కోట వాకిలి ముందు ఉరి తీయాలనిపిస్తుంది. నా తండ్రికి ప్రాముఖ్యతనిచ్చే నా కోపాన్ని అదిమిపెడుతున్నాను. ఆయన్ని గనక నీవు కంచికి పిలుచుకొని వచ్చివుంటే..."

"యువరాజా! ఆయనకు మీరిచ్చిన తాళపత్రం ఇవ్వడమే బ్రహ్మప్రయత్నమైంది కద?"

"అవును; చక్రవర్తి ఈ పళువేట్టరయ్యర్ల చేత బాగ చిక్కుబడిపోయారు. నా కన్నవారికోసమని నేను కంచిలో కట్టిన స్వర్ణమాళిగలో గబిలాలు తిరుగుతున్నాయి. నేను ప్రాణాలతో ఉన్నప్పుడే వారిని ఆ మాళిగకు స్వాగతించే భాగ్యం నాకు దొరుకుతుందో లేదో తెలియదు. ఈ కడంబూర్ వదిలి సజీవంగా బయటపడతానో లేదో అని కూడ సందేహం కలుగుతూంది..."

"యువరాజా! మీరిలా మాట్లాడుతూ పోతుంటే మలైయమాన్ రాజుగారిని సైన్యంతో రమ్మనడం చాల అవశ్యం అనిపిస్తూంది..."

"ఆ కార్యం మీద నిన్నే పంపుదామనుకొంటున్నాను..."

"అయ్యా! మన్నించాలి. తమను వదిలి ఒక్క క్షణం కూడ ఉండకూడదని మీ సహోదరి నన్ను ఆజ్ఞాపించారు."

"దాన్ని నీవింతవరకు బాగా పాటిస్తూ వచ్చావు..."

"పార్థిబేంద్ర పల్లవుడు ఇక్కడ ఊరకే ఉన్నారు. పొద్దు గడవక కష్టపడుతున్నారు...."

"అవును. పళువూర్ యువరాణిని చూడని ఒక్కొక్క క్షణమూ వాడికి ఒక్కొక్క యుగంలాగుంది. పార్థిబేంద్రుడు స్త్రీల అందానికి ఇంతగా బానిసవుతాడని కలలో కూడ అనుకోలేదు. అతన్నే మలైయమాన వద్దకు పంపాలి."

"సరైన ఆలోచన, యువరాజా!"

"అతడు లేని సమయాన నాకేమైనా అపాయం ఎదురైతే సహాయానికి నీవుండనే ఉన్నావు..."

"యువరాజా! ఎవరున్నా లేకపోయినా, మీకు హాని చేయగల ధైర్యంగలవాడు ఈలోకంలో ఉన్నాడని అనుకోను. మీరు లేనప్పుడు మీగురించి ఏవేవో మాట్లాడిన వీర వృద్ధులకు మిమ్మల్ని

ప్రత్యక్షంగా చూడగానే కాళ్ళు చేతులు వణికి మాటలు తడబడడం ప్రత్యక్షంగా చూశాను కద?"

"తమ్ముడూ! చేత కత్తి పట్టి పోరాడగల ఏ మగవాడికీ నేను భయపడను. వెనకనుంచి బాణం వదిలి వెన్నుపోటు పొడవగల గందమారన్ వంటి వారికి కూడ నేను భయపడడం లేదు..."

"మళ్ళీ గందమారన్ గురించి అలా మాట్లాడుతున్నారేం...?"

""విను, తమ్ముడూ! ఒక ఆడదాని మనసు లోతుల్లోని వంచనకు మాత్రమే నేను భయపడుతున్నాను. ఆమె మనసులో ఏం ఉందో అని తలుచుకొన్నప్పుడల్లా నా మనసు దడదడలాడుతూంది. ఆమె నన్ను మర్మంగా చూసే ఒక్కొక్క చూపూ ఈటెలాగ నా గుండెలోకి దూసుకు పోతూంది. దాన్ని తలుచుకొంటేనే నా కాళ్ళు చేతులు చల్లబడుతున్నాయి..."

"అయ్యా! నందినీదేవి వంచనకు భయపడవలసిందే అని నేనూ ఒప్పుకొంటున్నాను. ఆమె మనసులో ఎంతటి భయంకరమైన ద్వేషం గూడు కట్టుకొని ఉందో నాకు తెలుసు. నన్ను ప్రాణాలతో వదిలిపెట్టిన విషయం తలుచుకొంటే అందులో ఏ కుట్ర/పన్నాగం ఉందోనని భీతిల్లుతున్నాను. కానీ ఇదంతా వారికి నిజం తెలియకపోవడంవల్లనే కద? ఆమె సహోదరులు మీరు అని తెలియజెప్పేస్తే ఇంకే దిగులుండదు కద?"

"అలాగా అనుకొంటున్నావు? వల్లవరయ్యా! నీవు చాల తెలివైనవాడివే! కానీ స్త్రీల స్వభావం తెలియని అమాయకుడివి. నందినికి తాను సుందర చోళ చక్రవర్తి కుమార్తె అని తెలిస్తే, మా అందరిమీద ఆమె క్రోధం నూరు రెట్లు పెరిగిపోతుంది. తంజావూరు సామ్రాజ్యానికి ఆమెను చక్రవర్తినిగా చేస్తామని చెప్పినా ఆమె కోపం తీరదు..."

"యువరాజా! మీరలా అనుకొంటుంటే ఆ బాధ్యతను నాకే ఒప్పజెప్పండి. నేనే నందినికి నిజవృత్తాంతాన్ని చెబుతాను. వారి కోపాన్ని చల్లార్చేందుకు కూడ ప్రయత్నిస్తాను."

"నీ వల్ల కూడ అది సాధ్యంకాదు, మిత్రమా! నందిని కోపాన్ని ఎవరూ అడ్డుకోలేరు. నేను చెప్పేది విను! మా చోళకులాన్ని కాపాడాలంటే - నేను మరణించాలి; లేదా, ఆమె చావాలి; లేక ఇద్దరూ చావాలి. వీర పాండ్యుని చంపిన కత్తితో ఆమెనూ చంపేస్తాను..."

"యువరాజా! ఇదేం భయంకరమైన మాట?"

"వల్లవరయ్యా! ఒక సామ్రాజ్యాన్ని కాపాడేందుకు ఒక ప్రాణాన్ని చంపడం నేరమా? ఆమె ఆడదైతే మాత్రమేమి? నాతోడబుట్టిన సహోదరియైతేనేమి? నిజానికి ఆమె స్త్రీ కాదు; స్త్రీరూపంగొన్న మాయమోహినీ పిశాచి! ఆమెను ప్రాణాలతో వదిలిపెడితే విజయాలయ చోళుల కాలంనుంచి పెరుగుతూ, విస్తరిల్లుతూ వస్తున్న చోళసామ్రాజ్యం ఛిన్నాభిన్నమైపోతుంది...! ఆహా! అదేమి?" అని ఆదిత్య కరికాలన్ దిగులుతో ప్రశ్నించి, తిరిగి చూశాడు.

అప్పుడు వారున్న చోటికి కాస్త దూరాన అడవి పొదల మధ్య ఏదో కల్లోలం పుట్టింది. ఇద్దరూ

గుర్రాలను అదిలించి దగ్గరకు వెళ్ళి చూశారు. చూడగా వారికి ఒక అపూర్వమైన దృశ్యం కానవచ్చింది. ఒక అడవి పంది, ఒక చిరుత భీకరంగా పోరాడుతుండడం కనిపించింది.

"ఆహా! మనం వెతుక్కొంటూ వచ్చినవాడిక్కడున్నాడు!" అన్నాడు కరికాలన్.

"చిరుత మనకు పని లేకుండ చేసేస్తుంది కాబోలు!" అన్నాడు వంతిదేవుడు.

"అలాగా అనుకొంటున్నావు? చూస్తూండు!" అన్నాడు కరికాలన్.

~

చిరుతకు, పందికి మధ్య జరుగుతున్న భీకర పోరాటాన్ని ఇద్దరూ కాసేపు కన్నార్పకుండ చూశారు.

చిరుత పందిపైకి దూకి, తన కోరపళ్లతోను, పంజాతోను పందిని గాయపరచజూసింది. కానీ అడవి పంది గట్టి చర్మం చిరుత కోరపళ్ళకు, గోళ్ళకు ఏమాత్రం చెక్కు చెదరలేదు. కానీ పంది పరుగెత్తుకు వచ్చి చిరుతను కుమ్మి, నేలకు, చెట్లకు, చెట్ల వేళ్ళకు అదిమి తొక్కినప్పుడల్లా చిరుత పడరాని పాట్లు పడింది. పంది కోరపళ్ళు చిరుత చర్మాన్ని ఛిన్నాభిన్నంగా చీల్చాయి. చివరగా పంది చిరుతను కుమ్మి నేలకు రాచినపుడు అది చచ్చినట్లు పడివుంది.

"తమ్ముడూ! చిరుత చచ్చిపోయింది. పంది ఇక మనపైకి తిరుగుతుంది! అందుకు మనం సిద్ధం కావాలి!" అంటూనే కరికాలన్ విల్లుకు బాణం సంధించి వదిలాడు.

బాణం వెళ్ళి పంది మెడకు తగిలింది. పంది మెడను విదిలిస్తూనే తిరిగి చూసింది. రెండు గుర్రాలను, వాటిపైనున్న మనుషులను ఒక్క క్షణం తేరిపార చూసింది. తర్వాత ఒకసారి చిరుతను చూసింది. అది ఇక ఏం చేయలేదని తెలుసుకొంది కాబోలు! మూర్ఛావేశంతో గుర్రాల వైపు ఉరుకుతూ వేగంగా వచ్చింది. కరికాలన్ ఇంకొక బాణాన్ని సంధించేలోపు అది అతని గుర్రాన్ని గుద్దింది. అ గుద్దిన వేగానికి గుర్రం వెనుక కాళ్ళు ఒక చెట్టు వేరులో చిక్కుబడగా అది తడబడి కింద పడింది. గుర్రం కింద కరికాలన్ చిక్కుబడ్డాడు.

పంది మళ్ళీ వెనక్కు కాస్త వెళ్ళి కింద పడివున్న గుర్రాన్ని గుద్దేందుకు ముందుకు దూకింది.

~~~
~~~

# అధ్యాయము - 43

## "పులి ఎక్కడ?"

**ఆదిత్య** కరికాలన్ ఎటువంటి ఆపదలో చిక్కుకొన్నాడన్నది వంతిదేవుడు వెంటనే గ్రహించాడు. కన్ను మూసి తెరిచేలోపు తన గుర్రాన్ని మెరుపువేగాన ముందుకు దూకించి తన చేతిలోని శూలంతో పంది వీపుమీద పొడిచాడు. శూలం పంది వీపులో కొద్దిగా దిగింది. పంది తన ఒంటిని ఒక్కసారి విదిలించుకొని ఇటు తిరిగింది. ఆ వేగానికి వంతిదేవుడు చేత పట్టుకొన్న శూలం పట్టు జారి కింద పడిపోయింది.

పంది ఇప్పుడు వంతిదేవునివైపు వేగంగా పరుగెత్తుకు రాసాగింది. అతడు తన వైపు వస్తున్న అపాయాన్ని గ్రహించాడు. పంది గుద్దితే తన గుర్రం తట్టుకోలేదు. చేత శూలం కూడ లేదు. యువరాజేమో ఇంకా గుర్రం కిందినుంచి బయటికొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తాను గుర్రం పైన ఉన్న పళంగా ఏదైనా చెట్టుమీదికెగిరి ఎక్కితేనే తప్పించుకోవచ్చు. ఛీఛీ! ఎన్నో అపాయాలనుంచి తప్పించుకొని చివరికి కేవలం ఒక అడవి పంది చేతనా చావాలి?

తన అదృష్టం కొద్దీ దగ్గర్లోనే కిందికి వంగివున్న ఒక చెట్టుకొమ్మ అగుపించింది. వంతిదేవుడు గుర్రంమీదినుంచి ఎగిరి ఆ చెట్టుకొమ్మను పట్టుకొన్నాడు. కాలినుంచి తలవరకు తన బలాన్నంతా ఉపయోగించి కొమ్మమీదికెక్కాడు. అదే సమయాన పంది గుర్రాన్ని కుమ్మింది. గుర్రం తడబడి, ఎలాగో నిలదొక్కుకొని దూరంగా పరుగెత్తింది.

కరికాలన్ ఇంకా గుర్రం కిందే పడివున్నాడు. వంతిదేవుడు చెట్టుకొమ్మమీదున్నాడు. అడవి పంది ఇద్దరికీ నడుమ నిలబడి అటూఇటూ చూసింది.

~

ఇద్దరు ప్రత్యర్థుల్లో ఎవరిని ముందు ముట్టడించాలని అది ఆలోచిస్తూందని వంతిదేవుడు గ్రహించాడు,. యువరాజింకా గుర్రంకిందే పడివున్నారు. ఎలాగో గుర్రాన్ని పక్కకు నెట్టి బయటకు వచ్చినా, పంది ముట్టడిని ఎదుర్కోగలగడం సందేహమే. ఆయన చేతిలో ఏ ఆయుధమూ లేదు. వింటికి బాణం సంధించి వదలాలి. గుర్రం కిందపడి చిక్కుబడిపోవడం వల్ల ఆయనకు బలమైన గాయాలేమైన కలిగివుండవచ్చు. ఎలాగైన యువరాజుకు కాస్త అవకాశం కల్పించాలి. ఇదంతా మెరుపువేగంతో ఆలోచించి వంతిదేవుడు ఒక తీర్మానానికి వచ్చాడు. తానెక్కివున్న చెట్టుకొమ్మను బలంగా కదిలిస్తూనే, "ఆహా ఊహూ!" అని పెద్దగా చప్పుడు చేశాడు.

అతడి యుక్తి ఫలించింది. పంది మూర్ఖావేశంతో అతనెక్కివున్న చెట్టువైపు పరుగెత్తి వచ్చింది.

"రానీ, రానీ! వచ్చి చెట్టుకు గుద్దుకోనీ!" అని వంతిదేవుడు మనసులో అనుకొంటుండగానే, అతడెక్కి కూర్చొనివున్న కొమ్మ ఫెళఫెళ విరిగింది! దేవుడా! ఇదేం ఆపద! - కొమ్మతోబాటు కింద పడితే!? మరుక్షణమే పంది కోరపళ్ళు అతన్ని చీల్చి చెండాడేస్తాయి. ఇంకొక కొమ్మకు ఎగిరి పట్టుకొంటేనే బతికినట్లు. అలా దూకి ఇంకొక కొమ్మను పట్టుకోజూశాడు. పట్టుకోజూసిన కొమ్మ కాస్త దూరాన ఉండడం వల్ల ఒక చేతికి మాత్రమే పట్టు దొరికింది. చేతిపట్టు జారిపోనారంభించింది. కాళ్ళు ఊగిసలాడాయి! ఇక కింద పడవలసిందే - వెంటనే మరణం తథ్యం! ఏదో చివరి ప్రయత్నంగా యువరాజును కాపాడగలిగాం కద? యువరాకుమారి ఇది తెలుసుకొన్నప్పుడు సంతోషపడతారు కద? తన మరణానికి ఒక్క బొట్టు కన్నీరైనా విడుస్తారు కద?

ఉన్నట్లుండి ఏదో ఒక భయంకరమైన శబ్దం వినిపించింది! అదే సమయాన తన చేతిపట్టు కూడ జారిపోయింది! వంతిదేవుడు కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు. ధడేల్మని కింద పడ్డాడు. పడుతూనే స్పృహ తప్పాడు.

~

వంతిదేవునికి తెలివొచ్చి కళ్ళు తెరిచినప్పుడు యువరాజు ఆదిత్య కరికాలన్ అతని ముఖంపైన నీళ్ళు చల్లుతున్నాడు. చటుక్కున లేచి కూర్చొని, "యువరాజా! బతికేవున్నారా?" అని అడిగాడు.

"అవును. నీ దయవల్ల ఇంకా బతికేవున్నాను" అన్నాడు కరికాలన్.

"అడవి పంది ఏమైంది?"

"అదిగో!" అని కరికాలన్ వేలెత్తి చూపించిన చోట అది చచ్చి పడివుంది.

వంతిదేవుడు దాన్ని కాస్త పరీక్షగా చూసి, "యువరాజా! ఇంత చిన్నదైన ఈ ప్రాణి మనను ఎన్ని పాట్లు పడేట్లు చేసింది? గందమారన్ అడవి పంది గురించి చెప్పిందంతా నిజమే. చివరికి దాన్ని ఎలా చంపారు?" అని అడిగాడు.

"నేను చంపలేదు. నీ శూలమూ, నీవూ ఒక్కసారిగా చేరి దాన్ని చంపారు!"

వంతిదేవుడు అది అర్థంకానివాడిలాగ యువరాజు ముఖాన్ని చూశాడు.

"నా శూలాన్ని చాల బాగ ఉపయోగించారు! కానీ నేనేం చేయలేదే? ఆపత్కాలంలో మీకు సహాయం చేయలేనివాడనైనాను కద?" అన్నాడు.

"నీవు చెట్టుకొమ్మను పట్టుకొని గట్టిగా కదిలిస్తూ చప్పుడు చేశావు కద? అప్పుడు నేను గుర్రం కింది నుంచి బయటకు వచ్చి నీ శూలాన్ని చేత తీసుకొన్నాను. నా మనసులో పొంగుతున్న కోపాన్నంతా, పాపం, ఆ పందిమీద ప్రయోగించాను. శూలంతో పొడవబడగానే అది భయంకరంగా అరిచింది - నా చెవులే దిబ్బెళ్ళు పడేటంత పెద్దగా. కానీ శూలం పోటుతో మాత్రమే చావలేదది. నీవు చెట్టుకొమ్మ పైనుంచి జారి దాని మీద పడ్డావు! ఆ అదిరిపాటు వల్లనే చచ్చింది!" అని చెప్పేసి నవ్వాడు కరికాలన్. వంతిదేవుడు కూడ

అది తెలుచుకొని నవ్వాడు. ఒంటిని తడిమి చూసుకొని, "పందిపైన పడినందువల్లనేనేమో గాయాలేమీ లేకుండ తప్పించుకొన్నాను. మహావిష్ణువు వరాహావతారమెత్తి హిరణ్యాక్షుని చంపారని ఇక నేను నమ్మగలను! అబ్బ! ఎంతటి మూర్ఖప్రాణి!" అన్నాడు.

"ఈ చిన్న పందిని చూసి వరాహావతారాన్ని లోకువగా ఎంచకు, తమ్ముడూ! ఉత్తరాన వింధ్యపర్వతాల్లోని అడవుల్లో తలలో ఒంటి కొమ్మున్న అడవి పంది ఒకటుందట. ఇంచుమించు ఏనుగంత పెద్దదిగా ఉంటుందట. అంతటి పందే అయితే, అది వచ్చి ఈ చెట్టును కుమ్మితే దాని గతేం కావాలి?" అన్నాడు యువరాజు.

"చెట్టు కూకటివేళ్ళతో పెకలించుకొని కూలిపోయేది. మీరు విసిరిన శూలంకూడ విరిగిపోయేది. మన గతి అధోగతే. చోళకులపు శత్రువులకు పని లేకుండ పోయేది" అన్నాడు వంతిదేవుడు.

"తమ్ముడూ! నిజం చెప్పు! నా గుర్రం తడబడి కింద పడగానే శూలాన్ని విసిరావు కద? ఆ అడవిపంది మీదికి విసిరావా? నామీదికి విసిరావా?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

~

వంతిదేవుడు కోపంగా, 'అయ్యా! నిజంగానే మీరీ ప్రశ్న అడుగుతున్నారా? అలా మీకు సందేహం కలిగివుంటే పందిని చంపి నన్ను కాపాడవలసిన అవసరమేమి?" అని అడిగాడు.

"అవును, నిజమే. నీపైన సందేహం కలగకూడదు. నీవు చెట్టుకొమ్మను ఊగించి కేకలేయకపోయివుంటే ఆ పంది నాకే యముడైవుండేది. కానీ నీవు శూలాన్నెత్తినప్పుడు ఒక్క క్షణం నాకలాంటి సందేహం కలిగింది. ఇప్పుడల్లా నాకు దేన్ని చూసినా, ఎవరిని చూసినా కూడ అనవసరంగా సందేహం కలుగుతూంది. యముడు నన్ను వెన్నంటి వస్తున్నాడన్న భ్రమను పోగొట్టుకోవడమే అసాధ్యమైపోతూంది. యముడు నన్ను చంపేందుకు ఈ పంది రూపంలో వచ్చాడని కూడ ఊహించుకొన్నాను..."

"అలాగైతే చాల మంచిది. యువరాజా! మిమ్మల్ని వెన్నంటి వచ్చిన యముడు చచ్చి తొలగిపోయాడు. ఇంకేం దిగులు? గందమారన్‌తో వేసుకొన్న పందెంలో కూడ గెలిచాము. పందిని లాక్కొని వెళ్ళాలంతే కద? బయల్దేరుదామా?" అన్నాడు వంతిదేవుడు.

"బయల్దేరవలసిందే. కానీ అందుకు తొందరెందుకు? కాసేపు ఇక్కడే ఉండి అలసట తీర్చుకొని వెళదాం" అన్నారు యువరాజు.

"మీరు అలిసిపోయారని చెప్పడాన్ని మొట్టమొదటిసారిగా ఇప్పుడే వింటున్నాను. అవును, గుర్రం కింద చిక్కుపడి చాల కష్టపడివుంటారు."

"అదేమీ లేదు. ఒంట్లోని అలసట కన్న మనసులోని అలసటే అధికంగా ఉంది. వచ్చిన దారినే అంత దూరమూ అడవి దారినే వెళ్ళాలా? మళ్ళీ ఆ మూర్ఖులతో చేరి కద ప్రయాణం చేయవలసివస్తుంది?

దాని కన్న ఈ చెరువు దాటి వెళితేనేం?"

"ఈ సముద్రంలాంటి చెరువునా దాటుదాం అంటున్నారు? పందినుంచి కాపాడి ఈ చెరువులో నన్ను ముంచి చంపాలనా మీ ఉద్దేశం?" అన్నాడు వంతిదేవుడు.

"నీవు ఈదలేవన్న విషయం జ్ఞాపకముంది. నేను కూడ ఇంత పెద్ద చెరువును ఈది దాటలేను. ఒక పడవ దొరికితే పని సులువైపోతుంది. కాసేపటికి మునుపు ఒక పడవను చూశాం కద? అది సమీపాన చెరువు తీరం వెంబడే నిలబడివుండాలి కద? దాన్ని వెతికి పట్టుకొంటే ఏం?"

"గుర్రాల గతేమి? అడవి మృగాలకు ఆహారం కానీ అని వదిలిపెట్టి వెళ్ళిపోదామా?" అన్నాడు వంతిదేవుడు.

వెంటనే ఏదో జ్ఞాపకం వచ్చి, "అయ్యో! పులి ఎక్కడ?" అని అడిగాడు.

"నేనూ దాన్ని మరిచిపోయాను. ఇక్కడే ఎక్కడో దాక్కొనివుండాలి. యముడు పంది రూపంలో కాకుండ పులి రూపంలో నన్ను వెన్నంటి వస్తుండవచ్చు కద?" అన్నాడు కరికాలన్.

ఇద్దరూ చుట్టుపక్కల పరీక్షగా చూడనారంభించారు. కాసేపు వెతికిన తర్వాత వంతిదేవుడు, "అదిగో!" అని వేలెత్తి చూపించాడు.

~

చెరువులోకి వాన నీటిని తీసుకొని వచ్చి చేరుస్తున్న ఆ కాలువ ఉత్తరంగా పోను పోను సన్నబడసాగింది. అలా ఇరుగ్గా ఉన్న చోట ఒక పెద్ద చెట్టు కాలువకడ్డంగా పడి గట్లను తాకుతూంది. పులి ఆ చెట్టు కాండం మీద మెల్లగా ఊని నడుస్తూ అవతలి గట్టును సమీపిస్తుండడాన్ని ఇద్దరూ గమనించారు. ఇద్దరి మనసుల్లోను ఒకే ఆలోచన పుట్టింది.

"అయ్యో! పడవలో వచ్చిన స్త్రీలు!" అని ఇద్దరూ ఒకేసారి పెద్దగా అరిచారు.

తర్వాత, "ఈ కాలువ పక్కనేవున్న దీవిలోనే ఆ స్త్రీలు దిగివుండాలి" అన్నాడు వంతిదేవుడు.

"గాయపడ్డ చిరుత చాల అపాయకరమైనది" అన్నాడు యువరాజు.

"పందితోబాటు పులిని కూడ చంపి పడేయాలి."

"ఈ కాలువను ఎలా దాటడం? గుర్రాలు ఈ చెట్టు కాండంమీద నడవలేవు కద?"

"కాలువలో నీటి లోతు తక్కువగానే ఉండాలి. దిగి వెళదాం."

ఇంతలో కరికాలన్ గుర్రం లేచి వంతిదేవుని గుర్రం దగ్గరకు వెళ్ళి నిలబడింది. యజమానులు అంతరంగంగా మాట్లాడుకొన్నట్లు అవి కూడ కాసేపటికి మునుపు కలిగిన అపాయం గురించి మాట్లాడుకొన్నాయి కాబోలు.

ఇద్దరూ తమ తమ గుర్రాలమీదికెగిరి కూర్చొన్నారు. గుర్రాలు కాలువలో అడుగుపెట్టాయి. కాలువలో నీరు తక్కువగానే ఉంది. కానీ చాల బురదగా ఉంది. గుర్రాలు తడబడుతూ

ముందుకు సాగాయి.

కోడిక్కరై ఊబి గుంటలను తలుచుకొని వంతిదేవుడు, "ఈ బురద అంత పెద్దదేం కాదు" అని తనకు తానే ధైర్యం చెప్పుకొన్నాడు. దాని గురించి కరికాలన్‌కి కూడ చెప్పనారంభించాడు.

"మిత్రమా! బయటవున్న బురద గురించి చెప్ప మొదలెట్టావా? మనుషుల మనసులో ఉన్న బురద గురించి నీవేమంటావు? ఒక సారి నీచబుద్ధి అనే బురదలో కాలు పెడితే వారు గట్టెక్కడం చాల కష్టమని తెలుసా?" అని కరికాలన్ అడిగాడు. యువరాజు మనసు నిజానికి బురదగుంటలాగ కల్లోలితమై ఉందని భావించాడు వంతిదేవుడు.

~

గుర్రాలు అతిప్రయాస పడి అవతలి గట్టుకు చేరాయి.

అడవి లోపల అతి జాగరూకతతో అన్ని వైపులా పరికించి చూస్తూ ఇద్దరూ ముందుకు సాగారు.

కరికాలన్ చేతిలో విల్లంబులు సిద్ధంగా ఉన్నాయి.

వంతిదేవుడు తన శూలాన్ని పులిమీదికి విసిరేందుకు సిద్ధంగా పట్టుకొన్నాడు.

ఉన్నట్లుండి, అడవిలో సాధారణంగా వినిపించే శబ్దాలను మీరి ఒక స్త్రీ 'కీచు'మని అరిచిన శబ్దం, "అమ్మా! పులి!" అన్న కేక వినిపించాయి.

మణిమేఖల చెట్టుకొమ్మ మీద పులిని చూసిన అదేసమయాన వసంత మంటపంలో వంట చేస్తున్న పనిమనిషి అమ్మాయిల్లో ఒకతె కూడ ఆ పులిని చూసి అలా కేక వేసింది.

ఆ కేక ఇద్దరు మిత్రుల చెవుల్లోను పడి వారికి గగుర్పాటు కలిగించింది.

గుర్రాలను ఆ కేక వినిపించిన దిక్కున వేగంగా పరుగెత్తించారు.

చెరువు దిగువ భాగం ఒక మలుపు తిరిగిన చోట వారు చూసిన దృశ్యం ఇద్దరినీ అదిరిపడేటట్లు చేసింది.

నందిని, మణిమేఖల స్నానం చేసేందుకు కోసం కాబోలు ఆ మంటపం మెట్లు దిగి నీట అడుగు పెట్టబోతుండగా ఆ చిరుత చెట్టు కొమ్మ ఒకదాని మీద మెల్లమెల్లగా పైకెక్కసాగింది.

పందితో పోరాడి బాగా గాయపడ్డ ఆ చిరుత తన ప్రాణం కాపాడుకొంటే చాలన్న ఉద్దేశంతో ఉంది.

కానీ అది ఆ చిరుతకు తప్ప ఇంకెవరికీ తెలియదు.

మరుక్షణమే ఆ చిరుత నీట నిలబడ్డ మణిమేఖల మీద, నందిని మీద దూకబోతూందని ఇద్దరు మిత్రులూ భావించారు.

వంతిదేవుడు శూలాన్ని ప్రయోగించేందుకు జంకాడు. శూలం గురి తప్పి ఆ అమ్మాయిల మీద పడితే ఏం చేయడమని భయపడ్డాడు.

కరికాలన్‌కి అటువంటి భయం/జంకు కలగలేదు. వింటికి బాణాన్ని సంధించి సరిగ్గా గురి చూసి

వదిలాడు.

బాణం సర్రున దూసుకు వెళ్ళి పులి పొత్తికడుపును కొట్టింది. పులి భయంకరంగా గర్జిస్తూ కొమ్మమీది నుంచి అమ్మాయిల మీదికి దూకింది.

మరుక్షణం ఏం జరిగిందని స్పష్టంగా చూసి తెలుసుకోలేనట్లు అంతా గందరగోళమైంది. చిరుత, ఇద్దరు అమ్మాయిలూ ఉన్నట్లుండి మాయమైనారు.

కొన్ని క్షణాల తర్వాత ముగ్గురూ వేర్వేరు చోట్లలో నీటినుంచి తలెత్తారు. చెరువు నీటితో రక్తం కలిసి ఎర్రబారింది.

~~~
~~~

# అధ్యాయము - 44

## ప్రేమ – పగ

**ఇద్దరు** మిత్రులు పైన వివరించిన సంఘటనలను గాభరాతో చూస్తూ, గుర్రాలమీదినుంచి ఒక ఉదుటున కిందికి దూకి ఆ కాలువ గట్టు వెంబడి పరుగెత్తారు.

ఇంతలో చిరుత కాలువనీటిలో కాస్త దూరం వెళ్ళిపోయింది! అది తేలుతున్న తీరు చూస్తుంటే అది చచ్చి తేలుతున్నట్లనిపించింది.

స్త్రీలిద్దరూ చిరుతచేత ఎంత తీవ్రంగా గాయపడ్డారో ఇంకా తెలియరాలేదు.

వంతిదేవుడు మొదట మణిమేఖలను సమీపించాడు. ఎందుకంటే నందిని దాపుకు వెళ్ళేందుకు అతడికి ధైర్యం చాలలేదు.

మణిమేఖలకు ఏమీ గాయాలేర్పడలేదు. పులి నీట పడ్డ వేగానికి ఆమెకూడ నీటిలో పడిపోయి కాస్త ఊపిరి సలపకుండపోయింది. అది తప్ప ఆమెకింకేమీ గాయాలు కలగలేదు.

వంతిదేవుడు తనని సమీపిస్తుండడాన్ని చూడగానే ఆమె ఎనలేని అలసటగొన్నట్లు కళ్ళు గట్టిగా మూసుకొంది.

కాబట్టి కరికాలన్ వంతిదేవుని చేయి పట్టి ఆపి, నందినివైపు పంపించి, తనవైపు రావడాన్ని గమనించలేదు మణిమేఖల. కరికాలన్ ఆమెను రెండు చేతులతో ఎత్తి మెట్లెక్కి మంటపంలోకి వెళ్ళి నేలమీద మెత్తగా పెట్టేంతవరకు ఆమె కళ్ళు తెరవనేలేదు. శ్వాస ఆడుతూందా లేదా అని కరికాలన్ ఆమె ముక్కు కింద తన వేలిని ఉంచినప్పుడే మెల్లమెల్లగా కళ్ళు తెరిచింది. కళ్ళు తెరిచేటప్పుడే తన ఎనలేని ప్రేమానురాగాలను వంతిదేవునికి తెలియపరచాలని ప్రేమ, కుతూహలం నిండిన చూపులతో చూసింది. తన ముందున్నది యువరాజు కరికాలన్ అని తెలియగానే తుళ్ళిపడి లేచి అవతలకు వెళ్ళి కూర్చొంది.

ఆమె ముఖాన అప్పుడు కనిపించిన నిరాశను చూసి గొల్లున నవ్వారు యువరాజు.

"మణిమేఖలా! ఇదేమి ఉలికిపాటు? నన్ను చూసి ఎందుకంత అయిష్టం?" అన్నారు.

"అయ్యా! అన్యపురుషుల చేయి తలిగితే స్త్రీలకు సంకోచం/జంకు కలగదా?" అన్నది మణిమేఖల.

"అమ్మాయీ! నన్ను అన్యపురుషునిగా భావిస్తున్నావా? నాకూ, నీకు పెళ్ళి జరిపించేందుకు పెద్ద ప్రయత్నం జరుగుతోంది కద?" అన్నారు కరికాలన్.

"స్వామీ! ఆ ప్రయత్నం ఫలించిన తర్వాతే కద సంబంధం ఏర్పడుతుంది? అంతవరకు మీరు అన్యపురుషులే కద?" అన్నది మణిమేఖల.

"కానీ అది నీకు ఇష్టమా లేదా అని నీవు చెప్పవచ్చు కద?"

~

కడంబూర్ రాకుమారి కాస్త ఆలోచించి, "అయ్యా! మీరు చోళకుల దీపం; అన్నీ తెలిసిన బుద్ధిమంతులు. చిన్న పిల్లనైన నాతోటి ఇలా మాట్లాడవచ్చా? నా తండ్రిని కద అడగాలి?" అన్నది.

"అమ్మాయీ! నీ తండ్రి సమ్మతిస్తే నీకు సమ్మతమేనా?"

"నాతండ్రి సమ్మతించిన తర్వాత ఆయన అడిగితే చెబుతాను. మీ వద్ద ఈ విషయం గురించి మాట్లాడేందుకే సిగ్గుగా ఉంది. పులి నన్ను చంపకుండ, నేను నీట మునిగిపోకుండ కాపాడారు. అందువల్ల నాకు మీపట్ల కలిగిన కృతజ్ఞతాభావం వల్ల ఇంతసేపు ఓపికగా ఉన్నాను..."

కరికాలన్ నవ్వేసి, "మణిమేఖలా! నీవు చాల తెలివైనదానివి. అయినాకూడ మోసపోయావు కద! అందుకు నన్ను ఏమార్చేందుకు ప్రయత్నించకు!" అన్నారు యువరాజు.

"అయ్యా! ఇదేం మాట? మిమ్మల్ని ఈ అమాయకురాలు ఏమార్చగలగడమా? ఎందుకు? ఏ విధంగా?"

"ఎందుకు వృధాగా డొంక తిరుగుడు మాటలు మాట్లాడుతున్నావు? నాకు బదులు వంతిదేవుడు నిన్ను తీసుకొని వచ్చి గట్టుకు చేర్చివుంటే ఇంత కఠినంగా మాట్లాడేదానివా? వంతిదేవుడని ఊహించుకొనే కద నీవు కళ్ళు మూసుకొన్నావు? మోసపోయావు!" అన్నాడు కరికాలన్.

మణిమేఖలకు సిగ్గుతోబాటు కాస్త భయం కూడ కలిగింది. తర్వాత ధైర్యం తెచ్చుకొని, "రాజా! మీకు నా మనసు తెలిసింది కద? అలాంటప్పుడు ఈ అమాయకురాలిని ఎందుకు పరీక్షిస్తున్నారు?" అన్నది.

"మణిమేఖలా! నేను నీ మనసు తెలుసుకొన్నాను. అలాగే వంతిదేవుని మనసు కూడ నాకు తెలుసు. నీ పరిశుద్ధమైన ప్రేమకు అతడు పాత్రుడు కాడు కద అని యోచిస్తున్నాను. అదిగో చూడు. వంతిదేవుడు, నందిని - ఇద్దరి సల్లాపాలను! నందిని ముఖంలోని కుతూహలాన్ని చూడు!" అన్నారు యువరాజు.

మణిమేఖల కరికాలన్ చూపించినవైపు చూసింది. ఆ క్షణాన అసూయ అనే విషం ఆమె మనసులోకి ఎక్కేసింది.

అదే సమయాన వంతిదేవుడు, నందిని మాట్లాడుకొంటున్నారు. నందిని భుజాన పులి పంజా గోరు తగిలి రక్తం కారుతూంది.

మణిమేఖలలాగ నందిని కళ్ళు మూసుకోనూ లేదు, వంతిదేవుని చేతులనుంచి విడిపించుకోవడానికి తొందరపడనూ లేదు. వంతిదేవుడేమో తన చేతులను కాల్చేస్తున్న నిప్పు కణికను కింద పడేసేటట్లు యువరాణిని కిందకు దించేశాడు. నీట మునిగివున్నప్పుడు కూడ నిజంగానే నందిని

ఒళ్ళు నిప్పులాగ కాలిపోతూంది.

వంతిదేవుని మనసులో ఇదీ అని తెలియని భీతి గూడు కట్టుకొంది. అతని శరీరం వణికింది.

నందిని చిరునవ్వుతో, "అయ్యా! ఎందుకింత బెదురు? నన్ను పులనుకొన్నారా? లేక పులిని కాపాడాలనుకొని పొరబాటున నన్ను కాపాడి గట్టుకు చేర్చారని విచారిస్తున్నారా?" అన్నది.

"అమ్మణీ! ఇంత కఠోరంగా మాట్లాడకండి. మిమ్మల్ని తాకి ఇలా తీసుకొని రావలసి వచ్చింది కద అని నా మనసు కాస్త కలతబారింది..."

"తప్పు చేసిన మనసు కద? అందుకే కలతబారింది!"

"దేవీ! నేనే తప్పూ చేయలేదే!"

"తప్పు చేయలేదా? తంజావూరు కోటలో ప్రవేశించేందుకు సహాయం అడిగారు. రాజముద్ర పొదిగిన ఉంగరం ఇచ్చి సహాయం చేశాను. తర్వాత నా అంతఃపురంలో దొంగతనంగా ప్రవేశించారు. అప్పుడు కూడ మీకు హాని కలగకుండ కాపాడాను. అందుకు బదులు ఏం చేశారు? నాకు చెప్పకుండ, నాకు తెలియకుండ దొంగలాగ పారిపోయారు. పళైయారై యువరాకుమారిని చూసిన తర్వాత మళ్ళీ నన్ను వచ్చి చూస్తానన్నారు; ఆ మాటను నిలబెట్టుకోనేలేదు. ఇవన్నీ నేరాలు కావా?"

"ఆ తప్పులన్నీ ఒప్పుకొంటున్నాను. కానీ ఆ ఒక్కొక్కటికీ కారణముంది. నేను ఇంకొకరి సేవకుడిని. ఆదిత్య కరికాలన్‌గారి ఆజ్ఞకు కట్టుబడినవాడిని. ఇది మీరు ఆలోచించి చూస్తే నామీద నింద మోపరు."

"అవును. పులి నోటినుంచి ఒక స్త్రీని కాపాడాలన్నా, మీకు వారి అనుమతి కావాలి. నీట మునిగిపోతున్న స్త్రీని కాపాడాలన్నా మీకు వారి అనుమతి కావాలి. నేను గమనిస్తూనే ఉన్నాను. ఆహా! మణిమేఖలను కాపాడడంలో యువరాజు ఎంత ఆసక్తి, ఆదుర్దా చూపారు? వారి మనసెరుగక మీరు నన్ను కాపాడారు...."

"అమ్మణీ! అలా మాట్లాడకండి! మీరు తాళపత్ర సందేశం పంపినందువల్లే కద యువరాజు కంచినుంచి ఇంతదూరం వచ్చారు..."

"కానీ ఆయన ఇక్కడికి రాకుండ అడ్డుపడేందుకు మీరు తొందర తొందరగా ఇక్కడికి వచ్చారు. యువరాకుమారి సందేశం తీసుకొని వచ్చారు. కానీ మీ ప్రయత్నం ఫలించలేదు. నా కార్యంలో తల దూర్చేందుకు మీరు చేసే ప్రయత్నాలన్నింటికీ ఇదే గతి పడుతుంది!"

~

నందిని మాటలతో వంతిదేవుని మనసు ఇంకా అల్లకల్లోలమైంది. ఆమె మాటల అంతరార్థాన్ని ఆమె ముఖకవళికలనుంచి తెలుసుకోగోరి ఆమెను నిశితంగా చూశాడు. కానీ నందిని ముఖం ఏమాత్రం మార్పు చూపక ఎప్పటిలాగ చిరునవ్వుతో వెలుగుతూంది.

నందిని ఇంకా, "మీ నేరాన్ని/తప్పును మీ ముఖమే చెబుతూంది. ఆ అమావాస్య రాత్రి పళ్లిప్పడై సమీపాన మీరు నా చేత చిక్కుబడి నా బందీ అయినారు. నా మనుషులకు ఒక సైగ చేసివుంటే వారు మిమ్మల్ని అప్పటికప్పుడే ముగించేసేవారు. అప్పుడు కూడ మీ ప్రాణాలను కాపాడి పంపించాను. అందుకు కూడ మీకు కృతజ్ఞత లేదు. మీలాంటి కృతఘ్నులను నేనీ ప్రపంచంలో చూడనేలేదు..."

"దేవీ! మీపట్ల నా మనసులో పరిపూర్ణ కృతజ్ఞత నెలకొనివుంది. సత్యప్రమాణంగా చెబుతున్నాను."

"కానీ ఈ ఊరికి మేము వచ్చి ఇన్నాళ్ళయినా మీరు మీ కృతజ్ఞతను తెలియజేసేందుకు ఏ ప్రయత్నమూ చేయలేదు కద? మీ మాటలను నేనెలా నమ్మడం?"

"మిమ్మల్ని ఏకాంతంగా కలిసినప్పుడు చెబుదామనుకొన్నాను. అందుకు తగిన సందర్భం దొరకలేదు...."

"సందర్భం కల్పించుకోవడానికి మీరే ప్రయత్నమూ చేయలేదు. ముఖ భావాల ద్వారానో, కంటిచూపులతోనో ఒక సూచన కూడ ఇవ్వలేదు. అంతేనా? ఇన్నాళ్ళకు మీరు నావైపు ఒక్కసారికూడ కన్నెత్తి చూడలేదు..."

"దేవీ! మీరు చోళసామ్రాజ్యపు ధనాధికారి ధర్మపత్ని..."

"అంటే ముసలాయనను పెళ్ళి చేసుకొన్నది అన్న పరిహాస భావాన్ని వెలిబుచ్చుతున్నారు కదూ?"

"అయ్యో! మిమ్మల్ని పరిహసిస్తే నేను క్రూరనరకానికి పోతాను!"

"వద్దు, వద్దు! ఏదెలావున్నా సరే, పళువేట్టరయ్యర్‌గారి 'ధర్మపత్ని' అని మాత్రం నన్ను పిలవకండి. నేనాయన భార్యనేకాను..."

"అయ్యో! ఇదేం, ఇలా అంటున్నారు?"

"నిజాన్నే చెబుతున్నాను. ఒక స్త్రీని బలవంతంగా తీసుకొని వచ్చి పెట్టుకొంటే, ఆమె భార్య అవుతుందా?"

"దేవీ! మీరు తమిళనాడు ఉన్నతకుల స్త్రీల పరంపరలో వచ్చినవారు. స్త్రీ కుల ధర్మానికి విరుద్ధంగా మీరేమీ చేయరు!"

"స్త్రీకుల ధర్మం నేనెరుగుదును. పురాతన తమిళనాడు స్త్రీలు మానసికంగా ఎవరిని ప్రేమించి ఇష్టపడతారో, వారినే భర్తగా ఎంచుతారు. బలవంత వివాహానికి వారు లోనుకారు/కట్టుబడరు!"

"అయితే మీరు..."

"మీరడగబోతున్నది నాకు తెలుసు. పళువేట్టరయ్యర్ బలవంత వివాహానికి ఎందుకు పాల్పడ్డారని అడుగుతున్నారు. ఒక ముఖ్యమైన ఉద్దేశంతోనే ఒప్పుకొన్నాను. పాత తమిళనాడు స్త్రీలకు

ఇంకొక సంప్రదాయముంది. వారు తమకు జరిగిన అన్యాయానికి పగ తీర్చనే తీర్చుకొంటారు. అయ్యా! మీరు నా ప్రేమ ఫలించేందుకు సహాయం చేయలేదు. కనీసం నా విరోధులపైన పగ తీర్చుకోవడానికైనా సహాయం చేస్తారా?”

చివరిగా నందిని అన్న మాట ఏకకాలాన వంతిదేవుని మనస్సును వజ్రాయుధంతో పగలగొట్టేటట్లు, అతని తలమీద పిడుగు పడ్డట్లు చేసింది.

“దేవీ! దేవీ! ఇదేమి?...ప్రేమేమిటి? పగేమిటి? నాకు, మీ ప్రేమకు ఏం సంబంధం? ప్రేమకు, పగ తీర్చుకోవడానికి ఏం సంబంధం...?”

“సంబంధం ఉంది. కానీ దాని గురించి చెప్పేందుకు ఇప్పుడు సమయం లేదు. అదిగో యువరాజు, మణిమేఖల మనని సమీపిస్తున్నారు. రేపు అర్ధరాత్రి నేనున్న గదికి ఒంటరిగా వస్తే చెబుతాను...”

“అదెలా సాధ్యం దేవీ? మీరు అంతఃపురంలో ఉన్నారు. నేనక్కడికి రాత్రి ఒంటరిగా ఎలా రావచ్చు?”

“అదే అంతఃపురం గదినుంచి మీరు ఒకసారి తప్పించుకొని పారిపోలేదా? వెళ్ళిన దారినే మళ్ళీ రావచ్చు కద? మీరు మనసు చేస్తే...”

వంతిదేవుడు ఇప్పుడు ఆశ్చర్యంలో పూర్తిగా మునిగిపోయాడు.

కానీ నందిని ముఖంలో ఎటువంటి మార్పూ కనిపించలేదు. ఎప్పటిలాగే చిరునవ్వు చిందులాడుతూంది.

~~~
~~~

# అధ్యాయము - 45

## "నీవు నా సహోదరివి!"

**నందిని**, వంతిదేవుడు నిలబడ్డ చోటికి యువరాజు, మణిమేఖల వచ్చి చేరారు.

దగ్గరకు వచ్చేవరకు యువరాజు వంతిదేవునే చూస్తూ వచ్చారు. దగ్గరకు వచ్చిన తర్వాత నందినిని తేరిపారజూశారు. ఆమె భుజంపైన, చెంపమీద తగిలిన గాయాలను చూశారు.

"అయ్యో! ఆ పాపిష్టి పులి మిమ్మల్ని గాయపరిచిందా, ఏమి?" అని అడిగారు.

"అవునయ్యా! కానీ ఆ పులి నా శరీరాన్ని మాత్రమే గాయపరిచింది. నా మనసును గాయపరచలేదు!" అన్నది నందిని.

ఈ మాటలు కరికాలన్ గుండెల్లోకి బాణాల్లాగ దూసుకువెళ్ళాయి. కానీ అతడు ఏదైనా బదులు చెప్పేలోపు మణిమేఖల నందినిని సమీపించి, గాభరాగా, "అవునక్కా! ఆ పులి మిమ్మల్ని బాగానే చీరేసినట్లుంది! మంచివేళగా, నేను అంజనం తీసుకొచ్చాను. రండి, పూస్తాను! వెంటనే పూస్తే గాయం త్వరగా మానుతుంది!" అన్నది.

"చెల్లాయ్! ఇలాంటి గాయాలు నాకు సర్వసాధారణం. ఎన్నో గాయాలు తగిలి మానిపోయాయి. మనసుకు తగిలే గాయాలు మాసేందుకు ఏదైనా అంజనం ఉంటే చెప్పు!" అన్నది.

"ఓ! ఉందక్కా! అది కూడ ఉంది!" అని చెప్పి మణిమేఖల నందిని చేయి పట్టుకొని పాలరాతి మంటపంలోకి తీసుకొని వెళ్ళింది.

~

యువరాజు, వంతిదేవుడు వెళ్ళి ఒక మామిడి చెట్టు కిందనున్న ఒక విశాలమైన చలువరాయిమీద కూర్చొన్నారు.

"అయ్యా! ఎంత త్వరగా ఈ చోటు విడిచి బయలుదేరితే అంత మంచిది! ఎక్కువసేపు ఇక్కడే ఉండిపోతే గందమారన్, అతడి తండ్రి మన గురించి ఏదైనా పొరబాటుగా అనుకోవచ్చు / అపోహపడవచ్చు!" అన్నాడు వంతిదేవుడు.

"ఎవరేమైనా అనుకోనీ! మన తల తీసేస్తారా, ఏమి? ఈ అమ్మాయిలు మనని అపార్థం చేసుకోకుంటే చాలు. వారు రాగానే చెప్పేసి బయలుదేరుదాం" అన్నారు యువరాజు.

కాసేపటికల్లా నందిని, మణిమేఖల కొత్త బట్టలు ధరించి చక్కగా అలంకరించుకొని వచ్చారు. నందిని భుజంమీద, చెంపమీద గాయాలు కనిపించనట్లు అంజనం పూయబడింది.

"మీ దగ్గర సెలవు తీసుకొని బయల్దేరుదామని వేచివున్నాము" అన్నారు యువరాజు.

"బాగుంది! మిట్టమధ్యాహ్నమైంది. మాతో ఉండి, భోజనం చేసి వెళ్ళాలి. ఈ సమయాన మిమ్మల్నిలా వెళ్ళనిస్తే శంబువరయ్యర్ కూతురు నన్ను క్షమించదు" అన్నది నందిని.

"ఒక నిబంధన/షరతు మీద ఉంటాము. మీ గాయాలకు అంజనం రాసింది మణిమేఖల. అలాగే మనోగాయాలకు కూడ ఏదో అంజనం ఉందని చెప్పింది. అదేమని చెబితే ఉంటాము" అన్నాడు కరికాలన్.

"ఆమెను అడగకనే మనమే ఊహించి తెలుసుకోవచ్చు కద?" అన్నది నందిని.

"ఒకవేళ కాలక్రమేణ కలిగే మరుపును గురించి చెప్పివుండవచ్చు" అన్నాడు కరికాలన్.

"అది సాధ్యం కాదు. కాలం గడిచినా మానని మనోగాయాలున్నాయి కద?" అన్నది నందిని.

"స్త్రీల విషయంలో, మనోగాయాలకు ఒక మంచి అంజనం ఉంది! అదే కన్నీరు!" అన్నాడు వంతిదేవుడు.

"స్త్రీలను చులకన చేసేందుకు ఎక్కడ అవకాశం దొరుకుతుందా అని వేచివున్నారు వల్లవరయ్యర్. కానీ వారు చెప్పింది సరికాదు. కొన్ని రకాల గాయాలవల్ల కన్నీరు విడిచే శక్తి కూడ ఇంకిపోతుంది. తర్వాత అది అంజనంగా ఎలా ఉపయోగపడుతుంది?" అన్నది నందిని.

"మేమిద్దరు చెప్పింది సరి కాకపోతే మీ ఊహ ఏమిటో చెప్పండి!" అన్నాడు వంతిదేవుడు.

"దానికేం, చెబుతాను వినండి. చెల్లాయ్! నీవు చెప్పిన అంజనం చెవుల గుండా మనసుకు వెళ్ళేదే కద? యాళ్ (వీణలాంటి ఒక వాయిద్యం) , వేణువు, ఇంపైన గొంతునించి వెలువడే మధురగానం - ఇవే కద మనసుకు అంజనం అంటున్నావు?" అన్నది నందిని.

"అవునక్కా! మీకెలా తెలిసింది?" అని ఆశ్చర్యంతో అడిగింది మణిమేఖల.

"నేను మంత్రగత్తెనని చెప్పాను కద? మరి మనసులో ఉన్నది తెలుసుకొనే శక్తి నాకుంది. అయ్యా! మీరిద్దరు సంగీతానికున్న ఆ శక్తిని ఒప్పుకొంటారా?" అని అడిగింది నందిని.

"అవునవును. దాన్ని ఊహించలేకపోవడం మా తప్పని కూడ ఒప్పుకొంటున్నాము. మణిమేఖల సంగీతంలో నిష్ణాతురాలని, యాళ్ చాల బాగ వాయిస్తుందని గందమారన్ చెప్పింది కూడ గుర్తుంది" అన్నాడు కరికాలన్.

"అన్న అంటే అలా ఉండాలి! చెల్లెలి గొప్పతనం ఎవరికైన చెప్పనిరోజు కడంబూర్ యువరాజుకు పొద్దు గడిచినట్లే అనిపించదు. మణిమేఖల సంగీత ప్రావీణ్యత గురించి గందమారన్ చెప్పింది ముమ్మాటికీ నిజం. మణిమేఖల యాళ్ కూడ తీసుకొచ్చింది. గానమహిమ తెలియని నన్ను మాత్రం శ్రోతగా ఉంచుకొని పాడవలసిన అవస్థ ఆమెకు తప్పింది. అయ్యా! మమ్మల్ని పులికి ఎర కాకుండ కాపాడారు. దానికి నేను కృతజ్ఞత తెలియజేయాలి కద? మాతో భోంచేసి, మణిమేఖల సంగీతామృతాన్ని కూడ ఆస్వాదించి వెళ్ళాలి" అని నొక్కి చెప్పింది నందిని.

అందుకు ఒప్పుకోవద్దని సైగలతో యువరాజుకు సూచించాడు వంతిదేవుడు. కానీ ఆయన దాన్ని గమనించననే లేదు.

"రాకుమార్తెల చిత్తం మా భాగ్యం" అన్నారు యువరాజు.

"మణిమేఖలా! నీ మనోరథం నెరవేరింది! వంటయ్యిందేమో చూడు! త్వరగా సిద్ధం చేయమని చెప్పు!" అన్నది నందిని.

~

మణిమేఖల వెంటనే లేచి వంట జరుగుతున్నవైపు వెళ్ళింది.

అదే సమయాన వంతిదేవుడు లేచి నిలబడి చుట్టూ పరికించి చూశాడు.

నందిని అది గమనించి, "కాసేపటి క్రితం ఇతరుల మనసులో ఉన్నది తెలుసుకోగల మంత్రశక్తి నాకుందని చెప్పాను కద? దాన్ని ఇప్పుడు పరీక్షకు పెట్టగోరుతున్నాను. వాణర్‌కుల యువరాజు ఇప్పుడేం ఆలోచిస్తున్నారో చెప్పనా?" అన్నది.

కరికాలన్ నవ్వుతూ, "చెప్పండి చూద్దాం!" అన్నాడు.

"ఆ పులిని చంపి ఈ అమ్మాయిలను కాపడింది పెద్ద పొరపాటయిందని పశ్చాత్తాప పడుతున్నారు. వీరిద్దరూ ఆ పులి కడుపు లోపలికి వెళ్ళివుంటే చాల మంచిదైవుండేదని భావిస్తున్నారు."

కరికాలన్ ఇంకా నవ్వుతూ, "మిత్రమా! నీవలా ఆలోచిస్తున్నావా?" అని అడిగాడు.

"లేదయ్యా! నేనలా ఆలోచించడంలేదు. కానీ వీరిగురించి, పులిగురించి ఆలోచిస్తుండడం మాత్రం నిజమే. వీరిచేత చిక్కుకొన్న ఆ పులి ఎలా ప్రాణాలతో బయటపడిందని ఆశ్చర్యపడుతున్నాను!" అన్నాడు వంతిదేవుడు.

"ఏమంటున్నావు, తమ్ముడూ! పులి తప్పించుకొని బతికిపోయిందా? మళ్ళీనా? చచ్చిన పులి శరీరం నీట తేలింది కద? అది ఎక్కడ?" అని యువరాజు లేచి నిలబడి అడిగారు.

"అదిగో చూడండి!" అని వంతిదేవుడు చూపించాడు.

~

వారున్న చోటికి కూతవేటు దూరంలో చెట్టు కొమ్మల మధ్య ఒడ్డు కనిపించింది. అక్కడ రాకుమార్తెలు వచ్చిన పడవ కట్టబడివుంది. ఆ పడవ ముందుభాగాన్ని తన ముంగాళ్ళతో పట్టుకొని ఆ చిరుత పడవలోకెక్కేందుకు ప్రయత్నిస్తూంది.

"ఆహా! ఈ పులి ప్రాణం చాల గట్టిది!" అన్నాడు కరికాలన్.

"అయ్యా! రండి. వెళ్ళి ఆ పులిని చంపేసి వద్దాం. గాయపడ్డ పులిని ప్రాణాలతో వదిలేయడం చాల అపాయం" అన్నాడు వంతిదేవుడు.

"వాణర్‌కుల వీరా! మీరిద్దరు వీరులు ఒక గాయపడ్డ పులిని చంపేందుకు ఎందుకు శ్రమపడాలి?

మణిమేఖలను పిలుస్తాను. ఆమె తన చేతనున్న చురకత్తితో దాన్ని చంపేసి వస్తుంది!" అన్నది నందిని.

"చూశావా, మిత్రమా! పళువూర్ యువరాణి మన వీర, శౌర్యాలకు ఎంత విలువిచ్చిందోనని? నేనూ రావాలా? నీవొక్కడివే వెళ్ళి వస్తావా?" అన్నారు యువరాజు.

"అంటే మణిమేఖలను వెంట పంపించనా, వద్దా?" అన్నది నందిని.

"మణిమేఖలను పంపవచ్చు. కానీ ఆ అమ్మాయి గాయపడ్డ చిరుతపులికి కూడ అంజనం వేసి బతికించేసి వెంట పిలుచుకొని వచ్చేస్తే ఏం చేయడం?" అని తనలో తాననుకొన్నాడు వంతిదేవుడు.

"ఏమాలోచిస్తున్నావు?" అన్నారు యువరాజు.

""గాయపడ్డ పులి తలను తెగగొట్టి పళువూర్ యువరాణి కాళ్ళవద్ద సమర్పిద్దామా అని ఆలోచిస్తున్నాను. అప్పుడైనా వారు తృప్తిపడతారేమో చూద్దాం" అని చెప్పేసి గబగబ ముందుకు నడవనారంభించాడు వంతిదేవుడు.

"ఆ మూఢుడు చెప్పింది విన్నారా? గాయపడ్డ పులి తలను కొట్టేందుకు గొప్ప వీరశౌర్యాలు కావాలా?" అని చెప్పేసి నవ్వసాగాడు కరికాలన్. కానీ నందిని ముఖం చూసి మధ్యలోనే ఆపేశాడు.

"దాని గురించి మీరు కద అభిప్రాయం తెలియజేయాలి?" అన్నది నందిని.

కరికాలన్ ఒళ్ళు జలదరించింది.

గద్గద స్వరంతో, "నందినీ! నీవు తాళపత్రసందేశం రాసి గందమారన్ చేత పంపించినందువల్లనే కద నేనిక్కడికి వచ్చాను? లేకపోతే వచ్చేవాడినే కాను" అన్నారు యువరాజు.

"నా వేడుకోలుకు ఇన్నేళ్ళ తర్వాతైన విలువిచ్చారు కద! చాల ధన్యవాదాలు!" అన్నది నందిని.

"గడిచిపోయిందంతా నీవు మరిచిపోయావనుకొన్నాను. అందుకే తాళపత్రసందేశం పంపావనుకొన్నాను..."

"గడిచినదంతా మరిచిపోసాధ్యమా, అయ్యా! మీరదంతా మరిచిపోయారా?"

"మరిచిపోవడం అసాధ్యమే. నేనూ మరిచిపోలేకున్నాను! నీవు కంట నీరు పెట్టుకొని నా ముందు నిలబడి ఒక వరం అడిగావు. అది నేనివ్వలేదు. ఆ సమయాన ఏదో ఒక పిచ్చి ఆవేశం నన్నావహించింది. అదంతా నేనింకా మరిచిపోలేదు. కానీ, ఎందుకు పత్రం రాసి పంపించావు? ఎందుకని నన్నిక్కడికి రమ్మన్నావు?" అని అడిగారు యువరాజు.

"అయ్యా! మీరు మూడేళ్ళుగా తంజావూరుకు రాలేదు. జబ్బుపడ్డ మీ తండ్రిని చూడలేదు..."

"ఆయన నాకు మాత్రం తండ్రి కాడు, నందినీ..."

""అవును! యువరాకుమారికి కూడ తండ్రే! పొన్నియిన్ సెల్వన్‌కి కూడ తండ్రే! కానీ మిమ్మల్ని చూడకపోవడమే మీ తండ్రిగారికి పెద్ద కొరతగా ఉంది. మీరు రాకపోవడానికి నేనే కారణమని చక్రవర్తికి ఎవరో చెప్పినట్లున్నారు. అందువల్ల ఆయన నన్ను చూడడమే లేదు. అయ్యా! ఇప్పటికే నాకు మీరు చేసిన

కీడంతా చాలదా? నేనీ నిందను కూడ మోయాలా?"

"కానీ అది నిజమే కద? నీ కారణంగానే నేను తంజావూరుకు రావడం లేదు..."

"అలాగైతే నేను తంజావూరు విడిచి వెళ్ళిపోతాను. మీరు తంజావూరుకు వచ్చి, మీ తండ్రి సింహాసనాన్ని అధిష్ఠించి, వారి మణిమకుటాన్ని ధరించి..."

"నందినీ! అది ఎన్నడూ జరగబోని కార్యం! నాకిప్పుడు సింహాసనం మీద ఆశ లేదు. మధురాంతకుడు సింహాసనమెక్కి, చోళసామ్రాజ్యపు మణిమకుటాన్ని ధరించి రాజ్యమేలనీ..."

"అయ్యా! మీరు మధురాంతకులను బాగ ఎరుగుదురు. ఆయన ఇంత పెద్ద సామ్రాజ్యాన్ని ఒక్క రోజైన ఏలగలరా?"

"అతడికి సాధ్యం కాకపోతే, సహాయం చేసేందుకు పళువేట్టరయ్యర్లున్నారు, నీవున్నావు..."

"అయ్యా! మీ కోరిక నాకిప్పుడు బాగ అర్థమవుతూంది. నేను తంజావూరునుంచి, పళువూర్ అంతఃపురంనుంచి వెళ్ళిపోతాను... తమరు తంజావూరుకు వచ్చి..."

"లేదు, లేదు! నీవు తప్పుగా అర్థం చేసుకొన్నావు. నాకా ఉద్దేశమే లేదు. నీకు నేను గతంలో చేసిన అపకారం చాలు. పళువూర్ అంతఃపురంనుంచి నిన్ను తరిమికొట్టానన్న అపనిందను నేను మోయలేను...."

"అయ్యా! మనమిద్దరం తంజావూరులో ఉండలేమా? అంత పెద్ద నగరంలో మనిద్దరికి చాలినంత తావు లేదా? ఒకరినొకరు చూడవలసిన అవసరం కూడ లేదు కద?"

"చూడవలసిన అవసరం లేకపోవచ్చు. కానీ మనసులో తలుచుకోకుండ ఉండడం సాధ్యమా? కాసేపటి క్రితం నీవే చెప్పావు కద? గతమంతా మరిచిపోలేమని. నీ మనసులోని గాయం గురించి కూడ చెప్పావు. నా మనసు కూడ గాయపడివుంది. నేనూ మరువలేకున్నాను..."

"మరిచిపోలేకపోవచ్చు. కానీ క్షమించలేరా? నేను చేసిన నేరాలను ఇప్పటికీ క్షమించలేరా?"

"నందినీ! నేను క్షమించవలసిన నేరం నీవేమీ చేయలేదు. నేరం చేసినవాడిని నేను. నన్ను క్షమించమని కోరవలసినవాడిని నేను. కంచినుంచి బయలుదేరినప్పుడు కూడ నిన్ను క్షమ కోరి పొందుదామన్న ఉద్దేశంతోనే బయలుదేరాను. కానీ దారిలో నేను తెలుసుకొన్న ఒక సంగతి నేను నీవద్ద క్షమ కోరేందుకే అనర్హుడిని చేసేసింది...."

"యువరాజా! మీరు నావద్ద క్షమాపణ కోరడం ఏవిధంగా చూసినా అనుచితమే. మీరు చోళసామ్రాజ్య చక్రవర్తి కుమారులు. నేనేమో కన్న తలిదండ్రులు వదిలిపెట్టిన అనాధను...."

"లేదు, లేదు! నీవు అనాధవు కావు!"

"ధనాధికారి పళువేట్టరయ్యర్ నన్ను పెళ్ళి చేసుకొని తమ యువరాణిగా స్వీకరించారు. కానీ..."

"అది మాత్రం కాదు, నందినీ! నీకు నిజాన్నెలా చెప్పాలో తెలియక జంకుతున్నాను..."

"ఈ పేదరాలివద్ద మీరు ఏ జంకూ లేకుండ ఏదైన చెప్పవచ్చు. దారినపోయేవాళ్ళంతా నాకు ఏవేవో చెప్పేందుకు తెగిస్తున్నారు. నన్ను జగడానికి లాగి అవమానిస్తున్నారు..."

"నందినీ! ఇక నీతో ఎవరైనా అలా నడుచుకొంటే నేనొక్క క్షణంకూడ ఓర్చుకోను. నీవు చెబితే చాలు, వాడిని యమలోకానికి పంపించి తర్వాతి పని చూస్తాను..."

"ఎప్పుడూ మీరు నామీద అటువంటి కరుణ చూపుతూ వస్తున్నారు. పళైయారై యువరాకుమారితోకూడ చిన్నప్పుడు నాకోసం దెబ్బలాడారు. వారు మీ సహోదరి..."

"నందినీ! నీవుకూడ నా సహోదరివే! యువరాకుమారిలాగ నీవూ నా సహోదరివే! నేను నీ సహోదరుడిని!"

"యువరాజా! నేను ఇంకొకరిని పెళ్ళి చేసుకొన్నందువల్ల నన్ను మీ సహోదరిగా భావిస్తున్నారు. అది మీ కులం గొప్పతనానికి తగినదే. కానీ చక్రవర్తి కుమారులను, ముల్లోకాలను ఏలేందుకు పుట్టినవారిని, నేనెలా నా సహోదరునిగా భావించగలను?"

"నేను చెబుతున్నది నీకు సరిగ్గా అర్థంకాలేదు. నందినీ! నిజంగానే నీవు నా సహోదరివి; ముల్లోకాలేలే చక్రవర్తి కుమార్తెవు నీవు..."

ఇది విన్న నందిని గలగలమని నవ్వింది.

"మీ మనసు గతి తప్పి కల్లోలితమైందా, లేక నాకే పిచ్చిపట్టిందా? తెలియడం లేదు!" అన్నది.

"చిత్తభ్రమా లేదు, పిచ్చీ లేదు."

"అలాగైతే ఈ పేదరాలిని పరిహసిస్తున్నారా?"

"నన్ను చూసి చెప్పు, నందినీ! నిజంగానే నిన్ను పరిహసిస్తున్నట్లు కనిపిస్తున్నానా?"

"అయ్యా! మీరు నా ముఖాన్ని చూసి చెప్పండి! నన్ను చూస్తే చక్రవర్తి కుమార్తెలాగ కనిపిస్తున్నానా? రాజవంశపు లక్షణాలు నా ముఖంలో కనిపిస్తున్నాయా?"

"నందినీ! నీవు ఐదేళ్ల పిల్లగా ఉన్నప్పటినుంచి నీ ముఖాన్ని చూసినవాడిని. నీ ముఖంలో ప్రకాశించే సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపడేవాడిని, సంభ్రమించేవాడిని. అందుకు కారణం ఇప్పుడు తెలుస్తోంది. కంచినుంచి బయలుదేరిన తర్వాతే, మధ్యదారిలో తెలిసింది. చోళకుల పరంపరలో వైదుంబరాయల కుమార్తె కల్యాణికి అందంలో సాటి ఎవరూ లేరన్నది జగద్విదితం. కానీ నా బామ్మ పళైయారైలో ఇంకా సజీవంగా ఉన్నారు. డెబ్బైయేళ్ళ వయసైన తర్వాత కూడ ఆమె ముఖంలోని మానవాతీత సౌందర్యం కళ్లకు మిరుమిట్లుగొలుపుతుంది. ఆమె అందమంతా ఇప్పుడు నీలోనే నెలకొనివుంది. అది నా దగ్గర లేదు; యువరాకుమరి కుందవై దగ్గరలేదు; అరుళ్మొళి దగ్గరకూడ లేదు. నా తండ్రి మూలంగా నీ దగ్గరకే వచ్చి చేరింది..."

"అయ్యా! ఇదేం మాట? నిజంగానే నాకు చిత్తభ్రమ పట్టినట్లుంది. లేక నా చెవులకేదో

అయింది..."

"లేదు, నందినీ, లేదు! చిత్తభ్రమా లేదు, నీ చెవులకేం కాలేదు. నీవు నా తండ్రికి పుట్టిన కుమార్తెవు; కాబట్టి నీవు నా సహోదరివి! చక్రవర్తి నా తల్లిని పెళ్ళి చేసుకోబోయేముందు లంకకు చెందిన ఒక దీవిలో ఒక స్త్రీమణిని ప్రేమించి గాంధర్వ వివాహం చేసుకొన్నారు. ఆమె కూతురివే నీవు; కాబట్టి నా సహోదరివి!" అని కరికాలన్ ఆతురత నిండిన గొంతుతో అన్నాడు.

~

నందిని అమితాశ్చర్యంగొన్నదానిలాగ కాసేపు ఆదిత్య కరికాలన్‌ని చూస్తూండిపోయింది. తర్వాత ఆమె ముఖం కాస్త తేట పడింది.

"అయ్యా! ఈ వార్తనేనా మీరు కంచినుంచి బయలుదేరిన తర్వాత మధ్యదారిలో తెలుసుకొన్నారు?" అని అడిగింది.

"అవును, నందినీ! అది ఎరిగిన తర్వాత ఇంతవరకు విశదంకాని కొన్ని విషయాలు స్పష్టమైనాయి."

"యువరాజా! మీకీవార్తను తెలియజేసినదెవరు? వంతిదేవులేనా?"

"అవును! కానీ అతడు తనకుతానే చెప్పలేదు. యువరాకుమారి కుందవై చెప్పి పంపింది!"

"ఆహా! మిమ్మల్ని, నన్ను వేరుపరిచి ఉంచేందుకు మొదటినుంచి ఎన్నో పన్నాగాలు పన్నుతూ వచ్చారు. ఇంకా వారి పన్నాగాలు ముగిసినట్లనిపించడం లేదు..."

"నీవనుకొంటున్నది తప్పు, నందినీ! ఇందులో కుట్ర, పన్నాగం ఏమీ లేదు. చిన్నప్పటినుంచి నిన్ను, నన్ను వేర్పరచి ఉంచేందుకు పెద్దరాణి శెంబియన్ మహాదేవి చేసిన ప్రయత్నాలు నాకు అర్థమయ్యేవి కావు. అందువల్ల ఎనలేని కోపంగొన్నాను. వారు ఎంతటి విపత్తునుంచి మనని కాపాడారన్నది నాకిప్పుడు అర్థమవుతోంది. కానీ నిజాన్ని వారప్పుడే చెప్పివుండవచ్చు. చెప్పనందువల్ల నీకు పెద్ద అన్యాయం చేశారు. నాకు కీడు చేశారు. పోతే పోనీ. జరిగినదంతా మనిద్దరం మరిచిపోదాం; మరిచిపోలేకపోయినా క్షమించేద్దాం...."

"అయ్యా! వల్లవరయ్యన్ దారిలో కలిసి ఈ కథ మాత్రమే చెప్పారా? లేక ఇంకేమైనా చెప్పారా?" అని అడిగింది నందిని.

"కథ అని ఎందుకంటున్నావు, నందినీ? నీకు నమ్మకం కలగడం లేదా?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"మీరు చెప్పిన విషయం అంత తేలికగా నమ్మగలిగినదా? చక్రవర్తి కుమార్తెగా పుట్టి నేనీ గతికి చేరడం సాధ్యమా? ఇంతటి కఠినమైన కష్టాల పాలైవుండేదాన్నా? వంతిదేవులు చెప్పింది నిజమే కానీ ఇది మాత్రమే చెప్పారా? ఇంకేమీ చెప్పలేదా?" అన్నది నందిని.

~

ఆదిత్య కరికాలన్ కాస్త జంకుతూ, “అవును, ఇంకొక విషయం కూడ చెప్పాడు. నీవు పాండ్యదేశపు కుట్రదారులతో చేరావన్నాడు. చోళకులాన్ని సమూలంగా నాశనం చేసేందుకు కంకణం కట్టావన్నాడు. అందుకని, పిడిలో మీన చిహ్నమున్న మారణ ఖడ్గాన్నొకదాన్ని దగ్గరుంచుకొని పూజిస్తూ వస్తున్నావని కూడ చెప్పాడు. కొళ్ళిడం నది పక్కనున్న అడవిలో ఎవరో ఒక చిన్న పిల్లాడిని కూర్చోబెట్టి మణిమకుటం తలపైన ధరింపజేశావని కూడ చెప్పాడు. నందినీ! అదంతా నీవిప్పుడు మరిచిపో! చోళవంశకీర్తికి నాలాగే నీవు కూడ అర్హురాలివి. సుందర చోళ చక్రవర్తి కుమార్తెవు. నా ప్రియ సహోదరివి. నీకింతవరకు చేసిన అన్యాయాలన్నిటికీ పరిహారం చేయడమే నా ముఖ్యకర్తవ్యంగా భావిస్తాను...”

“అయ్యా! మీరిదంతా నమ్ముతున్నారు కద? అలా ఉన్నప్పుడు కడంబూర్ వచ్చి ఇన్నాళ్ళు వేచివుండనేల? ముందే నన్ను కలిసి మాట్లాడేందుకు ఒక్క ప్రయత్నం కూడ చేయలేదెందుకు?”

“నా మనసులో ఏర్పడిన కల్లోలమే కారణం. మన కొత్త సంబంధాన్ని మనసులో నెలకొల్పుకోవడానికి కాస్త సమయం కావలసి వచ్చింది. అంతా విశదంగా చెప్పదగ్గ సందర్భం కోసం వేచివున్నా. పలువురి ముందు చెప్పదగ్గ సంగతా ఇది? అదృష్టవశాత్తు ఒక అడవి పంది, ఒక చిరుతపులి నాకీ అవకాశాన్ని కల్పించాయి...”

నందిని అడ్డుపడి, “అయ్యా! అడవి మృగాలు క్రూరమైనవే! కానీ అవి మనుషుల్లాగ ఇతరులకు కీడు చేయవు. అది నాకు ఈరోజే బాగా తెలిసివచ్చింది" అన్నది.

“సహోదరీ! గడిచిందంగా మరువలేనని కాసేపటి క్రితం అన్నావు. దాన్ని నేనూ ఒప్పుకొంటాను. మరువలేకపోయినా కూడ క్షమించమని వేడుకొన్నాను. అందుకు నీవు బదులు చెప్పలేదు.”

“యువరాజా! మీరు గతంలో నాకు చేసిన ద్రోహాలను, అన్యాయాలను క్షమించేస్తాను. కానీ ఈరోజు చేసిన ద్రోహాన్ని ఎన్నటికీ మరువలేను; క్షమించలేను కూడ...”

“అయ్యో! ఈ రోజు నేనేం చేశాను? నేను తెలిసి తెలిసి నీకే ద్రోహం చేయలేదే?”

“"చెబుతాను. అదిగో వస్తున్నాడే ఆ ధూర్తుని చూడండి!”

“వంతిదేవుడినా సూచిస్తున్నావు?”

“అవును. పులి తలను తేకుండ ఒట్టి చేతులతో వస్తున్నాడే, వాడే! ఒకరోజు వాడు నన్ను తంజావూరులో చూశాడు. నా పాదం వాడిని తాకితేనే అదొక మహాభాగ్యమని భావిస్తానన్నాడు. వాడిని నా కాలితో తాకి తన్నేందుకు కూడ నేనిష్టపడను. పనివాళ్ళను పిలుస్తానని చెప్పగానే పరుగెత్తి పారిపోయాడు. వాడి నీచపుటాలోచనలకు నేను లోనుకాలేదు కాబట్టి నా గురించి ఇటువంటి భయంకరమైన కథలను కల్పించి చెప్పినట్లున్నాడు. నేను కోరితే తమ శిరస్సును కూడ తెగగొట్టి తీసుకొచ్చి సమర్పిస్తానన్నాడు. ఇదంతా నేను మీకు చెప్పేయబోతానని వాడి భయం. అందుకే మీరు కడంబూర్ మాళిగకు రాకుండ

మధ్యదారిలోనే అడ్డగించజూశాడు. అందుకే మనిద్దరం కలవకుండేటట్లు మీ వెన్నంటే తిరుగుతున్నాడు. అటువంటి నీచుడు, నేనిష్టపడని వాడు, నా శరీరాన్నంతటినీ హత్తుకొని ఎత్తి తీసుకొచ్చి గట్టెక్కించేటట్లు మీరే చేశారు. దీన్ని నేను మరువగలనా? లేక, క్షమించగలనా?"

ఇలా నందిని కళ్ళనుంచి నిప్పులు కురిపిస్తూ చెప్పిన మాటలు విని నిజంగానే కరికాలన్ తల గిర్రున తిరిగింది. పాలరాతి మంటపం, చెరువు నీరు, అడవి చెట్లు - అన్నీ గిర్రున తిరిగాయి. కాస్త సంభాళించుకొని, "సహోదరీ! నందినీ! నీవు చెబుతున్నది నిజమా? దేన్ని నమ్మాలో నాకు అర్థం కావడం లేదు. వంతిదేవుడు అంతటి నీచుడై ఉండడం సాధ్యమా? అతడికి ఆ అమాయకురాలు మణిమేఖలనిచ్చి పెళ్ళి చేద్దామని కూడ కాసేపటి క్రితం అనుకొన్నాం కద?"

"అయ్యా! నేను చెప్పేది మీరు నమ్మకండి. మీరెప్పుడూ తొందరపడి ఏదైనా చేసేస్తారు. ఈసారి అలా చేయకండి. రెండు రోజులు ఓపికగా వీడి నడవడికను గమనించండి. మీరే తెలుసుకొంటారు!" అన్నది నందిని.

~~~
~~~

# అధ్యాయము - 46

## పడవ కదిలింది

వంతిదేవుడు ఒకవైపు నుంచి వేగంగా వస్తున్నాడు.

ఇంకొక వైపు మణిమేఖల, "అక్కా! భోజనం తయార్!/సిద్ధం!" అంటూ వారిని సమీపించింది.

కరికాలన్ రెండువైపుల చూసి, "నందినీ! నన్ను కడంబూర్ మాళిగకు రావద్దని వంతిదేవుడు మాత్రమే అడ్డుపడలేదు. ఆళ్వార్ కట్టియాన్ అనే వైష్ణవుడు కూడ అదే సందేశాన్ని తీసుకొచ్చాడు కద? నా తండ్రి ప్రాణస్నేహితుడు, నా భక్తికి పాత్రులైన ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ చెప్పి పంపించారు కద?" అన్నాడు.

"ముఖ్యమంత్రి అనిరుద్ధులు! తమ తండ్రి ప్రాణస్నేహితులు! కాబట్టి తమ తండ్రి ప్రాణాలను తామే అపహరింపజూస్తున్నారు. తమ భక్తికి పాత్రులు! కాబట్టి తమకు సింహాసనం చక్రవర్తి తర్వాత దక్కకుండ చేయాలని చూస్తున్నారు..."

"ఎందుకు? ఎందుకు?"

"మీకు పిచ్చి పట్టిందని, మీరు దైవభక్తి లేనివారని వారి అభిప్రాయం. మీ తమ్ముడికి పట్టం కట్టి, అతన్ని వీరవైష్ణవునిగా మార్చేసి, ఈ చోళ సామ్రాజ్యాన్నే వైష్ణవ నాడుగా మార్చేయాలని ఆయన ఉద్దేశం, ఆశయం. తమ సహోదరుడు నడి సముద్రంలో కనిపించకుండపోవడంతో ఆయన ఆశయం మట్టి కరిచింది...."

"అందుకని నన్ను కడంబూరుకు రాకుండ అడ్డగించవలసిన అవసరమేమి?"

"వారి అంతరంగాన్నంతా నేను మీకు చెప్పేయవచ్చు కద?"

"నీకు వారి అంతరంగ విషయాలు, ఆలోచనలు ఎలా తెలుసు?"

"అయ్యా! ఆ వైష్ణవుడు ఆళ్వార్ కట్టియాన్ నా సహోదరుడన్న విషయాన్ని మరిచిపోతున్నారు..."

"నిజంగా నీవతని తోడబుట్టిన సహోదరివా? నన్నా కథను నమ్మమంటావా?"

"నేనూ ఆ కథను నమ్మడంలేదు. మిమ్మల్ని నమ్మమని కూడ అడగడం లేదు. అతని తండ్రి ఇంట్లో నేను పెరిగాను. కాబట్టి నన్ను సహోదరి అని చెప్పుకొంటున్నాడు. నన్ను ఆండాళ్ అవతారం అని తరచూ చెబుతుంటాడు. ఊరూరా అతడితోబాటు తిరిగి ఆళ్వార్ల పాశురాలను పాడి వైష్ణవ సంప్రదాయాన్ని విస్తరింపజేయాలని అతడి ఆశ."

"బౌద్ధ సన్యాసినులలాగ నిన్ను వైష్ణవ సన్యాసినిగా మార్చేయాలని అనుకొంటున్నాడా?" అని

ఆదిత్య కరికాలన్ అడిగాడు.

"అలా ఏమీ లేదు. నేను వాడిని పెళ్ళి చేసుకొని దంపతులుగా పాశురాలు పాడుకొంటూ ఊరూరా తిరగాలని వాడి ఆశ. వైష్ణవ సంప్రదాయాన్ని ప్రచారం చేసేందుకు బిడ్డలను కనివ్వాలని వాడి కోరిక..."

"ఛీఛీ! ఆ కోతి ముఖం తిరుమలై ఎక్కడ? నీవెక్కడ? నిన్ను వాడు తన భార్యగా పొందగోరాడా?"

"అయ్యా! నా దురదృష్టం అది! నేను పుట్టిన వేళ అలాంటిది! నన్ను సమీపించేవాళ్ళందరూ దురుద్దేశంతోనే నా దగ్గరికి వస్తున్నారు..."

"ముసలాడు పళువేట్టరయ్యర్ బుద్ధి పోకడలాగే ఇతరులు కూడ ఉంటారననేల?"

"అయ్యా! పళువేట్టరయ్యర్ గురించి నా చెవిన పడేటట్లు ఎలాంటి దూషణ భాషణలు కూడ చేయకండి. వారు నామీద ఆశపడ్డారు. నన్ను లోకమెరుగ పెళ్ళి చేసుకొన్నారు. అనాధనైన నన్ను అంతఃపురంలో పట్టపురాణిగా చేసుకొని గొప్పగా చూసుకొంటున్నారు..."

"కానీ, నీ కోరికేమి, నందినీ? నీవాయనను నిజంగానే పతిగా ఎంచి పూజిస్తున్నావా? అలాగైతే..."

"లేదు, లేదు! నాకాయన పట్ల ఎనలేని కృతజ్ఞత ఉంది. కానీ నేనాయనతో సంసారజీవితం గడపడం లేదు. ఆయన కూడ నన్ను బలవంతం చేయలేదు. అయ్యా! నేను పేద కుటుంబంలో పుట్టినదాన్ని; పుట్టిన వెంటనే తలిదండ్రుల చేత వదిలిపెట్టబడినదాన్ని. కానీ నా మనసును ఒక్కరికి మాత్రమే అర్పించాను. అది ఏనాడు మార్చుకోలేదు..."

"నందినీ! ఆ భాగ్యశాలి ఎవరు? వద్దు, నాకు చెప్పకు! నీవెవరివి? నిజం చెప్పు! నీవు నా తండ్రి కుమార్తెవు కాకపోతే, నా సహోదరివి కాకపోతే, ఆళ్వార్ కట్టియాన్ తోడబుట్టినదానివి కాకపోతే, మరి నీవెవరివి? అది మాత్రం చెప్పు, నందినీ! అది తెలుసుకోకపోతే నాకు నిజంగానే పిచ్చి పడుతుంది!" అన్నాడు కరికాలన్.

"అది మీకు తెలియజేయాలనే నేనూ ఆశిస్తున్నాను. కానీ మీ మిత్రులు, నా చెలికత్తె అదిగో మన దగ్గరికొచ్చేశారు. మళ్ళీ సందర్భం దొరికినప్పుడు తప్పక చెబుతాను" అన్నది నందిని

~

సమీపించిన వంతిదేవుని చూసి నందిని, "అయ్యా! ఇదేమి? వట్టి చేతులతో తిరిగివస్తున్నారు? పులి తల ఎక్కడ?" అని అడిగింది.

"దేవీ! పులి తలను తీసుకొని వచ్చి మీ పాదాల వద్ద సమర్పించే భాగ్యం నాకు లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"ఆహా! ఇంతేనా మీ వీరత్వం? మీ పూర్వీకుల వీర శౌర్యాల గురించి పద్యాలు, పాటలు చెప్పారు కద? మూడు కులాల నాయకుల [పేందర్గళ్] తలలను తీసుకొచ్చి కడుగునీళ్ళలో ముంచారని చెప్పారు కద?"

"అదేం పాట?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

"దేవీ! అలాంటి పాటను నేను మీకు చెప్పినట్లు గుర్తు లేదే?" అన్నాడు వంతిదేవుడు.

"మీకు గుర్తు లేదు కాని, నాకు గుర్తుంది. చెబుతాను, వినండి!

<< వాణర్ కుల పూర్వీకుల వీరశౌర్యాలను శ్లాఘిస్తూ ఒక పద్యం >>

ఎలా ఉంది, పాట యువరాజా? మీరు ఒక్క పాండ్యుని తల మాత్రమే జయించారు. ఈ వీరుని పూర్వీకులు చోళ, చేర, పాండ్య రాజుల తలలను కొట్టి తీసుకొచ్చి కడుగునీటిలో ముంచి జెండా నాటారట...!"

కరికాలన్ ముఖాన జుగుప్స, కోపం తాండవమాడాయి.

"భలే వ్యవసాయం! భలే నాటు!" అని చెప్పేసి పిడుగు పడ్డట్లు నవ్వాడు.

~

వంతిదేవుడు కరికాలన్ ముఖాన్ని తలెత్తి చూడలేకపోయాడు. తడబడుతూ, "దేవీ! ఇటువంటి పద్యాని నేను మీ వద్ద చెప్పనే లేదే?" అన్నాడు నందిని వైపు చూసి.

"అందువల్లనేముంది? ఇంతవరకు తెలుసుకోకపోతే, మీ కులం గొప్పతనాన్ని ఇప్పుడు తెలుసుకోండి! అలా మూడు రాజ వంశాల నాయకుల తలలను తీసుకొని వచ్చి నాటిన కులంలో పుట్టిన మీరు ఒక గాయపడ్డ పులి తలను తీసుకొని రాలేకపోయారు కద?" అన్నది నందిని.

"దేవీ! ఆ పులి చచ్చి తొలగిపోయింది. చచ్చిన పులి తలను కొట్టి తీసుకొని రావడానికి నేనిష్టపడను."

"అదెలా? పులి తడబడుతూ పడవలోకి ఎక్కడాన్ని నేను చూశాను కద?" అన్నాడు కరికాలన్.

"ఆ దృశ్యాన్ని మీకు చూపించింది నేనే. పడవలోకెక్కి పడుకొన్న తర్వాత అది చచ్చిపోయింది. పళువూర్ యువరాణిని గాయపరిచాను కద అన్న పశ్చాత్తాపంతో అది ప్రాణాలు విడిచింది కాబోలు" అన్నాడు వంతిదేవుడు.

కరికాలన్ ముఖాన చిటపటలు కాస్త తగ్గి, ఒక చిరునవ్వు వెలిసింది.

"కానీ అది నీటిలోనే చచ్చివుండవచ్చు కద? పడవలోకెక్కి చావవలసిన అవసరమేమి?" అని అడిగాడు కరికాలన్.

"నాలా దానికి కూడ నీరంటే ఇష్టం లేదులాగుంది. అన్ని విధాల మరణాల కన్న నీట చావడమే నాకు చాల భయాన్ని పుట్టిస్తుంది!" అన్నాడు వంతిదేవుడు.

"కానీ కాసేపటి క్రితం ధైర్యంగా నీట దూకేశారు కద? ఈ పేదరాలి మీద మీకు అంతటి కరుణ కాబోలు!" అన్నది నందిని.

"దేవీ! నాకు నీటి కన్న స్త్రీలంటేనే ఎక్కువ భయం. యువరాజు బలవంతం మీదనే నీట దూకాను. నిజానికి అలా నీట దూకవలసిన అవసరమే ఉండలేదని ఇప్పుడే తెలిసింది!" అన్నాడు వల్లవరయ్యన్.

"అవునవును! మీకు మీరు నీట మునిగి చావడం గురించే భయం. ఇతరులను నీట ముంచి చంపడమంటే ఏ భయమూ లేదు!" అన్నది నందిని.

ఈ మాటలేవీ మణిమేఖలకు రుచించలేదని ఆమె ముఖకవళికలనుంచి కొట్టవచ్చినట్లు తెలిసింది.

"అక్కా! వండిన వంటలన్నీ చల్లారిపోతాయి. రండి, వెళదాం!" అన్నది.

~

నలుగురూ చలువరాతి మంటపంవైపు నడిచారు. అప్పుడు మధ్యమధ్య మణిమేఖల వంతిదేవుని వైపు చూపులు సారించింది. అతడి మనసులో ఏదో కల్లోలం లేచిందని, యువరాజు, నందిని అతడికేదో ఇబ్బంది కలిగిస్తున్నారనీ ఆమె ఊహించి తెలుసుకొంది. "ఎవరు మీకు వ్యతిరేకులైనా కూడ నేను మీ పక్షాన ఉంటాను; దిగులుపడకండి!" అని కంటిభాష మూలంగా వంతిదేవుని ఓదార్చజూసింది. కానీ వంతిదేవుడేమో ఆమెవైపు తిరిగి చూడనేలేదు. అతడు తన దిగులనే కడలిలో పూర్తిగా మునిగిపోయినట్లు అగుపించాడు.

~

నందిని వంచకపు మాటలు, ఆమె వంతిదేవుని పైన మోపిన భయంకరమైన నిందలు ఈ కథను విడవకుండ చదువుతూ వస్తున్న పాఠకులకు జుగుప్స కలిగించడం సహజమే.

అయినా కూడ, మనం ఎరిగినంతవరకు ఆమె పుట్టుక, ఆమె జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకొంటే అంతగా ఆశ్చర్యపడరు.

మానవుల గుణ గణాలు చాలవరకు పారంపర్యంగా వచ్చేవే; పరిస్థితుల వల్ల, అలవాట్ల వల్ల, జీవితానుభవాల వల్ల అవి ఒకింత మారుతున్నాయి.

మూగది, చెవిటిదీ అయిన మందాకిని చాలవరకు అడవిలోనే తన జీవితాన్ని గడిపింది. అడవి మృగాలనుంచి తప్పించుకోవడానికి ఆమె ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చేది. తాను బ్రతికి బయటపడేందుకు ఆ మృగాలను కొన్ని సందర్భాలలో అతి క్రూరంగా చంపవలసి వచ్చేది.

చాల కాలంవరకు పాలలాగ తెల్లగా ఉండిన ఆమె మనసులో ప్రేమ అనే అమృతం ఊరింది. కానీ  అది త్వరలోనే ఎండిపోయి ఆమె మనసు ఎడారిలాగ మారిపోయింది. విధి ఆడిన ఆట ఆమెను ఒక

పెద్ద నిరాశకు గురిచేసింది. అందువల్ల ఏర్పడ్డ అదురుపాటు ఆమె బుద్ధినే కల్లోలపరిచింది. కానీ కాలం గడిచేకొద్దీ ఆమె మనసుకు కలిగిన గాయం మానింది. ప్రేమ అనే అమృతం మళ్ళీ ఊరసాగింది. సుందరచోళ చక్రవర్తి మీదగొన్న ప్రేమను ఆయన ముద్దుల కుమారుడైన అరుళ్మొళి మీద పుత్రవాత్సల్యంగా మార్చుకొంది.

మందాకిని కూతురైన నందినిలో తల్లి గుణగణాలు చాలవరకు తోచాయి. కానీ తల్లిని లోకం మోసం చేసినదానికన్న, కూతురిని అధికంగా వంచించి మోసం చేసింది. కన్న తల్లి చేత వదిలిపేయబడింది. ఇతరుల ఇంట పెరిగింది. అడవి మృగాలవల్ల తల్లికి ఎదురైన కష్టాలకన్న ఎక్కువగా కూతురికి నాగరిక లోకంలో కలిగాయి. చిన్న వయసులోరాజవంశస్థుల చేత అవమానించబడింది. అదంతా ఆమె మనసును విషపూరితంగాను, ద్వేషపూరితంగాను మార్చింది. ద్వేషాన్ని మార్చగల అనురాగమనే అమృతం ఆమెకు దొరకలేదు. ఆమె ఎవరిమీద ప్రేమగొన్నదో వారందరూ ఆమెను నిర్లక్ష్యం చేసి వెళ్ళగొట్టడమో, లేక దురదృష్టం పాలై చనిపోవడమో జరిగింది. ఆమెను అవమానించినవారు, ఆమె చేత తిరస్కరించబడినవారు మాత్రం పై అంతస్తులో మంచి హోదాలో జీవిస్తున్నారు. ఒక స్త్రీ హృదయాన్ని విషంకన్న దారుణంగా మార్చేందుకు ఇంకేం కారణాలు కావాలి? తనను వంచించిన వారి మీద, అవమానించినవారిమీద పగ తీర్చుకోవడం తప్ప ఆమె మనసులో ఇక దేనికీ తావు లేకపోయింది. దానికి కావలసిన ఉపాయాలు, పన్నాగాలు తల్లి గర్భంలో ఉండగానే ఆమె రక్తంలో చేరాయి. జీవితంలో ఆమె పడ్డ కష్టాలు, మోసాలు, వంచనలు ఆమె హృదయం నుంచి ప్రేమ, కరుణ మొదలైన సున్నిత మధుర భావాలను పూర్తిగా తుడిచిపెట్టేశాయి.

ఈ కథలో ఇకముందు రాబోయే సంఘటనలను బాగా అర్థం చేసుకోవడానికి ఈ గుణ విశ్లేషణ ఇక్కడ సూచించడం అవసరమని తలచి రాసి మీముందుంచాము.

~

భోజన సమయంలో వారి మధ్య ఉత్సాహపూరితమైన సంభాషణలేవీ జరగలేదు. నందిని, కరికాలన్, వంతిదేవుడు వారివారి దిగుళ్ళలో మునిగివున్నారు. ఇందువల్ల మణిమేఖలకు చాల కష్టమనిపించింది. పళువూర్ రాణితో ఉల్లాసంగా మాట్లాడుతూ, ఉత్సాహంగా పొద్దు గడపాలని ఆమె జలకాలాట, వనభోజనం ఏర్పాటు చేసింది. యువరాజు, వంతిదేవుడు అనుకోకుండ వచ్చి చేరడంతో ఆమె ఉత్సాహం అధికమైంది. కానీ ఆ తర్వాత ఆ ముగ్గురూ మాట్లాడుకొన్న మాటలు, నడుచుకొన్న విధానమూ ఆమెకు ఏమాత్రం రుచించలేదు. నందినిని, వంతిదేవుని ఒక్కటిగా చూసినప్పుడు కలిగిన ఆవేదనను ఆమె పసి హృదయం అప్పటికే మరిచిపోయింది. దాని గురించి తప్పుగా భావించి అసూయ పడడం పొరబాటని భావించింది. ఆ తర్వాత ఆ ముగ్గురూ గలగల నవ్వుతూ మాట్లాడక ముఖాలు చిట్లించుకొని మాట్లాడుకోవడం ఆమెకు అర్థం కాలేదు; నచ్చనూ లేదు.

కాబట్టి, భోజనం చేసి కాసేపైన తర్వాత, "అక్కా! మనం తిరిగి వెళదామా? పడవను తెమ్మని చెప్పనా? వీరిద్దరూ మనతో వస్తున్నారా? లేక గుర్రాలెక్కి వచ్చిన దారినే వెళతారా?" అని అడిగింది మణిమేఖల.

అప్పుడప్పుడే కరికాలన్ చింతనాలోకంనుంచి బయటికొస్తున్నాడు. "ఆఁ! ఈ అమ్మాయి  వాద్య సంగీతాన్ని వినకుండ తిరిగి వెళ్ళడమా? లేదు, లేదు! నందినీ! మరిచిపోయావా, ఏమి? మణిమేఖలా! మమ్మల్ని మోసపుచ్చకు!" అన్నాడు.

"అది నేను మరువలేదు. మిమ్మల్ని, మీ స్నేహితుని చూస్తుంటే సంగీతాన్ని ఆస్వాదించే స్థితిలో ఉన్నట్లనిపించలేదు. ముళ్ళమీద కూర్చొన్నట్లున్నారు కద? అయినా ఫరవాలేదు. మణిమేఖలా! ఏదీ, నీ యాళ్ ఇలా తీసుకు రా!" అన్నది నందిని.

"ఎందుకక్కా? ఇష్టంలేనివారి ముందు నన్నెందుకు వాయించమంటున్నారు?" అని మణిమేఖల కాస్త బింకంగా అన్నది.

"లేదు, లేదు! యువరాజే అడిగారు కద? ఆయన స్నేహితునికి సంగీతం వినడం ఇష్టంలేకపోతే చెవులు మూసుకోనీ!" అన్నది నందిని.

"భగవాన్! అలాగ నేను సంగీతకళను విరోధించేవాడిని కాను. కోడిక్కరైలో పూంగుళలి అనే పడవ నడిపే పిల్ల

అలల కడలి నెమ్మదిగొనగా
మనోసముద్రం పొంగుతున్నదేల?

అని ఒక పాట పాడింది. అది తలుచుకొంటే ఇప్పుడు కూడ నా ఒళ్ళు పులకరిస్తుంది!" అన్నాడు వంతిదేవుడు.

"కొంతమందికి కొందరి పాటలు మాత్రమే నచ్చుతాయి. నా పాట మీకు నచ్చుతుందో లేదో!" అన్నది మణిమేఖల.

"నచ్చకపోతే ఎవరు వదులుతారు? అందు గురించి దిగులుపడకు. నేను చూసుకొంటాను. నీవు నీ వాద్యాన్ని తీసుకొని రా!" అన్నాడు కరికాలన్.

మణిమేఖల యాళ్ తీసుకొని వచ్చి, పాలరాతి మంటపం పైమెట్టుమీద కూర్చొంది. తంత్రులను లాగి శృతి కట్టింది. ఏడు తంత్రులున్న యాళ్ అది. ఒక్కొక్క తంతిలోను సగం వరకు ఒక స్వరం, ఆపైన ఇంకొక స్వరం పుట్టించగలదు.

కాసేపు యాళ్ మాత్రం వాయించి సంగీత వర్షాన్ని కురిపించింది మణిమేఖల. కరికాలన్, వంతిదేవుడు నిజంగానే తక్కిన దిగుళ్ళన్నీ మరిచిపోయారు. ఆ అమోఘమైన వాద్య సంగీతానికి తమ మనస్సులను అర్పించి పరవశించారు.

తర్వాత మణిమేఖల వాద్యసంగీతంతోబాటు గానసంగీతాన్ని కూడ చేర్చి పాడింది. అప్పర్, శివజ్ఞాన సంబందర్, సుందరి మొదలైన వారి దైవ పాశురాలను పాడింది.

కాసేపటి తర్వాత యువరాజు, “మణిమేఖలా! నీ గానం అద్భుతంగా ఉంది. కానీ అన్నీ భక్తిమయమైన పాటలే పాడుతున్నావు. నేను భక్తిలో అంతగా నిమగ్నుడిని కాలేను. శివభక్తినంతా మధురాంతకునికే వదిలేశాను. ఏవైనా ప్రేమగీతాలు పాడు!” అన్నారు.

~

మణిమేఖల అందమైన కళ్ళు సిగ్గుతో కిందికి వాలాయి.

“అమ్మాయీ! నీవిక్కడ ప్రేమగీతం పాడితే నన్నుద్దేశించి పాడుతున్నావని నేను భావించను. నా స్నేహితుడు కూడ అలా భావించడు. కాబట్టి ఏ జంకూ లేకుండ పాడు!” అన్నారు యువరాజు.

“అలా ఎవరైనా అనుకొంటే మణిమేఖల అందుగురించి ఏమీ దిగులుపడదు!” అన్నది నందిని.

“పోండక్కా! ఇద్దరు పురుషుల ముందు నన్నిలా పరిహాసం చేయవచ్చా?” అన్నది మణిమేఖల.

“వీరు పురుషులని నీవనుకేవడమే తప్పు. ఒక చచ్చిన పులి తలను తీసుకొని రాలేకపోయినవారిని మగవారని ఎంచవచ్చా? మునుపు తమిళనాడు వీరులు బతికున్న పులిని పట్టి దాని నోటిని తెరిచి దాని పళ్ళను పీకి తమ నాయికలకు ఆభరణాలకు అర్పించేవారట! పోతేపోనీ! నీవు పాడు! ఆరోజు నాకోసం పాడావు కద? అ అందమైన పాటను పాడు!” అన్నది నందిని.

మణిమేఖల అలాగే తన వాద్యాన్ని వాయిస్తూ ఒక అందమైన పాటను పాడింది. అదేం విచిత్రమో, మునుపటికన్న ఈ పాట పాడినప్పుడు ఆమె స్వరం మరింత మధురంగా వినిపించింది.

<< ఆ సుందర మదురగీతాన్ని అనువదించవలసివుంది >>

ఇలా మరిన్ని మధురగీతాలను మణిమేఖల వేర్వేరు బాణీలలో పాడింది. అ గానలహరిలో తక్కిన ముగ్గురూ మునిగిపోయారు. పలుకారణాలవల్ల తన మనసును రాతికన్న గట్టిగా మార్చుకొన్న నందిని కంట కూడ కన్నీళ్ళుబికాయి. ఆదిత్య కరికాలన్ ఈ లోకాన్ని పూర్తిగా మరిచిపోయాడు. వంతిదేవుడు అప్పుడప్పుడు ఉలిక్కిపడి మేలుకొన్నవాడిలాగ మణిమేఖలవైపు చూడసాగాడు. అటువంటి సందర్భాలలో ఆమె తననే చూడడం గమనించి వంతిదేవుడు మరింత ఉలిక్కిపడ్డాడు. “అయ్యో! ఈ పిల్లకు మనమెంతటి కీడు చేశాం కద!” అని అతని మనసు కలవరపడింది.

గానవర్షంలో, భావవర్షంలో మునిగిపోయిన వారు గాలి రానురాను ఉధృతం కావడాన్ని గమనించనే లేదు. చెరువులో మొదట చిన్న చిన్న అలలు లేచి పడడం, తర్వాత అవి పెద్దవి కావడాన్ని కూడ వారు గమనించలేదు. గాలి సుడిగాలిగా మారి అడవిచెట్లలో ఒకదాన్ని పెకలించివేసినప్పుడే వారు మేలుకొని చుట్టుపక్కల పరికించి చూశారు. బలమైన సుడిగాలి వీస్తుండడాన్ని, చెరువులో పెద్ద పెద్ద అలలు

లేస్తుండడాన్ని గమనించారు.

ఉన్నట్లుండి నందిని, “అయ్యో! పడవెక్కడ?” అని గాభరాగా అరిచింది.

కట్టివుంచిన చోట పడవ కనిపించలేదు. పరీక్షగా చూసినప్పుడు పడవ అలలచేత లాగబడి ముందుకు జరిగి వెళుతుండడం కనిపించింది.

“అయ్యో! ఇప్పుడేం చేయడం?” అని నందిని మళ్ళీ అరిచింది.

“మీకిద్దరికీ గుర్రం నడపడం తెలిస్తే మా గుర్రాలెక్కి వెళ్ళండి. మేమిద్దరం ఏదైనా ఇంకొక మార్గం వెతుక్కొంటాము" అన్నాడు వంతిదేవుడు.

“ఈ సుడిగాలిలో అడవి చెట్లు పెకలించుకొని మా మీద పడి మేము చావాలనా మీ ఉద్దేశం?” అని నందిని అడిగింది.

“అదంతా వద్దు. సుడిగాలి వేగం తగ్గేవరకు ఇక్కడే ఉందాము. అక్కడికి వెళ్ళి ఏం చేయాలి? వంటకు కావలసిన సామగ్రి ఉంది. పాడేందుకు మణిమేఖల ఉంది. ఇటీవలి కాలంలో ఇంత సంతోషంగా నేను కాలం గడపనేలేదు!” అన్నారు యువరాజు.

“యువరాజా! అది సరి కాదు. శంబువరయ్యర్, గందమారన్ ఏమనుకొంటారు?” అన్నాడు వంతిదేవుడు.

“ఈయనే పులిని వెతుక్కొంటూ వెళ్ళినప్పుడు పడవను విప్పి వదిలేశారు కాబోలు!” అన్నది నందిని.

“అక్కా! ఎందుకు అనవసరంగా నింద మోపుతున్నారు? ఈయన తిరిగి వచ్చినప్పుడు పడవ ఒడ్డునే కట్టబడివుంది. ఎవరూ దిగులు/గాభరా పడకండి. మా నాన్నగారు ఈ సుడిగాలిని చూసిన వెంటనే తోడుగా పెద్ద పడవలను పంపిస్తారు!” అన్నది నందిని.

ఆమె మాట కాసేపటికల్లా నిజమైంది. ఇంచుమించు ఓడలని చెప్పదగ్గంత పెద్ద పడవలు రెండు ఆ దీవివైపు రాసాగాయి. వాటిలో ఒక పడవలో పెద్ద శంబువరయ్యరే వున్నారు. నలుగురూ క్షేమంగా ఉండడాన్ని గమనించి చాల సంతోషపడ్డారు.

వారినెక్కించుకొని అలల కడలిగా కల్లోలితమైన ఆ పెద్ద చెరువులో రెండు పడవలూ వెనుదిరిగాయి. శంబువరయ్యర్ తప్ప తక్కిన నలుగురి మనస్సులలోను విపరీతమైన సుడిగాలి వీచి మహాకల్లోలాన్ని సృష్టించసాగింది.

~~~

~~~ ఇంతటితో పొన్నియిన్ సెల్వన్ నాలుగవ భాగం సమాప్తం ~~~